శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణగ్రంథావళి

125వ జయంతి ప్రచురణలు

# సుభద్రాకళ్యాణము

పరిష్కర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రచురణ

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2012

## SUBHADRA KALYANAM

By Thallapaka Thimmakka.

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

2012

Copies : 1000

Price.Rs...............

Published by

Sri L.V. Subrahmanyam,I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501
D.T.P. SVPSVP., T.T.D. Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

# సుభద్రాకల్యాణము

తాళ్లపాక తిమ్మక్క.

**పరిష్కర్త**
**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

**ప్రచురణ**
**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం**
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2012**

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణగ్రంథావళి

**125వ జయంతి ప్రచురణలు**

# వేటూరివారి పీఠికలు

రెండోభాగము

**గ్రంథకర్త**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

**ప్రచురణ**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2012**

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణగ్రంథావళి

125వ జయంతి ప్రచురణలు

# వేటూరివారి పీఠికలు

రెండోభాగము

**గ్రంథకర్త**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**


**ప్రచురణ**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2012**


**VETURIVARI PEETHIKALU**

By Sri **Veturi Prabhakara Sastri**


**T.T.D. Religious Publications Series No.**



**© All Rights Reserved**



**2012**

**Copies : 1000**

**Price.Rs...............**

**Published by**

**Sri L.V. Subrahmanyam,I.A.S.,**
**Executive Officer,**
**Tirumala Tirupati Devasthanams,**
**Tirupati -517 501**
**D.T.P. SVPSVP., T.T.D. Tirupati.**

**Printed at**
**Tirumala Tirupati Devasthanams, Press.**
**Tirupati.**

ఓం నమో వేంకటేశాయ

# ముందుమాట

**ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.** - -2012
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

శ్రీ వేటూరిప్రభాకరశాస్త్రిగారు జగద్విఖ్యాత శతావధానులగు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి శిష్యరికంలో సంస్కృతాంధ్ర సాహిత్యాలను అభ్యసించారు. అపారమైన పాండిత్యాన్ని సంపాదించి సుప్రసిద్ధ పండితునిగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, బహుగ్రంథపరిష్కర్తగా ప్రసిద్ధిని పొందారు. మాస్టర్ సి.వి.వి గారి యోగసాధనలో సిద్ధులై వారి యోగవిద్యతో వ్యాధిగ్రస్తులైనవారి నెందరినో రక్షించి వారికి ప్రాణభిక్ష పెట్టిన మహనీయులు. మహాతపస్వి.

శ్రీ శాస్త్రిగారు మొదట మదరాసులో తెలుగుపండితునిగా కొంతకాలం పనిచేశారు. పిమ్మట 1910 నుండి 1939 వరకు మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారంలో తెలుగు పరిశోధక పండిత పదవినలంకరించారు. ఆ 29 సం॥ల కాలంలో వారు పరిశోధకులకు పంటపొలాలన దగిన అముద్రిత గ్రంథ వివరణసూచికలు ( Descriptive Catalogues ) 20 సంపుటాలు నిర్మించారు. శాస్త్రిగారు ఆ కాలంలో స్వయంగా 20కి పైగా ఉత్తమ గ్రంథాలను పరిష్కరించి పరిశోధనాత్మక పీఠికలతో ప్రచురించారు. తర్వాత తి.తి.దే., ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేశారు. తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన రాగిరేకులను పరిష్కరించి తొలిసారిగా వెలుగులోనికి తెచ్చిన వారు వీరే! అన్నమాచార్యోత్సవాలకు శ్రీకారం చుట్టినది వీరే. ఎంతోమంది శిష్యులను పండితులుగా తీర్చిదిద్దారు. వారికి జ్ఞానభిక్షను ప్రసాదించారు.

బహుముఖప్రజ్ఞాశాలి, ఉత్తమ పరిశోధకులు, ఆత్మదర్శనులు, నిరంతర యోగసాధకులు, కవి, రచయిత, శాసన పరిశోధకుడు అయిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సాహిత్యకృషిని గుర్తించి తి.తి.దేవస్థాన యాజమాన్యం 2007వ సం॥లో శ్వేతభవనంలో "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని" స్థాపించి, వారు రచించిన ముద్రిత, అముద్రిత గ్రంథాలను తి.తి.దే ద్వారా ప్రచురించి ఆంధ్రసాహితీ లోకానికి అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఈ పీఠం "తెలుగుమెఱుగులు, మీగడతఱకలు, సింహావలోకనము, పూలవిందు, ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ, అన్నమాచార్యచరిత్ర పీఠిక, కేయూరబాహుచరిత్ర, వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక" అనే గ్రంథాలను ప్రచురించింది.

ప్రస్తుతం ఫిబ్రవరి 7, 2013 వ తేదీన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా శాస్త్రిగారి "వేటూరివారి పీఠికలు" అనే గ్రంథము మహాభారతంలోని కథను ఆధారం చేసుకొని ద్విపద కావ్యంగా రచింపబడింది. తెలుగువారి పలుకుబళ్ళు, నుడికారాలతో నిండిన సుభద్రాకళ్యాణం పాడుకోవడానికి సులభంగా ఉండి ప్రజల్లో మిక్కిలి ప్రాచుర్యాన్ని పొందింది. .

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా ఆవిష్కరింపబడుతున్న ఈ గ్రంథాన్ని సాహిత్యభాషాభిమానులందరు తప్పక పఠించి ఆదరించగలరని ఆశిస్తున్నాము.

**(ఎల్.వి. సుబ్రహ్మణ్యం)**

ఓం నమో వేంకటేశాయ

# ముందుమాట

**ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.** - -2012

కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

శ్రీ వేటూరిప్రభాకరశాస్త్రిగారు జగద్విఖ్యాత శతావధానులగు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి శిష్యరికంలో సంస్కృతాంధ్ర సాహిత్యములను అభ్యసించారు. అపారమైన పాండిత్యాన్ని సంపాదించి సుప్రసిద్ధ పండితునిగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, బహుగ్రంథపరిష్కర్తగా ప్రసిద్ధిని పొందారు. మాస్టర్ సి.వి.వి గారి యోగసాధనలో సిద్ధులై వారి యోగవిద్యతో వ్యాధిగ్రస్తులైనవారి నెందరినో రక్షించి వారికి ప్రాణభిక్ష పెట్టిన మహనీయులు. మహాతపస్వి.

శ్రీ శాస్త్రిగారు మొదట మదరాసులో తెలుగుపండితునిగా కొంతకాలం పనిచేశారు. పిమ్మట 1910 నుండి 1939 వరకు మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారంలో తెలుగు పరిశోధక పండిత పదవినలంకరించారు. ఆ 29 సంIIల కాలంలో వారు పరిశోధకులకు పంటపొలాలన దగిన అముద్రిత గ్రంథ వివరణసూచికలు ( Descriptive Catalogues ) 20 సంపుటాలు నిర్మించారు. శాస్త్రిగారు ఆ కాలంలో స్వయంగా 20కి పైగా ఉత్తమ పరిశోధన గ్రంథాలు పరిష్కరించి ప్రచురించారు. తర్వాత తి.తి.దే., ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేశారు. ఎంతోమంది శిష్యులను పండితులుగా తీర్చిదిద్దారు. వారికి జ్ఞానభిక్షను ప్రసాదించారు.

బహుముఖప్రజ్ఞాశాలి, ఉత్తమ పరిశోధకులు, ఆత్మదర్శనులు, నిరంతర యోగసాధకులు, కవి, రచయిత, శాసన పరిశోధకుడు అయిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సాహిత్యకృషిని గుర్తించి తి.తి.దేవస్థాన యాజమాన్యం 2007వ సంIIలో శ్వేతభవనంలో "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని" స్థాపించి, వారు రచించిన ముద్రిత, అముద్రిత గ్రంథాలను తి.తి.దే ద్వారా ప్రచురించి ఆంధ్రసాహితీ లోకానికి అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఈ పీఠం "తెలుగుమెఱుగులు, మీగడతఱకలు, సింహావలోకనము, పూలవిందు, ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ, అన్నమాచార్యచరిత్ర పీఠిక, కేయూరబాహుచరిత్ర, వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక" అనే గ్రంథాలను ప్రచురించింది.

ప్రస్తుతం ఫిబ్రవరి 7, 2013 వ తేదీన శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా శాస్త్రిగారి "వేటూరివారి పీఠికలు" అనే గ్రంథము 2వ సంపుటమును శ్రీ ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా తి.తి.దేవస్థానం ప్రచురించింది.

ఈ పీఠికా సంపుటంలో క్రీడాభిరామం, ఉత్తరహరివంశము, హరవిలాసం, గోవిందరామాయణము, వేంకటేశ్వరవచనములు, శృంగార సంకీర్తనములు, అన్నమాచార్య చరిత్ర, ఆంధ్రామరుకము, ధనుర్విద్యా విలాసము, సుభద్రాకళ్యాణము మొదలైన గ్రంథాల పీఠికలు, ఉపోద్ఘాతము, తొలిపలుకులు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ ఎంతో వైవిధ్యం కలిగిన రచనలు. ఇటువంటి శాస్త్రిగారి మహత్తర రచనలు సాహిత్య పరిశోధకులకు చక్కని మార్గదర్శ కాలవుతాయి. సాహిత్య జిజ్ఞాసువులు ఈ పీఠికలను పఠించి మనోవికాసాన్ని పొందగలరు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి 125వ జయంతి సందర్భంగా ఆవిష్కరింప బడుతున్న ఈ సంపుటములు సాహితీ ప్రియులకు, పరిశోధకులకు, సాహిత్య విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయి. కనుక ఈ గ్రంథాలను సహృదయ పాఠకులందరు చదివి, చదివించి శాస్త్రిగారి సాహితీ సౌరభాలను పదిమందికి పంచిపెట్టగలరని ఆశిస్తున్నాను.

**(ఎల్.వి. సుబ్రహ్మణ్యం)**

# మనవి

(మణిమంజరి ప్రచురణలో ఉన్నది. యథాతథం)

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళిలో మూడవ కుసుమముగా "వేటూరి వారి పీఠికలు" (1910–1928 సం॥ మధ్యకాలమునాటివి) మొదటి భాగముగా 1985లో వెలువడినది. ఇప్పుడీ గ్రంథము రెండవ భాగముగా 1929–1950 సం॥ల మధ్యకాలములో కూర్చిన పీఠికలన్నిటిని కూర్చుకొని వెలువడుచున్నది. ఈ రెండు సంపుటములలో శ్రీ ప్రభాకరుల పీఠికా రచనలన్నియు (మాకు లభ్యమైనంతవరకు) వెలువడినట్లే.

ఈ రెండు సంపుటములలోను శ్రీ ప్రభాకరులు ఇతర గ్రంథాలకు తాము కూర్చిన పీఠికలనే (సమీక్షలు, అభిప్రాయాలతో సహా) కాలక్రమాన గ్రహించినాము. సృజనాత్మక గేయరచనలకు తాము కూర్చుకొన్నమున్నుడుల నిందు చేర్చలేదు. అట్టివి ఆయా సృజనాత్మకరచనలతో విడిగా వెలువడనున్నవి.

ఈ సంపుటమున దాదాపు 41 గ్రంథములకు శ్రీ శాస్త్రిగారు కూర్చిన పీఠిక లున్నవి. వీనిలో క్రీడాభిరామము మొదలుగా, ఆంధ్రకామందకము వరకు ప్రముఖ గ్రంథాలొక పదనెన్మిదింటికి (ప్రాచీనులవి. అర్వాచీనులవి వెరసి) ప్రభాకరులు కూర్చిన పీఠికలు ప్రసిద్ధము లున్నవి. తక్కినవి అర్వాచీనుల రచనలకు ప్రభాకరులందించిన అభిప్రాయములు మున్నుడులు, ఆశీస్సులు, అభినందనలు, ప్రశంసలు, సమీక్షలు మున్నగునవి ఉన్నవి.

పీఠికలు తొలిసంపుటము 345 పుటల గ్రంథము. ఈ రెండవ సంపుటము ఇంచుమించు 480 పుటల గ్రంథము. మొత్తము 800 పుటలకు పైపడిన ఈ గ్రంథము ఒక సంపుటముగా వెలువరించుట సాధ్యముకాక ఇట్లు రెండు సంపుటములలో నేటికి సంపూర్ణముగా వెలువరించుటైనది. శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళిలో పీఠికలకు సంబంధించిన సంపుటములివి రెండును సంపన్నములైనవి. ఇట్లే శ్రీవారి రూపక రచనలన్నియు సంపూర్ణముగా వెలువడినవి. తక్కినవానిలో చాటు పద్యమణిమంజరి సంకలనము పెంపు చెందిన క్రొత్త కూర్పు నేటికి రెండు సంపుటములు మాత్రమే వెలువడినది.



అవి మరి రెండు మూడు సంపుటములలో సంపన్నము కావలసియున్నవి. శ్రీ ప్రభాకరుల వ్యాసపరంపరలో నేటికి వ్యాసమంజరి ఒక సంపుటము వెలువడినవి. 'వ్యాస ప్రభాకరము' అను మరియొక సంపుటము తొలికూర్పును మాకు తోడ్పాటు నందించు సుహృద్భావముతో హైదరాబాదు ఆంధ్రసారస్వత పరిషత్తువారు ఇటీవలనే ప్రకటించినారు. ఇవికాక ఇట్టివి మరి రెండుమూడు సంపుటములు వెలువడిన గాని శ్రీ శాస్త్రిగారి వచన (వ్యాస) రచనలిన్నయు సంపూర్ణ గ్రంథావళి కెక్కినట్లు కాదు. వాని కూర్పునకు, ప్రచురణకును యత్నములు సాగుచున్నవి. ఇవికాక వార పద్యకృలతులు, గాలికబుర్లు, సామెతలు, మార్జినల్ నోట్సు, లేఖలు, సంపాదిత పరిష్కృత గ్రంథములు వగైరాలు మరికొన్ని కూర్పు నందుకొని వెలువడవలసి యున్నవి. ఈ పనులన్నియు ముగిసిననాడు గాని శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి ప్రకటనము సుసంపన్నము కాజాలదు. దీనికి వ్యయప్రయాసలధికము కావలయును. ఇప్పటికి ఇంచుమించు ఇరవై సంపుటములు వెలువడినవి. మరి యిరువదింటికి పైగా వెలువడవలసినవి కలవు. ఈ దిక్కున పరిశోధన సాగినకొలది ప్రచురింపవలసిన గ్రంథముల సంఖ్య పెరుగుచుండుట, గ్రంథసామగ్రిని విశ్లేషించుటలోను కూర్చుటలోను సమయము కావలయుట, ఈ రంగమున శ్రమించు పరిశోధకులకును, గ్రంథసంపాదకులకును వ్యవధి చాలకపోవుట, ప్రెస్సుల జాప్యము, ఆర్థిక లోపము వంటి కారణములచేత అనుకొన్నవన్నియు అనుకొన్నంత తేలికగా వేళకు నిర్వాహము చెందకున్నవి. అచిరకాలములో ఈ ఇక్కట్లు కడచి లక్ష్యము నెరవేరునని భావింతుము. నేషనల్ ఆర్కైవ్సు వారి నుండి 1986–89 సం॥లలో లభించిన ఆర్థికసహకారము ఈ లక్ష్యసాధనలో మాకు ఎంతో తోడ్పడినది. అది వలసినంతగా, వరుసగా మరికొంతకాలము నిలువక సాగివచ్చుననియు, ట్రస్టు వారి ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి ప్రకటన లక్ష్యము నెరవేరు ననియు ఆశింతుము.

గ్రంథములను అచ్చుకు దెచ్చుట ఒక యెత్తు, వానినమ్మి సొమ్ము రాబట్టుకొనుట ఇంకొకయెత్తు. గ్రంథాలయ సంస్థలవారు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వములవారు గ్రంథముల కొనుగోలు విషయమున మరికొంత ఉదారముగా వ్యవహరించినచో గ్రంథములు చెల్లుబడియగును. అట్లు వచ్చు రాబడిని పెట్టుబడి పెట్టి ట్రస్టు లక్ష్యముల నెరవేర్చుట కనుకూలపడును.

అట్టియదను అచిరకాలములో కలుగునుగాకని కోరుదము.

ఈ పీఠికల సంపుటములలో చేరదగిన ప్రభాకరుల రచనలను పెక్కింటిని ట్రస్టువారే కూర్చి యుంచిరి. మరికొన్నింటిని అభిప్రాయాదులను మా మిత్రులు డా॥ ముదివేడు ప్రభాకరరావుగారు సేకరించి పంపిరి. వారు పంపిన వానిని ప్రచురణాది వివరముతో మేమట్లే స్వీకరించితిమి. శ్రమకోర్చి వానిని శ్రద్ధతో అచ్చునకు సిద్ధముగా వ్రాసి పంపినందుకు వారికి మా కృతజ్ఞతలు. మా దృష్టికి రాని యిట్టి రచనలు మరికొన్ని యుండవచ్చును. అట్టి వానిని పాఠకులు గుర్తించి తెలిపినచో మలి ముద్రణమున కృతజ్ఞతతో స్వీకరింపగలము.

మా కోర్కెను మన్నించి ఉభయ భాషలలోను గ్రంథప్రశంస లందించిన విమర్శవిశారదులు శ్రీ॥ హెచ్. రాజేంద్రప్రసాద్ (ఛీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, హైదరాబాదు) గారికిని, డా॥ అక్కిరాజు రమాపతిరావు (డిప్యూటీడైరెక్టర్, తెలుగు అకాడమీ, హైదరాబాదు) గారికిని కృతజ్ఞతాభి వందనము లర్పించుచున్నాము.

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళిలో నీ పీఠికా సంపుటము సంపన్నమగుటకు తోడ్పడినవారి కందరికిని ధన్యవాదము లర్పించుచున్నాము. ప్రత్యేకముగా తిరుమల తిరుపతి దేవస్థానమువారి సౌహార్థము నీ సందర్భమున కొనియాడుచున్నాము. అచ్చు కూర్పున శ్రద్ధ వహించి ఈ సంపుటమున కీ రూపునిచ్చిన యస్వీ ప్రింటర్సు హైదరాబాదువారి నభినందించుచున్నాము.

ఇట్లు

వేటూరి ఆనందమూర్తి

సంపాదకుడు.



# సర్వంకషమనీష

(మణిమంజరి ప్రచురణలో ఉన్నది. యథాతథం)

## డా॥ అక్కిరాజు రమాపతిరావు

శ్రీ శాస్త్రిగారు ఆత్మదర్శనులు. సర్వతోముఖమైన పాండిత్యం వారిది. ఏదైనా ఒక విషయం చెప్పటాని కుపక్రమించినప్పుడు కొత్తకోణం ఒకటైనా చూపించటమూ కొత్తదైన ఆవిష్కారాన్ని ఒకటైనా ప్రతిపాదించటమూ వారు చేసుకున్న ప్రతిజ్ఞ. ఇది ఎంతోకష్ట సాధ్యమైన విషయం. అయినా ఈ ప్రతిన వారి విషయంలో అవితథంగా సాగింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో వ్యాఖ్య, సమీక్ష, విమర్శ, కావ్య విషమఘట్ట అర్థతాత్పర్య నిర్ణయం, సాహిత్య చరిత్ర, కవికాలాది, కర్తృత్వ వినిర్ణయాది విషయాలలో వారి మాట ఘంటాపథం. మత, చారిత్రక, సాంస్కృతిక, పురాతత్వ, ఆలయశిల్ప విజ్ఞాన ఆధారస్థ సమీచీన సమన్వయంలో వారి ప్రతిభ మేరలేనిది. ప్రజ్ఞా చక్షువు అనే మాట వారికి అన్నివిధాలా అనువర్తిస్తుంది.

అంతర్ముఖ సమారాధ్యత ఆయన చిత్తవృత్తి. ఏదైనా ఒక విషమఘట్టం, సమన్వయం కాని సమస్య ఎదురవుతే దాని సమాధానాన్ని వారు నిమీలిత నేత్రులై అంతఃకరణం ద్వారా ఆవిష్కరించేవారు, అని వారిని సన్నిహితంగా ఎరిగున్న పరిశోధనప్రవణులు, అంతరంగకోటిలోని వారూ చెప్తున్నారు. ఈ విధంగా వారు ఎన్నో ప్రతిపాదనలు చేశారు. అవి సాహిత్య చరిత్ర పురాతత్త్వ అపరిష్కృత, అసమన్వయీకృత విషయాలను నిర్ణయించటానికి తోడ్పడ్డాయి.

శాస్త్రిగారి వచన రచన 'లలిత విస్తరం'. వారి సూత్రఫక్కిక 'ప్రజ్ఞాపారమితం.' 'నన్నయది పురాణశయ్య. తిక్కనది కావ్యశయ్య. నన్నయ భారతభాష నాగమ సూత్రస్మృతి భాషనుగా భావించుచో దిక్కన భాషను గాళిదాస కావ్యభాషనుగా బరిగణింపవచ్చును. నన్నయ దొక ఋషిమార్గము. తిక్కనదొక రసమార్గము' ఇత్యాది వారి సాహిత్య దర్శనం తరువాత కాలంలో సుప్రసిద్ధ విమర్శకులకు ఆనంద చక్షురున్మీలితం చేసింది. విశ్వనాథవారు కల్పవృక్షకావ్యావతారికలో 'ఋషివంటి నన్నయ్య రెండవ వాల్మీకి, తిక్కన్న శిల్పపు తెనుగుతోట' అని శాస్త్రిగారి దర్శనాన్నే అనువదించారు.

ఆయన స్వయంగా కవి. పండితుడు. భాషాతత్త్వ జిజ్ఞాసి. కొత్తపాతల మేలు కలయికను బాగా ఆకళించుకొన్నవారు. మానవ స్వభావాన్ని అచ్చస్వచ్ఛ హృదయంతో అర్థం చేసుకొన్నవారు. సంప్రదాయ మార్గంలో అభ్యుదయ గామి. అభ్యుదయ పథంలో సంప్రదాయ నిర్మాత. తెలుగుభాషా సాహిత్యాలకు సంబంధించి ఆయనంత పరిశోధించినవారు సమకాలికులలో వేరొకరు లేరనే చెప్పవచ్చు. జనజీవనాన్ని వారు ఒప్పరికించలేదు. జానపద విజ్ఞానాన్ని చిన్న చూపు చూడలేదు. బాలభాష నుంచి బ్రహ్మ విద్య వరకు మానవ జీవిత సమాహార పరమార్థం వారికి హృద్యం. కరుణార్ద్రమైన, కృతజ్ఞతా సౌగంధ్య బంధురమైన వారి వ్యక్తిత్వం వారి రచన లన్నిటా ఉదాత్త మధురంగా కనపడుతూనే ఉంటుంది.

శ్రీ శాస్త్రిగారు తమ ఇరవై ఏళ్ళ వయసుననే సాహిత్య కృషి ప్రారంభించారు. అరవై ఏళ్ళ వయసు వరకు నిర్విరామంగా కొనసాగిస్తూనే ఉన్నారు. మధ్యకాలంలో కొంత ఉదాసీనత కలిగినా, ఈ సాహిత్యం, సమాజ బాధ్యత, పరమార్థ కృషికి దోహదకారులా అన్న విచికిత్స వారికి కలిగినా, మద్రాసు నుంచి తిరుపతిలో ప్రాచ్య పరిశోధన సంస్థ పండితులుగా కుదురుకొన్న తర్వాత శ్రీ వేంకటేశ్వర వాఙ్మయ ప్రకాశన కృషిలో చరితార్థమైన ఉపకారం చేశారు తెలుగువారికి శ్రీ శాస్త్రిగారు.

ఈ పీఠికా సంకలనంలో ఐదు శతాబ్దుల తెలుగు సాహిత్య క్రమ పరిణామ వికాసం కనపడుతుంది. శ్రీనాథుడి క్రీడాభిరామం మొదలుకొని దుర్భాక రాజశేఖర శతావధానిగారి రాణాప్రతాప చరిత్ర వరకు శాస్త్రిగారి ఒరగల్లు తెలుగు సాహిత్యంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను సమీక్షించింది. విలువ కట్టింది. రత్నాలను కృత్రిమ రత్నాలను వెంటనే పోల్చుకోగల సాహిత్య ఆపణికులు శాస్త్రిగారు. ఈ సంకలనంలో వారి లేఖిని నుంచి వెలువడినవి సమీక్షలైతేనేమి, పీఠికలైతేనేమి, అభిప్రాయాలైతేనేమి, ప్రోత్సాహవాక్యాలైతేనేమి మొత్తం 41 రచనలు చోటుచేసుకున్నాయి. ఈ రచనలలోని వైవిధ్యం ఎంతో హృద్యం.



శ్రీ శాస్త్రిగారు పూనుకొని వెలువరించకపోయినట్లైతే తెలుగు వారికి క్రీడాభిరామం కనుమరుగైపోయేదే. కాకతీయుల చరిత్రకు సంబంధించినవీ, భాషా సాహిత్యాలకు సంబంధించినవీ అయిన ఎన్నో అపూర్వమైన విషయాలు దక్కకుండా పోయేవి. అన్నమాచార్య చరిత్రకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు కూర్చిన పీఠిక యీ సంకలనంలో అన్ని రచనలకన్నా ఎక్కువ పెద్దది. ఆ తర్వాత పెద్దరచన ఈ క్రీడాభిరామ పీఠికే. క్రీడాభిరామం ప్రచురించేనాటికి శ్రీ శాస్త్రి గారి వయసు నలభై సంవత్సరాలు మాత్రమే. అయితే అప్పటికే 'తెలుగు సాహిత్యాన్ని అంతా చుళుకించిన అగస్త్యులా ఏమి శాస్త్రిగారు' అన్నంత అబ్బుర పాటు కలుగుతుంది ఈ పీఠిక చదివిన వారికి. ఈ గ్రంథాన్ని పరిష్కరించడం ప్రకటించడం మరొకరికి మరొకరికి సాధ్యమయ్యేపనికాదు. దీని కాధారమైన ఒకేఒక తాళపత్రప్రతి లభించింది. అదికూడ చాలదోష భూయిష్ఠం. అనన్వితం. అంతేకాక వివాదాస్పద గ్రంథ కర్తృకం. ఇటువంటి గ్రంథాన్ని పరిష్కరించి ప్రకటించారు శాస్త్రిగారు. 'తునాతునకలై దురుద్ధరమయియున్న తంజావూరి తాళపత్ర ప్రతిని బరిశోధించి గ్రంథపాతములను దప్పులను బెక్కింటిని నేను జక్కబరచుకొని యుంటిని. నా దగ్గరనున్న పాఠములు పోయెనేని యిక నీ గ్రంథమును సరిపరచుట శక్యము కాదనియే నా నమ్మకము. తంజావూరి తాళపత్రప్రతి ముక్కలు ముక్కలై మిక్కిలి రూపుచెడియున్నదిగాన దానిని బట్టి యిక దత్తత్పాఠములనుద్ధరింప గుదురదు. ప్రత్యంతర మింతవరకెక్కడను దొరకలేదు." అన్నారు వారు. శ్రీనాథుడి ఇతర కృతులాధారంగా చేసుకొని క్రీడాభిరామం శ్రీనాథుడి కృతమే అని స్థాపించారు శాస్త్రిగారు. ఈ పరిశ్రమ అత్యంతాద్భుతావహమూ ఆహ్లాదజనకమూ కూడానని ఈ పీఠిక చదివిన వారికి తెలుస్తుంది. శ్రీనాథుడి రచనాశైలికి ప్రయోగవైచిత్రికిక ఆకరమైన సంస్కృత మహా కావ్యాల నుంచి నాటకాల నుంచి అంతరత సాక్ష్యం చూపిస్తూ క్రీడాభిరామం తప్పక శ్రీనాథుడిదేనని నిరూపించారు. కాశీఖండం, భీమఖండం, హరవిలాసం, శివరాత్రి మాహాత్మ్యం, నైషధాల నుంచి శ్రీనాథుడి పలుకుబళ్ళను చూపి క్రీడాభిరామం శ్రీనాథుడిది కాదనటానికి వల్లకాదని నిష్కర్షించారు శాస్త్రిగారు. శ్రీనాథుడికి సాతవాహన సప్తశతి మీద ప్రీతిగదా! ఆ మూలప్రాకృత

సప్తశతిలోని గాథా వర్ణనలను శ్రీనాథుడు క్రీడాభిరామంలో ఏవిధంగా అనుకరించిందీ చూపారు శాస్త్రిగారు. ఇటువంటి అశ్లీల రచనను శ్రీనాథుడి వంటి మహాకవి, మహాపండితుడు ఆమోదిస్తాడా అన్న దానికి సంస్కృత సాహిత్యం నుంచి, ప్రాకృత సాహిత్యం నుంచి తగిన ఉపపత్తులు చూపారు. శ్రీనాథుడి కవిసార్వభౌమతకు ఆయన నిరంకుశత్వమూ, నవ ప్రియత్వమూ కారణాలుగా చూపారు. అతివేల శృంగారాన్నీ ముమ్మాటికీ అశ్లీమైన వర్ణనలను ఉదాహరించటానికి శాస్త్రిగారు పొందిన సంకోచం, మనస్విత మెచ్చదగినవి. కాని, ఆభాసవిమర్శకులు చేసిన విమర్శలను దృష్టిలో ఉంచుకొని శ్రీనాథుడి చాటువులుగా పరిగణితములయ్యేవాటి నెన్నిటినో ఈ పీఠికలో వారుదాహరించారు. కామవల్లీ మహాలక్ష్మి పేరుతో పిలువబడే కామేశ్వరికథను కూర్చారు. ఓరుగల్లు విశేషాలను తెలియజేస్తూ ఆనాటి సాంఘిక చరిత్రనంతా విశదంగా తెలియజేశారు. శ్రీనాథుడి ప్రయోగాలను ఆయన అర్వాచీనులైన మహాకవుల అవే ప్రయోగాలతో తైపారువేసి చూపారు. క్రీడాభిరామంలోని కొన్ని పదాలకు ప్రయోగాంతర సాధనాలతో అర్థాలు చెప్పారు. శ్రీ శాస్త్రిగారి సౌజన్యము, మనస్విత ఎటువంటివంటే అంతకుపూర్వం ఇరవై ఏళ్ళ కిందట శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు క్రీడాభిరామాన్ని ప్రకటించిన విషయం ప్రస్తావిస్తూ "వారి యనుజ్ఞగొనియే నేనీ గ్రంథమును సంస్కరించి యుపోద్ఘాతము వ్రాసి యచ్చునకిచ్చితిని" అన్నారు. శ్రీనాథుడి కవితా వైభవ 'సర్వస్వ' రచనగా ఈ పీఠిక అనుసంధానితమైంది. ఇంతేకాకుండా కాకతీయుల ఇలవేలుపైన కాకతమ్మనుగూర్చి కొన్ని పదాల అర్థాలనుగూర్చీ ప్రశస్తమైన అనుబంధం చేర్చారు శాస్త్రిగారు. ఇప్పుడీపీఠికా సంకలన ప్రకటన కర్తలై, తండ్రికి తగిన తనయులు ఆచార్య ఆనందమూర్తిగారు ఒక అనుబంధం కూర్చారు. ఇందులో క్రీడాభిరామ ప్రకటనానంతరం కర్తృత్వాన్ని గూర్చీ, శబ్దార్థాలను గూర్చీ వచ్చిన విమర్శలను సమీక్షించి సిద్ధాంత న్యాయం చేశారు శ్రీ ఆనందమూర్తిగారు. కాకతమ్మను గూర్చి ఈ అనుబంధంలో కొత్త విషయాలు ఉటంకించారు. ఏకవీరాదేవి ఆరాధన కొంకణదేశంలోనూ ఉన్నట్లు సి.డి. దేశముఖ్‌గారి స్వీయచరిత్రలో ఉంది. మాహురగ్రామం మహారాష్ట్రంలో



నెలకొని ఉన్నది కాబట్టి మహారాష్ట్ర వీరగాథలు, జానపద గాథాసాహిత్యం ద్వారా కాకతమ్మ, ఏకవీరులకు సంబంధించిన కొత్త సంగతులేవైనా తెలుస్తాయేమో పరిశీలించవలసిందిగా సాంఘిక సాహిత్య చరిత్రకారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. పీఠికా సంకలనంలో క్రీడాభిరామాన్ని గూర్చిన శ్రీ శాస్త్రిగారి పీఠిక వెలకట్టరానిది. మౌలికమైన మహాప్రాతిభమైన కృషి కాబట్టి దీనినిగూర్చి కొంత విపులంగా ఇక్కడ ప్రసక్తం చేయటం జరిగింది.

పూజ్యపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి ఈ పీఠికల సంకలనంలో మూడు వంతులు శ్రీ వేంకటేశ్వరస్వామి సాహిత్యం, మూడు వంతులు ప్రాచీన కావ్య ప్రబంధ దేశి సాహిత్య సమీక్షలతోపాటు మూడు వంతులు ఆధునిక సాహిత్య అనుశీలనం కనపడటం విశేషం. వారిది సమగ్రమైన మూర్తిమంతం. పూర్ణయోగం. అందువల్ల దేనినిగూర్చి సంభావించినా అట్టుపుట్టానవాళ్ళతో సహా పాఠకులకు తెలియజేస్తారు. చిన్న అభిప్రాయం, లఘు సమీక్ష అయినా పర్యాప్తంగా ఉంటుంది. వారి అభిప్రాయాన్ని ఆశించిన వారికీ, తరవాత దానిని అవలోకించిన వారికీ కూడా తృప్తికరంగా ఉంటుంది. అహమిక, మమకారం, స్వీయమతాభినివేశం, పట్టుదల, ప్రాగ్ నిర్ణయం కనపడవు వారు ఏవిషయాన్ని ప్రస్తావిస్తున్నా. ఈ పదం అర్థం ఇది కాబోలు, ఇంతవరకు ఈ విషయాన్ని నిర్ధారించగల ఆధారాలు లభించలేదు, ఈ ప్రయోగానికి ఇదమిత్థ నిర్ణయ సమర్థమైన ఆకరంలేదు, ఇత్యాదిగా పరమ సాధుసుందరంగా వారి ఆత్మీయ వచస్సు విరాజమానమవుతుంది. సాధారణంగా సంస్కృత పండితులకు సంప్రదాయ పరినిష్ఠిత విద్వద్వరేణ్యులకు గతకాలము మేలు అనే దృక్పథం ఉంటుంది. వ్యాకరణం పట్ల పూర్వ పూర్వకవి ప్రయోగ శిరోధార్యత పట్ల మొగ్గు ఉంటుంది. కాని, శ్రీ ప్రభాకరశాస్త్రుల వారికి సంస్కృత సాహిత్యం పట్ల ఎంత ప్రీతి ఉన్నదో ప్రాకృతం పట్ల అంత మమత్వమూ ఉన్నది. దేవాలయం శిల్పం పట్ల, ఆగమ శాస్త్రాల పట్ల ఎంత అభిరుచి ఉన్నదో పాటిదిబ్బలపైన, అక్షరాలు అరగిపోయిన బండరాళ్ళపైన, పాడుపడ్డ గుళ్ళలోని పాతగిల్లిన శాసనాలపట్ల అంత ఆసక్తి ఉన్నది. నాటి ప్రజా జీవితాన్ని బాగా తెలుసుకొంటేనే కాని, సామాజిక సాంస్కృతికమైన పరిణామాలను

నిరూపించలేమని వారి అభిప్రాయం. అదీ భాషా సాహిత్య పరిశోధనలో వారి తాదాత్మ్యం.

బాలసాహిత్యం విలువ ఎటువంటిదో పిల్లల వాచకపు పుస్తకాలు ఎట్లా ఉండాలో సుమారు డెబ్భై ఏళ్ళనాడే శ్రీ శాస్త్రిగారు చెప్పిన విషయాలు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తాయి. ఈనాడు సంఘంలో పసివయస్సుననే నేర్చుకొనే విషయాలు అర్థభావ సంగతం కాకపోవడం, వాటిలో సృజనాత్మకోద్దీపన లేకపోవడం సాంస్కృతికమైన ప్రాతిపదికవికసనం బుదుత బుద్ధులలో చేకూర్చ లేకపోవడం వారు ప్రస్తావించారు. "ఉన్నత కవితా వాహినికి బాల వాఙ్మయ మూటపట్టని చెప్పవచ్చును" అంటారు వారు.

ఇందులో నాచన సోముని ఉత్తరహరివంశానికి, శ్రీనాథుడి హర విలాసానికి శ్రీ శాస్త్రిగారు కూర్చిన పీఠికలు పరిమాణంలో చిన్నవైనా గుణవత్తరాలు. నన్నయ భట్టారకుడి ధారాశుద్ధీ, తిక్కన భావగాంభీర్యం సోమనాథుడి కవితలో కనపడుతున్నా శయ్యాసౌభాగ్యం అతిమాత్రమై అర్ధ సౌలభ్యం కొంతవరకు కొరవడిందని శ్రీ శాస్త్రిగారి వంటి మహావిద్వాంసులు మాత్రమే చెప్పగలరు. కవికాలాదికాన్ని గూర్చి పూర్వ హరివంశపు ఉనికి సంభావ్యతను గురించి అనేక విషయాలు చర్చించి నాచన సోముని కవితాగుణాన్ని సిద్ధాంతీకరించారు. 'ఆంధ్రకవులలో చిత్ర కవిత్వమును వెలయించిన వారిలో నీతడే ప్రథముడుగా గానవచ్చుచున్నా' డన్న విషయాన్ని నిరూపించారు. హరవిలాసంలో శ్రీనాథుడు కాళిదాస కుమార సంభవాన్ని అనుకరించే సన్నివేశాలలో ఏవిధంగా 'పాడు' చేసిందీ 'పాడి' చేసిందీ హృద్యంగా వివరించారు. మూలాతిశాయి సౌందర్య సంపాదకములని కొన్ని ఘట్టాలు చూపారు. 'పై శ్లోకమునకు శ్రీనాథుని తెలుగు పద్యము సరియయినదికాదు' 'నన్నయ భట్టారక పద్యానుకరణోత్సహమున శ్రీనాథుడు కాళిదాస శ్లోకరసభావౌచిత్యానుశీలనమును మరచినాడు' అన్నారు. "అధ్వాన' పదాన్ని గురించి శ్రీ శాస్త్రిగారు చేసిన చర్చ వారి సర్వతోముఖవిద్వత్తకు తారకాణగా నడిచింది. "కర్ణాటమున బంపకవి విక్రమార్జున విజయములో 'అధ్వాన పదపరిశ్రమ శ్రాంత' యని ప్రయోగమున్నది. తన్ముద్రాపకు



లాయధ్వాన పదమును మార్గార్థముగా గ్రహించిరి. మార్గమని, మార్గమనియేని యర్థముగల సంస్కృత శబ్దమని, అధ్వశబ్దపు దత్సమ రూపమనియేని గ్రహించినను శ్రీనాథుని 'యధ్వానపుంబట్టు' సమర్థితమగును. వ్రాతప్రతి పాఠము పరిగ్రాహ్యమే కావచ్చును. కాని తెల్గుననిక నెక్కడను నీ 'యధ్వానము' నాకు గానరాలేదు" అన్నారు వారు. దీనిని బట్టి వారి అపారపాండితీ పరిశ్రమను పోల్చుకోవచ్చు 'కోహళి' అని పదం అర్థం గూర్చి చర్చిస్తూ ఈ పదప్రయోగం శ్రీనాథుడూ, నాచన సోమన మాత్రమే చేశారనీ మురారి నాటక శ్లోకభాగం దీనికి మూలమనీ' సంస్కృతాంధ్రములలో నాకీ పదమింకెక్కడను గానరాలేదు' అనీ శ్రీ శాస్త్రుల వారు చెప్పారు. కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయ యక్షగానానికి మధుర కవితలు అనే పేరుతో పీఠిక వ్రాస్తూ తెలుగు సాహిత్యంలో యక్షగానాల స్థానాన్నీ, దేశి సాహిత్య ప్రశస్తినీ గూర్చి అపూర్వ హృద్యమైన విషయాలెన్నో తెలిపారు."దేశి రచనలలో నుండి సింగి, సింగడు, కోణంగి, దరువు అనునవి నటీనటులుగను, విదూషకుడుగను, ధ్రువగను సంస్కృత నాటకముల జేరెనేమోయని కూడ యోజింపదగి యున్నట్టున్నది." అని పురా ద్రావిడ భాషల ప్రభావం సంస్కృతంపైన కూడా ప్రసరించకూడదా అనే విచికిత్సను భాషాశాస్త్రులవేత్తల పరిశోధనల కన్నా ముందుగానే శ్రీ శాస్త్రిగారు ప్రతిపాదించారు. ఇది వారి విశాలహృదయానికీ సత్యాన్వేషణకు నవీన దృక్పథ స్వాగతానికి తార్కాణం. గిడుగు సీతాపతిగారి భారతీశతకానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ వ్యావహారికభాషా వాదాన్ని సర్వాత్మనా సమర్థించారు శ్రీ శాస్త్రిగారు. మొయిలురాయబారము అనే శ్రీ త్రిపురాన వేంకటసూర్య ప్రసాదరావుగారి మేఘసందేశ గేయరూప ఆంధ్రీకృతిని సమీక్షిస్తూ మేఘదూతానికి "నూటింటి దాక ననుకరణములు నిరువదింటి దాఁక వ్యాఖ్యలు వెలసినవి కాని, యా యనుకృతులేవియు దీనికి దీటు గాజాలకపోయెను. మేఘసందేశము జాతిరత్నమే, అనుకరణములెల్ల బోతరత్నములే" అని వివరిస్తూ "భారతీయుల యెల్ల భాషలలోను నింకనెన్నో ఖండాంతర భాషలలోను నిది పరివర్తితమై చిత్తరువులతో గూడ ముద్రితమై వెలసినది. మన దేశమున నే నెఱిగినంతలో నింతకుముం దిది వంగభాషలోను

హిందీభాషలోను బద్యరూప పరివర్తనములతో జిత్రములతో ముద్రితమైనది" అని శ్రీ శాస్త్రి గారు సర్వభారతీయ భాషల ఆధునికతా పరిశీలనంలో కూడా అగ్రేసరంగా ఉన్న విషయం విదితం చేస్తున్నారు. ఉత్తమకవిత తత్త్వం ఏమిటో గోవింద రామాయణానికి (ఉత్తరకాండ అనువాదం) తొలిపలుకు రూపంగా ఆవిష్కరించారు శాస్త్రిగారు. శ్రీ వెంకటేశ్వరసాహిత్యానికి సంబంధించిన ఆరు రచనలున్నాయి ఈ సంకలనంలో. తాళ్ళపాక కవులను గూర్చిన సమగ్ర సమాచారం ఈ పీఠికా సంకలనం ద్వారా తెలుస్తుంది.

చిన్నయసూరిని స్మరిస్తూ లోకంలో ఒక్కొక్క పనికోసం ఒక్కొకరు జన్మిస్తారు అని శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు రమణీయంగా నివాళించారు. ఇదేవిధంగా తాళ్ళపాక కవులను గురించి ముఖ్యంగా సంకీర్తన సార్వభౌములైన అన్నమయ్యను గూర్చి శ్రీ ప్రభాకరశాస్త్రి గారు వెలయించిన చారిత్రక విశేషాలు, తిరుపతి దేవాలయంలోని తాళ్ళపాక అరనుంచి రాగిరేకుల సముద్ధరణం వారు ఈ ఘనకార్యంకోసం తిరుపతి చేరారేమో ననిపిస్తుంది. వేంకటేశ్వర వచనములు, శృంగార సంకీర్తనములు, వేంకటేశ్వర లఘుకృతులు, అన్నమాచార్య చరిత్ర, ఆంధ్రామరుకము, తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కళ్యాణము శ్రీ శాస్త్రిగారు తమ పీఠికలతో ప్రకటించారు. తాళ్ళపాక తిరువేంగళప్పకృత అమరు కాంధ్రీకరణానికి శ్రీ శాస్త్రిగారు వ్రాసిన పీఠిక పరిణామంలో చిన్నదే అయినా చాలా విలువైనది. "ఈ శతకశ్లోకములు నూఱును నేర్పరియగు చిత్రకారుడు చదివినచో నూఱు చిత్రములు చిత్రింప గలడు" అన్నారు వారు. అది ఇప్పుడు నిరూపితమైంది.

ధనుర్విద్యావిలాసమనే గ్రంథం కృష్ణమాచార్యుడనే కవి రచించాడు. ఇది మరీ ప్రాచీన గ్రంథం కాదు. కాని, వేటూరి వారు విపులమైన పీఠికతో వెలువరించిందాకా ఇందుకు సంబంధించిన మహత్తరమైన విషయాలెన్నో తెలుగు వారికి తెలియవు. ఈ గ్రంథ ప్రచురణలో వారి పరిశ్రమ చాలా అక్కజం గొలుపుతుంది. వారి వివిధ శాస్త్ర పాండిత్యం, సమన్వయ కౌశలం ఈ పీఠికలో అడుగడుగునా పొడకడుతుంది. సమకాలీన ఆంధ్రసాహిత్య ప్రపంచానికి శ్రీ శాస్త్రిగారిపట్ల ఉండే గౌరవ ప్రపత్తులు వారు అనేక ఆధునిక



కావ్యాలకు కూర్చిన పీఠికలు, సమీక్షలు, పరిచయాలు, అభిప్రాయాలు వల్ల తెలుస్తున్నది. కవిరాజు శ్రీ పాదకృష్ణమూర్తి శాస్త్రిగారి శ్రీ కృష్ణ భారతం పై శ్రీ శాస్త్రిగారు వెలువరించిన అభిప్రాయం ఈ సంకలనంలో ఉంది. అదే విధంగా ఆకుండి వ్యాసమూర్తి శాస్త్రిగారి వ్యాసభారత నవనీతం గూర్చిన సమీక్ష కూడా ఉంది. చిదిరెమఠం వీరభద్రశర్మగారి శివపంచస్తవి, తుమ్మల సీతారామమూర్తిగారి ధర్మజ్యోతి, కరణం అశ్వత్థరావుగారి దండకరామాయణం, శుభ్రవేటి తిప్పాజోశ్యులుగారి వేదభూగోళం, మల్లంపల్లి వీరేశ్వర శర్మగారి కాంచీఖండం, బయిరెడ్డి సుబ్రహ్మణ్యంగారి గాంధీశతకం. నందిరాజు చలపతి రావుగారి మంగళగిరి మాహాత్మ్యం, కొండూరు వీరరాఘవాచార్యులుగారి శిల్పదర్శనం, ముదిగొండ నాగవీరేశ్వర కవిగారి శివపురాణం, ముదివర్తి కొండమాచార్యులుగారి ధర్మదీక్ష, బులుసు వేంకటేశ్వరులుగారి మహర్షి జీవిత కథామృతం, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మాదిరాజ విశ్వనాథరావు కవిద్వయ కృత విక్రమాంకదేవ చరిత పద్యానువాదం గూర్చి శ్రీ శాస్త్రిగారు వెలువరించిన సమీక్షలు అభిప్రాయాలు, ఆమోద ప్రోత్సాహాలు ఈ పీఠికా సంకలనంలో చేరాయి.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి మనస్విత, భావసౌకుమార్యం, సాధుప్రవృత్తి, దయాదాక్షిణ్య మాధుర్య హృదయ గాంభీర్యం, దుర్భాకరాజశేఖర శతావధానిగారి రాణాప్రతాప సింహ చరిత్రపై వారు వెలువరించిన సమీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. ఎల్లలెరుగని వారి ఔదార్యం ఈ సమీక్షలో ప్రతిపద సుందరంగా భాసించింది. గడియారం వేంకట శేషశాస్త్రిగారి శివభారతాన్ని గూర్చి కూడా శాస్త్రిగారు హృద్యమైన సౌశీల్య సుందరమైన అభిప్రాయం వెలువరించారు. ఇంకా వేదాంత దేశికుల వారి హంస సందేశానికి శ్రీమోచర్ల వారి అనువాదం, మల్లంపల్లి మల్లికార్జున కవిగారి భోగేశ్వర మాహాత్మ్యం, శ్రీ వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారి అభినందన సంపుటం బులుసు వేంకట రమణయ్యగారి కువలయానందసారాలకు వేటూరి వారి పీఠికలు, అభిప్రాయాలు ఈ పీఠికా సంకలనంలో చేరాయి.

అన్నిటికన్నా విశేషం ద్రావిడ వేదమైన నాలాయిరంలో గోదాదేవి

విరచిత మొదటి ముప్పైపాశురాలను "తిరుప్పావై" అంటారు. ఇందులో పదిపాశురాల ఆంధ్రానువాదం మాత్రమే శ్రీనివాస గురుని రచన లభించగా తక్కిన ఇరవై యింటిని శ్రీ శాస్త్రిగారు పూర్తిచేసి సప్తపదులు అనే పుస్తక రూపాన ప్రకటించారు. ద్రవిడ భాషలో కూడా శ్రీ శాస్త్రిగారి లోతైన పరిశ్రమ ఎటువంటిదో ఈ  సప్తపదులకు వారు కూర్చిన పీఠికను బట్టి తెలుస్తుంది. 'భగవద్గుణాను భవానంద పరవశమై యామె తన భర్త శ్రీ రంగనాథ స్వామియేనని వినోదించుచు లౌకిక రీతిచే నవివాహితగానే యాయుష్కాలము గడిపి యుండవచ్చును" అని ఆముక్త మాల్యదా  శ్రీ రంగనాథుల అనుబంధాన్ని శ్రీ శాస్త్రిగారు కొత్తరీతిన వ్యాఖ్యానించారు. ఇది వారి ఆధునిక స్వతంత్ర హేతువాద భావ ధోరణిని సూచిస్తున్నది. ఆంధ్ర కామందకమనే నీతిశాస్త్ర సంకలనాన్ని పరిష్కరించి ప్రకటిస్తూ విలువైన పీఠికను కూర్చారు వారు. ఇటువంటి పీఠికా సరస్వతికి ఒక పీఠికాపుష్పాన్ని సమర్పించే అవకాశం కలిగించిన ఈ సంకలన ప్రకాశకులైన ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారికి కృతజ్ఞుణ్ణి. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి సారస్వత మూర్తికి నమస్కారము.

అక్కిరాజు రమాపతిరావు
హైదరాబాదు
4–5–1990

## PATH - BREAKER AND A TREND - SETTER

## PRABHAKARA SASTRI

H.Rajendra Prasad
Chief post Master general
Andhra Pradesh
Hyderabad- 500001

The depth and extent of influence exerted on the contemporary Telugu literary criticism and research by **Sri Veturi Prabhakara Sastry** will perhaps never be determined with any degree of exactitude, Nor because we, the modern- day beneficieries of his indefatigable labours are  sensitive to or unaware of the invaluable legacy of scholarship bequeathed by him. In fact, the pioneering skills and near - total mastery demonstrated by Prabhakara Sastry in the twin - spheres of literary criticism and research are generally so well recohnised that we, at times, tend to actually take them for granted. It has been noted that men are apt to quote from Shakespeare and the Bible, more by  instinct and as a matter of routine habit, without any particular awareness of the origins of the source of such quotations - an abiding evidence of universal and continuing validity of these never - known- to- fail sources themselves ! So it is, one imagines, with  Prabhakara Sastry. He strode the world of modern Telugu literary criticism in the manner of a gaint, path - breaker and a trend - setter who evolved his own ground - rules and ranged freely, with distinct authority, over his chosen fields, for  other lesser of less - gifted men merely to emulate and obey. And none of the many critics and researchers who came after him could claim to be free of the wholesome and utilitarian critical influences emanating from his tireless labours and astounding scholar ship. Such claims, if made, would probably look scarcely less

than pretentious ! Prabhakara Sastry 's unremitting efforts served to lightup, repeatedly, many little - known or obscure nooks of our immense literary treasures and brought to light as many unknown or neglected nuggets of Telugu literary heritage.

Prabhakara Sastry pursued his tasks and prodigious labours over a span of four decades. His efforts were for the most part single - handed. They came also at a time when such undertakings were largely unassisted and unencouraged by any but the most perfunctory sponsorships and patronage, depending almost entirely on the personal munificence of local rulers of princes with a flair for the literary, the exploratory or the artistic. And although the avenues for explorations were vast, the aids and methodology for such questings were vastly considerably less than what we have got accustomed to in our own times. A direct consequence of situations so unpropitious as these was that the success and effectiveness of a scholar and researcher depended wholly on his personals tenacity and - importantly - on the calibre of his mental processes and the clarity of his thought. Such, however, was the intellectual stature of Prabhakara Sastry, and such the unflagging brilliance of his mind and thought, that he converted every lack of organised and institutional patronage into a shining route to informed artistic - literary quest. It might in truth take a long time before the full import or beneficiant impact of Prabhakara Sastry`s untiring exertions and amazing scholarship are fully realised and assessed by the grateful successor - generations of scholars and researchers.

The varied ( and often voluminous) writings of Prabhakara Sastry were published in different journals over a period of three decades. Many of those journals are extinct, and those which have not ceased publication are difficuly now to get (the old numbers) by. Some of his writings were not published at all. Consequently, sizeable portions of his critical output may well have been lost, if determined efforts were not made to retrieve, collect and publish them afresh. Fortunately for all who value excellence of human thought and greatness in literature, **Manimanjari Publications**, decided to undertake the laudable venture of publishing the complete works of Prabhakara Sastry. So far 20 Books have been published. As part of that venture Prabhakara Sastry's critical introductions to classics have all been compiled in two volumes. The first volume in the series, covering the years 1914 - 1928, comprising sixteen pieces of his writing on subjects as diverse as drama, history, poetry, puranas and some miscellaneous compilations, besides selected prefaces and interpretative essays, were published a few years ago (1955). The Current Volume, the second in the series. consists of Sri Sastry's published and unpublished writings during 1928 - 1950.



Any discussion of the multi-sided accomplishments of Prabhakara Sastry would seem to automarically necessitate an early mention of the many celebrated prefaces flowing from his prolific pen at variors points of time during his illustrious career. These were often long and elaborately- sculpted pieces of pure brilliance. The prefaces of Prabhakara Sastry - like those of Bernard Shaw- in themselves constitute an impressive subgenre of creative writing . Often employed to "introduce"to the lay reader a long - forgotten or barely- rememberred literaty composition, and often quite the longer than the original work so sought to be introduced, these prefaces, inevitably, were pieces of distilled wisdom and discernment. Interestingly, Arudra, one of our brightest literaty personages, referring to these prefaces, observed : " Not Shaw am I, nor a Prabhakara Sastry..."

While many of his numerous prefaces are deservedly famous. It is also interesting. and rare, that a whole new play be triggered by any one of them. But such a rare thing did indeed happen when , inspired by Prabhakara Sastry`s preface to " **Basava Puranam**" Viswanatha Satyanarayana, the doyen among modern poet- play wrights, was moved to write his famous play, " **Trisulam**"

"Kreedabhiramamu" had been regarded as the legendary work of Vallabharaya. This view regarding its authorship had found wide acceptance until Prabhakara Sastry propunded a contrary- view that the author of this dramatic poem was indeed none other than Sreenatha, and not his patron as had been believed for a long time. The close analysis and critical scrutiny employed to examine the stylistic peculiarities of the work ( besides its syntax, imagery, structure and the idiom) and the inferences drawn from such exercise, bespeak of the originality and sharpness, the eclecticism as well as the exploratory side of Prabhakara Sastry's critical prowess.

With considerable effort and equal tenacity, this extraordinary scholar collected, then delineated - and thereby eventually succeeded in propagating many a fine specimen of folk- compositions and children's songs. All this contributed meaningfully to the great acceptability attained by this genus of popular literature. "**Mugdha Madhura Vangmayamu**" is a valuable place of perceptive writing pertainging to this category. Nachana Somana was not one of the determined and dedicated of scholars. His best- known work, " **Uttara Hari Vamsamu"** is a long and complex poem. Prabhakara Sastri not merely edited the difficult poem with competence and discernment but also provided an illuminating commentary on it the sureness and deft manner in



which he proceeds to 'dete' the author and his work with the aid of many fascinating literary and historical insights is truly rema kable. Quite another milestone in the same mould is his impeccably- crafted preface to Sreenatha's "**Hara Vilasamu**". Indeed it may be safely asserted that no more authoritative and scrupulously- composed critcal study of Sreenatha and his works was ever attempted by anyone then what was written by Prabhakara Sastry with such telling success.

It is not commonly realised that the contribution of Telugu poets to the grown and development of Yaksha-Gana' was quite considerable. Prabhakara Sastry's analysis and elucidation of " **Sugreeva Vijayamu**" represents his esteem for and deep understanding of the Yaksha- Gana, genre of popular art which flourished in large parts of south Indea, including the Andhra desa. He was also a firm supporter of the idea that Telugu language should be liberated from the shackles of pedantic and artificial constraints and be invested with the naturalness of the spoken word. In this respect, he was an ally of man like Gurajada Appa Rao, Gidugu Rama murti and J.A. Yates all of whom strove hard and long to try and invest Telugu litererary language with conversational ease and fluidity, and divesting it of excessivly scholarly of stilted cramps. A sample of his views and concerns in the area of language - i.eform is found in his introduction to "**Bharati Satakamu**" included in the volume. It bears close and repetitive reading for its and clear- headed thoughts lucid exposition.

It would somehow seem as if Prabhakara Sastry had come to develop and entertain steady and mystically repetitive connections with the Lord of Tirupathi : five of the pieces in the volume pertain directly of obliquely to the dominant deity of Andhra Desa, Venkateswara. Prabhakara Sastry's pioneering

efforts in locating and bringing to light the copper- plates (on which were inscribed the celebrated devotional songs of Tallapaka Annamacharya ), are well - known. It was due to this, more than any other factor, which awakened the general interest and made people aware of the great merit and devotion in the hitherto unknown compositions of this legendary Vaggeyakara, whose very life was one long, unbroken paean of devotion to the Lord of the Seven Hills. " **Sringara Sankeertanamulu** " describes the discovery, study, collation and interpretation of Annamacharya's devotional compositions. In the preface to " Annamacharya Charitra" the author delves into the family- history of the saint- composer and discusses the developments as well as the components of his devotional verses. Here, Prabhakara Sastry scales rare heights of scholastic genius it may ever be surmised that each fact brought out in the preface, indeed every sentence in it, could well become the core and a basis for a regular dissertation by scholars at a future date so loaded with insights and revelations is this particular preface. A work which was not very well- known, " **Subhadra Kalyanamu** ", is introduced by means of another of his luminant prefaces. Although brief when compared to others, Prabhakara Sastry, through this preface, succeeded in acquainting the reader with the creative endeavours of Tallapaka Timmakka, wife of Annamacharya, Herself a gifted poet and one of the earliest women who made and left their mark on Telugu literaty tradition. The last preface in this group which deserve mention is "Venkateswara Laghu Kritualu" which embodies the author's deep familiarity and grasp as reflected in his earlier achievements of planned and painstaking discovery and collation of a number of palm lear manuscripts and which led directly to the publication of an elaborate descriptive catalogue of such writings which ran into nearly twenty volumes. This is truly a path-breaking work



and serves to highlight Prabhakara Aastry's stupenduous exploratoty and anthological gifts.

"Thiruppavai" is a work of the Alwaars of what is now the TamilNadu. It represents the best in the Dravidian devotional thoughy and tradition. This intensely god-intoxicated work has continued to evoke utmost devotion from generations of men and women. It is recited with great veneration and fervour in thousands of homes throughout south India. The essential piety, -not to mention his versatility - of Prabhakara Sastry is reflected in his excellent rendering of this great poetic work into eminently readable Telugu. And as was usual with him, he added, too, a most comprehensive preface to it.

The volume under disussion also contains, in addition to the prefaces and commentaries briefly referred to in the preceding pages, some of the miscellaneous writings of the great scholar, like forewords, reviews, opinions and the like. Notable among these are " Andhra Kamandakamu", a digest of morality and matters realting to political ethics, " Dhanurvidya Vilasa Peethika", pertaining to the art of archery. " Govinda Ramayanamu", etc.

The writings included and presented in this collection are pure gold. They serve to highlight the undoubtedly multi- faceted genius of Prabhakara Sastry. One looks forward with eagerness to nuture volumes of his complete works which are to follow and succeed this one, and all of which, together, might remind us yet again of the invaluable services rendered by this Titan among scholars in the cause of Telugu language and literature.

April 19, 1990. (sd)
Hyderabad H Rajendra Prasad.

# విషయసూచిక


| విషయము | పుటలు |
|---|---|
| 1. క్రీడాభిరామము తొలిపలుకు | 1 |
| 2. ముగ్ధమధురవాఙ్మయము (బాలభాష ) (1923, 1930) | 120 |
| 3. ఉత్తర హరివంశము - పీఠిక (1936) | 128 |
| 4. హరవిలాసము - పీఠిక (1939; 1953) | 138 |
| 5. మధురకవితలు ( సుగ్రీవవిజయము ముని పలుకు)(1939) | 162 |
| 6. భారతీశతకము - ఉపోద్ఘాతము (1940) | 176 |
| 7. మొయిలు మెఱుగులు (మొయిలురాయబారము పీఠిక...1940) | 181 |
| 8. గోవిందరామాయణము- తొలిపలుకు (1942) | 192 |
| 9. వెంకటేశ్వర వచనములు - పీఠిక (1945) | 195 |
| 10. శృంగారసంకీర్తనములు - ఉపోద్ఘాతము (1947) | 212 |
| 11. వెంకటేశ్వర లఘుకృతులు - తొలిపలుకు (1948) | 222 |
| 12. అన్నమాచార్య చరిత్ర (1949) పీఠిక | 226 |
| 13. ఆంధ్రామరుకము - పీఠిక (1949) | 340 |
| 14. ధనుర్విద్యావిలాసము - పీఠిక (1950) | 342 |
| 15. సుభద్రాకళ్యాణము - పీఠిక (1950) | 386 |
| 16. తిరుప్పావై సప్తపదులు - పీఠిక (1925) | 388 |
| 17. ఆంధ్రకామందకము - ఉపోద్ఘాతము (1950) | 391 |
| 18. సప్తపదులు - పీఠిక (1925; 1950) | 405 |
| 19. శ్రీకృష్ణభారతము (1916) | 409 |
| 20. భోగేశ్వర మాహాత్మ్యము-పండితాభిప్రాయము (1919, 1932) | 410 |
| 21. కువలయానందసారము పండితాభిప్రాయము (1933, 34) | 411 |
| 22. హంససందేశము - తొలిపలుకు ( 1939) | 412 |
| 23. శ్రీ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి అభినందనగ్రంథము(1941) | 415 |
| 24. శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావు గారికి లేఖ (1941) | 416 |
| 25. శ్రీ శివభారతము- అభిప్రాయము (1943) | 417 |
| 26. శ్రీరాజశేఖర శతావధాని రాణాప్రతాపసింహ చరిత్ర- సమీక్ష (1944, 1983) | 418 |
| 27. విక్రమాంకదేవ చరితము - పండితాభిప్రాయము(1943) | 437 |
| 28. ధర్మదీక్ష - అభిప్రాయము (1946) | 438 |
| 29. శ్రీ మహర్షి జీవిత కథామృతము పండితాభిప్రాయము ( 1946, 50, 53) | 439 |
| 30. శ్రీ శివపురాణము - విద్వదభిప్రాయము (1947) | 441 |
| 31. మంగళగిరి మాహాత్మ్యము- పండితాభిప్రాయము (1947) | 442 |
| 32. శిల్పదర్శనము - అభిప్రాయము (1947) | 443 |
| 33. గాంధీశతకము - అభిప్రాయము (1948) | 444 |
| 34. వేదభూగోళము - అభిప్రాయము (1949) | 446 |
| 35. కాంచీఖండము - పండితాభిప్రాయము (1949) | 447 |
| 36. శ్రీ దండక రామాయణము- అభిప్రాయము (1949) | 448 |
| 37. శ్రీ వేంకటేశ్వర సదాశివేశ్వర గేయద్వయము (1949) అభిప్రాయము | 449 |
| 38. ధర్మజ్యోతి -తొలిపలుకు - | 450 |
| 39. హరస్తుతి-ప్రశంస (1949) | 453 |
| 40. శివపంచస్తవి -సమీక్ష - | 454 |
| 41. శ్రీమదాంధ్రవ్యాస భారత నవనీతము-సమీక్ష - | 455 |

శ్రీః

శ్రీ గురుచరణం శరణమ్

# క్రీడాభిరామము

## తొలి పలుకు

విషముష్టివిత్తులు, నాభి, నల్లమందు, ఉల్లిపాషాణము ఎట్టి చెట్టవస్తువులో యీ క్రీడాభిరామముకూడ వట్టి చెట్టపుస్తకమే యనఁదగును. వస్తుపరిజ్ఞానము చాలనివారు, వాడవలసినవరుస నెఱుఁగనివారు, దురుద్రేకములకు మురియు వారు, ధర్మాభిరతి లేనివారు, బాలురు, పామరులు, ముగుదలు నట్టి వస్తువులను ముట్టరాదు. ఇట్టి పుస్తకములనుగూడఁ జేతఁ బట్టరాదు. అట్టివారి కివి యబ్బెనేని యనర్థములు గల్గినను గల్గవచ్చును. ఇఁక నిట్టి చెట్టతనము గల వస్తువులను, బుస్తకములను జెత్తకుప్పలోఁ జేర్పక యంగళ్ళకుఁ దెచ్చుటేల, యచ్చొత్తించుటేల? అని యాక్షేపమేని యిదిగో సమాధానము. అవియు, నివియుఁగొంత యపాయకరములే యయినను నెక్కువగా నారోగ్యవర్ధకములు, నానందదాయకములు నగుచున్నవి. విరుద్ధోపయోగమున విషములేకాని యర్హోపయోగమున నివి యమృతములు. పండితు లా వస్తువులను, నీ పుస్తకములను శుద్ధిచేసి దోషములఁదొలగించి విషవికారము లెసరేఁగ కుండునట్లును, ఆరోగ్యము నానందము నలవడునట్లును వాడుదురు. నాడీశక్తి నష్టమై నీరసించుచున్న రోగుల నెందఱనో సద్వైద్యులు విషముష్టివిత్తులు మొదలగువానిని వాడఁదగినట్లు వాడి యుత్సాహబలోపేతులఁ గావించి యుజ్జీవింపఁజేయుచున్నారు. వాని సముచిత ప్రయోగమువలన శాస్త్రసిద్ధాంతవిశేషములఁ జాలఁగా గుర్తించుచున్నారు. వాని వినాశమునకు వైద్యు లంగీకరింపరు. అట్లే, అనుపమాన కవితాహ్లాదమును గల్పించుచు, ననేక ప్రాచీన చరిత్ర విషయముల నెఱింగించుచు, నింక ననేకా పూర్వశబ్దార్థ రహస్యముల నిరూపించుచు సహృదయహృదయాహ్లాదకములైన యిట్టి చతురకృతులుగూడఁ బండితలోకమునకు బహూపకారకములుగా నున్నవి. వీని నాశపఱచుటకు సరసులగు విద్వాంసులును సమ్మతింపరు.

అందును క్రీడాభిరామము భాషాచరిత్ర కవిత్వ విశేషముల ననేకములనెఱిఁగించుచున్నది. విద్వాంసులీ గ్రంథమునకై మిక్కిలి వేడుకపడుదురు. ఈ గ్రంథమిట్టి యోగ్యతగలదే యనుటకుఁ బ్రఖ్యాత పండితులు పలువురు ప్రమాణము. నేను నిందు ముందు దీని గుణ విశేషములను నిరూపింపనున్నాఁడను.

నాభి, నల్లమందు మొదలగు వస్తువులవలని యనర్థ మడఁగాఱుటకై దొరతనమువారు వాని యుత్పత్తిని మిక్కిలి తక్కువగాను, వాని విలువను మిక్కిలి యెక్కువగాను గావించుచున్నారు ; కట్టుదిట్టముల నిట్టు గల్పించి యనర్హులచేతికి వాని నందకుండఁ జేయుచున్నారు.

అట్లే, యీ గ్రంథమునుగూడఁ జాలఁ దక్కువ ప్రతులు మాత్రమే ముద్రించుటకును, విలువ మిక్కిలి యెక్కువ ఉంచుటకును ప్రకాశకులేర్పాటు చేసికొనిరి. అప్రౌఢులకు, నపండితులకు, నీ గ్రంథము నమ్మరాదు. ప్రాజ్ఞులును, పండితులును మాత్రమే దీనిని గొని పఠింపఁ దగుదురు. వారును రహస్యముగా నుంచుకొనుటకును, నప్రాజ్ఞులచేతి కందనియ్యకుండుటకునుబూటపడిననే దీనిని బడయఁ దగుదురు. ఇట్టి కట్టుదిట్టములకుఁ బ్రకాశకులు భరపడిరి. ఈ గ్రంథమిట్టి కట్టుదిట్టములతో సురక్షితమై యుండుఁగాక యనియే నేను గోరెదను. దీని మాతృక తంజావూరి పుస్తకశాలలో నున్నది. బ్రహ్మశ్రీమా. రామకృష్ణ కవిగారు దానినిబట్టి పెక్కేండ్లకు ముందు[1] దీని నొకతూరి ప్రకటించిరి. ఆ ముద్రణమున గ్రంథపాతము లెక్కువగా నున్నవి. తునాతునకలై దురుద్ధర మయియున్న తంజావూరి తాళపత్రప్రతిని బరిశోధించి గ్రంథపాతములను దప్పులను బెక్కింటిని నేను జక్కఁబఱచుకొనియుంటిని. నా దగ్గఱ నున్న పాఠములు పోయెనేని యిఁక నీ గ్రంథమును సరిపఱచుట శక్యముకాదనియే నా నమ్మకము. తంజావూరి తాళపత్రప్రతి ముక్కలు ముక్కలై మిక్కిలి రూపు చెడియున్నది గాన దానినిబట్టి యిఁకఁ దత్తత్పాఠముల

1. 1909 లో విస్మృకకవి గ్రంథమాలికాకుసుమముగాఁ బ్రకటితము



నుద్ధరింపఁగుదురదు. ప్రత్యంతర మింతవఱ కెక్కడను దొరకలేదు. శ్రీనాథకృతిగా నిరూపితమగుచున్న యీ చతురకృతి సమసిపోఁగూడ దను నభిమానముచే నా దగ్గర నున్న పాఠముల నెల్ల సంకలనము చేసి యిట్లు ముద్రణమున కొనఁగితిని. తంజావూరి ప్రతికి మూలప్రతిగూడఁబెక్కు గ్రంథపాతములు గలది గాఁబోలును. ఆ ప్రతివ్రాఁతలోనే పెక్కులోపములు గానవచ్చుచున్నవి. అందుఁగృత్యారంభము గానరాదు. నడుమ నడుమఁ గథాసమన్వయము సరిగా నుండకపోవుట పెక్కుచోట్లఁ గాననగును. అట్టి పట్టులు గొన్ని ముద్రణమునఁ జూపఁబడినవి. ఇతర గ్రంథములందుఁ గ్రీడాభిరామము లోనివిగా నుదాహృతము లయిన పద్యములు గొన్ని యిప్పుడీ గ్రంథమునఁ గానరావు. అవి లుప్తగ్రంథభాగములలోని వగుననుటకు సంశయింపఁ బనిలేదు. మఱియుఁ బెక్కుపద్యము లీ గ్రంథములోనివిగా రచనాదులను బట్టి గుర్తింపఁదగినవి గలవు. వానినిగూడ నుపోద్ఘాతములోఁ జూపుదును. బహుప్రయోజనమైన యీ రసవత్ప్రబంధమునకుఁ బ్రత్యంతర మింక నెక్కడనేని దొరకునే నెంతయు సంతసింపఁ దగియుండును. సమగ్ర గ్రంథోపలబ్ధి కాశించుచున్నాఁడను. దోషములఁ దొలఁగించి మరల ముద్రించుటయ్యెను.

ఇందు సరిక్రొత్తగాఁ గొన్ని విషయములు పీఠికలోఁ జేర్పఁబడినవి.

⁂

# ఉపోద్ఘాతము

ఈ క్రీడాభిరామకృతికర్త వినుకొండ వల్లభరాయఁడని కృత్యవతరణికలోఁగలదు. అతని వంశవృక్ష మిట్టిది :

విశ్వామిత్ర గోత్రము

మంచెన్న [1]

చంద్రామాత్యుఁడు ( కర్ణాటాధీశ్వరుఁడగు పెదబుక్కరాయలకు మంత్రి)
(భార్య పోచమ్మ)

మంచెన ( భార్య తిప్పమ్మ)

సింగన తిప్పన మల్లన చెన్నమంత్రి
(భార్య త్రిపురమ)

చంద్రమంత్రి వల్లభన్న, లింగన, తిప్పన, సింగన, భైరవ

బైచన, మల్లన, పోచన, తిప్పన బైచన, మల్లన, తిప్పన
( [2]వల్లభ ?)

1. ఈ వంశవర్ణన మిక్కిలి తప్పులతో అనన్వితముగా నున్నది. జాగ్రత్తగాఁ బరిశోధించి ఉచిత విధమున సంస్కరించితిని. గ్రంథమునఁ జూడఁదగును. నేను సంస్కరించిన విధమున నీ వంశవృక్ష మిక్కడఁ జూపితిని.

2. ఈతఁడే కృతికర్త. ( చూ. అనుబంధము )



కృతికర్తయగు వల్లభునితండ్రి తిప్పయ తనకు మూఁడు గ్రామములు సర్వభోగముగాఁ జెల్లగాఁ ములికినాటిలోని మోపూరిఁ బరిపాలించెను. ఈ మోపూరు ఉదయగిరి సీమలో నున్నది. అక్కడ భైరవకొండ యని గుహాలయముగల పర్వత మున్నది. అందు భైరవస్వామి గలఁడు. ఈ వల్లభుఁడా భైరవస్వామి భక్తుఁడు. క్రీడాభిరామము కృత్యవతరణికలో నా భైరవస్వామి ప్రశంస కలదు గాఁబోలును. కృత్యవతరణిక యిప్పు డీ పుస్తకమున లోపించినది. ప్రాయికముగా నాటకములు ఏవో దేవోత్సవసమయములందుఁ బ్రదర్శించుటకై రచింపఁబడినట్లు ప్రస్తావనలోఁ జెప్పుట సంప్రదాయ సిద్ధము. ఇదికూడ నట్టి దేవోత్సవ సందర్భమునఁ బ్రయోగించుటకై రచింపఁబడినట్లు ప్రస్తావనలోఁ జెప్పఁబడి యుండును. ఆ దేవోత్సవ మీ మోపూరి భైరవుని తిరునాళ్ళయి యుండును. ఇన్ని విషయములను స్ఫురింపజేయునదిగాఁ బ్రబంధరత్నావళిలో[1] వల్లభరాయని వీథినాటకములోనిదని యీ క్రింది పద్యముదాహృతమై కానవచ్చుచున్నది.

సీ॥ చంద్ర ఖండములతో సరివచ్చు ననవచ్చు
విమలదంష్ట్రా ప్రరోహములవానిఁ
బవడంపుఁ గొనలతోఁ బ్రతివచ్చు ననవచ్చు
కుటిలకోమల జటాచ్ఛటలవాని
నింద్రనీలములతో నెనవచ్చు ననవచ్చు
కమనీయతర దేహకాంతివాని
నుదురాజరుచులతో నొఱవచ్చు ననవచ్చు
చంచన్మదాట్టహాసములవాని

గీ॥ సిగ్గుమాలిన మొలవానిఁ జిఱుతవాని
నెల్లకాలంబు ములికినా డేలువాని
నర్థి మోపూర నవతార మైనవాని
భైరవునిఁ గొల్వవచ్చిరి భక్తవరులు (ప్రబంధ. 131 పుట)

1. 1918 లో ప్రకటితము.

ముల్కినాటిలోని భైరవస్వామి యనుగ్రహ మీ యుపలబ్ధ గ్రంథభాగమునఁగూడ రెండుచోట్ల స్మరింపఁబడినది. ' ప్రత్యక్ష మొనరించి భైరవస్వామిచే సిద్ధ సారస్వత శ్రీ వహించె' (22వ) నని యవతరణికలోను,

చ॥ "'ముదమున ముల్కినాటిపుర మోహనశైల సువర్ణకందరా
సదనుఁడు గాలభైరవుఁడు శంభునిపట్టి సమగ్ర వైభవా
భ్యుదయ పరంపరా విభవముల్ గృపసేయుఁ గవీంద్రకాంక్షిత
త్రిదశ మహీరుహంబునకుఁ దిప్పయ వల్లభరాయ మంత్రికిన్"

(క్రీడా. 294 వ)

అని కృత్యంతమునను గలదు,. గ్రంథమధ్యమునఁగూడఁగాలభైరవ వర్ణనము గలదు. కృత్యంతపద్యమున భైరవుడు 'ముల్కినాటిపుర మోహన శైలసువర్ణకందరా సదనుఁడ'ని వర్ణితుఁడయ్యెఁగదా! ఇప్పుడా భైరవుని కొండలోని గుహాలయమును దొరతనమువారు కనుఁగొని పరిశీలించి యక్కడి శిల్పచాతుర్యాదులను గూర్చి ప్రశంస నెఱపినారు. ఈ గ్రంథ రచనమునాఁటి కా గుహాలయమున వర్ణచిత్రములుగూడ నుండెనేమో? మోహనశైల మని, సువర్ణకందర యని కలదుగదా!

## ఇది శ్రీనాథకృతమే

వల్లభరాయని కృతిగా గ్రంథమున నున్నను, శ్రీనాథుఁడే దీనిని రచించెనని పెక్కుకారణములచే నేను నిశ్చయించుచున్నాడను. ఇంతకు ముందాకారణములఁ జాలఁగా నేను 'శృంగార శ్రీనాథము'నఁ [1] జెప్పియుంటిని. అయినను నిక్కడ మరల మఱింత ప్రబలముగాఁ జెప్పుచున్నాఁడను. సులక్షణసారము, అప్పకవీయము, లక్షణదీపిక, సర్వలక్షణసార సంగ్రహము మొదలగు లక్షణ గ్రంథములందు శ్రీనాథుని వీథినాటకము లలోనివిగా నుదాహృతము లయిన పద్యము లీ క్రీడాభిరామమునఁ గలవు. శ్రీనాథుఁడే యీ గ్రంథమును రచించి రామాయణాదులవలె నీ గ్రంథము కూడాఁ గర్తయగు శ్రీనాథుని పేరనే లోకమునఁ బ్రచారము గాంచి యుండుటచే నప్పకవ్యాదు లట్లు చెప్పియుండవలెను. అప్పకవ్యాదు

1. 1923 లో ప్రకటితము.



లుదాహరించిన పద్యములు క్రీడాభిరామమున నానుపూర్వితో నున్నవి. ప్రక్షిప్తములనఁ గుదురదు. వల్లభరాయుఁడును శ్రీనాథుఁడును సమకాలమువారు గాకపోవుదురేని, శ్రీనాథుఁ డాతనిపేర గ్రంథము రచించుట యసంభవమగును. అట్టి చిక్కులేదు. శ్రీనాథుఁడును వల్లభరాయఁడును సమకాలమువారు. వల్లభరాయని పెద్దతండ్రియగు లింగనమంత్రి విద్యానగరపు హరిహరరాయల మంత్రి. రెండవ మూఁడవ హరిహరరాయంద్రు క్రీ.శ. 1402 – 1412 వఱకు నుండిరి. లింగనమంత్రి వారిలో నెవరియొద్ద మంత్రియయి యుండినను వల్లభరాయఁడు మన శ్రీనాథుని సమకాలమువాఁడే యగును. అందును నీ క్రీడాభిరామమును కాశీఖండ రచనానంతరమే రచించెనని నేఁదలంచుచున్నాఁడను గాన శ్రీనాథుఁడును వల్లభరాయఁడును సమకాలమువారగుదురనుటను సంశయింపఁ బనిలేదు.

మఱియు నీ గ్రంథమున వల్లభరాయని వాగ్వైభవ దాతృత్వాది వర్ణనము మితిమీఱి యున్నది. గ్రంథకర్తయే తా నగుచో వల్లభరాయఁడట్లా కందపద్యాష్టకమును రచించుకొని యుండఁడు. ఆ పద్యములు భీమఖండాదులలోని కృత్యవతరణికాపద్యముల ( భీమ. 1.36; 71) పోలిక గలిగి యున్నవి. అందుఁ గడపటి పద్యము.

క॥ ఉపమించెద ధారాధర
తపనజ రైరాజ రాజ ధారానగరా
ధిప ధారాధరవాహులఁ
ద్రిపురాంతకవల్లభుని వితీర్ణి ప్రౌఢిన్. ( క్రీడా. 29ప.)

అని యున్నది. మఱియుఁ గృత్యవసాన పద్యమునఁ గాలభైరవుఁడు కవీంద్ర కాంక్షితత్రిదశమహీరుహమగు వల్లభరాయనికి సమగ్ర వైభవాభ్యుదయములు కృపసేయునని యాశీర్వచనమున్నది. సూత్రధారోక్తిగాను భరతోక్తిగాను నయినను గ్రంథకర్తయగువాఁడిట్లు చెప్పుకొనుట సరసముగాదు. ఇది తానే తుమ్ముకొని, తానే శతాయుస్సని యనుకొన్నట్టున్నది. కవీంద్రకాంక్షిత త్రిదశమహీరుహము గావున, వల్లభరాయఁడు విశేష ధన మొసఁగి కవియశః కాంక్షియై యేతత్కృతికర్తృత్వమును దనపై వేయించుకొన్నాఁడని తలచుట ప్రమాణదూరముగాదు. అట్టి సంప్రదాయముగూడ నా కాలమున హెచ్చుగాఁ గలదు.

శ్రీనాథుఁడు తన గ్రంథములలోఁ గొన్ని పద్యములను, బద్య భాగములను, భావములను మార్పుచేయక యొకతీరుననే కూర్చుకొనుచు వచ్చినాఁడు. స్వరచనమే యగుటచే సరిపడినపట్టులందు ముందు రచించిన గ్రంథములలోని కూర్పులను జేర్చుకొనుట దోషము గాదు గదా! తిక్కనాదులు గూడ నిట్లు చేసిరి. ఎన్నఁటికినిగూడఁ గ్రీడాభిరామము శ్రీనాథకృతము గాదనువాదము పుట్టకుండుటకో యనునట్లు శ్రీనాథకవి యనేక స్థలముల నిందు దన తక్కిన గ్రంథముల రచనలను జేర్చెను. ఆ పోలిక లీ గ్రంథము శ్రీనాథకృతమే యని చెప్పక చెప్పుచున్నవి. ఇతర కవికృతులందలి సరస సంవిధానములనుగా జేయు దొంగకవులును గొందఱుందురు. వల్లభరాయడట్టివాఁడై శ్రీనాథరచనములఁ గొన్నింటిని గాఁజేసియుండరాదా యనరాదు. గ్రంథ మామూలాగ్రముగ శ్రీనాథరచనముగానే కన్పట్టుచున్నది. తస్కర కవుల స్వరచన మస్వరసమై పొందిపొసఁగక తెలియవచ్చుచుండును. క్రీడాభిరామమునఁ బదసంవిధానము, అన్వయక్రమము, కారకప్రయోగ వైచిత్రి, పద్యోపక్రమ నిర్వాహములు, ప్రతి పదము శ్రీనాథుని పేరుగ్గడించుచున్నవి. శ్రీనాథుని రచనాచమత్కారముల నెఱిఁగిన వారిది చక్కఁగా గుర్తింపఁ గల్గుదురు. అదేపనిగా నారంభించినచోఁ గ్రీడాభిరామమందలి ప్రతి పద్యమునందును శ్రీనాథుని రచనావైచిత్ర్యమును బోల్చిచూపనగును. ఆరంభమందలిదే సీసపద్యపు టెత్తుగీతి :-

గీ॥ ఎవ్వఁడాతండు సామాన్యఋషియె తలఁపఁ
దాటకాకాళరాత్రికి దాశరథికిఁ
గాలకంధరకోదండఖండనునకుఁ
గార్ముకాచార్యవర్యుండు గాధిసుతుఁడు. (క్రీడా. 2 ప)

తొలుదొలుతఁ గ్రీడాభిరామ తాళపత్ర పుస్తకమును దెఱచి నేనీ పద్యమును జదువుచునే యిది శ్రీనాథ గ్రంథమగునో యని యనుమానించితిని. ఈ పద్యమందు శ్రీనాథుని యపూర్వ రచనారీతి యగుపడెను. కాశీఖండ షష్ఠాశ్వాసమున నొక సీసపద్యపుటెత్తుగీతి (6.46) యీ విధముననే కలదు. సీసము నాల్గు చరణములను గ్రియాన్వితము లగు వాక్యములఁగాఁ జెప్పి యెత్తుగీతిని యత్తదర్థకశబ్దములతో నుపక్రమించి పూర్వచరణములతో



నన్వయము పొసఁగించుట శ్రీనాథుని క్రొత్త గడుసరికూర్పు నేర్పు. మఱియుఁ బై యెత్తుగీతిలో ‘దాశరథికి’ అను షష్ఠ్యంతవిశేష్యమునకు విశేషణము లయిన ‘తాటకాకాళరాత్రికి’ ‘కాలకంధర కోదండ ఖండనునకు’ అను పదములుగూడ షష్ఠీవిభక్తిలోనే కలవు. సాధారణముగాఁ దెలుఁగుకవులు విశేషణములను బ్రథమాంతములఁగా నుంచి, ‘అగు’ క్రియాజన్య విశేషణమును జేర్చి విశేష్యముతోఁబొందింతురు. ‘ తాటకాకాళ రాత్రియు, కాలకంధరకోదండ ఖండనుఁడు నగు దాశరథికి ఇత్యాది విధమున. శ్రీనాథుఁడు తఱచుగా విశేషణవిశేష్యముల నేక విభక్తిలోనే నిలుపుచుండును. ‘భువనైకధన్విచేఁ బుష్పాయుధునిచేత’ - కాశీఖండము ( 4-203). ‘హాటకగర్భుచేతఁ గమలాసనుచే’ ఇత్యాది - శృంగార నైషధము (1-3).

పయి సీసగీతియందుంబోలె షష్ఠీవిభక్తి కాశీఖండమున సీసగీతియందును -

గీ॥ అంబురుహనాభు దేవి కనాదిశక్తి
కిందిరకు లోకమాతకు నిగురుబోఁడి
కలరువిల్కానితల్లికిఁ బ్రార్థితార్థ
కల్పవల్లికి మ్రొక్కంగఁ గంటి మంటి. ( కాశీ .3-4)

ఈ సీసగీతిని బోలినదే క్రీడాభిరామమున నొక సీసగీతి గలదు.

గీ॥ నిత్యకల్యాణి కలికుల నీలవేణి
కాదిశక్తికి వేదవేదాంతసార
కేకవీరకుఁ బూర్ణరాకేందుముఖికి
నఖిలజననికి సాష్టాంగ మనుదినంబు ( క్రీడా. 127 ప)

ఇట్లు ప్రతిపద్యమును బోల్చి చూపవచ్చును. ముఖ్యముగా శ్రీనాథుని రచన సర్వాంధ్రకవుల రచనలకంటెను శయ్యాసౌభాగ్యమున నసాధారణమై యెక్కడఁ బట్టిన నక్కడ స్పష్టముగా గుర్తింపఁదగినదై యుండును. అట్టి శయ్యాసౌభాగ్య మీ గ్రంథమున ననుపదమును గానవచ్చుచు శ్రీనాథుని పేరిని బట్టి యిచ్చుచున్నది. శ్రీనాథుని యితర గ్రంథములకును గ్రీడాభిరామమునకును గల రచనాసామ్యములఁ జూపుచున్నాఁడను.

శా॥ సారాచారమునన్ వివేకసరణిన్ సౌభాగ్య భాగ్యంబులన్
ధౌరంధర్యమునన్ బ్రతాపగరిమన్ దానంబునన్ సజ్జనా
ధారుం దిప్పనమంత్రివల్లభు నమాత్యగ్రామణిం బోల్పఁగా
వేరీ మంత్రులు సింధువేష్టితమహోర్వీ చక్రవాళంబునన్.
(క్రీడా. 31 ప.)

శా॥ వేరీ నిన్నెదిరింపఁగా జగమునన్ వీరుల్ ప్రతాపోద్ధతిన్
ధౌరంధర్యమునన్ బ్రభావమహిమన్ ధైర్యంబునన్ జాపలీ
లారంభంబున సాహసిక్యమున బాహాశక్తి దివ్యాయుధో
దారప్రౌఢిమ దేవదైత్యనరగంధర్వాది సంఘంబునన్
(హర. 7-144)

గీ॥ గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన
శకున మూనుట యది బృహస్పతిమతంబు
వ్యాసమతము మనఃప్రసాదాతిశయము
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము. (క్రీడా. 66 ప)

గీ॥ గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన
శకున మూనుట యది బృహస్పతిమతంబు
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము
సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మత మగు. (భీమ. 3-41)

శా॥ వ్రాలెన్ దిక్కుల భానుభావ్యతికర ప్రక్రీడదర్కోపల
జ్వాలాజాల జటాల జాంగలతటీ వాచాలకో యష్టులై
రోలంబంబులు మూఁతి ముట్ట వెఱచెన్ గ్రొవ్వేఁడిబీరెండలన్
జాలంగ్రాఁగి కరంబు వేఁడియగు కాసారాబ్జమైరేయముల్
(క్రీడా. 153ప)

శా॥ మౌళిం గోహళి సంఘటించినక్రియన్ మధ్యాహ్నవేళన్ మహా
కాళంబైన నభోవిభాగమున వీఁకం గాసె బీరెండ యా
ప్రాలేయాహిత సంప్రదీప్త కిరణప్రక్రీడదర్కోపల
జ్వాలాజాలజటాల జాంగలతటీవాచాలకోయష్టియై.
(హర. 7-108)



పయి రెండు పద్యములలోని 'ప్రక్రీడదర్కోప' లేత్యాది సమస్తపద సంవిధానము భట్టమురారిప్రణీత మగుననర్ఘరాఘవనాటకమందుఁ గలదు. శ్రీనాథునకు భవభూతి భట్టమురారి నాటకములమీఁద నభిమానము మెండు. వారి నాటకములలోని రచనములఁ బెక్కుచోట్ల నాతఁడు పుడికి పుచ్చుకొన్నాడు.

శా॥ ఉద్దామద్యుమణిద్యుతివ్యతికరప్రక్రీడదర్కోపల
జ్వాలాజాలజటాలజాలజ్గతటీనిష్కూజకోయష్టయః ;
భౌమోష్ణ ప్లవమానసూరకిరణ క్రూరప్రకారా దృశో
రాయుష్కర్మసమాపయన్తిధి గమూర్మధ్యాహ్నశూన్యాదిశః
( అనర్ఘ రాఘవము. 2-30)

మఱియు,

స్రగ్ధర॥ వ్యామగ్రాహ్యస్తనీభి శ్శబరయువతిభిః కౌతుకోదంచదక్షం
కృచ్ఛ్రా దన్వీయమానః క్షణ మచల మసౌ చిత్రకూటం ప్రతస్థే.
( అనర్ఘ రాఘవము. 5-2)

శా॥ ఆమిత్రావరుణాంశసంభవుని వింధ్యాటోపవిధ్వంసి లో
పాముద్రాసహితుం గనుంగొనిరి యుత్పన్న ప్రమోదంబునన్
వ్యామగ్రాహ్యపయోధరల్ కుటిలనీలాగ్రాలకల్ తథ్యమి
ధ్యామధ్య స్థితమధ్య లాటవిక సేనాధీశ సీమంతినుల్
( కాశీ. 3-53)

శా॥ ఆమోదంబున వేటఁలాడుదురు నీహారాద్రికాంతారరే
ఖామధ్యంబునఁ జాపటంకృతులతో గంధద్విపశ్రేణులన్
క్షామక్షామమనోజ్ఞమధ్యమలు గుంజాభూషణాలంకృతల్
వ్యామగ్రాహ్యపయోధరల్ శబరసేనాధీశ సీమంతినుల్!
( హర. 5-23)

కాశీఖండ హరవిలాసములందలి యీ పద్యద్వయము పయి మురారి శ్లోకచ్ఛాయ గలది. 'వ్యామగ్రాహ్య' పదప్రయోగమున శ్రీనాథునకుఁ బ్రీతిమెండు. బహువారము లాతఁడా పదమును బ్రయోగించును.

వ్యామగ్రాహ్యస్తను లగుభామినులు ( శృంగారనైషధము. 8- 98)

ఇది సరిగా భట్టమురారి ప్రయుక్తపదమే.

వ్యామగ్రాహ్యకుచంబు లంటి (శివరాత్రిమాహాత్మ్యము. 3-87)
క్రీడాభిరామమునఁ గూడ నీ పదము గలదు.

వ్యామగ్రాహ్యనితంబబింబ కుచభారాభీల భద్రాకృతుల్. (క్రీడా. 209 ప)

వ॥ టిట్టిభ యదె చూడు వరుణరాజవారాంగనావిలాస దర్పణానుకారియై యహర్పతి క్రుంకఁబోయె. ( క్రీడా. 257 ప)

క॥ చరమాచలశిఖరంబునఁ
దిరమై యొక్కింతదడవు దినకరుఁ డొప్పెన్
వరుణునిశుద్ధాంతంబున
నరవిందాక్షులకు మించుటద్దం బగుచున్ ( భీమ. 2-27)

ఇట్టి వింకను గలవు.

"నెఱసంజయు మసమసకని చీకటియుం గలసి దిక్సౌధకూట
వాటీనికరంబుల వ్రేల విడిచిన గురివెందపూసల పేరునుఁ బోలెఁ
బొలుపు మిగిలె" (క్రీడా. 273 వ)

క॥ పసుఁబాప యెండకొనలును
మసమసకని యిరులుఁ గలసి మన మలరించెన్
దెసల నలుగడల గుంజా
విసరంబుల సరులు వ్రేలవిడిచిన భంగిన్. (నైషధము. 8-12)

వ॥ సంజకెంజాయయున్ గలయ బెరసి గురువెంద పేరులయందంబు వహించుటయు. (నైషధము. 8-14)

ఇట్టివింకను గలవు.

' గన్నేరుఁబూచాయ కరమొప్ప నీర్కావి
మడుఁగుదోవతి పింజె విడిచి కట్టి' ( క్రీడా. 42 ప)

' గన్నేరుఁబూఁజాయఁ గనుపట్టు జిలుఁగైన
సలిలకాషాయవస్త్రంబు గట్టి' (నైషధము. 8-103)



'గొజ్జంగిపూనీరు గులికి మేదించిన
గంగమట్టి లలాటకమునఁ దీర్చి' (క్రీడా. 42ప)

'గొజ్జంగి పూనీరు గులికి మేదించిన
కమ్మకస్తురి మేనఁ గలయఁ గలదు' (కాశీ. 3-118)

' నిద్దంపువెలిపట్టు నెఱిక దూలినయప్డు
తొడలమించులు వెలిఁ దొంగలింప ' (క్రీడా. 137 ప)

' అచ్చవెన్నెలచాయ నవఘళింపఁగఁజాలు
నిద్దంపు వెలిపట్టు నెఱికఁగట్టి ' (నైషధము. 6-22)

' జఱిగొన్న వెలిపట్టు జన్నిదంబులలుంగ
యంటులు వాయంగ నఱుత వైచి ' (క్రీడా. 42 ప)

' జఱిగొన్న వెలిపట్టు జన్నిదంబులతోడ
రత్నాలతారహారము ధరించి ' (శివరాత్రి. 2-90)

' గంగమట్టియతోడ సాంగత్య మెడలిన' (క్రీడా. 80 ప)

' గంగమట్టి లలాటకమునఁ దీర్చి' (క్రీడా. 42 ప)

' గంగమట్టియమీఁదఁ గస్తూరిరసమున' (శివరాత్రి. 2-90)

'తోకచుక్కలఁ బోలుతోరంపుఁ దెలికన్నులు' (క్రీడా. 137 ప)

'తోకచుక్కలఁ బోలు దృక్తోయజముల' (నైషధము. 8-60)

'అదె ముద్దరా ల్మసానమ్మనివాసమ్ము' (క్రీడా. 149 ప)

'మోసపోక ముసానమ్మ ముద్దరాలు' (కాశీ. 5-289)

'చరణాంగుళీకుటిలనఖశిఖాకోటికుట్టనమున' (క్రీడా. 235ప)

'కుటిలచంచూపుటకోటికుట్టనముల' (నైష. 2-5)

'కుటిల పాటలజటాంకురకుట్టనంబున.' (కాశీ. 5-105)

ఇట్టి వింకను బెక్కులు –

'కంఠగ్రైవేయఘంటికాటంకారంబులు' (క్రీడా. 227 వ)

'ఆఖండలదిశావేదండకంఠగ్రైవేయఘంటికాటంకారంబునుం బోలె' ( భీమ. 2–101)

'కరిఘటాగ్రైవేయఘంటిటంకారంకాబులం బ్రోదిసేయుచు' (నైషధము. 6–80)

ఈ సమాసము భట్టబాణునిరచనలోఁ గలదు. శ్రీనాథుఁడు దీని నింకను బెక్కుచోట్ల ననుకరించెను.

'చాంపేయకుసుమచ్ఛదఛ్చాయాదాయాదంబులైన' (క్రీడా,273 వ)

'కఠోరపాఠీనచ్ఛాయాదాయాదంబులైన' (భీమ. 2–110)

'సుకుమారశుకచ్ఛదచ్ఛాయాదాయాదంబులైన' ?

'కనత్కనకనఖశలాకానికాయచ్ఛాయాదాయాదంబు' (భీమ. 3–212)

ఇట్టి వింకను బెక్కులు గలవు.

'ముఖర వీణాక్వాణపాణింధమం బైన మధురస్వరంబున' (క్రీడా. 100 వ)

'కలమధురవీణాక్వాణపాణింధమం బైన యెలుఁగెత్తి' (భీమ. 2–110)

'కాలకూటచ్ఛాయాపాణింధమంబైన' (కాశీ. 4–118)

'గంధలహరీపాణింధమంబు' (శివరాత్రి. 4–43)

'సంధ్యారాగంబు నింగి యింగిలికంబునంబెట్టి' (క్రీడా. 273 వ)

'నింగియింగిలికాన నభ్యంగ మార్చె' (కాశీ. 1–124)

ఇట్టి వింకను బెక్కులు గలవు.

'ఘ్రాణపుటీకుటీరములఁ గాఁపుర ముండఁ దొడంగె' (క్రీడా. 161ప)

'నాసికాపుటకుటీకుటుంబి యగు పక్వాన్నగంధంబు' (కాశీ. 4–120)



'నాసికాపుటకుటీరకోట రాంతఃకుటుంబితాపాటవమున' (నైష. 7–154)

ఇట్టి వింకను గలవు.

శా॥ పంచారించిననీపయోధరము లాస్ఫాలింతునో లేతఁబొ
మ్మంచుం గెంజిగురాకు మోవి ణిసిధాత్వర్థం బనుష్ఠింతునో
పంచాస్త్రోపనిషద్రహస్యపరమబ్రహ్మస్వరూపంబు నీ
కాంచీదామపదంబు ముట్టుదునొ యోకర్ణాటతాటంకినీ!
( క్రీడా. 90 ప)

మర్మజ్ఞు లీ పద్యము వినఁగనే శ్రీనాథునిరచనమని గుర్తింపఁ గల్గుదురు. ణిసిధాత్వర్థపదప్రయోగమున నాతనికి నభిరుచి హెచ్చు.

మ॥ విసు వౌచున్నది కాలయాపనకు నువ్విళ్ళూరెదున్ భావముల్
రసభంగం బగు మానదోష మతిమాత్రం బయ్యె నే నింతటన్
బ్రసభాలింగనపూర్వకంబుగ మనోరాగంబు రెట్టింపగా
ణిసిధాత్వర్థ మనుగ్రహింపఁగదవే నీరేజపత్రేక్షణా!
(నైషధము. 8–52)

క్రీడాభిరామ పద్యమునఁగల 'పంచారించు' పదము 'పంచారించిన కైవల్య శుభప్రచయంబులకును ఖని మణికర్ణిక' అని కాశీఖండము ( 6–125) ననుగలదు. కవిత్వరచనలో శ్రీనాథునిపదములఁ బట్టుకొనిన పాండురంగసుకవి కృతి (3–179) లోఁ గూడ నీ పదము గలదు. ఈ పద మితరకవులకృతులలో నసాధారణము. ఇట్లే పాండురంగ సుకవి యీ క్రీడాభిరామమందలి 'పుంజాలదండను' గైకొన్నాఁడు.

' సవరగా గ్రుత్తుఁ గ్రొత్తపుంజాలదండ' (క్రీడా. 93 ప)

'దండ సకిమెడఁ బుంజాలదండవెట్టు' ( పాండురంగమా. 3–62)

ఈ పదమింకఁ గళాపూర్ణోదయమునఁ గూడఁ గలదు.

మఱియుఁ గ్రీడాభిరామపుఁబయి (90వ) పద్యమున 'పంచాస్త్రోపనిషద్రహస్యము', 'గంధర్వోపనిషద్రహస్యములు వక్కాణింతురు' ఇత్యాదిగా భీమఖండము (1–90) నను గలదు.

'చంద్రఖండములతో సరివచ్చు ననవచ్చు
విమలదంష్ట్రా ప్రరోహములవాని'

ఇత్యాదిపద్య మీ యుపోద్ఘాతమున నింతకుముందుదాహృత మయ్యెను.

సీ॥ సరివచ్చు ననవచ్చు శతమన్యువీటికి
వివిధదేవాగార విభ్రమమునఁ
బ్రతివచ్చు ననవచ్చుఁ బాలమున్నీటికి
నక్షయం బగు జీవనాభివృద్ధి
నెనవచ్చు ననవచ్చు నిందుబింబమునకు
సకలకలావిలాస ప్రవృద్ధి
దొరవచ్చు ననవచ్చుఁ దోయజాక్షునిమూర్తి
కభిరామలక్ష్మీసమగ్రమహిమ. (భీమ. 1-106)

'సరివచ్చు ననవచ్చు, ప్రతివచ్చు ననవచ్చు, ఎనవచ్చు ననవచ్చు, దొరవచ్చు ననవచ్చు' అను నీ పలుకుబళ్ళు శ్రీనాథుని రచనలోఁ దప్ప నాకిఁక నెక్కడను గానరాలేదు. నేఁటి కొప్పరపుఁ గవీశ్వరులు మాత్రము జార్జి పట్టాభిషేక పద్యములలోఁ గాఁబోలు నీ పలుకుబళ్ళను మరలఁ బాడినారు.

'కమఠావతారంబు గై కొన్నదైత్యారి
కమనీయ చరమభాగంబువోలె
నాదియుగంబునం దావిర్భవించిన
జిననాథదేవుని శిరసువోలె' (క్రీడా. 80ప)

'ఆదికాలమున మాయావిలాసిని యైన
మురదైత్య దమనునిమూర్తివోలెఁ
గామినీరూపంబు గైకొన్నశంబరా
రాతికాలాయసాస్త్రంబువోలె' (శివరాత్రి 3-31)

'అదె దారువనభూమి' (క్రీడా. 191ప)

'అదె భైరవస్థాన మటమీఁద నల్లదె' (క్రీడా. 149)

ఇత్యాదిపద్యములు రెండింటిని బోలుపద్యములు :



'అదె సంవేద్యము కోటిపల్లి యదె' - ఇత్యాది ( భీమ. 3-54)

'అదె పట్టిసస్థాన -మిత్యాది ( భీమ-3-55)

'అదె వియద్వాహిని యదె మణికర్ణిక
యదె కాశి నిఖిలకళ్యాణరాశి' - ఇత్యాది (కాశీ. 5-117)

'అదె దారువనభూమి - ఇత్యాది సీస ( 191 ప.) ము‌ను దాని తర్వాతిది.

'తియ్యనివింటిజోదు రతిదేవిచనుంగవ నొత్తిగిల్లి యొ
య్యొయ్యన వంక చక్కఁబడ నొత్తెడుఁజూచితె పుష్పబాణముల్
(క్రీడా. 192వ)

"ప్రతిభవన భిత్తిభాగంబునం జిత్రించిన చిత్తరువులయందుం గోరకిత నేత్రత్రిభాగుండై కుసుమకంకపత్రంబుల వంకలొత్తుచు రతిదేవివృత్తస్తనంబుల మీఁద నత్తమిల్లిన యున్మత్తచిత్తభవు విక్రమసంపత్తిప్రకారంబును, బట్టపగలు యోజనగంధ యను గంధగజగమనవక్త్రువచనుంగవ సూచి తొౢట్రుపడువసిష్ఠ పౌత్రుని దృష్టిప్రియత్వంబును నాచార్యుభార్య యగుతారాదేవిమీఁదఁ దారకారాజు పఱపుచీటంబు వాటంబునేయు లలితకటాక్షవీక్షావిక్షేపమ్ములును, ధృతిమాలి మాలినీసైకతంబున నేకతంబున గురువెందపొదలో వేలుపులంజియ కెంజిగురు చవి సూచిన కుశికనందను రాగావేశంబును గుసుమకోదండ జయడిండిమంబగు విభాండకసుతుని వనితామండలానక్తియు బృందావనంబునందు ముకుందుండొనరించిన నందవ్రజవధూవిహారాడం బరంబును నంబురుహసూతి యాఁడుపట్టిం బట్టికొనిన పట్టునుం బురుహూతుండు గౌతమకళత్రంబుమీఁదఁ గల్పించిన చీకటితప్పును."
(హర. 5-39)

'అదె దారువనభూమి' ఇత్యాది పద్యమున వర్ణితములయిన కథలే మఱియు 'తియ్యనివింటిజోదు' ఇత్యాది పద్యమునఁగల రతిమన్మథస్థితియే యీ హరవిలాసవచనమునఁ గానవచ్చుచున్నవి. మఱియు నీ క్రీడాభి రామారంభ పద్యమున (2 ప.) 'మాలినీతీరనిర్మలసైకతములలో మేనకాప్సరసతో మేలమాడె' నను విశ్వామిత్ర ప్రశంసాసీస చరణమును పయిహరవిలాసవచనగత విశ్వామిత్ర ప్రశంసయు 'మాలినీతీర సైకత'

పదాంకితములుగా నుండుటఁ బరికింపఁ దగును. మఱియుఁ బయి క్రీడాభిరామ, హరవిలాసచిత్రరచనావర్ణనా రీతులే శృంగారనైషధమునను సమానరీతితోఁ గలవు.

తే॥ కోరగించినకడకంటికొలికిఁ జూచి
వాఁడివాలికపూఁదూపువంక దీర్చు
చొరగి రతిదేవి పాలిండ్ల నొత్తిగిలిన
యించువిలుకాని వ్రాసినా రిడుపునందు.

సీ॥ అమరవల్లభుఁడు గౌతముకూర్మియిల్లాలుఁ
జీకటితప్పుఁ జేసినవిధంబు
సితభానుఁ డాచార్యుచిగురాకుబోఁడిపైఁ
గన్ను వైచినకన్నె కలుపుమరులు
నట్టేట దాశకన్యకకు నువ్విళులూరి
జాలిఁ బొందినపరాశరువిరాళి
గారాపుఁగూతుఁపైఁ గాఁగానిపనిఁ బూను
వనజసంభవుని నెమ్మనము వెలితి

గీ॥ దారువనవీథి శీతాంశుధరుని రంకు
శౌరిగోపాలభామినీ చౌర్యకేళి
కామరసభావములు మించి కానఁబడఁగఁ
దీర్చి యిడుపులయందుఁ జిత్రించినారు.
(నైషధము. 7-150,151)

'జారచోరమహాధూర్తచక్రవర్తి
దేవవేశ్యాభుజంగుండు తెలుఁగుభర్త' (క్రీడా. 205 ప)

'జారచోరాదిధూర్తవిహారభూమి' (నైషధము. 7-55)

'సంతతము దేవవేశ్యాభుజంగుఁ డితఁడు' (భీమ. 2-13)

'కోకిలము పంచమశ్రుతిఁ గొసరినట్లు
కనుమ యవ్వలిదేశంబుకరణకాంత.' (క్రీడా. 101 ప)



ఒకదాని నొకటి రెట్టించుకొనుచుఁ గోకిలములు కొసరి కొసరి కూయుట యిక్కడ వర్ణితము. ఇది శ్రీనాథ సర్వగ్రంథసాధారణము.

'పంజళంబున ధవళ ప్రబంధగీతి
కనుమ యవ్వలికర్ణాటకమలముఖులు' (శివరాత్రి. 2-54)

ఈ 'కనుమయవ్వలికర్ణాటకమలముఖుల' ప్రస్తావన మపూర్వమును ఇతరత్రాదృష్టమును; కనుకనే ముద్రాపకులర్థము తోఁపకేమో వేఱుపాఠమును సంస్కరించి చేర్చి దీని నధోజ్ఞాపికలో నుంచిరి.

గీ॥ వాహకుం డెక్కి విడిచినవారువంపుఁ
గొదమయునుబోలె రతికేళిమదము డిగ్గి
యలసభావంబుతోడఁ గర్ణాటవేశ్య
వచ్చుచున్నది యదె విప్రవర్య ! కంటె! ( క్రీడా. 87 ప)

'చండాలకులవరారోహ వాహకుం డెక్కి విడిచినవారువంబును బోలె సంభోగమునం దృప్తి చని' (శివరాత్రి. 3.96)

'కద్రూమహాదేవి గారాపు సంతతి
మధుకైటభారాతి మడుఁగుఁబాన్పు' (క్రీడా. 221 ప.)

'ఏ యింతులకుఁ బుట్టినిల్లు దుగ్ధాంబోధి
మధుకైటభారాతి మడుఁగుఁబాన్పు.' (కాశీ. 3-199)

ఈ క్రింది శివరాత్రిమాహాత్మ్యపద్యమున నితరకావ్యసాధారణము లగు పదములు గలవు.

చ॥ స్థితి చెడి మాంసభోజనము చేసి జనంగమవంశభామినీ
రతిఁ బరతంత్రుఁడైనపుడుఁ బ్రత్యహమున్ ధరియించు చుందు న
ప్పతితుఁడు గంగమట్టియయుఁబ్రన్ననినున్ననినీరుకావిదో
వతులును.....ములు వంశ్యులయిండ్ల భుజించుకోరికన్.
(శివరాత్రి. 3-112)

'అలరుంబోఁడి జనంగమప్రమద' 'గంగమట్టియతోడి సాంగత్య మెదలిన' 'ప్రన్ననిపట్టుతోరము ధరించి' 'గన్నేరుఁబూచాయ కరమొప్ప నీర్కావిమడుఁగుదోవతి' (క్రీడాభిరామము)

'ప్రన్నని' పదము శ్రీనాథుని సర్వగ్రంథములందు బహువారములు ప్రయుక్తమయ్యెను.

' ప్రన్నని నున్నని నీరుకావి దోవతులును' (శివరాత్రి . 3-112)

'ప్రన్నఁగాఁ బెనఁగొన్న బ్రహ్మసూత్రంబులు' (భీమ.4-90)

'భానుదీప్తుల నీటారి ప్రన్ననైన' (హర3-78) ఇత్యాదులు

'ముక్కుసోణంబుదాఁకను జెక్కు టొకటి' (క్రీడా.270 ప)

'ధాతసతిముక్కుసోణంబు దాఁకఁ గోసె' (కాశీ.7-84)

'కటికి హొన్నాళ్ళంబు గండగత్తెర వట్టి' (క్రీడా.142 ప)

'హొన్నాళంపుఁగరాచూరి' (శివరాత్రి. 4-83)

ఈ(హొన్నాళ) పద మీరెండుచోట్లఁ దప్ప నాకిఁక నెక్కడనుఁ గానరాలేదు.

'బ్రాహ్మణకాంతలు తాలఁబోయఁగన్' (క్రీడా.161 ప)

'దళమైనక్రొవ్వఁతో దాలఁబోసి' (హర. 2-121)

'గొడ్డేఱు కలఁక పుట్టె' (క్రీడా. 248 ప)

'నీపడ్డపాటు గొడ్డేఱుగా' (హర. 2-132)

...................... (కాశీఖండము)

ఈ పదము శ్రీనాథుని యవసానకాలపద్యముననుగలదు.

'అందుకొని పుష్పలావికిఁ ద్యాగమిచ్చె' ( క్రీడా.176)

'దానధర్మంబు లొనరించి త్యాగ మిచ్చె' ( శివరాత్రి. 2-74)

'కంచెల వెసఁగుట్టియీఁడు వెలచేడియకున్ విషయాభిలాషియై'

(క్రీడా.106ప)

పై వాక్యమందలి కడపటిపదము నశ్లీలార్థమున శ్రీనాథుఁడే పలుదడవలు ప్రయోగించినాఁడు.



' విద్వజ్జనులు నిన్ను విషయించి వత్తురు' ( నైషధము 6-110)

ఉ॥ గండము దప్పె నాంధ్రకవిగానికి నిన్నటిరేయి పుష్పకో
దండునికేళిఁగూడకయ తద్దయు నిల్చితిఁగాని యయ్యయో
బండరువారిపాపికిని బైటిపసారమె కాని యందులోఁ
బుండట యెల్లవంకఁ జెడిపోదుఁగదా విషయింపఁబోయినన్.

ఈ పై పద్యము శ్రీనాథుని చాటుధార యని సి.పి.బ్రౌను దొరగారు సేకరించిరి.

'అయ్యగారికి జోహారు లనుచు మ్రొక్కు' (క్రీడా. 186 ప)

'అయ్యగారికి నమస్కారంబు లని' (శి.మా.3-38)

'వేశ్యాజనంబునకు వావివరుస యెక్కడిది' (క్రీడా. 252 ప)

'వారకాంతాజనమునకు వావి గలదె' (హర. 127)

'పులుఁగురాయని తాత్కాలపుణ్యభిక్ష' (క్రీడా. 221 ప)

'పొసఁగ వడ్డించెఁ దత్కాలపుణ్యభిక్ష' (హర. 5-48)

'పురములోఁ దత్కాలపుణ్యభిక్ష' (భీమ. 3-7)

'కసటు వోఁవగఁ దోమి కడిగి బోరగిలంగ' (క్రీడా. 80 ప)

'కసటువోఁ దెలినీటఁ గడిగి యీటార్చిన' (హర. 7-110)

'గోధూళి లగ్నంబున నార్యవాటికఁ బ్రవేశించి' (క్రీడా.273 వ)

'గోధూళిలగ్నంబునం బురంబుఁ బ్రవేశింపవలయు'(క్రీడా. 65 వ)

'శీతకాలంబు గడి మాడసేయఁ గుడుచు
భాగ్యవంతుఁడు ఱేపాడి పల్లెపట్ల' (క్రీడా. 56 ప)

'నడినూక లేనియన్నము
వడఁబోసిన నెయ్యి బుడమవరుగున్ బెరుగున్
గడి మాడ సేయఁ బెట్టిన
యడిమాచెలనంబిపడుచునడిగితిననుమీ.' (శ్రీనాథుని చాటుధార)

'అప్పసమెవ్వాఁడొ యొకండు రాత్రీసురత ప్రౌఢిందనుందేల్చినన్
వసివాళ్వాడుచు వచ్చుచున్నయది కర్ణాటాంగనం జూచితే.'
(క్రీడా. 86 వ)
( ' పసనెవ్వాఁడొయొకండు రాత్రిరతులన్ బల్గాసి గావించినన్'
(లక్షణగ్రంథపాఠము) )

సీ॥ ఒక చెంప కోరగా నొనఁగూర్చి దిద్దిన
తురుముననుండి క్రొవ్విరులు రాల
రాత్రియెవ్వాఁడొ బల్ రతుల గాసి యొనర్ప
బడలిక నడుగులు తడఁబడంగ
వింతవారలఁ జూచి వెస నవ్వినను గప్పు
గలదంతములకాంతి వెలికిఁ దోఁప
చిడిముడి నడచుటఁ జెలరేఁగుగుబ్బల
పైఁదాఁకి యొక్కింత పైఁట జాఱఁ

గీ॥ జెమటచేఁ దిరునామంబు చెమ్మగిల్ల
హొళి డాచేత విడియంబు గీలుకొలిపి
రంగపురి రాజవీథిఁ గానంగ నయ్యె
నాదుమదిఁగోర్కులూర వైష్ణవవధూటి. (శ్రీనాథుని చాటుధార)

క్రీడాభిరామములోని వగు నీ క్రిందిపదములు శ్రీనాథుని యితర గ్రంథములందు బహుస్థలములఁ గానవచ్చును. 'బాలార్కకిరణసంపర్కంబు' 'వీథీవిటంకంబు' 'పదియార్వన్నెపసిండి' 'చెక్కుటద్దములు' 'కోకిలము పంచమ శ్రుతి గొసరినట్లు' 'కలకంఠీకలకంఠకోమలకుహూకారంబు తోరంబుగాన్' 'ఘంటాఘణాత్కారముల్' 'కప్పురభోగివంటకము' 'పెసరుఁబప్పు' (శ్రీనాథునకుఁ గందిపప్పు ప్రియముగాదేమో : పెసరుఁబప్పునే బహువారములు పేర్కొన్నాఁడు.) 'ఓలగందము' 'మిసిమింతుఁడు' 'అలవోక' 'కట్టెల్టి' 'ఉఱ్ఱూఁతలు' 'కలికిచూపులు' 'సప్తపాతాళవిష్టపములు' 'జంగాళము' 'అహల్యాజారుఁడు' 'ఒసపరి మన్మథుండు' ' చక్రవాకులు' 'పాటపాట' 'వల్లువము' 'పటితాళించు' 'కర్ణాటతాటంకిని' 'ద్యావాపృథ్వ్యవకాశముల్' 'దాసనపుఁబువ్వుఁజాయ' 'త్రస్తరులు' 'ప్రేమ సంధుక్షణాగర్భంబు' 'కుసుమంబెట్టు' 'తేపాడి'.



మఱియు నాంధ్రభాషోద్ధారకు లగు సి.పి.బ్రౌనుదొరగారు క్రీ.శ. 1830 కింకను బూర్వకాలముననే సంకలనము చేసిన చాటుధారలలో 'మీన విలోచనంబులును' ఇత్యాది (క్రీడా. 104) పద్యమును శ్రీనాథుని వీథినాటకములోని దానిఁగా సేకరించిరి. దొరగారికి వేఱొక వీథినాటకము దొరకలేదు. వారు శ్రీనాథుని వీథినాటకములోనిదిగా విని సేకరించిన పయిపద్యము స్పష్టముగాఁ బూర్వోత్తరసందర్భములతో నీ క్రీడాభిరామమున నున్నది.

మఱియు నిప్పటి కేడెనిమిదియేండ్ల క్రిందట నేను గుంటూరుమండలమున మోదుకూరను గ్రామమున బల్లెం కనకరాజుగా రని పేరుగల బ్రాజుగారింటఁ బ్రాచీన తాళపత్రగ్రంథములఁ బరిశోధించుటలో హరిశ్చంద్రనలోపాఖ్యానపుఁ దాళపత్రప్రతి ముఖపత్రములం దీ క్రింది వ్రాఁతను జూచితిని.

'కాకుళ్ళతిరునాళ్ళనాడు చెప్పిన శ్రీనాథవీథినాటకం- హైమగ్రావ నితంబబింబకుచహారాభీలభద్రాకృతుల్ కామాంధల్.........'
(క్రీడా. 209 పద్యమున నిది సమగ్రముగ చూడనగును.)

చ॥ కలసి పెనంగుకాలమున గాజులచప్పుడు గాదు, కంటి కిం
పలరఁగఁ జుంబనక్రియకు నడ్డముగా మెడఁద్రాడు గీడు లే
దలుగుఁలఁబాఱుచుండుఁగుసుమాస్త్రుగృహంబున వారి పూరముల్
వలపుల పుట్టినిల్లు విధవన్ జెడనాడిన నోరు పుచ్చదే !

ఈ రెండుపద్యములేకాక నేను చాటుపద్యమణిమంజరి రెండవభాగమునఁ గూర్చిన చాటుధారలు, ప్రౌఢదేవరాయలసభలో డిండిమ శ్రీనాథ వివాదసందర్భమందలి చాటుధారలు పెక్కులుగూడ నక్కడ దొరకెను, శ్రీనాథుఁడు ప్రౌఢరాయలసభలలో బాలాయువతీ ప్రౌఢాలోలలమీఁదఁ జెప్పినపద్యములును నందున్నవి. అవియెల్ల ననర్ఘరత్నములు: తెనాలితాలూకా మోదుకూరిలోను, రేపల్లెతాలూకా, పల్లెకోనలోను, విద్వాంసులగు భట్టురాజులు పూర్వము వెలసియుండిరి. వారు సేకరించిన తాళపత్రగ్రంథములు మంచివి నిన్న నేఁడు మంటిపాలయినవి. ఈ విషయము స్థలాంతరమున వ్రాసియుంటిని. కనకరాజుగారి యింటిలోని పయి తాళపత్రపుస్తకము "పరీధావినామ సం. వైశాఖ శుద్ధ భానువారం వరకు బల్లెం అమ్మిరాజు వ్రాసినది."

1. 1922 లో బ్రకటితము. ( 1952 లో ద్వితీయ ముద్రణము)

పయి రెండుపద్యములలో మొదటిది యించుక పాఠభేదముతోఁ గ్రీడాభిరామమునఁ గలదు. రెండవదియు నందుండవలసినది కాఁదగును. క్రీడాభిరామమునఁ బెక్కు గ్రంథపాతములచే నా పద్యము జాఱిపోయి యుండవచ్చును. పయి తాటాకుపుస్తకమును వ్రాసినకాల మగుపరీధావి వత్సరము డెబ్బదియైదేండ్ల క్రిందటిది గాక యంత కఱువది యేండ్లకుఁ బూర్వపుఁ బరీధావి యగును.

శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్ర ద్విపదప్రబంధమును రచియించెను. క్రీడాభిరామము ( 116 ప) న ద్విపద పల్నాటి వీరచరిత్ర ప్రశంస గలదు. మఱియుఁ దత్కథావిశేషవర్ణనము హెచ్చుగాఁ గలదు. తన కాకథమీఁది యాదరముచేఁ దద్వర్ణనముఁజేసి యుండవచ్చును.

శ్రీనాథుఁడు సాతవాహనసప్తశతిని దెలిగించెననుటకాక్షేపించు వారెవ్వరు నుండఁగూడదు. 'నూనూగు మీసాల నూత్నయౌవనమున సాతవాహనసప్తశతి నొడివితి' నని కాశీఖండము (1-7)నఁ జెప్పుకొన్నాడు. ఆంధ్రవిద్వాంసుల యదృష్టలోపముచే నా యాంధ్రగ్రంథ మీ కాలమునఁ గానరాకున్నది. కాని, మూలమగుప్రాకృతగ్రంథము సవ్యాఖ్యముగా ముద్రితమై సమకూరు చున్నది. అందు చతుర్థ శతకమున పదునై దవగాథ యీ క్రిందిది.

" ఝుఞ్ఝావా ఉత్తణి ఏ
ఘరమ్మిరో ఊణ ణీసహణిసణ్ణమ్
దావేఇ వ గఅవ ఇఅం
విజ్జుజ్జోఓ జలహరాణమ్"

దీనిని సంస్కృతచ్ఛాయ యిట్లు :

" ఝుఞ్ఝావాతో త్తృణితే
గృహే రుదిత్వా నిస్సహనిషణ్ణామ్
దర్శయతీవ గతపతికాం
విద్యుదుద్యోతో జలధరాణామ్."

క్రీడాభిరామమున నీక్రింది పద్యమున్నది.

మ॥ పటుఝుంఝూపవనోత్తృణాలయములో భద్రంబునన్ బట్టెకం
కటిపై ముచ్చుముడింగి నిర్భరవియోగగ్లాని శోషిల్లి యె
క్కటి నిద్రించుచు నున్నవాడ (పాంథ) వనితన్ గర్జావచఃప్రౌఢిమన్
దటిదుద్యోతము సూపు నట్టనడురే ధారాధర శ్రేణికిన్.( క్రీడా. 60 ప)



పయిసాతవాహనసప్తశతీగాథ కీ పద్యము సరియయిన తెలుగుసేఁత యని నిరూపించుట కధిక ప్రయత్న మక్కఱలేదు. ఝంఝూ-వాత-ఉత్తృణితే-గృహే అను పదములకు -ఝంఝూ-పవన-ఉత్తృణ-ఆలయములో- అని తెలుఁగుసేఁత, రుదిత్వా- నిస్సహ- నిషణ్ణామ్- అను పదములకు 'భద్రంబునన్ - మొదలు, నిద్రించుచు నున్న- వఱకు శ్రీనాథసంప్రదాయానుగుణమైన విపులవివరణము- గతపతికాం- వాడ (పాంథ అని పాఠమై యుండును) వనితన్, గర్జావచః ప్రౌఢిమన్ - శ్రీనాథ రచనాసంప్రదాయానుగుణమైన, యధిక గుణసంపాదకమైన యమూల పదమిది. విద్యుదుద్యోతః- తటిదుద్యోతము, దర్శయతి- చూపున్ - నట్టనడురే- ఆవశ్యక మయిన గుణసంపాదక మయిన యమూలకపదమిది. జలధరాణామ్ ధారాధర శ్రేణికిన్-ఝంఝూ-ఉత్తృణ-ఉద్యోతపదములు మక్కికి మక్కిగాఁ గూడఁ గలవు. ఇట్లీ తెల్గుపద్యము సాతవాహన సప్తశతీ గాథకుఁ దెలుఁ గగుట విస్పష్ట మగుచుండఁగా, సాతవాహనసప్తశతిని శ్రీనాథుఁడు తెలిఁ గించుట ప్రఖ్యాతమైయుండఁగా, శ్రీనాథుని కాలముననే క్రీడాభిరామరచనము జరిగియుండుట (శ్రీనాథుఁడును వల్లభరాయఁడును సమకాలమువారు గాన) సునిశ్చితమై యుండఁగా, శ్రీనాథుని యాంధ్రీకరణరీతి) యీ పద్యమునఁ బరిస్ఫుట మగుచుండఁగా క్రీడాభిరామము ప్రేమాభిరామ మను సంస్కృతరూపకమునకు మక్కికిమక్కిగా దెలుఁగునఁ బెట్టఁబడిన ప్రతిబింబము గాదనుట ( ఈ పద్యమునుబట్టి కూడ) యంగీకరించి తీరవలసినదై యుండఁగా నీ పద్యముగాని, యీ పద్యముగల గ్రంథముగాని శ్రీనాథరచితము గాదనువాదమున కాదరువుండునా? నేనీ పద్యమునకుమూలము నిప్పుడు సాతవాహనసప్తశతి నుండియెత్తి చూపితినిగాన యిఁక దీనిని బ్రక్షిప్త పద్యముగాఁ బరిగణించి పరిహరింపవలె నను వాదము బయల్పడఁబోవును గాఁబోలును; వాదమా నీకు వందనము! ఇదివఱకే యిట్టి వాదమొకటి పుట్టి యున్నది. " ఈ గ్రంథముతో శ్రీనాథునకు సంబంధము కలదని యంగీకరింప వలసినదే యనియు శ్రీనాథుడు వల్లభరాయని యెడఁగల స్నేహబాంధవములకలిమిచే నీ గ్రంథరచనమున నాతనికి విశేషముగాఁ దోడ్పడి పెక్కు పద్యములు రచించి యిచ్చియుండు ననియు, శ్రీనాథ వల్లభరాయల యిర్వుర గౌరవమునకుఁగూడ నీ యభిప్రాయము నిర్బాధకమైన దనియును- " "కవి యశోలోభమున వల్లభరాయఁడు విభవ మొసఁగి శ్రీనాథునిచే స్వకర్తృకముగాఁ జెప్పించుకొనుట నీచపుఁ బని గాన వల్లభరాయఁ

డందు కొడఁబడె" ననరాదఁట : పల్లెగ్రామములలో రైతు లిద్దఱు దగవులాడుకొనుచున్నప్పుడు కరణము కాఁపులు మాధ్యస్థ్యము చేసి యిద్దఱకును కష్టనష్టములు కలుగకుండఁ గుదుర్చు రాజీపద్ధతియా యిక్కడ యోజింపవలసినది? వల్లభరాయఁడు కవియై, గ్రంథకర్తయై యున్నపుడు కొన్ని పద్యము లయినను శ్రీనాథునిచేఁ జెప్పించుకొనుట నీచపుఁబని కాదు గాఁబోలును గ్రంథ మామూలాగ్రము శ్రీనాథుని పేరిని బట్టియిచ్చుచున్నదని గదా నేను జెప్పుచున్నది.

## శ్రీనాథుఁ డిట్టి రచన చేయునా?

క్రీడాభిరామమున 'సుసరభేత్తు' 'కమఠావతారంబు' 'ఈమణి' 'పూవుంబోఁడులు' 'వ్యామగ్రా' హేత్యాది రచనము లసభ్యములై యున్నవి. మహాకవి యగు శ్రీనాథుఁడిట్టి రచనములఁ జేయఁబూను ననుట సంగత మగునా యని సందేహముతోఁచును. ఇంచుక విపులముగా విమర్శించినచో నీ సందేహమునకు స్థానముండదు. సంస్కృతభాషలో భాణములు, ప్రహసనములు, వీథులు కావ్యనాటకాదులకంటెఁ గొంత హెచ్చుగాఁ బచ్చిగాఁ గాముకీకాముక వ్యాపారవర్ణనములతో వెలయుచున్న వన్నవిషయము సంస్కృతభాషాపాండిత్యము గల సరసులకుఁ జక్కఁగా నెఱుక కెక్కియుండునదే. బహుప్రాచీను లగు శూద్రక వరరుచీశ్వరదత్త శ్యామిలకాదులును, శ్రీనాథుని సమకాలమువారగు డిండిమవామనభట్ట బాణాదులును రచించిన భాణములందుఁ బచ్చిపచ్చిగా వర్ణనలు హెచ్చుగాఁ గానవచ్చును. మచ్చునకుఁ గొన్ని పద్యము లిచ్చుచున్నాఁడను.

[1]స్రగ్ధర.

ఆక్షిప్తస్రస్తవస్త్రాం ప్రశిథిలరశనాం ముక్తనీవీం విహస్తాం
హస్తవ్యత్యాసగుప్తస్తనవివరవలీమధ్య నాభిప్రదేశామ్
లజ్జాదీనోపవిష్టాం నహి నహి విసృజేత్యేవమాక్రన్దమానాం
శయ్యామారోప్య కాన్తాం సురతసమదయస్యాగ్ర సస్యం గృహాణ.
(శూద్రకుని పద్మప్రాభృతకము. పుట 11)

1. చూ. శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు, యస్.కె. రామనాథశాస్త్రిగారు పరిష్కరించిన 'చతుర్భాణి–1922 లోఁ బ్రకటితము.



శా॥ వ్యాక్షేపం కురుతః స్తనౌ న సురతే గాఢోపగూఢస్య తే
రాగఘ్నస్తవ మాసి మాసి సుభగే నై వార్తవ స్యాగమః
రూపశ్రీనవయౌవనోదయరిపుర్గర్భోఽపి నైవాస్తి తే
త్వా మేవం సుగుణాం విహాస్యతి సచే ద్రత్యుత్సవం త్యక్ష్యతి.
(వరరుచి యుభయాభిసారిక. పుట 9)

శా॥ జాత్యన్ధాం సురతేషు దీనవదనా మంతర్ముఖాభాషిణీం
హృష్ట స్యాపి జనస్య శోకజననీం లజ్జాపటే నావృతామ్
నిర్వ్యాజం స్వయమప్యదృష్టిజఘనాం స్త్రీరూపబద్ధాం పశుం
కర్తవ్యం ఖలు నైవ భోః కులవధూకారాం ప్రవేష్టుం మనః
(ఈశ్వరదత్తుని ధూర్తవిటసంవాదము–పుట 6)

వసంతతిలక॥

ఆలిఙ్గితోపి సమయా పరిచుమ్బితోపి
శ్రోణ్యర్పితోపి కర జై రుపచోదితోపి
ఖిన్నాస్మి దార్వివ యదా న స మా ముపైతి
శయ్యాఙ్గ మేక ముపగూహ్య తతోస్మి సుప్తా.
(శ్యామిలకుని పాదతాడితకము. పుట 26)

అనుష్టుప్ ॥ కల్యాణాయాస్తు వః కామః కారుణ్యా దస్యవాసవః
ఏకం ప్రయుజ్యాహల్యాయాం పునర్లేభే సహస్రథా !
( డిండిముని యోగానందప్రహసనము ?)

[1] రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామముగూడ నీ విధముననే యుండి యుండును. ప్రేమాభిరామములోని వనఁదగిన కొన్ని సంస్కృత శ్లోకములు నాకుఁ గానవచ్చినవి. క్రీడాభిరామపద్యములకు మూల ప్రాయములుగా నవిగలవు. ప్రేమాభిరామము ననుసరించి రచించిన దగుటచేఁ గ్రీడాభిరామమునఁ గూడ నట్టిరచనలు చేరి యుండవచ్చును. ఔచితి నెఱింగిన శ్రీనాథమహాకవి వాని నడఁచిపుచ్చక తెలిగించునాయని యాక్షేపించువా రీ క్రిందివిషయమును గూడ నారయఁ దగుదురు. ఆచార్య దండి ప్రభృతులు గ్రామ్యతాదోషము క్రింద గణించి గర్హించినరచనములు

1. ప్రేమాభిరామమును ద్విపదగా మార్చి రచించితినని మఱింగంటి సింగరాచార్యుఁడు సీతాకల్యాణములోఁ జెప్పికొన్నాఁడు. అది ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నున్నది. (R –708). ( చూ. పీఠికలో 'ప్రేమాభిరామము' అను శీర్షిక.)

శ్రీనాథుని సర్వగ్రంథములందును గలవు. శ్రీనాథుఁడాచార్య దండి ప్రభృతుల యనుశాసనము నెఱుగనివాఁడుగాఁడు. నిరంకుశుడై యాతఁ డట్టి రచనములఁ జేర్చినాఁడు. 'ఔచిత్యమును బోషించియు ననౌచిత్యమును బరిహరించియు రచించితి' నని శ్రీనాథుఁడే చెప్పుకొన్న శృంగారనైషధము సప్తమాశ్వాసమున నూటముప్పది మూఁడవపద్యము 'యజమాన ప్రమదావికస్వ' రేత్యాదికము జుగుప్సావహము, గ్రామ్యతా దోషజుష్టము. మూలమున నుండునే కాక: మఱియు "విద్వజ్జనులు నిన్ను విషయించి వత్తురు" (నైష. 6-110) ఇత్యాదిపద్య మశ్లీలముగాదా? అనౌచితిని బరిహరించుటలో నది చేరవలదా : ఇఁక హరవిలాసము. దీనిని దొలుత ముద్రించిన సరస్వతీ పత్రికాధిపతు లనౌచిత్యభీతిచేఁ గొంత గ్రంథభాగమును ముద్రింపకే విడిచిరి. నేఁటికి నాభాగమట్లే కలదు. పలువురు విద్వాంసు లాశ్రీనాథరచనము పరిహృతమయినందుకు దురపిల్లుచున్నారు. ఎందఱెందరో విద్వాంసు లా భాగమెట్లుండునో యెందేని దొరకునోయనికూడా నన్నడిగిరి. బాహాటముగా దాని నాగ్రంథమున ముద్రించుట భావ్యముగాదు. శ్రీనాథుని నిరంకుశత్వనిరూపణమునకై దానినిక్కడఁ జూపుచున్నాఁడను.

హరవిలాసము 5-57 పద్యము తర్వాత :

"ఇట్లు పరమధూర్తవర్తనంబునం బ్రవర్తిల్లు నయ్యష్టమూర్తి యిష్టాపూర్త ధర్మకర్మాధ్యు లగునమ్మరపతులు.........రిన కట్టిన కౌపీనంబు దలంగ వైచి ప్రాచీనబర్హికుంభిశుండాదండ సన్నిభం బైనమదనధ్వజదండంబు నిగుడించి యమ్మహనీయ సాధనంబున నమ్మహీసురోత్తముల యుత్తమాంగంబు ........దకడఁత లడంచియుఁ జెవులకొడొంక లొత్తియు మొగంబులు మొత్తియు, ముక్కులునొక్కియు, బరులువేసియు, వీపులుచఱచియుఁ, బండ్లు రాల్చియు, నురంబులు ఊచియు...... త్రికంబులు దాఁకించియు, జంఘలువొడిచియు, జానువులు తాటించియు, బడలువఱచియుఁ, దోలి తొప్పఱంబెట్టి యార్చి యమ్మహాలింగంబు నింగి దాఁకం బెరిగించుటయు నక్షత్రమండలం(బను) ముత్యాలగొడుగునకుం బసిండికామభంగి నంగీకరింపఁ జేసి, సోమార్కమయమహాసోపానంబుల డిగ్గు వియద్గంగాప్రవాహంబు నభిషేకం బాపాదించి, బ్రహ్మాండకర్పరం బప్పళింపఁజేసి నాగ.........



క॥ సురగరుడఖచరవిద్యా
ధరకిన్నరసిద్ధసాధ్యదానవముఖ్యుల్
పురహరుఁడు చాచిపట్టిన
యురులింగంబునకు మ్రొక్కి రురుతరభక్తిన్

సంస్తుతింపఁదొడంగి రప్పుడు బ్రహ్మ బ్రహ్మలోకంబునకు నిగిడిన యమ్మహాలింగంబునకుం గరకమండలంబు తీర్థంబు వారిధారాసహస్రంబుల నభిషేకంబాపాదించి గంధ పుష్ప ధూపదీప నైవేద్య తాంబూలాద్యుపచారంబుల నుపాసించి యథాపూర్వకంబుగా నిట్లని స్తుతియించె.

**దండకము–** జయజయ శివలింగజ్యోతిర్మహాలింగ లింగోద్భవ శ్రీమహాలింగ వేదత్రయీలింగ నిర్లింగసంప..... ద్యక్షమాలింగ సద్భావలింగస్వభావై....... కాల వ్యవచ్ఛేదరాహిత్య లింగ స్వయం భూమహాలింగ పాతాళ లింగ క్రియాలింగ పంచాక్షరీలింగ పంచప్రకారోపదీప క్రియాలింగ వారాణసీ క్షేత్ర కేదారసింధూ గయా ....... నిశోణాచల వ్యాఘ్రపుర్యాది నానావిధ స్థాన సంసిద్ధిలింగ ప్రణామాప్రమేయ ప్రధాలింగ ప్రతిష్ఠాకళాలింగమూ....... నకోణత్రయీ గేహరోహ ప్రధాలేఖికాస్యూతి భిందావషట్పుష్కరీ నిమ్న టంక్రోడ విష్టంభ నిష్కంప శంపాలతాలంఘిత బ్రహ్మరంధ్ర స్రవచ్చాంద్ర సాంద్రామృత స్యందనస్వ ........ శూన్యస్వరూపాభిధాలింగ ఖట్వాంగ లింగాహిలింగాభ్రగంగాసరిల్లింగ సారంగలింగాత్మభూలింగ ఐంలింగ ఓం లింగ దివ్యాత్మ నానావిరూపాక్షలింగా నమస్తే నమస్తే నమః

క॥ అని సంస్తుతించి వెండియు
వనరుహసంభవుఁడు దాను వాగ్భామినియున్
గనకారవిందముల న
ర్చన సేసిరి నీలగళుని సాధనమునకున్.

వ॥ ఇట్లు పూజించి విరించి కరకమలంబులు మొగిడ్చి,

సీ॥ ఉపసంహరింపుము త్రిపురదైత్యధ్వంస
యూర్ధ్వాండకర్పరం బొలియకుండ
బింకం బడంపుము సంకల్పసిద్ధ నీ
కుడువీథి గ్రిగ్గోడు పడకయుండ
బిరుసు మాన్పుము జలంధరదైత్యమర్దన

యె................కుండ
దర్పంబు సడలింపు తరుణేందుశేఖర
యొరసి యాశాభిత్తు లొలియకుండఁ

గీ॥ దివియు వేగ మహాదేవ ధిక్కరింపు
ముదుపు మహిరాజకంకణ యడఁపు రుద్ర
వాల్పు ఖట్వాంగపాణి (వదల్పు మభవ?)
మోహనంబైన నీమహీమేహనంబు.

చ॥ అనినఁ బ్రసన్నుఁడై కహకహధ్వని నవ్వి లలాటనేత్రుఁడి
ట్టను భువనంబు లెల్ల వినునట్లుగ నోపరమర్షులార ! యో
యనిమిషులార ! తక్కుఁగల.....................
యనుపమదివ్యలింగ మిది యర్చన కర్హమునేఁటినుండియున్.

క॥ లింగార్చనాపరుం డగు
మంగళహృదయునకు నేను మక్కువతోడన్
సాంగత్యము గృప సేయుదు
నంగీకృత................తోన్.

వ. అని శంభుండు నిఖిల బ్రహ్మాండ సంభార కుక్షింభరియగు నిజమహాలింగ స్తంభంబు స్తంభింపం జేసె నప్పుడు ముకుళిత హస్తారవిందులై దేవదారు వన దివ్యాశ్రమస్థలగు......... బులు జనియించి......... పాహిభూషణుని బహువిధంబుల భక్తి విశేషంబుల భజియించిరి. భోగమోక్షంబులు గాంచిరి..... వనవిహారంబు ... ఫలసిద్ధ యగును.”

మఱియును :

శా॥ కాంచీకంకణ తారహార కటకగ్రైవేయభూషావళుల్
లంచం బిత్తురు దూతికాతతికి లీలన్ బెండపూఁడన్ననిన్
బంచాస్త్రోపముఁ దారతార కవయన్ బ్రార్థించి లోలోపలన్
బంచారామములందుఁ బల్వెలపురిన్ బ్రౌఢేందుబింబాననల్.
(భీమ. 1–77)

మఱియును :

సీ॥ ముడువంగ నేర్తురు మూల దాపటికి రాఁ
జికురబంధము లీఁగ జీరువాఱఁ
బొన్నపువ్వులఁ బోలుపొక్కిళ్ళు బయలుగాఁ



గట్టనేర్తురు సీర గటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడు వ్రేలుఁజెవులందు
నవతంసకంబుగా నల్లి పువ్వు
పచరింప నేర్తురు పదియాఱువన్నియ
పసిఁడిపాదంబులఁ బట్టుచేల

గీ॥ పయ్యెదయు నిగ్గుఁ (సిగ్గుఁ) బాలిండ్లఁ బ్రాఁక నీరు
తఱచు పూయుదు రోలగందంబు పసుపు
బందికత్తెలు సురతప్రపంచవేళఁ
గంచియఅవత లసమాస్త్రఖడ్గలతలు. (కాశీ. 3–109)

ఈ పద్యము కాశీఖండము తృతీయాశ్వాసమున నున్నది. శృంగార ప్రసక్తిలేనివాఁడు భగవదారాధనపరుఁడునగు శివశర్మ యను బ్రాహ్మణుఁడు తీర్థయాత్ర సల్పుచు కాంచీనగరము మీఁదుఁగాఁ బోవుట యక్కడి కథాసందర్భము. సంస్కృత కాశీఖండమున మీఁద నుదాహరింపఁబడిన పద్యమునకు మూలము లేదు. పై పద్యమునకుఁ బూర్వోత్తర పద్యములు మాత్రమే యక్కడ సరసములు సంగతములు మూలానుగుణములును; అట్టిచో నమూలక మయిన పై పద్యము నక్కడ శ్రీనాథుఁ డతకరించుట యనుచితము నసంగతమునుగ నున్నది. శ్రీనాథుఁడు కాంచీపురమున కరిగెను. అప్పు డాతఁడు చెప్పుకొన్న చాటుపద్యము విడిగానున్నఁ జెడిపోవునన్న లోభముచే నిందు దూర్చినాఁడనియే నేను దలంచుచున్నాఁడను. సంస్కృతమున లేనిదాని, కథాసందర్భమున కనుచితమైనదాని నీ పద్యమును శ్రీనాథుఁడు చెప్పుటకుఁ గారణమేమై యుండునో యించుక యోజించువారికి గోచరింపకపోదు.

మఱియుఁ గాశీఖండము సప్తమాశ్వాసమున దక్షాధ్వరధ్వంసకథలో.

సీ॥ శితికంఠునకును నెచ్చెలికాఁడు గాఁడొకో
యటమటీఁడైన యీ యక్షభర్త....

ఇత్యాది సీసపద్యము గీతిలో

గీ॥ ఏమి గుడువంగ వచ్చినా రిండ్లు విడిచి
హరుని వెలివెట్టినట్టి యీ యాగమునకుఁ
బంచవదనుని కను జేవురించె నేని
తత్క్షణమునంద తమయాంధ్రత్రాళ్ళు దెగవె. (కాశీ. 7–60)

ఇందు శ్రీనాథుని కవనంపుఁబెంపు, నిరంకుశత, భావోద్రేకము దైవాఱుచున్నవి. [1](వీరభద్రుడు) కుబేరుని, అగ్నిని, చంద్రుని, ఇంద్రుని తిట్టుచున్నాఁడు. 'ఏమి గుడువంగ వచ్చినా' రనుటలో భుజించుట యను నుచితార్థమున్నను వేఱొక యశ్లీలార్థమును వ్యక్తమగుచునే యున్నది.'ఈ యాగమునకు' అనుచో 'నీ ఆగమునకు' అనికూడా ఛేదమున్నది. 'అల్లరీ ఆగమూ' అని నానుడి. 'తమ యాంద్ర త్రాళ్ళు తెగవె' ఇట్టి పలుకు ములుకులు సాధారణ కవుల రచనలలో సాగునవి గావు. ఈ పద్యము చదివినప్పుడెల్ల శ్రీనాథుఁడు గవిసార్వభౌముఁడై నాకుఁ గన్పట్టుచుండును. 'కుడుచు' ధాతువును భుజించు నర్థమున నీతఁడు ప్రయోగించుటఁ జూపి యిక్కడ నన్నెవ్వరే నాక్షేపింతురు గాఁబోలును. 'ఏమి గుడువంగ వచ్చినా, రనుటలో రెండవయర్థ మెంత యశ్లీలమైనను నది [2](వీరభద్రుఁడు దక్షాధ్వర ధ్వంసములోఁ జెలరేఁగి తిట్టెడు తిట్టులలో నిక్కడ సొంపునే సంపాదించుచున్నది. అపుడు వీరభద్రుఁడు సభ్యమైన, సరసమైన, హితోక్తు లాడుటయే యస్వరస మగును.)

మఱియు హరవిలాసము సప్తమాశ్వాసమున మాయాకిరాతుఁ దర్జునుని దిట్టుటలో

కు॥ మండెడుబలునారసమున
గుండియ వగులంగ నేసి కూల్చితి దీనిన్
వెండి ప్రయోజన మేదీ
రండాసుత ! దీనిపై శరము నిగుడింపన్ (హర. 7-53)

మఱియు శివరాత్రిమాహాత్మ్యమున :

గీ॥ అనుచు విప్రుండు దమకించి యంటుకొనియె !
సమ్మతించియ యుండె నా చంద్రవదన
శూకలాశ్వంబు నసరేఁపఁ జొచ్చినప్పు
డనుమతింపదె యత్తళు వైనబడబ. (శివరాత్రి. 3-69)

సీ॥గీ॥ ఎట్లు కనుఁ బ్రామి వచ్చునో యింటివారి
నెట్లొ (చీకటి నొం)టి మై నింటి కరుగు
నతివ పగలైన మా పైన నతనితోడ
నిచ్చ నొకసారి గావించు నిథువనంబు. (శివరాత్రి. 3-114)

1. ఇందున్నట్టు 'వీరభద్రుఁడు' కాదు. 'దధీచి' అని చదువుకొనవలెను.(ప్రకాశకుఁడు)

2. ఈ వాక్యముల నిట్లుగా చదువుఁడు: (ప్రకాశకుఁడు) (దక్షాధ్వరధ్వంస కథలో దధీచి నిందాగర్భితముగా నాడెడి పట్టున నిక్కడ సొంపునే సంపాదించుచున్నది.)



"యథా యకారాదిపదం రత్యుత్సవనిరూపణే"

అన్న యాచార్యదండియనుశాసన మిక్కడ నాఁగలేదు. బ్రాహ్మణుఁడు భ్రష్టుఁడై చండాలకన్యతో సంగమించుటను జెప్పు సందర్భమున నీయశ్లీలము గొంత యౌచితి గలదేయగునని తలఁచి నిరంకుశుఁడై శ్రీనాథుఁ డిట్టిరచన జేర్చెను. క్రీడాభిరామమందలిరచనలు నిట్టివే. ఆంధ్రకవులలో శ్రీనాథునకుఁ బూర్వ మిట్టిరచనలను జేసినవారు గానరారు. నన్నిచోడఁడు మాత్రము :

కు॥ స్మరమందిరమ్ము శోభా
కరముగ మెఱుఁగారుపసిఁడికంబము లనఁగాఁ
గరమొప్పు నగతనూజకుఁ
గరభోరులు వొలుచు మదనకరికరలీలన్.(కుమారసం. 3-48)

గీ॥ అదిమి పట్టినఁ గరులైనఁ జదియునట్టి
కడిఁది బలులగు మగలొత్తి గొఁగిలింపఁ
గుసుమకోమలు లగుసతుల్ గొసరుచునికి
గనియు నెఱుఁగవె విపరీతకామశక్తి. (కుమారసం. 4-79)

అని యించుక హద్దుదాటి కుమారసంభవమున రెండుపద్దెములఁ జెప్పెను.

## శ్రీనాథుని శీలము

సత్ప్రబంధములందుఁ గూడ నిట్టిరచనలను సంకోచింపక నిరంకుశముగాఁ జొప్పించుటకు శ్రీనాథుని శీలమెట్టిదై యుండఁదగునో యించుక యోజించిన గోచరించును. శివరాత్రి మాహాత్మ్యమును జెప్పు పవిత్రగ్రంథమున సంస్కృతమూలమున లేని చండాలాంగనా బ్రాహ్మణబ్రువ సంభోగసంభారమునంత సంపూర్ణముగా వర్ణించియే తీఱవలెనా? కాశీఖండమున ననుచితముగాఁ గంచియఱవతల ముచ్చటను బచ్చిగా వర్ణింపవలసినదే? హరవిలాసమున శివలింగోత్పత్తి కథ నంతకంటె సభ్యముగా సాగింపఁదగదా? సత్ప్రబంధములందే లేని జంకుఁగొంకులింక రసికులకొఱకే రచితమయిన క్రీడాభిరామమునఁ జూడఁబడునా? అనావశ్యకము లయినపట్టుల గూడ నిట్టి రచనములను హెచ్చుగాఁజేర్చుటను జేసియు, సరసమయిన శృంగారసందర్భములం దింపులు సొంపులు పొంపిరి వోవునట్లును, క్షుద్రహృదయులు గూడ రసార్ద్రహృదయులగునట్లును నమృతధారవంటి కవితాధార నలుఁగులు వాఱించుటం జేసియుఁ, జాటుమాటు లేక తన స్వైరవిహారమును చాటుధారలలోఁ జాటుటంజేసియు, సర్వాంధ్రదేశము నందును, నందును బల్నాట స్థలనిర్దేశ నామనిర్దేశములతోఁ

గూడ నాతని స్త్రీలౌల్యప్రఖ్యాపకము లయిన కథలు, పద్యములు గడల్కొని యుండుటంజేసియు, అవి యెల్ల నప్రామాణికములని యడఁగఁద్రొక్కుటకుఁ దగినవ్యతిరేక ప్రమాణములు గానరాకపోవుటంజేసియు, శ్రీనాథకవీశ్వరుని గూర్చి నేను రచియించిన శృంగార శ్రీనాథమున మిక్కిలి జాగ్రత్తతోనే సూక్ష్మముగా నాతని స్త్రీలౌల్యమును సూచించితిని. దానిపై నొకరు పెద్దగా నాక్షేపములఁ బ్రకటించిరి. శ్రీనాథుని స్త్రీలౌల్యప్రఖ్యాపకములయిన చాటుధారల నా గ్రంథమునఁ బ్రకటింపనయితి గాదయ్యెను. అట్టి పద్యముల నందుఁ బ్రకటింపకుండుటయుఁ బెద్ద యాక్షేపమే యయ్యెను. ఆ పద్యములఁ బ్రకటింపకున్నచో వారి యాక్షేపములకుఁ జాలినంత సమాధానము ఘటిల్లదు గావునను, బాహాటముగా వానిఁ బ్రకటింపఁదగదు గావునను, నిప్పటి వఱకు నే నా యాక్షేపముల కేమియు సమాధానము చెప్పనయితిని. పండితులు, కావ్యతత్త్వ పరిశోధకులు ప్రౌఢులు నగువారికే పడయఁదగినది గాన, యిందాపద్యములఁ బొందించుచున్నాఁడను. నా గ్రంథముపై వెల్లివిరిసిన యాక్షేపముల పెల్లున కిఁక వేఱొకచోటఁ జల్లఁగా సమాధానములు సాగింపఁ గల్గుదును.

కII [1] బూతుంబద్దెము లిఁకపైఁ
జేతులు వడఁకాడ మనసు చీఁదఱపడఁగా
రోఁత జనింపఁగఁ గూర్చెద
నీతిపరుల్ లోఁ జదువుఁడు నిర్లిప్తులుగాన్.

## శ్రీనాథుని చాటుధారలు

ఉII హాజలజాక్షి! హా కిసలయాధర! హా హరిమధ్య! హా శర
ద్రాజనిభాస్య! హా సురత తంత్రకళానిధి! యెందు వోయితే
రాజమహేంద్రవీథిఁ గవిరాజు ననున్ గికురించి భర్గకం
ఠాజిరకాలకూటఘుటికాచిత మైన యమాసచీకటిన్.

1. ఈ పద్యము శ్రీ శాస్త్రిగారు రచించినది.
2. కవిలోక చింతామణికర్త తాతంభట్టు శ్రీనాథుని తర్వాత 100 ఏండ్లలోనివాఁడు. లక్షణసారసంగ్రహకర్త కూచిమంచి తిమ్మకవి. బాలబోధచ్ఛందస్సుకర్త పేరెఱుఁగరాదు. అందు బహుప్రాచీనము లయినగ్రంథము లుదాహృతము లయ్యెను. అప్పకవికంటెఁ దత్కర్త ప్రాచీనుఁడు గాఁదగును. అది ప్రాచ్యలిఖితపుస్తకశాలలోఁ గొంత గలదు. బ్రహ్మశ్రీ మా. రామకృష్ణకవిగారి దగ్గఱఁ గొంతగలదు. వారు దఱచుగా నక్కడక్కడ నుదాహరించుచు వచ్చిన ప్రాచీనపద్యరత్నము లనేకము లందలివి. రత్నఖని యగునాగ్రంథమును గూర్చి వేఱుగా నొక వ్యాసము వ్రాయుదును. లక్షణదీపికగూడ నప్పకవిఁ దర్వాతిదిగాదు. అప్పకవి స్మరించిన లక్షణదీపిక యని కలదు. మఱికొన్నింట వార్తాకవి రఘునాథయ్యగారి లక్షణదీపిక యని కలదు. క్రీ. 1600 లో నీ రెండు గ్రంథములు వెలసి యుండవచ్చును.



ఈ పద్యము శ్రీనాథుని చాటుధార యని [2]కవిలోక చింతామణిని, లక్షణసారసంగ్రహమునను, బాలబోధచ్ఛందమునను, లక్షణదీపికను నుదాహృతమై కానవచ్చుచున్నది.

మఱియు నీ పద్యము మోదుకూరిలో బల్లెం కనకరాజుగారియింటి తాళపత్రపుస్తకమునఁ గూడ శ్రీనాథునిదిగాఁగలదు. ఇన్నింటిలో నిట్లుదాహృతమయిన పయి పద్యమును శ్రీనాథేతరు లెవ్వరో సృష్టించిరనుట న్యాయ్యముగాదు. అంతటి యావశ్యకత యెవ్వరికి నుండదు. ఇతరులే సృష్టించి చేర్చిరని నిరూపింపఁగల బలవత్ప్రమాణములు చూపినచో జోహారులు : పై చాటుధారలో 'రాజమహేంద్రవీథి' గలదు. 'కవిరాజు' గలఁడు. శ్రీనాథుడు రాజమహేంద్రవరమునఁ గొన్నాళ్లుండుట సుప్రసిద్ధము. అక్కడఁ జెప్పిన చాటుధారలింకను గలవు. నేను ప్రకటించిన చాటుపద్యమణిమంజరి 1,2 భాగములఁ జూడఁదగును. శ్రీనాథునకు 'కవిరాజు' అని బిరుదుపేరు గలదు. అది 'కవిరాజుకంఠంబు గౌఁగిలించెను గదా'ఁ అని శ్రీనాథుని యవసానకాల పద్యమునను 'ఘనుఁడైన శ్రీనాథకవి రాజరాజు" అని పల్నాటివీర చరిత్రమునను గలదు. రాజమహేంద్రవరవాస్తవ్యులు నేఁడు నొక కవిరాజుగారు గలరు. మున్నూఱేండ్లకుముందే యిది లక్షణగ్రంథములందు శ్రీనాథుని పేరనే యుదాహృతమయ్యె గాన, వర్తమానకవిరాజు కీ పద్యపుముచ్చట వర్తిల్లదు. రాజమహేంద్రవర కవిరాజు వేఱొకఁడు ప్రాచీనుఁడు గానరాఁడు. ఈ పద్యమును బట్టి శ్రీనాథునివర్తన మెట్టిదిగాఁ దెలియనగునో తెలుపుటకు ప్రాజ్ఞులు ప్రమాణము. మఱియు గూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహమున ' రంతు'లను పదము సాధురేఫముగల దనుటకు శ్రీనాథుని చాటుధారగా నీ క్రింది పద్యమునుదాహరించెను.

ఉII అంగడి వీథిఁ బల్లవుల కాసఁగ మామిడిపండు లమ్ముచున్
జంగమవారిపిన్నది పిసాళితనంబునఁ జూచెఁబో నిశా
తాంగజబాణకైరవ సితాంబుజమత్తచకోర బాల సా
రంగతటిన్నికాయముల రంతులు సేసెడువాఁడిచూపులన్

మఱియు, నందే శ్రీనాథుని చాటుధార యని

'మత్తేభగామినీ వృత్తస్తనంబుల
నెలవంక లేమిట నిలుపువాఁడ

అను చరణ ముదాహరింపఁబడినది. ఈ చరణముగల పద్యమెల్ల

నా కన్యత్ర చేకూరినది. తనచేతి వ్రేలిగోరు విఱిగిపోఁగా శ్రీనాథుఁడు చెప్పుకొన్న చాటువిది.

సీ॥ నీలాలకాజాలఫాలకస్తూరికా
తిలకంబు నేమిట దిద్దువాఁడ
నంగనాలింగ నానంగసంగర ఘర్మ
శీకరం బేమిటఁ జిమ్మువాఁడ
మత్తేభగామినీవృత్తస్తనంబుల
నెలవంక లేమిట నిల్పువాఁడ
భామామణీకచాభరణశోభిత మైన
పాపట నేమిటఁ బాపువాఁడ

గీ॥ ఇందు సఖులను వే ప్రొద్దుఁ గ్రిందుపఱిచి
కలికి చెంగల్వఱేకుల కాంతిఁ దనరి
....................అహహా!
పోయె నా గోరు! తనచేతిపోరు మాని.

క్రీ. 1830 ప్రాంతములందు 'ఆంధ్రభాషా మహావిద్వాంసు'లని, 'సర్వజ్ఞు'లని నాటి మహావిద్వాంసుల చేతనే కీర్తింపఁబడిన మహనీయులు సి.పి. బ్రౌనుదొరగారు కథావివరణములతో శ్రీనాథుని చాటుధారలను గొన్నింటిని సేకరించిరి. అందుఁ గొన్ని వివరణములు పద్యములు వారి స్వహస్తాక్షరములతో నున్నవి. వాని నిక్కడఁ జూపు చున్నాఁడను.

శ్రీనాథుని వీథినాటకములోనిదని (ములుపాక) బుచ్చయ్యశాస్త్రి ఒక చరణమే చదివినాఁడట.

'పయట కొం గిఱుకుగుబ్బలసందిఁ బడి బండి
గురిగింజదండతో సరసమాడ'

శ్రీనాథుని వీథినాటకములోని వని యీ క్రింది రెండు పద్యములు నుదాహరింపఁబడినవి.

ఉ॥ మీన విలోచనంబులును మీఁటిన ఖంగనుగుబ్బచన్నులున్
(క్రీడా. 104 ప. చూ.)

ఉ॥ కందుకకేళి సల్పెదు ప్రకారమునన్ (క్రీడా. 82 ప. చూ.)



"శ్రీనాథుఁడు శఠకోపజియ్యరుమీఁద చెప్పినది. తన యింటి యంచుమఱుగుతావులో జియ్యరు వుండగా అక్కడికి వక స్త్రీ వస్తే దాని పనులు వాడు చేసుకున్నట్లు చూచి శ్రీనాథుఁడు తెల్లవారి చెప్పినది" (ఇది బ్రౌను దొరగారి వాక్యరచన)

ఉ॥ ఇంగలమంచు వచ్చి యడియే నని కొత్తమసాని మ్రొక్కఁగాఁ
గొంగు బిరాల్నఁ బట్ట తిరుకొం గటు దీసి జలారిచెంతనే
వంగఁగఁ బెట్టి యోనిఁ దిరువట్టలఁ గొట్టగఁ జాలుఁ జాలు నీ
............లటంచు నిన్ను మఱి తిట్టెనుగా శఠకోపజియ్యరూ!

దీని పోలికను చౌడప్ప యొక పద్యము చెప్పెను.

ఉ॥ గండము దప్పె నంధ్రకవిగానికి నిన్నటిరేయి పుష్పకో
దండునికేళిఁ గూడకయ తద్దయు నిల్చితిఁ గాని యయ్యయో
బందరువారి పాపికిని బైటిపసారమె కాని యందులోఁ
బుండట యెల్లవంకఁ జెడిపోదుఁగదా విషయింపఁ బోయినన్

ఉ॥ జంగమురాలిఁ బట్టి యొకజంగము వంగఁగఁ బెట్టి యోనిలో
లింగముఁ బెట్టి క్రుక్కి యదలించుచు నొక్కొకతాఁకు తాఁకినన్
లింగ ! నమశ్శివాయ! గురులింగ! మహేశ్వర! జంగమయ్య! యో
యంగజభంగ! సాంబగురుఁడా! యనుఁదాఁకినతాఁకుతాఁకుకున్.

ఉ॥ గోష్పదరూపమై మిగులఁ గోమలమై గణుతింపరానిదై
శష్పవిహీనమై నునుపు చాలఁగఁ గల్గి ద్రవం బపారమై
పుష్పిణి యై నీభగము పుణ్యమునన్ భుజియింపఁగల్గె వా
స్తోష్పతికైన నో ద్రవిడసుందరి! నిన్ను వచింప శక్యమే?

చ॥ వడిసెల చేతఁ బూని బిగివట్రువగుబ్బలఁ బైఁట జాఱఁగా
నడుము వడంకఁగాఁ బిఱుదు నాట్యము సల్పగఁ గొప్పువీడఁగా
దుడదుడ మంచెయెక్కె నొకదొడ్డమిటారపుఁ గమ్మకూతురున్
దొడదొడ మంచమెక్కె నొక దొడ్డమిటారపు రెడ్డికూఁతురున్.

శా॥ అక్షయ్యం బగు సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్ బృందారక శ్రేణికిన్
దాక్షారామచళుక్య భీమవర గంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్

ఈ కడపటిపద్యము శ్రీనాథుఁడు తెలుంగురాయని దర్శించినప్పుడు చెప్పిన పద్యముగా సర్వాంధ్రదేశమందును వాడుక గలదు. శ్రీనాథుని గ్రంథములలో నీ పద్యమును బోలు పద్యములు పెక్కులు 'క్ష' ప్రాసముగలవి రచనా సామ్యముగలవి గలవు. శ్రీనాథుఁ డవసానకాలపద్యమున "రంభఁ గూడెఁ దెలుంగురాయరాహుత్తుండు కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు" నని చెప్పుకొనెను. ఇట్లీపద్యము శ్రీనాథుని వర్తన మెట్టిదిగాఁ దలఁపవలెనో తెలుపుటకు సహృదయులు ప్రమాణము. శృంగారశ్రీనాథములో నీ పద్యమును గూర్చి కొంత వివృతి వ్రాసితిని. దానిపైఁ గొన్ని యాక్షేపములు వెల్వడెను. నిస్సారములు నిరర్థకములును నగునాయాక్షేపముల ననువదించి సమాధానము చెప్పుట కిప్పుడు పూనుకొనను.

'హో జలజా' క్షీత్యాది పద్యమును రాజమహేంద్రవరమున శ్రీనాథుఁడు చెప్పినదాని నింతకుముం దుదాహరించితినిగదా! మఱియు శాస్త్రార్థైకప్రవణు లగుతర్క విద్వాంసులు తన్నును దన విషయలౌల్యమును నుద్దేశించి యీసడింపఁగా శ్రీనాథుఁడు చెప్పినదని యీ క్రింది పద్యము సర్వాంధ్ర దేశమునను వ్యాప్తి గన్నది –

శా॥ హంసీయానకుఁ గామికి [1]న్నధమరోమాళుల్ నభఃపుష్పముల్
సంసారద్రుమమూలపల్లవగుళుచ్ఛం బైనయచ్చోట వి
ద్వాంసుల్ రాజమహేంద్రపట్టణమునన్ ధర్మాసనంబుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావమనుచున్ దర్కింతురెల్లప్పుడున్.

ఈ ముదుక పరిహాసమునకుఁ దార్కికులు నాఁటికి నేఁటికిని దలలు వంపవలసినదేగదా! మహావిద్వాంసుఁడయ్యు శ్రీనాథుఁ డిట్టి స్త్రీలౌల్యమునఁ జెడ్డాఁడని రాజమహేంద్రవరమున సోమయాజులు నిరసింపఁగా శ్రీనాథుఁ డీ క్రింది పద్యమును జెప్పెనఁట.

మ॥ శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుండంత నానాధ్వర
వ్రతుఁడై పోయి కనున్ బురందరపురారామద్రుమానల్ప క
ల్పతరుప్రాంత లతాకుడుంగసుఖసుప్త ప్రాప్తరంభా భగ
ప్రతిరోమాంకురపాటన క్రమకళాపాండిత్య శౌండీర్యమున్.

1. ఈ సంధి శ్రీనాథప్రయుక్తమే. శివరాత్రిమాహాత్మ్యమునఁ జూడఁదగును. 'కయ్యధమ' అనియేని కవిప్రయోగము గానవచ్చును.



ఆ యాక్షేపమును నీ సమాధానమును వివేకులు విమర్శించి చూచినచో నిది శ్రీనాథుఁడే చెప్పఁదగిన పద్యమని తప్పక తోఁచును. ఈ పద్యముతో రచనాసామ్యముగల పద్యము తిక్కనది గలదు.

[1]చ॥ ఉలిమిడిచెక్కయున్ మిగులనుక్కయుఁ జప్పని రొట్టె ముక్కయున్
మలినపుగుడ్డలున్ నులుకమంచపుఁగుక్కియుఁ జీకటిల్లునుం
దలఁచిన రోఁతవచ్చు నొకనాటిసుఖం బొకయేఁటిదుఃఖ మీ
పలివెల వారకాంతల యుపస్థలకుం బదివేల దండముల్ !

ఈ పద్యము స్త్రీ వ్యాధిగ్రస్తుఁడై పలివెల వేశ్యలను గూర్చి శ్రీనాథుఁడు చెప్పినదిగా బహుస్థలములందు వినఁబడుచున్నది. పలివెల శ్రీనాథునినాఁట వారకాంతలకుఁ బ్రఖ్యాతి గన్నది. భీమఖండము (1–77) న.

శా॥ కాంచీమౌక్తిక తారహారకటకగ్రైవేయభూషావళుల్
లంచం బిత్తురు దూతికాతతికి లీలన్ బెండపూఁడన్ననిన్
బంచాస్త్రోపముఁ దార తార కవయన్ బ్రార్థించి లోలోపలన్
బంచారామములందుఁ బల్వెలపురిన్ బ్రౌఢేందుబింబాననల్.

అని పద్యము గలదు.

సీ॥ నగముఁ బోలెడు మేను సగము చేసెనుగదా
భగము కా దది మహోరగము గాని

ఇత్యాది సీసపద్యమును నర్సారావుపేఁటలో నొక విద్వాంసుడు శ్రీనాథుఁడు స్త్రీవ్యాధిగ్రస్తుఁడై చెప్పినది యని చదువ వింటిని.

శ్రీనాథుఁడు కర్ణాటరాజధాని యగువిద్యానగరమున కరిగినప్పుడు చెప్పిన పద్యమిది సుప్రసిద్ధము :

శా॥ కుల్లా యుంచితిఁ గోకసుట్టితి మహాకూర్పాసమున్ దొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్తవడ్డింపఁగాఁ
జల్లాయంబలిఁ ద్రావితిన్ రుచులు దోసంబంచుఁబోనాడితిన్
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్.

1. బహుస్థలముల నిది శ్రీనాథకృతముగా నాకు వినవచ్చెను. శ్రీ దీ. పిచ్చయశాస్త్రిగారు చాటుపద్య రత్నాకరమున శ్రీనాథకృతముగాఁ జేర్చిరి. శ్రీ బం. తమ్మయ్యగారు పగటిభాగవతపువేసగాఁడు చెప్పినదిగాఁ దాము విన్నట్లు వ్రాసిరి. ఏమో!

విశ్వస్తవడ్డింపు రుచింపలేదు :

ఇప్పటికిఁ బదునైదేండ్లకుఁ బూర్వము శ్రీజయంతి రామయ్యపంతులు గారు మద్రాసులో ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటుగా నుండఁగా వారి యింటికి విద్యావయోవృద్ధులు ప్రామాణికవిద్వాంసులు బ్రహ్మశ్రీ రామడుగు రామకృష్ణ శాస్త్రులుగారు విచ్చేసిరి. వారు శ్రీనాథుని పల్నాటి చాటుధారల నాకుఁ జదివి చెప్పిరి. అప్పుడు నే నీ క్రింది పద్యములఁ గొన్నింటి వ్రాసికొంటిని. చాటుపద్యమణిమంజరిలోఁ బ్రకటించితిని. అంతకుఁ బూర్వ మీ పద్యము లెక్కడను బ్రకటితములు గాలేదు.

ఉ॥ అంగడి యూర లేదు, వరియన్నము లేదు, శుచిత్వ మేమి లే,
దంగన లింపులేరు, ప్రియమైన వనంబులు లేవు, నీటికై
భంగపడంగఁ బాల్పడుకృపాపరు లెవ్వరు లేరు, దాత లె
న్నంగను సున్న, గాన పలినాటికి మాటికిఁ బోవ నేటికిన్.

క॥ గుడిమీఁది క్రోఁతితోడను
గుడిలోపలినంబివారికోడలితోడన్
నడివీథిలంజెతోడను
నడిగొప్పులహోరుగాలి నడిగితి ననుమీ.

ఈ పై పద్యమునకుఁ గథాసందర్భము లున్నవి. శ్రీనాథుఁడొకనాఁటి రాత్రి యాయూర ననుభవించిన కష్టసుఖముల నీ పద్యమునఁ జెప్పుకొన్నాడు. అడిగొప్పులలో నేఁటికిని దఱచుగా హోరుగాలి వీచు చుండునట!

క॥ తేలాకాయెను బోనము
పాలాయెను మంచినీళ్ళు, పడియుండుటకున్
నేలా కఱవాయె నిసీ!
కాలినగురజాల నిష్టకామేశశివా.

గురజాలలో శ్రీనాథుని కొకనాటిరాత్రి తిండి దొరకలేదు. తేలుగుట్టెను. మంచినీళ్ళును గఱవయ్యెను. నిద్రించుటకుఁ దిన్ననిచో టయినను గుదురలేదు. తేలుగుట్టిన బాధ తీఱుటకై నమలిమ్రింగిన మందాకే యాహారమయ్యెను. ఎవరో కవితాభిమాను లగుకాపులు తెచ్చి యిచ్చిన పాలే మంచినీళ్ళయ్యెను.

క॥ రసికుఁడు పోవఁడు పల్నా
డెసఁగంగా రంభయైన నేకులె వడుకున్



వసుధేశుఁడైన దున్నును
గుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్

ఉ॥ దోసెఁడుకొంపలోఁ బసులత్రొక్కిడి, మంచము, దూడరేణమున్
బాసిన వంటకంబు, పసిబాలురశౌచము విస్తరాకులున్
మాసినగుడ్డలుం దలకుమాసినముండలు వంటకుండలున్
రాసెఁడుకట్టెలుం దలఁపరాదు పురోహితులింటికృత్యముల్.

దీని వివృతిని చాటుపద్యమణిమంజరిలోఁ జూడఁదగును.

గీ॥ చిన్నచిన్నరాళ్లు చిల్లరదేవుళ్ళు– నాగులేటినీళ్ళు నాపఱాళ్లు
సజ్జజొన్నగూళ్ళు సర్పంబులును దేళ్ళు–పల్లెనాటి సీమపల్లెటూళ్ళు.

ఇట్టి వింకను పెక్కులున్నవి. మఱియు మొరస రాజ్యమునుగూర్చి చెప్పినపద్యములు గొన్ని యున్నవి. చాటు (ద్వితీయ) లో చూచునది. కడిది పురమును గూర్చి చెప్పినవి :

క॥ ముదివిటులు విధవలంజెలు
పదకవితలు మాఱుబాస బాపనవారల్
చదువని పండితవర్యులు
కదనాస్థిరవీరవరులు కడిదిపురమునన్.

ఉ॥ చీరయు ముక్కుముంగఱయుఁ జెంపలగంధముఁ జుక్కబొట్టు మం
జీరఝుణంఝుణారవముఁ జేతులఁ గంకణనిక్వణంబు నొ
య్యారము జాఱుకొప్పును గయాళితనంబును గాని లోన శృం
గార మొకింత లేదనుట గంటిని యీపురివారకాంతలన్.

రాచవీటి (రాయచోటి) కరిగి చెప్పినవి.

చ॥ పస గలముద్దుమోవి బిగివట్రువగుబ్బలు మందహాసముల్
నొసట విభూతిరేఖయు పునుంగుగనతావి మిటారిచూపులున్
రసికులు మేలుమేలు భళిరాయని మెచ్చఁగ రాచవీటిలోఁ
బసిఁడిసలాకవంటి యొక బల్జెవధూటిని గంటి వేడుకన్.

ఉ॥ ................................................బో
చేస్తిమి లేస్తి మామెకుడిచేతికి దండ మటుండనిమ్మ యా
విస్తరి పుట్టినట్టి పలువిత్తుల ఱంకుల రాచవీటిలో
నస్తును బస్తునాయెఁ గవితార్థుల కక్కడఁ గూడు గల్గునా?

ఇట్లు పెక్కుదేశములఁగూర్చి శ్రీనాథుఁడు పద్యములఁ జెప్పెను. వానినెల్లఁ జాటుపద్యమణిమంజరులలోఁ జేర్చితిని. అందుఁ జేరని దిందొక్కటి : కడపమండలమందలి 'కుందుగడ్డ' ను గూర్చి చెప్పినది.

గీ॥ మందరాద్రిసములు మానవు లందఱు
చందమామకూన లిందుముఖులు
కందు లేనిమౌక్తికంబులు జొన్నలు
కుందనంపుబెడ్డ కుందుగడ్డ.

మఱియు శ్రీనాథుఁడు నానాజాతివనితలఁ గూర్చి చెప్పిన పద్యములు గొన్ని-

చ॥ తొలకరిమించుఁదీవగతిఁ దోఁప దుకాణముమీఁద నున్నయ
య్యలికులవేణితోఁ దమలపాకులబేరము లాడఁబోయి నే
వలచుట కేమి శంకరునివంటి మహాత్ముఁడు లింగరూపమై
కులికెడుదానిగబ్బిచనుగుబ్బలసందున నాట్యమాడఁగన్.

ఉ॥ వీసపుముక్కునత్తు నరవీసపుమంగళసూత్ర మమ్మినన్
గాసును రాని కమ్మలరకాసును రానివి పచ్చఁబూసలున్
మాసినచీరఁ గట్టి యవమాన మెసంగఁగ నేఁడు రాఁగ నా
కాసలనాటివారి కనకాంగిని జూచితి నీళ్ళరేవునన్.

సీ॥ హరినీలముల కప్పు లణఁగించునునుగొప్పు
విడఁ బువ్వుదండ దా వీడఁబాఱఁ
గోటిచందురుడాలు గీటు సేయగజాలు
మొగముకుంకుమచుక్క సొగసు గులుక
నలజక్కవలటెక్కు లణఁగఁ ద్రొక్కఁగ నిక్కు
పాలిండ్లపై నాఁచు పైఁట జాఱ
నిసుకతిన్నెలమెట్టు పసిఁడిచెంపలఁగొట్టు
పిఱుఁదుపై మొలనూలు బెళుకుఁదేర

గీ॥ చిగురుకెమ్మోవి పగడంపు జిగియు మెఱయ
మాటలాడఁగఁ గనుదోయితేట లమరఁ
జెమట లూరంగ సింహాద్రి చేరవచ్చె
భోగగుణధామ యాంధ్రనియోగిభామ.



సీ॥ విడినకొప్పున జాజివిరు లొప్పఁగా వ్రాల
చుట్టుకుంకుమచుక్కబొట్టు చెదర
చక్కఁగాఁ బటువారు సందెడుకుచ్చెళ్ళు
చెలఁగు మెట్టియలపైఁ జిందులాడ
కొదమగుబ్బలఁ బైఁటకొంగు సయ్యన జాఱ
ముక్కు నత్తొకవింత ముద్దు గుల్క
మొలగంట లిమ్మగు మ్రోఁతతో రంజిల్లఁ
గనకంపుటందియల్ ఘల్లురనఁగ

గీ॥ పొసఁగుకర్పూరవీడ్యము ల్పొందుపఱచి
యనుఁగుఁజేడెలతో ముచ్చటాడికొనుచు
నలరుసింహాద్రిపై కెక్కి హర్షమునను
వచ్చెఁ గలకంఠి వేపారిమచ్చెకంటి.

సీ॥ జిలుఁగైన చెంగావి జిగిమీఱుకుచ్చెళ్ళు
చిన్ని మెట్టెలమీఁదఁ జిందులాడ
నీటైనరత్నాల తాటంకముల కాంతి
కుల్కుగుబ్బలమీఁద గునిసియాడ
గుఱుతైనయపరంజి గొప్పముత్తెపునత్తు
మోవిపై నొకవింత ముద్దుగుల్క
తీరైనముత్యాలహారముల్ మేలిమై
మెఱుఁగుఁజెక్కులతోడ మేలమాడ

గీ॥ గంధకస్తురివాసనల్ గమ్మనంగ
నలరువిలుకానిచేతి పూవమ్మనంగ
కాళ్లనందెలు గలుగల్లు గల్లనంగ
సొగసు గుల్కంగ వేపారిసుదతి వచ్చె.

సీ॥ మీఁగాళ్ళఁజీరాడ మేలైనసరకుతోఁ
దీరుగా మడిచీర దీర్చి గట్టి
బిగువుగుబ్బలమీఁద నిగనిగ ల్దళుకొత్త
నోరపయ్యెదకొంగు జాఱవైచి
వలపుల కొకవింత గలుగ బా గొప్పఁగాఁ
గురులు నున్నగ దువ్వి కొప్పు వెట్టి
నెలవంక నామంబు సలలితంబుగ నుంచి
తిరుచూర్ణ మా మీఁద తీర్పుచేసి

గీ॥ యోరచూపుల విటులఁ దా నూరడించి
గిల్కు మెట్టెల రవరవ ల్గుల్కరింపఁ
జికిలి చేసినతామ్రంపుఁజెంబు పూని
వీథి నేతెంచె సాతానివెలఁది యొకతె.

ఉ॥ వాసన గల్గుమేను నిడువాలుకనుంగువ గబ్బిగుబ్బలున్
కేసరిమధ్యమున్ మదనకేళికి నింపగుబాహుమూలవి
న్యాసము గల్గినట్టి యెలనాఁగను బోగముదానిఁ జేయ కా
దాసరిదానిఁ జేసినవిధాతను నేమనవచ్చు నీశ్వరా!

సీ॥ పొలుపొందఁగ విభూతిబొట్టు నెన్నొసలిపైఁ
దళుకొత్తు చెమట కుత్తలపడంగ
సొగసుగాఁ బూదండ జోపినకీల్గొప్పు
జాఱఁగా నొకచేత సరుదుకొనఁగ
బిగిచన్నుఁగవమీఁద బిరుసుపయ్యెదచెంగు
దిగజాఱి శివసూత్ర మగపడంగఁ
ముక్కున హురుమంజి ముత్యాలముంగర
కమ్మవాతెఱమీఁద గంతు లిడఁగఁ

గీ॥ గౌను జవ్వాడ మెట్టియల్ గదిసి మ్రోయఁ
గమ్మవిలుకాని జాళువాబొమ్మ యనఁగ
మెల్ల మెల్లన సింహాద్రిమీఁది కేఁగెఁ
గన్నెపూఁబోఁడి యగసాలివన్నెలాఁడి.

ఉ॥ వాలగుకన్నుదోయి బిగువట్రువగుబ్బలు కారుచీకటిం
జాల హసించుకొప్పుజిగి సారసము న్నగు మోము గల్గునా
బాలికఁ గూలి కమ్ముకొన బట్టలు నేసెడివాని కిచ్చె హా
సాలెత గాదురా కుసుమసాయకు పట్టపుదంతి యింతియే.

ఉ॥ కుమ్మరివారిబాలిక చకోరవిలోచన ముద్దుగుమ్మ యా
వమ్ముదరిన్ రసామలినవస్త్రము చుంగులు జాఱఁ గట్టి తాఁ
గమ్మని మ్రోఁతతోఁ గరనఖమ్ముల భాండము లంగజాస్త్రపా
త మ్మనఁ బ్రోవు దీసె విటతండముగుండియ లారవిచ్చఁగన్.



సీ॥ తల్కుతళ్కనుకాంతి బెళ్కు కెంపులముంగ
రందమై కెమ్మోవియందుఁ గుల్క
ధగధగద్ధగలచే దనరారు బంగారు
గొలుసులింగపుకాయ కొమరు మిగుల
నిగనిగన్నిగలచే నెగడు చెల్వపుగబ్బి
గుబ్బ లురంబున నిబ్బరింప
రాజహంసవిలాసరాజితం బగుయాన
మందు మెట్టెలు రెండు సందడింప

గీ॥ సరసదృక్కుల విటులను గరఁగఁజూచి
పొందికైనట్టి మోమున భూతిరేఖ
రాజకళ నొప్ప నద్దంకిరాజవీథిఁ
బొలిచె నొకబొమ్మ గాజులముద్దుగుమ్మ.

సీ॥ మకరధ్వజునికొంప నొకచెంప గనుపింపఁ
జీర గట్టినదయా చిగురుఁబోఁడి
యుభయకక్షములందు నురుదీర్ఘతరము లౌ
నెఱులు పెంచినదయా నీలవేణి
పసపువాసన గ్రమ్మఁబైటచేలము లెస్స
ముసుకు పెట్టినదయా ముద్దుగుమ్మ
పూర్ణచంద్రునిబోలి పొసఁగ సింధూరంపు
బొట్టు పెట్టినదయా పొలతి నుదుట

గీ॥ ఎమ్మె మీఱంగ నిత్తడి సొమ్ములలర
నోరచూపులు గుల్క సింగార మొల్క
కల్కి యేతెంచె మరునిరాచిల్క యనఁగ
వలపులకు పేటి యొక యొడ్డెకులవధూటి.

క॥ నిబ్బరపుఁ గలికిచూపులు
జబ్బించుక లేనిపిఱుఁదు సన్నపునడుమున్
మబ్బుకురు లుబ్బుకుచములు
బిబ్బీలకుఁ గాక కలవె పృథివీస్థలిపై.

శా॥ పొచ్చెం బింతయులేక హంసనడతోఁబొల్పొందులే నవ్వుతోఁ
బచ్చల్దాపినకుల్కు ముంగరరుచిన్ బాగైనకెమ్మోవితో
నచ్చంబైన ముసుంగు వెట్టి చెలితో నామాటలే చెప్పుచున్
వచ్చెన్ బో కుచకుంభముల్గదలఁగా వామాక్షి దా నీళ్ళకున్

ఉ॥ దుష్పరివారశూన్యగతితో మెఱుఁగై సరసోచితోల్లస
త్పుష్పశరాసన క్రియకుఁ బొల్పెసలారి మనోహరంబు నౌ
పుష్పసుగంధ్యనంగగృహపుణ్యమునన్ భుజియింపఁగల్గెవా
స్తోష్పతి కెన్ని యున్న సరితూఁగినవే యొక శోభనంబుతోన్.

క॥ ఆకదురునఁ బికరవమున్
ఆకదురున భృంగరవము నాత్మరవంబున్
ఏకీకృతముగ నేకు ల
నేకులు విన వడికె ముదిర యేకులముదిరా!

ఉ॥ గుబ్బలగుమ్మ లేఁజిగురుఁగొమ్మ సువర్ణపుఁగీలుబొమ్మ బల్
గబ్బిమిటారిచూపులది కాఁపుది దానికి నేల యొక్కనిం
బెబ్బులి నంటగట్టితివి పెద్దవు ని న్ననరాదురోరి దా
నబ్బ ! పయోజగర్భ! మగ నాలికి నింత విలాస మేటికిన్.

శా॥ దాయాదుల్వలె గుబ్బచన్ను లొఱయన్ ధావళ్యనేత్రాంబుజ
చ్ఛాయల్ తాండవమాడఁ గేరి పురుషస్వాంతమ్మునన్ మన్మథుం
దేయం జంగమువారి చంద్రముఖి విశ్వేశార్చనావేళలన్
వాయించెం గిరిగిండ్లు బాహుకుశల వ్యాపారపారీణతన్.

ఉ॥ పువ్వులు కొప్పునం దుఱిమి ముందుగఁ గౌ నసియాడుచుండఁగా
జెవ్వనఁ జంగసాఁచి యొకచేతను రోఁకలి పూని యొయ్యనన్
నవ్వుముఖంబుతోడఁదననందనుఁ బాడుచు నాథుఁజూచుచున్
సువ్వియసువ్వి యంచు నొకసుందరి బియ్యము దంచె ముంగిటన్.

సీ॥ బొమవింటఁ దొడిగిన పూవింటిదొరముల్కి
పోలిఁ గస్తురిసోఁగబొట్టు దీర్చి
చకచక లీను తారకలరేకులువోలెఁ
గొలుకులు వెడలఁ గజ్జలము దీర్చి
పొడుపుగుబ్బలిమీఁదఁ బొడమునీరెండ నా
రంగుచందురకావిరైఁక దొడిగి
పిఱుఁదుపొక్కిలి యనుమెఱకపల్లము గప్పఁ
బాలవెల్లువవంటి చేల గట్టి

గీ॥ అంచకొదమలగమి బెదరించుపోల్కి
నందెచప్పుళ్ళు ఘల్లుఘల్లనుచు మొఱయ
నడుము జవజవలాడఁ గీల్జడ ఘటించి
వచ్చె ముక్కంటిసేవకు మచ్చెకంటి



సీ॥ తాటంకయుగధగద్ధగిత కాంతిచ్ఛటల్
చెక్కుటద్దములపై జీరువార
నిటలేందుహరినీలకుటిలకుంతలములు
చిన్నారిమోమునఁ జిందు ద్రొక్క
బంధురమౌక్తిక ప్రకటహారావలుల్
గుబ్బచన్నులమీఁద గునిసియాడఁ
గరకంకణక్వణక్వణనిక్వణంబులు
పలుమారు ఱొతిపైఁ బరిఢవిల్ల

గీ॥ ఓరచూపుల విటచిత్త మూఁగులాడ
బాహుకుశలతఁ జక్కని మోహనాంగి
పాటఁబాఁడుచుఁ గూర్చుండి రోటిమీఁదఁ
బిండి రుబ్బంగఁ గన్నులపండు వయ్యె.

ఉ॥ కూటమి నొక్కనాటికిఁ ద్రికోణసహస్రములం బగుల్చునీ
ధాటికిఁ జల్లడంబులును దారుణగోణము లంచుగోచులున్
శాటులు నోర్వఁగాఁగలవె! చాలును నీదు విజృంభణం బయో
యేటికి లేవఁబాఱితివి యీసరిప్రొద్దుకడం బ్రజాపతీ!

ఉ॥ మాపటికొండవీటికసుమాలపుఁదొత్తులఁజూచి యేల యు
త్థాపనశక్తి చూపెదవు దబ్బఱశిశ్నమ! వారిసోమన
శ్చాపగృహాంతరాళతలజాగ్రదుదగ్రనిరర్గళవ్రణో
ద్దీపితకాలకూటవిషదిగ్ధశరీరుల ము న్నెఱుంగవే!

చ॥ సడి గలవంటగుంటకులసంభవ వేంకటభట్లయింటిలో
వడు గని చేరవత్తురట వచ్చిన బ్రాహ్మల కేమి వెట్టునో
పిడుకలఁ బెట్టునో మఱియుఁబీఁటల బెట్టునొ ఱాలఁ బెట్టునో
తడఁబడ లేవఁ ద్రోలి తనదడ్డొక టడ్డము బెట్టి కొట్టునో?

ఇప్పుడు నే నిక్కడ నుదాహరించినవిగాక యింకను బెక్కు పద్యములు నానాజాతి స్త్రీస్వభావాదివర్ణనములు గలవి శ్రీనాథకృతములుగా వినవచ్చుచున్నవి. ఇందు నేనుదాహరించినవానిలో నేవేని కొన్నిగాని యింకను నట్లు వినవచ్చువానిలోఁ గొన్నిగాని నిజముగా శ్రీనాథకృతములు గాకయుఁ బోవచ్చును. ఇట్లనుటకు సాధకము నీ క్రింది విషయమును బెక్కేండ్లకు మునుపే చాటుపద్యమణిమంజరిలోఁ బ్రకటించితిని.

ఉ॥ చూడఁగ నల్పుగాని పరిశోభితదివ్యకురంగనాభ మే
జాడను? రాజయోగ్య మగుజవ్వని నల్లనిమేనిసంచు తో
డాడఁగ రాదుగా! రతిరహస్య మెఱింగినఁ జిత్తసంభవ
క్రీడలఁ దేరి చూడవలె గేదగిగంగి విచిత్రవైఖరుల్.

ఉ॥ భూతలమందు ధాతకు నపూజ్యత గల్గెను రెంటమూఁట భా
గోతులబుచ్చిగాని కొక కొంచె మనంగగృహంబు సేయమిన్
భీతకురంగనేత్ర యగుపెండెలనాగికి మర్మజాతసం
ఘాతము లుంచినందుకును గంగిని నల్పొనరించినందుకున్.

అను పద్యములు శ్రీనాథకృతములుగాఁ వినఁబడుచున్నవి. కాని, యీ పద్యములు తురగారామకవిగ్రామణి వని యీ క్రిందిపద్యము నిరూపించుచున్నది.

ఉ॥ పెండెలనాగి కొప్పుపయిఁ బెద్దికటిస్థలి గంగిగుబ్బచ
న్గొండల నుండురామకవికుంజరుహస్తము క్రిందు సేసె హా
పండక బంటుపల్లి; యది పండిన నీకసుమాలధారుణీ
మండలనాథుఁ బోలునొకమానవమాత్రుని వేఁడఁబోవునే!

మఱియు,

ఉ॥ రాతిరి నేను పస్తు హయరత్నము పస్తు కవీంద్రగాయక
వ్రాతము పస్తు.........................................
......................................................
లేఁతమిటారి నావయసులేమ యుప-కుఁ బస్తు భూవరా!

ఇత్యాది పద్యమును గూడఁ గొందఱు శ్రీనాథకృత మందురు గాని యదియు రామకవికృతమే యని పలువుర పారంపర్యపు వినుకలి, ప్రతికూలప్రమాణములు గలవాని నిట్టివానిని విడనాడవచ్చును. కాని, శ్రీనాథునివిగా వినఁబడుచున్న చాటుధారల నన్నింటిని శ్రీనాథ శత్రువులెవ్వరో కల్పించినా రనువారిస్వకల్పితపువాదమును నేను సంభావింపఁజాలను.

మఱియు“ ఎట్టిజారుఁడయినను దన దుశ్చారిత్రమును దానే ప్రకటించుకొనుచుఁ బద్యముల వ్రాయునా? కావున, శ్రీనాథుఁడు జారుఁ డను నపవాదమాతని కాలములో లేక యాతని యనంతరము చాలఁ గాలమునకుఁ బుట్టియుండునని తలఁపవలసియున్నది” అని యొక యాక్షేపముగలదు. ఈ యాక్షేపమునకు లోకజ్ఞత చక్కఁగా సమాధానము నొసఁగఁగలదు. లోకమున విషయ వాసనల జయింపగలవా రేకాలమునఁ



గాని యసాధారణముగా నుందురు. లౌకిక విషయసముల్లాసముతో నుండువారికి భోగవాంఛలు పొంగారుచుండును. అయినను సర్వసౌభాగ్యములు గల్గియుండియు నందందుఁ గొందఱు సువిరక్తులై, నిర్వికారులై, వీరవ్రతులై వెలయుచుందురు. సాధారణముగా ననేకులు స్వాంతము జజ్జువాఱుచున్నను లోకనిందకు వెఱచియు, సంఘమర్యాదకు జంకియు, నింకను బలుబాధలకు భయపడియు సద్వర్తనమును సాగించుకొనుచుందురు. అట్లువారు పవిత్రవర్తనమును బడయుటగూడ నిజముగా భగవదనుగ్రహాయత్తమే. సన్నివేశములు స్వాధీనములై దుష్ప్రవర్తనమునకుఁ ద్రోవలొసంగుచున్నను, జిత్తము చిదుకుచున్నను, జిత్రముగా నపాయములకందక పవిత్రవర్తనమునే పడయఁ గల్గుచుంట భగవదనుగ్రహాయత్తమే కాదా! రహస్యముగాఁ దమవర్తన మెంతేని క్రుళ్ళువాఱి దుర్గంధిలమై రోఁతగొల్పుచున్నను గొందఱు బాహిరముగాఁ బరిశుద్ధులువోలె శిష్టతను నటించుచు శ్రీరంగనీతు లాడుచుందురు. లోనెల్ల నపవిత్రతతో నిండియుఁ బయికిఁ బరమ వేదాంతములు పలుకుచుఁ గాషాయములఁ దాల్చి సన్యాసివేషములతోఁ గొందఱు పయోముఖవిషకుంభములువోలె లోకమును మోసగించుచుందురు. తా రతి సచ్చరిత్రులయ్యును కొందఱు పయికి దుశ్చరిత్రులువోలెఁ దోఁచునట్లు ప్రవర్తించుచుందురు. తమ సచ్చరిత్రభంగమును జాటుసేయక సంతాపముతో వెల్లడించుకొనుచుఁ గొందఱు కుందుచుందురు. తమ తప్పిదములను దప్పిదములుఁగాఁ గూడఁ దలఁపక కొందఱు కొండాడుకొనుచుందురు. తప్పిదముల బలములు గూడఁ గాలభేదములబట్టి తార్మారగుచుండును. ఒక కాలమునఁ బ్రబలముగాఁ దలఁపఁబడు తప్పిదము కాలాంతరమున దుర్బలముగాను, ఒప్పిదముగాను గూడఁ దలఁపఁబడుటయుఁ గలదు. లోక మింత వింతతీరు గలది.

శ్రీనాథుఁడు సుఖదుఃఖములను, లాభనష్టములను, మానావమానములను దనకుఁ దటస్థించినవానిని జాటుసేయక చాటిచెప్పుకొను స్వభావము గలవాఁడు. తన గృహచ్ఛిద్రములను, దేశాటన క్లేశములను, దారిద్ర్యమును, వానివలని యవమానములను నాతఁడు కలకాలము దెలియఁ దగునట్లు కవితలో వెలయఁ జెప్పుకొన్నాడు. నేలపన్ను నీయఁజాలకపోఁగా రాచవారు నగరివాకిట నిలఁబెట్టి భుజముపై నల్లగుండు మోపుటను, చేతులకు వెదురు గొడియ వేయుటను, కాళ్ళకు నిగళయుగళము దగిలించుటను, నెదురెండలో నూరివీథులఁ ద్రిప్పుటను అవమానములని యడఁచిపుచ్చక చాటిచెప్పుకొన్న జగజెట్టికి శ్రీనాథునకిఁకఁ దనవలచి వర్తించిన శృంగార వర్తనమును గూర్చియా సిగ్గుపాటు: అతఁడు దానినొక ప్రాభవవిశేషముగానే పరిగణించెను. అతఁడేకాదు; ఆతని నాదరించిన యా కాలపు మంత్రులుగూడ

నట్లే పరిగణించిరి. కాకున్నచో భీమఖండమునఁ “గాంచీమౌక్తికతారహా” రేత్యాదిపద్యమును రచించుట యెట్లు?

## కవులు గొంద ఱిట్టివారు గలరు

కవికులతిలక మగుకాళిదాసునిఁ గూర్చియు నిటువంటి ప్రతీతి గలదు.

అనుష్టుప్॥

ధన్యాం విలాసినీం మన్యే కాళిదాసో య దేతయా
నిబద్ధ స్స్వగుణై రేవ శకుంత ఇవ పంజరే.

ఇత్యాది శ్లోకములు తజ్ జ్ఞాపకములు గలవు. మేఘదూతమున నాతఁడు –

మందాక్రాంతము॥
జ్ఞాతాస్వాదో వివృతజఘనాం కో విహాతుం సమర్థః (పూర్వ. 41)

అని తన యస్వాదజ్ఞతను జాటుకొన్నాడు.

కవిశేఖరుఁ డగు రాజశేఖరుఁడు:

[1]శా॥ కర్ణాటీదశనాంకిత శ్శితమహారాష్ట్రీ కటాక్షాహతః
ప్రౌఢాన్ధ్రీకుచగుమ్భితః ప్రణయినీభ్రూభంగవిత్రాసితః
లాటీ బాహువివేష్టితశ్చ మలయస్త్రీతర్జనీతర్జిత
స్సోఽయం సంప్రతి రాజశేఖరకవి ర్వారాణసీం వాఞ్ఛతి.

అని తన నానాదేశవిలాసినీభోగానుభూతిని వెల్లడించుకొన్నాఁడు.

ప్రచండపండితకవి యగు జగన్నాథపండితరాయఁడు :

[2]వసంతమాలిక॥

యవనీ నవనీతకోమలాంగీ
శయనీం మమ యాతిచే త్కదాచిత్
అవనీతలమేవ సాధు మన్యే
న వనీ మాఘవనీ వినోదహేతుః

1. ఉద్ధృతము–క్షేమేంద్రుని ఔచిత్యవిచారచర్చనుండి 81 శ్లో.
2. చూ. పండితరాజకావ్యసంగ్రహః పుట 190–585 శ్లో. ( హైదరాబాదు సం. అకాడమీ ప్రకటన 1958.)



అని తన యవనీప్రియత్వపుముచ్చటఁ జెప్పుకొన్నాఁడు. భామినీ విలాసము తత్ప్రియతాజ్ఞాపకముగా రచితమయ్యెనని యైతిహ్యమున్నది. కాశీపట్టణమున విద్వాంసు లీ పండితరాయని బహిష్కరించిరఁట:

ఇట్టివా రింకను గలరు; వీరు సంస్కృతకవులు; తెలుఁగుగవీశ్వరులు నిట్టివారున్నారు. ధూర్జటికవి కాళహస్తీశ్వరశతకమునందు “సంతోషించితిఁ జాలుఁజాలు రతిరాజద్వార సౌఖ్యంబులన్” అని తనిసి విసివినాఁడు.

ఈతనికవితామాధుర్యమునకు మెచ్చి శ్రీకృష్ణదేవరాయలవా రొసఁగిన సమస్యయు నేకవియో చేసిన పూరణములు సుప్రఖ్యాతములు.

చ॥ స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గెనో
యతులితమాధురీమహిమ; హా తెలిసెన్ జగదేక మోహనో
ద్ధతసుకుమారవారవనితాజనతాఘనతాపహారిసం
తతమధురాధరోదితసుధారసధారలఁ గ్రోలుటంజుమీ!

ఈ ధూర్జటిమనుమఁడును కృష్ణరాయవిజయ ప్రబంధకర్తయు నగు కుమారధూర్జటికవికూడఁ బై సమస్యను తన గ్రంథమునఁ బ్రశంసించుకొన్నాఁడు:

సాహితీసమరాంగణసార్వభౌముఁ డగుమహారాజు విద్వద్గోష్ఠిలో నట్టి సమస్యాపూర్తి జరిగినది. అది పూరించిన కవీశ్వరుఁడుగాని, విన్న మహారాజుగాని, అట్టివర్తనముతో నున్న యా కవీశ్వరుఁడు గాని దానికి నేవగించుకొనువారుగా నుందురేని యది సందర్భించునా?

వేయేల? నీతివర్తనము విషయమున భూతకాలము కంటె వర్తమానకాలమే హెచ్చుగాఁగీర్తనీయ మని నానమ్మకము. రాజులకు, రాజమంత్రులకు, రాజాస్థాన కవులకు వేశ్యాప్రియత్వ మొక విభవముగా సమ్మానార్హముగాఁ బూర్వకాలమునఁ బొగడ్త గనుచుండెడి దనుట కెన్నియేని ప్రబలప్రమాణములున్నవి. అది దోషముగా, నవమానకారణముగా, నడఁచి పుచ్చఁదగినయపరాధముగా నేఁటికాలమున నెన్నఁబడుచున్నది. కాని, భూతకాలమునందంతరోఁత లేదు. స్మృతీతిహాసాదులలోని విషయము లనిప్పుడు పేర్కొనను. మహారాజగు శ్రీకృష్ణదేవరాయల యాముక్తమాల్యదలో “భోగినీసంగతికి రాజుపోవుట” వర్ణితమయ్యెను. మఱియు నామహారాజునకు పలువురు భార్యలప్పటికే వెలయుచుండినను శ్రీకాకుళ పుణ్యక్షేత్రమున కరిగి హరివాసరోపవాసవ్రతముతో నున్న నాఁటిరాత్రి యాంధ్రనాయకస్వామి

స్వప్నప్రత్యక్షమై చేసిన యనుగ్రహమును “ఇతోధికబహుప్రేయసీప్రాప్తి” వ్యంజకముగా నుండెను: ఇప్పటికి నించుమించుగా ముప్పదియేండ్లకు మునుపటికాలమువఱకు వర్తిల్లినమహావిద్వాంసుఁడు, మహాప్రతిభాశాలి, మహాకవియగు మాడభూషి వెంకటాచార్యులవారి వేశ్యాప్రియత్వము విఖ్యాతము. వారి ప్రేయసియగు రామావధూటిమేడ నేఁడును గుంటూరఁ గలదు. “అభినవపండితరాయ నిరంకుశచర్య వేంకటాచార్య’ యని వారి బిరుదు. వారి రామావధూటి తారావళిని చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగమునఁ బ్రకటించితిని. అందువిడువఁబడిన పద్యముల నిందుఁ జేర్చుచున్నాను.

సీ॥ ఫలహారమును జేసి పవళింపఁగా వచ్చి
విడె మిచ్చి నేఁడు నేఁ దలకుఁ బోసి
కోవలె నిట పండుకొనుఁడు మీ రని పోయి
జలకంబు లాడి పూసలు ధరించి
లలి జిల్గుమల్లుసెల్లా గట్టి రవిక చే
పట్టి రాఁజూచి యాపాదమస్త
కంబు గాన్పింప మోహంబునఁ బై ఁబడి
గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి కుచయుగంబుఁ

గీ॥ బట్టఁబో రామలక్ష్మి పార్శ్వముననుండి
హుమ్మనుచుఁ బల్క నంత నే నులికి పడఁగ
దానితో నే మనుచు నీవు పూనుకొన్న
ఠీవి మఱవంగఁ దరమె రామావధూటి.

సీ॥ ఒకనాఁటికలలోన నుదయమే నినుఁ బట్టి
రతిగోర నిపుడు నిస్త్రాణఁ జేయు
మధ్యాహ్న మని తెల్పి మధ్యాహ్నమున రాఁగ
విడెముసేయుం డని విడెముసేసి
నంతట నిద్రించి యావల మీయిష్ట
మని కూర్కి లేచినవెనుక జుట్టు
దువ్వెద రమ్మని దువ్వుచు రాత్రికి
సిస లని చేతిలోఁ జేయి వేసి



గీ॥ యిటులఁ దందన సేయునంతటను నిద్ర
మేలుకొని గుండె ఝల్లన మేను మరచి
సొమ్మసిల్లి యొకింత యుసూరు మనుచు
మదిని దపియించుచుంటి రామావధూటి!

సీ॥ కలగంటి నొకరాత్రి కనకాంగి నీతోడ
సమరతితోఁ గేళి సల్పినట్లు
కలగంటి నొకరాత్రి కలకంఠిరో నీ వు
పరతిలో నను గుషాల్పఱిచినట్లు
కలగంటి నొకరాత్రి కలికి గాఢాలింగ
నాదిసౌఖ్యంబుల నలరినట్లు
కలగంటి నొకరాత్రి కమలాక్షి నీతోడ
బంధలీలలఁ జాల బడలినట్లు

గీ॥ ఒక్కరాతిరి కలఁగంటిఁ జొక్కి నేను
నీదుకెమ్మోవి యానుచో నీవు నాదు
పై పెదవి యానుచును ఱెప్పపాటు లేక
మన్ముఖము చూచునట్లు రామావధూటి!

ఈ పరిశీలనమువలన “ నెట్టి జారుఁడయినను తన దుశ్చారిత్రమును దానే ప్రకటించుకొనుచుఁ బద్యముల వ్రాయునా’ యను నాక్షేప మపాస్తమయినది. “స్వచ్ఛమగు శ్రీనాథుని కీర్తిని గళంకితమొనర్చుచు నాతఁడు విషయలోలుఁడని నిరూపించు నైతిహ్యములును జాటు పద్యములను గొన్ని యంధపరంపరగ నాంధ్రలోకమునఁ గొంతకాలమునుండి వ్యాప్తములై యుండుట పాఠకమహాశయు లెఱింగియేయుందురు. మోహాంధకార మూలకములగునీ గాథలను భేదించి వినిర్మలకీర్తితేజోవిరాజితం బగు శ్రీనాథునిదివ్యమూర్తిని నాంధ్రలోకమునకు బ్రకాశింపఁ జేయు విజ్ఞాన భానూదయమునకు శ్రీ శాస్త్రిగారిహృదయమునఁ గూడ నవకాశము లేకపోయినది.” అని శృంగార శ్రీనాథవిమర్శకులు నాపై దెబ్బఁ దీసిరి. ఇప్పటి కించుమించుగా నే నూఱేండ్లకు ముందుండిన శ్రీనాథకవీశ్వరుని చరిత్రమును నేను తద్గ్రంథములను, శాసనములను , నైతిహ్యములను నితర సాధనములను సమకూర్చుకొని శక్తికొలఁదిని జక్కఁజూచి సంధానించితిని. వానిఁబట్టి తత్స్వరూపస్వభావాదులు గొంతవఱ కనుమేయములయ్యెను. పై

విమర్శకులు శ్రీనాథుని నిష్కళంకమూర్తిని జూచిరట! కాని, వాస్తవముగా నేనట్టిదానిఁ జూడలేకపోయితిని. లోక సామాన్యుఁడనయిన నేను నేఁటి కేనూఱేండ్లకుఁ బూర్వమున్న శ్రీనాథునిమూర్తినెట్లు చూడఁగలను? అట్టి దివ్యదృష్టి నాకులేదు. నేను లోకోత్తరుఁడఁ గాను. ఐతిహ్యములు చాటుపద్యములు అంధపరంపరగ వచ్చుచున్నవట: ఓహో! లోకపుగ్రుడ్డి తనమును దివ్యదృష్టిగలవారు వీరుగదా తెలియఁగల్గిరి: అవి మోహాంధకార మూలకములట: ఎవరిదామోహాంధకారము? వీరి వాక్యములు స్వతః ప్రమాణములుగాఁబోలును : విజ్ఞాన భానూదయమునకు నా హృదయమునఁ గూడ నవకాశము లేకపోయెనట: చేయిసాగినట్లెల్లఁ జెలరేగి వ్రాయుచుండు వ్రాఁతల కిట్టివాని కేమని బదుళ్ళు చెప్పవచ్చును?

## లాక్షణికోదాహృతులు

క్రీడాభిరామము శ్రీనాథకృతమే యనుట కింతదాఁక బెక్కు సాధనములఁ జూపితిని. కాని, శృంగార శ్రీనాథముపై విమర్శము వెలయించిన విమర్శవిశారదులింక నొక యాక్షేపమును నిక్షేపించిరి.

"అప్పకవి మొదలయిన యాధునికలాక్షణికు లొకరిద్దఱు క్రీడాభిరామమందలి పద్యములను శ్రీనాథుని వీథినాటకములోనివని యుదాహరించినను బూర్వలాక్షణికులు పలువురు. అందులో శ్రీనాథున కించుమించుగా సమకాలికులగు శ్రీధరాదులు కూడ ఈ గ్రంథమందలి పద్యములను వల్లభరాయని వీథినాటకములోని వనియే తమ లక్షణ గ్రంథములలో నుదాహరించియున్నారు. ఈ విషయము శ్రీశాస్త్రిగారి సిద్ధాంతమునకుఁ బ్రబలబాధకముగాఁ గలదు. శాస్త్రిగా రీ సంగతిని పూర్తిగా విస్మరించి యిందుంగూర్చి యేమియును జర్చింపరయిరి. శ్రీనాథ వల్లభరాయల దొంగతనమును గనిపెట్ట మనపాటి నైపుణ్యము వారికి లేకుండెనో? పై వాక్యములు బూటకంపు బూకరింపులబుంగలు ; దుర్వివేకధురంధరములు. ఎట్లనగా: క్రీడాభిరామమందలి పద్యములను శ్రీనాథుని వీథినాటకములోని వని యుదాహరించినవారు అప్పకవి మొదలయినవారొకరిద్దఱు గారు. నలుగురైదుగురు. అప్పకవీయము, లక్షణదీపిక, వీరరాజీయము, లక్షణసారసంగ్రహము మొదలగు గ్రంథములఁ జూచునది. మఱియు వీ రెల్ల రాధునికులును గారు. ఆధునికులనుట వీరేశలింగము పంతులుగారు



'ఆధునిక కవులు' అని చేసిన కవిచరిత్రవిభాగము ననుసరించినదేని క్రీడాభిరామపద్యములను శ్రీనాథునిపేర నుదాహరించినవారిలోనొకరిద్దఱే యాధునిక కవులలోనివా రగుదురు. కాని, పలువురుమధ్యకవులలోనివారు. క్రీడాభిరామపద్యములను వల్లభరాయనిపేర నుదాహరించి రనుట దబ్బఱ. అట్టి లాక్షణికుఁడొక్కఁడేని నాకుఁ తెలియరాలేదు. అనేకులు లాక్షణికులు శ్రీనాథుని పేరఁ గ్రీడాభిరామపద్యముల నుదాహరింపఁగా నొకరిద్దఱు మాత్రమే యట్లుదాహరించిరనుటయు, నొక్క లాక్షణికుఁడేని వల్లభరాయనిపేర నా పద్యముల నుదాహరింపకపోఁగాఁ బలువురు లాక్షణికులు అందును శ్రీనాథున కించుమించుగా సమకాలమువా రగు శ్రీధరాదులు అట్లుదాహరించిరనుటయు నప్రామాణికోక్తులు. శ్రీధరాదులగు లాక్షణికులు శ్రీనాథున కించుమించుగా సమకాలమువారట: ఇట్లనుటకుఁ బ్రబలప్రమాణములు మృగ్యములు. శ్రీధరుఁడుగాక మఱియిఁక 'ఆదులు' ఎవ్వరు? ఈ విషయములట నా సిద్ధాంతమునకుఁ బ్రబల బాధకములట: అందుచేత నేను వీనిని బూర్తిగా విస్మరించితినట : విమర్శకులు బలేపూర్వపక్షమును వెల్లడించి నా వాదమును సిద్ధాంతముగాకుండఁ జేసిరిగదా! నేనెఱిఁగినంతలో లాక్షణికు లెవ్వరును క్రీడాభిరామపద్యములను వల్లభరాయనిపేర నుదాహరింపలేదు. ప్రబంధరత్నాకర మనుపేర ప్రబంధపద్యములను సంధానించిన పెదపాటి జగన్నాథకవి యొక్కఁడు మాత్రము ( ఈతనిది లక్షణగ్రంథము గాదు.) వల్లభరాయని పేరఁ గ్రీడాభిరామ పద్యముల సేకరించినాఁడు. ఈ విషయమును నేను శృంగార శ్రీనాథమున స్పష్టముగా బేర్కొనియే యుంటిని. ఈ జగన్నాథకవి పెద్దనాదులకుఁ దర్వాతివాఁడు. ఆంధ్రచ్ఛందోలక్షణగ్రంథములలో లక్షణసారము, అథర్వణచ్ఛందము, ఉత్తమగండచ్ఛందము, గోకర్ణచ్ఛందము, కవిగజాంకుశము, కవిసర్పగారుడము, కవిలోక చింతామణి, కవిరాక్షసచ్ఛందము, నీలకంఠచ్ఛందము అనునవి నే నెఱింగినంత వఱకుఁ బ్రాచీనములు. ఇందుఁగొన్ని శ్రీనాథునకుఁ బూర్వమే వెలసినవి. స్థూలదృష్టి నిట్లు చెప్పుటగాని వీనికన్నింటికిని రచనాకాలము స్పష్టముగా నిర్ణయింప శక్యముగాకున్నది. ఇవియెల్ల నముద్రితములు. ఇందుఁ బెక్కింటియునికిగూడ నెఱుఁగరాకున్నది. ఇందు, కవిగజాంకుశము, కవిసర్పగారుడము, లక్షణసారము, కవిసార్వభౌమచ్ఛందము, కవిలోక చింతామణి అనునవి

మాత్రమే సమగ్రముగానో అసమగ్రముగానో దొరకినవి. వీనిలో నెందుఁగాని క్రీడాభిరామపద్యములు గానరావు.

శ్రీనాథునికిఁ జాలఁ దర్వాతివారిలో చిత్రకవి పెద్దన, ముద్దరాజు రామన, గణపవరపు వేంకటకవి యనువారి గ్రంథములు సర్వలక్షణసార సంగ్రహము, కవిసంజీవిని, ప్రయోగరత్నాకరము అనునవి దొరకియున్నవి.

ఆఱేండ్లక్రిందట మైసూరుదొరతనపువారియొద్దనుండి కె.వి. లక్ష్మణరావుగారు కొన్ని తెలుఁగుగ్రంథములను సాహిత్యపరిషత్తునకై కొనిరి. చిత్రకవి పెద్దన సర్వలక్షణ సారసంగ్రహము, హరిభట్టు నృసింహపురాణము మొదలగునవి యవి యాంధ్రసాహిత్యపరిషద్భాండారమున నిప్పుడున్నవి. మైసూరు నుండి రాఁగానే వాని నేను గడముట్టఁ బరిశీలించితిని. వానిఁ గూర్చి కొంత లఘుసూచిక వ్రాసికొంటిని. చిత్రకవి పెద్దనకృతిలో క్రీడాభిరామపద్యమున్నట్టు నేను వ్రాసికొన్న సూచికలోఁ గానరాదు. అం దా పద్యములు లేవనియే నా నమ్మిక . ముద్దరాజురామన గ్రంథమునను, గణపవరపు వేంకటకవి గ్రంథముననుగూడ క్రీడాభిరామపద్యములు వల్లభరాయనిపేర నుదాహృతము లగుట నాకుఁగానరాలేదు.

శ్రీధరచ్ఛంద మింతవఱకు నా కెక్కడను గానరాలేదు. ప్రసిద్ధగ్రంథాలయములం దెందును దాని యునికి తెలియరాలేదు. రంగరాట్ఛందస్సు మొదలగు లక్షణగ్రంథములందు శ్రీధరచ్ఛందములోనివిగా నీ క్రిందిపద్యములుదాహృతము లయ్యెను.

క॥ మయరసతజభగణంబులు
నయధనభయ విలయబంధనశ్రీతేజో
జయములు క్రమమున నొసఁగును
ప్రియసరసవచోభిరామ పిన్నయసోమా!

క॥ సురనరతిర్యగ్గౌరవ
వరగతులగుభూసురాదివర్గాక్షరముల్
గురులఘువులు నరసురగతు
లరిరాయ విఘాల! సోమ! యవనీపాలా!



వీనిఁబట్టి యది 'పిన్నయసోమ' భూపతిపేరఁ జెప్పఁబడినట్లు తెలియనగును. అతఁడారెవీటి బుక్కరాయల వంశమున పూర్వుఁడే యని తలఁపఁదగును. పై పద్యములిట్లు సోమభూపతిసంబోధనముతో నున్నను శ్రీధర ఛ్ఛందస్సులోనివిగా లక్షణగ్రంథములం దుదాహృతములగు పద్యములు పెక్కులు విష్ణుసంబోధనములతోఁగూడనున్నవి. ఇందేపద్యములు సరి యయినవో యెఱుఁగరాదు. ఆ గ్రంథము దొరకినప్పుడుగాని, దానిఁగూర్చి యిదమిత్థ మని నిర్ణయింపఁజాలము. శ్రీధరచ్ఛందము నేనుజూడలేదు. కనుకఁ జెప్పఁజాలను గాని, తక్కిన గ్రంథములందు క్రీడాభిరామపద్యములు వల్లభరాయనిపేర నుదాహృతము లయ్యె ననుట కాధారము నాకుఁ గానరాలేదు. ఇప్పటికిఁ గ్రీడాభిరామము శ్రీనాథకృతము కాదనువారి సర్వవాదములకు శక్యమైనంతవఱకు సమాధానము చెప్పితిని.

## ప్రేమాభిరామము

రావిపాటి త్రిపురాంతక కవీశ్వరుఁడు ప్రేమాభిరామ మను పేర సంస్కృతమున రచియించిన వీథీరూపకము ననుసరించి తెలుఁగున నీ క్రీడాభిరామము రచితమయ్యె నని యిందుఁ గలదు. ప్రేమాభిరామము నేఁడు గానరాదు. ఈ క్రీడాభిరామ మాప్రేమాభిరామచ్ఛాయ ననుసరించి రచింపఁ బడినదే కాని, దానికి సరి యయిన తెనుఁగు గాదు. ఓరుగంటిప్రాంతమున నున్నవాఁడు మఱింగంటి సింగరాచార్యుఁడు సీతాకళ్యాణ మనుగ్రంథమునఁ దాను ప్రేమాభిరామమును ద్విపదకావ్యముగా రచించినట్లు చెప్పుకొన్నాడు. ఆ కవిగ్రంథములు పెక్కులు దొరికినవి గాని ప్రేమాభిరామ ద్విపద దొరకలేదు.

గీ॥ "అనఘ! ప్రేమాభిరామ ధనాభిరామ
కావ్యములు జాతివార్తలు గడలుకొనగ
ద్విపదలుగఁ జేసితిని గడుఁ గృపను నెన్నఁ
బూని షోడశవత్సరములనె మొదల" – ( R.703)

త్రిపురాంతకుఁడాంధ్రకవీశ్వరులలో నిరుపమానుఁడు. తత్కృతి యుదాహరణ [1]మొక్కటిమాత్రము నేఁడు గానవచ్చుచున్నది. ప్రబంధ రత్నావళిలో అంబికాశతకము, చంద్రతారావళి యను తత్ కృతులలోని పద్యము

1.మా. రామకృష్ణకవిగారు దానిఁ బ్రకటించిరి.

లుద్ధృతములై గానవచ్చుచున్నవి. దొరకిన రచనములఁబట్టి చూడఁగా నాకవీశ్వరుని కవిత యతిప్రశస్తమని తలఁపఁదగియున్నది. క్రీడాభిరామ పద్యములకు మూలకల్పము లనఁదగినశ్లోకములు నాకుఁ గొన్ని గానవచ్చినవి. పెదకోమటి వేమారెడ్డిగారు రచియించిన సాహిత్య చింతామణిలోఁ గానవచ్చుటచే నా శ్లోకములు ప్రేమాభిరామములోనివి గావచ్చునని నమ్మవచ్చును.

ఉపేంద్రవజ్ర ॥

పరారి సందర్శితసన్నివేశౌ
పరుత్పరాభూతపయోజకోశౌ
ఇహైషమ స్తాళఫలోపమానౌ
స్తనౌ కియన్తౌ పురతో భవేతామ్.

చ॥ దొరసెము (?) నందు చుట్టుకొని తోరణకట్టె నురోవిభాగమున్.
( చూ. క్రీడా. 288 ప)

ఆర్యా.

తరుణం సర్షపశాకం
నవౌదనం పిచ్ఛిలాని చ దధీని
స్వల్పవ్యయేన సుందరి
గ్రామ్యజనో మృష్ట మశ్నాతి.

ఈ శ్లోకము వృత్తరత్నాకర వ్యాఖ్యలో నుదాహృతమయ్యెను. దీని కీ క్రిందిపద్య మనుకృతియే.

గీ॥ శీతకాలంబు కడి మాడ సేయఁ గుడుచు
భాగ్యవంతుండు తేపాడి పల్లెపట్లఁ
గొఱ్ఱి (గ్రొత్త) యోరెంబు నిగురావకూరతోడఁ
బిచ్ఛిలం బైన నేతితోఁ బెరుగుతోడ (క్రీడా. 56 ప)

'కొఱ్ఱియోరెంబు' అనుచో 'క్రొత్తయోరెంబు' అని కవిపాఠమై యుండవచ్చును

మాలిని॥

పృథులజఘనభారం మన్దమాన్దోలయన్తీ
ప్రచలితకుచకుంభా సంభ్రమత్కర్ణపూరా



మృదుచలదలకాన్తా ముగ్ధపుంభావలీలా
మభినయతి హరిద్రాపేషణచ్ఛద్మనైషా.

స్ర॥ పరిపోటీఖర్వఖర్జూపరతిసమయసం
భ్రాంతసంభోగభంగిన్. (క్రీడా. 110 ప)

## గ్రంథపాతములు

ఇప్పుడు ప్రకటిత మయిన యీ గ్రంథమున గ్రంథపాతములు పెక్కులు గలవు. తంజావూరిలైబ్రరీలో నున్న దీని మాతృక యగుతాళపత్రప్రతి వ్రాఁతలోనే పెక్కు గ్రంథపాతము లున్నవి.దాని మాతృకలోఁగూడ నవి యుండవచ్చును. ఈ కృతి యవతరణిక యెంత గ్రంథముగలదో? అది యిందు లేదు. కాని, యందలి పద్యమొక్కటి మాత్రము ప్రబంధరత్నాకరమునఁ గలదు. దాని నిందింతకుముం దుదాహరించితిని. క్రీడా. 176వ పద్యము 'అందుకొని....గొమలితేకు' తరువాత నొక గ్రంథపాతమున్నట్టున్నది. మాతృకలో నట్లు గానరాదు గాని, గ్రంథసందర్భమునుబట్టి చూడఁగా గొంతగ్రంథలోప మున్నట్టు తోఁచును. ఇట్లే 'అనిన గాంధర్వి' 216 వచనమునకుఁ బూర్వము కొంత గ్రంథపాతము గలదు. తంజావూరిఁ లైబ్రరీలోనే వేఱొక తాళపత్రగ్రంథ సంపుటమున నీ గ్రంథపాతము లోనిదిగాఁ దలఁపఁదగినపద్య మీక్రిందిది గానవచ్చును.

సీ॥ తివిరి గోదావరీతీరదేశంబున
విధవల విషయించె వీనితాత
కాకొల్ని తిరునాళ్ళఁ గలమాసకమ్మల
వెదకి పొందినవాఁడు వీనితండ్రి
వరుసఁ జందురగిరి వాడముండల కెల్ల
వెఱపు దీర్చినవాఁడు వీనియన్న
గర్భ మాదిగ నోరుఁగంటియక్కలవాడ
వలతియై తిరుగాడువాఁడు వీఁడు

ఆ॥వె॥ అనఁగఁ దాత తండ్రి యన్నయుఁ దానును
పొగడు నెగడు నట్టి పుణ్యుఁ డితఁడు
..... ........ .......
..... ....... ......

మఱియు నింతకుముం దుదాహృత మయినపద్యము 'కలసి పెనంగు కాలమున' ఇత్యాదిక మీ పట్టున నుండవలసినది గాఁదగును. 'స్మరదివ్యాగమ' 272 ప. తరువాతగూడ గ్రంథపాతము గలదు. ఇంతదాఁకఁ బేర్కొన్న గ్రంథపాతములందే యే విషయములు గలవో వానిపరిమితి యెంతో యెఱుఁగఁ రాదు. 276 ప.– 280 ప. నడుమ గూడ గ్రంథపాతములు గలవు గాని వానిలోఁ బద్య గద్యభాగములు మాత్రమే లోపించినవి.

## కథావస్తు విమర్శనము

ఓర్గంటివారగు మంచనశర్మ టిట్టిభసెట్టిగారల వృత్తమునుబట్టి వినుకొండకవి రచియించిన యీ వీథినాటకమును బల్లాళరాజుల రాజధాని యగు దోరసముద్రమున నుండి నటులు విచ్చేసి మోపూరి భైరవుని తిరునాళ్ళలోఁ బ్రదర్శించినట్లుగా నేతత్ గ్రంథనిర్మాణము గలదు.

క॥ నటులది దోరసముద్రము
విటులది యోర్గల్లు కవిది వినుకొండమహా
పుటభేదన మీత్రితయము
నిట గూర్చెను బ్రహ్మ రసికు లెల్లను మెచ్చన్. (క్రీడా. 293వ)

కాసల్నాటి మాధవునికుమారుఁడును, మీసాలప్పయ్యగారి మేనల్లుఁడును నగు గోవిందమంచనశర్మ ఓరుఁగంటిలో ఆర్యవాటమునఁ గల కామమంజరి యను వునర్భువునకు ననుపుకాఁడై యుండెను. కార్యాంతర వ్యాసంగమున నాతఁడు కొంతకాలము దేశాంతరమున వసించి యక్కడ మిత్రుఁడయినటిట్టిభ సెట్టితోఁ గూడి తిరిగి యోరుఁగంటి కరుగుదెంచెను. మంచనశర్మకు వలసిన ధనాదివ్యయమును సంపన్నుఁడగుటిట్టభసెట్టిచేఁ బెట్టించుచుండెను. ఆ మిత్రులిర్వురును నొకనాఁటి వేఁకువజామున నేకశిలానగరమునఁ బ్రవేశించి యా నగరవీథులలోని వింతలు విశేషములు సూచుచు, వినోదించుచు రాత్రికి గంతవ్యస్థలమును జేరి యక్కడ కామోత్సవమునకుఁ గడఁగుట యిందలి కథావస్తువు.

ఇట్టి కథలో నేకశిలానగరవీథులలోఁ గన్పట్టుటనుబట్టి, ప్రసక్తానుప్రసక్తము లగుటనుబట్టి వివిధ విషయములు వర్ణితము లయ్యెను. వాని యనుక్రమణి విషయసూచిలోఁ గాననగును.



## ఏకశిలానగరము

ఇందు వర్ణితము లయిన విషయములఁబట్టి యేకశిలానగరస్థితి కొంత వఱకు గుర్తింపనగుచున్నది. నేఁడది పాడుపఱుపఁబడి పరిఖ, ప్రాకారరేఖ, పెద్దగవని, కేశవ శ్రీ స్వయంభూనికేతనముల నేలమట్టములు మొదలగు శిథిల చిహ్నము లల్పముగాఁ గలదై పల్లేరుపాడుగా నున్నది గాన, దాని యానాఁటి సన్నివేశముల గుర్తించుట కీ గ్రంథము గొంత తోడ్పడును. ఆ యీ విషయము నించుక విస్తరింతును.

ఏకశిలానగర ప్రాకారమునకు వెలుపలనుండి టిట్టిభమంచనశర్మలు సూర్యోదయకాలమునఁ జూడఁగా నగరములోని సౌధాగ్రములు గానవచ్చినవి. వా రిర్వురును దొలుత వెలిపాళెమునఁ బ్రవేశించిరి. వెలిపాళె మనఁగా నగరప్రాకారమునకును బరిఖకును వెలితట్టున నున్నగూడెము. ఆవెలివాడలోఁ గట్టకడపట మేదరవాడగలదు. అక్కడ కటకుటీర విలాసినీవర్ణనము కొంత. అటపోవ నొక చండాలాంగన ఋతుస్నానార్థమై వచ్చుట గానవచ్చెను. దీనిఁబట్టి వెలిపాళెము నగరముచుట్టును గలపరిఖకు వెలుపల దాని నంటి చుట్టియేని లేక పెద్దగవనిప్రాంతములం జుట్టియేని కలదనియు నందు దుట్టతుద మేదరవాడకలదనియు నొకప్రక్క చండాలవాటి గలదనియు చండాలస్త్రీ యగడ్త నీటిలో ఋతుస్నానముచేయ నేతెంచెననియుఁ దెలియనగును. అట కొంత చనఁగా నొక కర్ణాటి కుండతో నీళ్ళఁగొంపోవుట గానవచ్చెను. ఆ స్త్రీ నీళ్ళనగడ్త నుండియే కొనిపోవుచుండవచ్చును. దీనిఁ బట్టి యగడ్త జలసమృద్ధ మనియు, నాజలము వెలిపాళెమువారి స్నానపానాదులకుఁ దగియుండెననియుఁ దెలియ నగును. ఆవలవారు హట్టమార్గమునఁ జనిరి. హట్టమార్గ మనఁగా నంగడివీథి నగరములోనికిఁ బోవుముఖ్యమార్గము. అందు 'మైలసంత' గలదు. నగరము లోపాళెమున 'మడిసంత'యు, వెలిపాళెమున 'మైలసంత' యు నుండెడివి గాఁబోలును. మడిసంతలో నున్నతజాతులవారు గొనదగిన వస్తువులు (కూరగాయలు మొదలగునవి) యుండెడివి గాఁబోలును. మైలసంతలో నిమ్నజాతుల వారికిఁ గావలసిన వస్తువు (మత్స్యమాంసాదు) లుండెడివి గాఁబోలును. ఈ మైలసంత యేకశిలానగరముననే కాక విద్యానగరమందును గలదు.[1]

మైలసంతలో 'సుసరభేత్తను మందు నమ్ము మందులదానిని మనకథా

1. దక్షణహిందూదేశ శాసనసంచయము 4 వాల్యుం నెం. శాసనము చూచునది.

పాత్రములు గాంచిరి. ఈ మందును బ్రాహ్మణుఁడగుమంచనశర్మ యింతకుముందెఱుఁగఁడు. కోమటిబిడ్డఁడగు (వర్తకుఁడు గాన కాబోలును) టిట్టిభసెట్టి యెఱుఁగున్నాఁడు (చూ. 77 ప. -80 ప.). ఆనాఁడిట్టిమందులు మైలసంతలో బాహాటముగా ఘోషణముతో నమ్మఁబడుచుండెడి వని తెలియనగును. ఈ సందర్భమునఁ జెప్పఁదగినవి శాస్త్రీయములు, సాంప్రదాయికములు నగు విషయములు పెక్కులు గలవు గాని, విడుచుచున్నాఁడను. నేఁడును 'మందులవా' ళ్ళను పేరఁ బల్లెటూళ్ళలోఁ దిరుగాడు దేసద్రిమ్మరియాఁడువాం డ్రిటువంటి యౌషధములను గుప్తముగా విక్రయించుచుందురు. అట పోవఁగా వెలిపాళెమునడుమ హాలికవాటి గాననయ్యెను. తద్వర్ణనము కొంత. అట చనఁగా వీథివిటంకమున కర్ణాటక వేశ్య గానవచ్చెను. ఈ గ్రంథకర్త యిందింతకుముందు మేదరకరణవేశ్య యని యిక్కడ 'కర్ణాటవేశ్య' యని పేర్కొన్నాఁడు. ఆయా జాతులలో వ్యభిచార వృత్తిలో నుండువారినట్లు పేర్కొనుట కలదు గాఁబోలును. అవలఁ జనఁగా జూదరులగుంపు జూదమాడుచుండుపట్టుగాన వచ్చెను. అక్కడనే 'కనుమయవ్వలిదేశంబుకరణకాంత' యోరగ్రంతను సంపెంగనూనె యమ్ముట గానవచ్చెను. ఓరుఁగంటికిఁ గనుమ యవ్వలిదేశమనఁగా, కర్నూలు మండలమగునో, నల్లఁగొండల పశ్చిమదేశమగునో !సంపెంగనూనెనమ్ము నీ కర్ణాటకాంత తెలికికులపుది. అక్కడి కుత్తరముగా మోహరివాడయు నందు కుట్రపువాఁడు అవికలు కుట్టుటయుఁ గానవచ్చెను. మోహరివాడ యనఁగా యుద్ధభటులుండువాడ యనుకొందును. [1] ఆ వాడ గడచి యుత్తరముగాఁ జనఁగాఁ గొన్నియిండ్లు నందు స్త్రీలు ఈరీర్చుకొనుట, పసుపు నూఱుకొనుట గానవచ్చెను ఇప్పటికి బాహ్యకటకవీథీవిటంకములను మనకథాపాత్రములు దాఁటిరి. లోతైఁనపరిఖ, ఆకాశమంటు ప్రాకారరేఖ, జనసంకులమైనవంకదార (మలుపుద్వారము). స్వర్ణవికారములయిన తలుపులుగల పెద్దగవని అనువానివారు సూచి చేరి ప్రవేశించి చౌరఁబాఱిరి. అట్టువారు చౌరఁ బాఱుటలో రథ, ఘోట, శకట, కరటియాథములయొత్తిడి కోసరిల్లుచుండ వలసెను. "రాజమార్గము ఏనుఁగులు, గుఱ్ఱములు, బండ్లు, భటులు మొదలగువారిచే సంకులమై ధూళిరేఁగుచు కష్టముమీఁదఁ బోవఁదగినదిగా నుండును. కావున, మనమందుఁబోవలదు. క్రంతత్రోవలు కలకలములులేక సుఖవినోదములతో నుండును మఱియు నందుఁబోవుటచే మనకు వేశ్యవాటిక

1. చూ. అనుబంధము.



మధ్యవీథి దఱిసి పోఁగల్గను. అప్పటికి మధ్యాహ్న మగును. అప్పుడు 'అక్కలవాడ' (పూటకూళ్ళ యిండ్లవాడ) చొచ్చుటకు వేడుకై యుండును" (చూ. 114 ప) అని మంచనశర్మ యంతకుముం దానగరమం దున్నవాఁడే కాన యీ విశేషములనెల్లనుపన్యసించి కోమటిబిడ్డ నందుల కంగీకరింపఁ జేసినాఁడు. ఇర్వురును ఆలువరి (వప్రము) క్రిందిత్రోవగా నరిగిరి. అక్కడ పల్నాటివీరులయాలయము గాన వచ్చెను. ఆ వీరులు పల్నాటి వాస్తవ్యులుగాన వారికిఁ బల్నాటనాలయ ముండుట యుక్తమే కాని, పదునాల్గవశతాబ్ది పూర్వార్ధమునాఁటికే యేకశిలానగరమునఁగూడ వారి కాలయము నిర్మితమగుట తత్కథామాహాత్మ్యాదులకానాఁడు తెల్గుదేశమునఁ గల గౌరవమును దెలుపుచున్నది. పల్నాటి వీరచరిత్ర పాడువారి చేష్టలు, తత్కథాప్రకారములు గొంత వర్ణితములయ్యెను. పల్నాటివీరచరిత్ర మాకోవెలలో గచ్చుచేసిన చిత్రంపుగద్దెపలకమీఁదఁ జిత్రిత మయ్యెనట: అటకొంత చనఁగా నేకవీరాదేవిగుడి గాననయ్యెను. తద్వర్ణనమున నేకవీరాదేవి యేయే గ్రామములందు వెలసియున్నదో యాజాత్రలం దేమేమి వింతలు నడచునో అది యెల్లఁగలదు. ఆ కాలమున నేకవీరాదేవి జాత్రలు హెచ్చుగా జరుగుచుండెడివి. నేఁడును ఎఱగొల్లలను పేరి దేసద్రిమ్మరి తెగవాండ్రు ఏకవీరాదేవికథలఁ బాడుచుందురు. పరశురామ విజయము, పరశురామరామాయణము, మాహురమ్మకథ ఇత్యాదులు వారు పాడు ద్విపదప్రబంధము లిప్పుడును గలవు. 'మాహుర' మను పేరు గలగ్రామమున వెలసిన దగుటచే యేకవీరకు, మాహురమ్మ యనియు నామాంతరము. ఏకవీరమ్మ కాకతమ్మకు సైదోడట: ఏకశిలానగరము రాజధానిగా నాంధ్రసామ్రాజ్య మేలినకాకతీయాంధ్ర చక్రవర్తులకు నీ కాకతమ్మ [1] యిలువేల్పు. ఆమెకు సైదోడగుటచే నీ యేకవీరకును గూడ నేకశిలా నగరమునఁ గోవెల వెలసెను. ఏకవీరగుడి గడవఁగానే కామవల్లీ మహాలక్ష్మివలపును బాడుచు నొకజక్కులపురంధ్రి గానవచ్చెను. తత్కథాది వర్ణనము కొంత గలదు. ఇందుఁ గొంత విస్తరించి చెప్పవలసిన విషయ మున్నది. కామవల్లీ మహాలక్ష్మికే కామేశ్వరి యని నామాంతరము. ఏడుగురక్కలలో గడగొట్టుదైనను కామవల్లీ మహాలక్ష్మి ముఖ్యురాలు కావుననామె పేరు ప్రధానముగాఁ బేర్కొనఁబడుచున్నది. తక్కిన యార్వురకును వేర్వేఱు పేరులు గలవు. మొత్తమున వారి కెల్లరకును 'అక్క'అని పేరు. నేఁటికిఁ గూడ సర్వాంధ్రదేశమునను బ్రాహ్మణాది వర్ణములవారికీ కామేశ్వరి

1. చూ. అనుబంధము.

(అక్కలు) యిలువేల్పు. ఈ దేవి యిలువేల్పుగాఁ గల యిండ్లలో వివాహాది శుభకార్యములు జరగినతోడనే యక్కలకొల్పును జరగును. ఆనాఁడేడుగురు ముత్తైదువుల కర్చనము జరుగును. ఆంగ్లేయుల యుద్ధగీతములవలె నుద్రేకజనక మైనగాన ఫణితిని కామేశ్వరిపాట వీరవాద్యములతో నానాఁడు పాడుదురు. ఆ పాట తీవరములో స్త్రీలకు కొందఱకు సివమెత్తును. ఆ యర్చనము జరగునాఁ డెంత తొందరించినను భోజనములగుటకు సూర్యాస్తమయ మగును. " అక్కలు లేచేటప్పటికిక నక్కలు కూస్తయి" అని నానుడి. నే నీ యక్కల కథ నముద్రితములుగానున్న యాదిలక్ష్మీ విలాసము, కామేశ్వరి చరిత్రము ననుగ్రంథముల మూలముఁగనుఁగొనఁ గల్గితిని. [1]కామేశ్వరి నిలవేల్పునుగా నర్చించువారు పలువురెఱుఁగఁ గోరుచున్నారు గాన తత్కథాసారము నిక్కడ తెల్పుచున్నాడను.

## కామేశ్వరి కథ

శ్రీ మహావిష్ణువు శ్రీరామావతారమున నుండఁగా శ్రీమహాలక్ష్మి చూచి తన్మూర్తిని వలచెను. తనవాంఛ దీర్చ నుత్తరీయాంచలము నందుకొని వేఁడెను. రామచంద్రమూర్తి యేకపత్నీవ్రతుఁడ ననెను. అవతారభేదమే కాని నీవు నాభర్తవే యని లక్ష్మీదేవి నిర్భంధించెను. రామచంద్రమూర్తి గర్హించెను. నన్నిట్లీ యవతారమున దుఃఖపెట్టితివి గాన, యింకొకయవతార మెత్తి యిలువడి దప్పి, గొల్లచేడెలఁగాళ్ళ వ్రేళ్ళఁబడి, వేఁడికూడి, జారుఁడని యాఱడిఁ బడుదువుగాక యని యాదిలక్ష్మి రామచంద్రమూర్తిని శపించెను. రాముఁడు ప్రతిశాపమిచ్చెను. "సరే కాని, యానాఁడు నీవుగూడ ఆదిలక్ష్మి కామేశ్వరి యను పేర వెలసి నామీఁది మోహమున నవయుచునే యుండెదవు పొమ్ము"అని. ఆదిలక్ష్మి శ్రీ మహావిష్ణువుతో విన్నవించుకొనఁగా "నేను శ్రీకృష్ణావతారమందెదను, నీవు శ్రీమహాదేవునకుఁ బుత్త్రివై వెలసి మద్విరహక్లేశము నందఁగలవు. నేను కల్క్యవతార మందినప్పుడు మరల నీవు నన్నుఁ బొందఁగలవు పొ"మ్మనియెను. శ్రీమహావిష్ణువు కృష్ణావతార మందెను. ఆదిలక్ష్మి మహాతపమున నున్న శివుఁజేరఁబోయి నన్నుఁ బుత్రినిఁగాఁ గాంచుకొన ననుగ్రహింపుమని వేఁడెను. శివుఁడు " నేనిప్పుడు మహాతపమున నుంటిని. గౌరినింకను బెండ్లాడలేదు. అంతదాఁక నీ వీకొలన వసింపుము.

1. కామేశ్వరి పాట 'స్త్రీల పాటలు' అను పేర ఏలూరు మంజువాణి ప్రెస్సులో ముద్రితములయిన మూఁడు సంపుటములలో నొకదానఁగలదు. కాని యదియధికదోషములతో నందదుకులుగా ననన్వితమై యసమగ్రమై యున్నది. ఆ భణితితోనే దానికిఁ బాఠాంతరముగూడఁ గలదు. అది సరిగా మరల ముద్రింపఁదగినది.



గౌరిని బెండ్లాడిన పిదప నీవు నాకుఁ బుత్రివై వెలయఁగలవు" అని యామె నొకకొలన నివసింపఁజేసెను. పిదపఁ గొంతకాలమునకు శివుఁడు గౌరిని బెండ్లాడెను. వా రిర్వురు దాంపత్యసౌఖ్యముల నందుచు వినాయక వీరభద్ర కుమారాదులఁ గనిరి. గౌరి యొకనాఁడు దనకుఁ బుత్త్రికాసంతాన మనుగ్రహింపు మని విభుని వేఁడెను. ఆమె వేడుక దీర్పనొకనాఁడు శివుఁ డామెతోఁగూడ లక్ష్మియున్నకొలన జలక్రీడ సల్పుచుండెను. పరస్పర విహారవిలాసక్లేశమున గౌరి యాకొలన నేడుదోసిళ్ళ నీరు ద్రావెను. లక్ష్మి యా నీటితో గర్భమునఁ బ్రవేశించెను. "సప్తక్రమంబులఁ జవిగొన్నకతన" నామెకు లక్ష్మి సప్తకన్యకలుగా సద్యోగర్భమునఁ బుట్టెను.

"పొడవైన మెఱుఁగుల ప్రోవుచందమున
పెడతల జనియించెఁ బెరవాణి యనఁగ
శిరమున జనియించె శివవాణి యనఁగ
కొప్పున జనియించె కొండవా ణనఁగ
మొగమున జనియించె ముద్దరా లనఁగ
చన్నుల జనియించె జక్కులమ్మనఁగ
కన్నె లార్గురకును గడపటఁ బొడమి
చిన్నారిపొన్నారి చెలియలై యపుడు
అన్నిటఁ గొదలేని యాకారరేఖ
గన్నుల నుదయించెఁ గామవ ల్లనఁగ
ఇటువలె శ్రీలక్ష్మి యేవురై పుట్టె
శర్వాణి వెఱుఁగంది సప్తకన్యకల–"

సర్వేశ్వరుని "నిదేమి వింత? వీరిట్లు కలుగఁ గారణమేమి?" యని గౌరి యడిగెను. శివుఁడు కథయెల్లఁ జెప్పెను. వీరిని గొనిపోయి పెంచుకొందమని గౌరి కోరెను. వీరు మనమాట వినరు.

" ఒకరిపై మోహించి యూరక బ్రమసి
తికమకలను బొంది తిరుగుచుండుదురు
కోమలి యిటువంటి కూఁతు లేమిటికి
పోదము రమ్మన పురహారుం డపుడు
మవ్వంపుఁజీరెలు మంచిసొమ్ములును
పువ్వులు గంధకర్పూరంబు లొసఁగి."

వారికిఁ గాపుగాఁ బోతురాజును సృజించి యట నిలిపి తా నరిగెను. ఒకనాఁడు బ్రహ్మదేవుఁ డాకొలనికి వచ్చి వారి స్థితుల నెఱిఁగి దాదెమ్మ యను నామెను వారి పోషణకై సృజించి పోతురాజునకు శాంతి పుట్టింపఁగాఁ దగిన యామెను కూనలమ్మను సృజించి యా పోతురాజునకు భార్యనుగాఁ జేసెను. ఆ కొలని దగ్గఱనే కనకావతీపుర మనునొకపురము నిర్మించి యందు వారికి వలయు సర్వసౌకర్యముల నొడఁగూర్చెను. వారందుండిరి. ఇట్లు కొంతకాలము గడవఁగా కామవల్లి యొకనాఁడు శివునికొల్వున కరిగి తదనుగ్రహము వడసెను.” అప్పుడు

“ఆపార్వతీశ్వరుం డతిసంభ్రమమున
నిరవొప్పయక్షుల నిద్దఱఁ బిలిచి
మురువొప్ప జక్కులముద్రలు చేసి
ఉరుమలు మద్దెల లుపకరణములు
కర మొప్పఁ దగినవి గావించి యిచ్చి
ముత్యాలరంగముల్ మున్నూఱు చేసి
అత్యంతముదముతో నడిగిన వేళఁ
జిందెముల్ బోనముల్ శృంగారములును
అందముల్ పఱికెలు నానందములును
ఆ రీతి సంతస మందగాఁ జేసి
సారెకు ముద్రల జక్కులఁ బిలిచి
రమణ మీవంశ పారంపర్య మెల్ల
కమలాక్షిఁ గొలువుండు కామవల్లెమను
కామవల్లిని గొల్చుఘను లెల్ల మున్నె
ప్రేమతో మిముఁ జాలఁ బ్రియము చేసెదరు”.

అని కట్టడ చేసెను. అట్లు జరుగుచుండెను. ఒకప్పుడు శ్రీకృష్ణమూర్తి బృందావనమునఁ బశువులఁ గాచుచు విహరించుచుండఁగా నీయక్కలు సర్వాభరణభూషితలై యక్కడి కొలన విహరింపనేఁగిరి. “ గుభులు గుభుల్లనఁ గొలనిలో నుఱికి, వాల వాలేవాల వాలవా లనుచు వాలఁ బెట్టుచు” వారెల్లరును నోలలాడుచుండిరి. శ్రీకృష్ణమూర్తి తక్కిన గోపాలకులతో గోవుల నీరు ద్రావింపఁ గొలనికి వచ్చెను. ఆ గోవులు కొలను చీకాకు పఱిచెను. కామవల్లి గోవులను గోపాలకులను శిలలుగా శపియించెను. కృష్ణుడు వారి చీరల హరించి పొన్నచెట్టెక్కి సంగీతముపాడెను. శిలలెల్ల మరల గోవులు గోపాలురు నయిరి.



కామవల్లి కృష్ణగీతాలాపములకుఁ జొక్కి దక్కి దక్కించుకొనఁగోరెను. కృష్ణుఁడు పరస్పరశాపవిధముల నెఱిఁగించెను. కామవల్లి విరహోద్వేగమున మిగుల దుఃఖించి ప్రార్థించెను. ఎపుడు నన్నుఁ జూడఁగోరుదువో అపుడెల్ల నా యాకారరేఖ చూపుదును. దాన నీకుఁ గొంత శాంతి కలుఁగగలదు. మఱియు నీ యవతారమున భీష్మకనృపతికి నీయంశము రుక్మిణి యని జన్మించి నన్నుఁ బొందఁగలదు. దానఁ గొంత నీకు శాంతి కల్గును. మఱియు ధర్మదయాపరు లయినయాస్తికులు నిన్నిలువేల్పుగా నర్చింపఁగలరు. వారి యర్చనలవలనఁ గొంత శాంతి కలుగఁగలదు. వీనిచే మద్విరహవేదనాభరము నోర్వఁగలవు. నిన్నుఁ గొల్చుచుండువారి కభీష్టము లొసఁగుచుండుము. మఱియు ధరణిపై నవివాహిత లగువధువుల నెల్ల నీవు పూనియుండుము. నేను వరులను బూని యుందును. వారిదాంపత్యవే మనదాంపత్య మగును. కల్క్యవతారమునఁ దప్పక నన్ను నీవు పొందఁగలవు” అని వరము లిచ్చెను. కామవల్లి యంశమున రుక్మిణి జనియించి శ్రీకృష్ణునిఁ బొందెను. కామవల్లీమహాదేవి ధరణిపై డెబ్బదిరెండు స్థానముల కొలఁకులందు మహోత్సవము లందుచు వెలయుచున్నది. క్రీడాభిరామవర్ణనములు గూడ మీఁదికథనే సూచించుచున్నవి.

మనకథాపాత్రము లట వెడలికొంత చనఁగా మైలార వీరభటులుగాన వచ్చిరి. ‘మైలారదేవర’ భైరవుని తోడిజోడట: స్కాందపురాణమున నేతన్మాహాత్మ్యముఁ జెప్పుఖండము ‘మైలారఖండ’ మని యొకటి గలదు. మైలార వీరభటుల చేష్టలలో గొరగపడుచు చేయువింతలు గొన్ని వర్ణితములయ్యెను ( చూ. 143, 144 ప.). ఆ వింతల నిప్పుడును దొమ్మరి పడుచులు చేయుచున్నారు. గొరగలు శివార్చాపరు లగు దేశద్రిమ్మరి తెగవారు గాఁబోలును. అట కొంత చనఁగా నీ క్రిందిదేవళము లొక్కటొక్కటిగాఁ గానవచ్చెను. భైరవుని గుడి చమడేశ్వరీ మహాశక్తినగరు, వీరభద్రేశ్వరాగార మంటపము- బౌద్ధవిహారము, ముద్దరాలు ముసానమ్మవసతి, కొమరసామిగుడి, పాండవుల గుడి, తురకమసీదు–వీని కన్నింటికిని నవ్వలఁ గొంతదూరాన గోపురముల మీఁది బంగారుశిఖరములు రవిదీప్తిని బ్రజ్వలించి మేరుశిఖరములుంబోలెఁ దోఁపఁగా, కేశవ స్వయంభూదేవుల దేవాలయములును గానవచ్చెను. అప్పటికి మధ్యాహ్నకాలమయ్యెను. రాచనగరిమోసాలమీఁది గడియారమునఁ బదునాఱు గంటలు మ్రోఁగెను. మనకథా పాత్రములు పూటకూళ్ళింటికి భుజింపఁబోఁదలఁచిరి. ఏతత్కథా

కల్పనాకాలమునాఁటికిఁ గాకతీయ ప్రతాపరుద్రదేవుని రాచనగరు సమధికప్రాభవముతోఁ గలదనియు, దాని మోసాల మీఁద ఘటికాయంత్రము (గడియారము, నేఁటి స్విడ్జర్లండు గడియారము గాదు) గలదనియు, నందు గంటలు గడియకొక్కటిచొప్పున మ్రోఁగుననియుఁ దెలియనగును. మఱియు నానాఁటికే యానగరమునఁ దురకలమసీదుగూడ వెలసినదని యెఱుఁగ నగును. ఆ మసీదు కాకతీయచక్రవర్తుల పాలిత ప్రజలలోఁ దురుష్కులుగూడ నుండుటచే వారి భగవదారాధనార్థ మాచక్రవర్తులచేఁ బరమతాదరముఁబట్టి కట్టింపఁ బడినదిగాఁ దలఁపఁదగునుగాని, తురుష్కులచే స్వవిజయ చిహ్నముగా వెలయింపఁబడినదిగాఁ దలఁపఁదగదు. ఏలనఁగా తురుష్కులా నగరము నాక్రమించుకొన్న తర్వాత దాని కట్టి సౌభాగ్యమే లేదు. ఒక్కపెట్ట సర్వముఁ దుడిచిపెట్టఁబడినది. ఆంధ్రోర్వీశు మోసాలమీఁద గంటలు మ్రోఁగుచుండు కాలమునఁ దురుష్కులు విజయచిహ్నముగా నక్కడ మసీదు గట్టుట సందర్భింపదు.

పూటకూటింటికి మన కథాపాత్రము లరిగిరి. పూటకూటిండ్ల క్కడక్కడ నేఁడువోలె నాడును నాహారమునకే కాక విహారమునకును ననువుగల్గియుండుట వింత. కాని, నాఁడు రూక యిచ్చినచో కప్పురబోగి బియ్యపుసన్నన్నము, గోధుమపిండివంట, గుప్పెఁడు పంచదార, అప్పుడుగాచిన యావునేయి, పెసరుఁబప్పు, కొయ్యెనల్లనఁటి పండ్లు, నాల్గయిదు పచ్చళ్ళు, నూరుగాయలు, లప్పలతోడి కమ్మని పెరుగుగల దొడ్డభోజనము దొరకెడిదఁట: నేఁడో.....!మనకథాపాత్రము లక్కడ కడుపార భుజించి యట వెడలి కొంత చనిరి. మొగలిపూవులమ్ము పుష్పలావి గానవచ్చెను. తద్వర్ణనముగొంత. అట చనఁగా వేశ్యవాటి గానవచ్చెను. అందు, మన్మథామ్నాయవిద్యో పాధ్యాయయు, ప్రతాపరుద్ర ధరణీశోపాత్తగోష్ఠీప్రతిష్ఠాపారీణయు నగుమాచల్దేవి యిల్లు గానవచ్చెను. తద్గృహసౌభాగ్యాదివర్ణనముకొంత. మాచల్దేవి ప్రతాపరుద్రదేవుని 'గోష్ఠీప్రతిష్ఠాపారీణ" యనియె కలదు గాని, 'యుంపుడుకత్తె' యని స్పష్టోక్తి లేదు. ప్రతాపరుద్రదేవుఁడు తౌర్యత్రికప్రియుఁడు. ఆయనయాస్థానమునఁ బలువురు నృత్తగీతవాద్యనిపుణు లుండెడివారు. మాచల్దేవి తద్గోష్ఠిలో గొప్పప్రతిష్ఠ నందినది గావచ్చును. ప్రతాపరుద్ర నృపసార్వభౌముని నాళ్ళలో నేకశిలానగరమున మహైశ్వర్య సంపన్నురాలై మాచల్దేవి యని వేశ్యనిజముగా నున్నదో లేదో కాని, మన శ్రీనాథకవి సార్వభౌమునినాళ్ళలో బెజవాడ నగరమున మహైశ్వర్య సంపన్నురాలై మాచల్దేవి యని వేశ్య యొక్కర్తె గలదు.



ఆమె క్రీ.శ. 1437 ప్రాంతముల బెజవాడ పాపవినాశన దేవరకును, రుద్రపాదములకును బహుగ్రామము లందుఁ దనకుఁ జెల్లివచ్చుచున్న భూముల నెన్నింటినో ధర్మము చేసినది.[1] ఈ విషయమును జెప్పు బెజవాడ శిలాశాసనమున నామె నృత్యము చేయుచున్నట్టు విగ్రహచిత్రముగూడఁ గలదు[2]. ఆమె భాగ్య సంపన్నురాలు, ప్రఖ్యాత నర్తకి, విజయవాటీనివాసిని. కావున, నిట్టియామెను శ్రీనాథకవి సార్వభౌముఁడెఱిఁగుండును. మనకథా పాత్రములు మాచల్దేవియిల్లుదాఁటి యట కొంత చని యింకొక వేశ్యయింట ముకురదీక్షోత్సవమును జూచిరి. 'ముకుర వీక్షావిధానంబు మొదల లేక, వెలపడంతికిఁ గారాదు విటునిఁ గవయ' నట: మదనరేఖ యనునా వారకన్య కీమంచెనశర్మ తండ్రి. ఈతఁడే యాముకురదీక్షను జరపెను. 'శ్రీవర్ధస్వ' మను మంత్రమును జెప్పి యాబాలిక నాశీర్వదించెను. ద్విజేతరుల నాశీర్వదించునప్పుడు నేఁడును "శ్రీవర్ధస్వ" మని యారంభము గల సంస్కృతమంత్రమును బ్రాహ్మణులు పఠింతురు. పై వేశ్యయింటఁ గథాప్రసంగమున మనకథాపాత్ర మగు మంచెనశర్మ శ్రీకాకుళాంధ్రనాయకస్వామికి వైశాఖపూర్ణిమనాఁడు జరగు దవనోత్సవము[3] నాఁటి శృంగార విహారవిశేషములఁ జెప్పినాఁడు. దానిలోని సారాంశములు : కాకుళేశ్వరస్వామి నాగదేవభట్టారకునింట కాఁకరపాదులో వెలసినాఁడు. పసిఁడి కోరను వేఁడిపా లారగించినాఁడు. విప్రకన్యను బొందినాఁడు (ఇది శ్రీకాకుళక్షేత్రమాహాత్మ్యకథలో నున్నది). శ్రీకాకుళ పుణ్యక్షేత్రము పండ్రెండు క్రోశముల చుట్టుకొలత గలది. అక్కడి తిర్నాళ్ళలో నా వెలనాటిదేశపు (ఆ దేశమునకు వెలనాడని పేరు.) బాలవితంతువుల దుర్వర్తనముల జుగుప్సావహ వర్ణన కొంత. ఆ పట్టున శ్రీకాకుళేశ్వరుని యుత్సవమునకు వచ్చినగోవాళ్లు 'బెరసి వెన్నెల గాయంగఁ బేరకమ్మపులిన తలముల' విహరింతురని కలదు. నేఁడు శ్రీకాకుళక్షేత్రము కృష్ణామహానది వలపలియొడ్డున నున్నది. పేరకమ్మపులినతలములనఁగా కృష్ణానదీసైకత ప్రదేశములా యని సందేహము తోఁచును. అట్లేని, కృష్ణానదికే పేరకమ్మయని నామాంతరము గావలెను. అట్లెక్కడనూ గానరాదు. గణపతిదేవ చక్రవర్తి నాఁటిదగు మందరము శిలాశాసనమున ( ఈ గ్రామము శ్రీకాకుళపుకృష్ణ కింకను ఎగువను బెజవాడకు

1.దక్షిణహిందూదేశ శాసనసంచయము. 4 వాల్యూం 773 నెం. శాసనము చూచునది. చూ. అనుబంధము.

2. చూ. చిత్రపటము

3. చూ. అనుబంధము.

నెగువను కృష్ణడాపలియొడ్డునఁగలదు.) మందరము గ్రామముయొక్కయు, దాని లంకయొక్కయు హద్దులలో : "వాయవ్యాం పేరకమ్మనుండి వెళ్ళిన ఇనుంగాలి కాల్వతలపొలమేర" అనియు, "మందరానకున్నూ వెలంగపూండికిన్నీ వాయవ్యము పేరకమ్మనుండి వచ్చినపాయేటితలపడుమటి సీమగాను మందరపు లంక" అనియుఁ గలదు. ఇందు కృష్ణగూడ సరిహద్దులలో వేఱుగాఁ బేర్కొనఁబడినది. 'పేరకమ్మ' పదము గుండ్లకమ్మ వంటిదేమో: అది కృష్ణ ప్రక్కగాఁ బాఱుచుండిన వేఱొకయేఱగునేమో: ఈ విషయ మింకను విచారింపవలసియున్నది.[1] మనకథా పాత్రములు వేశ్యవాటిలో పాములవాని నాగస్వరపుఁబాట, పాములాట, గడీని గంతులు, మేషయుద్ధము, కుక్కుట యుద్ధము చూచిరి. అట పోయి దక్షిణమున 'మధుమావతి' యనువేశ్య యిల్లుగాంచిరి. మధుమావతి మన మంచెనశర్మగారి తండ్రి యగుమాధవ శర్మకు ననుపుఁగత్తె. మధుమావతి చెల్లెలగు మదాలస యీ మంచెనశర్మ మేనమామ యగు మీసాలప్పయద్వివేదులకొడుకు శ్రీధరుఁడు పరిగ్రహించిన ననుపులంజె. అక్కడి వింతలవర్ణనము కొంత. అప్పటికి సూర్యుఁడస్తమించెను. వేశ్యవాటిలో జరగు జారధర్మాసన ప్రశంస గొంత గలదు. ఇట్టిది శ్యామిలకుని పాదతాడితక ప్రహసనమునఁగూడ నున్నది. పిదప, గోధూళిలగ్నమున మన కథాపాత్రము లిర్వురును నార్యవాటికిఁ జేరిరి. ఒక్క తమ్మడిసానియింట విడిసిరి. ఆయింటి పూజరివిధవచేతఁదన రాకఁ గామమంజరికి మంచెనశర్మ యెఱిఁగించెను. నిండువెన్నెల గాయుచుండగా శివనమస్కారచ్ఛలమునఁ బ్రాణనాయకు నాపునర్భువు డాయంబోయి మ్రొక్కి కౌఁగిట దక్కి తనిసెను. కోమటిబిడ్డఁ డగు టిట్టిభునకుఁ గామమంజరీ మంచెనశర్మ లాతమ్మడిసానిఁ దగులుకొల్చిరి. జారజాయాపతులు నిండుజందురునకు గొజ్జంగినీటనర్ఘ్యమును, పచ్చఁగప్పురమున నారతియు నొసఁగి మ్రొక్కి స్వస్తి వేఁడిరి. కథ ముగిసెను.

## కవితా విమర్శము

శ్రీనాథుఁడాంధ్రపద్యముల కబ్బపునిబ్బరపునడక నేర్పినాఁడు. శయ్యాసౌభాగ్య మాతనిరచనలలో సర్వత్ర యతిమాత్రమై సాగును. నన్నయ, నాచన సోమన తొలుత నిట్టిత్రోవద్రొక్కిరి. శ్రీనాథుఁడు దాని ఘంటాపథము

1. శ్రీకాకుళ క్షేత్రమును గూర్చి నేను 'శ్రీకాకుళ శ్రీహరి' శతకపీఠికలో హెచ్చువిషయములు వ్రాసితిని. వాని నక్కడ చూడఁదగును.



గావించెను. అన్నియర్థతలకంటె నధికముగా శయ్యాసౌభాగ్యమునే శ్రీనాథుఁడు చక్కఁ జూచుకొనును. ఈ క్రింది పద్యముఁ జదువుఁడు.

శా॥ ఆకాశాంచలవీథుల న్నిగిడె సంధ్యారాగరేఖావళుల్
పాకోన్నిద్రిత పారిభద్ర పటలీ పాండిత్య వైతండికో
త్సేక స్ఫూర్జిత చండ తాండవరయోద్రేకారభ ట్యుద్భట
శ్రీకంఠ స్థిరకంఠ కోమల జటాశ్రేణి న్విడంబించుచున్. (భీమ. 2-32)

శయ్యబిగింపేకాని యిందర్థంపు సొంపేమున్నది? ఆకాశాంచల వీథులందు సంధ్యారాగ రేఖలు సాగినట్లే యీ పద్యము ప్రథమచరణమునఁ బదరచన సాగినది. తక్కిన చరణములును దానికిఁ దగినట్లు నెగడినవి. కొన్నిచోట్ల నిట్లున్నను నెన్నోచోట్ల శ్రీనాథుఁడు శ్రవణమాత్రముననే సంతోషము గొల్పఁజాలు గడుసరి నుడికారములను సంస్కృతాంధ్రములలో జతన పఱిచి సరసార్థముతోఁ జతుర రచనల నెఱపెను.

సీ॥ హాలాహలం బనునల్లొ నేరెడిపండు
మిసిమింతుఁడును గాక మ్రింగినాఁడు
పెనువ్రేలికొనగోర బిసరుహాసనుమోము
కెందమ్మివిరివోలె గిల్లినాఁడు (భీమ. 1-110)

చంద్రఖండములతో సరివచ్చుననవచ్చు
విమల దంష్ట్రాప్రరోహములవాని (ప్రబంధర. 131 పు)
..... ........ .......
అవఅవ మందు నెఱ్ఱనిచంద్రమల్లెల
చోద్యంపుగుండాలు సొచ్చువారు (క్రీడా. 142 ప)

ఇట్టిచోట్ల ముందు ముచ్చట గొల్పునది పదచమత్కారము. చక్కని శయ్యతో నింత వింతపదముల సంతరింపుతో నర్థంపుసొంపునుగూడ ననుగతపఱుచుట శ్రీనాథుని కవనమందే కాననగును. నన్నయాదులగు నాంధ్ర కవీశ్వరుల రచనములను సవిమర్శముగాఁ జదువు సరసవిద్వాంసుల కెక్కువగా శ్రీనాథుని పద్యములుమాత్రమే జిహ్వా నూఱించును. మఱపునఁ బడకుండ మనసున నత్తుకొనియుండును. నాల్కపై నాట్యమాడుచుండును. శ్రీనాథుని శిష్యులయి యాతని చరణములఁబట్టుకొన్న తర్వాతికవుల కృతులలోఁగూడ, గొన్నింట నట్టిరచనలున్నవి. శ్రీనాథుని తర్వాతికవులకుఁ బలువురకు శ్రీనాథునిరచనలు మేలుబంతులు. పిల్లలమఱ్ఱి పినవీరన, దగ్గుఁబల్లి దుగ్గన,

తెనాలిరామకృష్ణుఁడు, రాధామాధవుఁడు, పింగళి సూరన మొదలగువారు శ్రీనాథఁ రచనలఁ బుడికి పుచ్చుకొనిరి.

మ॥ హరచూడాహరిణాంకవక్రతయుఁ గాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యముల్ దిక్కులన్
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీగేహరంగంబులన్.
(భీమ. 1-11)

శ్రీనాథునిడెందముమెచ్చిన కవిత్వ సందర్భమిట్టిది. శాస్త్ర సంప్రదాయములు, భాషాసంప్రదాయములు, లోఁతుగా నెఱిగినఁగాని యెఱుఁగరానిరచన లీతని కృతులలో దఱచుగా నుండును. ఉపలబ్ధములయిన శ్రీనాథకృతులన్నింటి కంటెఁ గాశీఖండము పరిణత మయినకవితాపాకము గలది. ఈ క్రీడాభిరామరచనము దాని కీడుజోడుగా నున్నది. శ్రీనాథుఁడు దీనిని భీమఖండ హరవిలాస రచనానంతరము కాశీఖండరచనమునకు వెనుకనో ముందో రచియించి యుండును. హరవిలాస రచనము భీమఖండ రచనముతర్వాత జరిగెను.

ఈ గ్రంథమందలి యీ క్రిందిపద్యములతి ప్రశస్తమయినవి.

మంచనవింటివో. ఏకసక్కెముగ, కటిభారము, కమఠావతారము, కందుకకేళి, ఈ మఱియింకనొక్కమఱి, పంచారించిన, వ్రాలనినీ, చాటుప్రౌఢి, ముసుఁగువెట్టిననేమి, మీనవిలోచనంబులు, కొలుచునుజేనవెట్టి, పద్మలోచన, జఱివోని, అమితోత్సాహము, కప్పురబోగి, అఱుఁగౌను, పూవుంబోదులు, పాంథ సీమంతినీ, కద్రూమహాదేవి, మహానృపాల, పారిజాతపుఁబూవు, హో కుమారస్వామి, మలయజగంధి, కంగటికాలు, బంగారు తలుపులు, కలశపాథోరాశి -

ఇత్యాదులు
'వ్రాలని నీచన్నులతో
వ్రాలెడుజక్కవలుసరియె, వలలంబెట్టం
జాలెడి నీ కన్నులతో
బాలకి సదృశములె వలలఁబడు మత్స్యంబుల్' ( 91 ప)

పూత్కారపవనంబు పూరించుపుక్కిళ్ళు
ముసిఁడిపండులతోడ ముద్దుగురియ- ( 224 ప)



జాణవిప్రుండు సిగఁ దాల్చెఁ జందమామ
కొండినాలిక యగునొక్క (మొగలి) కొమలి రేకు - (176 ప)

ముంజెపదనైన శంబరభంజను గేహములు - (211 ప)

జవరాలిఁ బొడగన్న సన్న్యాసిపై నేయు
దులసిలేఁ జిగురాకుఁదూపు మరుఁడు- (212 ప)

పారిజాతపుఁబువ్వు నాఁ బరఁగుఁజూడు
తామ్రచూడంపుఁజూడాపథంపుజొత్తు
దర్పభరమున బ్రహ్మరంధ్రంబు నడుముఁ
జించి వెడలిన క్రోధాగ్నిశిఖయుఁబోలె. ( 234 ప)

[1]బంగారుతలుపులు పాయంగ ధట్టించి
లావణ్యవిత్త మేలా (మెల్లన్?) వ్యయించె - (287 ప)

ఇత్యాది రచనలసౌభాగ్యము సహృదయైకవేద్యమే. "పేర్చినసందడి" నిత్యాదిపద్యము జుగుప్స గల్గించుచున్నది. శ్రీనాథుఁ డిట్టిచాటుపద్యములఁ జాలఁ జెప్పినాఁడు. ఇందలి యాతని '' యువ్వరవొత్తుట''ను శ్రీకృష్ణరాయాదులుగూడఁ గూర్చుకొనిరి.

## అసాధారణ ప్రయోగములు

శ్రీకృష్ణదేవరాయాదు లీ గ్రంథమును బహువారములు పారాయణముచేసి యిందలి మేలిపలుకుబళ్ళను తమ గ్రంథములలో సమకూర్చుకొన్నారు. శబ్దరత్నాకరకారుల కీగ్రంథము దొరకలేదు గాన యిందలి యసాధారణ ప్రయోగములలోఁ గొన్నింటిని, వాని యితర కావ్యానుకరణములను, అర్థములను, నిక్కడ చూపుదును.

1. ఈ పద్యమునకు మూల మనఁదగు శ్లోకమిది చూ.
"లావణ్య ద్రవిణ వ్యయో న గణితః క్లేశో మహానర్జితః
స్వచ్ఛందం చరతో జనస్య హృదయే చింతాజ్వరో నిర్మితః
ఏషాపి స్వగుణానురూప రమణాభావాద్వరాకీ హతా
కోఽర్థశ్చేతసి వేధసా వినిహిత స్తన్వీ మిమాం తన్వతా."
(చూ. ధ్వన్యాలోకము- తృతీయోద్యోతము, ఆనందవర్ధనుఁడు దీనిని ధర్మకీర్తి రచనగాఁ బేర్కొనెను.)

గీ॥ జనని సంస్కృతంబు సకలభాషలకును
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స (క్రీడా 37 ప.)

శ్రీకృష్ణరాయలవా రాముక్తమాల్యదలో దీనినే –

ఎల్లనృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స". (1 – 15)

అని యుదాహరించుకొనిరి. పుట 14. **గొజ్జగింపూనీరు**= పన్నీరు. **జలపోసనము**= మొలాము, నీరూఁదుట. జటిగొన్న = సరిగచుట్టిన. జరిగొన్న, సరిగొన్న, చరిగొన్న జటిగొన్న రూపములలో నేదిసరియో అర్థ మింకేమో అస్పష్టము. చూ. శ. ర.చరికుండ. 'జటివోని (గోని?) గడితంపుఁ జిఱుత చౌకంబుల తొగరుఁబుట్టము' 44 పుటలో ప్రయోగాంతరము. శివరాత్రి మాహాత్మ్యాదులలోఁగూడ నిది గలదు. పుట 154. **అక్కిలఁజేయు**= ముడుచుకొనఁజేయు. **ఇరుచంబడు**=కుదియఁబడు. **గుమ్మడిమూట**= గుమ్మడిపండు నాకృతిని గట్టినమూట. **సుగ్గడితము**=సుఘట్టితము (వస్త్రము). **తోఁపు,రెంటము**=తోఁపువన్నెగల జమిలినూలిదుప్పటి. తట్టువున్న= నిద్దమైనపునుఁగు పుట17. **కోటఁడు**= గ్రుడ్లగూబ. **మాఁగిలి మాఁగిలి** – ఆఁచియాఁచి. పూఁగొమ్మ=పూఁ గొమ్మ. వలతీరు=కుడివైపుగతి. పుట 18. **ధర్మదార**=యుద్ధాంత జ్ఞాపకముగా నూఁదుబాకా. దీని నూఁదినపిదప నిఁక యుద్ధముసేయరాదు. రెండుపక్షములును వైరమునువీడి ధర్మముగా వర్తిల్లవలెను. సంధిజరగిననో, ఏదే నొకపక్షము గెల్చిననో, ఉభయపక్షములకు విశ్రాంతి వలసిననో దీని నూఁదుదురు.

" విఱిగి పాఱఁదొడంగె వీరపనేఁడు
జయలక్ష్మి సేకొని స్వామివా రపుడు
దయ మీఱఁగా **ధర్మదార వట్టించి**
బంగారు బొమ్మను బాండ్యభూనాథుఁ
డింగితవేదియై యిచ్చిన మెచ్చి
తంజాపురము సేరి–" (రఘునాథాభ్యుదయము–12 పొ.)

మేటిదునేదార్ల మెఱయువజీర్ల
ఘోటకమత్తేభకోటులఁ జదిమి
హేలఁ బైపైఁ జొచ్చి యెల్ల శాత్రవులఁ
ద్రోతి పెన్గొండకుఁ ద్రోవల నూఁకి



.....అని వేఁడుకొనిన దయాదృష్టిఁ జూచి
తనరువేడ్కల **ధర్మదారవట్టించి**
సమరంబు సాలించి చయ్యన మరలి"
(సౌగంధికాపహరణము కృత్యవతరణిక)

ఆముక్తమాల్యదలోఁ గూడ నీపదము గలదు. చూ.5 ఆశ్వాసము 150వ పద్యము. కాని యందీపదము నీయర్థముననే కవి ప్రయోగించెనని చెప్పశక్యముగాకున్నది. పద్యము నర్థమును బాఠమును స్పష్టముగా లేవు. ధార దార పదములు వాద్యవాచకములుగా శాసనము లందును ప్రయోగింపఁ బడినవి. చేబ్రోలి శాసనము, బసవపురాణము చూడఁదగును.

"భేరి డమామీలు పిల్లగ్రోవులును
దారలు గిడగిళ్ళు తమ్మటధ్వనులు
నపిరీలు రుంజలు నడవాద్యములును
విపరీతముగ మ్రోసె వినువీథి నిండ". (పల్నాటివీర చరిత్ర)

పు 20. **సొబగువీడు**= ఋతువగు. పు 22. **పచరించు**=ప్రకటించు, వెల్లడిసేయు. **దిస్సువాఱు** = దిస్సు (స్మిత ధ్వన్యనుకరణము) మను, **తీగనవ్వు**=సాగిన నవ్వు. ఈ సీసపద్యమును రాధామాధవకవి యనుకరించెను.

సీ॥ కన్నులార్చుచుఁ గొన్నిసన్నలు గావించుఁ
**దీగనవ్వులు** నవ్వు దిస్సువాఱఁ
బయ్యెద దిగజార్చి పాలిండ్లు పచరించు
నతితిపేరులు చక్క నలవరించు
గాజులచప్పుళ్ళు గలుగల్లు మనఁజేయుఁ
గౌనగోళ్ళ నందంద కురులుదీఁటు
నీలరాగము నెలయించు నించుక జాడఁ
దగవుమాటల జాణతనము లాడు. (రాధామాధవము. 5–112)

పు.23, **వల్లువము**=రొక్కపుజాలె. పు 24. **పటితాళించు**= బెళుకులార్చు. **మైలసంత** = ఊరివెలుపలనుండు నిమ్నజాతులసంత. **సుసరభేత్తు**= సులువుగా రోమములు తొలఁగఁజేయునది. పు 25. **సజ్జికపుఁ జాయ** = కసుగందనివన్నె? ఈ పదమునర్థ మస్పష్టము. 'సజ్జకము' అని కొన్నిచోట్లఁ గలదు. "జడగొప్పులోను నచ్చుపుసజ్జకములైన విరవాదులకు"

ఉత్తర హరివంశము. ఈ రెండు వేఱుపదములేమో విచారణీయము. **తొలుసమర్తయ**= ప్రథమఋతువు. సమర్త' 'సమరత' రూపాంతరములు– 'సమర్తయ'రూపమిది క్రొత్తది. సమర్త+ అకాలంపు' అని ఛేదము సరిగాదు. పు 27. **కుసుమ**=కుసుంభా వర్ణము. పు 28. **పంచారించు**= కుదురునిండి నెలవుకొను, **ణిసిధాత్వర్థము**=ముద్దు. **దిచ్చరించు**= ఉబికివచ్చు. పు 31. **మొరవంక కడియము**= చేటవంపు (అందెవలె) గలకడియము? పు 32. **జంగాళము** = జంఘాలము, హెచ్చు పొడుగు గలిగినది. **తిరుపుటెద్దు**= గానుఁగచుట్టుఁదిరుగునెద్దు. పు 33. **గానులది**= తెలికిది. **మోహరివాడ**= సైనికులవాడ? ( చూ. అనుబంధము) పు34. **గోరఁటయెఱ్ఱులు**= గోరంటాకునెఱ్ఱన గలవి. పుట 35. **గనపపరిఖ**= వ్రాఁతప్రతిలో 'కనపరిఖ' కలదు. గొప్పపరిఖ అర్థము గావచ్చును. **వంకదార**= పెద్దగవనికి ముందుండు మలపుద్వారము. పు 36. **అక్కలవాడ**= వంటలక్కలవాడ, పూఁట కూళ్ళమ్మలవాడ; ఈ పదమిందు 63, 86 పుటలలోఁ గూడఁ గలదు. ఆముక్తమాల్యదలోఁగూడ నీ పద మీయర్థముననే ప్రయుక్తమయ్యెను. 'అక్కలవాడల నరకూళ్ళుమెక్కి' (7–5) కాని, యీ గ్రంథముననే 86 పుటలో 'అక్కలవాడలోని వెలయాంద్రకు' అని యుండుటచే నీ పదమునకు వేశ్యవాటియనికూడ నర్థమేమోయని సందేహముతోఁచును. కాని, యట్లుగా దనుకొందును. పూటఁకూళ్ళ యిళ్లవాడకు దగ్గఱగా వేశ్యవాటిగాని, వేశ్యలయిండ్లుగాని యుండుట నేఁడును గలదు. అట్లే,పూఁటకూళ్ళమ్మల వాడలో వసించువేశ్యలని పైపద్యచరణమున కర్థము గావచ్చును. లేక ' మేదరకరణవేశ్య కర్ణాటవేశ్య' యని యింతకుఁబూర్వము ప్రయోగించినట్టుగా నీకవి పూటఁకూళ్ళమ్మలవాడలో వ్యభిచారవృత్తితో నుండు పూఁటకూళ్ళపొలఁ తులనయిన బేర్కొని యుండవచ్చును. పు 40. **త్రిక్కటి** =త్రికాష్ఠి, తిగటము, ముక్కోణము? పు 41. **గవడపేరు**= పెద్దహారము. గొప్పరుద్రాక్షలమాలకు గవడ రుద్రాక్షలమాలయని, గొప్పరుద్రాక్షలకు గవడకాయలని నేఁడు వ్యవహార మున్నది. 'గవుడ' యని శర. 'కాన కన్న' ఈ పలుకుబడి శ్రీనాథోపజ్ఞమేయేమో? పు 42.కేయూరబాహుచరిత్రమున మంచెన "చారుతరమూర్తి మండూక చక్రవర్తి" యనఁగా శ్రీనాథుఁడిందు "చారుతరకీర్తి,బవనీల చక్రవర్తి" అనెను. ఇట్టి సంవిధానము ననేకు లనుకరించిరి. "సకలగృహవర్తి మూషకచక్రవర్తి" "సకలగృహవర్తి మార్జాలచక్రవర్తి" ఇత్యాది విధములఁ బ్రాచీనులే కాక శ్రీజార్జిచక్రవర్తి పట్టాభిషేక పద్యరచయితలలో నొకరు "సకలగృహవర్తి మా జార్జిచక్రవర్తి" యని కూడ దీని ననుకరించిరి. పు 44. **ఓలగందము**=ఈ



పదమును శ్రీనాథుఁడు పలుచోట్ల ప్రయోగించెను. 'చిఱుబంతిపసుపాడి' యనియుఁ (భీమ 2–28) గల యాతని ప్రయోగాంతరమును బట్టి యీ పదమునకు స్నానసమయమునఁ బూసికొనెడు 'పసుపుపూఁత' యర్థమగు ననుకొందును. సివమెత్తినవారికి స్నానానంతరము గూడ నా పసుపును మొగమునఁ బూయుదురు. కాన, యిక్కడ నా యర్థము సరిపడును. 'చిఱుతచౌకంబుల తొగరుఁబుట్టము'. పాండురంగసుకవి దీనిని గైకొన్నాఁడు. ''కట్టిరి చిఱుత చౌకముల క్రొంబుట్టముల్''. దీనికి సరిగా నర్థము తోఁపలేదు. పు 45. **ఎడపదడప**= అప్పుడప్పుడు. ఈ పలుకుబడిని శ్రీనాథుఁ డు కాశీఖండమునఁ గూడఁ బ్రయోగించెను. ఎడపదడప తనూభవుం డెచట నుండుఁ గానరాఁ డని గృహభర్త కాంతనడుగ' (4'85). **జీవగఱ్ఱ**= వీణ తంతులకు కంబళిపీఁచు చుట్టి యాన్చి యుంచెడు పీఁటవంటి కొయ్య, లేక శ్రుతిని హెచ్చుతగ్గులు చేయుటకుఁ దీగలను జుట్టి తుదిపట్టున గ్రుచ్చియుంచిన చెవివంటి బిరడా. పు 46. **ఉరుమ**= వాద్యభేదము. **పిల్లదురులు**= ధ్వనివిశేషము, పు 47. **చంద్రమల్లెలు**= చంద్రనిప్పులు. **కరవాఁడి**= చేసాన పట్టినది. **హొన్నాళము**= బంగరు పిడిగలది? పు 48. **నెట్టికసీల**= అడ్డిగసీల, **కంఠాభరణము**= మరసీల "అడ్డిగసీలంత ఉన్నదో లేదో ఎంతమాటన్నదో చూడు ఆ పిల్ల." ఇత్యాది వ్యవహారము కృష్ణామండలమున నేఁడును గలదు. ఈ పదము ఆముక్తమాల్యద, ప్రభావతీ ప్రద్యుమ్నము మొదలగు గ్రంథము లందును బ్రయుక్తమయ్యెను. శబ్దరత్నాకరకారులు ఆముక్తమాల్యదలోని "నెట్టన యల్లలచ్చి యల నీలయు భూసతి యుండ నీకు నీ నెట్టికసీలపై మనసు నిల్పుట కే మనవచ్చు" (6–111) పద్యము నుదాహరించి యీ పదమును 'నైష్ఠికశీల' పదపువికృతిగా భావించి సదాచార పరతంత్ర యనియర్థము వ్రాసిరి. కాని యీ ప్రయోగమునకుఁగూడ 'చిట్టిబొట్టెకాయ' యనియే యర్థము యుక్తము. "అరయ నెట్టికసీల లంతలయ్యును బింకమున బ్రహ్మశిఖ ముట్టుప్రోడలార:" అని ప్రభావతీ ప్రద్యుమ్న ప్రయోగము. పు52. **'రెండెనిముదుల్'** 'ఎనిమిదుల్' అనియో 'ఎనిముదుల్' కవి ప్రయోగము. 'రెండుతొమ్మిదులు' అని కాశీఖండప్రయోగము గలదు. ఇక్కడఁగూడ 'రెండెనిమిదుల్' కానవచ్చును. అట్లేని, చిన్నయసూరిగారి సూత్రమునకు వార్తికము చేర్చవలసివచ్చును. పు 53. **తేఁడు**=వెదకు, **బాఁడు**=బ్రాహ్మణుడు, దీనిని గూర్చి నేను ప్రకటించిన లక్ష్మీపుర శాసనమునఁగొంత పరిశీలనము గలదు[1] (విభవ. జ్యేష్ఠ భారతి) **తాలఁబోయు**= తాలింపువెట్టు. **కుఱుబోడ**=?

1. చూ. అనుబంధము.

**బఱివోవు**=హద్దుమీఱు. పు 61. **మయ్యెరన్**=వెంట్రుకతో? ఇది శ్మశ్రుశబ్దవికృతిగావచ్చును. **అడియాలము** =గుర్తు; **అడి**=పాదము, ఆలము=పల్లము, అడుగు పెట్టినచోటఁ బల్లముగ నేర్పడిన పాద చిహ్నము. ఇది వ్యుత్పత్త్యర్థము. ఈ పదమఱవమునఁగలదు. పు 65. **పుల్లసిలు**=కందు, **లేఁబడు**=లేఁతపడు, పు66. **కోడెవిధవల్**=పడచు విధవలు. పు 71. మిహి=క్రొత్త, వింత. పు72. **లత్తెము**=గుత్తి, **ములుగు**=వ్రోఁగు, **గుమ్మడించు**=? పు 73. **దువాళిగొను**=దూఁకు. పు 74. **తస్సి**=డస్సి. **తట్టువాఱు**=చిదుకఁబడు, డీల్పడు. మేంతరాజు= గొట్టెటేఁడు" పు75 [1] **నారికేళబకజాతీయంబులు**=నారికేళ బకములను కొంగలను బోలినవి, కోడిపుంజులు.(కొబ్బరిచెట్లపై వ్రాలు బకములకు నారికేళబకములని పేరుండఁబోలును. తజ్జాతీయము లగు కోళ్ళ కాపేరుండఁ బోలును. కేయూరబాహుచరిత్ర 3 ఆశ్వా. నారికేళబకమను కొక్కెరకథ గలదు)

కII కలిమిఁ దరము గాని వ్యయం
బులు పేరిమ్ములకుఁ జేసి పొలియరె దుర్బు
ద్ధులు నారికేళ బకమను
పులుఁగు దురైశ్వర్యమహిమఁ బొలిసినభంగిన్.

అని తదాది. ఓహరి=? పు 79. **ఆహివెట్టు**= తాకట్టు వెట్టు, పు.80, **ఈఁగకునుబోఁక వెట్టినయిట్టిభంగి**= ....? పు 81 " గుడిలోనుండియు గుడి ఔలనుదీసె వీఁడు" ఈ నానుడి పాండురంగమాహాత్మ్యము (3-68)నఁ గూడఁ గలదు. పు 83. **విడిముడి**= భాగ్యము. **లాఁతు**= అధికము. ఈ పద మాముక్తమాల్యదలోఁ గూడఁ గలదు. **ఘటశాసిపుంగవుండు**[2]= శాస్త్రివర్యుఁడు, ఈ పద మాముక్తమాల్యదలోఁ గూడఁ గలదు. "ఘటశాసుల

1. అనుబంధము చూడుఁడు.

2. ( =తార్కికుఁడు, అర్థజ్ఞానశూన్యముగా వేదమును బఠించువాఁడు. చూ. కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయముపై నాదిండ్ల గోపమంత్రి రచించిన చంద్రికావ్యాఖ్య -

"ఏతే తావదర్థావధారణ విధురాః స్వాధ్యా
యాధ్యయనమాత్రనిరతాః వేదవిప్లవకా ఏవ"

అనుదాని వ్యాఖ్య- "ఏతే ఘటశాసినః అర్థజ్ఞానశూన్యాః, అత ఏవ వేదోపద్రవకారిణః .... ..... .... అర్థావబోధానుష్ఠానయోరభావే ఘటశాసినాం..... స్వత ఏవా యాతి వేదవిప్లవత్వం. ( 2 అం. 54 పుట, నిర్ణయసాగర్ ముద్రణము 1924). చూ. ఆముక్తమాల్యద పర్యాలోకనము పీఠిక. విద్యారత్న శ్రీమాన్ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్య. 1957)



శ్రౌతులఁ దప్పుపట్టుదున్" (7-3) "కొమ్మనఘటశాసి కొంపయుఁ గమలె బమ్మనభట్టిల్లు భగ్గనఁ గాలె" బసవపురాణము 7 ఆ. బిబ్బ బాచయ్యగారి కథలో. ఇది నేఁటి శాస్త్రి, అవధాని బిరుదముల వంటిదిగాఁ బెక్కు శాసనములందును గలదు. పు 85.

గీII మాఘమాసంబు పులివలె మలయుచుండఁ
బచ్చడం బమ్ముకొన్నాఁడు పణములకును
ముదితచన్నులు పొగలేని ముర్మురములు
చలికి నొఱగోయ కేలుండు సైరికుండు.

ఈ పద్యము సాతవాహనగాథాసప్తశతి 3 వ శతకము 39 వ గాథకుఁ దెలుఁగు.

గాII విక్కిణ ఇ మాహమాస
మ్మిపామరో పాఇడిం వ ఇల్లేణ
ణిద్ధూమముమ్మురవ్వి అ
సామలియథణో పడిచ్ఛన్తో.

ఛాయ II విక్రీణీతే మాఘమాసే
పామరః ప్రావరణం బలీవర్దేన
నిర్ధూమముర్మురనిభౌ
శ్యామల్యాః స్తనౌ పశ్యన్.

తన తెనుఁగుసప్తశతినుండి యెత్తి ఈ పద్యమును శ్రీనాథుఁడిందు గూర్చుకొన్నాఁడు. 'పచ్చడం బమ్ముకొన్నాఁడు పసరమునకు' అని పాఠమేని మూలమునకు సరిపోవును. పై పద్యమందలి "పొగ లేనిముర్మురము" లను బాండురంగసుకవి (పాండు. 4-9లో) పరిగ్రహించినాఁడు. "పొగలేని ముర్మురంబులు మగువల పాలిండ్లు భోగమహనీయులకున్." **ఒఱగోయు**= ఒఱనుండి కత్తిని లాగు అనఁగా ప్రతిఘటించు. పు 88. **సోణము**= నాసాస్థి సోడము రూపాంతరము, 'సోడంబుతో ముక్కు వ్రోడుగాఁ గోసి' బసవపురాణము (7 ఆ. సవరద నాచయ్యగారి కథలో) 'సోణా లంట ఘోణాచ్ఛిదన్' (ఆముక్త 5-50) పు 89 **కొత్తెమ**=? పు 95. **దొరసెము**? = పూర్వతరవత్సరము. పుట96 **బడిసివైచు**= దిగఁదుడిచివైచు, హారతిచ్చు. "అటునది దోరసముద్రము నిటునది యోర్గల్లు కడిఁది నినుకొండ మహాపుటభేదనము-" అని ప్రథమ ముద్రణ పాఠము. దీని కర్థములేదు.

**శిథిలశిథిలమై యున్న మూలమును బరిశీలింపఁగా నేను బ్రకటించిన మంచిపాఠము గానవచ్చెను.*** 'కడిఁది వినుకొండ' యని శ్రీనాథుఁడు ప్రయోగింపఁడు. ఆ గ్రామము పేరు వినుకొండ కాని, యినుకొండ కాదు. ఈ గ్రంథమునే యన్యత్ర 'శ్రుతపర్వతదుర్గ' మని వినుకొండ పేర్కొనఁ బడెను. నేనీ సంస్కారము చేయుట తప్పని యొకరు 'భారతి'లో నాక్షేపించిరి. విజ్ఞత లిట్లు వెలయుచున్నవి.

## ముగింపు

బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు తిన్నఁగా మాబోంట్లు కన్నులు తెఱవకపూర్వము అనఁగా నిప్పటి కిర్వదేండ్లకు ముందు అతిప్రశస్తము లయిన యాంధ్రగ్రంథముల ననేకముల గుర్తించిరి. అంత కింకను బూర్వమే శ్రీ వీరేశలింగముపంతులుగారికిఁ గవులచరిత్ర ప్రథమభాగ రచనమునను, ప్రాచీన గ్రంథ ప్రకటనమునను కడుంగడుఁ దోడుపడిరి. వారు గుర్తించిన ప్రకటించిన యాంధ్ర గ్రంథములలోఁ గుమారసంభవము, నీతిసారముక్తావళి, క్రీడాభిరామము నను నవి రత్నత్రయము. త్రిపురాంతకోదాహరణము, శ్రీరంగమాహాత్మ్యము మొదలగునవియు నుత్తమ గ్రంథములు. సంస్కృతమునను వారు చాల విలువగల గ్రంథములు వెల్లడించిరి. వెల్లడించుచున్నారు. సంస్కృతాంధ్ర భాషాభిమానులు వారియెడఁ జాలఁ గృతజ్ఞులు గావలెను. వారియనుజ్ఞగొనియే నేనీ గ్రంథమును సంస్కరించి యుపోద్ఘాతము వ్రాసి యచ్చున కిచ్చితిని.

తంజావూరికిఁబోయి యక్కడ తాటాకుఁబ్రతిలోని పాఠభేదములను ఇంకను నేవేవో నాకుఁదోఁచిన విశేషములను సేకరించి వ్రాసిపెట్టుకొన్న దీని ప్రథమ ముద్రణపుఁ బ్రతి నొకప్పుడు నేను బెజవాడ కరగి యక్కడి రామమోహన గ్రంథాలయమునఁ గోలుపోయితిని. నేనక్కడ నుండఁగా దాని ప్రశంస మిత్రగోష్ఠిలో వచ్చెను. దానిని వారికప్పుడు చూపితిని. ఆ తెలివిడిచే నెవ్వరో ప్రబుద్ధులు దాని నపహరించిరి. ఎందఱతోనో చెప్పితిని. ఎన్నో తంటాలు పడితిని గాని నా కది మరల దొరకలేదు. ఈ పీఠికాంత్యభాగము ముద్రితమగుచుండఁగా దానినాఁటిపోకడతీరు గొంత నేఁటికిఁ దెలియవచ్చినది. ఏమి లాభము : నే నందుకై మరలఁ దొందరపడి యప్పుడే

* తంజావూరి ప్రతిలో నేఁటికి నీ పద్య మిట్లేయుండు ననఁదగినట్లుండుట చూడనగును. (ప్రకాశకుఁడు)



తంజావూరి కరిగి తునాతునుకలై యున్న మాతృక నెట్టెట్టో పొందించుకొని లుప్తభాగములను' సాధుపాఠములను సేకరించుకొని వచ్చితిని. ఈతూరి మరల నెవ్వఁడేని యీ ప్రతి నెత్తుకొనిపోయెనా యిఁక దురుద్ధరమే క్రీడాభిరామము : ప్రత్యంతరమిఁక లేదు : సాధుపాఠ సంపాదన మిఁక శక్యము గాదు ! **దేశ చరిత్ర, సంఘచరిత్ర, భాషా చరిత్రాదులను బరిశీలించువారికి బహూపకారక మయినది శ్రీనాథరచితమయినది, ప్రశస్తరచనము గలది యన్న యభిమానముచేతనే దీని నిప్పుడిట్లు సంస్కరించి మరలఁ బ్రకటించుట.** అంతేకాని, దీనిలోని రోఁతవిషయములమీఁది ప్రీతిచేతఁ గాదు. పామరుల కందకుండఁ బండితులకే విక్రయింతుమని ప్రకటకులు బాసచేసిరి గావునను, గుప్తపఱచుట వ్యాప్తి నధికపఱచును గావునను, యథావస్థితముగా ముద్రించుటే మంచిదని పలువురు ప్రాజ్ఞు లభిప్రాయపడిరి. గావునను, దీనిని వికారపఱుపక యున్నదున్నట్లు ముద్రించితిని. ఈ పీఠికలోఁ గూడఁ దుచ్ఛములయినను గొన్ని శ్రీనాథరచనములను దచ్చరిత్ర ప్రయోజనములను బట్టి, కవితాచమత్కృతి మీఁది యాదరమును బట్టి చేర్చితిని. **శ్రీనాథకవి సార్వభౌముని రచన లేవియుఁ జెడిపోకుండ నెలకొనియుండుఁగాక యనియే నా కోరిక.** ఆ కవి యంత యభ్యర్హితుఁడు. ప్రఖ్యాతాంధ్రవిద్వాంసులతోఁ బలువురతో యోజించి ఈ గ్రంథమిట్లు ముద్రితమగుట యెంతయు నావశ్యకమేయని నిశ్చయించితిని. విద్యావైదుష్య విభవాధికులగు నాంధ్రమహాశయులు గొందఱీ గ్రంథప్రకటనము గూర్చి యొసఁగిన సదభిప్రాయముల నిందు జతకూర్చుచున్నాను. పామరులకుఁ గాక ప్రమాణపత్రమొసఁగిన పండితులకే విక్రయించుటకుఁ బట్టుదలతోఁ గట్టుదిట్టములతో వర్తింతురుగాకని ప్రకటకులను, పామరులకంటఁ బడకుండ నెక్కడఁగాని దీనిమూలమునఁ జెడుగు గలుగకుండ భద్రపఱిచి యుంచుకొందురుగాకని దీనిని గొను ప్రాజ్ఞులను హెచ్చరించుచున్నాఁడను. ఏ నూఱేండ్లనుండి జీవముతోనున్న ఈ గ్రంథమిఁక నంతరింపదు. ప్రాజ్ఞలోకమున కీ గ్రంథము పరితోషము గూర్పఁగలదనియే నా విశ్వాసము.

విభవ
శ్రీకృష్ణ జయంతి
7-9-28

విద్వద్విధేయుఁడు
వేటూరి ప్రభాకరశాస్త్రి

**పీఠికానుబంధము :**

# ౧. కాకతి*

ఇది యొక దేవత పేరు. ఈ దేవత యోరుగంటిని రాజధానిగాఁ జేసికొని యాంధ్రదేశమెల్ల నేలిన యాంధ్ర చక్రవర్తుల కులదైవము. ఈమె పేరినిబట్టి వారు కాకతీయులయిరని పలువురు తలచుచున్నారు. కాకతిపురవరాధీశ్వరు లగుటచేఁ గాకతీయనామము వారికి వచ్చియుండునని మఱియొక్క తలఁపు. దొరికినసాధనముల నెల్లఁ బర్యాలోచించి కాకతీయసంచికలో శ్రీయుత కె. రాఘవాచార్యులు M.A., B.L. గా రిట్లు వ్రాసిరి.

'కాకతీయుల కాపే రెందులకు వచ్చినదో, కాకితమ్మ ( కాకతమ్మ) యన నెవరో మనము విచారింపవలసి యున్నది. ఈ సందర్భమునఁ జరిత్రకారులు పెక్కువిషయముల నుద్ఘాటించుచున్నారు. మనకుఁ దెలిసిన విషయములఁ జర్చించి యామె జైనదేవతయా? కాదా యని విమర్శింపనగును. అనితల్లి కలువచేరుశాసనమున "కాకత్యాః పరశక్తేః కృపయా కూష్మాండవల్లికా కాచిత్ పుత్ర మసూత తదేత త్కుల మనఘం కాకతీయ సంజ్ఞ మభూత్" అని కలదు. రెండవప్రోలరాజు పద్మాక్షీ దేవాలయశాసనము నందలి జినేంద్రస్తుతిచే జైనమతావలంబకుఁడని యూహింపఁ బడుచున్నాఁడు. ఇరువదిరెండవ తీర్థంకరుని దేవి కూష్మాండిని యని జైనగ్రంథములు దెలుపుచున్నవి. వీని నొక దానితో నొకటి ముడివెట్టి కాకతి జైనదేవత యనియు నామెయే కూష్మాండిని యనియుఁ, గాకతి యన గుమ్మడితీగ యనుట దీనిని బలపఱుచుచున్నదనియు, వ్రాయుచున్నారు. కాకతి (కాకిత) యనునది జైనదేవత యని యెచటను దెల్పఁబడియుండలేదు. జైనగ్రంథములఁ గాకతి యనుపేరు గానరాదు. కాకతి యన గుమ్మడితీగ యని నిఘంటువులఁ గాని, మఱియే యితర గ్రంథములఁ గాని లేదు. విద్యానాథకృత ప్రతాపరుద్రీ యమున "కాకతీయకుల దుర్గాదేవీ సమారాధనేన విజయ ప్రస్థాన మంగళం

* 1. ఈ వ్యాసము శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయ పత్రిక యందుఁ బ్రకటితము.



కృత్వా" అని కలదు. రత్నాపణవ్యాఖ్యానమున "కాకతిర్నామ దుర్గాశక్తి రేకశిలానగరేశ్వరాణాం కులదేవతా, సాశక్తిర్భజనీయా అస్యేతి కాకతీయః" అని యున్నది. క్రీడాభిరామమున నీమె ఏకవీరకు సైదోడని వర్ణింపఁబడినది. ప్రతాపచరిత్రమున తమ యిలవేల్పయిన కాకితమ్మకు ఉత్సవములు చేయించి "కాకితదేవి వరప్రసాదంబున ఒక సుతునింగని కాకితప్రోలరాజు అను నామకరణ మొనర్చి" అని వ్రాయఁబడినది. కలువచేరుశాసనమునఁ గూడ నీమె శక్తి స్వరూపిణి యని కలదు గదా. వీనివలనఁ గాకతి యనునది దుర్గకపర నాయధేయమనియు, నామెయే కాకతీయుల కులదేవత యనియు స్పష్టము. మఱి కూష్మాండ వల్లరి నుండి కాకతీయులుద్భవించిరను శాసనభాగమును బరిశీలింప నది స్థానిక గాథలపై నాధారపడి యున్నట్లు తోఁచుచున్నది. మాధవవర్మ కుమారుఁడు పద్మసేనుఁడు సంతానంబు లేమి బుధానుమతంబున సిద్ధేశ్వర శ్రీమన్మహాదేవుని నిత్యంబును గూష్మాండఫలంబులఁ బూజింప, దత్ప్రసాదంబున నొక్క సుతుఁడు గలిగెనని ప్రతాపచరిత్రాదులఁ గలదు. ఇదియే కూష్మాండవల్లరీగాథకు మూలమని తోఁచును. పై విషయములఁ బరిశీలింపఁ గాకతి జైనదేవత యనుటకుఁ దగిన యాధారములు లేవు. అవి దొరకువఱకు నామె దుర్గయే యనియు, నామెను భజించుటచేఁ గాకతీయుల కాపేరు గలిగె ననియు మన మూహింపవలసి యున్నది. కాగతి యను గ్రామమునుండి కాకతిశబ్దము పుట్టినదనియుఁ గొందఱు వ్రాయుచున్నారు. అది సరికాదని తోఁచుచున్నది. నా మిత్రులలో నొకరు బౌద్ధవాఙ్మయమునఁ గాకతిఁయను దేవత యున్నదని తెల్పియున్నారు. ఇదియు భావివిమర్శనములవలన దేలవలసియున్నది. ప్రోలరాజు జైనుఁ డగుటచేఁ గాకతియు జైనదేవతయైఁ యుండునని విల్సనుగా రభిప్రాయపడియున్నారు'.

పానుగంటి శాసనమున "శ్రీమతు కాకతిపురవరాధీశ్వర రుద్రదేవమహారాజునకు" (చూ. కాకతీయ సంచిక 29 నెం. శాసనము) అని కలదు. దీనిఁబట్టి కాకతి గ్రామనామమగునని తత్పురవరాధీశ్వరులు కాకతీయు లయిరని తలఁపవచ్చును. కాని, కాకతి గ్రామనామము గూడ కాకతిశక్తి నివాస మగుటనుబట్టి యేర్పడినది గావచ్చును. మధుర, నాసిక బౌద్ధశాసనములలో కాకతేయ, కాఖండినామములు పేర్కొనఁబడినవి. తొలుత

నా పేరు బౌద్ధుల స్త్రీ దేవత దయియుండవచ్చును. తర్వాత నది హైందవతఁ జెంది శివునిశక్తి పేరయి మార్పుచెంది యుండవచ్చును. కాకాండి, కాకొలను, కావలి, కావూరు మొదలగు గ్రామ నామము లా శివశక్తి పేర నేర్పడినవిగావచ్చును. శక్తి మంత్రములలో 'కాది' మంత్ర మొకటి కలదు. దానికిఁ బంచదశి యనియు నామాంతరము. పంచదశీ మంత్రాద్యక్షరము 'క'. ఆ మంత్రమును గూర్చి 'కాది మతతంత్రము' మొదలగు గ్రంథములు మహావిద్యా విషయకములు గలవు. కాకతి యను పేరు కా+కత్తె సమాసమునుబట్టి యేర్పడినది గావచ్చును. కాది మంత్రాధిదైవతము శివుని శక్తికి మూర్తిభేదము. కాకతి దుర్గయని ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత చెప్పుట పై విధమున సంగతమే కాఁగలదు. నాసిక బౌద్ధగుహాశాసనములలో "కాకతేయ" "కాఖండి" పదములు కూడఁగలవు. కాకతీయులు తొలుత బౌద్ధులుగా నుండవచ్చును. వారు సాతవాహనుల యిక్ష్వాకులచాళుక్యుల సామంతులు గావచ్చును. కాకతీయరాజ్యము ప్రధానముగా వ్యాపించిన కృష్ణాతీర మొకప్పుడు బౌద్ధమత ప్రాచుర్యము గలది. కనుక కాకతి గూడఁ దొలుత బౌద్ధదేవత యగుట సంగతమే. కాకతి, యేకవీర, మాహురమ్మ, మైలారుఁడు, భైరవుడు కాకతీయుల యారాధ్య దైవతములు.

కృష్ణాజిల్లాలోని ముక్త్యాల జమీందారుగారి మ్యూజియమునకై నేను సేకరించిన వానిలో నీ కాకతిదేవి విగ్రహ మున్నది. ముక్త్యాలకు చేరువనున్న దొండపాడు అను గ్రామమున నేఁబది యెకరముల బీడునేల 'కాకతమ్మ బీడు' అనే పేరఁగలదట : అందులో నీ కాకతమ్మ విగ్రహ మున్నది. ఆ గ్రామపు వారీవిగ్రహమును కాకతమ్మ యని పేర్కొందురట. కరణీకపులెక్కలలో నాబీడు కాకతమ్మబీడు అను పేరనే కలదట. దాని విలువను గుర్తించి యా విగ్రహమును జెడకుండ నేను ముక్త్యాలకు జేర్పించితిని*. చేరునప్పటికి ముక్కు కొంతచెడినది. దానిని చూచి నేను ఫోటో తీయించికొని తెచ్చితిని. దానిప్రతిబింబమే యిందు ప్రకటించిన చిత్రము. అసలు రాతివిగ్రహ మిప్పుడు ముక్త్యాలలోఁ గలదు. ఇందీవిగ్రహమునకు నాలుగు చేతు లున్నవి. తలపై కబాయికుళ్ళాయి ఉన్నది. చెవులకుఁ గమ్మలున్నవి. ముందరికుడిచేత డమరుక మున్నది. ముందరి యెడమచేత కపాల(?) మున్నది. కుడివెనుక చేత జింకపిల్ల

*శ్రీ గరికపాటి వేంకటేశ్వర్లుగారి వలన నీ విషయము నేను తెలిసికొని విగ్రహమును తెప్పించితిని..



(?) యున్నది. ఎడమవెనుకటిచేత త్రిశూలమున్నది. నాల్గుచేతులకు మూఁడేసి కంకణములున్నవి. మెడలో కంటె హారము నున్నవి. పాదములకుఁ బాజేబు లున్నవి. పీఠమునకు దిగువను వరాహ మున్నది. కాకతీయకులదైవత మిట్లు దొరకుట నాకుఁ జాల వేడ్కఁ గొల్పినది. ఈ కాకతమ్మ యేకశిలా నగరమున నేకవీరాదేవికి సైదోడుగా వెలసియుండిన దని క్రీడాభిరామమునఁ గలదు. ఆ దేవాలయము, విగ్రహము, నగరము, రాజ్యము నన్నియు నంతరించిపోయినవి గదా! ఏకవీరాదేవివిగ్రహమును గూర్చియు జాయసేనాపతివిగ్రహమునుగూర్చియు వేర్వేఱుగా వ్యాసములను విగ్రహములతోఁ బ్రకటింతును.

ముక్త్యాలప్రాంతములలో ఏకవీర, మాహురమ్మ, కాకతమ్మలుగా గుర్తింపఁదగిన విగ్రహములు మఱికొన్ని నే సేకరించిన వానిలో నున్నవి. అందులో వింత గొలుపు విగ్రహ మింకొకటి యున్నది. అది ప్రాయికముగాఁ బండ్రెండు పదుమూఁడు శతాబ్దుల దయి యుండును. ఒక తురుష్కవీరుఁడు బల్లెమును చేబూని ఒక యేనుఁగుతో పోరాడుచున్నాఁడు. ఏనుఁగుమీద నిద్దఱు వ్యక్తులున్నారు. ఒకరు కాకతీయసేనాని జాయసేనాపతియో యేమో:

## 2. దవనపున్నమ

**వసన్తకాలతృప్త్యర్థం తత్సమృద్ధిభి రాహృతైః**
**పుష్పై ర్నానావిధై ర్దేవ మర్చయే ద్దక్షిణాముఖమ్**
**ఆసీనం మణ్డపేక్లప్తే వేదీమధ్యే మనోరమే**
**ఉద్యానే మందిరే వాపి కృత్రిమోద్యానశోభితే**
**నద్యాదౌ వా యథా యోగం ఫలపుష్పోదకాన్వితే-**

### దమనకోత్సవః

**పౌర్ణమాస్యాం తిథౌ తస్మిన్ మాసే దమనికాదళైః**
**పుష్పాన్వితైః ప్రపాం కృత్వా మణ్డపే పూజయే ద్ధరిమ్**
**పుష్పై ర్దమనికాభిశ్చ సర్వాలంకార మాచరేత్**
**ఉత్సవ శ్చ భవే త్తస్మిన్ హోమో దమనికాదళైః**
**వైశాఖే మాసి వా కుర్యా ద్వసన్తోత్సవ మబ్జజ**

**దమనీదళకళ్యాణ మపి వా పూర్వ మీరితమ్**
**వైశాఖే మాసి వా చైత్రే సితపక్షే శుభేదినే**
**దమనీదళవ త్కుర్యా త్కల్హారకుసుమోత్సవమ్.**

(పాద్మసంహితాయామ్ చర్యాపాదే చతుర్దశోధ్యాయః)

## దవనపున్నమ - దాక్షారామ శాసనములు

(చూ. ద. హిం. శాసనసంచయము 4 వాల్యూం)
నెం. 1368 : 1373

"స్వస్తిశకవరుషంబులు 1209 అగునేంటి చైత్రశుద్ధ దశమియు రవివారమునాండు ఒడ్డ (వా)ది మత్స్యకుల తిలక అర్జునదేవరాజులదేవి దాక్షారామ కొండిక మున్నూంటి ఆట్య గడియపసెట్టి వీరపనేని కూంత్తుఖు అక్కమదేవి శ్రీమద్దాక్షారామభీమేశ్వరమహాదేవరకు చైత్రదవన పర్వమి డోలోత్సవము నాంటి హవిబల్యాది అర్చకు ఒడ్డాదిలో పరిమఖువాడి ఊరు ఆచంద్రార్కస్థాయిగా బెట్టెను. "

"శకవత్సర 1197 గు నేంటి శ్రీమ (త్రి)భువన చక్రవర్తి శ్రీరాజాధిరాజ దేవరవిజ (య) రాజ్యసంవత్సరంబులు 59 గు శ్రాహి (శ్రే)ష్టమాసమున అమావాస్య మంగళవారము నాంటి సూర్యగ్రహణము నాండు దాక్షారామ శ్రీ భీమేశ్వర శ్రీ మహాదేవరకు దవనపున్నమ నాంటి డోలోత్సవము నాంటి అవిబలి అర్చనలకు ఒడ్డాది అర్జునదేవరాజు దేవి కొండిక మున్నూం (టి) అ (డప) గడియనసెట్టి వీరపసేని కూంతురు అక్కాసాన్కి నోముగా అర్జున దేవండు ధారాపూర్వ (కము)గా జేసి ఆచంద్రార్కముగం బెట్టిన మదువాడ(ను) యూరు ఒక్కండు."

## 3. అవీ, ఇవీ [1]

ఈశ్వరసంవత్సర మార్గశిరమాస భారతిలో సూర్యరాయాంధ్రనిఘంటు కార్యస్థానపండితులు శ్రీ పిశుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు 'కొన్ని విశేషములు'

1. 'అవీ, ఇవీ' యనుపేర శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రమాదినామ సంవత్సర కార్తికమాస భారతియందుం బ్రకటించినవ్యాసములలో క్రీడాభిరామమునకు సంబంధించిన విషయములతోడి వ్యాసభాగ మిందుఁ బ్రకటింపఁబడుచున్నది.



అను పేరం బ్రకటించిన యాక్షేపవ్యాసమునకు సమాధాన మీ క్రిందిది. తొలుత వారి యాక్షేపములం జూపి నా సమాధాన మటుపైం జెప్పుదును.

## ఆహివెట్టు

ఆక్షేపము.

**"ఆహివెట్టితి జొన్నగడ్డాగ్రహార**
**వృత్తి యేనూఱురూకల'[2] వృత్తమునకు -** (క్రీడాభిరామము -పొ. 80)

ఇందు 'ఆహివెట్టు=తాకట్టు పెట్టు' అని శ్రీశాస్త్రిగారు (పీఠిక పొ, 123) అర్థము వ్రాసినారు. 80 పొరటలో మూలమునం గూడ నిట్లే యున్నది. కాని 'ఆహివెట్టు' అను పదమే యెక్కడను గాన్పింపదు. కావున నిట 'ఆధివెట్టు' అని యుండవలయును. ఆధిశబ్దమునకుం దాకట్టు అనునర్థము గలదు.

ఈ క్రింది ప్రయోగములోంగూడ 'ఆధివెట్టు' పదము గలదు.

**'గ్రహణసంక్రమణాదుల రాచనగరం**
**గాసువీసంబు వెడలమి గ్రాసమునకు**
**నాధివెట్టిరి క్షేత్రంబులందుం గొన్ని**
**లెస్స యుండునె గృహభర్త లేని బ్రతుకు'**
(మనుచరిత్ర -3-34)"

దీనికి నేం జెప్పుసమాధాన మిది.

నిఘంటువులలో ఏకమాత్ర ప్రయోగముతో ఎన్నో పదములు పరిగృహీతము లయినవి.

వ్రాంతప్రతిలో నున్న "ఆహివెట్టు" ప్రయోగము సరికా దన్న యపనమ్మకము నాకు లేదు కాన దానిని నే దిద్దలేదు. 'ధి ఆ' పద మొకటి 'తాకట్టు ' అర్థము గలది ఉన్నంతమాత్రాన 'ఆహి' ఉండ దనవచ్చునా?

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమున ఎల్లవ్రాంతప్రతులలో 'ఆహికంబులు వెట్టి' అన్న ప్రయోగము గానవచ్చు చున్నది. 'ఆహికంబులు

2. 'రూకలవృత్తమునకు' – అని వ్రాతప్రతిలో నున్నది. అట్లే ముద్రించితిని. "ఏనూఱురూకల విత్తమునకు" అని దిద్దిన సముచితముగా నుండు ననుకొందును. ... వే.ప్ర

వెట్టి యవి దక్కుమితులు సాహసంబునఁ బల్కి" ( చూ. ఉత్తరభాగము). బ్రౌనుదొరగారి పండితులు ఇందు "తాకట్టు పెట్టి" అని యర్థము వ్రాసిరి. తేవప్పెరుమాళ్లయ్యగారు వ్రాఁతప్రతులను బ్రౌనుదొరగారు వ్రాయించిన టీకను బరిశీలించి "ఆహికము" తాకట్టు అనునర్థముతోఁ బ్రకటించిరి (చూ. 194 పుట). పిదప శ్రీ వేంకటరాయశాస్త్రులుగారు మరల నా గ్రంథమును బ్రకటించుటలో ఆహికము శబ్దరత్నాకరాదినిఘంటూద్ధృతము గాకుండుటచేఁ గాఁబోలును "ఆహితము" అని దిద్దిరి చూ. 151 పుట). తాకట్టు అనియే యర్థము వ్రాసిరి. ఆ పాఠము వ్రాతప్రతులలో లేదు. తెలుఁగున "ఆయకము" అను పదము తాకట్టు అనునర్థమున వ్యవహారమునఁ గలదు. ఆయకము రూపాంతరము "ఆహకము" అని యుండునని గాఁబోలును బ్రౌను, సీతారామాచార్యులు తమ నిఘంటువులలో గౌరనప్రయోగమును "ఆహకము"గా గ్రహించిరి. వ్రాతప్రతులలో లేని "ఆహకము" రూపము గ్రాహ్యముకాదు. గౌరన నవనాథచరిత్రమునఁ గూడ "ఆహికము" – కలదు."ఆహికంబులు వెట్టి యప్పులువార, వృద్ధి కొసంగుదు." (చూ. 153 పుట). ఆహి, ఆహికము రూప భేదములు కాఁబోలును. ఆహి పదప్రయోగము ఇంత సాధక సామగ్రి కలది. శ్రీనాథప్రయుక్తమయిన యీ "ఆహి" ప్రయోగము విడనాడి యీ యర్థమున శ్రీనాథరచనముల నారగించి జీర్ణించుకొని కవితాబలము గడించినవాఁడు పెద్దనామాత్యుఁడు "ఆధివెట్టిరి" అని ప్రయోగించుట యేలయని పరిశీలింతును గదా :– మనుచరిత్రమునఁగూడ 'ఆహి వెట్టిరి' అనియే యుండుట కానవచ్చెను. ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో మనుచరిత్రవ్రాఁతప్రతులు 15 ఉన్నవి. అందు 11 ప్రతులలో ఆహివెట్టిరి ఉన్నది. తక్కినవి కొన్ని కాగితపుఁ బ్రతులు ఇటీవలివి. అందు 'ఆధి వెట్టిరి' ఉన్నది.

ప్రాకృతమున గాథా కథా శబ్దములకు "గాహా" "కహా" రూపములు కలవు. "ఆధి" శబ్దమునకు "ఆహి" ప్రాకృత రూపము కాఁబోలును: థ, ధ లకు హకారాదేశము కొన్ని ప్రాకృతములందుఁ గాననగును.

## తేఁడు

ఆక్షేపము

"వీఁడిదె తెల్లనాకులను
  వీడెము సేయుచు వీథి వచ్చుచు



న్నాఁడు మదించి తిండి తిని
  నాఁడుసుమీ యిటమీఁద నేడకో
తేఁడఁగఁ బోయెడిన్ గరణ
  దేశపుజాణఁడు గాఁగ నోపు నీ
బాఁడు పణోపహారపరి
  పాటి యెఱుంగఁగవచ్చు వీనిచేన్." (క్రీడా. 53 పొ.)

ఇట " తేఁడు=వెదకు" అని (పీఠిక 121 పొ.) శ్రీ శాస్త్రిగారర్థము వ్రాసినారు. కాని తేఁడు ధాతువున కీ యర్థమును, తన్నిర్ణాయక ప్రయోగములును గాన్పింపవు. ఇదియే గాక యీ పద్యమునఁగూడ వీరు వ్రాసినయర్థ మేమాత్రమును సందర్భోచితముగా లేదు. శబ్దరత్నాకరములోనీ పదమునకు " తెండు, శయనించు" అనునర్థము వ్రాసి.

"అతివ పూర్ణేందుభీతిఁ దదశ్మశాలఁ
దేఁడి యతఁడందు నినుమడి తీండ్ర దోఁప
మింటిపై నుంట కాదని యింటిపైకిఁ
దెచ్చుకొంటి నటంచుఁ బెఱ ఱిచ్చ వెడలు'(ఆముక్త. 5–146)

ఉదాహరణముగా నీయఁబడినది. ఈ యర్థమే క్రీడాభిరామప్రయోగమునఁగూడ నెంతయు సమంజసముగా నున్నది. ఈ బ్రాహ్మణుఁడు పూట కూటింట భుజించి తాంబూలము వేసికొనుచు నెక్కడకో శయనింపఁ బోవుచున్నాఁడని యిట భావము. మఱియు,

'అనలునిఁ గాఁడుచుం జముని
  నాడుచు రాక్షసుఁ బాడుచుం గప
ర్దినొసలు చూడుచుం దనుజు
  ప్రేవులు దోడుచు గాడ్పు కడ్పులోఁ
గునుకులు గోడుచుఁ వరుణు
  గుండియఁ దేఁడుచు వాహనేంద్రు నం
దిని జన వేడుచుఁ నృపతి
  నేర్పులు దీడుచు వెండి వాఁడిగఁ .' (కకుత్స్థ. 5–123)

"గుండియఁ దేఁడుచుఁ – గుండియందు శయనించుచు" ఇతరులను బెదరించునప్పుడు "నీ గుండెలో నిద్రపోవుదును" అనుట వ్యవహారమునఁ గలదు. దానినే యీ కవి యిట గ్రహించినాఁడు. మఱియు "తేడు" ధాతువు సమానార్థక మగు "తెండు" ధాతువునకుఁ గూడ "శయనించు" అనునర్థమే సప్రమాణముగాఁ గాన్పించుచున్నది. పై విషయము లన్నియుఁ బరిశీలించి చూడఁగాఁ గ్రీడాభిరామప్రయోగములో శ్రీ శాస్త్రిగారు వ్రాసిన యర్థము సమంజసముగా లేదని తోఁపక పోదు."

ఇందుకు నా సమాధానము :

ఇందు "తేడు" "శయనించు" అనునర్థము గలదనుటకు శ్రీ శాస్త్రులు గారు ప్రయోగములఁ జూపిరి. "తేఁడు"కు "వెదకు" అను నర్థముకూడఁ గలదనుటయే నాయాశయము గాని "శయనించు" అనునర్థము లేదనుట గాదు. "వెదకు" అర్థమున "తేండుదల్, తేడుదల్, తేడితేడి" ఇత్యాదులు తమిళమున సర్వసామాన్యముగా వాడుకలో నుండును. "తెండు తేఁడులు" రూపాంతరములగుట శ్రీ శాస్త్రులు గారు నంగీకరించిన విషయమేకదా. తెలుఁగునఁగూడ "వాఁడు తెండుకు తెండుకు అవస్థపడుచున్నాఁడు నే నన్న మాటకు" ఇత్యాది వ్యవహారము నా జన్మదేశ మగు కృష్ణామండలమున నున్నది. "తెండు" కు "తిరుగఁదోడు, కలఁబెట్టు, పెనఁగులాడు, వెదకు, తదేక విచారముతో నుండు" ఇత్యాది విధముల నర్థము సంగతమయియున్నది.

ఆముక్తమాల్యదా కకుత్స్థవిజయ ప్రయోగములు నేఁ జెప్పిన యర్థమునకుఁ గూడఁ బొసఁగునవియే – "చంద్రకాంత శిలాశాలలోఁ దాపము గొల్పనిపట్టువెదకి" – అనియు, "వరుణుని గుండెల వెదకుచుఁ (గలఁబెట్టుచు)"– అనియు మీఁదిపద్యములలో నేఁ జెప్పిన యర్థము సరిపోవుచునే యున్నది. మఱియు నాముక్తమాల్యదాపద్యమున ప్రాచీన ప్రతులలోఁ గొన్నింట–

**అతివ పూర్ణేందుభీతిఁ దదశ్మశాలఁ**
**ద్రేణి యతఁడందు నినుమడి తీండ్రఁ దోప–**



అని కలదు.– ఓరియంటల్ లైబ్రరి చూ. 10 2–1 వ్రాఁతప్రతి. దీనికి శ్రీనివాసీయవ్యాఖ్యలో "యువతి పూర్ణచంద్రునిమీఁద భయపడి చంద్రకాంతశాలలో ప్రవేశించి, ఆ చంద్రకాంతశాలయందు చంద్రుడు మిక్కిలి వేండ్రముగా కానవచ్చేటప్పటికి" అని కలదు. సి.పి. బ్రౌను దొరగారుకూడఁ దమనిఘంటువున నీ పట్టున ప్రయోగమును 'త్రేణి' యనియే గ్రహించిరి. బ. సీతారామాచార్యులవా రేలొకో బ్రౌనుదొర గారి పాఠమును గ్రహించినవారు గారు. మఱియు బ్రౌనుదొరగారు 'త్రేణి' కి ఆముక్తమాల్యద నుండియె ప్రయోగాంతరమును గూడఁ జూపిరి. అది యిది.

క. **హత్తుకొని యొక్క కొండఱు**
**నత్తెరువుం గట్టఁ బనిచి యందఱక్రియఁ దాఁ**
**దిత్తి యొకటి గొని త్రేణి మ**
**ఱుత్తర ముత్తర మటంచు నొక ప్రొద్దుకడవ.**

శ్రీ వేంకటరాయశాస్త్రులవా రీ పాఠమునే గ్రహించిరి. మఱియు వ్యాఖ్యలో నిట్లు వ్రాసిరి.

"తేండి – దొరికిన వ్రాఁతప్రతు లన్నింటను 'త్రేణి' అని యున్నది. 'త్రేణి' అని తెండి (=శయనించి) అనుటకు ఈ వ్రాఁతపుస్తకములలో తఱుచుగఁ గలదు.'తేడు' ధాతువు 'తెండు' ధాతువునకు రూపాంతరముగా శ.ర.లో నున్నది. కొన్ని దేశ్యశబ్దములందు తొలియక్కరమునందలి క్రారవడులు అంతరించుట ప్రసిద్ధమే. డ కారముతావున ణకారము నిలుచుటయు సిద్ధమే.

ఉదాహరణము అణఁగు అడఁగు. పోణిమి పోఁడిమి ఇత్యాదులు. కావున నిట కవి ప్రయోగించిన పదము 'త్రేణి' అని యుండునని యూహింపఁ బడినది. ఆ వ్రాఁతపుస్తకములలో టీకయుంగలదు. అందు 'త్రేణిమఱి' 'నిద్ర మేల్కాంచి' అని యర్థమును వ్రాయఁబడినది,"

'తేడు' కు వెదకు అర్థమును నిరాక్షేపముగా నిరూపించుప్రయోగ మిది యొకటి గలదు.

కః **జూదంబుఁబన్నిదంబును**
**వాదునుఁ బతితోడఁ దేఁడ వలవదు కడుఁ బో**

రా దయ్యె నేని భృత్యులు
**భేదము గాకుండ గెలుపు పెనుపఁగ వలయున్** (భోజరాజీయము)

ఆముక్తమాల్యదపీఠిక 51-వ పుటలో శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రులవారీ ప్రయోగమునుగూడఁ జూపి యిట్లు వ్రాసిరి. "తేడు అనఁగా వెదకుట అని యరవమునఁ బ్రసిద్ధము. ఆ యర్థమున శ. ర. లేదు."

తేఁడుకు 'వెదకు' అర్థము స్పష్టమగుచుండఁగాఁ దదనుసారిగా క్రీడాభిరామ పద్యమునకు నేఁ జెప్పిన యర్థము "ఏ మాత్రము సందర్భోచితము గా లేదు," "సమంజసముగా లేదు" - అట! ఏలో?

ఆ బ్రాహ్మణుఁ డోరుఁగంటికి వేడుకలమీఁద వేడుకలు దిలకించుటకు, విహరించుటకు వచ్చినాఁడు గాని యారగించి నిద్రించుటకుఁ గాదు. దిట్టముగాఁ దిండి దిని తాంబూలచర్వణము సేయుచు వేడుకపట్టులు వెదకఁ బోవుచున్నాఁ డనునర్థ మేల సమంజసముగాదు?

## నారికేళబక జాతీయములు

కేయూరబాహుచరిత్రమున నారికేళబకమను కొక్కెర, అది కొబ్బరి చెట్టుపై వసించునదే యగుటకలదు గాన, దానిఁబట్టి నారికేళబక జాతీయములు అన్న పదమునకు నారికేళముపై వసించు బకములతీరుగలవి అన్నయర్థము 'కాఁబోలును' అని సందేహముతోనే నేను వెల్లడించితిని. శ్రీ శాస్త్రులుగారు కోళ్ళు నారికేళజాతివి, బకజాతివి కలవనుట కాధారముగా వెల్లడించిన [1] దశకుమారచరిత్రపద్యముల నే నప్పుడు చూడలేదు - వాని వెల్లడించినందుకు శ్రీ శాస్త్రులవారి యెడఁ గృతజ్ఞుఁడను.

---

1 క॥ చరణములు నేత్రములుఁ గడు
నరుణము లారెలును ముక్కు నాయతములు కం
ధరములు దొడలును సన్నము
లరయఁగ బకజాతి కది భయంపడుఁ బోరన్

క॥ ఆరెలు వలములుఁ దొడలును
దోరము బలుమెడయుఁ జుట్టుఁ దుండముఁ గుఱుచల్



## బెజవాడ మాచల్దేవి శాసనము

బెజవాడ గ్రామమధ్యమందు వేంచేసిన శ్రీ భ్రమరాంబా మల్లేశ్వర స్వామివారి దేవాలయం గర్భాలయం ముందర పడివున్న నల్లసీసపు రాయిమీద శాసనం :

"బెజవాడ పాపవినాశనదేవర రుద్రపాదాలస్థానాల ధర్మాలకు, పినకూరు తలాభక్తుని కూతురు మాచల్దేవి తనకు జెల్లిన వృత్తిక్షేత్రాలు : ప్రాతూరున పుట్టెండు క్షేత్రమున్ను, తాడేపల్లిని పుట్టెండు క్షేత్రమున్ను,

---

1 బీరంబును నురమును వి
స్తారి యగు న్నారికేళజాతికి నెందున్.

క॥ ఆ నారికేళజాతికి
మానుగ బకజాతి పోర మార్కొన దగుడం
దా నట యరుకలి యనుచును
మానక పోరించు నధికమాత్సర్యమునన్.

సీ॥ ఎదిరినకోడి ము న్నెనసి యారెలు మెడ
వెస గాఁడ నురువడి వ్రేసి వ్రేసి
యది వ్రేయ మది కిన్క నదరి బల్పునఁ బట్టి
కబళించి యందంద కదిమి కదిమి
విశిఖముఖంబులు వెనువెంటఁ దగులుచు
నంతంతఁ బోనీక యాఁగి యాఁగి
వాగాటులకు వచ్చి వసుమతి నిలువక
యొంటితన్నునఁ గొన రుడిపి యుడిపి

తే॥ గెలిచె నామాటఁ దగ నారికేళజాతి
యగ్గలిక నంతఁ బ్రజ యెల్ల నార్చుచుండెఁ
జెలఁగి యొకజాతిమాత్రోపజీవి యైన
బ్రాహ్మణుండు న న్నెంతయుఁ బ్రస్తుతించి.

దశకుమార చరిత్రము - నవమాశ్వాసము, 30 - 33.

పెనుంబాకను పుట్టెండు క్షేత్రమున్ను, గొల్లపూండిని పుట్టెండు క్షేత్రమున్ను, నరసూరు గ్రామానను పుట్టెండు క్షేత్రమున్ను, నున్నగ్రామాన పుట్టెండు క్షేత్రమున్ను, గుడుదల గ్రామాన పుట్టెండు క్షేత్రమున్ను, వెనకపల్లి గ్రామాన పుట్టెండు క్షేత్రమున్ను యీ పదిగ్రామాల కేసరిపాటి పదిపుట్ల క్షేత్రమున్ను పృథి లింగల గోత్రమువారికి పుణ్యంగాను ధారవోసి యిచ్చిన ధర్మశాసనం మంగళ మహాశ్రీం జేయును."

(చూ. శృంగార శ్రీనాథము ( 1923) పుట. 276-277)

## దోహరి

క్రీడాభిరామమున "...దాత్యూహ వ్యూహంబులుం గలిగిన మోహరి వాడ యందు..." "కొలుచును జేనవెట్టి" ఇత్యాది పద్యము కుట్రపువాని వర్ణనముతో నున్నది. దానిఁ బ్రకటించునాఁడు మోహరివాడ యనఁగా నా కర్థము తెలియదయ్యెను. "యుద్ధభటు లుండువాడ యనుకొందును-" అని పీఠికలో వ్రాసితిని. మోహరము = యుద్ధవ్యూహము అర్థముండుటను బట్టి యట్లను మానించితిని. ఇటీవలఁ దెలియవచ్చిన క్రొత్తయర్థము :

కాశీఖండము సప్తమాశ్వాసమున

సీ॥ ప్రార్థింప నున్నాఁడు పాదాగ్రముల వ్రాలి
వెలివాడవాఁడు తద్విప్రకులుని..

ఇత్యాది పద్యమున,

దీవింప నున్నాఁడు తెలిసి దోహరిబంటుఁ
జెవి నక్షమాలికఁ జెరివి ద్విజుఁడు (7-240)

అన్నచోట 'దోహరిబంటు' ఉన్నాఁడు. ఈతఁ డిక్కడ మరియు చండాలుఁడు - వెలివాడవాఁడు అనియుఁ జెప్పఁబడినాఁడు.

మఱియు నాముక్తమాల్యదలో, " అనినఁగహకహ నవ్వి యద్దోహరికి సురద్రోహి యిట్లనియె - (6 ఆశ్వా. 31 వచనము-)" అని కలదు. ఇక్కడ 'దోహరి' యనఁగా మాల (దాసరి), చండాలుఁడు - వెలివాడ వాఁడే. అచ్చు



పుస్తకములలో " అద్దాసరికి సురద్రోహి యిట్లనియె" నని కలదు- కాని ఓరియంటల్ లైబ్రరిలోని వ్రాఁతప్రతులలో ఒక్క దానఁదక్కఁ దక్కిన యన్నింటను 'దోహరి, అనియే కలదు. బ్రౌనుదొరగారును, సీతారామాచార్యుల వారును "దోహరి" యని గ్రహించి నేఁ జూపిన యాముక్తమాల్యదా ప్రయోగమునే యుదాహరించిరి. "దాహరి-దాసరి" రూప భేదములని వారి తలఁపు - కాని, యా పదము "దోహరి" యే. ఆముక్తమున - "దోహరికి -సుర- ద్రోహి" యని "దో-దో" యతి సంగతి యుండుట, వ్రాఁత ప్రతులన్నింట దోహరి యనియే కానవచ్చుట, కాశీఖండమునను "దోహరి బంటు" ఉండుట - అది "దోహరి" యే యనుటకు సాధకములు. మఱియు బసవపురాణమునను, పండితారాధ్య చరితమునను "దోహరి కక్కయ్య" యను శివభక్తుని చరిత్ర మున్నది.

శివభక్తు లయినమాలలతో ద్విజులు సరిగా రని చెప్పు కథాసందర్భ ములలో,

"ముక్కంటిగణము దాఁ గక్కయ్య నాఁగ
నీ ద్విజులకు వైరి.

విష్ణుమాహాత్మ్యము వర్ణించు పురాణభట్టును ముక్కలుగా నఱికి చంపెను.)-

"దోహరి కక్కయ్య మాహాత్మ్య మెఱిఁగి
యూహింప భక్తుల నొం డనఁదగునె - "

(బసవపురా. 7. ఆశ్వా.)

అని కలదు.

పండితారాధ్యచరితమున

"కలసె నంత్యజుఁ డనఁగా నెట్లు వచ్చు
నిక్క మట్లును గాక కక్కయ్యగణము

(బసవపురాణకథయే)

అటుగాన దోహరు లన నెటు వచ్చు
పటుతరం బగుభక్తిపరుల వెండియును –"(ప్రథమ ప్రకరణము)

అని కలదు. ఇన్నింటినిబట్టి " దోహరి" మాల యని యెఱుఁగనగును.

మఱి యీ యన్నింటికంటె వ్యక్తమగునట్లు ఓరియంటల్ లైబ్రరీ 4-4- 28 నెంబరు పుస్తకమున,

"కళ్యాణ మందు దోహర కక్కయ్య అనే భక్తుడు తోళ్ల తిత్తులు కూర్చేవాడు, దోహరుల కులం యందు జనియించి, తన పూర్వాశ్రమం ఖండించి వీరశైవదీక్ష..." ఇత్యాదిగాఁ గలదు.

దీనిఁ బట్టి దోహరి పదము "గౌడారి" కి పర్యాయపదమని స్పష్ట పడినది. గౌడారులు తోళ్లతో చెప్పులు, తిత్తులు కుట్టుచుందురు. వారు మాలవారిలో నొక తెగవారు "మాలకు మాంసంబు, మఱి గౌడారికిని దోలును నన్నట్టు"- బసవపురాణము. ఈ ద్విపద శ.ర.లో భాగవతమున నున్నట్టున్నది. సరిగాదు. క్రీడాభిరామమునఁ గూడ 'మోహరివాడ'ను "దోహరివాడఁ" జేయవలెనేమో ! "దోహరులు" చెప్పులు తోళ్ల కుట్రమే కాక వెలివాడ వారికి "రవికలు" మొదలగు బట్టల కుట్రము కూడఁ జేయివారు గాఁబోలును! ఇట్టి యాచారము తెలుఁగునాఁటఁ గొన్ని యేండ్ల క్రిందటిదాఁక సాగుచున్నట్టు వినికి.

## బాఁడు - పాఁడు

పఱాను-పాఱను అనుటకు స్వర వ్యత్యయముచే వచ్చిన ప్రామాదికరూపము. "పాఱను" అనియే పెక్కు శాసనములందుఁ గలదు. మఱికొన్నింట "పఱాను" కూడఁ గలదు. పాఱను= అనఁగా బ్రాహ్మణులను అని యర్థము. బ్రాహ్మణునకు అఱవమున "పార్పాన్" అని పేరు. అనఁగా "ద్రష్ట" తజ్జ్ఞుఁడు" అని యఱవవా రర్థము చెప్పుదురు. అది దేశిపదమని వారందరు "పార్పాన్" నేఁడు "పాపాన్" అని వ్యవహారమున నున్నదందురు. తెలుఁగున "బాపఁడు" అను రూపమున్నది. అది బ్రాహ్మణశబ్ద వికృతియని



మన తలఁపు. తెలుఁగులో బ్రాహ్మణ శబ్దపు వికృతి బాపఁడు అయినట్లే అఱవమున ('బ' లేదు గాన) పాపాన్ అయి ఆ తద్భవ పదమే దేశిపదతాభి మానము గల వ్యాకర్తలచే "పార్పాన్" గా సంస్కరింపఁ బడినదేమో అని నా యనుమానము. ఇది యిట్లుండె : బ్రాహ్మణశబ్దపు వికృతిగాఁ బుట్టినదో యెట్లు పుట్టినదో కాని తెలుఁగున బ్రాహ్మణుడు అను నర్థమున "పాఁడు" అనియో "బాఁడు" అనియో ఒక పదమున్నది. శ్రీనాథుని క్రీడాభిరామమందలి యీ క్రింది పద్యమును బరిశీలించినఁ దెలియఁగలదు.

వ॥ "ఎదురుగా నేతెంచు నొక్క బ్రాహ్మణుం గని".

ఉ॥ వీఁడిదె తెల్లనాకులను ...,.నీ బాఁడు, పణోపహార
పరిపాటి గనుంగొనవచ్చు వీనిచేన్. ( చూ. క్రీడా.)

వ్రాఁతప్రతిలో "బాఁడు" అని కలదు. దీనికి "పాఁడు" అని ప్రాచీన రూపము గానవచ్చును. లేక యిందు "బాఁడు", "పాఁడు" అనుటకు బ్రామా దికపువ్రాఁత గావచ్చును. "పాఁడు" శబ్దమునకు బహువచనరూపము "పాఱు" గాఁగాన వచ్చుచున్నది. ఇట్లనుటకు నే నింతకుముం దుదాహరించిన శాసనములపట్టులే లక్ష్యములు గాఁజాలును. తెలుఁగు కృతులలో పాఱుఁడు, పాఱువాఁడు, పాఱుత రూపములు గలవు గాని యవియెల్ల నర్వాచీన కవులవి. ఎఱ్ఱాప్రెగ్గడ భారతారణ్య పర్వశేషమునను, హరివంశమునను పాఱువాఁడు, పాఱుఁడు రూపములఁ బ్రయోగించెను. అటు తర్వాతి కవులు ప్రయోగించిరి. కాని, నన్నయ్య తిక్కన కృతులలో నా రూపములున్నట్టు నా దృష్టికి గోచరింపలేదు. ఒకవేళ వారట్లు ప్రయోగించినను నేను జెప్పువిషయము నన్నయకింకను నన్నూఱేండ్ల పూర్వపుది గాన, నా కాలమున ప్రథమాబహువచ నాంత మగు"పాఱు" నన్నయాదుల నాఁటికిఁ బ్రాతిపదికముగా మాఱిన దనవలసియుండును. మొదటికి నన్నయ తిక్కనలును వారి నడిమికాలపు వారును నగు కవులట్లు ప్రయోగించియుండరనియే నా నమ్మకము. మఱియు నిక్కడ నింక నొక్క విశేషము : ఇంతకుముందు ఎపిగ్రాఫియా ఇండికా XI వాల్యుంలో కీ.శే. హెచ్. కృష్ణశాస్త్రిగారు ప్రకటించిన సత్యాదిత్యచోళుని చిలుముకూరి తెలుఁగు శాసనమున "వేవాన్టూఱు నిల్పినపుణ్యంబు" అని

చదివిన పట్టునకు అర్థము బోధపడలేదని శాస్త్రిగారు వ్రాసిరి. అది వారు చదివినట్లే అయినను లేక "వేమాన్డుడ్ళు" అని యయినను దానికర్థము వేయిబ్రాహ్మణ గ్రామములని; వే+పాన్టు+ఊఋ్ళు- వేయి బ్రాహ్మణ గ్రామములు; లేక వే+పాన్డు+ఊడ్ళు - వేయి బ్రాహ్మణగ్రామములు. పాన్డుశబ్దమున నకార మరసున్నగా మాఱి బ్రాహ్మణవాచకముగాను, నకారములోపించి "పాడు" అయి బ్రాహ్మణగ్రామ (అగ్రహార) వాచకముగాను, వేర్పడియుండవచ్చును. ఇప్పుడు గ్రామనామములు పెక్కులు "పాడు" పదాంతములుగా నున్నవి. ఈ "పాడు" పదమునకుఁ బూర్వము బ్రాహ్మణా గ్రహారమనియే యర్థమేమో. నేఁడు పాడుపదము బహుకాలము గ్రామమున్న చోట బూడిదవన్నెగా మాఱిన మంటిదిబ్బ పట్టునకుఁ బేరుఁగా వ్యవహారమున్నది. క్రీ. 6,7,8 శతాబ్దములనాఁటి శాసనములలో గూడ గ్రామనామములకీ "పాడు" పదాంతత్వము గలదు. పాడు పదమునకు పాటిమట్టి దిబ్బయే యర్థమని యానాఁటికే గ్రామములు పాటిదిబ్బలేర్పడె ననవలెను. గ్రామనామముల తుది పాడుపదమున కర్థమేదయినను పయి చిలుముకూరి శాసనములోని పదము పాన్టూఋ్ళ్, పాన్డూడ్ళ్ బ్రాహ్మణాగ్రహార వాచకమే యనుటకు సందేహింపఁ బనిలేదు. సంఖ్యావాచకమగు "వే" పదమునకుఁ దర్వాతనున్నది గాన "పా" "వా" అయినది." (చూ. లక్ష్మీపుర శాసనము. విభవ - జ్యేష్ఠ భారతి)

పీఠికానుబంధము -

# క్రీడాభిరామము

వల్లభరాయని పేర శ్రీనాథుఁడు చెప్పిన వీథినాటక ప్రబంధమున వల్లభుని ప్రశంస 'మూడు గ్రామగ్రాసముల తోడఁ గూడంగ మోపూరుఁ బాలించే ముల్కినాట.... మనుజమాత్రుండె వల్లభామాత్యవరుఁడు' అను సీసపద్యము (క్రీ. 22)న గలదు. అందు తొలి నాలుగు చరణములందును గ్రియాన్వితములుగాఁ జెప్పఁబడిన విశేషము లన్నియు నా సీసపుటెత్తుగీతిని యత్తదర్థక శబ్దములచేత సూచితుఁ డగు వల్లభామాత్యునకే యన్వితములగుట శ్రీనాథుని సీసపద్య రచనా సంప్రదాయము. ఆ త్రిపురాంతకాధీశ్వరునకు, భండార రక్షకునకుఁ బ్రియతనూజుండు చందమాంబికకు సుతుఁడునయి యెవడు - పాలించెనో, పఠించెనో, వరించెనో, వార్తకెక్కెనో - ఆతఁడు వల్లభా మాత్యవరుఁడు మనుజమాత్రుండె అని యన్వయమగును. శ్రీనాథుని సీసపద్యమున నన్వయమిట్లు విస్పష్టముగా నున్నను గొందఱేలకో పై వాక్యము లన్నియు వల్లభుని తండ్రియగు తిప్పనకే చెల్లునని భావించిరి. అది యట్లన గాదు (చూ. పీఠిక పుట 20) క్రీడాభిరామమందలి 2,22 పద్యముల బోలినదే కాశీఖండమున నీ సీసపద్యమును గూడ బరికింపుఁడు.

సీ॥ మాటలాడుచు మూత్రమలము లుత్సారించు
  మిహిరోదయమ్మున మేలుకొనఁడు
సంధ్య వార్వఁడు మంత్ర జపసంయుతంబుగ
  విడికచ్చతోనుండు విడువ కెపుడు
బ్రహ్మసూత్రము ధరింపఁగ సిగ్గువహియించుఁ
  జల్దియోగిరము నిచ్చలు భుజియించు
ఋతువేళలఁ బరిగ్రహింపఁడు నిజభార్య
  నన్యకళత్రంబు నభిలషించు

గీ॥ నెవ్వఁ డవ్విప్రదాయాదుఁ డేగుదెంచె
మార్గవశమున భాగ్యసామగ్రి కలిమి
నాశ్రయించితి నతని మధ్యాహ్నవేళఁ
బ్రాంతదేశంబునం దొక్కరావినుండి    (కాశీ 6-46)

విశేషణవిశేష్యములను దఱచుగా నేక విభక్తిలోనే నిలుపుచుండు టీతని సంప్రదాయము కావున నీ యన్వయ మిట్లే యనఁదగును.

## వంశక్రమము

ఈ వల్లభరాయని వంశవర్ణనమును "మిక్కిలి తప్పులతో అనన్విత ముగా నున్నదానిని జాగ్రత్తగాఁ బరిశోధించి ఉచితవిధముగ సంస్కరించి" వంశవృక్షమును పూజ్యులు మా పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఒక విధమున బ్రకటించిరి. ( చూ. పీఠిక. పుట 13). వారి సంస్కారముల నన్నిట నంగీకరించియుఁ దుద కొకచోటమాత్ర మంగీకరింపక కొంద రించుక భిన్నముగాఁ దలచిరి ( చూ. శ్రీ బండారు తమ్మయ్యగారి పీఠిక – క్రీడాభి రామము, వావిళ్ళవారి ముద్రణము 1953). ఆ విమర్శకుల యభిప్రాయమున గృతికర్త యనఁబడిన వల్లభుని తాత తండ్రు లిరువురును దిప్పనలే. రాయనవరత్నభాండార రక్షకులే. తాత తిప్పనకు సోదరుఁ డగు లింగన వీరహరిహరరాయల సేనాని. అనఁగా లింగనమంత్రి వల్లభునకుఁ బెదతాత. ఇక, బెదబుక్కరాయల మంత్రి యయిన చంద్రామాత్యుఁడు వల్లభుని తాత యగు తిప్పనకు ముత్తాత (అనఁగా తాత తండ్రి) యగును. కాని, కొన్ని కారణములచేత నే నీ యభిప్రాయముతో నేకీభవింప జాలకున్నాను. శ్రీ శాస్త్రిగా రభిప్రాయపడినట్లు లింగనమంత్రి సోదరుఁడగు తిప్పన యొక్క తనయులు ముప్వురిలో నడిమి వాడుగాఁ బేర్కొనఁబడిన 'మల్లన' యే వల్లభుఁడు కాదగుననియు, నట్లు సంస్కరింపఁదగు ననియు విశ్వసించుచున్నాను. శ్రీనాథుఁడును వల్లభరాయఁడును సమకాలికులై కాలముకూడ నందుకుఁ బొంది పొసఁగియే యున్నది. దానికి హేతువులివి.

1. వంశ వర్ణనమందలి రచనాసంప్రదాయ మిందుకుఁ దగియున్నది. చూడుఁడు :

"మల్లనమంత్రికిం ద్రిపురమాతరళాక్షికిఁ గాంతి రోహిణీ
వల్లభు లాత్మసంభవులు వల్లభ లింగన తిప్పన క్షమా
వల్లభమంత్రి శేఖరులు వారవధూజన పుష్పభల్లు లు
త్ఫుల్ల యశోవిభాసితులు పుణ్యులు సింగనభైరవేంద్రులున్.



వ. అందు

సీ॥ తారకామందార తారాచలంబుల
తో రాయు నెవ్వాని చారుకీర్తి....
మర్త్యమాత్రుండె వల్లభామాత్యవరుఁడు."

(క్రీడా. 10,11,12.)

ఇట 'అందు' అనఁగా నైదుగురు సోదరులలోను మొదటివాఁడగు వల్లభుని అని. అతని వర్ణనము సీసములో నున్నది. అన్వయమొకే విధమున జక్కగాఁ బ్రథమలో పద్యమున దుదిఁ దాకుచున్నది. ఇట్లే ప్రస్తుతభాగమున గూడ నన్వయము.

"....తిప్పన యఖండిత ధీనిధికాంచెఁ బుత్రులన్
బాంధవ కల్పవృక్షముల బైచన మల్లన (?) తిప్పమంత్రులన్."

వ. అందు

సీ॥ 'మూఁడు గ్రామగ్రాసముల' (22 పద్యము)

ఈ సీసమున దొలి నాలుగుచరణములలో నున్న విశేషములన్నియు 'నెవ్వ' దను శబ్దముచే ప్రథమావిభక్తిలో వర్ణితుఁడైన వల్లభునకే చెల్లును. ఇక, పై వచనమున 'అందు' అనుట 'బైచన మల్లనఁ (?) తిప్పమంత్రు' లలో ననుటకు. కాని, యందు వల్లభుఁడు కానరాఁడు. అందుకే "మల్లన" అనికాక 'వల్లభ' అని యుండఁదగునని శ్రీ శాస్త్రిగారి సంస్కారము.

2. ఇందలి రచనా సంప్రదాయ మిట్లుండగా నెట్లో విమర్శకులు చెప్పిన చొప్పున పై (22) పద్యమున కన్వయము గల్పించు కొందమన్నను జిక్కులు తప్పకున్నవి. "బైచన మల్లన తిప్పమంత్రు" లలో నెవఁడు "మూడు గ్రామ గ్రాసములతోడఁ గూడంగ" మోపూరుఁ బాలించెనో ఆ త్రిపురాంతకాధీ శ్వరునకు "ప్రియతనూజుండు చందమాంబికకు సుతుఁడు" "వల్లభామాత్యవరుఁ డు మనుజమాత్రుండె" అని ప్రథమనుండి షష్ఠికి విశేషణ విశేష్యములను కప్పదాటుగా నన్వయించుకొనవలసి వచ్చును. ప్రాముఖ్యమునుబట్టి యీ అర్థమున బద్యమెల్ల రెండు ముక్కలగుచున్నది. అది యీ సీసపద్య రచనా సౌభాగ్యమును గుంటువడఁజేయుచున్నది.

ఇంతేకాదు. వాదసరళికి ఈ త్రిపురాంతకుఁడు లింగన సోదరుఁ డగు తిప్పనకాక యా తిప్పనకు కుమారుఁ డగు తిప్పనయే యనుకొన్నను చిక్కున్నది. "త్రిపురాంతకాధీశ్వరునకుఁ బ్రియతనూజుండు చందమాంబికకు సుతుఁడు- వల్లభామాత్యవరుఁడు" అని మాత్రమే పద్యమున నుండుటనుబట్టి కృతికర్త యనిపించుకొన్నవాని తల్లిగారి కులగోత్రములేమియుఁ జెప్పబడలే దనవలసివచ్చును. వల్లభుని నాయనమ్మయొక్కయు, తాతగారి భార్య యొక్కయు కులగోత్రాదిక ప్రశంసను విపులముగా గావించిన కవీశ్వరుఁడు తల్లిని గూర్చి సగౌరవముగాఁ జెప్పవలదా? లేదేమి? రచనా సందర్భమునుబట్టి యట్టి పద్యము లీ గ్రంథమున శిథిలములై యుండు నన వలనుపడదు. వంశమూలపురుషు లగు చంద్రామాత్యుని భార్యనుగూర్చియు, మంచన భార్యను గూర్చియు వ్రాయునపుడు చెప్పినట్లే యిచ్చుటనుఁ జెప్పినాఁ డనగుదరదు. అయిన వంశమున నడిమివారి భార్యలకేనా కులగోత్రము లుండుట ! కావున, పై విమర్శకుల యభిప్రాయముతో నే నేకీభవింపఁ జాలకున్నాను. మిక్కిలి పూర్వులగుటచే చంద్రామాత్యుని, తత్తనయుని భార్యల ప్రశంస నధికముగాఁ (తెలియకేమో !) జేయలేదు.

అటుపై క్రమముగాఁ జేసినాఁడు. మంచనార్యుని కుమారుఁడగు మల్లసచివాగ్రణి "మిరుతూరి విట్ఠమంత్రీశ్వరు తనయను" వరించెను. ఆ మల్లామాత్యు పుత్రుం డగు తిప్పమంత్రి యధిక వైభవమున "హరితగోత్ర జలధి హరిణాంకుఁడగు తిప్పనార్య తనయ" ను బరిణయమాడెను. కాని, యామె పేరు గ్రంథమున ముద్రితమైనట్లు "పెద్దమాంబ" కాదు. "చందమాంబ" యని యుండనగునని నేనూహించుచున్నాను. పాఠము "తిప్పనార్యతనయఁ జందమాంబ నెలమి" అని యుండవచ్చును. "మంచనశర్మ", "మంచెనశర్మ" అని యీ గ్రంథమందే లిపిభేదమున రెండువిధముల వ్రాయఁబడినట్లు 'చంద్దమాంబ' అను లిపి 'చెంద్దమాంబ' ఆ తాళపత్రములందు లిఖింపఁబడి యది 'పెద్దమాంబ' అను భ్రమను తత్ప్రతి విలేఖకులకు గల్గించియుండవచ్చును. పర్యవసానముగ దీని మాతృకయందును 'బెద్దమాంబ' యే మిగిలినది. కావున, నది 'పెద్దమాంబ' కాక 'చందమాంబ' యనియే నా విశ్వాసము. ఆ చంద మాంబా త్రిపురాంతకులఁ గూర్చి యిచట ప్రస్తావింపఁబడిన కారణముననే



22వ పద్యమున "చందమాంబ" యొక్క కులగోత్రాదికప్రశంస మరల కావింపఁబడలేదు. ఈ హేతువున దిప్పమంత్రులిరువును (తండ్రికొడుకులు) అగుటయు, వారి భార్యలు క్రమముగా పెద్దమాంబ, చందమాంబలగుటయు తొలగిపోవుచున్నది. ఇందు "చందమాంబ" ఒక్కతెయే తిప్పనార్యుని సతీమణి. ఆమె భర్తగాఁ బేర్కొనబడి రాయనవరత్నభాండార రక్షకులు, తిప్పననామాంకితు లిరువురు నొక్కరే యగుదురు గాని భిన్నులు కారు.

## కాలము

క్రీడాభిరామరూపకకర్తగాఁ బేర్కొనఁబడిన వినుకొండ వల్లభరాయఁడు శ్రీనాథునకుఁ బూర్వుఁడునుగాడు, తరువాతివాఁడును గాడు. శాసనచారిత్రిక సాక్ష్యము లీతడు సరిగా శ్రీనాథునకు సమకాలికుఁడని చెప్పుటకు సరిపడి యున్నవి. క్రీడాభిరామరచన కూడా శ్రీనాథరచనముగా నిరూపింపదగినట్లు భాసించుచు పై యభిప్రాయమును గ్రంథస్థమైన యాంతరంగిక సాక్ష్యముచేత రాద్ధాంత పరచుచున్నది. ఇందున్న వివరము లివి: మోపూరు పరిపాలకుఁ డగు వినుకొండ వల్లభరాయనితండ్రి వీరహరిహరరాయల రత్నభాండారరక్ష కుఁడును, మహాప్రధానియు నైనవాఁడు, పెదతండ్రి లింగన హరిహరరాయల మంత్రియు సేనానియునైనవాడు, ఇక, వల్లభరాయని తాతకుఁదాత యగు చంద్రామాత్యుఁడు 'కర్ణాటక్షితినాథుఁడైన పెదబుక్కక్ష్మాపదేవేంద్రు" నికడ మంత్రిగా నుండినవాఁడు.

ఇందలి విశేషణములు పై వారిని గూర్చి మఱికొన్ని జాగ్రత్తగాఁ బరిశీలింపదగినవియుఁ గలవు. లింగన 'అనతారాతినృపాల మంత్రి జనతా హంకార తారాహిమార్కుఁడు' గను, "హరిహరక్షోణీంద్ర సామ్రాజ్యవర్ధనుఁ డు" గను వర్ణితుఁడైనాఁడు. మల్లనపుత్రుఁ డగు తిప్పన "వీర హరిహరరాయ పృథ్వీ కళత్రరత్న భాండారసాధికార ప్రగల్భుఁడు" గను, "కపటాచార విరోధి రాజసచివగ్రావోగ్రదంభోళి" గను, "నృపనీతివ్యవహార కార్యఘటనానిర్ధారణా శాలి" గను, "మహాప్రధాని" గను, వర్ణితుడైనాడు. అంతేకాదు. "శ్రుతపర్వత దుర్గ మహాప్రధాన రాడ్గంధగజంబు"గ గూడ ప్రస్తుతుఁడైనాడు.

ఈ పై విశేషణములన్నిటిని దృష్టిలో నిడుకొనియే సందిగ్ధములుగ నున్న సంగమవంశీయులచరిత్రను, అప్పటి రెడ్డిరాజులతో వారికిఁ గల

సంబంధ బాంధవ్యములతీరును గమనించి యీతని కాలమును జాగ్రత్తగాఁ బరిష్కరించవలసియున్నది. పలువురు విమర్శకులు, చారిత్రకపరిశోధకులు నా పని చేసిరి. వానినెల్లఁ జదివినపిమ్మట యేర్పడిన నా యభిప్రాయము నిపుడు మీ ముందుంచుచున్నాను. పరిశీలనకై సంగమవంశీయుల వంశావళిని, ప్రస్తుతమగునంత వఱకు వల్లభరాయని వంశవృక్షమును నీ దిగువ నిచ్చుచున్నాను.

సంగమవంశము

బుక్కరాయలు

సంగమరాయలు

మొదటి హరిహరరాయలు (1336–1355) | కంపరాయలు | బుక్కరాయలు (1353 – 1377) | మారప్ప | ముద్దప

(బుక్కరాయలు (1353 – 1377) పుత్రులు:)

రెండవ హరిహరరాయలు (1337–1404) | రెండవ కంపరాయలు ప్రభృతులారుగురు

(రెండవ హరిహరరాయలు పుత్రులు:)

ఇమ్మడి బుక్కరాయలు | విరూపాక్షరాయలు | మొదటి దేవరాయలు (1406 (7) 1422)

(మొదటి దేవరాయలు పుత్రులు:)

విజయబుక్కరాయలు (1422–1428) | మూఁడవ హరిహరరాయలు | రామచంద్రరాయలు

(విజయబుక్కరాయలు పుత్రుడు:)

రెండవ దేవరాయలు ( 1428– 1446)



వినుకొండవారి వంశము

చంద్రామాత్యుడు (భార్య పోచమ్మ)

మంచన (భార్య తిప్పమ)

సింగన | తిప్పన | మల్లన భార్య మిరుతూరి విఠమంత్రి కూతురు త్రిపురమ | చెన్నమంత్రి

(సింగన పుత్రుడు:) చంద్రమంత్రి

(మల్లన, త్రిపురమ పుత్రులు:)

వల్లభన్న | లింగన (హరిహర రాయలు సేనాని, మంత్రి) | తిప్పన (భార్య హరిత్ర గోత్రుఁడగు తిప్పన తనయ పెద్దమాంబ (చందమాంబ?). వినుకొండదుర్గాధ్యక్షుఁడు. రాయలభండార రక్షకుఁడు) | సింగన | భైరవ

(తిప్పన పుత్రులు:)

భైచన | మల్లన (వల్లభ ?) కర్త | తిప్పన

వల్లభామాత్యుని తండ్రి, పెద్ద తండ్రు లగు తిప్పన, లింగనలు హరిహర రాయల కడ నుద్యోగులుగ నున్నట్లీ గ్రంథమం దున్నది. ఆ హరిహర రాయ లెవరో యిందు స్పష్టముగ లేకున్నను నాతఁడు క్రీ.శ. 1377–1404 సం.ల నడుమ కర్ణాటక రాజ్యమును బాలించిన రెండవ హరిహరరాయలు కావచ్చునని తలఁపవచ్చును. అతని కడ సేనానిగాను, మంత్రిగాను నుండిన లింగన 'హరిహర క్షోణీంద్ర సామ్రాజ్య వర్ధనుఁడు' గా బ్రస్తుతుఁ డగుటను

బట్టి – యప్పటి సంగమరాజుల సామ్రాజ్యవ్యాప్తి కీతఁడు తోడ్పడినట్లు తెలియనగును. రెడ్డిరాజుల యేలుఁబడిలో నుండిన వినుకొండ ప్రాంతమును క్రీ. 1372 నాటికి సంగమవంశీయులు సంపూర్ణముగా వశపరచుకొనిరి. కాని, తిరిగి క్రీ. 1377 ప్రాంతమున అన వేమారెడ్డి తిరిగి యీ ప్రాంతమును లోఁబరచుకొనెను. నాటి నుండి రెడ్డి విజయనగర రాజుల కాయా ప్రాంతములఁ గూర్చి తగవు లుండెడివేమో. నాడే లింగనమంత్రి రాయలకు సాయపడియుండును. ఇతర రాజుల మంత్రు లనెడితారల కీ లింగనమంత్రి చంద్రసదృశుఁడట. పరాక్రమము మాటటుంచి ప్రతిభచేతనే శాత్రవులను నిస్తేజస్కులఁ జేయువాఁడు కాబోలును. ఆనాళ్లలోనే లింగనసోదరుఁ డగు తిప్పన కూడ రాయల నాశ్రయించి వినుకొండ ప్రాంతము లందుండిన రాయల నవరత్నభాండారమున కధికారిగా నుండియుండును. క్రమమున నీతఁడును సోదరునివలె తన ప్రతిభా పరాక్రమములచేత రాయలను మెప్పించి మహాప్రధానియై యుండును. ఈ సోదరుల సాయముననే కావచ్చును రెండవ హరిహర రాయలు తిరిగి వినుకొండ ప్రాంతమును క్రీ. 1384 ప్రాంతమున జయించగల్గెను. తిప్పన అప్పుడే వినుకొండ దుర్గాధ్యక్షుడై యుండును. ( ఆ సమయమున వేరొక రెవరేని యా దుర్గమును బాలించుచుండి రనుటకునుఁ దగిన యాధారములు లేవు). ఆ మీఁదటనే బలశాలు రగు రెడ్డిరాజులతో విజయనగరరాజులు బాంధవ్య మేర్పరచు కొనవలసి వచ్చినది. అది నృపనీతి. ఆ నృపనీతి నాటి మంత్రిపుంగవుల పలుకుబడిచేత నిర్వహింపఁబడి యుండును. అందుకేనేమో త్రిపురారాతి మహాప్రధానుఁడు "నృపనీతివ్యవహార కార్య ఘటనా నిర్ధారణా శాలి" గా వర్ణితుఁడైనాడు. అట్లు బాంధవ్యమేర్పడిన తర్వాత రెడ్డి విజయనగర చక్రవర్తులు తమతమ యేలుబడులలో నున్న కొన్నికొన్ని ప్రాంతముల నిచ్చి పుచ్చుకొనుట జరిగినది. బాంధవ్యము దృష్టితో నే ప్రాంతమెవరిక్రిందనున్నను నాడు వారివారికి చెల్లుబడి యగుచుండిన పలుకుబడికి మాత్రమెట్టి యాటంకము నుండియుండదని భావించవచ్చును. ఆ దినములలోఁ దిప్పన వినుకొండలో నెన్నాళ్లుండెనో యెరుగరాదు. బహుశః హరిహరరాయల తుది దినములలోనే తిప్పన కుమారుఁడగు వల్లభరాయఁడు మోపూరు పాలకుఁడుగ నియుక్తుఁడై యుండును. తొలుత వీరి పూర్వులు



మోపూరు ప్రాంతము వారైనప్పటికిని చంద్రామాత్యుని కాలము నుండియు విజయనగరరాజులకడ వర్తిల్లుటను బట్టి స్థిరనివాసముగ నేర్పరుచుకొన్న వినుకొండతో వీరి సంబంధము తెగియుండదు. ఇట్లు వినుకొండ వారుగాఁ బ్రఖ్యాతిఁ గాంచిన కుటుంబము లోనివాఁడగు వల్లభరాయని శ్రీనాథుఁ డాదినములలో విను కొండలో గాని, మోపూరులోగాని, దర్శించి యుండును. అప్పుడే మోపూరు భైరవస్వామికి జరుగు తిరునాళ్ల సందర్భమున ప్రదర్శన కనుకూలముగ వల్లభరాయనిచేత నిర్వహింపఁబడిన యీ రూపకము శ్రీనాథునిడెందమున కెక్కియుండును. వల్లభరాయని ప్రేరణమున క్రీడాభిరామముగా జాలువారి యుండును. విషయమును ముందు వివరింతును. ఈ గ్రంథమందలి రచనా సందర్భమును బట్టి యిది శ్రీనాథుని భీమఖండ రచనమునకుఁ దర్వాతను, కాశీఖండరచన కించుక పూర్వమో లేక తరువాతనో రచియింపఁబడి యుండునని భావింపవచ్చును. *

## కర్తృత్వము

క్రీడాభిరామ కర్తృత్వమును గూర్చి చర్చలు. తర్జన భర్జనలు నేటిదనుక చాలా జరిగినవి. నా యభిప్రాయ మిట్లున్నది. నేడు మన కుపలభ్యమగుచున్న క్రీడాభిరామమనఁబడు వీథినాటకప్రబంధము రచనాసందర్భమును బట్టి శ్రీనాథఁ రచనమని నొక్కి చెప్పుట కెట్టి సందియము నక్కరలేదు. లాక్షణికుల యుక్తికూడా నట్లేయున్నది. కాక, గ్రంథమందలి ప్రతిపదము నా విషయమును చాటుచునే యున్నదని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు విపులముగా నాయా విషయముల నెల్ల తమ పీఠికలో విశదపరచియే యున్నారు. ఇట్టీ గ్రంథమందలి

---

*చూ. కాశీఖండము 7-230 పద్యమున నీ క్రీడాభిరామమును స్మరింపఁ జేయు వివరము లున్నవి.

"గొరగయై మైలారుఁ గొనియాడు నొకవేళ
నొడలిపై బండారుపసుపుఁ బూసి
ప్రణుతించు నొక్క (?) వీరాదేవి నొకవేళ
బవనీఁడయి సమగ్రభక్తి గరిమ"

(ఇందు "నొక్క" యని కాక "నేక" యని యుండునేమో?)

పద్యరచనలోఁ బ్రతిపదము శ్రీనాథుని బట్టియిచ్చుచుండఁగా, నిందే వల్లభరాయనికి కూడ నించుకంత కర్తృత్వ గౌరవ మాపాదింప ప్రయత్నింప వలసిన యగత్యము లేదు. నా యభిప్రాయమున గూడ ప్రతిపదము రస బంధురమగు నీ ప్రబంధమందలి రచన మంతయు శ్రీనాథునిదే గాని, వల్లభరాయనిది కాదు.

అయినను వల్లభరాయని కీ క్రీడాభిరామముతోఁ గల సంబంధ మెట్టిదో పైన సూచించిన విధమున సహృదయుల కిదే నివేదించుచున్నాను.

సంస్కృతమున ప్రేమాభిరామమును త్రిపురాంతకవాసి యగు రావిపాటి త్రిపురాంతకుఁడు వీథినాటకముగా రచించినాడు. రసవత్తరమగు నా దృశ్యప్రబంధమును జదివి వినుకొండ వల్లభరాయఁడు దానియం దాకృష్టు డైనాడు. అందుకే "ఆ మంత్రిశేఖరుండు రావిపాటి త్రిపురాంతక దేవుండను కవీశ్వరుండొనరించిన ప్రేమాభిరామనాటకంబు ననుసరించి క్రీడాభిరామం బను రూపకంబును తెనుంగుభాష రచించినవాఁడు"– అనినాడు శ్రీనాథుఁడు. కాని, యెవరేని వల్లభరాయని యనుకరణమును దప్పుబట్టుదురేమో యని కవీశ్వరుఁడే యిట్లు సమర్థించుచున్నాఁడు.

**"ఆతఁ డెంతటివాఁడు ప్రేమాభిరామ**
**మనఁగ నెంతటియది దాని ననుసరించి**
**వీథియను రూపకము మది వెఱపులేక**
**తిప్పవిభు వల్లభుండెట్లు తెనుఁగు జేసె.**

వ॥ అని యానతిచ్చెదరేని

ఉ॥ **నన్నయభట్ట తిక్కకవి**
**నాయకులన్న హుళక్కిభాస్కరుం**
**డన్నను జిమ్మపూడి**
**యమరాధిపుఁ డన్నను సత్కవీశ్వరుల్**
**నెన్నుదుటం గరాంజలులు**
**నింతురుజేయని రావిపాటి తి**
**ప్పన్నయు నంతవాఁడ**
**తగునా యిటు దోసపుమాట లాడగన్.**



గీ॥ జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాషలందుఁ దెనుఁగు లెస్స
జగతిఁ దల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చుటాడుబిడ్డ మేలుగాదె–"

అనినాడు. తిప్పన్నకృతి తల్లియైన తిప్పవిభువల్లభుని యనుసరణము బిడ్డ తల్లికావున దానికి గౌరవమున్నను అనుభవము విషయమున బిడ్డదే మేలుచేయి. సంస్కృతము మూలమందలి భాషయగుటచేత సామాన్యులకు గ్లిష్టము. దేశ భాషలలోఁ దెనుఁగు లెస్స గావున నీ యనుసరణము కూడ లెస్సయగును. దీనిని బట్టి వల్లభరాయఁ డావీథిని ప్రదర్శన యోగ్యమగు రూపకముగాఁ దెలిఁగించి యుండు ననుకొందును. శ్రీనాథునిచేతఁ బొగడితలు గాంచిన వల్లభరాయని వాగ్వైభవ మందు కానవై యుండును. వీథిని "వీథి" గానే మూలము "ననుసరించి' 'తెనుంగు బాస లో ( కవితలోకాక ప్రదర్శన కనుకూలముగా వచనమున గాబోలును:) వల్లభరాయఁడు రచియించి బహుశః మోపూరు భైరవుని తిరునాళ్ళ సందర్భమున బ్రదర్శింపించి యుండును. ఇందలి రచన యా విషయమును తలపించుచున్నది. అట్లు ప్రదర్శనకు యోగ్యమైన ఆ వీథీనాటకమును వినుకొండ (వాఁడేయైపోయిన) కవి రచించెను ; ఓరుగల్లు (వారేయై పోయిన) విటులగాథ యది; దోరసముద్రపు నటులు ప్రదర్శించిరి. తిరునాళ్ల సందర్భమున బ్రదర్శితమైన యీ నాటకమును శ్రీనాథుఁడు దర్శించియుండును. రసావేశమున నట్టి యపూర్వ నాటకానుసరణమునం దభినివేశమును గన్పరచిన వల్లభరాయని వాగ్ధోరణిని శ్రీనాథుఁడు ప్రశంసించి యుండును. అందుకే యీ నాటక ప్రబంధ మున నున్న కృత్యాదిపద్యము లంత యుత్కర్షతో నున్నవి. *శ్రీనాథుడు కవిసార్వభౌముఁ డగుటఁ జేసి 'కవీంద్రకాంక్షిత త్రిదశమహీరుహంబగు

*కృత్యాది పద్యములున్న యీ పట్టు వల్లభరాయని రచనము కాఁ జాలదు. ఇవి యన్నియు సూత్రధారోక్తులును గావు. రూపకమునఁ బ్రస్తావనలో సూత్రధారోక్తులుగా నుండిన రచనా భాగము బహుశః 1,31,32,33 పద్యము లును, నటుపై భాగమునందును నున్న భావములయి యుండవచ్చును.

తిప్పయ వల్లభరాయమంత్రి' కవియశోలోభమున విభవ మొసగి కోరcగా నాతcడుద్యమించి యనుసరించిన క్రీడాభిరామ వీథినాటకము నీతcడు ప్రబంధీకరించి యుండును. "వల్లభరాయ ప్రణీతం" బని ప్రకటించి యుండును.

ప్రశస్త రచనములు కాcదగినవానికి సాహిత్యసిద్ధిc గల్పించుటకై శ్రీనాథుcడిట్టి కార్యము లొండు రెండు ప్రత్యక్షముగ పూర్వమే కావించినాడు. దేశమున ప్రజల నాలుకలపై భ్రష్టవాక్యములతో శుద్ధి లేకయే ప్రచారమున నుండిన గేయాత్మక గాథలను కాటమరాజుకథ, పల్నాటి వీరచరిత్రమున్నగు వాని నీతcడు శుద్ధమగు ద్విపదప్రబంధములుగా సంతరించియుండెను. వానినే తరువాత ప్రజలనుసరించి పాడి, యాడి తన్మయులు కాసాగిరి. ఈ క్రీడాభిరామ వీథీనాటక ప్రబంధమందే యిట్లనుట కాధారమున్నది. రావిపాటి తిప్పన రచనలోనే నాడు ఓరుగల్లు నగరమున "పలనాటి వీరపురుష పరమదైవత శివలింగభవన నాటి" కడ "చిత్రంపు పలకగద్దెపై –శీలబ్రహ్మాది వీరనాసీరచరిత"ను చిత్రించి యా పల్నాటి వీరుల గాథను వీర పురుషులు గానము చేసి యభినయించిన వివరము లున్నట్లు భావింపవచ్చును. ప్రేమాభిరామ రచనాకాలమునకు వారు పాడిన గేయములు శ్రీనాథునివి కాcజాలవు. ఈ వీథీనాటక ప్రబంధ రచన కించుక పూర్వమే శ్రీనాథుcడా గేయాత్మక గాథను ద్విపదప్రబంధముగా నావిష్కరించి యుండెను. అది దేశమున శీఘ్రకాలముననే ప్రచారము నొందెను. నాటినుండి శ్రీనాథుని ద్విపదలకే పలుకుబడి సాగినది అందుకే యీ వీథీనాటక ప్రబంధమున నా విషయమును వ్రాయునపుడు "యతిగూడం ద్విపదప్రబంధమున వీరా నీకముంబాడె" (16 వ) నని శ్రీనాథుడు విశేషించి వ్రాసికొన్నాడు. అట్లే వల్లభ రాయc డభిమానముతో వ్రాసి యాడించి, యానందించిన రూపకమును గూడ నతcడు వస్తువునందలి గౌరవముచేతను, రావిపాటి త్రిపురాంతకుని రచనపైగల ప్రీతిచేతను, విభవమొసగిన వల్లభరాయని ప్రేరణము చేతను గ్రహించి ప్రబంధీకరించినాc డనవచ్చును. తన కర్తృత్వము శ్రీనాథుc డిందు ప్రత్యక్షముగ నుచ్చరించుకొనక పోయినను నా విషయము సహృదయ



లరయునట్లు తన కవితామూర్తి నంత కెక్కుడుగనే ప్రతిపదమున ముద్రించుకొని యున్నాడు. పల్నాటి వీరులగాథకు సంబంధించిన పూర్వపు గేయములు శ్రీనాథుని ద్విపదల పలుకుబడికి లోcబడి పోయినట్లే వల్లభరాయని రూపక రచనకూడ శ్రీనాథుని కవితామృత ప్రవాహమున వెల్లిcగొనిబోయి యుండును.

## ఇది వీథీనాటకమా – ప్రబంధమా ?

నేడు మన కుపలబ్ధమగుచున్న క్రీడాభిరామము వీథీ నాటకమా? ప్రబంధమా? అని విమర్శకులు సుదీర్ఘముగా చర్చించుచున్నారు. కాని, నా అభిప్రాయమున నట్టి చర్చకుc దావులేదు. వల్లభరాయని 'యనుసరణము' ప్రదర్శన యోగ్యమైన రూపకమే. (దానిని ప్రదర్శించి రనుటకీ గ్రంథమే సాక్ష్యము. కావున, ప్రదర్శింపcబడినది మాత్రమీ గ్రంథముకాదు.) శ్రీనాథుc డా రూపకమునే చేబూని యాతని పేరున ప్రబంధీకరించినాడు. ఈ క్రింది యుపపత్తుల నరయుcడు.

1. ఇందలి తొలి పద్యమే చెప్పుచున్నది.

"గణన కెక్కిన దశరూపకముల యందు
వివిధ రసభావ భావన వీథి లెస్స
యే కవీంద్రుcడు రచియించె నీ ప్రబంధ
మనుచు మీ రానతిచ్చెదరైన వినుcడు"

వీథీ– ప్రబంధముల నిట్లొక్కచోటనే యుచ్చరించుట తల్లక్షణము లాతc డెరుcగక కాదు. వీథి యనcబడిన యీ దృశ్యప్రబంధము (కావ్యపరముగ) నని గాని – లేదా– తన యీ ప్రబంధమున కాధారమైన వీథిని అని గాని కవిభావమై యుండవచ్చును.

2. రూపకాంతమున వల్లభరాయని రచనలో 'జార జాయాపతులు – నిండుcజందురున కర్ఘ్యమిచ్చి' మ్రొక్కినపిదప – నందరు నిష్క్రమింతురు అని రూపకము లన్నిటవలె నుండియుండును. దానినే ప్రబంధీకరించినాcడు కావున, శ్రీనాథుcడు 'అని యందఱును యథాసుఖంబుగ నిజస్థానంబుల కరిగి సుఖియించుచుండిరి' అనినాడు.

3. ఈ కారణముననే గ్రంథాంతగద్యలో 'వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబున సర్వంబు నేకాశ్వాసము' నని నాడు. ప్రణీతమైనది యేకాంకముగల వీథీ నాటకమే. కాని, యిదిమాత్ర మేకాశ్వాసముతో నున్న ప్రబంధము. నాటకమునందలి యంకముల నిట్లు ఆశ్వాసములుగాఁ జేసి నాటక ప్రబంధములఁ గూర్చిన కవులా కాలమున మఱికొందరు లేకపోలేదు.

4. ఇది రూపకమైనచో (మూలము ననుసరించుచు) నందున్న ప్రసంగములు మాత్రమే యిందు నుండఁదగును. కాని, యీ వీథీనాటక ప్రబంధమున మూలమున లేనివనఁ దగినవి "పటురుఘుంరుఘూ" (60) "బంగారుతలుపులు (287),"శీతకాలము" (56), "మాఘమాసంబు" (262), "పరిపాటీఖర్వఖర్జూ" (110) "దొరసెమునందు" (288) మున్నగు (శ్రీ శాస్త్రిగారే తొలుత గుర్తించిన) పద్యములెన్నియో శ్రీనాథుని యభిమానముచేత నాతని కభిమానపాత్రములగు కావ్యములనుండి యనువదింపఁబడి యిందు చేర్చఁబడినవి. ఇట్లు రచన పెరుగుట ప్రబంధలక్షణమే. మఱియొక విషయము. మంచనశర్మ 'కార్యాంతరవ్యాసంగంబున దేశాంతరగతుం' డైనట్లు మాత్రమే మూలమున నుండి యుండునేమో. బహుశః వల్లభాభ్యుదయ కర్తయగు శ్రీనాథుఁడే వీథీనాటక ప్రబంధమున శ్రీకాకుళపు దిరునాళ్లను జూడఁబోయినట్లుగాఁ జెప్పఁబడిన విశేషములతోఁ గూడిన కథాభాగమును గ్రొత్తగా సొంతముగాఁ జేర్చి కూర్చినాడేమో. ప్రేమాభిరామము దొరికినపుడు గాని యీ వివరములు తెలియరావు.

5. ఇది నాటకప్రబంధము కావుననే ప్రస్తావనా ప్రసంగములు, సంభాషణలు, నటుల ప్రవేశనిష్క్రమణాదులు సర్వమును నిందున్నవి యున్నట్లే ప్రబంధమార్గమునఁ బొందుపరుపఁబడినవి.

ఈ వీథీ నాటకమునకును, దీని కర్తృత్వమునకును సంబంధించిన ముడులుకొన్ని యింతటతో విడివడిన వనియే భావింతును. సహృదయులే ప్రమాణము.

## పరిష్కర్తలు – పాఠభేదములు

క్రీ. 1909లో మొట్టమొదట పూజ్యులు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు



ఈ గ్రంథమును బ్రకటించిరి. అందు, సరిగా పరిష్కరింపఁబడని కారణమున నిలచిన ప్రమాదములతోబాటు లెక్కకు మిక్కిలిగా ముద్రణ స్ఖాలిత్యములు గ్రంథపాతములు కూడ నెన్నో దొరలినవి. తరువాత మా పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తునాతునలై యుండిన తాళపత్రప్రతిని జాగ్రత్తగాఁ బరిశీలించి పాఠనిర్ణయము గావించుకొని (ఒకతూరి పాఠనిర్ణయము గావించుకొని యుండిన ప్రతి నెవ్వరో మహానుభావు లెత్తికొనిపోగా తిరిగి పరిశ్రమించి సంస్కరించి చక్కఁ గూర్చుకొన్న ప్రతిని విపులమగు పీఠికతో క్రీ. 1928 మరలఁ బ్రకటించిరి. *అటుపై శ్రీ శాస్త్రిగారే పునర్ముద్రణమునకని తామే స్వయముగా సంస్కరించుకొని యుండినప్రతి ననుసరించి శ్రీ ప్రభాకర పరిశోధక మండలివారు క్రీ. 1953లో శ్రీ బండారు తమ్మయ్యగారి పీఠికతో వారిచేత పరిష్కరింపించబడిన ముద్రణము నొకదానిని శ్రీ వావిళ్లవారు వెలయించిరి. ఇప్పుడీ ముద్రణము వెలువడుచున్నది. క్రీ.శ. 1952లో శ్రీ ప్రభాకర పరిశోధక మండలివారు వెలువరించిన ముద్రణమునను శ్రీ శాస్త్రిగారు గుర్తించుకొని యుండిన సంస్కరణములు, విశేషములు చాలవఱకు చేరినను కొన్ని మాత్రము ప్రమాదవశమున కనుమరుగై ప్రకటితములు కాలేదు. వానినిగూడ జతపరచి, పండితులకుఁ బరిశోధకులకుఁ బనికివచ్చు రీతిని సమగ్రముగా నీ ముద్రణము నిప్పుడు నేను పరిశోధక మండలి పక్షమున బ్రకటించుచున్నాను.

ఇట్లీ ముప్వురును బరిష్కరించి ప్రకటించిన గ్రంథ స్వరూపమును దిలకించిన మీదట శ్రీ శాస్త్రిగారి పరిష్కరణ దక్షత యెట్టిదో, యెంత సమగ్రమైనదో, సమర్థమైనదో నాకు విస్పష్టముగా నెరుఁగనైనది. పాఠకుల పరిశీలనకై గ్రంథాంతమున సూచికలలో ముఖ్యములగు నాయా పాఠభేదముల నెల్ల వారివారి సంస్కరణములను సంకేతములతోఁ బేర్కొంటిని. వాని మంచి చెడుగులను గూర్చి సహృదయులే విచారము సేయుదురుగాక.

*శృంగార గ్రంథమాలవారు 10 రూ. మూల్యముతోఁ బ్రకటించిన క్రీడాభిరామ ముద్రణమున 'ద్వితీయ ముద్రణ' మని యున్నది. వారీ గ్రంథ మును రెండు మారులు ప్రకటించినా రనుకొనను. శ్రీ కవిగారిది ప్రథమ ముద్రణ మనియు తమది రెండవ ముద్రణమనియు నభిప్రాయమేమో!

ఒండు రెండు విషయములను గూర్చి మాత్రమే యిచ్చట ముచ్చటింతును.

శ్రీ తమ్మయ్యగారు తమ పీఠికలో "వీరి (శ్రీశాస్త్రిగారి) పునర్ముద్రణ పాఠములుగూడఁ గొన్ని యెడలఁ గవి పాఠములు గావేమో యను సందియముల కెడమిచ్చుచున్నవి" అని వ్రాసి శ్రీ శాస్త్రిగారి పాఠములనే చాలవఱకు గ్రహించియుఁ, గొన్నిట మాత్రము భేదించిరి. తమకే సందేహాస్పదములుగా నున్నవానిని సంస్కరింప సాహసింపక యట్లే విడిచితిమని వ్రాయుచు పీఠికలో మాత్రమాయా పాఠముల విషయమున గొన్ని సూచనలిచ్చిరి. అట్లు వ్రాసి, వారును భ్రమప్రమాదముల నధిగమించినవారు కాఁజాలక పోయిరనియే నా విచారము చిత్తగింపుఁడు.

(1) ఇందలి "పటుఝంఝూపవనోత్తృణాలయములో" (60 వ) పద్యమును చూడుఁడు. దానికి మూలమగు గాథను శ్రీ శాస్త్రిగారే తొల్తగాథా సప్తశతినుండి గుర్తించి చూపినారు. ఈ యనువాదము మూలమున కెంత సన్నిహితముగా నున్నదో వివరించుచు లఘు వివరణమును గూడ తమ పీఠికలో నిచ్చిరి. ( చూ. పీఠిక 42పు). శ్రీ తమ్మయ్యగారు వివరణమే విశదముగా లేదనిరి. వారి కిక పద్యమున కర్థమెట్లు కుదురును? "జలధరాణామ్" అనుటకు 'ధారాధరశ్రేణికిన్' అని కి షష్ఠితోడి యనువాదము మూలానుగుణమగునా?" అని విమర్శించిరి. ఏలకాదో? భావమేకాక విభక్తిప్రత్యయమును మూలానుగుణముగనే యున్నదే! ఇంకను 'గర్జావచః ప్రౌఢిమతో మెఱపుకాంతులాకాంతను జలధరపంక్తులకుఁ జూపుట యేమి? ఇందేమైన సారస్యమున్నదా? అని ప్రశ్నించుకొని 'కవిపాఠమును' గుర్తించుటకై "తటిదుద్యోతత చూపు నట్ట నడురే ధారాధర శ్రేణికల్" అని సంస్కరింపవలయు నని యుబలాటపడిరి. వ్యర్థప్రయాస. "మేఘములయొక్క విద్యుత్ప్రకాశము (బయటివారికి) గన్పడ జేయును" అని యనుకొనిరి. అక్కడే అన్వయము వంకరదారి పట్టినది. అది చూపునది వారనుకొన్నట్లు బయటివారికి కాదు. మేఘములకే. బోలెడుసారస్యమున్నది. క్రీడాభిరామమునందే పైపద్యమునకు ముందున్న వచనమున దాని నర్థము చేసికొనుటకుఁ జాలినంతవివరణ మున్నది. తిలకింపఁ దగును. గాథార్థమిది. ప్రియుఁడు దేశాంతర గతుఁ డగుటచే ప్రియురాలు నిర్భర వియోగగ్లాని ననుభవించు చున్నది. దానికి



వర్షాకాలము మఱింత బాధాకరమైనది. గాలికొట్టి యింటికప్పెగిరిపోయినది. లోన మంచముపై వియోగమున ముచ్చముడింగియున్న వనిత మెఱుపు కాంతిలో కాననైనది. మెఱుపుకన్నె జలధరముల కామెను చూపి వాని రాక కారణమున నామె కెంతటి దుస్థితి ప్రాప్తించినదో వివరించినది. అంతేకాని చూపినది బయటివారికి కాదు. ఇక గర్జావచః ప్రౌఢిమనుగూర్చి-గర్జ వాస్తవమునకు మెఱపుదే. మెఱపు వచ్చిన తర్వాతనే మేఘమున గర్జ వినవచ్చును. మెఱపులేని మేఘమున గర్జలెక్కడివి? కావున, విద్యుత్కాంత తనదేయైన గర్జావచః ప్రౌఢిమతో మేఘమాలకు చూపినది. ఇంతకు మించిన వివరణ మనవసరము. కావున, సంస్కారమునకుఁ దావులేదు. పరిష్కర్త లుద్ధృత పాఠము నర్థముచేసి కొనుటకు యత్నించవలెనే గాని తొందరపడి సంస్కరింపఁ బూనుటకు సాహసింపరాదు. ఈ గాథను బోలిన శ్లోక మింకొకటి మృచ్ఛ కటికలో( 5-3) కూడ చూడనగును.

*యది గర్జతి వారిధరో
గర్జతు తన్నామ నిష్ఠురాః పురుషాః
అయి విద్యుత్ప్రమదానాం
త్వమపి చ దుఃఖం న జానాసి.

విశేషముఁ గాంచుఁడు. మేఘుఁడు పురుషుఁడు. విద్యుత్తు ప్రమద. పురుషులకు స్త్రీల వియోగబాధ దెలియదేమో కాని, కనీసము స్త్రీకైనా తెలియదా! అందుకే క్రీడాభిరామపద్యమున మెఱపు మేఘమునకుఁ జెప్పుట;

(2) క్రీడా. 287వ వచనమున "తమ్మడిసాని (కూతుం గూర్పునేర్పు" అని శ్రీ తమ్మయ్యగారు గ్రంథమున లేని కూతు శబ్దమును జేర్చిరి. ఈ సంస్కార మనవసరము. వచనము 273,286, 291 - పద్యము 289 తిన్నగాఁ బరికింపఁ దగును. "తమ్మడిసాని మందిరమున" విడిసిరి. అక్కడి "పూజారి విధవచేత" కబురంపిరి. "పూజారి వారియింట ముంగిట నిలిచి' టిట్టిభునకు "తమ్మడిసానిం గూర్పు నేర్పు విచారించి - సన్నపుటెలుంగునం

*చూ. సాహిత్యాచార్య భట్టశ్రీ మధురానాథశాస్త్రి పరిష్కరించి ప్రకటించిన గాథాసప్తశతి పుట 7 (నిర్ణయసాగర్ ప్రెస్సు. 1933)

బూజరిసానిం బిలిచి కనకనిష్కంబుతోడ గూడ కర్పూర వీడియం బచ్చేడియ (తమ్మడిసాని) చేతిలోనంబెట్టి యాపాదమస్తకంబు వీక్షించి" – వర్ణించిరి. ఆ వర్ణనము తమ్మడిసానిదే కాని, యన్యులది కాదు. పూజరిసాని బిలిచి – "కూడింపుకూతు" నన్నారు. "పూజరిసాని బిడ్డను వెడ్డువెట్టి " టిట్టిభుని చేతికిచ్చి ఇత్యాది. పూజరిసానియే తల్లి తమ్మడిసానియే పూజరిసాని కూతురు. విమర్శకులు "కూతు" అని చేర్చి చెప్పినప్పు డెట్టి యన్వయము చెప్పుదురో యట్లే ఆ పదము లేకున్నను నన్వయము పొసగును అంతేకాదు, పూజరి సానియుఁ తల్లిబిడ్డ లనఁదగినట్లే యిందున్నది కావున, వారి సంస్కారము నవసరము. ఉన్న పాఠము తిన్నగానే యున్నది.

(3) 'కీసిన వెదురు సలాకల' (క్రీడా 70వ) 'కీసిన యను పదము నిఘంటువుల కెక్కలేదు. దీనిని 'గీసిన' అని శ్రీ తమ్మయ్యగారు మార్చిరి. అవసరము లేదు. చీరుట అను నర్థముగల కీయుధాతువు పరుషాదియేకాని సరళాదికాదు. నవనాథచరిత్ర చూడఁదగును. "ఒసవుగా ముసుఁగిడ యొరగొం గడియుఁ గీసిన గుదియయు" *ప్రాచీనకవి ప్రయుక్త పదములను తామెఱిఁ గిన విధమున సంస్కరించుట కాదు, పరిష్కర్తలు చేయవలసిన పని. వానిని శక్యమగు రీతిని గుర్తించి కాపాడవలెను.

ఇట్లే క్రీడా 170 పద్యమున తాళపత్ర ప్రతిలోనున్న "విద్దికంచి రామాయణము"ను – "కంఠమెత్తి రామా" యని దిద్దిరి ఉచితముకాదు 63వ పద్యమున "పదియార్వన్నె పసిండితీగలగతిన్ బ్రాఁకెం బ్రభా జాలముల్" అనియుండఁగా వీరు "బ్రాఁకం బ్రభాజాలముల్" అని దిద్ది వాక్యమును సంశ్లిష్టము గావించిరి. ఉన్న పాఠమున లోటు లేనప్పుడు, అధమ మర్థవిశేషమేని సాధింపఁ గుదురనప్పుడు సంస్కార మనవసరము. ఇట్లే "పూవుంబోడులు లేరె" 169వ పద్యమున దుదికి "సుషమాసౌభాగ్యలక్ష్మిన్ గనున్" అని యున్నపాఠమును 'నగున్' అని మార్చిరి. 'కనున్' అని యున్న పాఠమునఁ గల యర్థ సారస్య మీ మార్పున నాకుఁ గానరాలేదు. "మంచన వింటివో" 54వ పద్యమున వీరు శ్రీ కవిగారి పాఠమును దృష్టిలోనుంచుకొని

*చూ. శ్రీ దీపాల పిచ్చియ్యశాస్త్రిగారి "సాహిత్య సమీక్ష" పుట–238.



"దమ్మదార" యను రూపము నుంచిరి. ఇది 'దమ్మదార' యనికాక "ధర్మదారపట్టించు" ననియే బహుథా ప్రయుక్తము. తాళపత్ర ప్రతియందు నట్లే యున్నది. కావున నది నట్లేయుంచుట పాడి ఈ పద్యమందే తుదకు "కాహళిన్" అని శ్రీ కవిగారు గ్రహించిన తాళపత్రప్రతిపాఠమున్నది. ధర్మదారపట్టించుటయే ధర్మకాహళ వట్టించుట – చూ.'ధర్మకాహళ వట్టించి' (దశకు 2–67); కుక్కుట కంఠ కాహళంబులు వట్టించె' (నైష 7–198 ; "ఆత్మసంగ్రామ విజయలబ్ధ మదనకాహళము" (నైష 8–105). పద్యమున "ధర్మదారపట్టించు" నని యున్న మీదట "కుక్కుటకంఠకాహళిన్" అని యుండుటలో సారస్యములేదు. అయినను తాళపత్రపాఠమునే నేనును సంభావించుచున్నాఁడను 39 పద్యమున "అటవీప్రదేశమున జెట్టులఁ జేమల నేమి గల్గునన్ రతి నిటు సంచరించితివి" అని శ్రీ తమ్మయ్యగారు దిద్దివైచిరి. "జెట్టులుచేమలు నేమిగల్గినన్ బతిచెడి సంచరించెదవు" అని యున్న తాళపత్ర ప్రతిపాఠమున కర్థము కుదురుచునే యుండఁగ దిద్దనేల? అంతేకాదు "పతిచెడి" శ్రీనాథకవి ప్రయుక్తపదము. సంస్కారము తగదు 13వ పద్యమున "పుత్రుడు" అనికాక శ్రీ శాస్త్రిగారు సంస్కరించినట్లే విభక్తిమర్యాద నపేక్షించి "సుతునకు" నని యుండదగును.

మరియొక పాఠము విషయము. చూ. పద్యము 144. ఇందు గొరగపడుచు గావించిన విశేషములు వర్ణింపఁబడినవి. "రసనా ప్రవాళమున శ్రీఘ్రము గ్రుచ్చెను నల్లపూసపే రనుపమలీల" అనియున్న పాఠమునకు డా. నేలటూరి వేంకటరమణయ్యగారు "రశనా ప్రణాళమున" అని సంస్కారమును జూపినారు.* దానికి వారు "నల్లపూసలలో దారము గ్రుచ్చె" నన్నట్లేమో చెప్పిరి. రసనా –రశనా పదములకు మొలనూలు, ఒడ్డాణము నను నర్థము లున్నవే కాని దారమను నర్థము కానరాదు. అట్లే ప్రనా(?) ళ మనుపదమునకు గొట్టమను నర్థమును గల్పించుకొనవచ్చును. వారనుకొన్న యర్థము కూడా నందురాకున్నది. – "రసనప్రవాళ" మను పాఠమే సమంజస మనుకొందును. భీమఖండమున "ఘనచక్రవర్తి యిచ్చిన ప్రవాళంబుల యొడ్డాణము ధరించు"

*చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి "హిస్టరీ ఆఫ్ రెడ్డి కింగ్స్"

(1-117) అని యున్నది. నాడు ఒడ్డాణములు ప్రవాళములు మున్నగు పూసలతోఁ గూర్చెడివారు. పవడములను, నల్లపూసలను గలిపి గ్రుచ్చుట పరిపాటియే. పగడములు పెద్దవి నల్లపూసలు చిన్నవి. శీఘ్రముగా రెంటిని గలిపి గ్రుచ్చుట క్లిష్టము. గొరగపడుచు ఆ పని కావించిన దని భావమేమో!

ఇవియే కాక పూర్వముద్రణములం దన్నిటను నిట్టివే మరికొన్ని ప్రమాదములు దొరలినవి. వానినికూడా నీ ముద్రణమున శ్రీ శాస్త్రిగారే సరిపరచుకొని యున్న వానిని జతపరచితిని సూచిక చూడనగును.

## కాకతమ్మ

శ్రీ శాస్త్రిగారు తొల్దొల్త కాకతమ్మ చిత్రము నిందు ప్రకటించిన తర్వాత పలువురా విషయమును గూర్చి విశేషముగాఁ బరిశోధన గావించిరి. డా॥ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగా రీకాకతమ్మ చిత్రమునకు దిగువనున్న జంతువును నక్కగా నూహించి యీ దేవతను చాముండిగా భావించిరి.

కాకతమ్మయనగా యమునిశక్తియైన చాముండి' యనిచెప్పి 'యామె మృత్యువున కధిదేవత' యనియు, 'ఏకవీర అనగా రేణుకాదేవి. విష్ణువు అవతారమైన పరశురాముని కన్నతల్లి యగుటచేత ఈమె జగదంబయైనది. పామరజనానికి ఈమె సృష్టికి ఆదిదేవతగానూ, ఆమె నాశమునకు ఆదిదేవతగాను వెలసినారు' అనియుఁ జెప్పి 'కాకతమ్మకు సైదోదు ఏకవీర' అనుటను సమర్థించుటకు యత్నించినారు.1 కాని వారి అభిప్రాయములతో నేకీభవింపక శ్రీ జి. ఆర్. వర్మగారు భిన్నముగా వ్రాసిరి. వారి యభిప్రాయమున ఆ విగ్రహమున భయంకరత లేమింజేసియు, దీని క్రింద నున్నది నక్కగాఁ దోపమింపజేసియునది చాముండి కాజాలదు. 'కాకతమ్మకు సైదోదు ఏకవీర' అనుటలో శ్రీవర్మగారి కది 'ఒకే దేవియొక్క రూపభేదముగా తోచినట్లు వ్రాసిరి.2 అది సరికాదు. సైదోడనుటలో వారిరువురును భిన్నులగుట విస్పష్టము. ఇక నిందున్న విగ్రహము క్రింది జంతువును గూర్చి డా॥ శ్రీపాద వారన్నట్లది నక్కకాదను కొందును. అది శ్రీశాస్త్రిగారు వ్రాసినట్లు వరాహమునే

1. చూ. భారతి, డిసెంబరు 1959; జూలై 960 సంచికలు.

2. చూ. భారతి, జూలై 1960 సంచిక.



దోపించుచున్నది. గోల్కొండ మ్యూజియము నందలి విగ్రహమున నక్క స్వరూపము విస్పష్టముగా నున్నది. దానికిని దీనికిని పోలికలేదు. ఏమైనను బరిశోధకు లింకను జాగ్రత్తగాఁ బరిశీలించి యీ విషయమును గూర్చి సత్యము వెల్లడింతురు గాకని కోరుచున్నాను.

## చేర్పులు, కూర్పులు

పూర్వముద్రణము కన్న నీ ముద్రణము విషయ వివరములతోఁ బరిశీలనమున కనుకూలముగా నుండవలె ననుతలంపుతో కొన్ని మార్పులను కూర్పులను అచ్చులోనికిఁ దెచ్చితిని. ఈ ముద్రణమును సాగించు సమయమున నేను ఓరుగల్లులోనుండిన భాగ్యమున మిత్రుల సాహాయ్యమున నిందు పొందుపరచిన విశేషములు కూడా మరికొన్ని కలవు. చిత్రపటములు సేకరించితిని. ఓరుగల్లుకోట పునాదుల ప్రణాళికను వ్రాయించితిని. కథానాయకు లేయే ప్రాంతములఁ బర్యటించిరో పరిశీలించి యిందు గుర్తించుటకు యత్నించితిని. వానిలో నేడును దుర్గమున గుర్తింపదగిన ప్రదేశములు రెండుమూఁడున్నవి. 1. కేశవ స్వయంభూదేవాలయము. 2. మాచల్దేవి దిబ్బ. 3. వీరభద్రాలయము – ఇప్పుడీయాలయము లేదుగాని బావి మాత్రమే సర్వే పటములలో గుర్తింపఁబడియున్నది. 'వీరభద్రేశ్వర స్థానంబు వెనుక నున్నట్లు పేర్కొనబడిన బొడ్డన బావి' (చూ. 273వ) యిదియే యనుకొందును. దుర్గమునందలి శిథిలములలో కాననైన నర్తకి శిలాప్రతిమకు ఛాయాపటమును సేకరించితిని. బెజవాడ శాసనశిల యందలి మాచల్దేవి చిత్రమును గూడ పరిశీలనమునకై వ్రాయించి జతపరిచితిని.

అప్పుడు ఓరుగల్లు నగర మెంత వైభవముతో నుండెడిదో నేడంతయుఁ బాడుపడి పోయినదికదా! ఈ క్రీడాభిరామమేని దానిని బునరుద్ధరించు గాక!

దీపావళి
20-10-1960

విద్వద్విధేయుఁడు
వేటూరి ఆనందమూర్తి

# ముగ్ధమధుర వాఙ్మయము

భాష యడవివంటిది. కవిత యుద్యానవనమువంటిది. అడవి నుండి శోధించి యందు సుందరమైన చివురుగుత్తులతోనున్న తరులతా గుల్మాదులను గొనివచ్చి చక్కఁబఱచి యుద్యానములందు నాఁటుకొనుచుందుము. బహుప్రయోజనమయిన యడవినుండి పరిమిత ప్రయోజనమయిన యుద్యానము పెంపొందుచున్నది. ఉద్యానపు హృద్యతకూడ నడవియం దెడనెడఁ బొడకట్టఁ గలదు గాని యరణ్యప్రయోజనములెల్ల నుద్యానమునం దొదవఁ జాలవు. అడవి విచ్చలవిడిగాఁ బెరుగునది. ఉద్యానము పెంపు సొంపులకు అరణ్య పరిశోధన మత్యావశ్యకమవును. ఇంతవఱ కాంధ్రకవి తోద్యాన పాలకులు తమ కవితోద్యానమందు నాఁటిన వచోవల్లరులు కొన్ని దెఱఁగులవే యున్నవి. ఇప్పుడు వింతవింత వన్నెచిన్నె యుద్యానములు వెలయుచున్నవి. పరికల్పకులును బలుదెఱఁగులవారు వెలయుచున్నారు. వారువారు వారివారి హృద్యతల కనుగుణముగా భిన్నభిన్నరీతుల పలుకు పువుగుత్తులను వాని కూర్పు తీర్పులను జూచుకొనున్నారు. ఇదిచక్కగా సాగుటకు, గవితోద్యానములు వెల్లివిరియుటకు, వార్వారు భాషారణ్యమునఁ బరిశ్రమించి, పరిశోధనము నెఱపి యపూర్వముల నరయుచుండు టావశ్యకము కాదా?

విచ్చలవిడిగా జీబుకొని వెలయుచున్న యాంధ్రభాషారణ్యమునుండి కవితోద్యానమునుఁ గొని తేవలసిన హృద్యవచోవల్లరు లింకనెన్నోయున్నవి. చవులొలుకునవి, పలుకుబళ్ళు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు, ఇత్యాదులు పెక్కులు అపరిశోధితములై, యముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచునున్నవి. అట్టి వానిని బరిశోధించుటలోను, సేకరించుటలోను నాకుఁ గోర్కి కొండంత.

పామరులనుండి పండితులదాఁక, వారిలోఁ గూడ బాల్యమునుండి వార్ధకముదాఁక నంతరము లనేకము లున్నవి. ఎన్ని యంతరములున్నవో యన్ని భాషారీతులున్నవి. వ్యవహారార్థమైన భాషారీతులేకాక రంజనార్థమయిన కవితారీతులు గూడ నంతరములఁబట్టి యనేకభేదములు గలవిగానున్నవి. అవియెల్లఁ బరిశోధితములై యాదృతములు గావలెను. పలువురు దీనికై ప్రయత్నించుట బాగు. భూములకువలె భాషకును సర్వే జరుగవలెను.



నేనట్లు సేకరించుచున్నదానిలో బాలుర ముగ్ధమధుర వాఙ్మయము నిప్పుడు వేఱుపఱిచి, 'బాలభాష' యనుపేర గ్రంథముగా వెల్లడించుచున్నాఁడను. దాని నిర్దేశించియే నాకుఁదోచినవి నాలుగు ముక్కలిక్కడ వ్రాయుచున్నాఁడను.

ఉన్నత కవితావాహినికి బాలవాఙ్మయ మూటపట్టని చెప్పవచ్చును. బాలభాషలో సహజముగా నంకురప్రాయములుగా గాన్పట్టు కవితాగుణములే ప్రౌఢభాషలో సంస్కృతములై బలుపొందుచున్నవి. సరళాక్షర సౌష్ఠవము, సంగీతచ్ఛాయ, యతిప్రాససంగతి, యాంధ్రకవిత కవతారమునాడే యలవడినవన్న విషయము నీ బాలవాఙ్మయము ప్రవ్యక్త పఱుచుచున్నది. పసిపిల్లల కర్థానుస్యూతములుగా శబ్దములను సంధించి వాక్యములను వ్యాహరించుట కింక నలవాటు కాకముందే యతిప్రాసముల పొందిక యలవడుట కానవచ్చును.

రంగు రంగు బిళ్ళా,  
రూపాయదండా,  
దండాగాదు తామరమొగ్గ,  
మొగ్గాగాదు మోదుగుమాద.

– ఇత్యాది

బండో యమ్మ బండి,  
బండికి కుచ్చులు తెండి;  
సుబ్బారాయడి పెండ్లి,  
చూచి వత్తాం రండి.

అమ్మనాకు బువ్వ,  
అరచేతిలో గవ్వ,  
చేయబోకు తప్పు,  
చేస్తే కాలి చెప్పు.

– ఇత్యాది

వీనిలో వాక్యార్థ సంగతి యంతగా లేకున్నను యతిప్రాస సంగతి యనుగతమై కానవచ్చుచున్నది.

పంతులు పంతులు
పావుసేరు మెంతులు,
కూర్లోకి చాలవు
గుప్పెడు మెంతులు.
పంచా యెక్కం పంచా,
పంతుల్నేసి దంచా;
రోట్లో వేసి రుబ్బా,
రొట్టె గాల్చుకు దొబ్బా !!

బడిబాలురే కదా యీ దుడుకుఁ గవిత్వమునకుఁ గర్తలు; యతిప్రాస ముల మెలపే కదా పయి రచనములకుఁ జెప్పఁదగిన యర్థము.

తెలియవలసిన విషయ మెంతయుఁ దేలికైన భాషలో, అందును వచనములో నున్ననుగూడ, నది వాక్యముపై వాక్యముగా నెడతెగకుండఁ దీగసాగుచున్నపుడు బాలురు, పామరులు వెంటాడుచు దాని యర్థము నందుకొనఁ జాలకుందురు. ద్రవరూపముననున్నను ఉగ్గుఁబాలను ధారగా బోయుచున్నచో బాలురు త్రాగఁజాలరు. గ్రుక్కెడు గ్రుక్కెడు చొప్పున నాచియాచి పోసినచోఁ ద్రాగఁ గల్గుదురు. అట్లయిన నాత్రాగినదియుఁ జక్కఁగా నిముడును, అట్లే తెలియవలసిన విషయమునుఁగూడఁ ద్రుంచి త్రుంచి యించించుకగాఁజేసి, నడుమ నడుమ, విశ్రాంతికై యెత్తుపలుకును గూడఁ జేర్చి చెప్పినచో బాలురు తేలికగాఁ దెలిసికొనఁ గల్గుదురు. అప్పుడు దాని యర్థమును తలలో వాండ్రకుఁ జక్కఁగా నెలకొనును. అంతేకాక, యది యించుక తాళలయానుగుణముగా గణబద్ధమై యుండుటచేఁ జిత్తరంజకమై మరవరానిదై కూడ నుండును. హెచ్చుగా బాలురయు, పామరులయు వాఙ్మయ మీ విధముగాఁ గానవచ్చుచున్నది.

రామన్న రాముడోయి రామభజనా,
రాముడొస్తున్నాడు రామభజనా.
పూలారథము నెక్కి రామభజనా,
వూరేగుతున్నాడు రామభజనా.

–ఇత్యాది.



శ్రీరామ లక్ష్మణులు గోవిందా రామ,
చెలులతో గూడుకొని గోవింద.
పన్నెండు వర్షములు గోవిందా రామ,
ప్రమదముతో ఉండిరీ గోవిందా.
దశరథుఁడంతటను గోవిందా రామ,
తగ వసిష్ఠునిజూచి గోవిందా.

–ఇత్యాది.

తుమ్మెద పదాలు, కోవెల పదాలు, చందమామ పదాలు, బాలనాగమ్మ కథ మొదలయినవి యిట్టివే.

దశరథు డనుపేర తుమ్మెదా
ఒక్క
ధరణీశు డున్నాడు తుమ్మెదా
ఆ
ధరణీశునకు తుమ్మెదా
నలుగురు
తనయూలున్నారు తుమ్మెదా !

– ఇత్యాది.

వీనిలో ఎత్తు పలుకులు విడిచితిమేని మిగిలినది సరిగా సాధార ణముగాఁ జదువఁ దగిన వచనముగా నుండును. యతిప్రాసముల సంగతికై రవంత రచనాప్రయత్నము కావలెను గాని, యిట్టి రచనలలోని కేవచనమును గాని సులువుగా విఱుగఁదీయవచ్చును. యతిప్రాసములు, తాళ లయాన్వితమగు గణబంధము పొసగుటచే నివి చదువునప్పుడెంతో హృదయంగమములుగా నుండును. ఆంధ్రభాషకు సహజాలంకారము లయిన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీఁగడ చవితోఁ జదువఁగలవు. ఈ యింపునెఱుఁగక పోవుటచే నిప్పటి బాల పాఠగ్రంథ రచయితలు “ఇదిగో ఆవు. దీనికి నాలుగుకాళ్ళు గలవు”. ఇత్యాదివిధములఁ బొల్లు మాటలతోనే పాఠములల్లి బాలకుల విసిగించుచున్నారు. బాల్యమం దిట్టి సముచిత సంస్కారముఁ బడయక పోవుటచే నిప్పటిబాలురు మంచి మంచి తెలుఁగు

పలుకుబళ్ళను, వాని సంగీతచ్ఛాయలను, పాటలను, బదములను, బద్యములను జక్కఁగాఁ జదువ నేరకున్నారు.

కంచికిపోతావా కృష్ణమ్మా !
ఆ – కంచి వార్తలేమి కృష్ణమ్మా?
కంచిలో ఉన్నది అవ్వ;
ఆ– అవ్వ నాకు పెట్టు బువ్వ.
బువ్వ ఉన్నదిగాని కృష్ణమ్మా ,
నీకు – పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి యింటిది అప్పు;
ఆ –అప్పు నాకుపెట్టు పప్పు.
పప్పు ఉన్నదిగాని కృష్ణమ్మా,
నీకు –కూర యెక్కడిదోయి కృష్ణమ్మా?
దొడ్లోను ఉన్నది బీర;
ఆ –బీర నాకు పెట్టు కూర.
కూర ఉన్నది కాని కృష్ణమ్మా,
నీకు –నెయ్యి యెక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి అక్కెమ్మ చెయ్యి;
ఆ –చెయ్యి నాకుపోయు నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కృష్ణమ్మా;
నీకు – పెరుగు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
ఉన్న యింటి యిరుగుపొరుగు,
ఆ– పొరుగు నాకు పోయు పెరుగు,
బువ్వ తిందువుగాని కృష్ణమ్మా;
నీకు ఆ– వూళ్ళో పనియేమి కృష్ణమ్మా?
అక్కడ ఉన్నది అమ్మ,
నేను– మొక్కివత్తును కామాక్షమ్మ.

ఈ పదము 'కృష్ణమ్మ' అని ఎత్తు పలుకు గలిగి బువ్వ, పప్పు, కూర, నెయ్యి, పెరుగు, అను భోజన పదార్థముల వరుసతోను, వరుసగా



అవ్వబువ్వ , అప్పుపప్పు, బీరకూర, నెయ్యిచెయ్యి, పొరుగు పెరుగు అను అనుప్రాస పదముల సంగతితోను, ముక్తవిషయ గ్రస్తముగాఁ బప్పు మొదలగువాని పునరుచ్చారణముతోను గలదు గనుక, బాలుడు, ఎక్కాలు మొదలగు వానివలె బండవల్లె వేయ నక్కఱలేకుండ నించుకంత ధారణను అవధానమును జూపుచు, అప్పటికప్పుడు పయి పయి పలుకు నందుకొనఁ గలిగి సులువుగాఁ గడముట్ట నప్పగింపఁగలుగును. దీనిచే బాలుని బుద్ధికి వయోనుగుణముగా సుకుమారమయిన పరిశ్రమము, యోజన, కలుగును. ఈ పదము ముగింపు జీవిత పరమార్థముగా భావికాలమునఁ జూచుకొన వలసిన యీశ్వరచింతనము నాటునదిగా నున్నది. ఇట్టిదే యింకొక్కటి.

ఎండలు కాసే దెందుకురా?
వానలు కురిసే టందుకురా.
వానలు కురిసే దెందుకురా?
చెరువులు నిండే టందుకురా.
చెరువులు నిండే దెందుకురా?
పంటలు పండే టందుకురా.
పంటలు పండే దెందుకురా?
ప్రజలు బ్రతికే టందుకురా.
ప్రజలు బ్రతికే దెందుకురా?
స్వామిని గొలిచే టందుకురా.

ఇందు భౌతిక స్వభావము వరుస చొప్పునఁ జెప్పఁబడుటచే బాలుఁడా వరుస నంటుకొని, యొకటి రెండు మారులు వినినంతనే తప్పకుండఁ బదము నప్పగింపఁగలడు.

సనసన్నగా బ్రతిభ నుద్దీప్త పఱచి యవధానమును, ధారణను బెంపొందించి, చిత్తవృత్తి నిటునటు దొలఁగనీక బాలునికిఁ జురుకుఁదనము నేర్పఁగల కథలు, పలుకుబళ్ళు పెక్కులున్నవి. "చిలుకలు కొట్టిన పలుకులేమి చేశావోయి? పిండిగొట్టానోయి. పిండేమి చేశావోయి? రొట్టెగాల్చానోయి." – ఇత్యాదులుకొన్ని, చేపకథ, గుఱ్ఱముకథ మొదలయినవి కథలుకొన్ని.

మఱియు బాలురవిద్యాభివృద్ధి యాటపాటల చాటున దెలియకుండా వెలయునదిగా నుండుట మేలు. ప్రాఁతకాలమున నది యట్టిదిగా నుండెను. పసితనముననే బాలురకు రామకథ మొదలగు పుణ్యకథలను, నీతివార్తలును నుయ్యాలలో నూచుచు జోలలుగా బాడుచు తల్లులు నేర్పెడివారు. ఇప్పటికిని బల్లెటూళ్ళలో ప్రాఁతకాలపు తల్లులిట్లు జోలలు పాడుట గానవచ్చును; గాని పట్టణములందుఁ జప్పగా జట్టువాఱుచున్నది. నేఁటి నాగరపు స్కూళ్ళలో జదువుకొను బాలిక లిట్టివాని నెఱుఁగరు గదా! వీరు తల్లులైనపుడు తనయుల కిక నెట్లు తెలియును !

ఉత్తముని పేరేమి? ఊరు పేరేమి?
సత్యపురుషులఁ గన్న సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు, ఊరు అయోధ్య,
సత్యపురుషులఁగన్న సాధ్వి కౌసల్య.

ఇల్లాళ్ళు ముగ్గురే యీ దశరథునకు,
పిల్లాళ్ళు నలుగురే పేరు గలవారు.
అయోధ్యలో వారు అంద రున్నారు,
నయోధ్యలో వారు సరిలేని వారు.

జగతిపై రామయ్య జన్మించినాడు,
సత్యమ్ము లోకాన స్థాపించినాడు,
తల్లిదండ్రులమాట చెల్లించినాడు,
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు.
సీతామహాదేవి సృష్టిలోపలను
మాతల్లి వెలసింది మహనీయురాలు.
శ్రీరామ జయరామ సీతాభిరామ
కారుణ్య గుణధామ కళ్యాణనామ

కృష్ణమ్మ వంటివాడు కొడుకొకడు పుడితె,
కష్టాలు కడతేరు కన్నతల్లులకు
మారు తల్లీచేత మాటపన్ననుచు
సారంగధరు దమ్మచావు కొప్పాడు.



పాటలతోను, పదములతోను గూడిన పసిపిల్లలయాట లనేకము లున్నవి. వానిలో వింత వింత విషయము లనేకములున్నవి. గణనీయమైన కవితయున్నది. బాలభాషలో నాకు శక్యమయినంత వాని సమకూర్చినాఁడను.

నన్నయాది కవీశ్వరులు తమ దేశకాలములను దెలుపుకొనుటచే వారి గ్రంథముల ప్రాచీనత యెట్టిదో మన మెఱుఁగఁ గల్గుచున్నాము; కాని యీ పాటలు ఈ కాలమున వెలసినవని, వీరు రచించిరని చెప్పుట కెట్లు సాధ్యమగును? నన్నయాదుల కింకను బ్రాచీన కాలమునాఁటివిగూడఁ గొన్ని యిందుండవచ్చును. నిన్న నేఁటివిగూడ నుండవచ్చును. నన్నయాదుల రచనముల కింక నెంతో పూర్వమే యిట్టి రచనములు పుట్టియుండక తీఱదు. నన్నిచోడాదు లిట్టివానిఁ బేర్కొన్నారు. పాల్కురికి సోమనాథు డిట్లనుచున్నాడు.

పొందంగ "రాగుంజ పోగుంజ లాట"
కుందెన "గుడి గుడి గుంచంబు లాట"
"అప్పల విందుల యాట" పల్మాఱు
చప్పట్లు వెట్టెడు " సరిగుంజ లాట"
"చేర బొంతల యాట" "చిట్లపొట్లాట"
"గోరెంతలాట" "దాఁగుడు మూతలాట,"

వీనిలో "గుడిగుంచ" మాట, "చిట్లపొట్లాట" ఇప్పటికిని ఇదే యుప క్రమముగల పదములతో బాలకు లాడుకొనుచున్నారు. చూచితారా ! ఆ పదము లెంత ప్రాఁతకాలమునాఁటివో !

---

( ఈ వ్యాసము తొలుత "కళ" (1923) లో ముద్రితము. "బాలభాష" (1950) పీఠికగా స్వీకృతము.)

# ఉత్తర హరివంశము
# పీఠిక
# నాచనసోమన

ఉత్తర హరివంశమును తెనుఁగున రచియించిన యీ కవి నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; భారద్వాజ గోత్రుఁడు; నాచన కుమారుఁడు.

## దేశము

విద్యానగరాధిపతి యగు సంగమ బుక్కభూపాలునిచే నేటికడప మండలమందలి పెంచుకలదిన్నె గ్రామమును బ్రతిగ్రహించుటచే నీ కవి కడపమండలమువాఁ డయి యుండవచ్చు ననవచ్చును. హరివంశముగాక వసంతవిలాస మని మఱియొక గ్రంథమును గూడ నీ కవి రచియించెను. లక్షణగ్రంథములం దుదాహృత మగునీ క్రింది పద్యమునుబట్టి తత్కృతిపతి మాచయ బ్రహ్మఁడని యెఱుఁగ నగుచున్నాఁడు.

ఉ. శ్రీచన్నుంగవక్రేవఁ గ్రొమ్మెఱుఁగులఙ శృంగారపుందోఁటకుఙ
బ్రాచీనం బగుచున్న వింశతి నఖప్రౌఢిఙ సుఖాంభోధివే
లా చంద్రోదయ మైనదేవుఁడు కృపాలంకారచిత్తంబునఙ
జూచుఙ మాచయబ్రహ్మధీమణిఁ గవిస్తోమైకచింతామణిఙ .

ఈ మాచయబ్రహ్మని శాసనము పల్నాడుతాలూకాలోని కారెమపూఁడిలో నున్నది.* కావున నీకవి గుంటూరు మండలము వాఁడేని కావచ్చును.

## కాలము

ఈ కవికాలమును గూర్చి పలుదగవులున్నవి. ఇంతదాఁక నెవ్వరును సముచితమయిన సిద్ధాంతమును నెలకొలుపలేదు. వాదస్వరూపము నించుక వివరించి నాకుఁ దోఁచిన సిద్ధాంతము నెఱిఁగింతును. **'ఎపిగ్రాఫికా కర్ణాటికా'** లో నాచనసోముని కాలము నిర్ణయించుటకుఁ దోడ్పడు శాసనములు రెండున్నవి.

*అది నేఁ జూచితిని; కాపివ్రాసికొని రాలేదు.



ఆ రెండును నేకదానమునే పేర్కొనుచున్న యేకశాసనమునకే భిన్నప్రతులు. నాగరిలిపితోనున్న తామ్ర శాసనముల నుండి యెత్తఁబడినవి. మూలప్రతి బింబము లా గ్రంథమునఁ గానరావు. కావున, నిప్పు డందుఁగానవచ్చుచున్న శాసనపత్రికలలోఁ గొన్ని యక్షరములు పాఠక ప్రమాదమునఁ జేరి యుండవచ్చు ననవచ్చును. సంగమరాజుకుమారులు, హరిహర, కంప, బుక్క రాయలు, మారప, ముద్దపనాము లయిదుగురిలో నడిమివాఁ డగు బుక్క రాయఁడు, విద్యారణ్యకృతమయిన విద్యానగరమున రత్నసింహాసనముననుండి **రసభూనయనేందు రసాభ్రనయనేందు** (రెండు ప్రతులందు రెండువిధములుగా నున్నది) సంఖ్యాకమయిన శకాబ్దమున, తారణచైత్ర శుక్ల నవమినాఁడు అష్టాదశపురాణముల తత్త్వార్థము నెఱిఁగినవాఁడు., అష్టభాషాకవిత్వ శ్రీ మహితుఁడు, నాచన కుమారుఁడు నగు సోమునకు గుత్తిదుర్గమందుఁ గల పెంచుకలదిన్నె గ్రామమును దానము చేసెను అని శాసన సారము. రసభూనయనేందు, అనఁగా 1216 అగును. రసాభ్రనయనేందు అనఁగా 1206 అగును. శక 1216 గాని 1206 గాని తారణవత్సరము కాదు. మఱియు నీ కాలమునకు దాతయగు బుక్కరాయల యునికియే తెలియరాదు. మఱియు నా కాలమునకు విద్యారణ్యులు విద్యానగరమును నిర్మింపఁజేయనే లేదు. శక 1258 అగు ధాతృనామ సం. వైశాఖ శుద్ధ సప్తమినాఁడు పుష్య నక్షత్ర యుక్త సింహలగ్నమున విద్యారణ్యుల నిదేశమున విద్యానగరము నిర్మింపఁబడినట్టుగా *కాపలూరు శాసనము చెప్పుచున్నది. దీనినిబట్టి చూడఁగా నిప్పుడు చెప్పిన రెండు శకకాలములు సరిగావని యేర్పడుచున్నది. తారణవత్సరము సరిగా శక 1266 సంవత్సరమున వచ్చుచున్నది. అప్పటికి విద్యానగర నిర్మాణము జరిగి యెనిమిది వత్సరములగును. కావున పయి శాసన మీ 1266 కాలమునే తెలుపునదిగా నుండవలెను.

**"శ్లో. అలంకృతే శకస్యాబ్దే రసర్తునయనేందుభిః, తారణాబ్దే చైత్ర మాసే నవమ్యాం శుక్లపక్షకే"** అని యుండవలసిన శ్లోకము శాసనము చెక్కినవారో, చదివినవారో తప్పుటచే 'రసభూ' 'రసాభ్ర' అనునపపాఠము లేర్పడియుండునని నేను తలఁ చుచున్నాఁడను. నాగరిలిపివ్రాత 'రసర్తు' అనునది 'రసభూ' గాను 'రసాభ్ర' గాను పొరపుచ్చుట సంభావ్యమే.

*నెల్లూరి శాసనములు 1 వాల్యం 15 నెం॥ తామ్రశాసనము.

కాని, దొరతనము వారి పరిశోధనలవలన బుక్కరాయలు శక 1274 నాఁటికి రాజ్యమునకు వచ్చినట్టును నంతకుఁ బూర్వమాతని యన్న యగు హరిహరరాయలు రాజ్యమేలుచున్నట్టును దెలియవచ్చును. రాజ్యమునకు రాక పూర్వము బుక్కరాయలు దానము నెట్లుచేయఁగల్గునని యొక యాక్షేపమున్నది. దీనికిట్లు సమాధానము చెప్పవచ్చును.

ఎపిగ్రాఫికాకర్ణాటికా వాల్యుం 5. హసన్ జిల్లా చెన్నరాయపట్నం తాలూకా శాసనము నె. 256లో హరిహరరాయలు రాజుగానున్నను, వాస్తవ మునకు విద్యానగరమును నిర్మింపఁ జేసినవాఁడు, పేరుపెట్టినవాఁడు బుక్కరాయలే యనియున్నది. అన్న హరిహరుఁడు రాజుగానున్నను సర్వసమర్థుఁడయిన తమ్ముడు బుక్కరాయఁడు యువరాజుగానుండుటచే నిట్లుదాన శాసనము వెలయింపదగినవాఁడే యగును. ఇదియొక గొప్పయాక్షేపము గాదు.

ఇట్లు చూడఁగా నాచనసోమన క్రీ. 1344లో నున్నవాఁడగుచున్నాఁడు. ఎఱ్ఱాప్రెగ్గడకంటె నీతఁడు ప్రాచీనుఁడు గాఁడు. సమకాలమువాఁడుగాని యించుక తర్వాతివాఁడు గాని యగును.

## బిరుదములు

సకలభాషాభూషణ, సాహిత్యరసపోషణ సంవిధానచక్రవర్తి, నవీనగుణసనాథ బిరుదముల నీతఁడు హరివంశగద్యమందు చెప్పికొన్నాఁడు. చిన్నయ్యసూరిగారు 'అలికంబున యక్షినిడాఁచినట్టి సర్వజ్ఞుఁడని యీతనిఁ బ్రస్తుతించిరి. అది మొదలుగాఁ గొంద ఱీతని సర్వజ్ఞబిరుదాంకుఁడనుచున్నారు.

## ఉత్తరహరివంశము

ఇప్పుడుపలబ్దమై ప్రకటితమైయున్న యీ యుత్తర హరివంశమునే కాక, పూర్వహరివంశమునుగూడ నీతఁడు రచించి యుండవచ్చునని కొంద ఱందురు. రచించెనని కాని, లేదనికాని, యొత్తిపలుకుటకుఁ దగిన యాధారములు గానరావు. ఇందు గ్రంథావతరణిక గానరాకుండుట, పూర్వభాగకథాను స్మరణముండుట, పూర్వహరివంశమునుగూడ నీతఁడు రచించియుండుటకు హేతువులందురు. బ్రహ్మశ్రీ నడుకుదుటి వీరరాజుపంతులుగారిట్లు వ్రాసినారు.

"సోముడు పూర్వహరివంశమును రచించిన ట్లొండు రెండు నిదర్శనములు గానవచ్చుచున్నవి. శ్రీమదోగిరాల జగన్నాథకవి రాజుగారు తమను మనోభిరంజనకావ్యము వ్యాఖ్యానమున నాచనసోమనాథుని యీ క్రింది ప్రయోగము నుదాహరించినారు.



శతతాళదఘ్నహ్రదమున నుఱికెన్ సుమ ద్వి. 48వ. వ్యాఖ్య.

ఈ పాదముగల పద్యము ఉత్తరహరివంశమునలేదు. ఇది శ్రీకృష్ణుడు యమునానదియందలి కాళియనాగరాజకు హ్రదమును నుఱికిన ఘట్టములోనిదని తోఁచుచున్నది. నలువది మూఁడేండ్ల క్రిందటఁ గవియే ముద్రింపించు కొన్న గ్రంథములోని దీయుదాహరణము. ప్రక్షిప్త మనుటకుగాని లేఖక ప్రమాదమనుటకుఁ గాని వలనుపడునది గాదు. కాళీయుని మడువున శ్రీ కృష్ణుఁడుఱికినది పూర్వహరివంశములోని కథయైయున్నది.

నలువదియేండ్ల క్రిందటివఱకును గల యిమ్మహాగ్రంథ మిప్పు డేమయ్యెనో యని భాషాభిమానులకెవ్వరికి విచారము గలుగకుండును? మొన్నటి జగన్నాథకవియఁట ! సోముని హరివంశపు నిండు ప్రతియట ! నేఁడు గానరాదఁట ! కాలమా ! శ్రీ జగన్నాథకవిగారి కుటుంబము గోదావరీ మండలములోని ఫ్రెంచివారి యీనాము కడనున్న నీలపల్లెగ్రామమునకు వెడలిపోయినట్లు వినియుంటిని. మహనీయు లెవ్వరైన దాని యునికిని గనుగొందురుగాక యని వేఁడుచున్నాఁడను."

ఇట్లు వ్రాసిరి కాని, శతతాళదఘ్న హ్రదము పేరు పింగళి సూరనార్యుడు రచించిన కళాపూర్ణోదయమందు సుగాత్రీ శాలీనులకథలో నున్నది. కాని, పద్యపాదము భిన్నవిధము గలది.

ఓగిరాల జగన్నాథకవిగారు ప్రామాదికముగా దానిని హరివంశ మందలి దానిఁగా స్మరించి యుందురేమో ! (అప్పకవి– 'ఒకనాఁడిందుధరుండు' ఇత్యాదిపద్యమును దెనాలి రామలింగని యిందుధరోపాఖ్యానమందలి దానిఁ గాఁ జెప్పినట్లుగానే.)

కవిలోక చింతామణిలో వెల్లంకి తాతంభట్టు నాచనసోమనాథునిదిగా నీ క్రింది పద్యము నుదాహరించినాఁడు.

క. ఆపాదశిరోలంకా, రాపాదితచారుతాభిరామాత్మీయా
రూపాలోకన తుష్టా, కూపారకుమారికా ముకుర మణిబింబా !

ఇది యుత్తరహరివంశమునఁ గానరాదు. (ప్రథమాశ్వాసాంత మందలిదేమో !) పూర్వహరివంశ మాతఁడు రచించియున్నచో నందలిదయి యుండునేమో !) లేక వసంతవిలాస మనిపేరుగల గ్రంథాంతరమందలిదేమో! సోముని వసంతవిలానమందలివిగాఁగొన్ని పద్యములు లక్షణ గ్రంథములందును బ్రబంధరత్నావళిలోను గాననగును. ఈ క్రిందివితాళ చౌపద వసంత విలానములోనిదిగా లక్షణ గ్రంథములందుఁ గానవచ్చుచున్నది.

వీణాగానము వెన్నెలతేట
రాణమీఱఁగా రమణుల పాట,
ప్రాణమైన పినబ్రాహ్మణువీట
జాణలు మెత్తురు జాజఱపాట.

సోమనాథుఁడు తన గద్యమున "బుధారాధనవిరాజి తిక్కన సోమ యాజి ప్రణీతంబైన మహాభారత కథానంతరంబున...నాచన సోమనాథ ప్రణీతంబైన" అని తిక్కన తర్వాతఁ దనపేరే పేర్కొనఁదగిన దన్నట్లు తన యభిమతమును దెల్పుకొన్నాఁడుగాని విద్వల్లోకము, తిక్కన తర్వాత నెఱ్ఱాప్రెగ్గడనే పేర్కొన్నది. కవిత్రయమని నన్నయ తిక్కన యెఱ్ఱనలకే పేరయ్యెను. వారు ముగ్గురు సమాన సమ్మానార్హులగుటచేతనే యిట్లు పేర్వెలసెను. ఎఱ్ఱాప్రెగ్గడకవితకుఁ గల ప్రసాదగుణము సోమనాథుని కవితకు లేదు.

అప్పకవి సోముని హరివంశములోనిదానిఁగా నీ క్రింది పద్యము కూడా హరించినాఁడు. –

శా. నాతో మార్కొనలేరు నిర్జరపురీనాగేంద్ర బృందారకా
రాతుల్ మున్నుగ దేవసంఘములు పోర న్ధీరసంగ్రామకుం
డీత్రైలోక్యమునందుఁ గల్గఁడు రణం బెచ్చోట లేకుండఁగాఁ
జేతుల్ వేయు వృథాభరం బగుచువచ్చె౯ దేవ యీ మేనికి౯

ఇది బాణాసురుని కథలో (౫ ఆశ్వాసము) నిది కాఁదగును. కాని, యుత్తరహరివంశపు వ్రాతప్రతులలో నిది కానరాదు.



మన నాచనసోమన తెల్గుహరివంశమునకు మూలమయిన సంస్కృత హరివంశమున్నదేమో యెఱుఁగరాదు. ఇప్పుడు ముద్రితమయియున్న హరి వంశమునకు నీ తెల్గునకు మిక్కిలి భేదములున్నవి. అందలికథలు పెక్కులిందు జేరనేలేదు. ఉన్న కథలు గూడ వెనుకముందులుగా నున్నవి. సంస్కృత హరివంశమున హంసడిభక కథ గ్రంథాంతమందున్నది. ఇందు చతుర్థాశ్వాసమున నున్నది. సంస్కృతమున హంసడిభక కథకు మిక్కిలి పూర్వమందున్న బాణాసురకథ తెల్గునఁ గట్టకడపటిదిగానున్నది. మూలముననుండి కొన్ని కథలను మాత్రమే కయికొని సోమనాథుఁడు తర్వాతి ప్రబంధరచనకు మార్గదర్శకముగా నవీనగుణనాథుఁడై యీ హరివంశము నిచ్చమెచ్చునట్లు రచించి యుండునని నేను దలఁచుచున్నాఁడను.

నన్నయభట్టారకుని ధారాశుద్ధియును, తిక్కన భావగాంభీర్యమును గలయికఁజెంది మన సోమనాథుని కవిత నాశ్రయించిన వనవచ్చును. కొన్ని చోట్ల శయ్యాసౌభాగ్య మతిమాత్రమై యర్థంపుసొంపును గొంత కొఱఁత పఱిచిన దనియు ననఁదగియున్నది.

మ. గనయంబుం గొనయంబు నెన్నడుముతో గర్ణావతంసంబుతోఁ
జనుదోయిం గనుదోయి సాయకముతో సంధానహస్తంబుతోఁ
జెనకం జేయుచు నేయుచుండె సతి లక్ష్మీభూతదైతేయ త
ర్జన గర్జారవ జర్జరాంగ రుధిరాసారంబుతోరంబుగా౯

శా. ఈ రూపంబున సంస్కృతిందొఱఁగి మీరేచింతలం జెంతలం
జేరంగోరక యూరకున్న నిట విచ్చేయంగఁజేయుం గడుం
బారం బేదని వంతయుంగలిగెనే బాలార్కబింబంబులో
నారంగూరిన యంధకారమన నాహా సాహసంబెట్టిదో !
చతుర్థాశ్వాసము.

శా. ధారాస్ఫారకృపాణబాణ పటలీధారాహతిం దచ్చతు
ర్ధారీశోణితఫాణితద్రవనిపీత ప్రీతులై తన్నుఁ జె
న్నారం బన్నగయక్షరాక్షసు లమర్త్యవ్రాత చేతస్స్ఫురత్
స్ఫారస్ఫారవిహార ఘోరనటనా ఝూటస్ఫుటాటోపులై.
షష్ఠాశ్వాసము.

ఈ కవీశ్వరుని రచనము పెక్కుపట్టులఁ దిక్కనసోమయాజి రచనమును బుడికిపుచ్చుకొన్నట్టు గానవచ్చును. భారతమున సంజయునిరాయబారమును, ఉత్తరహరివంశమున హంసడిభక కథలో జనార్దనుని రాయబారమును బోల్చిచూచిన నీ విషయము తేటపడఁగలదు. మఱియుఁ దిక్కనవోలె నీతఁడు మాటలు తేటగానున్నను లోఁతుగా నాలోచించినఁగాని యర్థముగాని యట్లుగా ననేకపద్యముల రచియించినాఁడు. హంసడిభకోపాఖ్యాన మీ గ్రంథములోని కథలలోనెల్ల హృద్యతమమై విరాజిల్లుచున్నది.

తెలుఁగువాఙ్మయమున నితరకవులెవ్వరును సాధారణముగా బ్రయోగించి యెఱుఁగని యుపమానములను, అర్థాంతరన్యాసములను దృష్టాంతములను నీతఁడు ప్రయోగించెను.

బీరపుఁబొత్తముఁగట్టుకొనిపోయె, పువ్వులు వేడుకైనఁ గడివోయిన వాళ్ళుముదువంగవచ్చునే, ఎంతదఱిఁగిన మిరియాలుం జొన్నలసరిపోవె, కొట్టె వ్వఁడింటికంబము సేసెన్, * నోఁచినవారి సొమ్ములవి నోమనివారిని వచ్చునే ధరన్

పిడుగు చిట్లిన భంగిన్, జీలుగు వెఱిగిన మాలెకుఁ గంబంబుగాదు, చెఱువువిడిచి కాలువఁ బొగడంజనునే, ఎదిరి కిన్మడఁచువాఁడు. తనకుఁ దగరంబు నఱచు టెంతటిభరంబు – ఇత్యాదులు. ఈ కవి యుద్ధవర్ణనలు తత్కాలపు యుద్ధములఁజూచి చేసినట్లున్నవి.

ప్రాచీనాంధ్ర కవికృతులలో దురవబోధము లనఁబడువానిలో సోమనాథునికృతి ప్రధానమయినది. అప్రతీతపదప్రయోగాభిమానము చేతను, శయ్యానైగనిగ్య సంపాదన ప్రీతిచేతను, అనుప్రాస విన్యాసాభిరతి చేతను, నీతఁడు తనకృతిని బెక్కుపట్టులందు దురవబోధము గావించెను. అందును వచనరచనలో మఱియుఁ గఱకుఁదనముఁ జూపెను. ఆంధ్రకవులలోఁ జిత్ర

*ఇదే చరణము సమస్యగా మైలమభీమని పేర నెవరో పూరించినారు. ఆ పూర్తి కూడ నీతనిది యయినను గావచ్చును. అదియిది : –



కవిత్వమును వెలయించినవారిలో నీతఁడే ప్రథముఁడుగాఁ గానవచ్చు వచ్చుచున్నాఁడు. అచ్చ తెలుగు పద్యములు, నిరోష్ఠ్యపద్యములు, అనుప్రాస పద్యములు నీతనికృతిలోఁ గానవచ్చుచున్నవి. ద్విత్రిచతుష్ప్రాసపద్యముల నీతఁడు చెప్పినాడుగాని యందు కందములందు రెండేసి చరణములకే యా ప్రాసములుండుట విశేషము.

అచ్చతెలుఁగు

సీ. తొలుకారు మెఱుఁగులతోఁటలో నాడెడు
రాయంచకొదమతో రాయఁజాలి
యిరులబండారంపుటింటికిఁ బెట్టిన
బొండుమల్లెలకోటఁ బోరగెలిచి
బలుమంచుఁగంబాల బలసిరాఁజుట్టిన
క్రొత్తమంజిడిబాగుఁ గొఱఁతచేసి
పాలపెన్నురువుగుబ్బలిమీఁద నెలకొన్న
నిండువెన్నెల ముగ్గు నిగ్గుఁజెఱిచి

గీ. జడల గ్రొన్నెల మెడఁబాఁప సరిగెదొడలఁ
బొడలతో ల్మేనవెలిమిడిపూఁతమించఁ
బొడమి వ్రేఱేనిముందటఁ బొడవు సూపెఁ
బొడువలందెల్లఁ బొడవైనబోఁటువేల్పు.

ద్వితీయాశ్వాసము.

నిరోష్ఠ్యము

చ. చనిచని కాంచె నంత ఋషిసంహతి ... ....
..... .... .... ..... ... ... ....

ఉ. యాచకఖేచరుండు సుగుణాంబుధి మైలమభీముఁ డీల్గినన్
జూచి వరించె రంభ యెడఁజొచ్చెఁ దిలోత్తమ; దారి నిద్దఱన్
ద్రోచె ఘృతాచి ముగ్గురకు దొడ్డడికయ్యముపుట్టె నంతలో
నాఁచుకుపోయె ముక్తిసతి నవ్విరి యద్దశఁ జూచి నిర్జరుల్
(నోఁచినవారిసొమ్ములవి నోమనివారికి వచ్చునే ధరన్ )

ప్రాస విశేషములు

క. అరిగరమున నేఁదాల్చిన, నరిగరము నగేంద్రధీరుఁడైనం జెడఁడే
యరి దిరమై నన్నదుగుట, యరిది రమైకాభిలాషులగు నృపతులకున్.
చతుర్థాశ్వాసము.

ఈ కవి ప్రయోగించినపదములు కొన్ని యితరత్ర గానరాకున్నవి. శబ్దరత్నాకరమునఁ జేరనిపదము లీ కవికృతిలోఁ బెక్కులున్నవి.

'గండారపుబొమ్మ' అనుపదము నీతఁడు ప్రయోగించినాఁడు. శబ్దరత్నాకరమున నిదిలేదు. దీనికిఁ బలువురు పలుదెఱఁగుల నర్థముచెప్పుచు న్నారు. దేశ్యనామార్థకోశమున, 'గండారపు బొమ్మనఁగా, మండలమున దృష్టిబొమ్మ' అని యున్నది. ఇట్టివి యీ కృతిలోఁ బెక్కులున్నవి.

బమ్మెరపోతరాజాదు లీ కవీశ్వరునిరచనల ననుకరించిరి. శ్రీ రాళ్ళ పల్లి అనంతకృష్ణశర్మగారు, వేలూరి శివరామశాస్త్రిగారు, నడుకుదుటి వీర రాజుపంతులుగారు మొదలగువా రీకవీశ్వరుని దేశకాలములను గూర్చియుఁ గవితారీతులను గూర్చియు నిదివఱకుఁ గొంతవిపులముగా విమర్శముల వెలయించిరి. ఆయా సమయములందు నేను వానిని జూచితిని గాని యీలఘు పీఠిక వ్రాయునాఁడు నాకు శ్రీ వీరరాజుపంతులుగారు సాహిత్యపరిషత్పత్త్రిక 12, 13 సంపుటములందుఁ బ్రకటించిన 'సోమునిహరివంశము' అనువ్యాసమే చూడఁగల్గెను. పయిఁబేర్కొనఁబడినవారు విలువగల విషయములెన్నో వారి వారి విమర్శనములందుఁ జెప్పిరి.

తంజావూరిలైబ్రరిలో నుత్తరహరివంశమునకు రెండు వ్రాఁతప్రతు లున్నవి. వానిఁ జూచి నేను గొన్నిపాఠభేదములను గూర్చుకొంటిని. శ్రీ వేంకటగిరి సంస్థానాధీశ్వరుల పుస్తకశాలలో నొక వ్రాఁతప్రతియున్నది. అది ప్రాయికముగా బహుజనవల్లి సీతారామాచార్యులుగారికి వీరేశలింగము పంతులు గారికిఁ జేకుఱిన ప్రతిని బోలినదే. దానిలోఁ బ్రథమాశ్వాసములేదు.

ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నొక తాళపత్త్రప్రతికలదు. పయి ప్రతులలోని పాఠములుగూడఁ గొన్ని యీ ముద్రణమునఁ గైకొనఁబడినవి.



పాఠభేదములఁ గూర్చుటలో నా వలనఁగాని ముద్రణమున నచ్చు చిత్తులఁ జూచుటలో ముద్రాలయము వారి వలనఁగాని యేవేని దోషము లిందు దొరలి యుండవచ్చును. 'నడచుచునుండు వాని చరణంబులకేకద రాళ్ళ తాఁకుడుల్' అను న్యాయము నెఱిఁగి యిందుఁ బొడకట్టు తప్పిదములను సహృదయులు క్షమింపఁగలరు.

- వేటూరి ప్రభాకరశాస్త్రి.

( నాచన సోముని ఉత్తరహరివంశమునకు పీఠిక – ముద్రణము 1939; 1926; 1913 )

# హర విలాసము

## కృతికర్త

శ్రీనాథకవి జన్మదేశము కృష్ణామండలమందలి కాళీ పట్టణము ; ఒండెc గలుపటము కాcదగను. *పాకనాటి నియోగి గాన యాతcడు పుట్టి పెరిcగిన యూరు పాకనాటనే యుండవలె ననుట సరిగాదు. పాకనాటి నియోగులు తొలుత పాకనాట నుప్పతిల్లినవారగుదురు. అంతేకాని, సదా వారక్కడే పుట్టుచుc బెరుcగుచు నుండవలసినవా రనcగాదు. శ్రీనాథుని బంధువులు (కాన, పాకనాటి నియోగులు) బెండపూcడి యన్నామాత్యాదులు శ్రీనాథుని నాcటనే గోదావరీమండలముననుండిరి. వారు కొన్ని తరముల పూర్వమున నుండి గోదావరీ మండల వాస్తవ్యులే. పాకనాటివారు పాకనాటనే, వెలనాటివారు వెలనాటనే, యాఱువేలనాటివా రాఱువేలనాటనే యానాc డుండిరనుట కాధారములు గానరావు.

శ్రీనాథుcడు క్రీ. శ. 1385 ప్రాంతముల జన్మించి చిరంజీవియై పదునైదవ శతాబ్ది యుత్తరార్థమునc గొందాcకc గూడ వెలయుచుండెను.*

## హర విలాసము

సీ. కమలనాభుని పౌత్రుc గవితామహారాజ్య
భద్రాసనాసీనుc బరమపుణ్యుc
బాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రుc గులపవిత్రు
భీమాంబికామారనామాత్యనందను
నఖిలపురాణవిద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాధీతినిష్ణాతు
నంధ్రభాషానైషధాబ్జభవుని

నుభయభాషాకవిత్వ ప్రయోగకుశలు
బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప

*చూ. శృంగార శ్రీనాథము.



నవచిత్రిపురాంతకుం దలకాధిరాజు
హితమితోక్తులు వెలయంగ నిట్టు లనియె.

పై పద్యమున శృంగారనైషధ రచన ప్రశంస గలదు. కాన, హరవిలాస రచనము శృంగార నైషధ రచనానంతరము జరిగిన దగుట స్పష్టపడినది. శృంగార నైషధము పెదకోమటి వేమారెడ్డిగారు కొండవీటి సామ్రాజ్యము నేలుచుండుకాలమునc దన్మంత్రి యగు మామిడిసింగామాత్యున కంకితముగా రచియింపcబడినది. అందు మామిడిసింగమంత్రి యిట్లు ప్రస్తుతుడయ్యెను.

మ. అరుదారన్ వివిధాగ్రహారములతో
నాందోళికాచ్ఛత్రచా
మరక (ప?) ళ్యాణకళాచికాదిబహుస
మ్మానార్హ చిహ్నంబు లా
దర మొప్పారcగ వేమభూవరునిచే
తన్ గాంచె సామ్రాజ్యసం
భరణ ప్రౌఢుcడమాత్యసింగcడు నయ
ప్రాగల్భ్యగర్వోన్నతిన్.

క. శ్రీమహిత పెద్దకోమటి
వేమాక్షితిపాల రాజ్యవిభవకళార
క్షామణికి సింగసచివ
గ్రామణికిన్ బాంద్యరాయగజకేసరికిన్.

మ ..... .... .... వేమభూపతి మహా
సామ్రాజ్యరక్షామణీ
యవనాధీశ సభానిరంకుశవచో
వ్యాపార పారంగతా !

శ్రీనాథకవియుc బెదకోమటివేమారెడ్డిగారి రాజ్యకాలమునc దదాస్థాన విద్యాధికారిగా నుండెను. పెదకోమటివేమారెడ్డిగారు క్రీ. శ. 1404 నుండి 1420 దాcక రాజ్యమేలిరి. శృంగార నైషధ రచన మాకాలమున,

అటు తర్వాతనేని జరగినది కావలెను. హరవిలాసరచన మంతకు నింకను దర్వాతి దగునుగదా!

భీమఖండమును శ్రీనాథుఁడు క్రీ. శ. 1428 కిఁ దరువాత రచించెను. * భీమఖండము సంస్కృత గ్రంథమునకుఁ దెలిఁగింపు. అందలి పద్యములెల్ల సంస్కృత మూలానుసారులు. భీమఖండమునను హరవిలాసమునను సముద్ర మథనకథ గలదు. మూలానుసారి యగు భీమఖండపద్య మీ క్రిందిది హర విలాసమునను గలదు.

క. కటుక మగు విషము విషధర
కటకం బగుకేలఁ బూని కౌతూహలియై
ఘుటికా సంసిద్ధుఁడు విష
ఘుటికయనుంబోలె మృడుఁడు గుటుకన మ్రింగెన్.

దీనికి సంస్కృత భీమఖండమున మూల మిట్లు కలదు.

శ్లో. గ్రసతే స్మ జగత్త్రాతా
విషభృద్భూషణో విషమ్
ఘుటికాం ఘుటికాసిద్ధో
బద్ధ్వా రసమయీ మివ - 1 అధ్యా 7.

కాన, భీమఖండరచనానంతరము హరవిలాసరచనము జరగె నవలె - అనఁగా, క్రీ.శ. 1430 తర్వాత హరవిలాసరచనము జరిగినట్టేర్పడును.

## కృతిపతి

హరవిలాసము శ్రీనాథుని బాలసఖుఁడగు నవచితిప్పయ యను వైశ్య వర్యుని కంకితము సేయఁబడినది. బాలసఖపదమునకుఁ జిన్ననాఁటి స్నేహితుఁడని యర్థము. ( ఈ యర్థముననే భారతాది గ్రంథములయందుఁ బ్రయుక్తము. ) హరవిలాసరచనము నాఁటికి నవచితిప్పయ కడు వృద్ధుఁడు.

*చూ. శృంగార శ్రీనాథము.



క. కంటిఁ బ్రవిశుద్ధసంతతి
వింటిఁ బురాణములు పెక్కు విశ్వము పొగడన్
మంటి బహువత్సరంబులు
కొంటి యశోధనము సుకవికోటులచేతన్.

హరవిలాసము అవతరణిక.

అతని బాలసఖుఁడగు శ్రీనాథుఁడును హరవిలాస రచనమునాఁ టికి వృద్ధుఁడే. కాని, శ్రీనాథుని కంటెను నవచితిప్పయ మఱీ వృద్ధుఁడు. అవచితిప్పయ కాంచీపురనివాసి. శ్రీనాథుఁడు కాంచీపురి కరిగి యక్కడ నీ గ్రంథమును భీమఖండరచనానంతరము కాశీఖండరచనముకుఁ బూర్వము రచించి యుండును. హరవిలాస కృత్యవతరణికాపద్యములు, కాశీఖండమున 'కంచి యఅవత లసమాస్త్రుఖడ్గలతలు' అన్నపద్యమును నాతని కాంచీపురీ పరిచయము నెఱిఁగించుచున్నవి.

రెడ్డిరాజ్యారంభకాలమునాఁటనుండియును నవచి తిప్పయవంశము వారు ద్వీపాంతరములతో వ్యాపారము జరపుచు, రెడ్డి రాజుల కత్యాప్తులయి యుండిరి. అద్దంకికిని గొండవీటికిని జేరువుగాఁ దూర్పుసముద్రము నొద్దనఁ గల ముకుళపురము (మోటుపల్లి) ఓడరేవుద్వారమున ద్వీపాంతరములతో వ్యాపారము వారు జరుపుచుండెడి వారు.

శ్రీనాథుని బాలసఖుఁడగు నవచితిప్పయ క్రీ. శ. 1390 నుండి 1404 దాఁక రాజ్యమేలిన కొమరగిరి నృపాలునివలన 'ఆందోళికాచ్ఛత్ర చామరతురంగభద్ర పీఠాది రాజ్యచిహ్నములు' వడసెను. అమ్మహారాజునకుఁ బ్రతివత్సరంబును సంవత్సరోత్సవంబులకుఁ దగిన 'కస్తూరీ కుంకుమకర్పూర సంకుమద హిమాంబు కాలాగురుగంధసార' ప్రధానము లగు సుగంధద్రవ్యము లొడఁగూర్చుచుండువాఁడు. మఱియు నాతఁడు 'చీని సింహళ తవాయి హురు మంజి జోణంగి ప్రభృతి నానాద్వీప నగ రాకరములగు ధన కనక వస్తు వాహన మాణిక్య గాణిక్యములను' దెప్పించి యిచ్చువాఁడు. మఱియు,

సీ. పంజారఁ గర్పూరపాదపంబులు దెచ్చె
జలనోంగి బంగారు (పన్నీరు?) మొలకఁ దెచ్చె

సింహళంబున గంధసింధురంబులు దెచ్చె

హురుమంజి బలుతేజిహరులు దెచ్చె
గోవ సంశుద్ధసంకుమదద్రవముఁ దెచ్చె
యాంపఁ గట్టాణిముత్యాలు దెచ్చె
భోటఁ గస్తూరికాపు (టకోశ) ములు దెచ్చెఁ
జీనిఁ జీనాంబరశ్రేణి దెచ్చె
జగదగోపాలరాయ వేశ్యాభుజంగ
బల్లవాదిత్య భూదానపరశురామ
కొమరగిరిరాజదేవేంద్రు కూర్మిహితుఁడు
జాణజగజెట్టి దేవయచామి సెట్టి.

మ. తరుణాసీరి, తవాయి, గోవ, రమణా, స్థానంబులం జందనా
గరు కర్పూరహిమాంబు కుంకుమరజః కస్తూరికాద్రవ్యముల్
శరధిన్ గప్పలి జోఁగు వల్లి వలికా సమ్మాన్లఁ దెప్పించు నే
ర్పరియై వైశ్యకులోత్తముం డవచితిప్పం డల్పుఁడే యిమ్మహిన్

(పై పద్యములఁ గల దేశనామముల కించుక విమర్శనము : చీని – చీనాదేశము. సింహళము ప్రసిద్ధము. తవాయి – మలయద్వీపకల్పనముఁ గల రేవుపట్టణము. తెల్గున "ఓడ యీతవాయి ఒడ్డు చేరితే" అని వ్యవహారము. హురుమం (ముం)జి – హుర్మజ్ – పారసీక సముద్రతీరమునందలిది. జోణంగి – ఇది మలబారుతీరమునఁ గల చిన్న ద్వీపములలోని పట్టు కాఁదగును. జోణంగి కుక్క లని వాడుక గలదు. మలబారుతీరపు లబ్బెసాహెబు లకు శోణహర్ అని పేరు. పంజార–ఇది సుమాత్రా ద్వీపమున పజ్జార్ అను పేరు గలది. ఒండె, బోర్నియో ద్వీపమున పంజార్ మాసీన్ అనుపేరు గలది. ఈ రెండు దేశములు [1]కర్పూర వృక్షములకుఁ బ్రసిద్ధములే యఁట! జలనోంగి – ఇది యేదో యెఱుఁగరాలేదు. [2]ఇక్కడనుండి బంగారు మొలకలను దెచ్చినట్లున్నది. ఆచరణమునఁ దొల్తఁ గర్పూరపాదపములు

1 ఈ విషయమును శ్రీ సోమశేఖరశర్మగారు తెల్పిరి.

2. జలనోంగి చిటగాంగ్ అని శ్రీ కొమరవోలు సుబ్బారావుగారు భావించిరి.



గలవు గాన, యిక్కడ 'పన్నీరుమొలక' యని యుండదగు ననుకొంటిని. శ్రీనాథునినాఁటి కించుక పూర్వముననుండి మాత్రమే మన దేశమునకుఁ బన్నీరు వచ్చుట యేర్పడెను. పన్నీటికిఁగాని, గులాబీచెట్లకుఁ గాని సంస్కృతమునఁ బేరులేదు. అవి మనదేశపుఁ బూలచెట్లు గావు. శ్రీనాథుని కించుక పూర్వపువాఁడగు నాచనసోమన పన్నీటిని బేర్కొనెను. సంస్కృతంబునఁ బన్నీటి కప్పుడు 'హిమంబు' అని పేరు వెలసెను. అది 'పన్నీరు' పదమునకు సంస్కృతీకర ణము. అది సంస్కృత భీమఖండమునఁగలదు. శ్రీనాథుని తెల్గు భీమఖండమునఁ బన్నీరని, గొజ్జఁగి నీరనీ దాని తెలిఁగింపు గలదు. మనదేశమునకుఁ దొలుతఁ బన్నీరును బిదపఁ గొన్నాళ్ళకు దాని చెట్లును వచ్చినవఁట! ఆ చెట్టునకుఁ బారసీకమున 'గుల్' అని పేరు. దాని నీటికి 'గుల్ + ఆబ్ (నీరు)' అని పేరఁట. పన్నీటి నిచ్చు చెట్టుగాన అదే గులాబీ చెట్టయినది. తెలుఁగున నా చెట్టునకు గొజ్జంగి అనిపేరు. ఈ పేరు హిమాలయ ప్రాంతారణ్యక వ్యవహారమునఁ గలఁదట. పన్నీరు రాని వట్టిగులాబిచెట్లు హిమాలయ ప్రాంతమునఁ బూర్వముండెడి వఁట! అవి దక్షిణదేశములకు వ్యాపించి యా పేరితోనే వ్యవహారముఁ బడసెనఁట! పన్నీరు తీయు చెట్లు 'రోజ్' రంగు గల చెట్లే. అవి పారసీకముననుండి వచ్చినవే యఁట. రెడ్డిరాజ్యము నాళ్ళలో నా చెట్లను నవచి తిప్పయవంశము వారు మనదేశమునకుఁ గొని తెచ్చి యుండవచ్చును. పన్నీరు ద్వీపాంతరములనుండి తిప్పయ తెచ్చుచుండుటను శ్రీనాథుఁడే చెప్పినాఁడు. తెల్గుభీమఖండమున 'గొజ్జంగినీరు' 'సజ్జికపు (రోజా రంగు) గొజ్జంగి నీరు ' వర్ణితములు. నే నిట్లు తలఁచితినిగాని, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఆస్ట్రేలియాది దేశములందు 'బంగారు మొలకలు' ( మొలకలు= పలుకులు ఈ యర్థమున నవి దొరకు దేశములందు వ్యవహారము గలదఁట) దొరకుచుండినట్లు గ్రంథస్థ మయి యున్నదనిరి. మొలక బంగారు అను పదమునకు శబ్ద రత్నాకరమున 'పుట్టలలో పురుగులవల్లఁగలిగెడు బంగారు' అని యర్థము కలదు. గోవా–పశ్చిమ సముద్రతీరపు గోవా పట్టణమే కావచ్చును. యాంప–యాద్వాణము, జాఫ్నా. ఇక్కడినుండి ముత్యాల దెచ్చెను. ఇది ముత్యాలకుఁ బ్రసిద్ధమే. భోట – బూటాన్ – ఇది కస్తూరికిఁ బ్రసిద్ధి కెక్కినది. చీని –

చీనాదేశము- పట్టుబట్టలకుఁ బ్రసిద్ధము. ఇక్కడినుండి చీనాంబరములఁ దెచ్చెను. తరుణాసీరి -తర్నాసరి [1](Tarnassari ).ఇదియు మలయ ద్వీపకల్పమున నొక రాష్ట్రప్రధాననగరము. తరుణాసీరి తెల్గున నిటీవల 'దనాసరి' అయిన దనుకొందును. 'దనాసరికము', 'దనాసరి గోంగూర' అని వ్యవహారముగలదు. గోంగూర భేదము తరుణాసిరి నుండి తొలుత వచ్చియుండువచ్చును., పంజార్ మాసీన్ నుండి – పంపర పనస, బటేవియా నుండి 'బత్తాయి' పండ్లు వచ్చినట్లు రాగములలో ధన్యాసియని యొక రాగము గలదు- అది 'తరుణాసీరి' పదవికారము గాఁబోలును. రాగములు పెక్కులు దేశముల పేళ్ళతో నున్నవి. రమణా-బర్మా దేశభాగము.

కృతిపతి యగు నవచితిప్పయను గూర్చి యింకను విశేషములు కృత్య వతరణిక నుండి యాశ్వాసాంత పద్యములనుండి గుర్తింపనగును.

## గ్రంథరచన

హరవిలాస మేడాశ్వాసముల ప్రబంధము. ఇందు చిఱుతొండనంబి చరిత్రము, మదనదహనము, గౌరీ కల్యాణము, దేవదారు వనవిహారము, సముద్రమథనము, కిరాతార్జునీయము ననుకథలు గలవు. ప్రథమ ద్వితీయాశ్వాసములు పీఠికతో, చిఱు తొండనంబి కథలో నించుమించుగా నిన్నూట పంద్రెండు గద్యపద్యములు, తృతీయాశ్వాసము మదనదహనకథతో నూఱు గద్యపద్యములు, నాల్గవయాశ్వాసము గౌరీకల్యాణకథతో నూటయయిదు గద్యపద్యములు, నయిదవయాశ్వాసము దేవదారువనవిహారకథతో డెబ్బదిరెండు గద్యపద్యములు, నాఱవ యాశ్వాసము సముద్రమథన కథతో నూటముప్పదియైదు గద్యపద్యములు నేడవయాశ్వాసము కిరాతార్జునీయకథతో నూటతొంబది యేడు గద్యపద్యములు వెరసి యేన్నూరు గద్యపద్యములు గలిగి యీ ప్రశస్తప్రబంధము వెలయుచున్నది.

### చిఱుతొండనంబి చరిత్రము

ఇది పాల్కురికి సోమన్న బసవపురాణకథ ననుసరించి కలదు.

1. దీనిని శ్రీ మ. సోమశేఖరశర్మగారు గుర్తించిరి.



కాని, మూలమునకంటె హరవిలాసమునఁ దత్కథ హృద్యముగాఁ జాలఁ బెంపు సెందినది. పెంపకమునఁ గల చమత్కృతి కొకమచ్చుతునక –

వృద్ధశివయోగివేషమున నున్న శివుఁడు చిఱుతొండనితో

'ఏఁడుగాలం బయ్యె.నేను హరుని నుద్దేశించి నిరాహారవ్రతముఁ గైకొన్నవాఁడ. ఆ వ్రతమున కుద్యాపనము నరుఁడు గావలయు. ఆతఁడు –

సీ.గీ. రోగశంకావిహీనుండు రూపసియును
వానిఁ దల్లియుఁ దండ్రియు వడుగు సేసి
పాక మొనరించి వడ్డింప భవున కొసగి
కుడుతు నాబంతి నిలుతేఁడుఁ గొడుకుఁ గుడువ.

అనెను. చిఱుతొండఁడంగీకరించెను. తుదకాశివయోగి యారగించునపుడు –

'పిన్నవాఁడు బంతిలో భోజనము సేయక నాకుఁ గడి నోరికిఁ బోదు. మగబిడ్డండు లేనినిర్భాగ్యునింట భోజనంబు సేయ. నీ కుమారు నా బంతి నారగింప రప్పింపు' మనెను. చిఱుతొండఁడు –

మ. మొదలందేవర యానతిచ్చితిర, యేముఁ జిత్తవృత్తిఁ మఱా
మది, నాకుం గొడు కింకనుం గలఁడు, వాఁడాడంగ నెం దేఁగెనో,
చదువం బోయెనొ, పిల్వఁ బంచెద నవశ్యంబుం, బ్రతీక్షించునీ
యదనం గూరలు చల్లనాఱవె మహాత్మా ! యోగి చూడామణీ ?--

అనెను. సోమనాథునికృతిలో వృద్ధశివయోగి నరమాంస మడుగఁగా --

'సర్వజ్ఞ ! మీ మనోజ్ఞం బైనయట్టి
సర్వలక్షణగుణసంపూర్ణుఁ డొక్క
వరపుత్త్రుఁ డున్నాఁడు నరమాంస మింకఁ
బొరుగింటికిని బిల్వఁ బోయెద నయ్య !
యరుదైనమీవ్రతోద్యాపన నేఁడు
గర మర్థిఁ జెల్లింతు క్షణము గొ' మ్మనిన

పిదప నారగించునపుడు --

'అతిథిపూజలు సేయు నవసరంబునను
సుతులును దారు నుత్సుక లీలతోడఁ
--'కాన పుత్త్రుఁడు గలఁడేని పిల్పింపు
లేనినాఁ డొల్లము పాన లొండేల ?' --

అనెను. చిఱు తొండఁడు --

చకిత దేహుఁ డగుచుఁ జయ్యన మ్రొక్కి
'యకలంక ! మీ రప్పు డన్నారు నేను
విన్నాఁడఁ బుత్త్రుఁడు నున్నాఁడు చదువు
చున్నాఁడొ యాడుచు నున్నాఁడొ పిదపఁ
జనుదెంచి మఱి మీ ప్రసాదంబు వాఁడు
గొనియెడిఁ గాక భోజన మాచరించి
రక్షింపవే యోగిరములు శాకములు
నక్షయాత్మక ! చల్లనారక యుండ-

అనెను. శ్రీనాథుని రచనమున వృద్ధశివయోగి తొల్తఁ జెప్పినదాన

'వానిఁ దల్లియుఁ దండ్రియుఁ వడుగుసేసి
పాక మొనరించి వడ్డింప భవున కొసగి
కుడుతు నా బంతి నిలుఱేఁడుఁ గొడుకుఁ గుడువ"

అనుచో రెండు విధముల వాక్యాన్వయములతో నర్థభేదము లున్నవి. ఇంటి యజమానుఁడు గూడఁ గొడుకును (అనఁగాఁ గొడుకు మాంసమును) నా బంతి నారగింపవలెనని యొక విధము. ఈ విధమున 'ఇలుఱేఁడున్' అను నది సముచ్చయార్థకవిశిష్ట మయిన ప్రథమాంత పదము. కొడుకున్ అను నది ద్వితీయాంతపదము. కొడుకు మాంసము వండి యారగింపఁ బెట్టుచో నాబంతి నా యింటి యజమానుఁడు నాతని పుత్త్రుఁడును నారగింపవలయు నని రెండవ విధము. ఈ విధమున ఱేఁడున్, కొడుకున్ అను పదములు రెండును సముచ్చయార్థకోపేతము లయిన ప్రథమాంతములు. శ్రీనాథుఁ డీయర్థద్వైవిధ్యమును జతురముగాఁ బొసఁగించినాఁడు. సోమనాథుని కృతిలో



నీ చమత్కృతి గానరాదు. మఱియు హరవిలాస రచనమందుఁ కథార్థము కరుణాద్భుతరసోల్బణముగాఁ గడు విపులముగా నున్నది. ఏ తత్కథాఘటితము లైన ప్రథమ ద్వితీయాశ్వాసములే యొక స్వతంత్ర ప్రబంధ మనఁదగును.

మఱియుఁ బ్రథమాశ్వాసములోని దగునొక పద్యమును బిల్లలమఱ్ఱి పినవీరన శృంగారశాకుంతలమున ననుకరించినాఁడు --

మ. ఖుసిమీఁదన్ సురధాణి నిందుకొలువై
కూర్చున్నచో నీ కరా
భ్యసనప్రౌఢి నుతించు రా యవచితి
ప్పా! చంద్రసారంగ నా
భిసముత్పాదిత తాళవృంతపవన
ప్రేంఖోలనప్రక్రియా
వసరోదంచిత సారసౌరభరస
వ్యాలోలరోలంబముల్

--హరవిలాసము.

మ. విసరఞ్ జూడకు రమ్మ పూవుసురఁటుల్
విశ్రాంతిమూలంబుగా
ననువు ల్వావుఁ దదంతరాంతరనితాం
తామోదహేలాలతాం
తనమాక్రాంతకృతాంతరూపపవమా
నప్రేంఖనప్రక్రియా
వసరోదంచిత సారసౌరభరస
వ్యాలోలరోలంబముల్

శృంగారశాకుంతలము. ఆ. 3.

మఱియు ద్వితీయాశ్వాసపద్యము నొకదాని జక్కన విక్రమార్క చరిత్రమున ననుకరించెను.

ఉ. తూనిఁగ లాడఁజొచ్చె దివి
ధూళి భ్రమింపఁగఁ జొచ్చెఁ బిచ్చుకల్
మానక యుబ్బి గబ్బులుఁగు

మాటికి మాటికిఁ గ్రోల్చెఁ గొమ్ముపై
వాన యవశ్య మింక బహు
వాసరముల్ జడి వట్టు నం చొగిన్
వానికి వాని కాడిరి య
వారణఁ బౌరులు గంచిలోపలన్
– హరవిలాసము.

ఉ. తూనిఁగ లాడెఁ దోయనిధిఁ
దోరపుమ్రోఁత జనించె బంతులై
కానఁబడెన్ బలాకములు
కప్పయెలుంగు చెలంగె నిర్జల
స్థానములందుఁ గుంజముతు
దన్ గృకలాసము నిల్చి నింగిపై
నానన మెత్తె భూమిరజ
మంగమునం బెరయించెఁ బిచ్చుకల్.
– విక్రమార్క చరిత్ర.

జక్కన శ్రీనాథులు చారిత్రకాధారములఁబట్టి యించుమించుగా సమకాలమువారుగాఁ దెలియవత్తురు. స్పష్టముగాఁ బూర్వుఁడీతఁడు, పరుఁడీఁతడు నని నిరూపింపఁ దగ్గయాధారములు లేవు. కాన, శ్రీనాథ జక్కనలలో నెవ్వరెవ్వరి ననుకరించిరో నిరూపింప ననువు పడదు. అయినను నీ క్రింది విధము పరిశీలింపఁగా జక్కనయే శ్రీనాథు ననుకరించె నన నగును. శ్రీనాథుని భీమఖండమున –

మ. జగతీమౌళివతంసభూషణము విశ్వఖ్యాతముం గాశికా
నగరంబుం బెడఁబాసి నీకును జగన్మాన్యైక చారిత్ర యీ
చిగురుంబోడికి నాకునుం గటకటా చేట్పాటు వాటిల్లె నీ
ముగురం గూర్చినముండదైవమునకున్ మోమోట లేదో సుమీ.

అన్న పద్యము సంస్కృతభీమఖండ శ్లోకముల కీ క్రింది వానికిఁ దెలిఁగింపు –



"జగదేక ప్రశంసార్హ చరిత్ర కలశోద్భవ
క్షోణీవతంసభూషాయాః కాశ్యా విరహకారణాత్
త వాస్యాః కోమలాంగ్యాశ్చ మమాప్యార్తి రజాయత
త్రీ నేతౄన్ యోజితవతో దేవస్య ను కృపా న కిమ్."

జక్కన విక్రమార్కచరిత్రలోని పద్యమునఁ గూడ శ్రీనాథుని యీ సంస్కృతానుసారి పద్యచరణానుకరణము గానవచ్చుచున్నది. మంచి పలుకుబడి తీరున శ్రీనాథుడు చేసిన "త్రీ నేతాన్ యోజితవతో దేవస్య ను కృపాన కిమ్" అనుదాని తెలుఁగు సేఁతను జక్కన యనుకరించె ననవలెను. శ్రీనాథుఁడె సంస్కృతభీమఖండమును గూడ రచించియుండు నన్నట్టు నే నిలువఁజాలక పోవును. విక్రమార్క చరిత్రపద్య మిది:

చిగురాకు న్ననుగెంపు లేఁదొడవు లి
చ్చెం జిత్తజుం డంచు లో
నగు నీలాగు ఋణంబు వీరలకు నె
న్నం డబ్బె నమ్మా యను
దగుఁబో వీరికి నాకు సంగమము పో
నాపాలిభాగ్యం బనున్
ముగురన్ గూర్చినముండదైవమునకున్
మ్రొక్కంచు జెజే యనున్.
(మదనదహనము...గౌరీకల్యాణము)

ప్రథమ ద్వితీయాశ్వాసముల (చిఱుతొండనంబి కథ) రచనమున కంటె నీ తృతీయ చతుర్థాశ్వాసముల కవితారచన ప్రశస్తతరముగానున్నది. తృతీయాశ్వాస కథ మదనదహనమును, దర్వాతి యాశ్వాసకథ గౌరీకల్యాణమును, కాళిదాసుని కుమారసంభవమహాకావ్యమున కించుమించుగాఁదెలుఁగు సేఁత యనఁదగినట్టు శ్రీనాథుఁడు రచించినాఁడు. కాని, కాళిదాసు కుమారసంభవములోని కథాక్రమ మిందుఁ గొంత మార్పు సెందినది. శ్రీనాథుని గ్రంథము లెల్లఁ బ్రాయికముగా నాంధ్రీకరణములే యైనను, నా యాంధ్రీకరణము సంస్కృతపు హద్దుపద్దులలో నుండక శ్రీనాథుని యిచ్చకు

వచ్చినట్లు విచ్చలవిడిగా నుండును. కొలఁది పట్టులందు మూలాతిశాయి సౌభాగ్యమున్నను రసోత్తరమైన కాళిదాసుని కుమారసంభవమును దెలిఁగించుటలోఁ గూడ జాగ్రత్త వహింపక విశృంఖలముగా వర్తించుట గొన్నిచోట్ల వైరస్య కారణమును నైనది. ఐనను కాళిదాసకృతి నెఱుంగక స్వతంత్రముగా శ్రీనాథ రచనమునే చూచువారి కది శయ్యా సౌభాగ్య సౌశబ్ద్యాదిగుణవిశేష ములచేఁ గొఱఁత తోఁపనీయనంత హృద్యతతోనే యున్నది. సంస్కృతమూల మననుసరించి యందలి విషయమును గొంత విడిచియుఁ, గొంత గ్రహించి సంగ్రహించియుఁ, గొంత పెంచియు విశృంఖలముగాఁ జేసిన తెలుఁగు చేతఁలు కొన్ని --

అథ సలలిత యోషిద్భ్రూలతాచారుశృంగం
రతివలయపదాంకే చాప మాసజ్య కంఠే
సహచరమధుహస్తన్యస్త చూతాంకురాస్త్రః
శతమఖ ముపతస్థే ప్రాంజలిః పుష్పధన్వా.

కుమార. స.2. శ్లో. 64

సీ. కాంతాజనంబుల కటివంక బొమలతోఁ
బ్రతివచ్చు పుష్పచాపంబుతోడఁ
గోకిలవ్రాతంబుఁ గ్రుక్కిళ్ళు మ్రింగించు
క్రొమ్మావిచిగురాకుగొడుగుతోడ
రతిదేవి నిడుసోగ గ్రాలుకన్నులడాలుఁ
దలఁపించుమీన కేతనముతోడ
భుజగలీలావతీ భుక్తశేషములైన
గంధవాహకిశోరకములతోడఁ

జందురునితో వసంతమాసంబుతోడ
రాజకీరరథం బెక్కి ప్రాభవమున
వచ్చె వలరాజు చిత్తానువర్తనముగ
సంభ్రమముతో మహేంద్రునాస్థానమునకు.

హర. ఆ. 3. ప. 38.

రతివలయేత్యాది సంస్కృత శ్లోకభాగము మాఱినది. పద్యము



బాగుగాఁ బెరిఁగినది. హృద్యత కొఱవడినది. సంస్కృతమునఁ దోఁచు కామవినీతత తెలుఁగునఁ గానరామి కొఱంతయే కదా.

దదౌ రసా త్పంకజరేణుగంధి
గజాయ గండూషజలం కరేణుః
అర్ధోపభుక్తేన బిసేన జాయాం
సంభావయామాస రథాంగనామా.

కుమార. స.3. శ్లో. 37

ఉ. పంకజరేణుగంధి యగు
పల్వలవారిఁ గరేణు విచ్చె ని
శ్శంక మదావళంబునకుఁ
జాఁచి గజంబును బద్మినీమృణా
లాంకుర మర్ధభుక్తము ని
జాంగనకుం బ్రియ మార నిచ్చె నా
వంకఁ దపోధనుల్ హృదయ
వత్సలతన్ బ్రియ మంది చూడఁగన్.

హర. ఆ, 3. ప. 61.

ఇందు శ్లోకమునఁ గల గండూషజలము పద్యమునఁ బల్వలవారి యగుట హృద్యముకాదు. శ్లోకోత్తరార్థమున రథాంగము తెల్గుపద్యమున గజముగా మాఱినది. ఈ మార్పు నేర్పుగలదే.

సుగంధినిశ్వాసవివృద్ధతృష్ణం
బింబాధరాసన్న చరం ద్విరేఫమ్
ప్రతిక్షణం సంభ్రమలోలదృష్టి
ర్లీలారవిందేన నివారయింతీ,

కుమా. స.3. శ్లో. 56.

ఉ. కమ్మనియూర్పు గాడుపుల
గందముఁ గ్రోలఁగ వచ్చి యోష్ఠబిం
బమ్ముసమీపదేశమునఁ

బాయక యాడెడు తేఁటిఁ గేళిప
దమ్మున మాటిమాటికి స
మంచితవిభ్రమలోలదృష్టియై
యమ్మదిరాక్షి చోఁపె దర
హాసవికస్వరగండపాళియై.
హర. ఆ. 3. ప. 71.

ఇందు "సుగంధినిశ్వాసవివృద్ధతృష్ణం" అనుటకు కమ్మనియూర్పు గాడుపులగందముఁ గ్రోలఁగ వచ్చి' యను తెలిఁగింపు సుందరముగాదు.

కుసుమాస్తరణే సహాయతాం
బహుశ స్సౌమ్య, గతస్త్వ మావయోః
కురు సంప్రతి తావ దాశు మే
ప్రణిపాతాంజలియాచిత శ్చితామ్.
తదను జ్వలనం మదర్పితం
త్వరయే ర్దక్షిణవాతవీజనైః
విదితం ఖలు తే యథాస్మరః
క్షణ మ ప్యుత్సహతే న మాం వినా.
ఇతి చాపి విధాయ దీయతాం
సలిలస్యాంజలి రేక ఏవ నౌ
అవిభజ్య పరత్ర తం మయా
సహితః పాస్యతి తే స బాంధవః.
పరలోకవిధౌ చ మాధవ
స్మర ముద్దిశ్య విలోలపల్లవాః
నివపేః సహకారమంజరీః
ప్రియచూతప్రసవో హి తే సఖా.
కుమార. స. 4. శ్లో. 35–38

సీ. హస్తయుగ్మము మోడ్చి ప్రార్థించి పలికెదఁ
దమ్ముఁడా ! నా కిమ్ము దగఁ జితాగ్ని
మందమందమ్ముగా మలయాచలము గాడ్పు



వెరవుతో మండంగ విసరుఁ గాతఁ
బరలోకతృప్తికై బంధు లిద్దఱకును
ధర్మోదకం బిండు తమ్మితేనె
సహకారమంజరీ చరుపిండకబళంబు
పెట్టుండు మాకు నై పికము ముట్టఁ
దేనె పెట్టుండు కస్తూరిఁ దీర్చి యచటఁ
జేర గొజ్జంగ పూనీటఁ జెంబు లిడుఁడు
నన్ను వలరాజుఁ దలఁచి మన్నన దలిర్పఁ
దగ సమర్చన సేయుఁడు దంపతులకు.
హర. ఆ. 3. ప. 49

ఈ తెలుఁగు సీసపద్యము మూలమును గొంతవిడిచినను హెచ్చుఁగా గొంత సంతరించుకొని ముచ్చట గొల్పుచున్నది. తమ్మితేనె ధర్మోదకమిడుట పికములు ముట్టునట్టు సహకారమంజరులు పిండములు పెట్టుట, గొజ్జంగి పూనీటి యుదకుంభము లిడుట మూలాతిశాయి సౌందర్య సంపాదకములు.

భవ త్యనిష్టాదపి నామ దుస్సహత్
మనస్వినీనాం ప్రతిపత్తి రీదృశీ
విచారమార్గప్రహితేన చేతసా
న దృశ్యతే తచ్చ కృశోదరి ! త్వయి.
కుమార. స. 5. శ్లో. 42.

సీ. ప్రథమ ప్రజానాథ.........

గీ. దుష్కరంబైన తప మిట్లు దొడరి సేసి
మేను డయ్యించుకొనఁగ నేమిటికి వచ్చెఁ
జిత్తము విచారమార్గంబుఁ జేరఁ దెచ్చి
తత్త్వముఁ దెలియఁ జెప్పు చూతము మృగాక్షి !
హర. ఆ. 4. ప. 23.

శ్రీనాథు డాంధ్రపద్యము నసద్దతో నాశుకవితలో రచించియుండును.

మఱియు,

కియ చ్చిరం శ్రామ్యసి గౌరి ? విద్యతే
మమాపి పూర్వాశ్రమసంచితం తపః
తదర్ధభాగేన లభస్వ కాంక్షితం
వరం త మిచ్ఛామి చ సాధు వేదితుమ్.

కుమార. స. 5. శ్లో. 50.

ఉ. ఏనును బ్రహ్మచారిఁ, దర శేక్షణ! నీవును గన్య, వింత కా
లానకు నీకుఁ బెండ్లియె ఫలం బగునేని విచార మేల? స
న్మానముతోడ నన్నుముని మాన్య వివాహము గమ్ము లెమ్ము, కా
దేనిఁ దపంబులోని సగమిచ్చెద మాను తపోభిమానమున్.

హర. ఆ. 4. ప. 25.

పై శ్లోకమునకు శ్రీనాథుని తెలుఁగుపద్యము సరియయినది కాదు.

'కన్యే కామయమానం మాం
న త్వం కామయసే కథమ్
ఇతి గ్రామ్యోఽ యమర్థాత్మా
వైరస్యా యైవ కల్పతే'

అను దండిసూక్తికి లక్ష్యమై యున్నది.

ఎంతదాఁక శ్రమింతువు ? బ్రహ్మచర్యార్జిత మగునాతపసున సగపాలిత్తును. దాన నీకాంక్షిత వరలాభమును బడయుము. నీ వరాపేక్ష యేదో యదియు నేఁ దెలియఁ గోరుచున్నాను.' అని యర్థము గల శ్లోకమునకు సరిపడని తీరున, ' నీకుఁ బెండ్లియే కావలసినదియేని మునిమాన్యుని నన్నుఁ బెండ్లాడుము. లేక, తపస్సే కావలసినదియేని నా తపస్సులోన సగపాలిత్తును. కైకొని తపోభిమానము వీడుము ' అన్న తెలిఁగింపు రోతఁగా నున్నది. ఇట్టి వటునిమాట విని పార్వతి యటనుండి లేచి పోవలసినదే ! వటుఁడు శివుఁడే కనుక, పార్వతికిఁ దనపై నేకాంతానురాగముకల్మిని గుర్తింపనట్లు పలికెనని సరిపుచ్చుకొందమన్నను వటుం డిట్లన్న మీఁదటఁ బార్వతి రోఁత చెందినట్లు



చెప్పకుండుట యసంగత మగును.

నన్నయభట్టారక పద్యానుకరణోత్సాహమున శ్రీనాథుఁడు కాళిదాస శ్లోక రసభావౌచిత్యానుశీలనమును మఱచినాఁడు.

శ్రీనాథుని ప్రస్తుతపద్య మీ క్రింది నన్నయభట్టారక పద్యమున కనుకరణము –

ఉ. నీవును బ్రహ్మచారివి వినీతుఁడ వేనును గన్యకన్ మహీ
దేవకులావతంస ! రవితేజ ! వివాహము నీకు నాకు మున్
భావజశక్తి నైనయది పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రుదయఁ జేయము నాకుఁ బ్రియంబు నావుడున్

ఆది. ప. ఆశ్వా. 3.

శ్రీనాథుడీ తృతీయ చతుర్థాశ్వాసముల రెంటిని రెండునాళ్లలో వడివడిగా రచించినట్లున్నాఁడు. రసోత్తరములయిన మూలశ్లోకములఁ బెక్కింటిని దేలికపాటి వచనరచనలోఁ బొందించినాఁడు.

ఈ కథను శ్రీనాథునికిఁ బూర్వము నన్నిచోడ మహాకవికూడఁ గుమార సంభవ ప్రబంధరత్నమునఁ గూర్చినాఁడు. అతఁడును గాళిదాసకుమార సంభవశ్లోకములఁ గొన్నింటి నందుఁ దెల్గించినాఁడు. కాని, యది చాలఁగా స్వతంత్రరచనమే. శ్రీనాథుని రచనకుఁ గల శయ్యాసొంపు, ప్రసాదము దానఁ గానరాదు గాని, దాని కున్న దేసిరచన, జానుదెనుఁగు పొలుపు, భావ గాంభీర్యము, అర్థపుష్టి శ్రీనాథుని రచనకులేదు. కాళిదాస కథాకల్పనానుసారి యగు శ్రీనాథకథాసంగ్రహము నన్నిచోడకథాకల్పనమున కంటెఁ జతురత గలదై యున్నది. అర్వాచీనాంధ్రకవి యగు కోటిరఘునాథ భూపాలుఁడు నొక కుమారసంభవ ప్రబంధమును రచించినాఁడు. అది కథాసౌందర్యము, కల్పనాచమత్కారము, నేఁటి తేట తెలుఁగు కూర్పుసొంపుగలదై చాలఁ జక్కగాఁ నున్నది.

ఈ తృతీయ చతుర్థాశ్వాసములలో నీ క్రింది సంఖ్యల పద్యములు చాల హృద్యములు. 7, 15, 32, 38, 39, 61, 65, 69, 71, 77, 80, 92, 94 – తృతీయాశ్వాసము. 17, 27, 29, 35, 42, 64, 65, 70, 91

– చతుర్థాశ్వాసము.

## దారువన విహారము

సంస్కృతమున నుత్ప్రేక్షావల్లభుఁ డనుకవి యీ దారువన విహారమును 'భిక్షాటనకావ్య' మను పేర సవిలాసముగ వర్ణించెను. అది శృంగారరస పూరిత మగునుచ్ఛృంఖలకావ్యము. ఆ కావ్యమునకును శ్రీనాథుని యీ రచనకును సంబంధము లేదు. పరమశివలీలయగు నీ కథాఘట్టమున నౌచిత్య చర్చ జరుపుట సంగతము గాదు. ఐనను శ్రీనాథుఁడీ కథారచనలో నౌచితినంతగాఁ గోల్పోవకుండుట ముదావహము.

ఇందీ సంఖ్యల పద్యములు చాల హృద్యములు – 5, 10, 14, 16, 20, 24, 30, 32, 33, 34, 35, 38, 39, 41, 56.

'ఎంచి నుతింప శక్యమె యహీశ్వరు నంతటివానికైన' ఇత్యాదిక మగుహరవిలాస పంచమాశ్వాస పద్యము పిల్లలమఱ్ఱి పినవీరన శృంగార శాకుంతలమునఁ గూడఁ గానవచ్చుచున్నది. నిజముగా దాని రచయిత యెవ్వరో యా యిద్దఱిలో ?

## సముద్రమథనము, హాలాహలభక్షణము

శ్రీనాథుఁ డీ కథను భీమఖండరచనానంతరమే రచించినట్టు గుర్తింప నగును. సముద్రమథనారంభమున దేవాసురులు విఘ్నేశ్వరపూజ సేయుట సంస్కృతభీమఖండమునఁ గలదు; తెలుఁగు భీమఖండమునను గలదు. ఈ సందర్భము భాగవతాదిపురాణములలోనిది గాదు. హరవిలాసమునఁ గూడ నీ విఘ్నేశ్వరపూజాప్రకరణ మున్నది. దీని యునికి భీమఖండ కథాసందర్భానుకరణమే యనుకొందును. మఱియు సంస్కృత భీమఖండ శ్లోకపుఁ దెనుఁగు సేఁత కందపద్యము భీమఖండమం దున్నది. ఆ పద్యమే యీ హరవిలానము నను నున్నది. ఇందు హాలాహలభక్షణము, సముద్రమథనము వడి గల కథాగతితో నున్నవి.

ఇందీ పద్యములు హృద్యతరములు –40, 44, 45, 56, 60,62, 66, 68, 77, 117, 127, 131.



## కిరాతార్జునీయము

భారవి రచించిన కిరాతార్జునీయకావ్యపుఁ గథయే యిది. కాని, నా చూచినంతలో నా కావ్యమునకు దీనికి సంబంధము కానరాలేదు. భారతారణ్య పర్వమునఁ గల కథాసంక్షేపమున కిది విస్తృతి. శ్రీనాథుని కవితాశయ్య యీ యాశ్వాసమున మిక్కిలి నిగనిగలు దేరి యున్నది. ఈ యాశ్వాసమొక్క స్వతంత్రసత్కృతి యనఁదగినది. ఇంద్రుఁగూర్చి యర్జునతపశ్చర్య వృద్ధబ్రాహ్మణ వేషమునఁ జేరవచ్చి యింద్రుఁ డర్జునునితో సంభాషించుట, శివునిఁ గూర్చి తపస్సుచేయు మని బోధించుట, శివునిఁ గూర్చి యర్జునుని తపస్సు, శివకిరాతవేషము, వరాహహననము, అర్జునకిరాత వివాదము, పరస్పర యుద్ధము, ఈశ్వరసాక్షాత్కారము, పాశుపత వరప్రదానము, అర్జునస్వర్గయాత్ర, ఊర్వశీదర్శనము, అర్జునోర్వశీభాషణము, అర్జున నిర్మలశీల సౌభాగ్యము, ఊర్వశి యవమానపాటు, శాపప్రదానము, అరుణోదయాది వర్ణనము, నివాతకవచాదుల విజయము, ఇంద్రసత్కారము నను విషయ విభాగములు గలదై యీ యాశ్వాస మీ గ్రంథములోని యన్ని యాశ్వాసముల కంటె గొప్పదై యొప్పు మీఱి యున్నది. ఇందు అర్జునోర్వశీ సంవాదమౌచితీ రుచిరమై మనోహరముగా నున్నది. శ్రీనాథుని గ్రంథములనుండి కండపట్టనఁదగిన కథపట్టును దెలిఁగింపు గానిదానిఁ బేరుకొనఁ గోరుకొందుమేని యీ కిరాతార్జు నీయమే యందుకుఁ దగినది.

ఇందీ పద్యములు చాల హృద్యములు – 5, 7, 8, 9, 19, 22, 29, 30, 31, 32, 33, 34, 35, 41, 43, 44, 46, 55, 59, 63, 65, 68, 69, 77, 79, 86, 89, 90, 99, 100, 111, 119, 120, 124, 125, 129, 132, 135, 137, 139, 141, 144.

హరవిలాసము శ్రీనాథుని తక్కిన గ్రంథములన్నిటికంటె మృదు మధురరచనము గలది. బహుప్రౌఢ సంస్కృతపదఘటనలు, అన్వయక్లేశములు కారక ప్రయోగవైచిత్యములు – భాషాంతరీకరణము లగుటచే శ్రీనాథుని యితరగ్రంథములలో నధికములైయున్నవి. ఇందంత గానరావు. శ్రీనాథుని రచనల లోతుపాఁతుల సక్రమముగాఁ దెలుఁగఁ గోరువారు హరవిలాసోప

క్రమముగాఁ దద్గ్రంథములను జదువఁ దగుదురు. నన్నయ, తిక్కన, నాచనసోమనల తెలుఁగురచనల పోలికలు, మురారి నాటకశ్లోకానుకృతులును నీ హరవిలాసమునఁ గొన్ని కాననగును. విస్తరభీతిచే వాని నిందుఁ జూపకుంటిని. అపూర్వశబ్దములు, ప్రయోగవిశేషములు, లక్షణ విశేషములు నిందు గొన్ని గానవచ్చుచున్నవి. సవిశేషములని పరికింపఁదగిన పద్యాంశమున గొన్నింటి మాత్ర మిందుఁ జూపుచున్నాను. పెడము వెట్టి, చింకల్, వాడెపట్టులు విఱిచి, బారాది దివ్యించి, భోరని కుర్యుచుండ, అంపాజాలంబు గురిసి, అవంచియే కంచి నీకు, ఎలప్రాసఁగుటడ్కులు, మిన్నకమిరెండుకుమారకుఁడు, చిఱుబంతిపసవుతోఁ జెవపు నలఁది, సీకాయ యఱపున జిడ్డువఱపి, కఱవాఁడిగా నూఱి గంటి దీడె, గొజ్జఁగనీటఁ జేపట్టుగావించి, చిత్తవృత్తిన్ మఱాకు, ఒత్తిల్ చీఱి, వానె వైశ్యులఁ బిళ్ళయర్వ లను గూడి–ఇట దైతేయుఁడు..... కత్తళముతోడఁ బుండరీకంబుతోలు, మసృణ స్నిగ్ధతరక్షుచర్మమయ, వైయాఘ్రాజినఖండమధ్యమున, ఏటలవినేసి.... గాటెఱు కునఁ గొఱఁతిడి, అబసరపుందెఱంగున – ఇత్యాదులు.

కూచిమంచి తిమ్మకవి లక్షణసారసంగ్రహమున హరవిలాస పద్యములఁ బెక్కింటి నుదాహరించినాడు. ఆయాపట్టులఁ దత్పద్యపాఠముల గుర్తించితిని. మిన్నకమిరెండు, అబసరపుందెఱంగున ఇత్యాదిపాఠములు వ్రాతఁ ప్రతులలో నున్నట్లే తిమ్మకవి యుదాహరణమునను గలవు. ఇట్టిపట్టుల బూర్వపూర్వతర ముద్రణ పాఠములు గొన్ని సరియైనవిగావు. శక్యమయినంత వఱకవి చక్కఁబఱుపఁ బడినవి. పూర్వ పూర్వతర ముద్రణములందు 'కమ్మనూనె' మైనంటి నలుంగుతో జలకమార్చి యొసంగిరి ధౌతవస్త్రముల్' – (ద్వితీయాశ్వాసము) అని కలదు. 'ఒసగు' సానుస్వార మనుట కాదికవి ప్రయోగములు మృగ్యములు. శాసనములలో ఎసగు, ఒసగులు నిరనుస్వార ములుగా నున్నవి. అవి తిక్కనభారతమున నిరనుస్వారములుగాఁ బ్రాసస్థలముల నున్నవి. శ్రీనాథుని గ్రంథములలోనే గుర్తించి నంతలో నిది యొక్కటే 'యొసంగిరి' అని పూర్ణానుస్వారవిశిష్టముగాఁ గానవచ్చెను. దీని గూర్చి భారతి సంపు. 12, సంచిక 12, పు 881 –4 చూడఁదగును.



హరవిలాసపు వ్రాఁతప్రతులఁ బరిశీలింతునుగదా – అందు 'జలక మార్చిరి యిచ్చిరి ధౌతవస్త్రముల్' అన్నపాఠమున్నది. 'ఒసంగిరి' అన్న పూర్వ పూర్వతర ముద్రణ పాఠము గానరాదు. ఆముక్త మనుచరిత్రాద్యర్వాచీన గ్రంథము లందు 'ఒసంగు' సానుస్వారముగా నున్నది.

అధ్వాన్నంపుం బట్టునన్ ( 74 పుట) – 'అధ్వాన్నము శత్రుమధ్యము' నని నానుడి కలదు. దాని ననుసరించి పై యట్లు ముద్రిత మయ్యెను. 'అధ్వానము' అనియే వ్రాతఁప్రతి. 'అధ్వ' శబ్దము తత్సమ రూపము 'అధ్వానము' కాఁబోలును. శ్వ. శ్వాన శబ్దములు సంస్కృతముననే యున్నవి. అట్లే అధ్వ, అధ్వానశబ్దములు నున్నవేమో ! శబ్దరత్నాకరకారులు అధ్వానము = అమార్గము అని యర్థముతో అకారాంత సంస్కృతపదముగా గ్రహించిరి. కర్ణాటమునఁ బంపకవి విక్రమార్జున విజయములో 'అధ్వాన పదపరిశ్రమ శ్రాంత' యని ప్రయోగ మున్నది. తన్ముద్రాపకు లాయధ్వాన పదమును మార్గార్థముగా గ్రహించిరి. మార్గమని, అమార్గ మనియేని గ్రహించినను, శ్రీనాథుని 'యధ్వానపుం బట్టు' సమర్థితమగును. వ్రాఁతప్రతి పాఠము పరిగ్రాహ్యమే కావచ్చును. కాని తెల్గున నిఁక నెక్కడను నీ 'యధ్వానము' నాకుఁ గానరాలేదు. వాచస్పత్యమున 'అధ్వాంత శాత్రవః= మార్గసీమారిపుః' అని యున్నది దానిఁబట్టి 'అధ్వాంత' మని యుండిన బాగనిపించును.

శా. మౌళిం గోహళి సంఘటించినక్రియన్ మధ్యాహ్న వేళన్మహా
కాళంబైన నభోవిభాగమున వీఁకంగాసె బీరెండయా
ప్రాలేయాహితసంప్రదీప్తకిరణ ప్రక్రీడ దర్కోపల
జ్వాలాజాలజటాలజాంగలతటీ వాచాలకోయష్టియై.

హర. ఆ. 7, ప 109.

పయి పద్యమున 'కోహళి' కర్థమెఱుఁగరాదు. 'ఆలవట్టము' కాని, 'ఉల్లడ' కాని కాఁదగు ననుకొందును. నాచనసోమన కూడ నీ పదమును బ్రయోగించెను. 'పార్వతీపతికిఁ బ్రభాతభూపతి గొన్నయలరుఁ గెందమ్మి కోహళి యనంగ – భానుబింబంబు కన్నుల పండు వయ్యె' – ఉ. హరి. ఆశ్వా. 3. ఇక్కడఁ గూడఁ బై యర్థములే సంగతము లగును. సంస్కృతాంధ్ర

ములలో నా కీ పదమింక నెక్కడను గానరాలేదు- పయి పద్యోత్తరార్ధము క్రీడాభిరామముననను గలదు. మురారి నాటక శ్లోకభాగము దీనికి మూలము.

మఱియు- 'విభూతిమంగళ, స్నానము జేసి ధౌతపరిధానము గట్టి' (ఆ.2. ప. 37.) ఇక్కడ యతిని గూర్చి పూర్వము 'భారతి' లోఁ గొంత చర్చ జరిగెను.

స్నానపదము 'స్త్నానము' అని యుండవలెననియు, నది వేదోచ్చార ప్రకార మనియు, శ్రీనాథుఁడు వేదజ్ఞుడు గాన యట్లు ప్రయోగించెననియు నొకానొకరివాదము. వేదోచ్చారము వేదమునకే కాని భాషకుఁ గాదు. ప్రశ్నము నకు ప్రశ్న్నము, సంవత్సరమునకు 'సంవత్త్సరము' అని యిత్యాది విధముల వేదోచ్చారమున్నది. సంస్కృత భాషలో నట్టి యుచ్చారము గాని, లిపి గాని, కానరాదు. సంస్కృత గ్రంథములందుఁ గాని, శాసనములందుఁ గాని కానరాకున్నను నీ యతిని రక్షించుటకై యిక్కడ 'స్నానము'ను 'స్త్నానము'నుగాఁ జేయ నక్కఱలేదు. తెలుఁగునఁ దద్భవవ్యాజయతి యని యొక యతి భేదము గలదు. దానిఁబట్టియే ప్రాచీన కవీశ్వరులు 'జ్ఞ'కు 'న' తోను 'కవర్గము' తోను యతిఁ గూర్చిరి. విజ్ఞానము -విన్నాణము, సంజ్ఞ- సన్న, ప్రజ్ఞ -పగ్గె, సంజ్ఞ -సైగ అగుటనుబట్టి 'జ్ఞ కారము'న 'నకారము' గాని కవర్గాక్షర మేది గాని కలదనరాదు. అట్లే స్నానపదము సంస్కృత సమాసగతముగా నున్నను స్నానశబ్దము దద్భవవ్యాజమునఁ దవర్గముతో యతిమైత్రిం జెందెను.

మఱియు నీ హరవిలాసమున 'ప్రారంభం బొక యింత లేకను తృణ ప్రాయంబు నట్లు' అనుచో 'లేకను' అని ప్రయోగమున్నది. ఇది నన్నయ భట్టారకుని 'లేకను సంతానోచ్ఛేద' ప్రయోగముం బోలినది. అక్కడఁ జెప్పఁ దగ్గసమర్థనోపపత్తులే యిక్కడను జెప్పఁదగినవి.

ఈ హరవిలాసము పీఠికాభాగము కొఱఁతగా గ్రంథమెల్ల నొక్క తాటియాకు ప్రతి తంజావూరు లైబ్రరీలోఁ గలదు. పీఠికాభాగ ముండి సప్తమాశ్వాసము లేక ప్రాచ్యలిఖితశాలలో వేఱొకప్రతి గలదు. ఈ రెండు ప్రతుల తోడ్పాటుననే పూర్వము కాకినాడ సరస్వతీ పత్రికాధిపతు లీ హరవిలా



సమును ముద్రించిరి. నాఁటికి నేఁటికి నీ రెండు వ్రాఁతప్రతులే కాని, క్రొత్త దేదియుఁ గానరాలేదు. తంజావూరి నుండి శ్రీ యానంద ముద్రణాలయము వారు తాళపత్ర ప్రతిపాఠములఁ దెప్పింపఁగా వానిని, ఆవశ్యకమయినచోట్ల ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని తాళపత్ర ప్రతిపాఠములను నేను బరిశీలించినపై నీ ముద్రణము సమకూర్పబడినది. శ్రీనాథుని సత్కవితా ప్రకటనమునఁ గలనాయానంద మీ యానంద ముద్రణాలయము వారి వలనఁ గొంత కడతేఱినది. సద్గ్రంథ ప్రకటనము నీ యానంద ముద్రణాలయమువా రింకను జక్కసాగింపఁ గల్గుదురుగాక !

మద్రాసు - వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రమాది కార్తికపూర్ణిమ.

(హరవిలాసము -పీఠిక

ఆనంద ముద్రణాలయము- 1939

సింహావలోకనము (1953) న పునర్ముద్రితము ).

# మ ధు ర క వి త లు.

## సుగ్రీవవిజయము – పీఠిక

ప్రాచీనాంధ్రలక్షణకర్తలు తెలుఁగుఁగవిత్వమును 'ఆశు, మధుర, చిత్ర విస్తరము' లను పేళ్ళఁ జతుర్విధముల విభజించిరి. యక్షగానాదు లందులో మధురకవిత్వమునఁ జేరును.

"మధురకవిత్వం బన్నది నాటకాలంకారంబులు, కళికో త్కళికలు, విభక్త్యధిదేవతోదాహరణములు. సప్తతాళనటనలు, నట్టొట్లు, గీతప్రబంధం బులు, చతుర్భద్రికాష్టభద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, చతురుత్తర సంఘటనలు, యక్షగానంబున వెలయుపదంబులు, దరువులు, నేలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనంబులు, నుయ్యాలజోలలు, జక్కులరేకుపదంబులు, చందమామసుద్దులు, అష్టకంబులు, ఏకపద ద్విపద త్రిపద చతుష్పదాష్టపదులు నివియాదిగాఁ గల్గునన్నియు."

– లక్షణదీపిక.

మధురకవితలు ప్రాయికముగా భాష, భావము, ఛందము దేసిగా నుండుటచే సంగీతసంస్కారము గలిగిన సామాన్య జనుల నాలుకలమీఁద నాట్య మాడునవిగా నుండును. గాన, తొలుత నవి యంతగా లిపి కెక్కక పోయెను. సంస్కృతప్రాయ రచనలు గల చిత్రవిస్తరకవితల ప్రాబల్యమునుఁ గూడ వానికి సత్కవితలలోఁ బరిగణన మంతగా లేకపోయెను. ఇటీవల కవులుగాఁ బురాణప్రబంధరచయితలే పరిగణింపఁబడుచుండిరి గాని, మధుర కవితారచయితలు లెక్క కెక్కకున్నారు. ఆంధ్రవాఙ్మయ వృక్షమున ముఖ్యమయిన మధురకవితాశాఖ యిందాఁక సుపరిశీలనము లేకయే యున్నది. ఇక్కడ నాకిప్పుడు దేసి నాటకము లనఁదగిన యక్షగాన రచనముల ప్రశంసయే ప్రసక్తమగుటచే వాని పుట్టుపూర్వోత్తరములఁ గూర్చి మాత్రమే నాకు గోచరించిన విషయములఁ గొన్నింటి వివరింతును.

## దేశిదృశ్యరచనలు

యక్షగానము లన్నపేరు గల దృశ్యరచనములు నన్నయాదుల కాలమున నున్న వనుటకుఁ బ్రబలాధారములు గానరావు. కాని యానాఁ



డేవో కొన్ని దేశిదృశ్యరచనము లున్న వని మాత్రము గుర్తింపనగును. నన్నయ కిన్నూఱేండ్లకుఁ దర్వాత నున్న పాల్కురికి సోమనాథుఁడిట్లు చెప్పినాడు.

"భ్రమరులు జాళెముల్ బయకముల్ మెఱసి
రమణఁ బంచాంగపేరణి యాడువారు
ప్రమథపురాతన పటుచరిత్రములు
క్రమమొంద బహునాటకము లాడువారు
లలితాంగ రసకళాలంకారరేఖ
లలవడ బహురూప మాడెడువారు
* * *
అమరాంగనలు దివి నాడెడుమాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు
ఆవియద్గతి యక్షు లాడెడునట్టి
భావన బ్రోకులపై నాడువారు
భారతాదికథలు చీరమఱుఁగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగఁ గంబసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు.
నాదట గంధర్వయక్షవిద్యాధ
రాదులై పాత్రల నాడించువారు

పర్వతప్రకరణము – పండితారాధ్యచరిత్రము.

పై ద్విపదలందు, నేఁటి వీధినాటకములు, దొమ్మరాటలు, తోలు బొమ్మలాటలు మొదలగునవి పేర్కొనఁబడినవి. ఇట్టి సంప్రదాయములు వీనిఁ బేర్కొన్న సోమనాథుని కిన్నూఱేండ్ల పూర్వకాలమునఁ గూడ నుండుట సంభావ్యమే. తెలుఁగునకు సాటిభాష లగుద్రవిడ కర్ణాటభాషల పద్ధతులను బట్టియుఁ దెలుఁగులో నిప్పు డుపలభ్యమానము లగుచున్నకొన్ని ప్రాచీన దృశ్య రచనములతీరులను బట్టియు, ద్రావిడభాషాసామాన్యముగాఁ దొలుత వెలసిన నాటకరచనల స్వరూపము కొంత గుర్తింప వచ్చును.

# కురువంజి [1]

తొలుత ద్రావిడభాషలలో వెలసినదృశ్యరచనములు కురవంజు లనఁ బడునవి. ఆంధ్రకర్ణాట ద్రవిడదేశముల యరణ్యములలో వసించునాటవికులు, చెంచులు, కురవలు (క్రోవ, కోయ) అనువారు. అందుఁ గురవజాతివారి యంజె = అడుగు (నృత్యవిశేషము) కురవంజె [2] యనఁబడెను. చిందు, గంతు, గొండ్లి, అంజె, అంగ – ఇత్యాదులు నృత్యవిశేషములు. ఆంధ్రదేశమున బహుకాలముననుండి శివక్షేత్రములగు శ్రీశైలము ఇంద్రకీలనగము (బెజవాడకొండ) మొదలగు పర్వతములమీదనుఁ నృసింహక్షేత్రములగు వేదాద్రులు (పెక్కు లున్నవి. మంగళాద్రి, సింహాద్రి, గరుడాద్రి, మాల్యాద్రి, వెంకటాద్రి) మొదలగు పర్వతముల మీదనుఁ వర్షోత్సవములు (యాత్రలు, జాత్రలు, జాతరలు) జరుగునప్పు డక్కడికి నాగరక ప్రజలు చేరుచుండువారు. వారి వినోదమునకై యక్కడి యాటవికులు రాత్రులందు నృత్యవిశేషములు నెఱపి ధనార్జనము చేయుచుండువారు. అక్కడక్కడి కొరవజాతులవారు చేయు నృత్యములు కొరవంజులనఁబడెను. కొరవంజె యన్నపేరు తొలుత వారి నృత్యమునకును, బిదప నృత్యవిశిష్ట మయిన వారి చిన్ని చిన్ని గేయరచనలకునను, నాపై కురవజాతివారికిని గూడఁబేరైనది. కురవజాతి వారు తొలుత చేయునృత్యవిశేషము కాలక్రమమున నాయా పర్వతప్రదేశముల స్థలమాహాత్మ్యకథలతోను, శివవిష్ణులీలాకథలతోను మిళితము లయి గేయ విశిష్టనాట్యరూపములను బడసెను. అపుడు మాయాకిరాతవేష లగు పార్వతీశివులకథలతో నున్నకిరాతార్జునీయము, నృసింహస్వామి చెంచీతను బెండ్లాడు స్థలమహాత్మ్యకథలు (చెంచీతకథ) కురవంజులుగా వెలసెను. ఇట్లు

1 వాల్చిచి గుజ్జరి విల్వేడు (?) దండలాస్యము కందుకక్రీడ యల్లికయును కొరవంజి (జె) శుభలీల గుజరాతి దేసి చౌపదము జక్కిణి దురుపదము మదనపదదౌత్యమును జోగిపదచాళి శారదాసామ్రాజ్యమును జిందు నవతి మచ్చరంబులు నాట్యకదంబంబు మొదలైన నాట్యముల్ హావణించునవరసజ్ఞు

( విజయరాఘవనృపాలుని ప్రహ్లాదచరిత్ర –యక్షగానము) ఇందు కొరవంజి. నృత్యవిశేషముగానే పేర్కొనఁబడినది.

2. కురువంజి, కురువ+ అంజె (అంజ, అంజె, అంజియ రూపాంతరములు) కురవంజియు కురవంజెలనుండి కురవంజి అనురూప మేర్పడి యుండ వచ్చును.



వెలసిన యా దృశ్యరచనములు తొలుత నత్యల్పముగా గేయ భాగములును విశేషముగా నృత్యమును గలవై యుండెను. అవి సింగి– సింగఁడు – అని యిద్దఱు పాత్రములు గలవై సంస్కృత వీథినాటకములఁ బోలియున్నవి. సింగి, సింగఁడు సంస్కృతనాటకములలోని నటీనటులవలె నాలుమగంద్రు. వీరిద్దఱే కథాపాత్రములగుచుందురు. కొన్నింట గథాసంధాయకుఁడు – సంధివచనములఁ జెప్పువాఁడు – విదూషకుఁడనఁదగినవాఁడు – మూడవపాత్రము –కోణంగి యనువాఁడు – (పిదప చోడిగాఁడు) కాన నగును. కోణంగి సంస్కృతనాటకములలోని ధ్రువాగానమే కురవంజులలో దరువనఁబడెను. దేశిరచనలలో నుండి సింగి, సింగఁడు, కోణంగి, దరువు అనునవి నటీనటులుగను, విదూషకుఁడుగను, ధ్రువగను సంస్కృత నాటకములఁ జేరే నేమో యని కూడ యోజింపఁదగినట్టున్నది. ఎంతో కాలమిట్లు కొండపట్టులందు సాఁగుచుఁ బెంపొందిన గేయ నృత్యసందర్భ ములు నగరములకుఁ గూడఁ గ్రమముగా వ్యాపించినవి. చెంచులు, కురవలు నడవులనుండి పులిగోర్లు, అడవిపంది కోఱలు, అడవిపండ్లు వెదురు బియ్యము, వెదురుబెత్తములు, పిల్లనగ్రోవులు, సూదంటురాళ్ళు, ఓషధులు, తేనె మొదలగు నాటవిక వస్తువులను నగరములకుఁ గొనివచ్చి యమ్ముచు నప్పుడప్పుడు తమ గేయనృత్యవిశేషములను నగరములందును, బల్లెలందును బ్రయోగించుటచే నవి నాగరకదేశములందును వ్యాపించెను.

## యక్షగానములు

ఇట్లు నగరములందు నభిరుచి గొల్పినయాగేయ విశిష్టనృత్యదృశ్య ములు, జక్కులవారు (యక్షులు, కళావంతులు) తర్వాత నగరములందును బ్రయోగింపఁ జొచ్చిరి. వీరి ప్రయోగములందు దృశ్య మయిననృత్యాభిన యములతోపాటుగా నధికముగా గేయవచనరూప మైన శ్రవ్యరచనము గూడఁ జేరెను. కురవంజులకంటె యక్షగానములు పర్యాప్తముగా శ్రవ్యము లగు కవిరచనములు గలవి. వీరిరచనములలో బహువిధము లగు పురాణకథలెల్లఁ జేరినవి. కురవంజులలోని సింగి, సింగఁడు పాత్రలు మాఱి రామ నలహరిశ్చంద్ర సీతా దమయంతీ చంద్రమత్యాదిపాత్రలు వచ్చినవి. కాని,

వీనిలో నాటవికరచనాసంస్కార సూచకముగా, 'ఎఱుకతసాని' పాత్రము వెలసినది. కురవంజులలోని దేసిరచనల కంటె నత్యధికముగా వీనిలో దేసిచ్ఛందోబద్ధము లగు గేయరచనలు ప్రబలినవి. రాజసభలలో, దేవోత్సవములలో, ఊరిజాత్రలలో యక్షగంధర్వాదివేషముల ధరించి [1] వేశ్యలు ప్రదర్శించునవి గావునను నృత్యధర్మములకంటె గేయధర్మము లధికముగాఁ గలవి కావునను, నివి యక్షగానములనఁబడెను. కళావంతులలో నొక తెగకు నేఁడు జక్కులవారను పేరు గలదు. యక్షాదివేషముల ధరించి నృత్యగాన ప్రదర్శనములను గావించుటచేతనే వారి కాపేరు వచ్చియుండ వచ్చును. శ్రీనాథుఁడు క్రీడాభిరామమున జక్కుల వారిని గూర్చి కొంత ప్రశంస నెఱపినాఁడు.

సీ. కోణాగ్ర సంఘర్ష ఘుమఘుమధ్వని తార
కంఠస్వరంబుతో గారవింప
మసిబొగ్గు బోనాన నసలుకొల్పినకన్ను
కొదుపుచేఁ దాటించు నెడప దడప
శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగ వలయుచోఁ
జెవిత్రాడు బిగియించు జీవగఱ్ఱ
గిల్కు గిల్కున మ్రోయుకింకిణీ గుచ్ఛంబు
తాళమానంబుతో మేళవింప

రాగముననుండి లంఘించు రాగమునకు
నురుమ యూరుద్వయంబుపై నొత్తిగిల్ల

1 శ్రీనాథుఁడు భీమఖండమున ద్రాక్షారామభీమేశ్వర మహోత్సవ సమయములందు సానులు వేషములు వేసికొని నాటకము లాడుట నిట్లు వర్ణించెను.

సీ॥ విరులదండలతోడి వేణికాభారంబు
పొంకంబు పిఱుఁదులఁ జొరలి యాడ
మణితులాకోటికోమలఝుణత్కారంబు
రవలి మట్టెల మ్రోఁత యవఘళింపఁ
గుదురు నిండిన చిన్న గుబ్బచన్నుమీఁద
ముత్యాలత్రిసరంబు మురువుఁ జూప



కామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు వాడుచు వచ్చె జక్కులపురంధ్రి.

అప్పకవి యక్షగానలక్షణము నిట్లు చెప్పినాఁడు.

సీ. తుద నేడులఘువులు తొలఁగించి చదివినఁ
ద్రిపుటకు వృషభగతిపదయుగము
లలిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె
మను ద్విరదగతిసమపదయుగము
గురు తగురచ్చెకుఁ దురగవల్గనా
హ్వయ మేక తాళి యామధురతికి (?)
నంఘ్రి కిర్వదినాలు గటతాళమున మాత్ర
లోలి విశ్రాంతి పద్నాలుగింటఁ
దెలియ నర్ధంబు నర్ధచంద్రికలు వీన
యక్షగానప్రబంధంబు లతుకవచ్చు
రగడభేదంబు లివి యంద్రు రసఁ గవీంద్రు
లవిత నిజసేవకస్తోమ ! యబ్ధిధామ !

వలమాన తాటంక వజ్రాంకురచ్ఛాయ
లేఁత వెన్నెలఁ బుక్కిలించి యుమియ

సాని యీశానియై మహోత్సవమునందుఁ
గేల నవచంద్రకాంతపుగిన్నె పూని
వీథి భిక్షాటన మొనర్చువేళఁ జేయు
మరులు నృత్యంబు జగముల మరులు కొలుపు. (ఆ.౧.౦౦౫)

వ॥ మహోత్సవమండపమునందుఁ బేరోలగం బుండి, కుండలీదండ లాసకప్రేరణీ ప్రేంకణసింధుకందక ధమాళి చేల మత్తల్లీ హల్లీసకాది నృత్యంబు లవలోకించుచు. (ఆ.౧.౧౧౮)

శ్రీనాథునికాలమునకే దేవోత్సవాదులయందు వేశ్యలు వేషములుకట్టి నాటకములఁ బ్రదర్శించుసంప్రదాయము ప్రబలినది.

"కీర్తింతు రెవ్వానికీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగానసరణి" భీమ. 3. ఆశ్వా. శ్రీనాథునికాలమున యక్షగానములు ప్రబలియుండుట దీనిచేఁ దెలియ నగును.

పై పద్యమును బట్టి చూడఁగా యక్షగానములందలి ప్రధాన గేయరచనములు దేశిరచనలగు రగడలలోఁ గొంతమార్పు జరిపి – త్రిపుట, జంపె ఏక, అట, అను తాళముల కనుగుణముగాఁ గల్పింపబడినవిగాఁ గానవచ్చును. అప్పకవి రగడవికార రచనములను తాళములపేరనే పేర్కొనెను గాని వానికిఁ బేరులు వేఱె తెలుపలేదు. అప్పకవి పేర్కొన్న యీ రచనములే కాక, యక్షగానములలో నింకను ననేకవిధము లయిన దేశిరచనములు చేరినవి. ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, చందమామ సుద్దులు, వెన్నెలపదములు, విరాళిపదములు, తుమ్మెద పదములు, గొబ్బి పదములు, కోవెలపదములు, చిలుకపదములు, అల్లోనేరేళ్ళు, సీస–కందార్ధములు, త్రిభంగులు, ద్విపదలు, త్రిపదలు, చౌపదలు, షట్పదలు, మంజరులు, జక్కుల రేకులు మొదలగునవి.

యక్షగానములిట్లు వెలసినను ప్రాచీనము లయినకురవంజి రచనములును యక్షగానరచనావిధాన సంకలితములై ఈ కాలమునఁ గూడఁ గొన్ని సాగుచునే వచ్చినవి. దేవోత్సవ, రాజాస్థానాదులం దిట్లు వేశ్యలచేఁ బ్రదర్శింపబడుచున్న యక్షగానములు పెంపొందుచుండు నీకాలమున, దక్షిణదేశమున విజయనగరరాజ్యమున కుపశాఖలుగా తంజావూరు మధురరాజ్యములాంధ్రనాయక రాజుల పరిపాలనమున వెలసినవి. ఆంధ్రదేశమునందును, దక్షిణదేశమునందును నీ కాలమున యక్షగానరచనము మిక్కిలి ప్రబలఁ జొచ్చెను. ఇవి యిట్లు కలావతులచేతఁ బ్రదర్శింపఁబడుచున్న వౌట గౌఱవతగాఁ గనిపట్టయో యేమో కాని, కృష్ణాతీరమునందలి కూచిపూఁడి గ్రామమున సిద్ధేంద్రుఁ డనుయోగి యొకఁడు భాగవతకథలను పారిజాతము, గొల్ల కలాపము మొదలగు పేళ్ళతో యక్షగానములుగా రచియించి శాస్త్రీయ మయిన భరతనాట్య సంప్రదాయములకు రక్షగా, స్త్రీనిస్సహాయముగా, నాయూరి బ్రాహ్మణులచేతనే ప్రదర్శము చేయింప నేర్పాటు చేసెను. ఆ యూర జన్మించిన బ్రాహ్మణుఁడెవ్వఁడు గాని, ఒక్కతూరి యైనను, యక్షగాన ప్రదర్శనమున స్త్రీ వేషమును ధరించి తీరవలెననియు, నది వారి కులాభ్యుదయహేతు వనియుఁ గూడ శాసించెనఁట. నేఁడు కూడ కూచిపూఁడి బ్రాహ్మణులు శాస్త్రీయమయిన భరతనాట్యముతో భాగవతకథలను బ్రదర్శించువారుగానున్నారు. ఈ సంప్ర



దాయము వెలసినపిదపనే తత్ప్రదర్శకులకు భాగవతు లనియు, తద్రచనములకు ఆట భాగవతము లనియుఁ బేరయ్యెను.

## ఆటభాగవతములు

ఈ భాగవతకథలలో పారిజాతాపహరణకథ హృద్యతర మగుటచే దానికిఁ బ్రచారమెక్కువయ్యెను. అది హృద్యతర మగుటకందలి సవతులకయ్యపుఁబట్టు ప్రధానకారణము, దీనినిఁ బట్టి యక్షగానసామాన్యము నకుఁ బారిజాతములనియుఁ బేరయ్యెను. ఏ యక్షగానముఁ బ్రదర్శించినను నందు సవతుల కయ్యపుఁబట్టునకుఁ బ్రసక్తి గల్పించుటయో లేక పారిజాతమునందలి తత్కథాఖండమునే స్వతంత్రముగాఁ బ్రదర్శించుటయో పిదప నేర్పడెను. ఈ సవతులకయ్యపుఁ గథపట్టు హృద్యతరమగుటచేఁ బ్రబంధ కవులను గూడ నిది వలపించెను. కళాపూర్ణోదయమున పింగళి సూరన్న పారిజాతకథలోని సవతుల కయ్యపుఁబట్టు నిట్లనుకరించెను.

అంత మదింపకువే యని పల్కిన నంత మదింపకువే యనుచుఁ
గంతు లడంచెద లెమ్మని పల్కిన గంతు లడంచెద లెమ్మనుచుఁ
రంతుల నేమి ఫలం బని పల్కిన రంతుల నేమి ఫలం బనుచుఁ
బంతము చూడఁగదే యని పల్కినఁ బంతము చూడఁగదే యనుచుఁ

సీ॥ ఒట్టు సుమీ యన్న నొట్టు సుమీ యంచు
నేమేమి యనిన నేమేమి యనుచుఁ
గానీగదే యన్నఁ గానీగదే యంచు
నింకేల యనిన నింకేల యనుచు
నోసి పోవే యన్న నోసి పోవే యంచు
నౌనంటి ననిన నౌనంటి ననుచు
మఱువకు మిది యన్న మఱువకు మిది యంచు
నీ వెంత యనిన నీ వెంత యనుచు

నొకతె మగనికి నాసించు టొప్ప దనిన
నొకతె మగనికి నాసించు టొప్ప దనుచుఁ

బట్టియాడె నారంభతోఁ బ్రథమరంభ
ప్రియుఁడు నిలుమన్న నిలువక పెద్దరొదగ.

కళా. ఆ. 3-౧౯౫ ,౧౯౬

ఆంధ్రదేశమున వెలసిన యీ కూచిపూఁడి భాగవతముల ప్రయోగ వైశారద్యము దక్షిణదేశమునకుఁ గూడ వ్యాపించినది. ఆనాఁడు కూచిపూఁడి భాగవతుల యాట భాగవత సంప్రదాయము నేఁటికిని దక్షిణదేశమునఁ గలదు. దక్షిణదేశమున బ్రాహ్మణులు పురుషులే నేఁడును భాగవత యక్షగానములను దెలుఁగువానినే ప్రదర్శింతురు. ఆంధ్రదేశమున వెలసిన యక్షగానము లిన్నూటికిఁ బైచిలుకు పరిగణింపఁబడినవి. వీని ననుసరించి వెలసిన దక్షిణదేశపు యక్షగానములు మున్నూటికిఁ బైచిలుకు గలవు. భక్తాగ్రేసరుఁ డనఁబడిన శివనారాయణతీర్థులవారు (కృష్ణలీలాతరంగిణి కర్త,) త్యాగరాజస్వామి వారు పారిజాతాపహరణ మని నౌకాచరిత మని భక్తి రసభరితములయిన యక్షగానములను రచించిరి. భగవత్కథలతోఁ బురాణకథలతో బెంపు వెలసిన యీ భాగవత యక్షగానములు తత్ ప్రదర్శనములు నాయకరాజుల కాలమునను, మహారాష్ట్రరాజుల కాలమునను మితిమీఱి యాయా రాజకుల శృంగారజీవిత వర్ణనాత్మకములుగాఁ గూడ రచితములై ప్రదర్శితము లగుచు వచ్చినవి. దిక్ప్రదర్శనలుగా కొన్ని కురవంజకులను, యక్షగానములను, భాగవతములను బేర్కొనుచున్నాను.

“కిరాతార్జునీయము, శ్రీగిరికురవంజి, గంగాగౌరీవిలాసము, అలమేలు మంగావిలాసము, ఎఱుకలవేషకథ, కపోతవాక్యము, గరుడా చలము, త్రిపురసంహారము, దారువనక్రీడ, నలచరిత్ర, నిజలింగచిక్కయ్యకథ, కన్యకాచరిత్ర, పారిజాతాపహరణము, పార్వతీపరిణయము, మృత్యుంజయ విలాసము, శివపారిజాతము, సముద్రమథనము, విజయరాఘవ చంద్రికా విహారము, రఘునాథనాయకాభ్యుదయము –”

భిన్నపాత్రవేషధారణము లేక సింగి, సింగఁడు (కొన్నింటఁ గోణంగి కూడ) పాత్రలతో వెలసివీథినాటకము లనఁబడు కురవంజులు యక్షగాన రూపమునఁ బెంపొందినపుడు వేషభేదము గల పాత్రభేదములను



బెంపొందెను. ఇట్లు పాత్రబాహుళ్యముకూడఁ గలవైన యక్షగానములందు సంధివచనములఁ జెప్పు కోణంగి, లేక సూత్రధారుఁడు ‘వచ్చెనమ్మా సత్యభామ–’ ఇత్యాది విధములను, ‘అంతట హనుమంతుఁ డేమనుచున్నాడు’ ఇత్యాది విధములను బాత్రములఁ బేర్కొనగాఁ దద్వేషధారులు వచ్చి తమ యాటపాటలు నెఱపుదురు. ఇట్లింకను బెంపొందిన యక్షగానములు తెరలు, రంగభేదములు కలవయి కొంత సంస్కృత నాటకచ్ఛాయయుఁ జొప్పడఁగా నాటకము లను పేరను గూడఁ బదునెనిమిదవ శతాబ్దినాఁటికిఁ బేర్వలసినవి.

ఇంచుమించుగాఁ దెలుఁగున నేనూఱింటిదాఁక లెక్కింపఁ దగియున్న యక్షగానములలో సుగ్రీవవిజయ మొకప్రశస్త కృతి.

## దాని కర్త
## కందుకూరి రుద్రకవి.

ఈతఁడు విశ్వబ్రాహ్మణవంశ్యుఁడు. కందుకూరికిఁ జేరువనే పాలేటి యొడ్డునఁగల చింతలపాలె మనుగ్రామ మీతని యూరు, ఆయూరనే తద్వంశ్యు లిప్పటికిని గలరు. రుద్రకవి మూలమున నా వంశమువారికి ‘కవిగారు’ అని యుపనామ మేర్పడినది. ఆ వంశమున రుద్రకవికిఁ దర్వాతఁ బలువురు రుద్రకవినామకులుండిరి. తొలుతటి రుద్రకవి కృష్ణదేవరాయల యాస్థానమున నష్టదిగ్గజము లనఁబడుకవు లెనమండుగురిలో నొక్కడుఁగా నుండెనఁట* మల్కిబ్రహీంకాలమునఁగూడ నొక రుద్రకవి యుండెను. ఇబ్రహీం కాలమునఁ గలరుద్రకవియే కృష్ణరాయలకాలమున బాలుఁడుగా నుండబోలును. చింతలపాలె మనుగ్రామము మల్కిబ్రహీంప్రభువే రుద్రకవి కొసఁగెను.

అద్యాశీతిచతుశ్శతాధిక సహస్రం వై శకాబ్దా గతాః
అస్మిన్ శ్రీజయవత్సరే జయతిథౌ మాసే చ మాఘే తథా
పంచమ్యాం ద్వయతింత్రిణీజనపదం రుద్రస్య విద్వత్కవేః
ప్రీత్యా శ్రీయిభరామభూపతి రదాత్ క్షోణీధరాఖండలః॥

*రుద్రకవి విషయమును చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగమునఁ జూచునది.

ఇబ్రహీంప్రభు విచ్చినయగ్రహారమును నిన్న మొన్నటిదాఁకఁ దద్వంశ్యులే యనుభవించుచుండిరి.

సుగ్రీవ విజయము రచించినరుద్రకవియే నిరంకుశోపాఖ్యానమని గ్రంథాంతరము రచియించెను. రెండు గ్రంథములందును గర్తకు కందుకూరు జనార్దన భక్తత్వము, పెదలింగనార్యపుత్రత్వము గలదు గావున రెండు గ్రంథములు నొక్కనివే యగుట స్పష్టము. నిరంకుశోపాఖ్యానమున,

"చేరి కన్నడభూమి చెఱవట్టుపాశ్చాత్య
నృపతికైనను గొంత కృప దలిర్చు."

అని సీసచరణ మున్నది. అది విద్యానగరమును దురుష్కులు కొల్లఁగొట్టిన దుస్సందర్భమును దెలుపుచున్నది. విద్యానగర వినాశనము క్రీ.శ. 1568 నాడు జరిగినది. కావున, నిరంకుశోపాఖ్యాన రచన మఱుతరువాత జరగిన దగును. అప్పకవీయమున వినుకొండలో గుంటుపల్లి భాస్కరయగారి సముఖమునఁ గందుకూరి రుద్రకవి కవితాచర్చ జరపినట్లు కలదు. మన రుద్రకవి యాతఁడగునేమో ! నిరంకుశోపాఖ్యాన సుగ్రీవవిజయకర్త క్రీ.శ. 1568 ప్రాంతములవాఁడేని, కొంతతర్వాతివాఁడేని కాఁగలఁడు. దక్షిణ దేశ మందల్పముగా నాంధ్రదేశమం దధికముగా యక్షగానముల రచనములు, ప్రయోగములు సాగుచుండిన కాల మది.

## సుగ్రీవ విజయము

శ్రీమద్రామాయణమునఁ గల కథాఖండములలో సుగ్రీవవిజయకథ యొక కండపట్టు. అత్యల్పకాలమున వడివడిగా గంటలలో నడచిన యీ కథపట్టు రామలక్ష్మణులు, హనుమంతుడు, సుగ్రీవుఁడు, వాలి, అంగదుఁ డు, తార అను కథాపాత్రముల శీలపు మేలిమి నొఱసి మెఱుఁగుతఱుగులు చూపిన యొఱగల్లనఁదగినది.

తెలుఁగున గుత్తెనదీవిరామాయణాదులగు రామాయణ గేయ కృతులలో నీ సుగ్రీవవిజయపుఁగథపట్టు చాల హృద్యరచనములతో నున్నది.



ఎంత పని చేసితివి రామా! నిన్ను
నేమనందును సార్వభౌమా !
చెంత కిటు రాలేక చెట్లలో దాగుండి
వింత మృగమును గొట్టువిధ మాయెనా బ్రదుకు !*

ఇత్యాది గేయములను బలువురు పాడుచుందురు.

ఈ రుద్రకవి సుగ్రీవవిజయమును గూడ స్త్రీ, వృద్ధ, పామరాదులు, పలువురు పాడుచుందు రఁట! ఆయాపాత్రముల పాటలు తత్తద్వేషధారులు వచ్చి పాడునట్లును దక్కిన సంధివచనాదులు ఒక్కరిద్దఱు సూత్రధారప్రాయులు పఠించునట్లును నీ సుగ్రీవ విజయము వీథియాటగా నాడబడుచుండెడిది. ప్రాచీన సంస్కృత నాటకరచయితలు భాసభవభూత్యాదు లీ సుగ్రీవ విజయౌ చిత్యమును దమ నాటకములలో విమర్శించిరి. శ్రీరాముని శీలమును శ్రీ వాల్మీకి రామాయణపద్ధతిని సమర్థించిరి.

భవభూతి "యద్వా కౌశల మింద్రసూనుదమనే తత్రాప్యభిజ్ఞోజనః" యని దీని యౌచిత్యము నించుక చెనకెను. మన రుద్రకవి సంస్కృతాంధ్ర రామాయణకవులు త్రొక్కినత్రోవనే త్రొక్కెను గాని, యపూర్వకల్పనాంశము నేమాత్రము నిందుఁ జేర్పలేదు.

ఆయా పాత్రములు ప్రసిద్ధరామాయణములలో నెట్టి యుక్తిప్రత్యు క్తులు గలవిగాఁ జిత్రితము లయ్యెనో యిందు నదే తీరు గలదు. కాని, యిది దేశిరచనముతో గేయరూపమున నుండుట విశేషము. ఇం దీ క్రింది గేయరచనలు ప్రశస్తములయినవి !

హా సతీమణి ధర్మచారిణి హా గుణోన్నత జనకసుత ననుఁ
బాసిపోయితి వింతలోనే పద్మనయన
లేటిమాయలు మదిని దెలియఁగ లేక పాపపురక్కసునిచే

---

సీ॥ ఎవరయా మీరు చక్కనిరాజులిద్దఱు
... ... దండంబు దండంబు దశరథ సుతులారా!
వర్ధిల్లు వర్ధిల్లు వానరేంద్ర... ఇత్యాది చాటు ధారలున్నవి.

బోటి నిను గోల్పోతి నిక నాకేటిబ్రదుకు !
* * *

లలన నినుఁ గలనైన బాయఁగఁగలన నీ విట లేక యుండినఁ
జలన మొందెను నాదుహృదయము జలజనయన !
తరుణికులమునఁ బుట్టి శరచాపములఁ బట్టి
తరుణిఁ గోల్పడుకంటె మరణమే మేలు
నను శౌర్యవంతుఁ డని తనపుత్రి నిడినట్టి
జనకవిభుఁ డీ వార్తవిని వగవకున్నె.
* * *

నాయ మెఱుగక చంపితివి నరనాథ పాపము గట్టికొంటివి
బోయ వింతియె కాక నీవొక భూమిపతివా?
* * *

శ్రీరామ నీరామఁ జెఱగొన్న రావణుని
వారిధుల ముంచితిని వాలమునఁ జుట్టి
ఒకమాట నాకుఁ జెప్పక పోయితివిగాక
సకలదైత్యుల దున్మి జానకిని దేనె?
* * *

ఆలిఁ జెఱగొని పోయినట్టిదశాస్యుఁ డుండఁగ నిర్నిమిత్తము
వాలి నేటికిఁ జంపితివి రఘువంశతిలకా !
ఇట్టి సాహసకర్మ మెచటికి నేఁగె భరతుఁడు సీమ వెడలఁగఁ
గొట్టి రాజ్యము పుచ్చుకొన్నెడఁ గువలయేశా!
నాయ మేటికిఁ దప్పితివి రఘునాథ జానకితోడనే చెఱఁ
బోయెనే నీ రాజనీతియు భూరిమతియుఁ.

* * *

శ్రీరామచందమూర్తి చెట్టుచాటుననుండి వాలిమేనఁ గాడనేసిన వాఁడి ములుకులకంటె నిక్కడ తార ప్రత్యక్షమై నిలుచుండి శ్రీరాముని యంతరంగము నుచ్చిపోవునట్టు ప్రయోగించిన పలుకుములుకులు క్రొవ్వాఁడి గలవి.



సుగ్రీవవిజయము వీరకరుణరసభరితము. స్త్రీ బాల పామరాదులు గూడఁ బఠింపఁ దగినది.

ఆ యక్షగానమున నీ క్రింది దేశిరచన లున్నవి. త్రిపుట, జంపె, కుఱుచజంపె, అర్ధచంద్రకలు, ఆటతాళము, ఏకతాళము, ద్విపదలు, ధవళములు, ఏలలు. అర్ధచంద్రికలు త్రిపుటాదిరచనల ఖండరచనలు గాఁబోలును. ఇందలి యర్ధచంద్రిక లెల్ల నొక్క తెఱఁగునడక గలవి గాక భిన్న గతులతో నున్నవి. సంగీతతాళ లక్షణము లెఱిఁగినవారు వాని ప్రభేదములు గుర్తింపవలెను.

కురవంజులు, యక్షగానములు నింకను మంచిరచనములు గలవి కొన్ని యున్నవి. అవి యేవేని సుగ్రీవవిజయమువలె సుముద్రితము లైనచో నాంధ్రమధురకవితావిశేషములను సహృదయు లింక నధికముగా నాస్వాదింపఁ గల్గుదురు.

మద్రాసు వేటూరి ప్రభాకరశాస్త్రి
బహుధాన్య మహాశివరాత్రి

(ముని పలుకు – సుగ్రీవవిజయ పీఠిక 1939)

# భారతీ శతకము

## ఉపోద్ఘాతము

ప్రియమిత్రులు శ్రీ గిడుగు వెంకటసీతాపతిగారు రచియించిన భారతీ శతకమునుఁ జాలసంతోషముతోఁ జదివినాను. సంగీత సాహిత్య కవితాది సరసకలావిలాసులు, మధుమధుర హృదయులునగు సీతాపతిగారు ప్రవిమల హృదయముతోఁ గావించిన యీ భారతీవరివస్య సత్ఫలోదర్కమే యగునని, సహృదయ సమ్మతమే యగునని నా విశ్వాసము.

అమృతయు, నాత్మకలయు, పరాఖ్యయునగు భారతీదేవికిఁ బ్రార్థనారూపమునఁ గూర్చిన యీ భారతీశతకము ఆంధ్రవాఙ్మయమున అపూర్వరచనమే. పరవాది గజాంకుశాది శతకములు మతవేదాంతాది విషయచర్చలతో నున్నవి యున్నవిగాని, భాషోత్పత్తి వికాసములతీరులను, కావ్యభాషాభ్యుదయ సాధనములను నిరూపించునది, వాఙ్మయ విమర్శాత్మకమగునది, శతకము, ఇట్టిది యింతదనుకఁ దెనుఁగునఁ గానరాదు.

నేఁడు ఆంధ్రదేశమున –అందేకాదు – అన్ని దేశములందును , సారస్వత విషయమున – అంతేకాదు మతరాజకీయ సాంఘికాది సకల విషయములందును విప్లవకల్పమయిన మహాపరిణామము సాగుచున్నది. విజ్ఞులు కొందఱు దీనిని విశాలహృదయముతో గ్రహింపఁ గల్గుచున్నారు; చిన్నచూపుతోఁ గొందఱు గర్హింపఁ గడఁగుచున్నారు. పరిణామమెల్లఁ బనికిమాలినదేయని భయపడువారుండుట వింతకాదు; గాని, ఒక ముఖమునఁ బరిణామమునకై ప్రయత్నించుచు, వేఱొకముఖమున దానిఁ బరిహరించువారుండుట వింత. బ్రాహ్మణుఁడని, పంచముఁడని భేదముండరాదని వాదించువారు తమ భాషాభేదముల సామరస్యమునకుఁ గూడ సంతసించుట సయుక్తికము.

భాషాప్రయోజనములలో సత్కావ్యనిర్మాణము నొక ప్రయోజనము. అంతేకాని, సత్కావ్య నిర్మాణ మొక్కటియే భాషాప్రయోజనము కాదు. ప్రాచీన లాక్షణికానుశాసితమగు నాంధ్రభాష కావ్యైక ప్రయోగార్హముగనే కలదుగాని, తదితర సర్వభాషాప్రయోజనములకును సరిపడఁ జాలకున్నది. అట్లే వ్యవహారభాషకూడ నేఁడు సత్కావ్యప్రయోజనమునకుఁ జాలకయే యున్నది.



కోర్టులో, కౌన్సిలులో, రేడియోలో సంభాషించుటకు నేఁటికావ్యభాష యుపయోగపడదు. 'వస్తూ', 'పోతూ', 'చూస్తూ, చూస్తూ', 'అన్నారు', 'ఉన్నారు' – ఇత్యాదులను శిష్టవ్యవహారమునుండి చంపివేసి, 'వచ్చుచుఁ', 'బోవుచుఁ', 'జూచుచుఁ జూచుచు', 'అనిరి', 'ఉండెడివారు',– ఇత్యాదులను జొప్పింపఁ దరముగాదు. 'ఉంటేఊరా', 'పోతేపాడా', 'అంటె అన్నావంటారుగానీ' – ఇటువంటి చవిగల పలుకుబళ్లెన్నో వ్యవహారమున సాగుచున్నవి. వీటి నన్నింటినీ కోర్టు, కౌన్సిలు, రేడియో వ్యవహారములు పరిత్యజింపఁ జాలవు. రేపు స్వరాజ్యమువచ్చి. ఆంధ్రరాష్ట్రము వేఱుపడి కౌన్సిళ్ళలో ఆంధ్రభాషా వ్యవహారముసాగి, తెలుఁగు షార్టుహాండు ప్రబలమై దైవానుగ్రహము దైవాఱితే – పెద్దలు సభలలో వ్యవహరించిన భాషావ్యవహారము స్వస్వరూపముతో పత్రికలలో ప్రకటితము కావలెనేకాని, అది నన్నయభట్టీయాథర్వణీయాది వ్యాకరణ పారాయణ పరాయణులచే పరి సంస్కృతమై ప్రకటితముగారాదు. భాషాప్రయోజనము లెన్నో నానాటికిఁ బ్రబలుచున్నవి. ఇంకను బరభాషలమూలమున నిన్ననేఁడు ననుభవించు లాభముల నెన్నింటినో మాతృభాషమూలమున నిఁక మన మనుభవింపవలసియున్నాము. ఇట్టి ప్రయోజనములకెల్లఁ బనికివచ్చుటకు వ్యవహారభాష సముచిత పరిపోషము గలది కావలెను.

కాలక్రమమున సముచిత సౌందర్యముతో వ్యవహారభాష పెంపొంద గలదు గాన, దానఁగూడ మెఱుఁగులు దేఱి కొంత సత్కావ్యార్హత యేర్పడ వచ్చును. యక్షగాన గేయాదిరచనములందు నేఁటికే వ్యవహారభాష పొసగి యున్నది. కాని, వ్యవహారభాషకు చంపకోత్పలమాలాది వృత్తములతో నేఁటి దాఁకఁ బెంపుగాంచుచున్న సత్కావ్యభాషతోఁ బొత్తు కుదురనేరదని నే నను కొనుచున్నాను. వ్యవహారభాష దీర్ఘాక్షరబహుళము. అక్షర గణబద్ధములయిన చంపకోత్పల మాలాది వృత్తముల కిట్టి భాష యొదుగదు. దీనిని గుర్తించియే నేఁటి నవకవులు క్రొత్తత్రోవలతో మాత్రాగణ బద్ధములగు దేశిపదరచనల సాగించుచున్నారు.

సర్వతోముఖమయి సాగుచున్న యీ వాఙ్మయ పరిణామమును సర్వేశ్వరుడు సక్రమపద్ధతిని సత్ఫలోదర్కముగా సంరక్షించుననియే నా నమ్మకము.

శ్రీ సీతాపతిగారు వారి తండ్రిగారగు శ్రీ రామమూర్తిపంతులుగారితో పాటుగా పై భాషావ్యవహారమున చాలఁగాఁ బనిగొని యున్నవారే యయినను, ఈ శతకమున ప్రాచీన కవిసమ్మతము, సలక్షణము, సక్రమము, సంప్రదాయానుగతమునగు తీరునఁ గావ్య వాఙ్మయపరిపోషణకే కడఁగిరి.

కావ్యభాషకూడ వ్యవహార భాషోద్ధృతయే యనియు, వ్యవహార భాషాపరిణామముతోపాటు కావ్య భాషాపరిణామము కూడ అనివార్యముగా సాగుచునే యుండుననియు సప్రమాణముగా ననేక యుక్తులతో సీతాపతిగారిందు 145 పద్యములలో సమర్థించిరి. సహృదయులకిది సమ్మతమే యగునుగాని, యాక్షేపార్హముగాదు. నన్నయనాఁటి భాష యేమార్పులేక చిన్నయనాఁటి దాఁకను సాగుచున్నదన్న నమ్మకము గలవారెందేనిఁ గొందఱుందురేమో కాని, వారు భాషాచరిత్రమెఱుఁగని, కావ్య ప్రయోగపరిణామము గుర్తింపని, పండితమ్మన్యులే యగుదురు. అట్టివారికీ శతకము గొంత యెఱుక గూర్ప వచ్చును.

ప్రథమ ప్రకరణమందలి పద్యములలో హృద్యములు కొన్ని :-

అణుమాత్రంబగు మట్టివిత్తనము మొల్కెలేచు: నేపారుఁ; జి
క్కని చెట్టై ననలెత్తికాచు ; నురుశాఖల్ సాచు ; నందుండి నే
లను దాఁకన్ బదునూడలన్ విడుచు; వేళ్ళన్ జాచు ; నట్లేకదా
తనరుఞ్ భాషయుఁ బ్రాణమున్నవఱకున్ దప్పేమి యోభారతీ!

"వ్యవహారంబున లేకపోయినసరే ప్రాఁబల్కులేయొప్పు; స
ద్వ్యవహారంబునఁ బుట్టి వర్ధిలిన నర్వాచీన శబ్దంబులన్
గవితన్ గూర్చుట త"ప్పనన్‌దగునె? వృక్షంబందు పెంపారు ప
ల్లవముల్ ద్రుంచుచు జీర్ణపత్రముల నిల్పన్ జూతురే? భారతీ !

అరయఁ బ్రసిద్ధమైన వ్యవహారమునందలి శబ్దరూపముల్
సరసకవి ప్రయోగమున సాధువులైనను, గ్రొత్తవైనచో
నెరసు లటంచు దిద్దఁదగునే? కవులెల్ల రసజ్ఞులైన వచ
స్సరణి యెఱింగి, కావ్యములు శ్రావ్యముగా రచియింత్రు భారతీ !



ఇంక రెండవ ప్రకరణమున.

తమకుఞ్ బూర్వకవి ప్రయోగముల యాధారంబు లేకుండినా
తమపూర్వుల్ రచియించు లక్షణము వద్దంచుఞ్ నిరోధించి నా
సమకాల వ్యవహారశబ్దములతో సత్కావ్యముల్ సత్కవుల్
సుమనోహృద్యముగా రచించి ; రవి నేఁజూపింతునో భారతీ!

అని సీతాపతిగారు కొన్ని వ్యాకరణములును, కొందఱు గ్రంథకర్తలను కాదు కూడదని గర్హించు ప్రయోగములకుఁ బెక్కింటికి యుక్తిచే, ఉత్పత్తిచే ఉచ్చారణ పరిణామక్రమ సాజాత్యముచే, శ్రవణహృద్యతచే, సత్కవి ప్రయోగ రీతిచే సాధుత్వమును నిరూపించిరి. ప్రతిపద పరీక్షకిది చోటుగాదు కాని, మొత్తముమీఁద సీతాపతిగారి పరిశీలనరీతియెల్ల నిందుఁ జాలప్రశస్తముగా వెలసినది. ప్రాచీన కవినామము, తద్గ్రంథనామము, ప్రయోగము నుదాహరించి, తల్లక్ష్యముగాఁ దాను నొక వాక్యమున నా యపూర్వ ప్రయోగ మును గూర్చి యిందు సీతాపతిగారు సనియమముగా చాలఁ జక్కని పద్యముల రచించిరి. ఇట్టి నియమములున్నను పద్యములిందు గొగ్గిలేక ధారాశుద్ధి గలిగి చక్కగఁ నున్నవి. మచ్చుకు :-

అంతాయంచు సముచ్చయార్థమునఁ దప్పౌనే ప్రయోగింప? నే
చింతా లేకయెకాదె ధూర్జటిరచించెన్ గాళహస్తీశ నా
మాంతంబై యలరారు పద్యముల; నింకా యెందరో యిట్టి దీ
ర్ఘాంతంబైన పదంబులన్ గృతులవ్రాయన్ లేదె? యో భారతీ!

రోసిందేఁటికి రోఁతలేఁటికి మహారోగస్థుఁ" డంచున్ గదా
వ్రాసెన్ ధూర్జటి; అత్వయుక్తపు నవర్ణంబందు నజ్లోపముల్
జేసెన్ మూఁడు పదంబులందు; నిక నేఁ జెప్పింది యొప్పైన నే
వ్రాసిందేఁటికి నొప్పుగాఁ బరిగణింపన్ జాలవో భారతీ!

"ఇరువైనాలుగు మూళ్ళమేర" యని కాదేవ్రాసె శ్రీ నాథుఁడే?
"అఱువై యోజనముల్ వెడల్పును" వరాహస్వామియే చూచె; "నూ
టిరువై యెన్మిది భేదముల్" నరసరాజే యొప్పుగానెంచె; నే
మరి యాభై నలభైకిఁ చేర్చి యివి తొంభైయందునా? భారతీ:

అతఁడున్నేయని నన్నపార్యుడన నే "నల్లుణ్ని" , "మూణ్నాళ్ళు" "నిం పితివేణ్నీళ్ళు", "మొగుణ్నిజూచె" ననఁ దప్పే? మల్లయామాత్యుఁడే గతి రామస్తవరాజమందు "ఎవనిన్గైకోని వాణ్నేని" యం చతిశ్రావ్యంబుగఁ బల్కినాఁడొ వినలేదా? పల్కుమో భారతీ!

సీతాపతిగారు నిరూపించిన విధమున హృద్యములై సుకవి ప్రయుక్తములయి గ్రంథములకెక్కియున్న పదములు తప్పులని గర్హింపరాదనియే నా నమ్మకము. షష్ఠీవిభక్తి 'కు' కు పూర్వము 'న' లేకపోవుట (నాచనసోమనాదులు ప్రయోగించినను) "నఃకౌ" అను ఆంధ్రశబ్ద చింతామణి సూత్రమునకు విరుద్ధమనియు (ఆంధ్రశబ్ద చింతామణి నన్నయ రచితము కానేరదని యెన్నివిధముల నిరూపితమగుచున్నను), 'చేతును', 'కోతును' తప్పు రూపము లనియు, వ్యవహారమున నంతగాఁ గానరాకున్నను 'ఊయెల', 'ఊయేల', 'ఉయ్యెల', 'ఉయ్యేల' – రూపములు సాధువులనుచు, సర్వజన వ్యవహారరూఢమయియున్న 'ఉయ్యాల' తప్పనియు వాదించు వారిని నేను సంభావింపఁ జాలను.

విశాలదృష్టితో ప్రాచీన సంప్రదాయాభిమాను లీ శతకమును జూడఁ గల్గుదురు గాకయని యాశించుచున్నాను.

భాషాచరిత్ర పరిశీలనము శబ్దపరిణామక్రమ నిరూపణము, సత్కవికావ్య ప్రయోగ ప్రదర్శనము, సద్రచనము, సరస్వతీస్తవముననను ప్రయోజ నములతో గర్భితమయియున్న యీ శతకము పండిత కవి ప్రశంసార్హము. పయి ప్రయోజనములు గలదగుటచే మాతృభాషా పండితులు కాఁగోరు కాలేజీ విద్యార్థులకు పాఠ్యగ్రంథముగాఁ గూడఁ బరిగ్రహింపదగిన దీ శతకము.

విద్వాంసు లీ శతకము నింకను జక్కగా విమర్శించి సీతాపతిగారి పరిశ్రమమును సఫలపఱుతురు గాకని కోరుచున్నాను.

మదరాసు వేటూరి ప్రభాకరశాస్త్రి
బహుధాన్య విజయదశమి.

# మొయిలుమెఱుఁగులు

## మొయిలు రాయబారము పీఠిక

శ్రీ త్రిపురాన వేంకట సూర్య ప్రసాదరావు దొరగారు నాకు నచ్చిన నెచ్చెలి, ఈ చెలికారమునకుఁ గారణము వారి సరస కవితా చాతురి యే. కాళిదాస భవభూతుల ఘనకృతులను వారు తీరు తియ్యములు వెలయ నింతకు ముందే తెలిఁగించిరి. అపూర్వ సౌందర్యము మెఱయఁగా సంస్కృత కృతుల నాంధ్రీకరించుట యందు వా రందెవేసినచేయి. ఈ నడుమఁ గడుఁ గ్రొత్త తీరున వారు 'మొయిలు రాయబార' మనుపేరఁ జేసిన మేఘసందేశపుఁ దెలుఁగుసేఁతను వారి ముఖమున నే విని తనిసితిని. అది కాళిదాసుని 'మేఘసందేశమునకు, మెఱుఁగులు వెట్టునదిగానున్నది. ఆ సంస్కృత కాళిదాసు సందేశమును, ఈ యాంధ్ర కాళిదాసు రాయబారమును బురస్క రించుకొని కవి సౌహార్దానురోధమున నుభయ కవితా ప్రశస్తుల నించుక యుగ్గడింపఁ గడఁగుచున్నాఁడను.

## కాళిదాసు

కవికులగురువగు కాళిదాసుని కృతులు రఘువంశ కుమారసంభవ మేఘసందేశము లని కావ్యత్రయమును, శాకుంతల, మాళవికాగ్నిమిత్రీయ, విక్రమోర్వశీయము లని నాటకత్రయమును, ఋతు సంహారమని ఋతు వర్ణనాత్మక మగు లఘు కావ్యమును బ్రసిద్ధము లై ముద్రితములునై యున్నవి. కుంతలేశ్వర దౌత్యమని యొక కృతి (కావ్యమో నాటకమో) కాళిదాసునిదిగా భోజుఁడు తన శృంగార ప్రకాశమునఁ బేర్కొని దాననుండి యొక శ్లోకము నుదాహరించెను.[1] విక్రమార్కుఁడు కుంతలేశ్వరుని కడకుఁ గాళిదాసు నెందుకో రాయబారినిగాఁ బంపుట యందలి కథయఁట! ఈ గ్రంథము నౌచిత్య

1 శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు కుందమాలా నాటక పీఠికలో పై విషయము వివరించిరి. కుంతలేశ్వరదౌత్య శ్లోక మిది :–

శ్లో. అసకల హసితత్వాత్ క్షాళితానీవ కాన్యా
ముకుళితనయనత్వాత్ వ్యక్తకర్ణోత్పలాని,
పిబతి మధుసుగంధీన్యాననాని ప్రియాణాం
త్వయి వినిహితభారః కుంతలానా మధీశ⬚! 9వ ప్రకాశము.

విచార చర్చలో క్షేమేంద్రుఁడు నుదాహరించినాఁడు[1] కాన యది కాళిదాసుని కృత్యంతరముగా గణింపవలసినదే యగును. 'చిద్గగన చంద్రిక' యని దేవీస్తుత్యాత్మకము కాళిదాసీయముగాఁ గాన వచ్చుచున్నది.[2] ప్రాచీనులు దానిఁ బేర్కొని రఁట. ఇంకను శ్యామలాదండకాదు లేవేవో కాళిదాసకృతులుగా వ్యవహృతము లగుచున్నవి. కొన్ని యున్నవిగాని యవి యాతని కృతులే యని విశ్వసించుటకుఁ దగ్గ యాధారములు గానరావు.

కాళిదాసు క్రీ.పూ. ప్రథమ శతాబ్దివాఁడని కొందఱు, క్రీ.త. నాల్గవ శతాబ్ది వాఁడని కొందఱు నందురు. దిఙ్నాగాచార్య ప్రశంస మేఘసందేశమునఁ గల దనియు, నా దిఙ్నాగుఁడు క్రీ.త. తృతీయ శతాబ్ది తుదివాఁడనియుఁ, గాన, కాళిదాసు క్రీ.త. నాల్గవ శతాబ్దివాఁడు గాఁదగునని చతుర్థ శతాబ్దీవాదులు తలఁచుచున్నారు. దిఙ్నాగుని కాలము సుస్పష్టముగాలేదనియు నాతఁడు ప్రథమ శతాబ్దివాఁ డని కూడఁ దలఁపఁ దగినవాఁ డనియుఁ గాళిదాసు విక్రమార్కుని సభలోని వాఁడను ప్రఖ్యాతి చిరంతనమనియు, గాన, యాతఁడు క్రీ. పూ. ప్రథమ శతాబ్ది వాఁడనుట యుక్తమని ప్రథమ శతాబ్దీవాదులు తలంచుచున్నారు. ప్రథమ శతాబ్దీవాదమే సముచితమని నా యభిప్రాయము.

విక్రమార్కుఁడుజ్జయిని రాజధానిగా రాజ్యమేలెను గావునను, మేఘసందేశమున 'వక్రః పంథా యదపి భవత' ఇత్యాది శ్లోకమున యక్షుఁడు చుట్టు త్రోవయయినను మేఘు నుజ్జయినికిఁ బొమ్మని చెప్పి యధికముగా నుజ్జయినీ వర్ణనము పది పండ్రెండు శ్లోకములలోఁ జేయుటచేతను గాళిదాసుఁ డుజ్జయినీ వాస్తవ్యుఁడని పలువురు తలఁచుచున్నారు. ఇది సంగతముగా వచ్చును. కాని యీ క్రింది సాధనములఁ బట్టి యాతఁడు గోదావరీ తీరము వాఁ డనియు గుర్తింప నగుచున్నాఁడు. కాళిదాసు వైదర్భీతికిఁ బ్రవర్తకుఁడని యాలంకారికు లనిరి.

---

1 అధికరణౌచిత్యం యథా కుంతలేశ్వరదౌత్యే కాళిదాసస్య ;--

"ఇహ నివసతి మేరుః శేఖరః క్ష్మాధరాణా
మిహ వినిహిత భారాః సాగరాః సప్త చాన్యే
ఇద మహిపతిభోగస్తంభవిభ్రాజమానం
ధరణితల మిహైవ స్థానమస్మద్విధానామ్.

2. ఇది ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నున్నది.



శ్లో. సిక్తా మధుద్రవేణేవ యస్య నిర్విశా గిరః
తే నేదం వర్త్మ వైదర్భం కాళిదాసేన శోధితమ్
దండి– అవంతి సుందరీకథ.

సరస్వతీవ కార్ణాటీ విజయాంకా జయత్యసౌ
యా వైదర్భగిరాం వాసః కాళిదాసా దనంతరమ్.

వైదర్భీ గౌడీత్యాది రీతులు తొలుతఁ దత్తద్దేశ వాస్తవ్యు లగు కవుల రచనముల ననుసరించి యేర్పడిన వయి యుండు ననుట సంగతము. వైదర్భీ రీతికిఁ గాళిదాసు జనకుఁ డగుటచే నాతఁడు తద్దేశ జనితుఁ డగు ననుట సముచిత మగును. విదర్భదేశ మిప్పుడు నైజాం రాష్ట్రమున 'బెదర్', అను పేర నున్నది. అది గోదావరి ప్రాంత దేశమే. మఱియు" సేతుబంధకారుఁడు ప్రవరసేనుఁడు కుంతలదేశాధీశ్వరుఁ డగుటచేతను, విక్రమార్కుఁడు కాళిదాసుని రాయబారిని గాఁ బంపినది. ప్రవరసేనాదులగు వాకాటక రాజుల దగ్గఱ కయి ఉండఁ దగుటచేతను, నా కుంతలదేశము సరిగా నేఁటి నైజాం రాష్ట్రమే యగుటచేతను, ఉద్యోగవశమున నుజ్జయినిలో విక్రమార్కు నొద్ద నున్న కాళిదాసు స్వదేశ మగు కుంతల దేశమునకు రాయబారిగాఁ బోవుట సంగత మగుటచేతను, మఱియు మేఘసందేశమున యక్షుఁడు ప్రవసించిన ప్రదేశము 'రామగిరి' యని యుండుట చేతను, రామగిరి గోదావరీ తీరమున భద్రాద్రి ప్రాంతమున నున్నదే యని దేశచరిత్రజ్ఞులు ప్రాజ్ఞులు పలువురు ప్రఖ్యాత పఱుచుటచేతను, యక్షునికి రామగిరి ప్రవాస కల్పనము కాళిదాసు తనకుఁ బరిచిత దేశ మగుటఁ బట్టి కావించినది కాఁదగి యుండుట చేతను, యక్షాపదేశమునఁ గాళిదాసు తన విప్రయోగవ్యథనే వర్ణించుకొనెనని పలువురు ప్రాజ్ఞులు భావించుచుండుట విశ్వాస్యమనఁదగి యుండుటచేతను, నాతఁడు విదర్భదేశ జనితుఁ డని తలంచుట గూడ యుక్తిసహమే యగును.[1] కాళిదాసు గోదావరీ తీరపు విదర్భ దేశమున జనించి మహాకవియై వైదర్భీరీతి నిర్మాత యై యుజ్జయినిలో విక్రమార్కునాస్థానమునఁ జేరి యక్కడి కవి రత్నములలోఁ దరళమై వెలసి యుండవచ్చును.

---

1. రామగిరి చిత్రకూటములు గోదావరీ తీరమున భద్రాద్రి ప్రాంతముల నున్నవేయని నలువదేండ్లకుఁ బూర్వము శ్రీ కె.వి. లక్ష్మణరావుగారు తిలక మహాశయుని 'కేసరి' పత్రికలో వాదము సలిపి నిరూపించిరి. ఆంధ్రసాహిత్య పరిషద్రజతోత్సవ సంచికలోఁ బై యర్థమే శ్రీసాగి వేంకటనరసింహముగారి " రామగిర్యాశ్రమేషు" అను వ్యాసమున మరల నిరూపింపఁబడినది.

# మేఘసందేశము

సంస్కృత వాఙ్మయమున మేఘసందేశమున కసాధారణ గౌరవము గలదు. స్వరూపమునఁ జిన్నదయ్యును గావ్యగుణములఁ బట్టి యిది యుత్తమ కావ్య మనఁ దగినది. కవికుల గురుని తక్కిన కావ్యముల కంటె నిందు వ్యంగ్యార్థ వైభవ మధికముగాఁ బొందుపడి యున్నది. కొందఱు కాళిదాసు తన విప్రయోగ వ్యథనే యేతత్కావ్య రూపమున వెలార్చుకొనె నందు రని యింతకుముందే వాకొంటిని. అందలి [1]శ్లోకములఁ బరిశీలింతుమేని యది యట్లే కాఁబోలు నని తోచును. యక్షుని విరహ కాతరత, యక్షి సౌశీల్యము, నిందుఁ జక్కఁగాఁ బ్రదర్శింపఁ బడినవి. మేఘ మార్గమున నదీ నగరాది వర్ణనము, అలంకారవర్ణనము, యక్ష నిలయ వర్ణనము, యక్షీ స్వరూపాది వర్ణనము, సందేశరీతి, యిందసామాన్య కవిత చాతురీ ధురీణములు గానున్నవి. వర్షర్తురామణీయక మిందు వాల్మీకి వర్షర్తు వర్ణనమును దలఁ పించుచు మనోజ్ఞముగా నున్నది. రసిక దంపతి వియోగ వ్యథామాత్ర కథా ఘటిత మై సార్వదేశికము, సార్వకాలికము నగు తీరున స్వారస్యము వెలార్చు చుండుటచే నీ కావ్యము ప్రపంచ వాఙ్మయముననే ప్రఖ్యాతి కెక్కినది. సంస్కృత మున దీనికి నూఱింటిదాఁక ననుకరణములు, నిరువదింటిదాఁక వ్యాఖ్యలు వెలసినవి. కాని, యా యనుకృతులేవియు దీనికి దీటు గాఁజాలక పోయెను. మేఘసందేశము జాతిరత్నమే. అనుకరణము లెల్లఁ బోఁత రత్నములే. వ్యాఖ్యా నము లన్నింటిలో నాంధ్రదేశీయుఁడగు మల్లినాథుని వ్యాఖ్యానమే ప్రఖ్యాత మైనది. 'మాఘే మేఘే గతంవయః' అని యాతఁడనె నఁట. భారతీయులలెల్ల భాషలలోను నింక నెన్నో ఖండాంతరభాషలలోను నిది పరివర్తితమై చిత్తరువులతోఁ గూడ ముద్రితమై వెలసినది. మన దేశమున నే నెఱిఁగి నంతలో నింతకుముందిది వంగ భాషలోను హిందీభాషలోను బద్యరూప పరివర్తనములతోఁ జిత్రములతో ముద్రితమైనది.[2]ఇట్టిది భాషాంతరము లందుఁ బరివర్తనములఁ బడయుట యట్లుండ మన తెనుఁగుననే యిర్వదింటి

---

1. పూర్వ మేఘమున 16,25, 26, 29, 38, 39, 45; ఉత్తర మేఘమున, 4,2 శ్లోకములు చూడుఁడు.

2. వంగ చిత్రములలోఁ గొన్ని చాల సుందరముగా నున్నవి. రంగుల యచ్చుదానఁ జాల మేలిమి కెక్కినది. నాగరీ ప్రచారిణివారి హిందీ ముద్రణమునఁ గూడఁ గొన్న చిత్రములు చక్కఁగ నున్నవి. (మిగతా ప్రక్క పేజిలో)



కించుమించుగాఁ బద్యరూప పరివర్తనములఁ బడిసినది. సంస్కృతాంధ్ర భాషా సర్వంకష ప్రజ్ఞులగు శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిగారు ప్రతిపద టీకా తాత్పర్య వివరణ పదప్రయోజనాదులతో దీనిని బ్రకటించుట యాంధ్రులకు బహూపకారక మయ్యెను. ప్రాచీన వర్తమానాంధ్ర కవీశ్వరు లనేకులు తెలుఁ గు సేసిన మేఘసందేశముల నెన్నింటినో నే నెఱుఁగుదును గాని వానిలోఁ బెక్కింటికంటె శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు కొంత స్వాతంత్ర్యముతోఁ జేసిన తెలుఁగు సేఁత గుణోత్తర మనుకొంటిని. అది యట్టిది గాఁదోచుట చేతనే కాఁబోలు శ్రీశ్రీ జయపురాధీశ్వరులు దానికిఁ గృతిపతులయిరి. ప్రస్తుత పరివర్తనము.

## మొ యి లు రా య బా ర ము [1]

శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు కయికొన్న స్వాతంత్ర్యమును బరిభావించి యంత కింక నెంతో సంతనగా దీర్ఘసమాసదూరాన్వయాది క్లేశములు తొలఁగఁ ద్రోసికొని వెలసినది. మఱియు నిది యల్లనల్లన విరియుచు వల్పులు గొల్పుచు నమృత బిందు లొలుకునలరు రేకులఁ బోలె సులలితములై జిలుజిలు మనఁ జలువలఁ జల్లుచుఁ జవులఁ జిందుచు విందులు గొలుపుచు నున్న పలుకుల పొలుపుతో మురిపపు టొయ్యారపుటూపుఁ దోపించు శయ్యతో దేసి తెలుఁ గు తీరునఁ గదుఁదియ్యమయిన పాట సొరుతో నిఁక నిట్లు తెలిఁగించు టన్యుల కసాధ్యమునఁ దగినట్లున్నది. పాఠక హృదయముల నీ రచన వలవైచి తివిచినట్లు వశముగావించుకొనుచున్నది. సంస్కృత రచనలఁ గల వ్యంగ్య వైభవమెల్ల నిందు మిక్కిలి చక్కఁగాఁ జవిగొనఁ దనినట్లు సంరక్షిత మయినది.

---

"'చిత్ర కళాకోవిదుఁ" డగు శ్రీ తలిసెట్టి రామారావుగా రీ యాంధ్ర ముద్రణమునఁ గూడఁ జక్కని చిత్రముల రచియించిరి. ఇందుఁ జిత్ర రచన తెలుఁగు పొలుపులతో నున్నది. యక్షుని మేఘాలోక చిత్ర మిందు సుందరతరము.

1.మేఘసందేశమని, మేఘదూత మని, సంస్కృత గ్రంథమునకుఁ బేళ్ళు అందలి "దూత" "సందేశ" పదములకు"రాయబారము" సరిపడునాయని సందేహించితిని. ఆ సంస్కృత పదముల కంతకంటెఁ జక్కనిపద మింకొక్కటి తెలుఁగునఁ గానరాలేదు. ఇట్టి శృంగార సందేశమునే శ్రీనాథుఁడు "రాయబార" మని పేర్కొనెను.

చూ. శృంగార నైషధము. ఆ. 4.ప. 95.

"ఉన్మాదులు సంఘటింపఁగ సమర్థులె యెందును రాయబారముల్.

ఇంతకుముం దాంధ్ర కవీశ్వరు లనేకులు బహు సమర్థులే తెలిఁగించినను నా యన్నింటికంటె నీ మొయిలు రాయబారము గుణోత్కర్షము గలదనుట నిర్వివాద విషయము. అందఱ తెల్గుసేఁతలు నిందుకు లొంగిపోవుటకుఁ బ్రస్తుత కవికిఁ దెలుఁగు బలుకుఁ బొలఁతిని నాలుకపై వలసినట్లెల్ల నాట్యమాడింపఁగల మెలపునుఁ దెలుఁగునాఁట నేఁడు విలసిల్లుచున్న దేశి రచనాపరిణామముఁ జక్కఁదిలకించి దిద్ది తీర్పఁగల నేర్పును, అసాధారణ మగు రసార్ద్రహృదయతయుఁ బ్రధాన కారణములు.

## దేశిరచన

తెల్గు బాసకు దేశి యగు ఛందో రచన నన్నయాదుల నాటనుండియు నంతగాఁ బ్రాముఖ్యముఁ బడయుదయ్యెను. ఈనడుమనే యది పరిపోషణముఁ బడయ సాగినది. ఈ విషయ మెల్లఁ బ్రపంచించుట కిది చోటుగాదు. శ్రీ ప్రసాదరావుగారు మందాక్రాంతావృత్తములలో నున్న సంస్కృత గ్రంథమును దెలుఁగున దానికిఁ జేరికగాఁ జెప్పఁదగిన దేశి చ్ఛందో భేదములతోఁ దెలిఁగించిరి. అవి సీస, ద్విపద. తరువోజ, రగడ, రచనల కందిపొందియున్నవి. మూలము ప్రతిపద చమత్కార భరిత మయిన కాళిదాసుకృతి యగుట, పరివర్తనము రససిద్ధుని రచన మగుట, ఛందము దేసి యగుట, యీ తెలుఁగుకృతి కింత పొలుపు గూర్చినవి.

సీసపద్య ప్రథమ దళసమానగతితో నైదుమాత్రలగణములు గలిగి మందాక్రాంతా ఛాయ గలపద్యముగాను, సీసచ్ఛాయ గలపద్యముగాను, ఖండగతి- ఝంపె-చాపు- తాళములలోఁ బదములుగాను, ఆధ్యాత్మ రామాయణకీర్తనము, గజేంద్రమోక్షకీర్తనము (రాజేంద్ర విను సుధా రాశిఁ ద్రికూటాద్రి - ఇత్యాదికము) ల మట్టునను, హృద్యముగాఁ జదువఁ దగియున్నది.

ఛంద మిందు మాత్రాగణ ఘటితముగాన గురులఘ్వక్షర పరివర్త నానుకూల్యము, యతి ప్రాసాన్యతర సంధాన సౌకర్యము, అలల వంటి పెద్దపెద్ద చరణముల యూపుటొయ్యారము, సమకూరి కవికిఁ బరివర్తన మున స్వైరవిహారసౌఖ్యము నొసఁగినవి. రచనము లిట్టివి మన తెలుఁగునఁ



బ్రాఁత కాలపుయక్షగానములలోఁ గాననగును. కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయమునఁ బదముల నిందుకుఁ దార్కాణగాఁ జూఁడదగును. కాని వానిలోని దేశిరచన లీ కృతిలోని రచనలవలె నిగ్గులు దేరినవిగావు.

## ఇది యక్షగానమే

యక్షులు (జక్కులు) కథా పాత్ర వేషములు గొని నృత్యగేయాత్మక ముగాఁ బ్రదర్శించు దృశ్య రచనమునకు యక్షగాన మని పేరు. తొలుతనవి శ్రీ శైలాహోబల పర్వతాదులందుఁ బ్రదర్శితము లగు చుండెడివి. ఇదియు నేకపాత్ర ప్రయోజ్యము, దృశ్య రూపకమే. ఇదియు నృత్యగానాభినయానుగుణ మగు రచనా చమత్కృతి గలదియే. ఇందు యక్షుఁడే కథా నాయకుఁ డగుట మఱియు విశేషము. ప్రధాన గ్రంథమెల్ల గేయాత్మకముగా నున్నను గ్రంథకర్త కడు నేర్పుతో మూల మందలి గ్రంథారంభశ్లోకముల నైదింటిని చూళికగాను, నాయకుని స్వగత సంభాషణము గాను బరివర్తించుటచేతను గ్రంథాంతమునఁ గూడ సంస్కృతమున దొరకుచున్న ప్రక్షిప్త శ్లోకములకు సరస సంగతి గల్గునట్లు మంగళాంతత యేర్పడునట్లును, కథాచమత్కృతిని గల్పించుట చేతను వర్ణనైకాత్మక మయిన కాళిదాసుని మేఘసందేశమున కీ మొయిలు రాయబారమున గానాభినయ చమత్కార సమంచిత మయిన దృశ్య రూపకత సమకూడినది.

## మ కు ట ము లు

గ్రంథకర్త తన గేయరూప పరివర్తనములకుఁ బెక్కింటికి మకుటములఁ గూర్చెను. అవి కొన్ని సరిగా మూలమునకుఁ బరివర్తనములు. కొన్ని మూలాను గుణములగు కల్పనా విశేషములు. పూర్వార్ధమున కెల్ల నన్వితమగు మకుటము (పల్లవి) చాలఁ జమత్కృతి గలది.

"క్రొమ్మెఱపు వగలాఁడి కూర్మి సంగడికాఁడ!
క్రొమ్మొయిలు ఱేడ ! గయికొమ్ము నా విన్నపము ;
నెమ్మి...............
....................సారస్యముగలాఁడ!"

పలుకు పొంక (సౌశబ్ద్యము) మిందుఁ గులుకులాడు చున్నది. కాళిదాసుని వ్యంగ్య గౌరవ మిందుగడలుకొన్నది. క్రొమ్మెఱపు వగలాఁడికిని గూర్మి సంగడీఁడవయి కూడి వినోదించు చుంటివి గాన నీవే నా నెయ్యురాలియెడఁ బాటు వగపును గుఱుతింపఁ గల్గుదువు. జీవన మిచ్చి సర్వ లోకములనుదేల్చు సారస్యము నీ కున్నది. కావున, నా విన్నప మాలింపను బాలింపను గల్గుదువు అని యిందు ధ్వని. ఇట్టి ధ్వని చమత్కృతి కాళిదాసుని కృతిలోఁ బిక్కటిల్లి యున్నది.

శ్రీ వేంకటరాయ శాస్త్రులవారు తమ యాంధ్ర వ్యాఖ్యానమునఁ బద ప్రయోజన మను పేర నిట్టి వ్యంగ్య చమత్కృతులఁ జాల వివరించియున్నారు. శ్రీ ప్రసాదరావుగా రా వ్యంగ్యార్థముల కెందును భంగము గల్గనియట్లు, అంతేకాక పరిశోషణము గల్గునట్లు, తమ తెలుఁగు సేఁత వెలయించిరి. అట్టి పట్టు లనేకములు వివరించి తెలుపఁదగినవే యయినను విస్తరభీతిని విడుచుచున్నాను. పూర్వ మేఘమునఁ దొలియైదు శ్లోకములుం బోను గడమ యెల్ల నలకామార్గ వర్ణనాత్మకములే కాన, యన్ని పాటలకు నిదియే పల్లవియై యుల్లాసము గొల్పుచున్నది. పాట పాటకును నీ పల్లవి యనుగతమై యాశ్లోకార్థము మేఘునిఁ గూర్చి యక్షోక్తియగుటను స్మరింపఁ జేయున్నది. ఉత్తరార్ధమున– "కలిమిచెలి కాఁపురము మా యలకాపురము..." ఇత్యాదికము కవికల్పితము. అలకాపుర వర్ణనాత్మకములగు పండ్రెండు శ్లోకములకు నీ మకుటము పనుపడి యున్నది. యక్షుఁడు తన యింటి పట్టు నానవాళ్లు చెప్పు శ్లోకము లేదు నాకు మేఘసందేశమునఁ గడు వేఁడుక గూర్చుచుండును. తెలుఁగు సేఁత లలిత లలితముగా నున్నను నీ శ్లోకములు గూడ దేశిగేయ రూపముగానే యుండఁ దగిన వనుకొనుచున్నాను. యక్షీ స్వరూప వర్ణనాత్మకము లగు రెండు పద్యములును శ్రీనాథుని సూర్య శతక శ్లోకాంధ్రీకరణములఁ దలపించుచు మనోజ్ఞములుగా నున్నవి.[1] వీని తెలుఁగు సేఁత తీరు కవిశేఖర శ్రీ వద్దాది సుబ్బరాయ కవి కృత్యుపజ్ఞమై శ్రీ పిచ్చయ శాస్త్రి రచనమునఁ దెనుఁగుఁ బొలుపున విరివిసెందె, విందుగొల్పి యిందు గేయతం బడసి కడుంగడు విందు గూర్చుచున్నది.

'1. చూ. శాత శ్యామాలతాయాః పరశు రివ... సూర్య శతకము చిఱుసానఁ బట్టించి చికిలిసేయించిన గండ్రగొడ్డలి......... (కాశీ ఖండము.)



యక్షుని సందేశము శ్రోత్రపేయ మైనదని "సందేశం మే... .... శ్రోష్యసి శ్రోత్ర పేయమ్" పూ.మే. శ్లో. 13న. యక్షోక్తి రూపమునఁ గాళిదాసు చెప్పెను. ఉత్తర మేఘమున నా సందేశము 10 శ్లోకములలో నున్నది. అందు "శ్యామాస్వంగం..." అను శ్లోకము మొదలు 6 శ్లోకములలో యక్షుని విరహావస్థయు, "నత్వాత్మానం" అను శ్లోకము మొదలు 4 శ్లోకములలో నిరాశచేఁ బ్రాణములు గోల్పో వలదని యక్షినోదార్చుటయుఁ గలవు. మొదటి 6 శ్లోకములకు "జీవితేశ్వరి ! నిన్నుఁ బాసియు... .... వినఁగదే" అను మకుటమును, గడమ 4 శ్లోకములకు, "తెగువ సేయకుమాస తెగఁ గోసికొని .... ... మన్నింపుము" అను మకుటమును విషయానుగుణముగా సందర్భోచితముగా 7 మాత్రలును 5 మాత్రలునుగల గణముల గీతికలలో శ్రీ ప్రసాదరావుగారు కల్పించిరి. ఆ సందేశ మందలి 'శ్రోత్రపేయత" శ్రీ ప్రసాదరావుగారి తెలుఁగుసేఁతలో మూలాధికమై మురిపించుచున్నది.

## ఇది ప్రయోగార్హము

రస భావమయ మయిన కథార్థము, అభినయ నాట్య గానానుకూల్యముతో నందచందము లొదవిన పదబంధమును గల యీ గేయ రూపకము రసిక విద్వత్సామాజిక సమక్షమునఁ బ్రయోగమును బడయఁ దగియున్నది. సామాన్య జనులు సామాజికు లగుచో దీని ప్రయోగ సౌభాగ్యము ననుభవింపఁజాలరు.

## కృత్యాది రచనలు

శ్రీ సూర్య ప్రసాదరావుగారు రచించిన పద్యములు 'పెంపుడు బిడ్డ' యన్నవి సుమనో మనోజ్ఞములు. 1, 4, 5, 13, 17, పద్యములు చదువుటలో నా తలఁపులు పులకరించినవి. శ్రీ సాహిత్య సమ్రాజులు శ్రీశ్రీశ్రీ విక్రమ దేవ వర్మ మహారాజులుంగారి దత్తపుత్రికా కళ్యాణ పద్యములు కవితా రచన మయ్యుఁ గవి కల్పనగాక నిక్కపుఁ బల్కుఁ జక్కందనముతో నిగ్గులు దేరియున్నవి. కాళిదాసాశ్రయ మగు విక్రమ నామమునకు నాంధ్రకాళిదాసాశ్రయమగు విక్రమ నామమునకు నైక్యమును, గృతి కన్యను బెంచుకొని రామార్పణము గావించుటలో విక్రమభూపునకు జనకసమానతయునంద

ముగాఁ బొందుపడినవి. వీనియన్వర్థతలో నేదోయౌచితి యనభివ్యక్తమై స్ఫురించుచున్నట్లున్నది. శ్రీ సూర్యప్రసాదరావుగారి తండ్రిగారు శ్రీ తమ్మయరాట్కవీంద్రులు శ్రీ ముక్కవిల్లి సాంబయ శాస్త్రిగారను విద్వత్కవివర్యుల నాస్థాన కవిని గాఁ గొని పోషించిరి. ఇట్లు విద్వత్పోషకతను బడసి భూనేత యై వెలయు శ్రీ ప్రసాదరావుగారిని గౌరవాస్థాన కవినిగాఁ బరిగ్రహించుటచే శ్రీ విక్రమ దేవవర్మ మహారాజులుంగారికి సాహిత్య సమ్రాడ్బిరుదము సార్థక మయినది.

నేఁటి యాంధ్ర కవీశ్వరులలో నుత్తమోత్తముల నేఱి వ్రేళ్ళపై లెక్కింపఁ బూనుచో శ్రీ సూర్య ప్రసాదరాయ కవిగా రందుఁ గుడిచేతివ్రేళ్ళ లెక్కలోనే కుదుర్కొనఁ గలరు. నిస్సామాన్యముగాఁ గాళిదాస కృతులఁ దెలిఁగించుటచే వా 'రాంధ్ర కాళిదా' సనఁ బరిగిరి. ఈ బిరుదము 'అభినవదండి', 'ఆంధ్రవాల్మీకి', ఇత్యాది బిరుదములఁ బోలిన దగుటలో స్వారస్యము లేదు. సంస్కృత వాఙ్మయమున వాల్మీకి, కాళిదాసు దివ్యకావ్యముల రచించి పేర్వెలసిరి. సంస్కృత వాఙ్మయమున వారి కెట్టి స్థానముగలదో యట్టి స్థానము నాంధ్రవాఙ్మయమున నాక్రమించిన వారికే న్యాయ్యముగా నా బిరుదములు చెల్లఁదగినవి. శ్రీ ప్రసాదరావుగారు స్వయముగా నపూర్వ కల్పనలతో నట్టి కృతుల రచింపను, గాళిదాసు నంత గౌరవము గడింపను నర్హులే యగుదు రని నా నమ్మకము. ఇఁకఁబై పరివర్తనములతో పాటు స్వతంత్ర కృతులను గూడఁ గూర్చి సరియయిన తీరున నాంధ్రకాళిదాస బిరుదమును శ్రీ ప్రసాదరావుగారు, అత్యంత మన్వర్థపఱుచుకొనఁ గలరుగాక!

శ్రీ మహారాజులుంగారి యాస్థాన మందింతకు ముందు శ్రీ సెట్టి లక్ష్మీనరసింహము కవిరత్నముగా నుండెను. ఆయన లేని కొఱత మాయునట్లు శ్రీ ప్రసాదరావుగారు మరల దొరకుట శ్రీ మహారాజులుంగారి యదృష్ట విశేషమే. శ్రీ విక్రమప్రభులు మఱియు నెనమండ్రఁ గవిరత్నముల నాస్థానిలోఁ జేర్చుకొనఁ గలరుగాక !

సరస సత్కవితా విశారదుఁడు సూర్య ప్ర
సాద రాణ్మణి పూర్వజని కృతామిత పుణ్య



పరిపాకమునఁ గాంచె బహు కావ్య కన్యకల
సురుచిరాలంకార సుందరతరాకార
వరణీయ గుణ వృత్తి వాక్చమత్కృతి మతుల
వార లెల్లను భాగ్యవతులే, యయిన నేమి
మురిపంబు పరువంబు ముద్దు ముచ్చటలు నిం
పును సొంపు నధిక మోమొయిలుఁ గన్నియ! నీకె.

ప్రాఁత కాలపు వేష భాష లిప్పటి కావ్య
బాలికల్ మెచ్చరని పరికించి నీ తండ్రి
స్వాతంత్ర్యమును దొంటి సంప్రదాయముఁ జక్క
సమకూర్చి పద పద్య సంగీత నాట్య రస
చాతురుల్ నేర్పి నిను జనముద్దుగాఁ బెంచె
సభలలో నీ యాట సొరు పాటల తీరు
ఖ్యాతి కెక్కించె విక్రమ భూపు మెచ్చించెఁ
బ్రీతి నాయన కిచ్చెఁ బెంపకపు బిడ్డగా;

పరమ పురుషునకు రఘుపతికి ని న్నర్పించి
తరియించినారు నీ తండ్రి పెంపుడు తండ్రి
చిరకాల మఖిలాంధ్ర సీమ నలరించుచును
జెలఁగుమా సుకృతి! యాశీర్వచన మిది నీకు
సరవి నిఁక నీ వంటి సత్కావ్య కన్యకలు
జనియింత్రు గా కాంధ్ర జగతి సత్కవులకును
దొరలుఁ గావుత నిరంతరము దొంతరలు దొం
తరలుగా సుకృతి సంతతుల కుద్బోధములు.

శ్రీ వేంకటేశ్వరం
ప్రాచ్య విద్యాలయము.
తిరుపతి 1-10-40.

వేటూరి ప్రభాకరశాస్త్రి.

# గోవింద రామాయణము
## తొలిపలుకు

శ్రీ సీతారామచంద్రులు భరతవర్ష ప్రజల కనుకరణీయ శీలురగు పరమపురుషులు. భారతదేశమున సుమంగళులెల్లరు సీతాశీలమును బాతివ్రత్యాదికము ననుకరింపఁ బ్రయత్నింతురు. పురుషులెల్లరు శ్రీరామశీలము, నేకపత్నీ వ్రతాదిరూపము ననుకరింపఁ దపింతురు. రామాయణేతివృత్తము భారతీయుల పవిత్రజీవితమునఁ బరిణమించి పోయినది. ప్రజల మంచి చెడుగులలో,కష్టసుఖములలో నింకనెన్నేని వ్యవహారములలో రామాయణ కథార్థములు రామాయణకథాపురుషులు పరిస్ఫురించుచుందురు. సీతలెందఱో, చుప్పనాతులెందఱో, రాములెందఱో, రావణులెందఱో, కౌసల్యలెందఱో, కైకలెందఱో ప్రజలలో బరిగణింపఁ బడుచున్నారు. కారణము లెఱుఁగరాని కష్టానుభవములందుఁ బ్రజలకు శ్రీరామచంద్రమూర్తి జీవితావలంబమును బ్రసాదించుచున్నాఁడు. మానవులై యవతరించిన, శ్రీ సీతారాములు తమ కాలముననే, తమ గుణోత్కర్షముచే నీశ్వరాంశావతీర్ణులుగా గుర్తింపఁబడిరి. నాఁటికి, నేఁటికి, నేనాఁటికిఁ గూడ, వారి నామాక్షరములు మహా మహిమతోఁ దారకబ్రహ్మ మంత్రములై యారాధింపబడుచునే యుండును.

> రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః ।
> రామభూతం జగత్సర్వం రామే రాజ్యం ప్రశాసతి.

సత్పురుషులఁ గీడ్పఱుచుచు సర్వసౌఖ్యము లందుచున్న వారెందఱులేరు? ఏవం విధ విధి వైపరీత్య పరిక్షోభానుభవము కూడ ప్రస్తుత గ్రంథకర్త కీయుత్తర రామాయణ కథారచనాభిమానమున కొక హేతువు కాఁగూడును !

కవి కల్పితములై కథార్థములు శృంగార కరుణాది రస పరికరములతోఁ గావ్య ప్రతిపాదనమున నాస్వాద్యము లగుటకంటె నవి లోకమున జరిగిన సత్యార్థములే యైనచో నంతగా నద్భుతానుభావాది రస పరికర పౌష్కల్యము, కవి కవితాకల్పనా చమత్కృతి లేకున్నను సహృదయుల కాస్వాద్యతరములై యానందముఁ గొల్పుచుండును. సత్యమే సౌందర్య సమంచితము. శుభమయము.సత్య వస్తువు ససిగా సమకూర నపుడే కవితా



ప్రతారణము వనిగొనును. సత్య స్వరూపము, సువ్యక్తము గాక పోఁగా నూహా పరికల్పితమైన, సత్య ప్రతికృతియే కవిత యగుచున్నది. అట్టిదానికి భాషాపరిష్కృతి, యలంకార విడంబము, శయ్యా వైయాత్యము, వస్తువిన్యాస వైచిత్ర్యము, పనిఁబూని కొని తేవలసి యుండును. కూటసాక్ష్యము చెప్పువాఁడు కథకట్టుకొని పూర్వాపర సందర్భముల నెన్నింటినో పూనికతోఁ బొసఁగించు కొనవలసినవాఁడగును. ఎంత పొసఁగించు కొన్నను తుదకు వాఁడదను దఱిసి నవు డవకతవకలకుఁ బాల్పడు చుండును. సత్యము వాక్రుచ్చువాఁడు తొట్రుపడక యున్న దున్నట్లు నిర్వికారముగా నిబ్బరముగా నిరూపణము చేయఁగల్గును. “టాగూరు బంగారు కలము చికిలి వ్రాతల కంటె గాంధి యినుప కలము గీటు వ్రాతలు చుఱుకయినవి, సూటియైనవి, సుందరమయినవి ! ” అని.

యిట్టి వేవేవో భావములు నాకు రేకెత్తుచుఁ గైతయన్న రోఁత తోచుకాలమున గోవింద రామాయణ మిది చేత చిక్కినది. ఇది యేదో రామాయణ కథారచన యని యీసడింపుతోనే యెత్తికొనియు దొలి పద్యము దొరకొని యితిశ్రీదాక యేకధారగాఁ జదివియే యింకొకరి చేత బెట్టవలసిన వాఁడనయితిని. నన్నీ కావ్యమంత తన్మయునిఁ గావించినది. కవితా విడంబనమంతగా నాకిందుఁ గానరాలేదు. కవి కిందు శ్రీ రామచంద్రమూర్తి దివ్యధ్యానము, తత్సచ్చరిత్ర ప్రణయనతత్పరత, పరమార్థలిప్స, యనునవియే యీ గ్రంథరచనమున హృదయమునఁ దొలఁకు లాడినవి. ఉత్తర రామాయణ మందున్న యుపకథలెల్ల నిందుపేక్షింపఁబడినవి. తిక్కన నిర్వచనోత్తర రామాయణము, పాపరాజు నుత్తర రామాయణము మొదలగునవి కవితా విలాసంపు సొంపు నాస్వాదింపగోరి కూరిచినకృతులు. ఈ గోవింద రామాయణమునకు వానికిని పోలికలేదు. ఈ గ్రంథములు పాఠకునిఁ గవితా స్వారస్య కల్పనా చమత్కారానుభవ రసికునిఁ గావింపఁ గల్గినవి. ఈ గ్రంథము పాఠకుని శ్రీరామభక్తిపరుని, సుఖదుఃఖ నిర్వికారుని పరమార్థ పరాయణునిఁ గావింపఁగల్గినది. కవితావికృతులంతగాఁ గానరాకున్నంత మాత్రమున నిది కావ్యగౌరవము లేనిదనఁగాదు. వంకలు దీఱినశయ్య, పొంకములుగల పలుకుతీరు, శుచిరుచులు గల పాకము, వడిగల కథావస్తుగతి యిందున్నవి.

ఉత్తర రామాయణ కథావస్తువుకిట్టి కవితా పరికరమే కావలసినది. కొంపలు దగులఁ బడుచున్న సంక్షోభసందర్భములఁ జెప్పునప్పుడు రాగాలాపములువోలె నుత్తర రామప్రణయ ప్రళయ కథాకథనమున విపుల కవితా విలాసములు వైరస్యహేతువు లగును. తటస్థులనెల్ల నువ్వెత్తుగా నూచి పడద్రోచి లోఁగొని కొట్టికొనిపోవు కరుణరసకల్లోలినిలో జల జలలు, మిల మిలలు, సెలమెలపులు, సోనసొంపులు, గోచరింపవు. పాఠకులకు జీవితానుశీలనమున నుత్తర రామచరిత్రమెంత గంభీర యోచనపుఁబని గల్పింపవలెనో, గోవిందా చార్యులవారి రచనమిది యంతపనిని గల్పింపఁ జాలియున్నది. దీనిఁజదివి నేను తన్మయుఁడనై స్తవముగాఁ గాక వాస్తవముగానే యిట్లు వాక్రుచ్చుచున్నాను. ఈ గ్రంథము నామూలాగ్రము జదువునపుడును నందును గ్రంథాద్యంతాశ్వాసావసాన ఘట్టములఁ జదువునపుడును నేనలౌకికానంద మును బొందినాఁడను. వియోగాశ్వాసము నిర్గమనాశ్వాసము, నిందు మఱీ రసప్లుతములుగా నున్నవి. కృత్రిమకవితా కల్పన లిందు లేవు. కథాగతి సూటిగా నున్నది. ఔచితి చక్కగా సంరక్షితమయినది. పుష్పమువోని కథాపరమార్థమునకు దొడిమవోలెఁ గవితవెనుకఁ బడియున్నది.

అనన్యసాధ్యే స్వాభీష్టే మహావిశ్వాసపూర్వకమ్.
త దేకోపాయతా యాచ్ఞా ప్రపత్తిశ్శరణాగతిః

అన్న ప్రపత్తి మాధుర్యము గ్రంథము ప్రతిపదమునఁ బాఠకులు పర్యాప్తముగా నాస్వాదింపఁగల్గుదురు. ఆంధ్ర సహృదయులకెల్ల నీ గోవింద రామాయణము పరమార్థపు విందుసాగించి పరితోషముగొల్ప జాలునని నా విశ్వాసము. పరమార్థపరాయణు లగు నిట్టి గ్రంథకర్తలను భగవంతుఁడాంధ్ర దేశమున కింకను ననుగ్రహించుఁగాక.

తిరుపతి,
16-2-1942. వేటూరి ప్రభాకరశాస్త్రి

# వెంకటేశ్వర వచనములు
## పీఠిక
# వచనరచన - తాళ్ళపాకవారు

ఆంధ్రవాఙ్మయమునఁ బ్రాచీనకాలమున వచన కావ్యరచన మంతగాఁ గానరాదు. భారతాదికృతులలోఁ బద్యరచనముల నడుమ నెడనెడఁ గానవచ్చు వచన రచనలే కాని, వచనైకరచనలు చాలఁదక్కువ. పద్యైక రచనలంత కింకను జాలఁ దక్కువ. తిక్కన నిర్వచనోత్తరరామాయణ మొక్కటే యట్టిది పేర్కొనఁదగినది. సంస్కృతమునఁ బద్యైకరచనలే యెక్కువ. చంపూరచన లంతకుఁ దక్కువ. గద్యైకరచనలును దక్కువే. దక్షిణ దేశభాష లలోఁ గర్ణాటకమున నొకతీరు గద్యరచనలు చాలఁగలవు. అవి ప్రాయికముగా వీరశైవులు భగవత్ప్రార్థనాతత్త్వార్థ నిరూపణ పరములుగా రచించినవి. అట్టిరచనలఁ బెక్కింటిని జేర్చి కర్ణాటకుల 'వచనశాస్త్రము' అనుపేర బేర్కొనిరి. కొన్ని సంపుటములుగా నిటీవల వానినిఁ బ్రకటించిరి. కన్నడమున నాయా రచనము లించుమించుగాఁ బంద్రెండవశతాబ్దినుండి యారంభమయిన వనవచ్చును. ద్రవిడమునఁ బ్రాచీనకాలమున వచనైకరచనలు లేనే లేవఁట! వ్యాఖ్యాన రూపవచనరచనము లుండుఁ గాక యవి వచన కావ్యరచనలనఁ దగినవి.

సంస్కృతమున వచన రచన ముత్తెఱఁగు లని వామనుఁడు కావ్యాలంకార సూత్రమున నిట్లు చెప్పినాఁడు.

"కావ్యం గద్యం పద్యం చ. గద్యం వృత్తగన్ధి చూర్ణ ముత్కలికా ప్రాయం చ. పద్యభాగవ ద్వృత్తగన్ధి. అనావిద్ధలలితపదం చూర్ణమ్. విపరీత ముత్కలికాప్రాయమ్ " అని.

పద్యపాదభాగముల కలయికతో వృత్తముల వాసనఁ దోఁపించు చుండు వచనరచనము వృత్తగన్ధి. దీర్ఘ సమాసముల గడబిడలు లేక తేలికపలుకులతో నుండు పొడిపొడివచనము చూర్ణము. దీర్ఘ సమాసముల గడబిడలు గలిగి యుద్ధతోక్తులతో నుండురచన ముత్కలికాప్రాయము నని.

వామనునికిఁ దర్వాతవాఁ డగు విశ్వనాథకవిరాజు వచనము నాల్గుదెఱఁగుల విభాగించెను. "వృత్తలేశవిహీన మయినగద్యము ముక్తకము వృత్తగంధి ఉత్కలికాప్రాయము చూర్ణకము నని నాలుగు విధములు.. తొలిది సమాసరహితము. రెండవది వృత్తభాగములతోఁ గూడుకొన్నట్టిది. మూఁడవది దీర్ఘసమాసాఢ్యము. నాల్గవది యల్పసమాసకము.

పయి రచనాప్రభేదములలో రెండింటికి మాత్రము తెలుఁగున భారతాది కృతులలోని వచనభాగములనుండి లక్ష్యము లెత్తి చూపవచ్చును. ప్రాయికముగాఁ గవిత్రయమువారి రచనలలోని వచనరచనములు చూర్ణకములనఁదగినవి. నాచనసోమన, పోతన ప్రభృతుల రచనలు గొన్ని యుత్కలికాప్రాయము లనవచ్చును. వృత్తగంధి రచనలు తెనుఁగునఁ బ్రాచీనకాలమున నంతగా లేవు. ప్రబంధరాజవేంకటేశ్వర విలాసమున వృత్తగంధి వచన రచన లున్నవి. నేఁటికాలమున శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు రచించిన* 'ప్రాఁదెనుగుఁగమ్మ' వృత్తగంధియే. మచ్చుతునుక–

'సిరిఁదాల్చుతేఁ దొగిఁజిన్ని చూడ్కులఁ జూచు తెనుఁగుఁ జదువుల రచ్చ తీర్పరులారఁ క్రిందను గ్రైవ్రాలునేసిన నే ననయా! యణకువ మెఱయుచు నాయోపు కొలఁదిఁ దెనుఁగుఁజదువులగుతిచి జాను మివులంగఁ దొలితెనుఁగు నుడు లనఁ దేటతెల్లగను విన్నప మొక్కండు వినిపింతు మిమ్ము మోడ్చియు నిరుచేయి మ్రోఁకరిలఁబడియు నెఱఁగియుఁ గైవార మొనరంగఁ జేసి తద్దయు వేఁడుదు నాలింపుఁ డయ్య మీరపోలెను నేను బ్రాఁబొత్తములు సాలఁజదువలేన'

కర్ణాటకమున గూడ వృత్తగంధి రచనము లున్నవి. రామాశ్వమేధాదు లందు లక్ష్యములు చూడనగును.

సంస్కృతమున వామనుఁడు పేర్కొన్నముత్తెఱఁగుల రచనములు నున్నవి. కాదంబరీ, దశకుమారచరిత్ర, యశస్తిలక చంపూ ప్రభృతులందును, శ్రీభగవద్రామానుజాచార్యులవారి గద్యత్రయమునందును, బాల్కురికి సోమనాథుని గద్య గ్రంథమునందును వీనికి లక్ష్యము లున్నవి. శ్రీభగవ ద్రామానుజాచార్యులవారి గద్యత్రయముననుండి ముత్తెఱఁగుల రచనలకు మచ్చుతునుకలఁ జూపుచున్నాఁడను. చూర్ణమునకు –

*చూ– ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక ౨ సంపుటము సంచిక 3



అపారకరుణామ్బుధే, అనాలోచితవిశేషా విశేష లోకశరణ్య, ప్రణతార్తిహర, ఆశ్రితవాత్సల్యైక మహోదధే, అనవరతవిదితనిఖిలభూతయాథా త్మ్యసత్యకామ, సత్యసఙ్కల్ప, ఆపత్సఖ, కాకుత్స్థ, శ్రీమన్నారాయణ, పురుషోత్తమ, శ్రీరఙ్గనాథ, మమ నాథ నమో ఽ స్తుతే. (శ్రీరఙ్గగద్యమ్)

ఉత్కలికాప్రాయమునకు –

స్వచ్ఛన్దానువర్తి స్వరూపస్థితిప్రవర్తిభేదా శేష శేషతైకరతిరూపనిత్య నిరవద్య నిరతిశయ జ్ఞానక్రియై శ్వర్యాద్యనన్త కల్యాణగుణగణ శేషాసన గరుడ ప్రముఖ నానావిధానన్తపరిజన పరిచారికా పరిచితచరణయుగల పరమ యోగివాఙ్మనసాపరిచ్ఛేద్య స్వరూపస్వభావ స్వాభిమత వివిధవిచిత్రానన్త భోగ్యభోగోపకరణ భోగస్థాన సమృద్ధానన్తాశ్చర్యానన్త మహావిభవానన్త పరిమాణ నిత్యనిరతిశయ శ్రీవైకుణ్ఠనాథ – (శరణాగతిగత్యమ్)

వృత్తగంధికి–

ప్రత్యగ్రోన్మీలిత సరసిజసదృశ నయనయుగలం – స్వచ్ఛనీలజీమూత సఙ్కాశమ్ –అత్యుజ్జ్వల పీతవాససం – స్వయంప్రభయా అతినిర్మలయా అతిశీతలయా స్వచ్ఛయా మాణిక్యాభయా – కృత్స్నం జగద్భాసయన్తమ్ –అచి న్త్యదివ్యాద్భుత నిత్యయౌవన స్వభావ లావణ్యమయామృత సాగరమ్ – అతిసౌకుమార్యా దీషత్ప్రస్విన్నవ దాలక్ష్యమాణలలాటఫలక దివ్యాలకావలీ విరాజితం – ప్రబుద్ధముగ్ధాంబుజచారులోచనం – సవిభ్రమభ్రూలతమ్– ఉజ్జ్వలాధరమ్ – శుచిస్మితం – కోమలగణ్డమ్ – ఉన్నసమ్ – ఉదగ్రపీనాంస విలమ్బికుణ్డలాలకావలీబన్ధురకమ్బుకన్ధరం – ప్రియావతం – సోత్పల కర్ణభూషణ శ్లథాలకా విమర్దశంసిభిశ్చతుర్భి రాజానువిలమ్బిభి ర్భుజై ర్విరాజితం – అతికోమలదివ్యరేఖాలఙ్కృతాతామ్రకరతలం, దివ్యాఙ్గులీయకవిరాజితమ్, అతికోమలనఖావలీవిరాజితం, అనురక్తాంఙ్గులీభి రలంకృతమ్, తత్క్షణోన్మీలితపుణ్డరీక సదృశ చరణయుగళమ్. *(శ్రీ వైకుణ్ఠగద్యమ్)

తెలుగునఁ లక్షణగ్రంథకర్తలు వచనరచనల నిట్లు పేర్కొనిరి.

"క॥ కనుఁగొనఁ బాదరహితమై
పనుపడి హరిగద్దెవోలె బహుముఖ రచనం

*ఇందు ఆళవందార్లస్తోత్రరత్నశ్లోకముల తునుక లున్నవి.

బున మెఱయు గద్య మది దాఁ
దెనుఁగు కృతుల వచన మనఁగ దీపించుఁ గడు≡ .

గద్యము – స్వస్తి సమస్తభువనరక్షాదక్ష శ్రీ పుండరీకాక్ష భుజగపతి సింహాసనారూఢ సురనికరమకుటతటఘటితసురుచి రమణిగణప్రభావిభాసిత పాదపీఠ వేదనినాదానుకారగౌరవలలితనూపురాలంకృత చరణసరసిజయుగళ నవ్యపదాంగుష్ఠనఖమయూఖలేఖాయితసురసరిత్ప్రవాహ పీతాంబరధర నూత్న మేఖలాకలితకటితటప్రదేశ చతురాననజనక నాళీకశోభితనాభిసరోవర యఖండ బ్రహ్మాండకలాపగోపననిపుణోదర క్షీరసాగరతనయా మనోజ్ఞ గేహీకృతవిపుల వక్షస్స్థల కనత్కనక కటక కేయూర ప్రముఖభూషణభూషిత చతుర్భుజ శంఖ పంకజసుదర్శనగదాధర కిరీటకుండలాభిరామ యనవరత ప్రసన్న వదన కౌండిన్యవరద శ్రీయనంతపద్మనాభ నమస్తే నమస్తే నమః–" (అనంతుని ఛందము)

'ఇఁక నందు గద్యలక్షణం – మఱియు నందు గద్యయు నైదుభేదం బుల విహరించు – నయ్యవి యేవంటేను గద్యయు, బిరుదగద్యయు, చూర్ణికయు, వచనంబును, విన్నపంబులు నన గద్యభేదంబు లైదును ప్రమోదంబున వివిధమ్ములై వినోదించు నందు గద్యక్రమం బెటువలె నంటేని ౧ గద్య – అనుకరణ శబ్దయుక్తంబై యొప్పు నందు ౨ బిరుదగద్య – సంబోధనాంత పదబంధురంబునై వర్తిల్లు నందు ౩ చూర్ణిక – ద్వివచన బహువచన సందర్భములగు విభక్త్యానుశాసన సమాసాది సమాసాదిత కల్పనానల్పజల్పితంబైవెలయు నందు ౪ వచనంబులు – బహుప్రకార రచనానిచయ ప్రాచుర్యమ్ములై సంచరించు నందు ౫ విన్నపంబు – లెన్న విన్నపై ఋజుమార్గమ్ముల ననుగమించి మించు నీపంచవిధమ్ములు మితివిరహితమ్ములై స్వేచ్ఛాకల్పనాగౌరవమ్ముల కొలందుల విలసిల్లు" (లక్షణశిరోమణి)

మీఁది లక్షణగ్రంథకర్తలలో ననంతుఁడు పదునైదవ శతాబ్దివాఁడు. అతఁడు చెప్పినగద్యలక్షణమున కనుగుణముగానే కర్ణాటాంధ్రభాషలలోని ప్రాచీనవచనైకరచన లున్నవి. లక్షణశిరోమణికారుఁడు పొత్తపి వెంకటరమణ కవి పదునేడవశతాబ్దివాఁడు గాఁబోలును. అతఁడు వచనరచనల నైదు విధముల విభజించినాఁడు ! అతఁడు పేర్కొన్న 'విన్నపములే' యనంతామాత్యుఁడు చెప్పినగద్యము లగును. ఇట్టి రచనములొకటి రెండు నిమిషములకు



మించనికాలమునఁ జదువఁదగినవై స్తుత్యదేవతా సంబోధక పదాంతములై యుండును. వీనినే తాళ్ళపాకవారు వచనగీతములని, తాళగంధిచూర్ణకములని కూడఁ బేర్కొనిరి. ఈ విషయ మిఁక ముందు వివరింతును. అనంతామాత్యుని నాఁటికిఁ దెలుఁగున భారతభాగవతాది గ్రంథముల వచనైకరచనలు లేవుగాఁ బోలును ! అట్టివాని నాతఁడు పేర్కొనలేదు. పదునాఱవ శతాబ్దినుండియే భారతభాగవతాదుల వచనైక రచనలు తెలుఁగున వెలసినట్లున్నవి. లక్షణశిరోమణికారుఁ డట్టి వానిని దాను విభజించిన పంచవిధవిభాగములలో నాలుగవ భేదమగు 'వచనముగా' నిర్వచించినాఁడు. ఈతని నాఁటికిఁ జూర్ణిక 'పొడిపొడి పలుకుల ప్రసన్నరచన గాక' సంస్కృతపు టుత్కలికా ప్రాయ రచనగా మాఱినది. ప్రబంధరాజవిజయ వేంకటేశ్వర విలాసాదులం దింకను సర్వలఘు వచనములు, అంత్యానుప్రాస చతుర్దశ చూర్ణికలు మొదలగు వచనచిత్రరచనా ప్రభేదములు చూడఁదగును. మఱియు నంధ్రమున నన్నయాదికవుల కృతుల లోని యాశ్వాసాంత వచనరచనలను 'ఆశ్వాసాంత గద్యము' లని పేర్కొనుట కలదు. అవి లక్షణశిరోమణికారుఁడు చెప్పిన 'బిరుద గద్యము' లగు ననుకొనవచ్చును. అట్టి బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవలె నని యాతఁడు చెప్పినాఁడు. అట్లే ప్రాచీనరాజుల బిరుదగద్యములు నున్నవి గాని యాగద్యముల కెల్ల సంబోధనాంతత నియతముగా నుండు నన్న నిర్ణయము నిలువదేమో! ఆశ్వాసాంత బిరుదగద్యములు సంబోధనాంతములుగా నుండవు గదా!

అనంతామాత్యుఁడు (వచన) గద్య మనియు, లక్షణశిరోమణికారుఁడు విన్నప మనియుఁ బేర్కొన్న తీరురచనము లవి సంస్కృతమున శ్రీభగవద్రామానుజాచార్యులవారు రచించిన గద్యత్రయమును బాల్కురికి సోమనాథుఁడు రచించినపంచప్రకారగద్యాదులును బురస్కరించుకొని కర్ణాటాంధ్రములలో వైష్ణవ శైవభక్తులు సాగించినరచనములయి యుండునని నే ననుమానించుచున్నాఁడను. తెలుఁగున నాకుఁ గానవచ్చిన యిట్టి రచనలలోఁ బ్రాచీన మనఁదగినవి 'సింహగిరి వచనములు' వీనికిఁ గృష్ణమాచార్య సంకీర్తనము లని నామాంతరము. *

*ఆ వచనములు రచియించిన కృష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాపరుద్రుని నాఁటివాఁడని యేకశిలానగర చరిత్రాదులవలనఁ దెలియనగును.

మచ్చున కాతనివచన మొకటి :-

"దేవా! పదికోట్ల యజ్ఞాదిక్రతువులు నడపంగా నేమి, తొమ్మిదికోట్ల తులాభారంబులు తూఁగంగానేమి, యెనిమిదికోట్ల సువర్ణదానంబులు, నేడు కోట్ల గోదానంబులు, నాఱుకోట్ల భూదానంబులు, నయిదు కోట్ల కన్యాదానం బులు, నాలుగుకోట్ల వస్త్రదానంబులు సేయంగానేమి, మూఁడుకోట్ల సత్యాది వ్రతంబులు సలుపంగా నేమి, రెండుకోట్ల యన్నదానంబులు గావింపఁగా నేమి, కోటిస్నానంబులు సేయంగా నేమి మీ నామోచ్చారణంబు సేయకఁ పదివేల యజ్ఞాదిక్రతువులు నడిపిన దేవేంద్రుండు నిలువెల్ల యోనులయ్యెను. తొమ్మిదికోట్ల తులాభారంబులు తూఁగిన దుర్యోధనుండు యమపురికేఁగెను. ఎనిమిదికోట్ల సువర్ణదానంబులు నేసిన కర్ణుండు పసిండికొండమీఁది యన్నంబుల కపేక్షించెను. ఏడుకోట్ల గోదానంబులు చేసిన కార్తవీర్యార్జునుండు గోహత్యా బ్రహ్మహత్యా పాతకంబులఁ బొందెను. ఆఱుకోట్ల భూదానంబులు చేసినబలి విష్ణు పాదంబునఁ బాతాళంబున కేఁగెను. అయిదుకోట్ల కన్యాదానంబులు చేసిన ధ్రువుండు కాశీక్షేత్రంబునఁ బండ్రెండువేల యేండ్లు భిక్షం బెత్తెను. నాలుగుకోట్ల వస్త్రదానంబులు చేసిన మార్కండేయుండు మతిహీనుం డాయెను. రెండుకోట్ల అన్నదానంబులు చేసిన ధర్మజుండు యమపురి తొంగిచూచెను. కోటిస్నానంబులు చేసిన కుమారస్వామి కోరిక సిద్ధించదాయెను దేవా! మీ నామోచ్చారణంబు చేసి ప్రహ్లాదనారద పుండరీక వ్యాసశుక శౌనక భీష్మ దాల్భ్యరుక్మాంగ దార్జున బలికృతార్థులైరి. కావున, యతిరామానుజ మునిపరం దాతారు (?) అనాథపతియైన స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధి."

(సింహగిరి నరహరి వచనములు) *కృష్ణమాచార్య సంకీర్తనములు.

---

*సీ. కటకేంద్రుకూఁతురి కౌగిటిలోఁ దక్కెఁ
　　జెళ్ళపిళ్ళస్వామి చేతఁగాదు
కృష్ణమాచార్య సంకీర్తనంబులఁ జొక్కె
　　సింహాద్రి యప్పయ చేతఁ గాదు
కవ్వంపుఁగొండ సంఘర్షణోద్ధతిఁ జిక్కె
　　శ్రీ కూర్మనాథుని చేతఁగాదు
శాక్యతొండని ఊలజడి కెంతయును స్రుక్కె
　　జెన్నమల్లేశునిచేతఁ గాదు



ఇంకను నిట్టివి శంకరవచనములని, శఠకోప విన్నపములని, కాల జ్ఞాన వచనములని, కాశికావచనములని, భవానీమనోహర వచనములని, శివరాజయోగ వచనములని, లక్ష్మీవల్లభ వచనములని, శేషగిరినాథ వచ నములని మఱియుఁ గొన్ని పేళ్ళతో వచనరచనలు ప్రాచీనములు గానవచ్చు చున్నవి. అవి యెల్ల నించు మించుగాఁ బదునాలుగవ శతాబ్దికిఁ దరువాతవే కాఁదగు ననుకొందును. ఇప్పటికి నా యెఱుక కందినంతలోఁ గాల నిర్ణయముఁ జెప్పఁదగిన ప్రాచీనవచనరచనలలోఁ గృష్ణమాచార్య సంకీర్తనముల తర్వాత 'వేంకటేశ్వర వచనములే' పేర్కొనఁదగినవి. ఈ రెండిలోఁ దొలిది పదుమూఁడవశతాబ్ది తొలిది. రెండవది పదునైదవ శతాబ్ది తుదిది. ఇక్కడఁ బ్రసక్తములు శ్రీ వేంకటేశ్వర వచనములు.

---

పవనజవననిరాఘాటయవనఘోట
హరణజయధాటి మీచేతనౌనె మేటి
వౌదు కొకసన్నఁ జూడు మేలా పరాకు
శత్రుసంహార! వేంకటాచలవిహార!

సీ. తాళ్ళపాక చిన్నన్న దండెమీటులు గావు
　　గోమాంసభుగ్ధసుర్గుణరవంబు
బం టొసంగిన బంకమంటి పువ్వులు గావు
　　యవనాధముల చిలుకంపగములు
సాముడిగ్గియనీటి చల్లులాటలు గావు
　　పాశ్చాత్యభటుల తుపాకిగుండ్లు
సంపెంగబాకులు జరగించుటలు గావు
　　రిపులపాళెములు దర్లించుపగలు
బంటుపంతము తగ దంచుఁ బంటకాఁపుఁ
దనము గైకొంటి విది మంచిగుణమె దినము
జనము దెచ్చిన ధనము లప్పనము లిచ్చి
శత్రుసంహార! వేంకటాచల విహార !

సీ. పొట్టేళ్ళగతిఁ బట్ట బోడిసన్యాసుల
　　ఢీయని తాఁకు లాడించునొకఁడు
సోమయాజుల బ్రహ్మసూత్రముల్ ద్రెంచి సిం
　　గాణివిండ్లకు నల్లె గట్టు నొకడు
ఖూబుఘోడా యంచు గుడికీలు గుఱ్ఱము
　　నెక్కి ధేయని తరటెత్తు నొకఁడు

# తాళగంధి చూర్ణకము

ఇవి తిరుపతి క్షేత్రమున శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యాస్థానమున సంకీర్తనాచార్యులుగ సుప్రఖ్యాతులయిన తాళ్ళపాకవారు రచించినవాని లోనివి. ఏతత్కర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు.[1] పదునైదవ శతాబ్ది చతుర్థపాదమున జనించి పదునారవ శతాబ్ది పూర్వార్థమున వర్తిల్లినవాఁడు. ఈ పెదతిరుమలాచార్యులవారికిఁ గుమారుఁ డయిన చినతిరుమలాచార్యుఁడు తనతండ్రి పెదతిరుమలాచార్యులు వ్యాఖ్యానించినతీరు ననుసరించి తనతాత తాళ్ళపాక యన్నమాచార్యుఁడు సంస్కృతమున రచించిన 'సంకీర్తనక్షణమును' దెలుఁగునకుఁ బరివర్తనము చేసెను. అందీవచన రచనల నిర్వచన మిట్లున్నది.

'మఱియుఁ జూర్ణాఖ్యపదం బెట్టిదంటేని –

కః ధరఁ గృష్ణాచార్యాదిక
పరికల్పితపదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరఁగు నది నిరుక్త నామ భాసిత మగుచున్.

మఱియుఁ దచ్చూర్ణవిధం బెట్టిదనిన –

కః ఛందోగణముల నియతిం
బొందక తాళప్రమాణమునఁ గడుఁ జెలువై

---

యవనసమ్మర్ద దుర్దినం బైన దిగువ
తిరుపతిని జూడు మిటువంటితఱిని నిదుర
పోవుచున్నాఁడు మీయన్న లేవలేక
శత్రుసంహార! వేంకటాచల విహార!

1. ఆతని కాలముననే యీ వచనములు రాగిరేకులమీఁదఁ జెక్కింపఁబడి తిరుపతి దేవస్థానమున భద్రపఱుపఁబడినవి. ఈ వచనములేకాక తాళ్ళపాకవారి పద్యగద్యగేయ రచనము లనేకములు రాగిరేకులపైఁ జెక్కబడి భద్రపఱుపఁబడినవి. అందుఁగొన్నిఱేకులు అహోబలమునకు శ్రీరంగమునకును గూడఁ జేర్పఁబడినవఁట; ఇటీవల నహోబలములోని రాగిరేకులు కొన్ని రాగి పాత్రలకై యమ్మబడినవనియు, నట్లమ్మఁబడినవి నాలుగయిదు వందల రూపాయల విలువఁగల రాగిరేకు లనియు, వింటిని. తిరుపతి ఱేకులమీఁది సంకీర్తనాదులు శ్రీ తిరుపతి దేవస్థానమువారిప్పటికి గొన్నింటి ముద్రించిరి.



కొందఱిచేఁ దచ్చూర్ణం
బందముగాఁ దాళగంధి యనఁ బొగడొందున్'.

పూర్వోదాహృత మైన సంకీర్తనలక్షణ గ్రంథ నిర్వచనముచొప్పున దాళగంధిచూర్ణము లనఁ దగిన యీ వచనములను రచించి శ్రీ స్వామివారి సన్నిధిని శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు రాగతాళములతో నాలాపించువాఁడు కాఁబోలును ! రాగిరేకులనుండి యెత్తి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువా రింతకు ముందు ముద్రింపించినవచనములు నలువదేడింటికి రాగ తాళములు నిర్ణీతము లయి యున్నవి. మఱియు నం దీవచనములు 'వైరాగ్యవచనమాలికాగీతము' లనుపేరఁ బేర్కొనఁబడినవి. అనఁగా నివి వచనములే యయినను గీతములుగాఁ బాడఁదగిన వన్నమాట! అందుచేతనే యివి సంకీర్తనలక్షణమున 'తాళగంధిచూర్ణకపదము' లని పేర్కొనఁబడినవి. సంస్కృతమున వామనుఁడు వృత్తగంధి, ఉత్కలికాప్రాయము, చూర్ణము, నని ముత్తెఱఁగు గలవచనరచన చెప్పఁగా నితఁడా చూర్ణమును వచన విభాగముననే తాళగంధి యని పదరచనా విభాగముగాఁ గల్పించినాఁడు. ఈ తెఱఁగు వచనరచనలకుఁ జూర్ణమను పేరు పొడిపలుకులతో నుండుటచే నేర్పడిన దగుట నీతఁడు సూచించినాఁడు. మనయీ వేంకటేశ్వరవచనములు పొడిపొడిపలుకులకూర్పే కాని, యిందుద్ధతోక్తులు, ప్రౌఢసమాసములు లేవు. ఇట్టి పదరచనములకుఁ గృష్ణాచార్యాదులు పరికల్పకు లని యా సంకీర్తన లక్షణపద్యమున నున్నది. ఇంతకుముందు నే నుదాహరించిన కృష్ణమాచార్యసంకీర్తనములకర్త కృష్ణాచార్యుఁడే సంకీర్తనలక్షణకారుఁడు పేర్కొన్న కృష్ణాచార్యుఁడు కాఁగలడు. ఇట్టి రచనములకుఁ గృష్ణమాచార్య సంకీర్తనములనఁబడు సింహగిరినరహరి వచనములే ప్రప్రథమరచనము లని యీ సంకీర్తనలక్షణ గ్రంథోక్తిని బట్టి గుర్తింపనగును. దీనిని లక్ష్యీకరించుకొనియే యనంతామాత్యుఁడు గద్యనిర్వచనము నట్లు చేసియుండును. తర్వాతికాలమున నిట్టి వచనములు 'విన్నపము' లనియుఁ బేర్కొనఁబడినవి

# వేంకకటేశ్వరవచనములు – వాని యోగ్యత

ఈ వచనములకు రచనములో నానుపూర్వి యేదియుఁ గానరాదు.

వస్తువిన్యాసమునఁ గూడఁ గ్రమపద్ధతి యేదియుఁ దోఁపదు. కవి యప్పుడప్పుడు తనకుఁ దోఁచిన తత్త్వవిషయముల నీశ్వరస్తుతిపరములు గావించి విడివిడి గనే వచనములుగా రచించినాఁడు గాఁబోలును! ఇందు విశిష్టాద్వైత సిద్ధాంత విషయములు సర్వత్ర కరడుగట్టియున్నవి. గ్రంథకర్త స్మార్తనందవరీక బ్రాహ్మణుఁడైనను వైష్ణవమతము స్వీకరించినవాఁడు. జాలిజాలిగాఁ గొసరి కొసరి శ్రీ వేంకటేశ్వరస్వామిని గవి యేతద్వచన రచనలలోఁ బలుదెఱఁగులఁ బరమార్థలబ్ధికై ప్రార్థించును. విశిష్టాద్వైతసిద్ధాంతపు జీవగఱ్ఱయగు 'శరణాగతి' యిందుఁ జాలఁ జక్కఁగా సవదరింపఁ బడినది. కవి యిందు స్వామిని బలుచోట్ల నేకవచనముననే తేలికగా 'నీ' వని యెచ్చరించును. తోడ్తోఁగొన్నిపట్టుల 'మీ' రని గొప్పగా బహూకరించును. తండ్రియొడిలో నాటవేడ్కలతో నుండు ముద్దులబిడ్డఁడు తండ్రిని నెయ్యంపుమురుపునఁ దొక్కుబల్కులతో నీవని తుంకరించుట, యంతలోనే పెద్దతికపుహద్దు తోఁపగా మరల మీరని బహూకరించుట యందం దనుభూయమానమే కదా! ఆ యనుభూతి నా కీ తీరునకు సమర్థకముగాఁ దోఁచినది.

ఇందు ౧౪౭ వచనమున నూటయెనిమిది తిరుపతుల పేళ్ళు పేర్కొనఁ బడినవి. నిత్యానుసంధానాదు లగు నర్వాచీన ద్రావిడవైష్ణవ సంప్రదాయ గ్రంథములలో నూటయెనిమిది తిరుపతుల (దివ్యస్థలముల) పేళ్ళు ముద్రితము లయి యున్నవి. వాని పరిగణన మా తీరుగా నేనాఁడు జరిగెనో గుర్తింపఁజాల నయితిని. ఆ పేళ్ళకు నిందున్న పేళ్ళకుఁ జాల భేదమున్నది. క్రీ.౧౪౮౦ ప్రాంతముల నూటయెనిమిది తిరుపతులపేళ్ళీ విధముగా నుండె నని దీనిఁబట్టి తెలియనగును. ఇందుఁ గొన్ని స్థలములపేళ్ళు తప్పులుగా నున్నట్టున్నవి. ప్రబంధరాజ వేంకటేశ్వరవిలాసమునను, హంసవింశతిలోను నూటయెన్మిది తిరుపతుల పేళ్ళు నిం దున్నతీరు ననుసరించియున్నవి.

ఇందు వచనరచనారీతిలో ననంతుఁడు చెప్పిన గద్య (వచన) లక్షణము చక్కగా నసిపడినది. లక్షణశిరోమణికారుని 'విన్నపము' రచన కీ వచనములు మంచి లక్ష్యము లనఁదగును. దూరాన్వయము, సమాసక్లేశము నను ప్రాసవిన్యాసపరిశ్రమము నిందు లేవు. నూటిగా మనసున నాటునట్లు



భావము లున్నవి. కొన్ని వచనములు టాగోరుగారి గీతాంజలిరచనములఁ దలఁపించునవిగాఁ గూడ నున్నవి. కృష్ణమాచార్యసంకీర్తనములు సరిగా నిట్టివే, వీనికి మూలకల్పములే కాని, యందు భాషాప్రాచీనత యింతకంటె విస్పష్టముగా గోచరించుచున్నది. ఈ వచనములను రాగతాళములతో బ్రాచీనకాలమునఁ బలువురు పాడెడివారు గావలయు. కవియే భావానుగుణముగా వీనికి రాగతాళములఁ గల్పించినాఁడు.

## తాళ్ళపాకవారు

ఏతద్ గ్రంథకర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు నందవరీక స్మార్తబ్రాహ్మణుఁ డంటిని. తాళ్ళపాక నేఁటి రాజంపేట తాలూకాలోనున్నది. అది వీరి నివాసగ్రామము. ఈకవి తండ్రి.

## అన్నమాచార్యుఁడు

ఈతఁడు వైష్ణవమతమును స్వీకరించినవాఁడు. గొప్పభక్తుఁడు. కవి. మహిమలు గలవాఁడు. ఈతఁడు డెబ్బదితొమ్మిదియేండ్లు జీవించెను. ఈ యన్నమాచార్యుఁడు దినమున కొక్కదానికేని తక్కువకాని చొప్పున గేయములు రచించుచు శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిని సంకీర్తనము చేయుచుండువాఁడట! ఈతనికిఁ బదునాఱవయేట స్వామి ప్రత్యక్ష మయ్యెనట! నాఁటనుండియే స్వామి యానతిచొప్పున నితఁడు సంకీర్తనములు రచింపనారంభించెను.

ఈతనికి సంకీర్తనాచార్యుఁడని, ద్రవిడాగమ సార్వభౌముఁడని, పంచమాగమచక్రవర్తి యని బిరుదులు. శ్రీ వెంకటేశ్వరస్వామి కీతఁడు మామ. అలమేలు మంగాంబ కీతఁడు తండ్రివరుసవాడు. ఇతని సంకీర్తనలను వినిన చెవిని మఱొకరి సంకీర్తనముల విననొల్లనని శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిజ్ఞఁ గావించె నఁట! ఈతఁడు రచించిన గ్రంథములు ౧ ఆధ్యాత్మ సంకీర్తనలు. ౨ శృంగారసంకీర్తనలు. ౩ శృంగారమంజరి, ౪ సంకీర్తన లక్షణము (సంస్కృతము; ఇది దొరకలేదు). ఈ కవికి సంబంధించిన చరిత్రము శాసనాదులందుఁ గానరాదు.[1] కాని తాళ్ళపాక చిన్నన్న ద్విపదకృతిగా నితని చరిత్రము రచించినాఁడు. ఈతని కుమారుఁడు –

1 ఇది తిరుపతి ఓరియంటల్ యిన్‌స్టిట్యూట్ లైబ్రరిలో నున్నది.

# [1]ఎదతిరుమలాచార్యుఁడు

ఈతఁడే శ్రీవేంకటేశ్వరవచనములకుఁగర్త శ్రీ తిరుపతి దేవస్థానమున నున్న రాగిఱేకులమీఁద నీ వచనములు తిరుమలాచార్యరచితము లని గ్రంథారంభమునఁ జెప్పఁబడినది. ఈతఁడు మహైశ్వర్యమహితుఁడుగా వెలసెను. శ్రీ వేంకటేశ్వరస్వామి కీతఁ డనేక కైంకర్యముల జరపించెను. శ్రీ స్వామి యీతనితోఁ దరువాతి మూఁడుతరములదాఁకాఁ బ్రత్యక్షమును, నేడుతరములదాఁకఁ బరమపదమును ననుగ్రహించెనఁట! ఈతని యితర కృతులు ౧ శృంగార సంకీర్తనలు ౨ శృంగారదండకము ౩ చక్రవాళమంజరి ౪ శృంగారవృత్తశతకము ౫ శ్రీ వేంకటేశోదాహరణము ౬ నీతిసీసశతకము ౭ సుదర్శనరగడ ౮ రేఫఱకారనిర్ణయము ౯ ఆంధ్రవేదాంతము (ద్విపద) ౧౦ ఆంధ్రహరివంశము ౧౧ భగవద్గీత (వచనము) ౧౨ శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము ౧౩ ఆధ్యాత్మసంకీర్తనలు. ఈతనికి వేదమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగతవజ్రపంజర బిరుదములు కలవు. స్వామి కీతఁడు జరిపిన కైంకర్యములసారము :–[2]

పెదతిరుమలయ్యగారు క్రీ. 1517 నుండి 1552 దాఁక శ్రీ వేంకటేశ్వరస్వామివారికిని, నింక నితరస్థలములలోని దేవరలకును నైవేద్యప్రసాదోత్సవాది కైంకర్యములకై పదునాల్గు గ్రామముల నర్పించిరి. ఆ గ్రామములు అచ్యుతరాయఁడు, బుక్కయ తిమ్మరాజు మొదలగువారు తనకు దానము చేసినవి. అంతేకాక యేన్నోవేల పణములను గూడ నాయాపుణ్యకార్యములకై వారర్పించిరి. తిరుమలమీఁదఁ దమసంకీర్తనములు చెక్కించిన రాగిరేకులు దాఁచియుంచిన సంకీర్తనభాండారము రక్షించుటకై యర్చించుటకై కూడ

1. ఈతఁడు పెరియ తిరుమలాచార్యుఁ డని, పెద తిరుమలయ్య యని, తిరుమలార్యదేశికుఁ డని పలుదెఱఁగుల బేర్కొనఁబడుచున్నాఁడు.


2. తాళ్ళపాకవారి చరిత్రాంశములు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రకటించిన తిరుపతి దేవస్థానము ఎపిగ్రాఫికల్ రిపోర్ట్ (పేజీలు 382 –391) ననుసరించి వ్రాసినవి.



గొప్పదానములు చేసిరి. తండ్రిగారును దామును రచించిన సంకీర్తనములను స్వామివారి సన్నిధిని బ్రతిదినముఁ బాడుటకై యిద్దరు వైష్ణవుల నియోగించిరి. స్వామివారి కోనేటిని, గోపురములను, మంటపములను బెక్కింటిని జక్కఁ బఱిపించిరి. కోనేటినడుమ నీరాడుమంటపమును గట్టించిరి. ఇట్లెన్నో పుణ్యకార్యముల జరిపిరి. తండ్రివలె నీతఁడు గూడఁ బూర్ణపురుషాయుష జీవితము గల్గినధన్యచరిత్రుఁ డయియుండును. ఏలనఁగా నీతనితండ్రి క్రీ. 1408 నుండి క్రీ. 1503 దాఁక జీవించెను. అన్నమార్యున కీతఁ డఱువదవయేఁట జన్మించినాఁ డనుకొన్నాను. ఈతని జన్మకాలము క్రీ. 1468 అగును. అప్పటినుండి క్రీ. 1552 తర్వాతిదాఁక నీతఁడు జీవించినవాఁడగును. ఈతనికి సాతానివైష్ణవు లిద్దరు శిష్యులుండెడివారఁట! వారుకూడ నీతనివలె స్వామికిఁ గొన్ని కైంకర్యములు జరిపిరి.

ఈతనికిఁ గుమాళ్ళు ౧ చినతిరుమలాచార్యుఁడు ౨ అన్నయ, ౩ పెద తిరువేంగళనాథుఁడు, ౪ తిరువేంగళనాథుఁడు (చిన్నన్న), ౫ కోనేటి తిరువేంగళనాథుఁడు.

ఇందు నాల్గవకుమారుఁ డయిన తిరువేంగళనాథుఁడు రచించిన యష్టమహిషీకల్యాణమున వీరి వంశవృక్ష మిట్లున్నది.






1. మూలపురుషుఁడు శృంగార సంకీర్తనాదిగ్రంథకర్త.
2. వేంకటేశ్వరోదాహరణాది బహుగ్రంథకర్త. వేంకటేశ్వరవచనకర్త కూడ.
3. సంకీర్తనలక్షణాది గ్రంథకర్త.
4. అష్టమహిషీకల్యాణ పరమయోగివిలాసోషాపరిణ యాన్నమాచార్య చరిత్ర గ్రంథకర్త.
5. ఆంధ్రామరుకామరవ్యాఖ్యా కావ్యప్రకాశవ్యాఖ్యాకర్త.
6. శకుంతలాపరిణయము, శ్రీపాదరేణుమాహాత్మ్యము ఇతని కృతులు.

ఈ తాళ్ళపాకవారికి రేవణూరివారు జామాతృ వంశమువారు. రేవణూరి వేంకటకవి తన శకుంతలా పరిణయమున నిట్లు చెప్పినాఁడు.

శ్రీవత్సాన్వయ రేవణూరికులజున్ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణస్ఫుట కావ్యకల్పక కవిన్ సంకీర్తనాచార్యపు
త్త్రీవంశోత్తము నందవైదికబుధాతిప్రోక్తవృత్తిస్వయం
భావుం దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

శ్రీ వేంకటరమణునకు....సమర్పణంబుగా సమర్పించెద నిహపర సాధనములకు నింక నేమి కొదవ యదియునుం గాక యమ్మహాదేవుండు మదీయమాతామహవంశ శిఖారత్నం బగు నన్నయాచార్యునకు జామాతరుం డనిపించుకొని భవదీయసంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితరసంకీర్తనంబు లాలించ నని ప్రతిజ్ఞఁగావించెఁ దత్తనూజుం డగు పెద్దతిరుమలాచార్య బిడౌజకునకుఁ ద్రిపురుష పర్యంతముగాఁ బ్రత్యక్షంబును, సప్త పురుషపర్యంతముగా మోక్షంబు నొసంగెద నని వరమిచ్చె; సచ్చరిత్రులగు తదీయపౌత్రులకుఁ జినతిరుమలదీక్షి తాన్నయాచార్య తిరువేంగళనాథ కోనేటితిరువేంగళనాథ వెంగళార్యులకు విచిత్రముక్తాతపత్ర రత్నకిరీట ముద్రికా ప్రచండమణిమండిత మకరకుండ లోత్కరాహః కరదీపికా పాదుకాది బహూకరణంబులఁ గరుణించె; విశేషించియు నత్తిరువేంగళనాథుండు సంకీర్తనంబుఁ బాడిన నాదం దొడంగె నేతత్ప్రకారంబున నమ్మహామహునకుఁ బాండవసహాయుండైన శ్రీకృష్ణదేవునింబలె సహాయుండై........... ధన్యుఁడ నయ్యెద నని నిశ్చయించి'

ఈ గ్రంథమును బట్టి చూడఁగా నీ వేంకటాచార్యకవి సంకీర్తనాచార్యుఁ డగునన్నమాచార్యునికి దౌహిత్ర వంశములోనివాఁ డని యేర్పడును.

రచనమును జాలఁ దర్వాతిదిగానేయున్నది. కాని యాతనిదే యగు [1] శ్రీపాద రేణుమాహాత్మ్యముగద్య మాతఁడు సంకీర్తనాచార్యుని మనుమఁడే యనఁదగిన ట్లున్నది :–

'ఇది సంకీర్తనాచార్య దౌహిత్ర రేవణూరి తిరుమలకొండ యాచార్య పుత్ర వేంకటాచార్య ప్రణీతం బైన శ్రీపాదరేణుప్రభావం బనునిస్సహాయ కావ్యంబు నందు రంభాపురందరసంవాదం బనునది తృతీయోల్లాసము.' ఇది తప్పయి యుండునేమో ! 'సంకీర్తనాచార్య దౌహిత్ర వంశ్య' అని యుండఁ దగునేమో !

## గ్రంథముద్రణము

ఇప్పటి కిరువది యేండ్ల క్రిందట నే నీ వేంకటేశ్వర వచనములను బ్రాచ్యలిఖిత పుస్తక శాలలోని ప్రతులఁబట్టి యుద్ధరించి 'భారతి' పత్రికలోఁ బ్రకటింపఁ బూనితిని. అప్పటికి తాళ్ళపాకవారు రచించిన వయియుండునని నే ననుమానించితినేకాని దాని కాధారమేదియు నాకు గానరాలేదు. అప్పుడు ప్రకటించుటలో నే నిట్లు వ్రాసితిని.

"ఇవి తాళ్ళపాకవారు రచించినవై యుండవలెను. వీనిలో విష్ణుభక్తి యూటలూరుచున్నది. ప్రాచీనములలో నింత రసవంతయు, భక్తిభరితము నగు వచనరచన యసాధారణముగా నున్నది. కృష్ణమాచార్య సంకీర్తనములు శంకర వచనములు మొదలగునవి వ్రేళ్ళలెక్కకుఁ జాలినవి, యిట్టివి, కొన్నియున్నవి. వీనినెల్లఁ గ్రమముగా వెల్లడింపఁ గోరికపడుచున్నాను. సహృదయ లివి చవిగొందురుగాక!" (భారతి – క్రోధన వైశాఖము)

'భారతిలో నట్లు ప్రకటించుచుండుటఁ జూచిన సహృదయులు గొందఱు నన్నావచనములెల్ల గ్రంథముగా ముద్రింపఁగోరిరి. అట్లే నేను వానిని మదరాసులో 'నాంధ్రపత్రిక ముద్రణాలయము' ననే ముద్రింపఁ బూనితిని. నూటయిర్వది వచనములు 80 పుటలు ముద్రితములయ్యెను. అప్పుడు తిరుపతి శ్రీ వేంకటేశ్వర దేవస్థానోద్యోగులొకరిద్దఱు నా మిత్రులా గ్రంథము తిరుపతి దేవస్థానమువారు ముద్రించుచుండుట నా కెఱింగించిరి. రాగిరేకులపైఁ గవికాలమునఁ జెక్కఁబడియున్న యావచనముల నుద్ధరించి

1 ఇది తిరుపతి ప్రాచ్యపరిశోధనశాల లైబ్రరీలో నున్నది. కృత్యవతరణిక లేదు.



దేవస్థానమువారు ముద్రించునప్పుడవి మిక్కిలి నిర్దుష్టముగా నుండగలవని, వారు ముద్రించుచుండఁగానే నాత్రపడి ముద్రించుట వ్యర్థమని వెఱచి యా గ్రంథము బయల్పడిన తర్వాత నా ప్రకటన విషయమే యోజించుకొన వచ్చునని యుపేక్షించితిని. అచ్చుపడిన యాఫారము లెల్ల నాంధ్రపత్రికా కార్యాలయము ననే యుండెను. తర్వాతనే తిరుపతి దేవస్థానమువారి ముద్రణము ముగిసెను. అటు తర్వాతఁ గొన్నాళ్ళకుఁ జూతునుగదా ! అందు నలువదియేడు వచనములే ముద్రితములయి యుండెను. మఱిమూఁడేండ్లకు నేను తిరుపతివచ్చి పరిశీలింపఁగా తర్వాతి వచనములయునికి యెఱుఁగ రాలేదు. అవి యహోబిలముననో శ్రీరంగముననో యడఁగి యుండఁబోలును! ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోను, దంజావూరి సరస్వతీభాండాగారములోను నున్న వచనములు సమకూర్చికొని చూడఁగా 175 వచనములున్నవి. ఇంకఁగొన్ని లోపించియు నుండఁబోలును ! నేను రెండు లైబ్రరీలలోని విషయములను సమకూర్చుకొని యుంటిని. తిరుపతి దేవస్థానముద్రణము తప్పులతో నసమగ్రముగానే యుండెను. ఈ విషయము వివరించి తెలుపఁగా నప్పుడు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యాలయమున డైరెక్టురుగా నున్న సరస్వతీ హృదయాలంకారులు శ్రీమాన్ యమ్. కృష్ణమాచార్యులుగారు నా ముద్రణము పూరింపఁగోరిరి. వెదకఁగా మదరాసులోని యచ్చుఫారములెట్లో యెక్కడో చెల్లిపోయినట్లు తెలిసెను. నా దగ్గఱ మిగిలియున్న యచ్చుఫారములబట్టి 120 వచనముల మరలనిపుడు ముద్రించుట, కడమయ ముద్రితములఁబూరించుట, జరపితిని ఇట్లుదీనిని వెల్లడింపఁజూచునాఁటికి శ్రీకృష్ణమాచార్యులుగారు కీర్తిశేషులయిరి. శ్రీమాన్ పరవస్తు వేంకట రామానుజస్వామి యమ్.ఏ. డైరెక్టరుగారు దీని ముద్రణ యత్నము సాగించిరి. ఇట్లు శ్రీస్వామి వారు స్తుతిగ్రంథము శ్రీ స్వామివారి యాస్థానకవి రచించినది. యీనాఁటి కిట్లు శ్రీస్వామివారి యాస్థాని లోనే ప్రకటితమగుట సంఘటిల్లినది. ఆనాఁటి తాళ్ళపాక వంశమువారు మహనీయులు. వారి రచనము లింకనెన్నో ప్రకటితములు గావలసియున్నవి. వారు శ్రీస్వామి వారికెన్నో కైంకర్యముల జరపిరి. తన భక్తులగు నట్టి యా మహనీయుల సత్కృతులను శ్రీస్వామివారు సంరక్షించుకొందురనియే యాశించుచున్నాఁడను.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
తిరుపతి., తారణ ఫాల్గుణము.

వేటూరి. ప్రభాకరశాస్త్రి

# శృంగార సంకీర్తనములు
## ఉపోద్ఘాతము

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము కమిటీవారు శ్రీ తాళ్ళపాక వారి రచనలను 1935 సంవత్సరము ముద్రింప నారంభించిరి. అంతకుఁ బూర్వమే శ్రీమహంతు ప్రయాగదాస్‌జీవారు తమ పరిపాలన కాలమునఁ దిరుపతికొండ పై సురక్షితములుగా నున్న తాళ్ళపాక రచనల రాగిరేకులను కాగితములపై వ్రాయించి యుంచిరి. వానినిబట్టి తర్వాత కమిటీ వారు మూడు సంపుటము లను బ్రకటించిరి. రాగిరేకులలోఁ గానరాకున్నను తాళ్ళపాకవారి రచనలేయగు 'అష్టమహిషీకల్యాణము', 'పరమయోగివిలాసము', 'ఉషాపరిణయము' లను గ్రంథములను గూడ కమిటీవారు ముద్రించిరేకాని యవి యింకను ప్రకటన పడయలేదు. ఆనాఁడు దేవస్థానమువారు కొంత వఱకుఁ బ్రకటించి విడిచిపెట్టిన తాళ్ళపాకసంకీర్తనల నాల్గవ సంపుటమును బూరించుటకు నీ పరిశోధనాలయాధ్యక్షులు తలపెట్టి యాపనిని నాకప్పగిం చిరి. నేను ప్రయత్నముతో దేవస్థానము ఆఫీసునుండి రాగిరేకులనన్నింటిని నీ పరిశోధనాలయమునకు తెప్పించుకొని సహోద్యోగుల సహాయముతో రాగిరేకులను ముద్రిత గ్రంథములను బరిశీలింపఁగా నీ క్రింది విషయములు తెలియవచ్చినవి.

### 1 వ సంపుటము - తాళ్ళపాక లఘుకృతులు.

వీని రాగిరేకులు కొన్ని మాత్రమే యగపడినవి.

### 2 వ సంపుటము - అధ్యాత్మ సంకీర్తనలు

రాగిరేకులలో తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనల రేకులు 391 పెదతిరుమలాచార్యులవి 77, చినతిరుమలాచార్యులవి 10. వెరసి 478. అందు అన్నమాచార్యులవి 30, పెదతిరుమలాచార్యులవి 39 రేకుల సంకీర్తన ములు మాత్రమే ప్రకటితములయినవి. ఆ ప్రకటనముకూడ కలగపులగ ముగా అపక్రమముగా, నివి యన్నమాచార్యుల రచనములు, ఇవి పెద



తిరుమలాచార్యుల రచనములు అని వేర్పాటులేక యున్నది. ఉపక్రమమున మాత్రమన్నియు నన్నమాచార్యుల రచనములే యగునట్టున్నది.

అన్నమాచార్యుల యధ్యాత్మ సంకీర్తనల మొదటిరేకు తరువాత 1 నుండి 10 దాక పెదతిరుమలాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనముల రేకులు, మరల 11 నుండి 20 దాక అన్నమాచార్యుల రేకులు, 22 నుండి 29 దాక పెదతిరుమలాచార్యుల రేకులు, 31 నుండి 36 దాక అన్నమాచార్యుల రేకులు, 37 నుండి 50 దాక పెదతిరుమలాచార్యుల రేకులు. 61 నుండి 70 దాక అన్నమాచార్యుల రేకులు, 71 నుండి 77 దాక పెదతిరుమలాచార్యుల రేకులు 78 నుండి 80 దాక అన్నమాచార్యుల రేకులు ముద్రణమున కెక్కినవి.

ఇదింకను అన్నమాచార్యులవి 2 నుండి 10 దాఁకను, 21 నుండి 30 దాకను, 37 నుండి 50 దాకను, 81 నుండి 88 దాకను 91 నుండి 391 దాకను; పెదతిరుమలాచార్యులవి 12 నుండి 21 దాకను, 31 నుండి 36 దాకను, 51 నుండి 70 దాకను; చినతిరుమలాచార్యులవి 1 నుండి 10 దాకను ముద్రితములు కావలసియున్నవి.

ఈ ఆధ్యాత్మ సంకీర్తనములలో అన్నమాచార్యుల రేకులు 51 నుండి 60 దాకను, 71 నుండి 77 దాకను, 121 నుండి 130 దాకను, 216, వెరసి 28 రేకులు కానరాలేదు.

పెదతిరుమలాచార్యుల రేకులు 11, 30 సంఖ్యలవి కానరాలేదు.

### 3వ సంపుటము - శృంగారసంకీర్తనలు

రాగిరేకులలో తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల రేకులు రెండువేల రెండు. పెదతిరుమలాచార్యులవి నూఱు. చినతిరుమలా చార్యులవి పది. వెరసి 2112. అందు అన్నమాచార్యులవి 1 నుండి 18 దాకను, 20 నుండి 30 దాకను, 61 నుండి 95 దాకను; పెదతిరుమలాచార్యు లవి 3 నుండి 7 దాకను, 11నుండి 50 దాకను, ముద్రితమయినవి. ఇందు పెదతిరుమలాచార్యులవి 3, 4, 5, 6 రేకులు పాడినపాటలుగా రెండు తూర్లు ముద్రితమయినవి.

## అన్నమాచార్యుల శృంగార సంకీర్తనముల ఱేకులు


| ఱేకు నంబరు. | ఱేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 1. | యేవూరికేవూరు యెక్కడికి | 2 |
| 2. | తగిలిన మునులేయాతని | 5 |
| 3 | మగువ పూర్పులనైన | 9 |
| 4 | శోభనమే శోభనమే | 13 |
| 5 | అప్పటి యెండ చెమట | 18 |
| 6 | ఆపరాని వలపాయనమ్మా | 22 |
| 7 | తన్నుంబాశినేనింత | 26 |
| 8 | కోవిల పలుకదు కొమ్మావి | 30 |
| 9 | వద్దు నీకు నాతోడి వట్టిమాటలు | 34 |
| 10 | వొద్దేలమొక్కే వోవుద్దవుండా | 38 |
| 11 | మెచ్చితి భళిరా వోరి | 303 |
| 12 | చక్కందనముల చేత జవ్వన | 307 |
| 13 | కొమ్మ దన ముత్యాలకొంగు | 311 |
| 14 | విరహమో సంభోగంబొ | 314 |
| 15 | లేతమాయలునీకు నింతేశి | 318 |
| 16 | వద్దునాతో బొంక నిటువలె | 322 |
| 17 | పసులంగాచేటి కోల పసపుంజేల | 326 |
| 18 | నేనేలెవ్వరు నేలనీ | 330 |
| 20 | పొదిగా నేండతనికె పొలింతి | 334 |
| 21 | తవ మాంద్రష్టం దయాస్తి | 413 |
| 22 | యేమిటికింజిం త్తయిదె | 46 |
| 23 | కలికి కాంతాళములు | 51 |
| 24 | అవి యెటువంటి రహస్యములో | 55 |
| 25 | పొద్దింకనెన్నండు వొడచునొ | 59 |
| 26 | యెట్టుధరింపంగనగు | 433 |
| 27 | కొంచము మాకులము గుణము | 67 |
| 28 | చిన్ననాండు మద్దులు వంచిన | 441 |
| 29 | యెన్ని శేంతలైనం జేయు | 445 |
| 30 | యేవందరశయతి హితమతిరివ | 449 |
| 61 | భోగీంద్రశయనుని | 163 |
| 62 | యెంతవడిదాక నీయలయింపులు | 167 |
| 63 | పైపైదూరక పదరోయింత్తి | 171 |
| 64 | నాకుంజెప్పరే వలపు | 175 |
| 65 | కూరిములే కదవమ్మ | 179 |
| 67 | ముదిత చిత్తమునకు | 183 |
| 67 | కాంత నీ నెరులచీకటి | 187 |
| 68 | వేటకాండనంటా | 191 |
| 69 | కామయాగము చేసె | 195 |
| 70 | మూల మూల నమ్ముదు | 200 |
| 71 | యేల రాడమ్మ యింత్తిరో | 204 |
| 72 | పుడమిలోన మగలు గలుగు | 207 |
| 73 | సారెకు నంటకురే జడ | 211 |
| 74 | కానరటె పెంచరటె | 215 |
| 75 | చెప్పరాదే యింత్తిశిరులు | 219 |
| 76 | అవ్వలి మాటలే హితవవు | 223 |
| 77 | మోవుల చిగురుల | 227 |
| 78 | యెందరువలె నీ కింకాను | 231 |
| 79 | రమ్మనవే వాని రమ్మనవే | 235 |
| 80 | అంజలి రంజలి రయం తే | 239 |
| 81 | తెప్పగా మట్టేకు మీంద | 243 |
| 82 | ప్రతిలేనిపూజ దలపంగ | 247 |
| 83 | కమలానన సౌభాగ్యము | 251 |
| 84 | యెచ్చరించెదననిన | 256 |

| ఱేకు నంబరు. | ఱేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 85 | పడంతి నినుం దలంచి | 260 |
| 86 | జట్టిగొనేర నిన్ను జవరాలు | 264 |
| 87 | చాలుం జాలునీ జాజర | 268 |
| 88 | భారపు టూర్పులతో | 272 |
| 89 | అటుగొంత గాలంబు | 276 |
| 90 | కొండలగుబ్బలనాతో | 280 |
| 91 | యింతిచేసిన భాగ్యము | 284 |
| 92 | వాండు నాకు నిక్కముగా | 288 |
| 93 | జాజుజాజేకాక | 292 |
| 94 | దశవిధాచరణం తన్నభవతి | 296 |
| 95 | సితకపడును దోసిటి | 300 |
| 3 | శిగ్గుగల యాంటదైతే | 379, 395 |


## పెదతిరుమలాచార్యుల
## శృంగార సంకీర్తనముల ఱేకులు


| ఱేకు నంబరు. | ఱేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 4. | అయినప్పు డాయ్యాంగాని | 383, 399 |
| 5 | ఆతని నన్ను నన్నట్టె యనరాదా | 387, 401 |
| 6 | కాంతుని దప్పకచూచి | 391, 407 |
| 7 | లేవే యెంతలేదు | 409 |
| 11 | ఎంతలేదు తలపోంత | 338 |
| 12 | యిద్దరి మీజగడాలు | 342 |
| 13 | ఎంత చనవరొకాని | 346 |
| 14 | కుచ్చితాలే నీవైతే | 350 |
| 15 | మమ్ము నేల చెనకేవు | 354 |
| 16 | అనరెయిట్టె యనరె | 359 |
| 17 | చూడ నిచ్చింనంతలోనె | 363 |
| 18 | యెరపరికరము లింక | 367 |





| ఱేకు నంబరు. | ఱేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 19 | అప్పటి నాకు మోహించె | 371 |
| 20 | అంగన నీపతి | 375 |
| 21 | ఇందరమున్నారము | 43 |
| 22 | దొమ్మి సరసాలాడితి | 417 |
| 23 | ఇంతలోనే వేగిరమా | 421 |
| 24 | ఏసతి బొందవలశో | 425 |
| 25 | ఇందాకా విరహమున | 429 |
| 26 | చెప్పరాదు నీ శిగ్గరితనము | 63 |
| 27 | ఆడనుండేమి తగవు | 437 |
| 28 | ఇద్దరము నిద్దరమే | 71 |
| 29 | సిగ్గరికాంతల నింత చిమ్మరింతురా | 75 |
| 30 | పాయపు వనిత నింత | 79 |
| 31 | నీవు సేసిన పనులే నీకేల | 83 |
| 32 | అంగడి వేతురా వలపందరు | 87 |
| 33 | వెల్లివిరు లాయనోయి | 91 |
| 34 | వాడవారె మెప్పించ వలెగా | 95 |
| 35 | బాపురే యెంతటి జాణ | 99 |
| 36 | చెలులార విభునికి చెప్పరే బుద్ధి | 103 |
| 37 | లోకపు నీ చేతులకు లోనే కాదా | 107 |
| 38 | మాతో నేల పంతపుమాట లాడేవు | 111 |
| 39 | లకిమి నాయకురాలి | 115 |
| 40 | చిత్తములో రమణుడు | 118 |
| 41 | ఏమని చెప్పుదునె ఇటువంటి వేడుకలు | 123 |
| 42 | ఏమి సేతుమయ్య నీవు యింతటి | 127 |
| 43 | తానేమి సేసునే తనవోజ | 131 |
| 44 | ఎంత చనవరి యైన | 135 |
| 45 | ఏమని చెప్పుదు చెలియా | 139 |

| తేకు నంబరు. | తేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 46 | ఎక్కడి కెక్కడి సుద్దులే | 143 |
| 47 | వెనుకముందెంచబోతే | 147 |
| 48 | అమ్మేదొకటియు అసిమలోదొకటియు | 151 |
| 49 | ఎంత వేగిరకాడ వేమోయి | 155 |
| 50 | గుట్టుకొంత అట్టుకొంత | 159 |

ఇందింకను అన్నమాచార్యులవి 31 నుండి 60 దాకను, 96 నుండి 2002 దాకను; పెదతిరుమలాచార్యులవి 1,2,8 నుండి 10 దాకను, 51 నుండి 100 దాకను; చినతిరుమలాచార్యులవి 1 నుండి 10 దాకను ముద్రిత ములు గావలసి యున్నవి.

వీనిలో అన్నమాచార్యులవి 19, 96 నుండి 100 దాకను, 451 నుండి 460 దాకను, 521 నుండి 530 దాకను, 706, 889, 912, 915, 1105, 1151 నుండి 1160 దాకను, 1271 నుండి 1280 దాకను, 1521నుండి 1531 దాకను, 1581 నుండి 1590 దాకను, 1911 నుండి 1920 దాకను వెరసి 81; పెదతిరుమలాచార్యులవి 51 నుండి 60 దాకను, వెరసి 91 తేకులు కానరాకున్నవి.

పై తేకులన్నియు నీ క్రిందికొలతలతో నున్నవి.

అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు. పొ. 15 1/2 అం.వె. 7 అం.

పెదతిరుమలాచార్యుల శృం.సంకీర్తనలు." 16 అం. " 7 అం.

చినతిరుమలాచార్యులశృం.సంకీర్తనలు." 15 1/2 అం. " 7-2 అం.

అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు " 15 1/2 అం." 7 అం.

పెదతిరుమలాచార్యుల అ. సంకీర్తనలు " 15 3/4 అం. " 6 3/4 అం.

చినతిరుమలాచార్యుల అ. సంకీర్తనలు " 15 అం. " 7 1/2 అం.

ఇవిగాక 33 అంగుళముల పొడవు 2 1/2 అం. వెడల్పుగల తేకులు 120, తునకలు 5 ఉన్నవి. అవి మీద వర్ణితములయిన తేకులను చిక్కన తక్కువ పొడవు, హెచ్చు వెడల్పు గలవానిని జెక్కించుటకు ముందు



అన్నమాచార్యుల శృంగారసంకీర్తనములు కొన్ని మాత్రము చెక్కిన తేకులుగాఁ గానవచ్చుచున్నవి. వీనిలోని గేయములే పెక్కులు, మీఁదవర్ణితములయిన అన్నమాచార్యుల శృంగారసంకీర్తనపు తేకులలోనున్నవి. కొన్ని పాటలు చెక్కించిన పిదప తేకులదైర్ఘ్యము, పలుచన వాని చిరస్థితికి భంజక మగునని వెఱచి, వానినే మరల క్రొత్తతీరు తేకుల కెక్కించి యుందు రనుకొనవచ్చునేమో!

అహోబలమఠమునఁ దాళ్ళపాకరచనములు కలతేకులు కొన్నియున్న వట! వానిని గూడఁ దెప్పింప యత్నించుచున్నాము. అవి వచ్చెనేని యిప్పుడు కానరాని తేకులో, మఱికొన్ని క్రొత్తరచనములో లభింపఁగల వనుకొందును.

1937 సంవత్సర ప్రాంతముననే శ్రీదేవస్థానము కమిటీవారి నిదేశముననే అన్నమాచార్యుల మిగిలిన శృంగారసంకీర్తనముల ముద్రణమారంభమై ఆరు ఫారముల ముద్రణము సాగి నిలిచిపోయెను. తన్ముద్రాపకులు, అన్నమాచార్యుల తొలి తేకుననున్న యుపక్రమ వాక్యముల మరల ముద్రించి, యముద్రితములుగానే యున్న యన్నమాచార్యుల 31 నుండి 41 దాకగల నుజ్జగించి 42వ తేకునుండి ముద్రణ మారంభించిరి.

మే మీతేకులను, బుస్తకములను బరిశీలింపఁగా ముద్రణ మపక్రమముగా సాగుచుండుట తెలియవచ్చెను. విడనాడఁబడిన 31 నుండి 41 దాక గల తేకుల గేయములను, నప్పటికిక ముద్రితములయిన 42 నుండి 60 దాక గల తేకుల సంకీర్తనములకు దర్వాత చేర్చి ముద్రించితిమి.

ఈ సంపుటములో ముద్రితములైన అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల తేకులు.

| తేకు నంబరు. | తేకులలోని మొదటిపాటల మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 81 | ఎటువంటి మోహంబు | 121 |
| 82 | తానేచూడవే యీతండు | 80 |
| 33 | ఇయ్యింతి మురిపెము యెట్లుండెనే | 84 |
| 34 | ఏటి తమకమె నాకిఁకను | 88 |
| 35 | తొయ్యలికొప్పున సేవంతులు | 92 |
| 36 | కన్నులతుదలం గెంపు గానరాఁగాను | 96 |

| | | |
|---|---|---|
| 37 | తొయ్యలిభారపుతురుమమరె | 100 |
| 38 | ఇంతేపోవలపిందరికి | 105 |
| 39 | కుసుమకోమలి విభుని | 109 |
| 40 | అటువంటి వైభవము లమర | 113 |
| 41 | దిమ్మరిగా కేలమాను | 117 |
| 42 | చిన్ని శిశువూ చిన్నిశిశువూ | 1 |
| 43 | అతనుసంపదకంటె | 6 |
| 44 | కనుమూసెంగదా దీనిగరువంపు | 10 |
| 45 | సుదతి నీ కితవంటా | 14 |
| 46 | విన్నపాలు వినవలె వింతవింతలు | 18 |
| 47 | ఏగతినోచెనో యిందువదన | 22 |
| 48 | వెఱవక యింత విన్నవించగలమా | 26 |
| 49 | అల్లవాండే వాం డల్లవాండే | 30 |
| 50 | ఏమిసోద్యం బిదియు | 35 |
| 51 | లోనివారిమొరంగేటి | 39 |
| 52 | వెన్నెలలబాయిట | 43 |
| 53 | నన్నేల యేచేరే నగుబాట్లు | 48 |
| 54 | చేcతలేమనుచుం జేసితివో | 52 |
| 55 | నీకువలచినసతికి | 56 |
| 56 | నతుమమతా సన్మానస్త్వదీయ | 60 |
| 57 | యింకా నేటికెయింతులు | 64 |
| 58 | అప్పుడేమని యేమను మనెను | 68 |
| 59 | భ్రమయించే విట్టే పదిమారులు | 72 |
| 60 | పిల్లగోవి పట్టుమంటా | 76 |


పూర్వమెప్పుడో వ్రాయించియుంచిన కాగితములు, వాని లిపిరీతులు నేcటి ముద్రణమున కుపయోగపడcదగినట్లు లేవుగాన ఇంక ముద్రింప వలసిన గ్రంథభాగములను రాగితేకులను దగ్గఱనుంచుకొని చూచుచు నాcటి లిపిరీతిని, నేcటి పఠనార్హ లిపిరీతికి ననుగుణముగా మరల వ్రాసి ప్రకటింప వలసియున్నది. ఇందుకై డైరెక్టరుగారగు శ్రీపరవస్తు వేంకట రామానుజస్వామి యం. ఏ, గారు ఈ వాల్యుము నింతటితో ముగించి పై విషయమెల్ల నుపోద్ఘాతముగా నిందు వెల్లడించుట యుక్తమనుటచే నట్లు చేసితిని.



లభించిన తాళ్ళపాకవారి రచనముల తేకులు రెండువేల యాఱు వందల ముప్పదియైదింటిని, పరిశోధించి, చిక్కులు దీర్చి, విషయ విభాగము, కవి విభాగము, ముద్రితా ముద్రిత విభాగము మొదలగు వివిధ విభాగముల నెల్ల సమకూర్చుటలో శ్రీతిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన కార్యాలయ మున తెలుగు పరిశోధక విద్యార్థిగా నున్న చిరంజీవి విద్వాన్ ఎ.వి. శ్రీనివాసా చార్యులు ప్రధానముగా పరిశ్రమించి స్పష్టమయిన యెఱుకను నాకు జేకూర్చెను.

ఇcకపై నాధ్యాత్మ సంకీర్తనముల శేషమును శృంగారసంకీర్తనముల శేషమును, గ్రమముగా వాల్యుములుగాc బ్రకటింపగలము.

తాళ్ళపాకవారి పదములలోని యపూర్వ శబ్దార్థసంపదలను, రచనా విశేషములను, నాcనాటి లిపిసంప్రదాయములను వెలువడనున్న వాల్యుము లలో వివరింతుము.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము, తిరుపతి.

వేటూరి ప్రభాకరశాస్త్రి

# వేంకటేశ్వర లఘుకృతులు
## తొలిపలుకు

విమర్శగ్రంథములే కాక శ్రీ తిరుపతి వేంకటేశ్వర స్వామివారి మీఁద వెలసిన ప్రాచీనరచనము లెల్లంగూడఁ బ్రకటించుటయే మా సంకల్పము.

స్వామివారి మీఁది రచనలనన్నింటిని వేర్వేర నీ క్రిందితీరున విభాగింపవచ్చును.

1. శ్రీతాళ్ళపాకవారి రచనలు

2. శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు

3. శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యకథాప్రబంధములు

4. శ్రీ స్వామివారి కర్పితములయిన, కాని, ప్రాచీనకృతులలోని స్వామివారి స్తుతి వర్ణనాత్మక రచనాభాగములు.

(1) పై విభాగములలో తాళ్ళపాకవారి రచనలు గొన్ని యిక్కడనే యిప్పటికే ముద్రితములయినవి. కడమవి కడముట్ట ముద్రితములగానున్నవి.

(2) శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు- ఇవే ఇప్పుడు ముద్రితము లయినవి.

(3) శ్రీ వేంకటేశ్వరమాహాత్మ్య కథా ప్రబంధములలో నిప్పటికే యితరత్ర ముద్రితములయినవి తరిగొండవెంకమాంబ వేంకటేశ్వర మాహాత్మ్యాదులు గాక శ్రీనివాసవిలాససేవధి మొదలగు ప్రాచీనరచనలు ప్రశస్తమయినవి మేమే యిఁక నిక్కడ ముద్రింపనుంటిమి.

(4) ప్రాచీనగ్రంథములలోని శ్రీ వేంకటేశ్వరవర్ణనాస్తుతుల నెల్ల మేమే సేకరించుట జరుగుచున్నది. ప్రశస్తములయిన యీ ప్రాచీన కవులరచనల నెల్ల నొకసంపుటముగా ముద్రింతుము.



# శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు

పై పేర నిప్పుడు ప్రకటితము లైన యీ సంపుటములోని రచన లెల్ల నింతదాఁక నెవ్వరును బ్రకటింపనివే. ఇందుఁగొన్ని ప్రశస్తమైన రచనాపాటవము గలవి. స్తుతిమాత్రసుందరములు కొన్ని.

వీని వివరణము :-

వేంకటాచలవిహారశతకము :- ఇది మంచి రచనానైపుణిగలది, రచయిత పేరెఱుఁగరాదు. 98 పద్యములేదొరకినవి. లోపించిన రెండు పద్యములలో రచయిత పేరు తెలుపుకొనెనేమో. బ్రాహ్మణుఁడను నీ సొమ్ముదిన్న కవిని అని రెండుచోట్లఁ గవి తన విషయము చెప్పుకొన్నాఁడు.

ఇది క్రీ. 1700 శతాబ్ది యుత్తరార్ధమున మహమ్మదీయుల మూలమునఁ దిరుపతి ప్రాంతముల విప్లవము జరుగుచుండఁగా రచితమైనది. ఈ విప్లవరీతి నేఁడు తెలంగాణమున రజాకార్లు జరిపిన విప్లవము తార్కాణించు చున్నది. 4, 15, 17, 23, 24, 25, 30, 37, 38, 42, 43, 50, 53, 57, 76, 77, పద్యములఁ జదివిన నా సంక్షోభగాథ కనులకు గోచరించి పాఠకుల గుండెలకు జడుపును జలదరింపును గొలుపును. దిగువతిరుపతిలోఁ గూడనాఁ డలజడి చాల జరిగినదట.

వేంకటరమణ వేంకటేశ్వరశతకములును వేంకటాచలధామ తారావళియు :- ఇవి స్తుతిసుందరము లైన తేటరచనలు. తొలిగ్రంథమునకుఁ గర్త వెచ్చాధర్మపురి. కడపటిరెండు గ్రంథములకుఁ గర్త- ధర్మపురి వెంకటశాస్త్రి.

పంకజాతభవాండేశశతకము :- తారావళి యనఁదగినట్లు 28 పద్యములే యిందు దొరకినవి. ఇది శతకమే యని స్పష్టముగాఁ జెప్పఁ జాలము. రచనము చక్కఁగా స్తుతిసుందరముగా నున్నది. రచయిత పేరెఱుఁగరాదు.

వేంకటశైలనాయకశతకము :- ఇదియు స్తుతిసుందరమైన రచనము. రచయిత పే రెఱుఁగరాదు.

వేంకటేశ్వరపంచకము:- ఇదియుఁ బైదానివంటిదే. రచయిత పేరెఱుఁగరాదు.

వేంకటాచలేశశతకము :- ఇది మంచిరచనా చమత్కృతి గలది. అసమగ్రముగా రచయితపే రెఱుఁగరానిదిగా దొరకుటయ్యెనే యని చింతిల్ల వలసిన రచనము.

వేంకటాచలపతి శతకము :- స్తుతి సుందరమైన మంచిరచన. అసమగ్రమే. రచయిత పేరెఱుఁగరాదు.

మేల్నాటి వేంకటేశశతకము :- మంచిరచనగలది. స్తుతిసుందర మైనది. రచయిత పేరెఱుఁగరాదు.

వేంకటనగాధ్యక్షశతకము :- చాల విలువగల ప్రశస్తరచన. అసమగ్రముగా దొరకుట, రచయిత పేరెఱుఁగరాకుండుట, వింతగొల్పుచున్నది. దొరకిన పద్యములు వరాలవంటివి.

వేంకటశైలనాయకశతకము :- యమకాలంకారమును దేసి తెలుఁగు తెఱఁగును గల శృంగారశతకము. అసమగ్రముగా రచయిత పేరు లేనిదిగా దొరకినను దీనికర్త ప్రబంధరాజవిజయవేంకటేశ్వర విలాసకర్త గణప వరపు వేంకటేశ్వరకవియగుట గుర్తింపనయ్యెను. అతఁడు దన ప్రబంధరత్నాకరమున నిందలి పద్యమును కమ్మనితమ్మిదోదుమిని ఇత్యాదిక మును తనయమకశతకములోనిదానిఁగా నుదాహరించుకొన్నాఁడు. ఆ పద్యమును బట్టి యీ శతకము తత్కృత మగుట స్పష్టము.

శ్రీ వేంకటేశ్వరకల్యాణము :- ఇది మంచిగేయరచన. కర్త పేరెఱుఁ గరాదు. అసమగ్రముగానే దొరకినది. తుదిగేయములు మూఁడు నేను కూర్చి ముగియఁజేసితిని.

అలమేల్మంగాస్తవము :- ఇది మంచికవితారీతిగల స్తుతిరచన. కర్తపే రెఱుఁగరాదు.

ప్రసన్న వేంకటేశ్వరమంజరి :- ఇది మంచిరచనము. శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి మైసూరిచికదేవరాయని పరిపాలనకాలమున తత్పాలిత



దేశమున వామలూరను నూర వెలసి దివ్యవైభవము లందుట యిందు వర్ణిత మైనది. రచయితపే రెఱుఁగరాదు.

శ్రీ వేంకటేశ్వర పంచచామరములు :- అద్వైతవేదాంత ప్రతిపాద మయిన శ్రీ వేంకటేశ్వరస్తుతిరచన. ధారాళమయిన కూర్పుగలది. కర్త పేరు నామయోగి. భవన్నామయోగి యనికూడ గలదు గనుక వేంకటేశ్వరయోగియని యేని పేరు కాఁదగును.

వేంకటేశ్వరదండకములు:- తొలిదండకకర్త పేరెఱుఁగరాదు. రెండవ దండకము రచయిత పేరు ప్రే (హే?) మాద్రి రంగేంద్రుఁడు.

శ్రీ రమాపరిణయము :- బహుగ్రంథకర్త్రియగు తరిగొండ వేంక మాంబ రచనము. స్వామికల్యాణపు వేడుకలు బువ్వముబంతి విందుముచ్చట్లు నిందు సుందరముగా వర్ణితములయినవి.

ఇట్లు వర్ణితములయిన యీ గ్రంథములుగొన్ని ప్రాచ్యలిఖిత పుస్తక శాలలో వ్రాయించుకొన్నవి. వేంకటాచలవిహారశతకపుఁ బ్రత్యంతరము ఆంధ్ర సాహిత్య పరిషత్తునుండి వేంకటేశ్వరపంచచామరములు వేంటకనగాధ్యక్ష శతకపద్యములు గొన్ని తంజావూరి సరస్వతీ మహలు లైబ్రరినుండి వ్రాయించి తెప్పించినవి.

ప్రత్యంతరములు లేక యందదుకులుగాఁ జాలఁ దప్పులతో గ్రంథపాతములతో దొరికిన పై గ్రంథములను శక్యమయినంతవఱకు దోషములు తొలఁగించి లోపములు పూరించి సరిపఱచుటయ్యెను.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రస్తుతిని ప్రధానీకరించుకొని భక్తులు రచించిన యీ రచనలలో 'చెఱకునకు వంక గల్గినఁ జెడునెతీపు' అన్నట్లు భక్తిమాధుర్యమే యాసాధ్యము కాని కావ్యగుణములకొఱఁతలు నెఱసులు గణింపఁదగినవి గావు. స్వామివారిభక్తుల కిది సరస రసాయనమట్లు స్వాద్యమై హృద్యమై వెలయఁగలదు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము
సర్వధారి విజయదశమి, తిరుపతి, **వే. ప్రభాకరశాస్త్రి**

# అన్నమాచార్య చరిత్ర పీఠిక

## అవతరణిక

అన్నమాచార్య చరిత్రము కథాపురుషుని మనుమఁడే రచించినది కాఁబట్టి, విలువగల ప్రామాణిక చరిత్ర గ్రంథము. తెనుఁగున ప్రాచీన కాలపుఁ జరిత్ర గ్రంథములు కవీశ్వరులవి, ప్రాచీనులే ఆయా కవీశ్వరుల దగ్గఱి కాలమువారే కవితతో రచించినవి, చాలఁ దక్కువ.

బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, తిక్కన చరిత్రము (దశకు-౧ఆ.), కృష్ణరాయచరిత్రము, రఘునాథనాయకాభ్యుదయము, నృసింహగురుచరిత్రము, ఇట్టివి కొన్ని మాత్రమే వ్రేళ్ళలెక్క కెక్కి యున్నవి. అం దీయన్నమాచార్యచరిత్రము మతపాండిత్యకవితా ప్రఖ్యాతి గన్న మహనీయుని చరిత్రమై చాలఁగా జరగిన విషయములనే సవదరించునదిగా నిరూపణకెక్కి నా కెక్కువమక్కువ గొల్పినది.

దీని రచయిత చినతిరువెంగళనాథుఁడని నిండుపేరుగల చిన్నన్న, ఈతని విషయము 'అన్నమాచార్యసంతతి' అనుపట్టున వివరింతును.

[1] ఈ యన్నమాచార్య చరిత్రమునుబట్టియే కాక, అన్నమాచార్య రచితము లయిన సంకీర్తనములఁ బట్టి, తత్ప్రసక్తము లయిన శాసనములఁ

---

1. ఈ యన్నమాచార్య చరిత్ర కాగితపు వ్రాఁతపుస్తకమును కడపజిల్లా రాయచోటి తాలూకా మడితాడుగ్రామవాసి శ్రీ తాళ్ళపాక సూర్యనారాయణయ్యగారు తిరుపతి వెంకటేశ్వర ప్రాచ్య గ్రంథాలయమున కొసఁగిరి. ప్రాఁత తాటాకుప్రతి ననుసరించి వారు దానిని 1940 సం॥లో వ్రాసిరట. దానితో రేవణూరి వెంకటాచార్యుని శ్రీపాదరేణుమాహాత్మ్యమును, తాళ్ళపాక చిన్నన్న తామ్రశాసనమును గూడ వారీ గ్రంథాలయమున కొసఁగిరి. తామ్రశాసనమును, శ్రీ.మా. రామకృష్ణకవిగారు జర్నల్ వాల్యుం 1 పార్టు 1లో ప్రకటించిరి.

ఈ యన్నమాచార్యచరిత్ర వ్రాఁతప్రతిలో గ్రంథము ముగిసిన తర్వాత 7 పుటలో "తాళ్ళపాక తిరువెంగళనాథుని జీవితచరిత్రము కార్వేటినగర సంస్థానములో ఉన్నది. చూడవలెను." అని కలదు. అట్లది కార్వేటినగరమునఁ గలదేమో.



బట్టి, అన్నమాచార్యుల పుత్రపౌత్రాదులు రచించిన సంకీర్తన కావ్యాదులనుబట్టి, కూడఁ దచ్చరిత్రము కొంత గుర్తింపనగును. నలుదెఱఁగుల సాధనములను గ్రుచ్చి యెత్తి హృద్యమయిన తచ్చరిత్రము నుద్ధరింప యత్నింతును.

## అన్నమయ వంశము

అన్నమాచార్యుఁడు నందవరవైదిక బ్రాహ్మణవంశమున జన్మించినాఁడు. ఈ వంశమువారు ఋగ్వేదులు ఆశ్వలాయనసూత్రులు. భరద్వాజ గోత్రులు. పొత్తపినాఁటిలోని తాళ్ళపాకగ్రామమున[1] నుండినవారు.

లభించిన తాళ్ళపాకవారి యితర గ్రంథములలో నెందుఁగాని యన్నమయ పితృపితామహాదుల ప్రశంస లేదు. ఇందే అది కలదు. (చూ, 4 నుండి 8 పుటలు) అన్నమాచార్యుని తాత విద్యాభ్యాసమునకు ఊటుకూరను బంధుగ్రామమున కరిగినట్లున్నది.[2]

## అవతారము

అన్నమాచార్యుని తల్లి లక్కమాంబ3 మాడుపూరి మాధవస్వామి భక్తురాలట. అది యామె పుట్టినింటివారి యూరు గాఁబోలును. అన్నమయ శక. 1346 క్రీ. 1424 క్రోధి వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున జన్మించినాఁడు. పన్నిద్దరాళ్వార్లలో ముఖ్యులగు నమ్మాళ్వార్లు (శఠకోపయతి) కూడ వైశాఖవిశాఖనే జన్మించిరి. జన్మోత్సవము పుట్టిన నక్షత్రమును బట్టియును, నిర్యాణోత్సవము చనిపోయిన తిథిని బట్టియును జరుపుట సంప్రదాయము. వైశాఖమాసమున విశాఖా నక్షత్రము ప్రాయికముగా పూర్ణిమాతిథికి వచ్చును. కనుక వైశాఖ పూర్ణిమ జన్మతిథిగాఁ గూడ నిర్ణయింప వచ్చును. శక. 1424, క్రీ.శ 1503 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశినాఁడాతఁడు దివ్యధామ మందినాడు. అతని జీవిత పరిమాణము 79 ఏండ్లు. ఇటుచూడఁగా నేఁటి

---

1. తాళ్ళపాక నేఁటి కడపజిల్లా రాజంపేట తాలూకాలోనిది.

2. చినతిరుమలయ్య ఊటుకూరి చెన్నరాయనిమీఁద సంకీర్తనములు రచించెను. ఊటుకూరు తాళ్ళపాక దగ్గఱనే రాజంపేట తాలూకాలోనే నేఁడున్నది.

3. మాడుపూరు, కడపజిల్లా సిద్ధవటము తాలూకాలో నున్నది.

కాతఁడు జన్మించి 524 ఏండ్లయినది. దివ్యత్వమంది 445 ఏండ్లయినది.

వేదాంతదేశికులు శ్రీ వెంకటేశ్వరస్వామివారి గుడిఘంట యంశమున నవతరించిరని ప్రఖ్యాతి. మన యన్నమాచార్యులు స్వామి నందకము (ఖడ్గము) నంశమున నవతరించిరని ప్రఖ్యాతి. ( చూ. 10 పుట.)

## బాల్యము

అన్నమాచార్యునకు బాల్యమునఁ దల్లిదండ్రులు వదినెయన్నలు పనులు చెప్పుటయు, భగవద్భక్తిపరాయణుఁడై యాతఁడు వానినిఁ జేయఁ జాలక చీకాకుపడుటయు జరిగెను. (చూ. 11,12 పుటలు) కుటుంబము వారి వలనఁ దాను జీకాకు పొందుటను సూచించు సంకీర్తనములు కొన్ని యన్నమాచార్య సంకీర్తనములలోఁ గలవు. అందొకటి :-

### సామంతం

అయ్యో పోయం బ్రాయముఁ గాలము।
ముయ్యంచుమనసున నే మోహమతి నైతి ॥పల్లవి॥

చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁ జెలులు।
వట్టియాసలఁ బెట్టువారే కాక।
నెట్టుకొని వీరు గడు నిజ మనుచు హరి నాత్మఁ।
బెట్టనేరక వృథా పిరివీకు లైతి ॥అయ్యో॥ 1

తగుబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును।
వగలఁ బెట్టుచుఁ దిరుగువారే కాక।
మిగుల వీరలపొందు మే లనుచు హరి నాత్మఁ।
దగిలించలేక చింతాపరుఁడ నైతి ॥అయ్యో॥ 2

అంతహితులా తనకు నన్నలునుఁ దమ్ములును।
వంతువానికిఁ బెనఁగువారే కాక।
అంతరాత్ముఁడు వెంకటాద్రీశుఁ గొలువ కిటు।
సంతకూటములయలజడికి లోనైతి ॥అయ్యో॥ 3

అన్న. అధ్యా. 29 ఱేకు.



## స్వామి సాక్షాత్కారము

అన్నమయకుఁ బదునాఱవయేఁట స్వామి ప్రత్యక్ష మయినట్లాయన సంకీర్తనముల తొలి రాగిఱేకుమీఁదఁ జెక్కంబడియున్నది. నాఁట నుండియే స్వామియానతి చొప్పున నాతఁడు సంకీర్తనములు రచింప నారంభించెను. నమ్మాళ్వార్లు (శఠగోపయతి) కూడఁ బదునాఱవయేఁటనే ప్రజ్ఞాపూర్ణులై దివ్యప్రబంధరచన సాగించిరి. అన్నమయ తనకు స్వామి బాల్యమున దర్శన మిచ్చుట నిట్లు సంకీర్తనములఁ జెప్పుకొన్నాఁడు.

### భూపాలం

ఇప్పు డిటు కలగంటి నెల్లలోకములకు ।
నప్పఁడగు తిరువెంకటాద్రీశుఁ గంటి ॥పల్లవి॥

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి ।
ప్రతిలేని గోపురప్రభలు గంటి ।
శతకోటిసూర్యతేజములు వెలుఁగఁగ గంటి ।
చతురాస్యుఁ బొడగంటిఁ జయ్యన మేలుకంటి ॥ ఇప్పు॥ 1

కనకరత్నకవాటకాంతు లారుగడఁగంటి ।
ఘనమైన దీపసంఘములు గంటి ।
అనుపమ మణీమయ మగుకిరీటము గంటి ।
కనకాంబరము గంటిఁ గ్రక్కన మేలుకంటి ॥ఇప్పు॥ 2

అరుదైన శంఖచక్రాదు లిరుగడఁ గంటి।
సరిలేని యభయహస్తము గంటిని ।
తిరువెంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి ।
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి॥ఇప్పు॥ 3

అన్న. అధ్యా. 6 ఱేకు.

### పాడి

సందేహ మెక్కడా లేదు సంతోషించుకొంటి నేను ।
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను ॥పల్లవి॥

నున్నఁగా సంకీర్తన నానోరి కిచ్చితి గనుక।
నన్ను రక్షింతువే యనుచు నమ్మితి నేను।
పిన్ననాఁడే నీవు నన్నుం బేరుకొంటివి గనుక ।
యెన్నంగ నీడేర్తువని యియ్యకొంటి నేను ॥సందే॥ 1

శ్రీకాంతుఁడ నీమూర్తి నాచిత్తములో నిల్పఁగాను ।
నాకు నీవు గల వని నమ్మితి నేను ।
దాకొని లోకములో నీదాసుం డనిపించఁగా।
ఈడక నేలితి వని యెఱిఁగితినేను ॥సందే॥ 2

కైవసమై నీవు నాకుఁ గలలో నానతియ్యఁగా।
నావద్ద నున్నాఁడవని నమ్మితినేను ।
ఏవేళా శ్రీవేంకటేశ యెదుటనే వుండఁగాను ।
పావనమై యిన్నిటాను బ్రబలితి నేను ॥సందే॥ 3

అన్న. అధ్యా. 2వాల్యుం 244 పేజి.

## తిరుపతికిఁ బయనము

అన్నమయ కాడినమా టెల్ల నమృతకావ్యముగాను పాడినపా టెల్లఁ బరమగానముగాను గాఁజొచ్చినవి. తిరుపతి యాత్రకుఁ బయనమయ్యెను. పరుసగుంపువారిట్లు పాడఁజొచ్చిరి. ( చూ 13 పుట.)

వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని ॥పల్లవి॥

ఆమటి మ్రొక్కులవాఁడే ఆదిదేవుఁడే వాఁడు
తోమని పళ్యాలవాఁడే దురితదూరుఁడే ॥వేడు॥ 1

వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డలనిచ్చే గోవిందుఁడే ॥వేడు॥ 2

ఎలమిఁగోరినవరా లిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీ వెంకటాద్రినాథుఁడే ॥వేడు॥ 3

తాళ్ళపాక శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.



దిగువతిరుపతి క్షేత్రము పొలిమేరలో తాళ్ళపాకగంగమ్మ యను గ్రామదేవత గలదు. తాతాయగుంట గంగమ్మ.[1] అంకాళమ్మ ఇత్యాది నామముల గ్రామసీమాదేవత లింకను గలరు. అందరకంటెఁ దాళ్ళపాక గంగమ్మ ప్రాచీనదేవతయట. ఇప్పటికి నాదేవి తిరుపతి పొలిమేరలోనే కలదు. పూర్వము తిరుపతియాత్రకు వచ్చు యాత్రికు లాక్షేత్రదేవత నర్చించి క్షేత్ర ప్రవేశము చేయుచుండెడివారట. అన్నమయ యాదేవతకు మ్రొక్కు చెల్లించెను. (చూ. 14 పుట.) తొలుత నా దేవతను తాళ్ళపాక యన్నమయ యర్చించుట చేతనేమో యామెకు తాళ్ళపాక గంగమ్మ యని పేరయ్యెను. తిరుపతిలో నేఁటేఁట జరుగు గంగమ్మ జాతర యీ గంగానమ్మలకై యేర్పడినదే.

అన్నమయ యంతటఁ దిగువతిరుపతికి విచ్చేసి యిట్లు సంకీర్తనము చేసెను.

---

. (1) తాతాయగుంట గంగమ్మను గూర్చి యీకథ గలదు:- ఎప్పుడో తిరుపతి నుండి తిరుమల తాతాచార్యులవారు శిష్యసంచారము చేయుచు కడపప్రాంతముల నొక యూరి కరుగఁగా జరిగినది:- ఆయూర నెన్నఁడో వెలసియున్న గంగానమ్మ భయంకరవ్యాధులచే ప్రతివత్సరము నసంఖ్యాకజనమును నాహుతి కొనుచుండుటయు నొకప్పుడు జాత్ర జరగుచుండఁగా నామె జాలి దలఁచి యేఁడాది కొకనరబలి యిచ్చుచో నీమారణ మాపివేయుదు ననుటయు గ్రామస్థులందుల కంగీకరించుటయు జరిగెను. ఏటేఁట జాతరనాళ్ళలో బాటసారిగా వచ్చిన పరాయి యూరివాని నొకని బలిపెట్టుట జరగుచుండెను. ఒకయేఁట తాతాచార్యులుగారు చిక్కిరి. గురువుగారిని గోల్పోవుటాయని యూరివారు తటపటాయింపసాగిరి. ఎట్లో తెలిసి ఆచార్యులవారు భీముని వలె బలి యగుదునని వెఱపు మాన్పిరి. బలి గావలసినవాఁడు జాతరచోట అష్టాక్షరీ నారాయణకవచాదుల ననుసంధించుచు శిష్యులకుఁ జేయు శంఖచక్రముద్రాంకితముల తీరునఁగాక కణకణ నిప్పు రగిల్పించి శంఖచక్ర ముద్రల నెఱ్ఱగాఁ గాల్చి యుంచిరి. జాతరలో నమ్మవారి పూనకముతో నొకబత్తుఁడు బలిబలి యనుచు వారిమీఁదికి దూఁకెను. ఆచార్యులవారు పట్టుకార్లతో శంఖచక్ర ముద్రల నాపూనకమువాని రెండు భుజముల మీఁద గట్టిగా నంటించఁబోయిరి. శివశక్తి పాఱిపోఁజూచి వెనుదిరిగెను గాని మంత్రప్రభావముచే నడుగు సాగక నిలిచిపోయెను. ముద్ర వీపుమీఁదఁబడెను. తాతాచార్యులు గారి ముద్ర భుజముదప్పినా వీపుతప్పదన్న సామెత తదాదిగా వెలసెను. గంగానమ్మ యా యాచార్యులవారి కాళ్ళపై వాలి

## మలహరి

అదె చూడు తిరువెంకటాద్రి నాలుగుయుగము।
లందు వెలుఁగొంది ప్రభమీఱఁగాను ॥పల్లవి॥

తగనూటయిరవై యెనిమిది తిరుపతులం గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును।
అగణితంబైన దేశాంత్రులమఠంబులును
నధికమై చెలు వొందఁగాను ।
మిగుల నున్న తములగు మేడలును మాడుగులు
మితిలేనిదివ్యతపసు లున్నగృహములును।
వొగినొరగుఁ బెరుమాళ్ళవునికిపట్టయి వెలయు
దిగువ తిరుపతి గడవఁగాను ॥అదె॥ 1

పొదలి యరయోజనము పొడవుననుఁబొలుపొంది
పదినొండు యోజనంబుల పరపుననుఁ బరగి
చెదర కేవంకఁ జూచినమహాభూజములు
సింహశార్దూలములును ।
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడగంధర్వ యక్షులును విద్యాధరులు।
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవాఱఁగాను ॥అదె॥ 2

ఎక్కువల కెక్కువై యెసగి వెలసిన పెద్ద
యెక్కు డతిశయముగా నెక్కి నంతటిమీఁద ।
అక్కజంబైన పల్లవరాయని మఠము

శరణాగతురా లయ్యెను. ఆమెకు శిష్యత ననుగ్రహించి యాచార్యులవారు తిరుపతికిఁ దోడ్తెచ్చి యూరివెలుపల నెలకొల్పిరి. నాఁటితో నాగ్రామపువారి కామెవలని పీడ తొలఁగెను. నాఁటనుండి తిరుపతిలో తాతాచార్యులవారి యనుమతి నామె కేఁటేఁట జంతుబలులతోను మద్యపుఁ జూఱలతోను నిన్నటిదాఁక జాతర సాగినది. మహాత్ములయనుగ్రహమున నేఁడామె శుద్ధసాత్త్వికురాలై మద్యపుం జూఱను జంతుబలిని విడనాడినది.



అలయేట్ల పేడగడవఁ ।
చక్క నేఁగుచు నవ్వచఱి గడచి హరిఁదలఁచి
మ్రొక్కుచును మోఁకాళ్ళ ముడుగు గడచినమీఁద।
నక్కడక్కడ వెంకటాద్రీశు సంపదలు
అంతంతఁ గాన రాఁగాను ॥అదె॥ 3

బుగులుకొను పరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైననానావిధంబుల వనంబులును ।
నిగిడి క్రిక్కిఱిసి పండినమహావృక్షముల
నీడలను నిలిచి నిలిచి।
గగనంబు దాఁకి శృంగారరసభరితమై
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది।
జగతీధరుని దివ్యసంపదలుగల నగరు
సరగునను గానరాఁగాను ॥అదె॥ 4

ప్రాకటంబైన పాపవినాశనములోన
భరితమగు దురితములు పగిలిపాఱుచునుండ ।
ఆకాశగంగతోయములు సోఁకిన భవము
లంతంత వీడిపాఱఁగను ।
ఈకడనుఁ గోనేట యతులు బాశుపతుల్ మును
లెన్న నగ్గలమై వున్న వైష్ణవులలో
నేకమై తిరువెంకటాద్రీశుఁ డాదరిని
యేప్రొద్దు విహరించఁగాను ॥అదె॥ 5

అన్న. ఆధ్యా. 37 ఱేకు.

## శేషాద్రి దర్శనము

అదివో అల్లదివో హరివాసము ।
పదివేల శేషుల పడగలమయము ॥పల్లవి॥

అదె వేంకటాచల మఖిలోన్నతము ।
అతివో బ్రహ్మాదుల కపురూపము ।

అదివో నిత్యనివాస మఖిలమునులకు ।
నదె చూడుఁడదె మ్రొక్కుఁ డానందమయము ॥అది॥ 1

చెంగట నల్లదివో శేషాచలము ।
నింగి నున్న దేవతల నిజవాసము ।
ముంగిట నల్లదివో మూలనున్నధనము ।
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము ॥అది॥ 2

కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీవెంకటపతికి సిరులయినది ।
భావింప సకలసంపదలరూప మదివో
పావనముల కెల్లఁ బావనమయము । ॥అది॥ 3

అన్న. ఆధ్యా. 4 ఱేకు.

## రామక్రియ

కట్టెదుర వైకుంఠము కాణా చయినకొండ।
తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ ॥పల్లవి॥

వేదములే శిలలై వెసినది కొండ ।
యేదెసఁ బుణ్యరాసులే యేఱులైనది కొండ ।
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనలకొండ ।
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥ 1

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ ।
నిర్వహించి జలధులే చిట్టచఱులైన కొండ।
వుర్విఁ దపసులే తరువులై నిలిచిన కొండ ।
పూర్వపు టంజనాద్రి యీపొడవాటి కొండ ॥కట్టె॥ 2

వరములు కొటారుగా వక్కణించిపెంచే కొండ ।
పరగులక్ష్మీ కాంతు సోబనపుఁ గొండ ।
కురిసి సంపద లెల్ల గుహలనిండిన కొండ ।
విరివైన దిదివో శ్రీ వేంకటపుఁ గొండ ॥కట్టె॥ 3

అన్న. అధ్యా. 282 ఱేకు.



## అహిరి

తోరణములే త్రో వెల్లా ।
మూరట బారట ముంచినలతల ॥పల్లవి॥

కూరిమి మటములు గోపురంబులును ।
తేరుపడగలే తెరు వెల్లా ।
కోరినపండ్లు గురిసేటి తరువులు ।
తోరములైన వెదురుజొంపములు । ॥తోర॥ 1

ఆటలుఁ దిరువులు నందపు టురువులు ।
పాటలు వనవైభవ మెల్లా ।
కూటువనెమిళ్ళ కోవిలగుంపులు ।
పేటలఁ దేటల పెనుఁగూటములును॥తోర॥ 2

వింజామరలును విసనకఱ్ఱలును ।
గొంజెగొడుగులే కొండెల్లా ।
అంజనగిరిరాయఁడు వెంకటపతి ।
సంజీవని పరుషల కొదవఁగను ॥తోర॥ 3

అన్న. అధ్యా. 20 ఱేకు.

అన్నమయ దిగువ తిరుపతినుండి వేకువజామున బయలుదేరి అడిపడి నరసింహుని, తలయేరుగుండును, పెద్దయెక్కుడును, కపురపుఁగాలువను, దర్శించుచు జామెక్కుసరికి మోఁకాళ్ళ ముడుపుకడ కేఁగెను.

## తలయేరుగుండు

అడిపడిదగ్గఱనే గొప్పచింతచెట్టు నేఁడును గలదు. శ్రీ వేంకటేశ్వర సేవాక్రమమున నది ప్రస్తుతిగన్నది. అన్నమాచార్యుఁడు దీనిఁబేర్కొన్నట్టు లేదు.

చించా మున్నిద్రసుభగాం దివ్యాం తన్మూలతశ్శుభే ।
శ్రీనివాసపదాంభోజే స్వసంకల్పాత్ సముత్థితే
తన్మూలతస్స్వయంవ్యక్తాన్ సరోయోగిముఖానపి।
లక్ష్మీనృసింహం శేషాద్రిం ప్రణిపత్య కృతాంజలిః ॥సేవాక్రమః.

చింతచెట్టు దాటినతర్వాత నరసింహస్వామి, తలయేరుగుండు, అక్కడనే శ్రీపాదములు, నున్నవి. కొండమీఁది కెక్కువారును దిగువారును తలనొప్పి కాలునొప్పి కలుగుకుండుటకై యాగుండును దలతో మోఁకాళ్ళతోఁ దాఁకుదురు. కనుకనే దానికిఁ దలయేరుగుం డన్న పేరయ్యెను.

(చూ. 14 పుట.)

## శ్రీపాదములు

శ్రీరామానుజాచార్యులవారు తిరుపతికి విచ్చేసి కొండపై స్వామి సన్నిధిని మూన్నాళ్ళ వసించి యటుపై దిగువ తిరుపతిలో నొకవత్సరము నెలకొని తిరుమలనంబిగారికడ రామాయణరహస్యార్థములఁ దెలిసికొనిరట ! తిరుమల నంబి ప్రొద్దుట స్వామిని సేవించి కొండదిగి యడిపడికడ దలయేరుగుండు దగ్గఱిమండపమునకు రాఁగా రామానుజాచార్యుల వారు గోవిందరాజ సన్నిధినుండి యక్కడికరిగి రహస్యార్థములఁ దెలిసికొనుచుండెడివారట. తిరుమల నంబి యొఁకనాడు స్వామి సన్నిధిని మధ్యాహ్న పూజ సాగదయ్యెఁగదాయని ఖిన్నుఁడు కాఁగా స్వామి నీకాకొఱఁత తొలగిపోఁగలదు దుఃఖింపకు మని స్వప్నోద్బోధము కావించిరట. మఱునాఁడు ప్రాతఃకాల పూజచేసి వచ్చి రామానుజులకుపదేశము చేయుచుండగా మధ్యాహ్న పూజా సమయమునకు దివ్యకుసుమ తులసీ మృగమదకర్పూర సుగంధముతో స్వామిపాదములు ప్రత్యక్షమయ్యెనట. తదాది శ్రీపాదముల కక్కడ ప్రతిష్ఠకలిగెను. ఇతిహాసమాలలోనే ఈ కథ.

ముఖారి

బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దా నీ పాదము ॥పల్లవి॥

చెలఁగి వసుధ గొలిచిన నీపాదము ।
బలి తలమోపిన పాదము ।
తలఁకక గగనము దన్నినపాదము ।
బలరిపు గాచిన పాదము ॥బ్రహ్మ॥ 1

కామిని పాపము గడిగిన పాదము ।
పాము తల నిడిన పాదము ।
ప్రేమపు శ్రీసతి పిసికేటిపాదము ।
పామిడి తురగపు బాదము ॥బ్రహ్మ॥ 2

పరమ యోగులకుఁ బరిపరి విధములఁ
పరమొసఁగెడి నీ పాదము ।
తిరువేంకటగిరి తిరమనిచూపిన ।
పరమపదము నీ పాదము ॥బ్రహ్మ॥ 3

అన్న. అధ్యా. 31 ఱేకు.



## కురువనంబి

తలయేరుగుండు దాటిన తర్వాత కుమ్మరమండపమని యొక స్థలము గలదు. అదినేఁడు చెడినది. అక్కడిఱాళ్ళు మెట్టకుఁ బ్రక్కగోడ ఱాళ్లుగా మాఱినవి. ఆ ఱాళ్ళ మీఁదఁ గురువనంబి కథాశిల్పములున్నవి.

ఒక కుమ్మరి స్వామికిఁ బ్రతిదినము వంటకుండలుచేసి యర్పించుచు దానియాయతిచే జీవించుచుండెను. అనుదినము నెడతెగక యాపని యుండుటచే నాతనికి స్వామిదర్శనము తఱచుగా లభింపదయ్యెను. కొయ్యతో శ్రీనివాస మూర్తిని గల్పించుకొని యాతఁడు కుండలు చేయఁగా మిగిలిన మట్టితోఁ బుష్పములు గావించి యామూర్తి నర్చించు చుండెను. తొండమానుఁడను రాజు ప్రతిదినము స్వామికి బంగారుపూలతో దొలిపూజ జరుపుచుండెను. ఒకనాఁడు రాజు స్వామిపాదములపై నర్పించిన బంగరుపూ లొక ప్రక్కకు జాఱియుండుటయు మట్టిపూవులు శ్రీపాదములపై నుండుటయుఁ గానవచ్చెను. రాజుచూచి విచారింపఁగా కుమ్మరి తనయున్నచోట నర్పించుచుండిన పూవులవి యగుట తెలియవచ్చెను. రాజు కుమ్మరిని దర్శించి, తన కట్టియోగ్యత నర్థించెను. స్వామి కుమ్మరికిని అహంకృతి తొలగించుకొనిన రాజునకును సాన్నిధ్యమొసఁగెను. ఈ కథ వెంకటాచలమాహాత్మ్యమునను గలదు.

## కురువనంబి

కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రతికె కిరీటము గలరాజు ॥పల్లవి॥

దవ్వులామటనుండి నీవు పువ్వులఁ బూజించితే అవి ।
చివ్వున అప్పునియడుగుఁ దామెరలపై చెలఁగియప్పుడే నిలిచె ।
పువ్వులకు ఱెక్కలున్నవో లేక పుండరీకాక్షుని మహిమో ।
నివ్వటిల్లు నీ భక్తియోకాని నేఁడు నాతోఁ జెప్పవే ॥కురు॥

పొంకపుదోసిటి యదుసున లెస్స పొరలిన గన్నేరుఁ బువ్వులు ।
కుంకుమగంధ మాకల్పములపై కోరివేడి నిలిచె ।
బంకమ న్నది యెంతవాసనో లేక పారిజాతములకెక్కుడో ।
వెంకటపతికెంత వేడుకో నాకు వివరింపవె అప్పయ్య ॥కురు॥

దోసిటిలోపలఁ బెట్టిన శ్రీతులసి సేవంతిపువ్వులు ।
వాసిగ జగమెల్ల కుక్షిలో నిదుకొన్నవాని మేనెల్లనిండె ।
వేసదారి యలమేలుమంగ శ్రీ వేంకటేశ్వరుని మహిమో నీ ।
దాసరితనము బలమో కాని తలఁపునాతోఁ జెప్పవే ॥కురు॥

శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

## పెద్దయెక్కుడు

ఇక్కడ మెట్లు నిట్టనిల్వునను చాలాయెత్తుగాను నుండును. తిరుమల యెక్కుటలో నెక్కువశ్రమకర మయినయెక్కు డిది.

## కర్పూరపుఁగాలువ

"కపురంపుఁదావులు గదు నూలు కొలువు "కపురంపుఁగాలువ" యట. పెద్దయెక్కుడు దాటినతర్వాత మోఁకాళ్ళ ముడుపునకుఁ బూర్వమీకా లువ గలదట. అక్కడ నాసెలయేటి జాలునీళ్ళు సుగంధము గలిగి యుండునట. సేవాక్రమమున నిట్లున్నది. "తతఃకర్పూరసురభి తీర్థం కర్పూర నిర్ఝరమ్".

## మోఁకాళ్ళ ముడుపు

సాలగ్రామమయమైనది గనుక నిఁకమీఁదఁ బర్వతము పాదములతోఁ గాక మోఁకాళ్ళతో నడచుట జరిగెడిదట. కాన, మోఁకాళ్ళ ముడుపని పే రయ్యె నందురు. ఒక్కొకమెట్టు మోఁకాలి యెత్తుగలిగి మోఁకాళ్ళు ముడుచుకొనుచు నెక్కవలెను. గనుక నా పేరయ్యెననియు నందురు.



"అలమేలుమంగకు నాశుమార్గమున
సలలితంబుగ నొక్కశతకంబు సెప్పె"

తెలియక చెప్పుఁగాళ్ళతోఁ గొండ నెక్కుచు బదలి మోఁకాళ్ళ ముడుపు దగ్గఱ నన్నమయ వెదురుపొదక్రింద నొక బండపై మైమఱచి నిద్రించుచుండఁగా నలమేలుమంగాంబ దర్శనమిచ్చి యూఱడించి, చెప్పులు విడిచి కొండ నెక్కుమని తెలిపి దివ్యప్రసాదము ప్రసాదించి యాకలిదీర్చి యరుగుట, మెలకువగొని కళవళమంది యాతఁడది నిజమో కాదేమో యని సంశయించి, కడకు నమ్మి యాశుకవితగా నమ్మవారి మీఁద శతకముచెప్పుట జరిగినది.

చ॥ అరసెలు నూనెబూరియలు నౌఁగులుఁ జక్కెరమండెగల్ వడల్
బురుడలు పాలమండెఁగ లపూపము లయ్యలమేలుమంగ నీ
కరుదుగ విందువెట్టఁ బరమాన్నశతంబుల సూపకోట్లతో
నిరతవినిర్మలాన్నముల నేతులసోనల వేంకటేశ్వరా !

ఉ॥ చొచ్చితిఁ దల్లి నీమఱుఁగు సొంపుగ నీకరుణాకటాక్ష మె
ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి యోయలమేలుమంగ నీ
మచ్చిక నంచు నీతరుణిమన్నన నే నినుఁ గంటి నీకు నా
బచ్చెనమాట లేమిటికి బ్రాతివి చూడఁగ వేంకటేశ్వరా !

ఉ॥ యోగ్యత లేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడ గర్భని
ర్భాగ్యుఁడ నీ కృపామతికిఁ బ్రాప్తుఁడ నోయల మేలుమంగ నా
భాగ్యము నీకృపాగరిమఁ బ్రాప్యము కావు మటంచు సారె నీ
భాగ్యవతీశిరోమణిని బ్రస్తుతిచేసెద వేంకటేశ్వరా !

ఉ॥ అమ్మకుఁ దాళ్ళపాకఘనుఁ డన్నఁడు పద్యశతంబు సెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకున్
నెమ్మది నీవు చేకొని యనేకయుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్ధిలుము జవ్వనలీలల వేంకటేశ్వరా !*

'వేంకటేశ్వరా' యని పద్యాంతసంబోధన మున్నను నిందుఁ బ్రతి పద్యమును నలమేలుమంగాంబికా ప్రస్తుతిపరమే. కడపద్యములో కవికూడా

*దీనిని వావిళ్ళవారు ప్రకటించిరి.

అమ్మకు అలమేల్మంగకు పద్యశతము చెప్పితిననెను – కనుక నిదియలమేల్మం గాంబికాస్తుతి శతకమేయనఁదగినది.

అన్నమాచార్యచరిత్రలో నన్నమయ కొండ నెక్కునాఁటి కెనిమిదేండ్ల వాఁడనియున్నది గాని, దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చిన దాదిగా నని యన్వయించుకొని యెనిమిదేండ్లవాఁడని, మాతృగర్భమున నుండి పుట్టిన దాది పదునాఱేండ్లవాఁడని సరిచూచుకోవలెను. కొండనెక్కు నాఁటి కాతఁడు సంకీర్తనకర్త. పదునాఱవయేఁట స్వామి ప్రత్యక్షమై సంకీర్తన రచనానుగ్రహము చేసినాఁడని రాగిఱేకుమీఁదనున్నది.

## శ్రీభాష్యకారులు

### దేశాళం

గతులన్ని ఖిలమైన కలియుగ మందును ।
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥పల్లవి॥

ఈతనికరుణనేకా యిల వైష్ణవులమైతి ।
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర ।
మీతఁడే రామానుజులు ఇహపరదైవము ॥గతు॥

వెలయించె నీతండెకా వేదపురహస్యములు ।
చలిమి నీతండె చూపె శరణాగతి ।
నిలిపినాఁ డీతండెకా నిజముద్రాధారణము ।
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥గతు॥

నియమము లీతండెకా నిలిపెఁ బ్రపన్నులకు ।
దయతో మోక్షముచూపెఁ దగ నీతండె ।
నయమై శ్రీ వేంకటేశునగ మెక్కి వాకిటను ।
దయఁ జూచీ మమ్ము నిట్టే తల్లిదండ్రి దైవము ॥గతు॥

అన్న. అధ్యా. 175 ఱేకు.



అన్నయమ కొండ నెక్కి స్వామిపుష్కరిణిని దర్శించి తొలుతనందు స్నానముచేసినాఁడు. అప్పుడు పుష్కరిణి నిట్లు ధ్యానించినాఁడు.

(18 పుట. చూ)

## స్వామిపుష్కరిణి

### గుండక్రియ

దేవుని కిదే వునికి నీ తెప్పల కోనేరమ్మ ।
వేవేలే మొక్కులు లోకపావని నీ కమ్మా ॥ పల్లవి॥

ధర్మార్థకామమోక్షతతులు నీ సోబనాలు।
అర్మిలి నాలుగువేదా లదే నీదరులు ।
నిర్మలపు నీజలము నిండు సప్తసాగరాలు ।
కూర్మము నీలోఁతువో కోనేరమ్మా ॥దేవు॥ 1

తగిన గంగాదితీర్థములు నీకడళ్ళు ।
జగతి దేవతలు నీజలజంతులు ।
గగనపుఁ బుణ్యలోకాలు నీదరిమేడలు ।
మొగి నీచుట్టుమాఁకులు మును లోయమ్మా ॥దేవు॥ 2చ

వైకుంఠనగరమువాకిలే నీ యాకారము ।
చేకొను పుణ్యము లే నీజీవభావము ।
యేకడను శ్రీవెంకటేశుండె నీవునికి ।
దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా ॥దేవు॥ 3

అన్న. అధ్యా. 185 ఱేకు.

పెద్దగోపురమును నీడతిరుగని చింతచెట్టును [1] గరుడగంభమును చంపకప్రదక్షిణమును దివ్యప్రసాదము లొసఁగుప్రదేశమును అక్కడి

1. ఈ చింతచెట్టు శేషాంశమట. సేవాక్రమముునను వేంకటాచలమాహాత్మ్యమునను పరమయోగివిలాసమునను నీ చింతచెట్టుస్తుతికలదు. ఈ చెట్టు నేఁడులేదు కాని సేవాక్రమమున పర్వతారోహణోపక్రమమునఁగూడ నొకచింత చెట్టున్నట్టు వర్ణనము న్నది. ఆ చింతచెట్టు నేఁడును గలదు.

ప్రసాదములను నడగోపురమును శ్రీనివాసుని భాష్యకారులను నరసింహుని జనార్దనుని అలమేలుమంగను యాగశాలను ఆనందనిలయమును కళ్యాణ మంటపమును బంగారుగరుడుని శేషుని పునుఁగుచట్టలనుకాచి తైలము వడియఁగార్చు ప్రదేశమును స్వామినిస్తుతించు చిలుకల పంజరములను శ్రీ భండారమును బంగారుగాదెలను బంగారువాకిటిని దర్శించి స్తుతించి లోనికి స్వామిని సేవింప నరిగెను. ఈ సందర్భములలోఁ బెక్కింటికి సంకీర్తనము లున్నవి.

## దేవాలయప్రవేశము

పాడి

సేవించి చేకొన్న వారి చేతిభాగ్యము ।
వేవేగ రారో రక్షించి విష్ణుఁ డీడను । ॥పల్లవి॥

గరుడగంభముకాడ కడుఁ బ్రాణాచారులకు ।
వరము లొసఁగీని శ్రీవల్లభుండు ।
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలము లెల్ల ।
పరుషల కొసఁగీని పరమాత్ముఁడు ॥సేవించి॥ 1

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము ।
నానాగతిఁ బుట్టించీని నారాయణుండు ।
కానుక పైఁడిగాదెలకాడ నిజరూపు ।
అనుక పొడచూపీని అఖిలేశుఁడు ॥సేవించి॥ 2

సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి ।
విన్నపాలు వినీ శ్రీ వేంకటేశుఁడు ।
ఎన్నికం బాదాలవద్ద ఇహము పరముఁ జూపీ।
మన్ననల నలమేలుమంగవిభుఁడు ॥సేవించి॥ 3

అన్న. అధ్యా. 288 ఱేకు.

## విష్వక్సేనుఁడు

నీవేకా చెప్పఁ జూప నీవేకా ।
శ్రీవిభుప్రతినిధివి సేన మొదలారి ॥పల్లవి॥



నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద ।
దేవతలఁ గనిపించే దేవుండవు ।
యేపంక విచ్చేసినాను యిందిరాసతికి నిజ ।
సేవకుండవు నీవేకా సేనమొదలారి ॥నీ వేకా॥ 1

పసిఁడి బద్దలవారు పదిగోట్లు గొలువ ।
దెసలఁ బంపులు వంపే ధీరుఁడవు ।
వనముగా ముజ్జగాలవారి నిందఱిని ।
సిసువులఁగా నేలిన సేనమొదలారి ॥నీవేకా॥ 2

దొరలైన యసురులఁ దుత్తుమురుసేసి జగ ।
మిరవుగా నేలితి వేకరాజ్యమై ।
పరగుసూత్రవతిపతిపై వెంకటవిభు ।
సిరులపెన్నిధి నీవె సేనమొదలారి ॥నీవేకా॥ 3

అన్న. అధ్యా. 42 ఱేకు.

## హనుమంతుఁడు

సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు ।
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు ॥పల్లవి॥

పెట్టినజంగతోడి పెద్దహనుమంతుఁడు
పట్టెను యెడమచేత బలుముష్టి ।
మెట్టినాఁడు పాదముల మించురాకాసితలలు ।
కొట్టే ననచు నెత్తె గొప్పవలకేలు ॥మొక్కరో॥ 1

వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోఁక ।
పెంచెను మిన్నులు మోపఁ బెనుదేహము ।
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవుడల ।
కాంచనపుఁబట్టుకాసె కదు బిగించెను॥మొక్కరో॥ 2

పెనఁచి తొడలుదాఁక పెద్దపదకము వేసెఁ
తనువుపై వ్రేలాడేదండలతోడఁ

అనయము శ్రీవెంకటాద్రిదేవునిబంటు ।
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను ॥మొక్కరో॥ 3

అన్న. అధ్యా. 252 రేకు.

## ప్రసాదములు

దేసాక్షి

ఏ పొద్దుచూచిన దేవుఁ డిట్లానె యారగించు
రూపులతోఁ బదివేలు రుచులైనట్లుండెనూ ॥పల్లవి॥

మేరుమందరాలవలె మెఱయు నిద్దెనలు ।
సూరియచంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు ।
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను ।
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ఏపొద్దు॥ 1

పలుజలధులవంటి పైఁడివెండి గిన్నెలు ।
వెలిఁగొండ లంతలేసి వెన్నముద్దలు ।
బలసిన చిలువాలు పంచదార గుప్పఁగాను ।
అలరువెన్నెల రస మందిచ్చినట్లుండెను ॥ఏపొద్దు॥ 2

పండిన పంటలవంటి పచ్చళ్లుఁగూరలును।
పండి యలమేలుమంగ వడ్డించగాఁ।
అండనె శ్రీ వెంకటేశుఁ డారగించి మిగులఁగ।
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను ॥ఏపొద్దు॥ 3

అన్న. అధ్యా. 252 రేకు.

## స్వామి దర్శనము

శంకరాభరణం, అటతాళం

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయఁడా ॥పల్లవి॥

కోరి మమ్ము నేలినట్టికులదైవమా, చాల।
నేరిచి పెద్ద లిచ్చిన నిధానమా ।



గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు ।
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా ॥పొడ॥ 1

భావింపఁ గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేరఁ గాచినట్టిచింతామణీ ।
కామించి కోరిక లిచ్చే కామధేనువా, మమ్ము ।
తావై రక్షించేటిధరణీధరా ॥పొడ॥ 2

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా।
లడఁచి రక్షించే దివ్యౌషధమా ।
బడిఁ బాయక తిరిగే ప్రాణబంధుఁడా, మమ్ము ।
గడియించినట్టి శ్రీ వేంకటనాథుఁడా ॥పొడ॥ 3

రామక్రియ అటతాళం

కంటిఁగంటి నిలువుచక్కనిమేను దండలును
నంటుఁజూపులను జూచే నవ్వుమోముదేవుని ॥పల్లవి॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును ।
ఘనపీతాంబరము పైకట్టు కటారి ।
మొనసియొడ్డాణపు మొగవుల మొలనూలు ।
ఒనర నాభీకమల ముదరబంధములు ॥కంటి॥ 1

గరిమ వరదహస్తకటిహస్తములును ।
సరస నెత్తినశంఖచక్రహస్తములు ।
ఉరముపై కౌస్తుభ మొప్పుగుహారములు ।
.................................... ॥కంటి॥ 2

కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు ।
కట్టాణిముత్యాల సింగారనామము ।
నెట్టన శ్రీ వెంకటేశ నీకుఁ గర్ణపత్రములు ।
నట్టెసిరనుమీఁదఁ నమరే కిరీటము ॥కంటి॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

భూపాళం

పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుఁడా।
వేవేల కితని నింక వేమాఱునుం బాడి ॥పల్లవి॥

హరినామములే పాడి అతనిపట్టపురాణి ।
ఇరవై మించినయట్టియిందిరఁ బాడి ।
సరస నిలువంకలాను శంఖచక్రములఁ బాడి ।
వరదకటిహస్తాలు వరుసతోఁ బాడి ॥పావ॥ 1

ఆదిపురుషునిఁ బాడి అట్టే భూమిసతిఁ బాడి ।
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి ।
మోదపుబ్రహ్మాండాలు మోచే వుదరముఁ బాడి ।
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి ॥పావ॥ 2

శ్రీవెంకటేశుఁ బాడి శిరసుతులసిం బాడి ।
శ్రీవత్సముతోడురముఁ జెలఁగి పాడి ।
లావుల మకరకుండలాలకర్ణములు పాడి ।
ఆవటించి యితనిసర్వాంగములుఁ బాడి ॥పావ॥ 3

అన్న. అధ్యా. 173 ఱేకు.

## స్వామి యభయహస్తము

సామంతం

ఇందఱికి నభయంబు లిచ్చుచేయి
కందువ లగుమంచి బంగారుచేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదికి తెచ్చినచేయి ।
చిలుకుగుబ్బలిక్రిందఁ జేర్చుచేయి ।
కలికియగు భూకాంతఁ గౌఁగిలించినచేయి
వలనైన కొనగోళ్ళ వాఁడిచేయి ॥ఇంద॥ 1

తనివోక బలిచేత దాన మడిగినచేయి ।
ఒనరంగ భూదాన మొసఁగుచేయి ।



మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చినచేయి ।
యెనయ నాఁగేలు ధరియించుచేయి ॥ఇంద॥ 2

పురసతుల మానములు పొల్లచేసినచేయి ।
తురగంబుఁ బరపెడిదొడ్డచేయి ।
తిరువెంకటాచలాధీశుఁడై మోక్షంబు ।
తెరువు ప్రాణుల కెల్లఁ దెలిపెడిచేయి ॥ఇంద॥ 3

2 వాల్యూం 215 పుట.

## స్వామి మహిమలు

శంకరాభరణం పల్లవి

ఎటువంటి వాఁడవో నీ మహిమ
లెట్టుదెలియవచ్చును
నిటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు
ని న్నెట్లుదెలిసేరు మావులు ॥పల్లవి॥

తిరుమలనంబి తా తాత యన్ననాఁడె
తెలిసెఁబో మీ పెద్దతనములు ।
కురువనంబిగారి చేతిబంకమట్టి పువ్వులు
కొన్ననాఁడె తెలిసె మీభోగము।
మఱియు ననంతాళువారి చెఱువుగట్ట
మన్ను మోయఁగా దెలిసె మీనటనలు
గరుడగంభముకాడ కాను కొక్కవరమిచ్చి
గడియించఁ దెలిసె మీసంపద ॥ఎటు॥ 1

తొండమాంజక్రవర్తికి సంపద
తొలుత నియ్యఁగాఁదెలిసె మీయీవులు
అండయెఱుకువారి కొఱ్ఱచేనియెన్ను
లారగించగాఁ దెలిసె మీరుచులు ।
వుండి గొల్లలకావిళ్ళపాలెల్ల
వుట్టుకోఁగఁ దెలిసె మీనేమములు ।

దండిగ సంపంగిమాఁకుల నడిపించ
దైవరాయ తెలిసె మీవిద్యలు ॥ఎటు॥ 2

మును దాను తిమ్మన్న తుంబురుకొండకు
మోక్ష మియ్యఁగా దెలిసె మీబుద్ధులు।
పనివడి తాళ్ళపాక అన్నమయ్యగారి
పదములలోఁ దెలిసె మీవోజలు।
యెనయ శ్రీవెంకటనాథ యలమేల్మంగ
నెద నుంచఁగాఁ దెలిసె మీగోప్యము।
వెనుకొని పరుషవారికెదురు వోయి
వెంటరాఁగాఁ దెలిసె మీరాజసము ॥ఎటు॥ 3

శేషా. వ్రాఁతప్రతి

బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమెనీవూ
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతె నిప్పటి యన్నట్లూ॥ప॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుండని।
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మ మనుచు।
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁడనుచు।
అలరి పొగడుదురు కాపాలికకులు ఆదిభైరవుఁ డనుచు ॥ఎంత॥ 1

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు।
దరిసెనముల మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు।
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచిన వారికి నల్పం బవుదువు।
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥2

నీ వలనఁ గొఱఁత లేదు హతి నీరుకొలంది తామరవు।
ఆవల భాగీరథిదరి బావుల ఆజలమే వూరినయట్లు।
శ్రీ వెంకటపతి నీవైతే మముఁ జేకొని వున్నదైవమని।
యీవల నే నీశరణనియెద నిదియె పరతత్వము నాకు ॥ఎంత॥ 3

అన్న. అధ్యా. 179 ఱేకు.



బౌళి

ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను
ఏమఱక కొలచిన నితఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందఱికిఁ గన్ను లిచ్చుఁ గాళ్ళిచ్చు।
పనిసేయఁ జేతు లిచ్చు బలియుఁడై।
తనుఁ గొలువుమని చిత్తము లిచ్చుఁ గరుణించి।
వొనర లోకాన కెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥ 1

మచ్చిక తనుఁ గొలువ మనసిచ్చు మాట లిచ్చు।
కుచ్చితములేని కొడుకుల నిచ్చును।
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు।
నిచ్చలు లోకాన కెల్ల నిజమైన దైవము ॥ఏమి॥ 2

పంతమాడి కొలచినఁ బ్రాణ మిచ్చు ప్రాయమిచ్చు।
యెంతటి పదవులైన నిట్టె యిచ్చు।
వింతవింత విభవాల వెంకటేశుం డిదేమో।
యంతరంగమున నుండే అరచేతి దైవము ॥ఏమి॥ 3

అన్న.అ.ధ్యా. 128 ఱేకు.

స్వామిదర్శనము (చూ. 22.పుట) ఇక్కడి వర్ణనము వంటిదే పరమయోగివిలాసమునను స్వామివర్ణనమున్నది.

ఆవరణంబుల కాదియై మిగులఁ
గొమరారు వైకుంఠగోపురంబునకుఁ
బ్రమదంబుతో మున్ను ప్రణమిల్లి యంతఁ
జనుదెంచి గారుడస్తంభంబు చక్కి
వినతుఁడై చెంతఁ గొవ్విరిసాల కేఁగి
వలనొప్పు చంపకావరణంబు వేగ
వలచుట్టి వచ్చి యాస్వామిపుష్కరిణి
తోయంబు లాని యుత్తుంగభామున
నాయహికులపతి యవతారమగుచుఁ

దిరుగనిచింతలం దెఱలించు నీడ
తిరుగనిచింత కెంతే భక్తి మ్రొక్కి
రమణ రెండవగోపురము దాఁటి లోని
కమల మహానసాగార సేవించి
నెలకొని యానందనిలయాఖ్య మగుచుఁ
నలువొందు మణివిమానంబు సేవించి
పటుమహామణి మంటపంబు సేవించి
యట వచ్చి తురగతార్క్ష్యాహినాయకుల
సేవించి నిత్యుల సేవించి కూర్మి
నావేళ లోనికి నరుదెంచి యచటి
పంచాస్త్రకోటుల భావంబు మించి
పంచవిగ్రహముల భాసిల్లి పసిఁడి
గజ్జెలు నందియల్ కనకాంబరంబు
గొజ్జంగిముత్యాలకుచ్చుకటారి
బెడఁగుగాఁ గటిమీఁద బెరసినకేలు
నుడుగక వరముల నొసగుకెంగేలు
నుదరబంధంబు కేయూరహారములుఁ
బొదలుతావుల తట్టుపునుఁగుపైపూఁత
కుడిరొమ్ముమచ్చ యక్కున నెలకొన్న
కడలికన్నియదివ్యకంఠసరంబు
ధళధళదులకించు దరము చక్రంబు
బలసి చూపట్టెడుపాణి పద్మములు
బింబాధరంబు నొప్పెడుకపోలములు
కంబుపోతంబు నెక్కసమాడుగళము
మకరకుండలములు మణికిరీటంబు
వికసితధవళారవిందనేత్రములు
చల్లనిచూపును జారునాసికము
తెల్లనిమెఱుఁగుముత్తియపు నామమును



గలిగి యెంతయును శృంగారభావంబు
మలయు నయ్యలమేలుమంగామనోజు.

పరమయో 8 ఆశ్వా.

బంగారుగజ్జెలుఁ బసిఁడియందియలు
జెంగావిచాయమించినపైఁడి వలువ
మొగవులమొలనూలు ముత్యాలకుచ్చు
బిగిసి చూపట్టుముప్పిడికఠారంబుఁ
గటి ఘటియించిన కరపల్లవంబుఁ
బటువరంబుల నిచ్చు పాణిపద్మంబు
వలమురి నెఱవాఁడివలయపుఁగత్తి
బలసి చూపట్టెడు పాణియుగ్మమును
బొడ్డుమానికము కెంపులబిటారించు
నొడ్డాణమును మించునుదరబంధంబు
భుజకీర్తులును బాహుపురులు తాయెతులు
భుజగభూషలుఁ దట్టుపునుఁగు మైపూఁత
యక్కుననెలకొన్న యలమేలుమంగ
యక్కజంబగువై జయంతిసరంబుఁ
దారహారములు పుత్తడిజన్నిదములుఁ
జారుమౌక్తికకంఠసరముఁ బేరురము
కంబుకంధరమును గౌస్తుభమణియు
బింబాధరంబు నొప్పెడికపోలము
మందస్మితంబును మకరకుండలము
లిందుబింబము హసియించునెమ్మోము
తెలిదమ్మికన్నులుఁ దిలనాసికంబుఁ
దెలిమించునాణిముత్తియపు నామంబు
కనకపిప్పలదళ కలిత పట్టంబు
ననుపమమణిమయం బగుకిరీటంబు
గలుగు శ్రీ వేంకటగ్రావాధినాథు.” పరమయో 2 ఆశ్వా.

పైయన్నింటను స్వామిముఖమున ముత్యాలనామ మున్నట్లు వర్ణ నమున్నది. అది యాభరణరూపము.

స్వామికి శుక్రవారమునాఁటి తిరుమజ్జనోత్సవమును అన్నమయ యుఁదత్పుత్రులును బదింబదిగా వర్ణించిరి.

అది యీనాఁట నిట్లు సాగుచున్నది :- పునుఁగుత్తైలపుటభ్యంజ నమును క్షీరఘటాభిషేకమును కుంకుమపూవు కస్తురి, కప్రము, నూటి బంగరు గిన్నెలనించిన యనుకుతో నలుఁగును స్వల్పజలాభిషేకమును అనుకు నలుఁ గుతోఁ గలసిన యాతీర్థము స్వామిపాదతీర్థముగా సేకరమయిన మీఁద విరివిగా జలాభిషేకమును జరుగును. తలకుఁ దడియారఁగా బొడివలువ పిడిచుట్టు చుట్టి దివ్యమంగళవిగ్రహము నెల్లఁ బొడివలువతో దుడిచి నీరు పూఁతగా ముఖమున దూమెఱుఁగుగా సర్వాంగమున పునుఁగు తైలముపూఁత ముఖమునఁ గర్పూర చూర్ణముతో నామము సాఁతుట యానామమునకు నుడమఁ గస్తూరీ తిలకము దిద్దుట అలమేల్మంగ హారము (మంగతాళి) మొదలగు దివ్యాభరణములను పీతకౌశేయములను ధరింపించుట జరగును. తాళ్ళపాకవారినాఁట నిట్లు సాగెడిది :-

ఆపాదమస్తకము పునుఁగు తైలపు టభ్యంజనముచేసి కుంకుమపూవు మొదలగువాని యనుకుతో నలుఁగువెట్టి పన్నీటిను శుద్ధోదకముననుు జలక మార్చి తుడిచి సర్వాంగములందు నారఁగాఁ గర్పూరధూళిచల్లి మేదించి దానిపై నారఁగా బునుఁగుతైలమురాచి ముత్యాలతిరునామము మంగతాళి మొదలగు దివ్యాభరణములను వస్త్రములను పుష్పహారములను నలంకరించు టయ్యెడిది.

అభిషేకసమయమునఁ దాళ్ళపాకవారు దగ్గఱనుండి నలుఁగుపాటలు అభిషేకపుబాటలు మొదలగునవి పాడుట, అభిషేకానంతరము వారి కొక యభిషేకపుఁ బన్నీటి చెంబును తాంబూలచందనాదులను నొసఁగి సత్కరించుట జరగెడిది. తిరుమజ్జనోత్సవమిట్లు శాశ్వతముగా జరుగుటకుఁ దాళ్ళపాకవారే స్వామి కగ్రహారముల నర్పించిరి.



## శుక్రవారాభిషేక దర్శనము

కంటి శుక్రవారము గడియ లేడింట ।
అంటి అలమేల్మంగ అండనుండేస్వామిని ॥పల్లవి॥

సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు ।
చెమ్మతోన వేష్టువలు రొమ్ము తల మొల చుట్టి ।
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండేస్వామిని ॥కంటి॥ 1

పచ్చకప్పురమె నూటి పసిఁడిగిన్నె నించి ।
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది ।
అచ్చెరపడిచూడ అందరికన్నుల కింపై
నిచ్చమల్లెపూవులవలె నిటు తా నుండేస్వామిని ॥కంటి॥ 2

తట్టుపునుఁగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు ।
పట్టి కరఁగించి వెండిపళ్యాల నించి ।
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది ।
బిట్టువేడుక మురియుచుండే బిత్తరిస్వామిని ॥కంటి॥ 3

శేషాచార్యులవారి వ్రాఁతప్రతి.

### శ్రీరాగము

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమునం గళలెల్లా మొలచినట్లుండె ॥పల్లవి॥

జగదేకపతిమేనఁ జల్లినకర్పూరధూళి।
జిగిగొని నలువంకఁ జిందగాను ।
మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనుక ।
పొగరువెన్నెల దిగఁబోసినట్లుండె ॥ఒక॥ 1

పొరి మెఱుఁగుఁ జెక్కులఁ బూసినతట్టుపునుఁగు ।
కరఁగి యిరుదెసలఁ గారఁగను ।

కరిగమన విభుఁడు గనక మోహమదము ।
తొరిగి సామజసిరి దొలఁకిన ట్లుండె ॥ఒక॥ 2

మెఱయ శ్రీ వెంకటేశుమేన సింగారముగాను ।
తఱచయిన సొమ్ములు ధరియించఁగా
మెఱుఁగుఁబోడి యలమేలు మంగయుఁ దాను ।
మెఱుపు మేఘముగూడి మెఱసిన ట్లుండె ॥ఒక॥ 3

## శ్రీరాగము

పులుగడిగినయట్టి పురుషోత్తముఁడు వాఁడే
ఎలమి నారతులు మీరెత్తరే దేవునికి ॥పల్లవి॥

గొప్పయింద్రనీలాలకొండ మంచు గప్పినట్టు ।
నెప్పుమింట పాలవెల్లి నెరసినట్లు ।
విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు ।
కప్పురధూళి మేనఁ గప్పిరి దేవునికి ॥పులు ॥ 1

నిండు నైరావతము పై నీలిజగ గప్పినట్టు ।
వెండిమేడపెఁ జీఁకటి విడిసినట్టు ।
పుండరీకపుఁ గొలను పొరిఁ దేం ట్లాఁగినట్టు ।
మెండగు తట్టుపునుఁగు మెత్తిరి దేవునికి ॥పులు॥ 2

అదె నల్లగలువల నకరువు లుండినట్టు ।
మెదిగి కస్తూరిభూమి మేరువున్నట్టు ।
యెదుట శ్రీ వేంకటేశునెద నలమేల్మంగను ।
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి ॥పులు॥ 3

పెదతిరుమల. శృ.సం. 94 తే.

## శంకరాభరణము

ఏమనిచెప్పుదుమమ్మ యీతని సౌభాగ్యము
కోమలపు జవ్వనము గుఱుతై నట్టుండె ॥పల్లవి॥



ఒట్టుచుఁ గప్పురకాపు ఊడిగపువారెల్లా ।
అట్టె దేవునికి నలఁదగాను ।
దట్టముగ మంచి తెల్లఁ దామెరపువ్వునకు ।
ముట్టి అవయవములు మొలచినట్టుండె ॥ఏమని॥ 1

తనివొంద గిన్నెలతోఁ దట్టుపునుఁగులు దెచ్చి ।
పొలుపొంద దిరుమేనఁ బుయ్యగాను ।
పనివడి గొప్పనిడుపాటి నేరేడుఁబండు ।
కనుపట్టు పురుషాకార మైనట్టుండె ॥ఏమని॥ 2

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా ।
పలువిధముల నించి భావించగాను ।
అలర శ్రీవేంకటేశుం డనెడి పుప్పొడిరాశి ।
వెలయ మరుఁడు ముద్రవేసినట్లుండె ॥ఏమని॥ 3

నేఁడు స్వామినామపుఁగర్పూరచూర్ణమును తిలకపుఁగస్తూరిని బునుఁగుతైలమునుగలపి శ్రీపాదరేణువని వేఱుగాను అభిషేకపు సుగంధితీర్థమును బాదతీర్థమని వేఱుగాను భక్తులకుఁ బ్రసాదించుట జరుగుచుచున్నది. రేవణూరి వేంకటాచార్యుఁడు రచించిన శ్రీపాదరేణు మాహాత్మ్యమున స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరిగిన, కర్పూరధూళితోడి పునుఁగుతైలమును, దన్మిశ్రమయిన పాదతీర్థమును శ్రీపాదరేణు నామమునఁ బ్రస్తుతిగన్నది.

తాళ్ళపాకవారి సంకీర్తనములలో నిప్పటికి నేఁజూచినంతలో పునుగు తైలముతోడి కస్తూరీకర్పూర మిశ్రితమయిన పాదతీర్థమే ప్రస్తుతమయినది గాని నేటి శ్రీపాదరేణుసంకలన రీతిగాని శ్రీపాదరేణునామముగాని కానరాలేదు. ఒక సంకీర్తనము :-

## శంకరాభరణము

శ్రీహరిపాదతీర్థంబే చెడనిమందు ।
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥పల్లవి॥

కారమై కంటగించని కడుఁ జల్లనిమందు ।
నూఱనికాచనియట్టి నున్ననిమందు ।
కోరికతో వెలవెట్టి కొనితేవల్లనిమందు ।
వేరువెల్లంకులు కూర్చనట్టి వెందువోనిమందు ॥శ్రీహరి॥ 1

గుఱుతైనరోగములు గుణముచేసేమందు ।
దురితములు పెడఁబాపే దొడ్డమందు ।
నిరతముబ్రహ్మాదులు నేరుపుతో సేవించేమంద ।
నరకము సొరనట్టి నయమయినమందు ॥శ్రీహరి॥ 2

పొంకముతో భయములు పొందనియ్యనిమందు ।
మంకు బుద్ధులు మాన్పి మన్నించేమందు ।
పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నునిమందు ।
సెంకించక తనదాసులఁ జేపట్టేమందు ॥శ్రీహరి॥ 3

అన్నమాచార్యుని సంకీర్తనములలో గుర్తుస్తుతిపరములుగా రచనలు చాలఁగలవుగాని ఆగురువు పేరేమో సరిగ్గాఁ దెలియరాలేదు. ముద్రాధారణానంతరము వైష్ణవు లీతని బంతి నిడుకొని భుజించిరట (చూ 28 పుట) అన్నమాచార్యునినాఁడే యీ వంశమువారు వైష్ణవు లయిరి. ఈ విషయము నీతని పెద్ద మనుమఁడు చిన తిరుమలాచార్యుఁ డిట్లు చెప్పుకొన్నాఁడు.

## దేసాళం

ఎట్టి హితోపదేశకుం డెటువంటి దయాళువు ।
అట్టే తాళ్ళపాకన్నమాచార్యుఁడు ॥పల్లవి॥

పచ్చితామసుల మమ్మం బరమసాత్వికులఁగా ।
నిచ్చటనే చేసినాఁడు యెంతచిత్రము ।
ఇచ్చగించి మాకులాన నెన్నఁడు లేనివైష్ణవ ।
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥ 1

ముదిరినపాపకర్మములు సేసినట్టి మమ్ము ।
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంతసోద్యము ।



కదిసి యేజన్మానం గాననిసంకీర్తన ।
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥ 2

గడుసుందనవుమమ్ముఁ గడువివేకులఁ జేసి ।
యిడుమ లెల్లాఁ బాపె నేగురుఁడు ।
నడుమనే యెన్నడుఁ గానని శ్రీ వెంకటనాథు ।
నడియాలముగ నిచ్చె నన్నమాచ్యుఁడు ॥ఎట్టి॥ 3

చినతిరు. అధ్యా. 9 ఱేకు.

అన్నమాచార్యచరిత్రమున (చూ 28 పుట.) నిక్కడఁ గొంత గ్రంథపాత మున్నది. అందుఁగొన్న యేండ్ల కాలమేమో గురుసన్నిధి నన్నమాచార్యుఁ డుండుట అతని వెదకికొనుచు నాతనితల్లి తిరుమలకు వచ్చి కొడుకును జూచి యింటికి రమ్మని పిలుచుట ఆతఁడు సమ్మతింపకుండుట అందుపై గురుఁ డేవో దివ్యోపదేశములు చేసి యింటికిఁ బొమ్మని మీ వంశమునఁ బుట్టబోవు వారు మహనీయులు కాఁగలరని యాశీర్వదించుట ప్రధానముగా నుండఁ దగినకథాంశము. తొలుతనింటికిఁబో సమ్మతింప కున్నను గుర్వాజ్ఞ గనుక నన్నమాచార్యుం డెట్టకేలకందుకు సమ్మతించెను. ఈ సందర్భమున సంకీర్తనములున్నవి.

## మలహరి

సర్వోపాయముల జగతి నా కితండె
వుర్విధరుఁడు పురుషోత్తముం డితండె ॥పల్లవి॥చ

సకలగంగాదితీర్థస్నానఫలము లివి
స్వామిపుష్కరిణిజలమె నాకు ।
సకలపుణ్య క్షేత్రవాసయాత్ర లివి
సరివేంకటాచలవిహార మిదియె।
సకలవేదాధ్యయన శాస్త్రపాఠంబు లివి
శౌరిసంకీర్తనం బిదియె నాకు ।
సకలకర్మానుష్ఠానము లితని కిచ్చుటఁ
జాతుపడి కైంకర్య మిదియె ॥సర్వో॥ 1

ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు
 లొగి భుజించుటె నాకు దినదినంబు ।
జపరహస్యోపదేశంబు లితనిపాద
 జలములు శరణనేటి సేవయొకటె ।
ఉపమింపఁ బుణ్యపురుషులదర్శనము నాకు
 నొగి నిచటిబహువృక్షదర్శనంబు ।
యెపుడు బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటి
 యెన్నఁ గలబహుపక్షి కలకలంబు ॥సర్వో॥ 2

తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులఁ
 దగులుసంవాససహయోగంబు ।
వెలయ నిండుమహోత్సవంబు లిన్నియు నితని
 విభవంబు లెసఁగుతిరునాళు నాకు ।
చెలఁగి యిటుదేవతాప్రార్థనింతయు నాకు
 శ్రీ వెంకటేశ్వరుని శరణాగతి
అలరునాసంపదలు యింతిపట్టపురాణి
 అలమేలుమంగకడగంటిచూపు ॥సర్వో॥ 3

అన్న. అధ్యా. 133 తేకు.

## భౌళి

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను॥పల్లవి॥

తనువే వొళవు తలయే దండెకాయ ।
ఘనమైనవూర్పులు రెండు కట్టినత్రాళ్ళు ।
మనసె నీ బద్దితాడు మఱి గుణాలె జీవాళి ।
మొనసినవుట్టుగె మూలమైనకరడి ॥పాడే॥ 1

పాపపుణ్యాలిరువంక పైఁడివెండియనుసులు
పైపైఁ గుత్తికె మేటి పైచనిగె ।
కోపులనాలికె లోనఁ గుచ్చికట్టినట్టిత్రాడు ।
చూపరాని సంసారమె సూత్రపుఁగణిక । ॥పాడే॥ 2



జీవునకు నీదండె సేసిన వాఁడవు నీవు ।
వావాతిమాటలే నీపై వన్నె పదాలు ।
ఈవే మాకు నిహపరా లిచ్చితివి మెచ్చితివి ।
శ్రీ వెంకటేశ నీవే చేకొన్నదాతవూ ॥పాడే॥ 3

అన్న. అధ్యా. 281 తేకు.

## గుండక్రియ

దాఁచుకొని పాదాలకుఁ దగ నేఁ జేసినపూజ లివి ।
పూఁచి నీకీరితి రూపు పుష్పము లివి యయ్యా ॥పల్లవి॥

ఒక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ ।
తక్కినవి భండారాన దాఁచి వుండనీ ।
వెక్కసము నీనామము వెలసులభము ఫలమధికము।
దిక్కై నన్నేలితి వింక నవి తీరనినాధనమయ్యా ॥దాచు॥ 1

నానాలికపై నుండి నానాసంకీర్తనలు ।
పూని నాచే నిన్నుఁ బొగడించితివి।
వేనామాల వెన్నుండా వినుతించ నెంతవాఁడ ।
కానిమ్మని నాకీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥దాచు॥ 2

ఈ మాట గర్వముగాదు నీమహిమే కొనియాడితిఁ గాని ।
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాఁడఁ గాను ।
నేమానం బాడేవాఁడను నేరము లెంచకుమీ ।
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీ వేంకటేశుఁడవయ్యా ॥దాచు॥ 3

అన్న. అధ్యా. 169 తేకు.

## లలిత

బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటి బారి నింకం దోయకు మోయయ్య ॥పల్లవి॥

చిక్కులభవములఁ జేరం జిక్కి వోపలేక ।
నిక్కి నీమఱుఁగు చొచ్చి నిలిచితిని ।

అక్కజమై యల్లనాఁటి అప్పులకర్మము లెల్ల ।
ఇక్కడనే చుట్టుముట్టీ నేమిసేతునయ్య ॥బల్లి॥ 1

లచ్చి సంసారమునకు లగ్గ మచ్చితీరలేక ।
యిచ్చట నిన్నుఁ గొలిచి యెక్కువైతిని ।
పొచ్చుముల నల్ల నాఁటి పూఁటదీరదని కొన్ని ।
బచ్చన బందాలు వచ్చెఁ బాపఁగదవయ్య ॥బల్లి॥ 2

అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక ।
ముంచి నీ పాదాలకు మొఱవెట్టితి ।
పొంచిన శ్రీ వేంకటేశ భువనరక్షకుఁడవు ।
పంచలనున్నాఁడ నన్నుఁ బాలించవయ్య ॥బల్లి॥ 3

అన్న. అధ్యా. 361 ఱేకు.

సకల వేదాంతశాస్త్రము నన్నమయ యధ్యయనముగావించెను. ఈ శతకోప ముని అహోబలమఠ ప్రతిష్ఠాపనాచార్యులయిన యాదివణ్ శఠకోపమునీశ్వరు లగుదురు. అన్నమయనాఁట నీ శఠకోపయతులే వర్తిల్లిరి. ఆముక్తమాల్యదలో శ్రీ కృష్ణదేవరాయలవా రీ శఠకోపయతిని సన్నుతించిరి. (చూ. ఆశ్వా. 7 వచనము) అన్నమాచార్యుఁ డీ యతివర్యు నిట్లు కీర్తించెను.

భైరవి

చూడుఁ డిందఱకు సులభుఁడు హరి ।
తోడునీడ యగు దొరముని యితఁడు ॥పల్లవి॥

కైవల్యమునకు గనకపుఁదాపల ।
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై ।
పావన మొకరూపమై విరజకు ।
నావై యున్నాఁ డిదె యితఁడు ॥చూడు॥ 1

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన ।
దీపమై జగతికిఁ దేజమై ।
పాపా లడపఁగ భవపయోధులకు ।
తేపై యున్నాఁ డిదేయీతఁడు ॥చూడు॥ 2

కరుణానిధికి రంగపతికిఁ గాంచీ ।
వరునకు వేంకటగిరిపతికి ।



నిరతి నహోబలనృకేసరికిఁద ।
త్వరుఁ డగు శఠకోపముని యితండు ॥చూడు॥ 3

అన్న. అధ్యా. 1 వాల్యుం.

అన్నమాచార్యుఁడు మంచిప్రాయముననే రామాయణమెల్ల కీర్తనాత్మకముగా వెలయించెను. (చూ. 30 పుట) అన్నమాచార్యుని సంకీర్తనములలో రామాయణకథా ఘటితములుచాలఁగలవు. అన్నమయ సంకీర్తనము పద్ధతి జగన్మోనమై ప్రఖ్యాతి కెక్కెను. అది విని సాళ్వనరసింగ రాయఁడన్నమయదర్శన మపేక్షించెను. ఈ నరసింగరాయఁడు టంగుటూరి [1] పాలకుఁడని నాళీకబాంధవాన్వయుఁ డని యిందున్నది (చూ. పుట 31) అతఁడు చంద్రవంశమువాఁడని శాసనములందును గ్రంథములందునున్నది. ఇందు నాళీక 'బాంధవా' ఉండుట 'శాత్రవా' ఉండుటకు వ్రాఁతగాని చేతప్పుగాఁ బోలును. నరసింహరాయఁడు విజయనగరపుఁ బ్రథమరాజ వంశ్యుఁడగు విరూపాక్షరాయల తర్వాత నా వంశము నుత్సారించి రాజ్యమాక్రమించు కొన్నాడు. ఇంచుమించుగా నాతఁ డన్నమయవయసువాఁడు. అతఁడు తొలుత దండనాథుఁడుగా విద్యానగరరాజులక్రిందనుండి యారాజుల దౌర్బల్యముచే సనసన్నగఁ బెంపొంది తుదికి విద్యానగరాధీశ్వరుఁ డయినాఁడు. విద్యానగర మాక్రమించుకొనక పూర్వము క్రీ. 1450 ప్రాంతముల నీతఁడు పొత్తపినాఁటి లోని టంగుటూర దండనాథుఁడై ప్రాభవమున వర్తిల్లుచుండఁ బోలును. అన్నమాచార్య చరిత్రమున నాతఁడు 'రాచమూఁకలలో బరాక్రమశాలి' యని కలదు. అతఁ డన్నమాచార్యుని వేఁడికొని తనయూరికిఁ బిలుచుకొనిపోయి నాఁడు. అపుడు "శ్రీకృష్ణుమన్ననఁ గ్రీడి భూచక్ర । మేకచక్రంబుగానేలిన పగిది । నాలాగు మీ సహాయము నాకుఁ గలుగ। నేలుదు ధరయెల్ల నేకచక్ర ముగ" నని తనకోర్కి తెల్పుకొన్నాఁడు. రాయఁడు నన్నమయయుఁ బొంది పొసఁగి టంగుటూరఁ గొన్నాళ్లుండిరి. అన్నమయ యాశీస్సుచే శ్రీ వెంకటేశ్వర స్వామిదయచే నరసింగరాయఁడు వియజనగరరాజ్య మాక్రమించుకొనెను. తిరుపతిశాసనములఁ బట్టియు సాళ్వాభ్యుదయమునుబట్టియు నాతఁడు కొన్నాళ్ళు తిరుపతిదగ్గతిచంద్రగిరిలో రాజ్య మేలినట్లు తెలియనగును. టంగుటూరాతని జన్మస్థలమో దండనాయకతాస్థానమో కాఁబోలును.

1 టంగుటూరు కడపజిల్లా రాజంపేట తాలూకాలో నున్నది.

విజయనగరరాజ్యపు విప్లవ (విరూపాక్ష చంద్రశేఖరరాయల) కాలమున గాఁబోలును కపిలేశ్వర గజపతి యొకమాఱును, పురుషోత్తమ గజపతి యింకొక మాఱును విజయనగరము మీఁదికి దండెత్తి వచ్చిరి. తొలితూరి కొంత కప్పము చెల్లించి విరూపాక్షరాయఁడు గాఁబోలును విజయనగరమును రక్షించుకొనెను. రెండవతూరి పురుషోత్తమ గజపతికి సాళ్వనరసింహరాయఁడుదయగిరి రాజ్యమున నొసంగి విజయనగరమును గాపాడఁగలిగెను.

కపిలేశ్వరజగపతి :-

ప్రసహ్య కర్ణాటమహేపతేః పురీం నిరుధ్య విద్యానగరీం నిజైర్బలైః
సమున్నతం మానమివోచ్ఛ్రయంకరం సమాదదే కర్కశచక్రవిక్రమః

పురుషోత్తమగజపతి :-

యస్మై నిత్యతరప్రతాపదహన జ్వాలాయమానధ్వజ ।
స్తంభాబద్ధకుసుంభరక్తవసన ప్రేక్షావిభగ్నద్విషే ।
సంధాయాభయయాచానాంజలి మహోదత్యోదయాద్రింభయా
దాత్మానం ముముచే నృసింహనృపతిః కర్ణాటదేశాధిపః॥ [1]

చరిత్రకారు లీ సందర్భము నిట్లు గుర్తించిరి.

“విషయాసక్తుఁడగు విరూపాక్షరాయని నాతని పెద్దకొమారుఁడగు రాజశేఖరరాయలు చంపించెను. (౧౪౭౮) ఇతనిని ఈతని తమ్ముడగు రెండవ విరూపాక్ష రాయలు చంపించెను. కాని, యీభ్రాతృహంత పరిపాలనము ప్రజల కిష్టమైనది గాదయ్యెను. అతని దండనాయకుఁడగు సాళువనరసింహ రాజు సర్వజనులు తనకు అనుకూలురుకాఁగా రాజును వెడలఁగొట్టి రాజ్యమును ఆక్రమించుకొనెను. అంత నీ ప్రథమవంశమంతరించెను. (౧౪౮౬) తర్వాత సాళ్వనరసింహరాజు ౧౪౮౬ నుండి ౧౪౯౦ దాఁక రాజ్యమేలెను” [2]

1 అనంతవరం తామ్రశాసనము, భారతిసంవత్సరాది సంచికలోను, కళింగదేశ సంచికలోను ప్రకటితము.

2. మహమ్మదీయమహాయుగము.



సాళ్వనరసింగరాయనికి బ్రహ్మహత్యాపాపము చుట్టుముట్టఁగా దానిని మాధ్వమతాచార్యులగు శ్రీపాదరాయలవారు విడఁగొట్టిరట. ఈ బ్రహ్మ హత్యకారణముగాఁ దిరపతి వేంకటేశ్వరస్వామి యర్చనము నిలిచిపోఁగా వ్యాసరాయలు పంద్రెండేడ్లు స్వామియర్చనము సలిపి నెమ్మదిగా మరల వైఖాన సులఁజేర్చిరట ! శ్రీపాదరాయాష్టకములో నీ శ్లోకమున్నది.

**శ్రీమద్వీరనృసింహరాయనృపతే ర్భూదేవహత్యావ్యథాం**
**దూరీకృత్య తదర్పితోజ్జ్వలమహాసింహాసనే సంస్థితః**
**శ్రీమత్పూర్వ కవాటనామకపురే సర్వేష్టసిద్ధిప్రదః**
**శ్రీ శ్రీపాదయతీంద్ర శేఖరమణి ర్భాయా త్స వః శ్రేయసే.** [1]

క్రీ. 1440 నాఁటికి బదునాఱేండ్లవాఁ డయిన యన్నమాచార్యుఁడీ రాజోప్లవము లెల్ల నెఱుఁగున్నాఁడు. నరసింహరాయల ప్రార్థనమునఁ గాబోలును దఱచుగా విద్యానగరమున కరుగుచు నక్కడ వెలసియున్న వేల్పులపై పెక్కుసంకీర్తనముల రచించినాఁడు. ఆయా కాలములలో నాతని కక్కడిరాజుల దౌర్జన్యములు ప్రత్యక్షము లగుచుండెడివి. రాజ్యలబ్ధికై నాఁటి రాజులు చేసిన పితృభాతృ పుత్రహత్యాదుల నాతఁడు సంకీర్తనములలో వివరించి విలపించినాఁడు.

## శ్రీరాగం

వెఱతు వెఱతు నిందు వేదుకపడ నిట్టి
కుఱుచబుద్ధుల నెట్టు గూడుదునయ్యా ॥పల్లవి॥

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాడు ।
ద్రోహిగాక నేఁడు దొరయటా ।
ఆహికముగ నిట్టి అధమవృత్తికి నే ।
సాహసమున నెట్టు చాలుదునయ్యా ॥కుఱు॥ 1

తోడఁబుట్టినవానిఁ దొడరి చంపెడువాఁడు ।
చూడ దుష్టుఁడుగాక సుకృతియట ।
పాడైన యిటువంటి పాపబుద్ధులు సేసీ ।
నీడ నిలువ నెట్టు నేరుతునయ్యా ॥కుఱు॥ 2

1. దీనిని దొలుత కర్ణాటచరిత్రకారులు గుర్తించిరి.

కొడుకు నున్నతమతిం గోరి చంపెడువాఁడు ।
కడుఁ బాతకుఁడుగాక ఘనుఁడటా ।
కడలేని యిటువంటి కలుషవృత్తికి నాత్మ ।
వొడఁబఱపఁగ నేనెట్లోపుదునయ్యా ॥కుఱు॥ 3

తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడు గాక।
యెల్లవారల కన్న నెక్కుడటా ।
కల్లరి యనుచు లోకము రోయుపని యిది ।
చెల్లఁబోనే నేమిసేయుదు నయ్యా ॥కుఱు॥ 4

యింటివేలుపు వెంకటేశ్వరుఁ దనవెంట ।
వెంటఁ దిప్పెడు వాఁడు విభుఁడటా ।
దంటనై యాతని దాసానుదాసినై
వొంటి నుండెద నేమి నొల్లనోయయ్యా ॥కుఱు॥ 5

అన్న. అధ్యా. 38 రేకు.

విజయనగర రాజ్యము మీదికి (కపిలేశ్వర, పురుషోత్తమ) గజపతులు దండెత్తి వచ్చునపుడో యింకెపుడో అన్నమయ విజయనగరములోనో స్వగ్రామముననో ఉండఁగా నాతని దేవతార్చన విగ్రహములను శత్రువులెత్తుకొని పోవుటో, స్థలముమార్చు గజిబిజిపాటులో నేమో అయిపోవుటో జరగి కాన రాకపోఁగా సంకీర్తనరూపమున నిట్లు విలపించినాఁడు.

బౌళి

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మా కిటువలె ।
పొంది యీతనిఁ బూజించఁ బొద్దాయ నిపుడు ॥పల్లవి॥

ధారుణి మైరావణు దండించి రాముఁ దెచ్చి
నేరువు మించిన యంజనీతనయా ।
ఘోరనాగపాశములఁ గొట్టి వేసి యీతని ।
కారుణ్య మందినట్టి ఖగరాజ గరుడా ॥ఇంది॥ 1

నానాదేతలకు నరసింహుఁ గంభములో ।
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా ।



మానవుఁడౌ కృష్ణుమహిమల విశ్వరూపు ।
పూని బండి నుంచుకొన్న పోటుబంట యర్జునా ॥ఇంది॥ 2

శ్రీ వల్లభునకు నశేషకైంకర్యములా ।
శ్రీ వేంకటాద్రివైన శేషమూరితి ।
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుఁడా యీ ।
దేవుని నీవేళ నిట్టె మాకుఁ దెచ్చి యీయరే ॥ఇంది॥ 3

అన్న. అధ్యా. 373 రేకు.

క్రీ. 1440 ప్రాంతములనో తర్వాతనో తురుష్కులు గాఁబోలును జరపిన దౌర్జన్యము నన్నమాచార్యుఁడిట్లు చెప్పి చెప్పి చింతిల్లినాడు.

రామక్రియ

తతిగాని యీపాటు దైవమా విచారించవే ।
కతలాయఁ జెప్ప నేఁడు కలికాల మహిమా ॥పల్లవి॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు ।
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో ।
అటుబాలుల రొదలు ఆకాశ మెట్టోరిచెనో ।
కటకటా యిట్లాయఁ గలికాలమహిమా ॥తతి॥ 1

అంగలార్చే కామినుల యంగభంగపు దోఁపు ।
లింగితాన మింటసూర్యుఁ డెట్టు చూచెనో ।
పొంగు నానాజాతిచేత భువన మెట్లానెనో ।
కంగి లోక మిట్లాయఁ గలికాలమహిమా ॥తతి॥ 2

అరుదు గోహత్యలు సేయఁగ దూడ లంగలార్వ
సరిధర్మదేవ తెట్టు సమ్మతించెనో ।
పరధనచూఱ కెట్టు పట్టాయనో లక్ష్మి ।
కరుణ యెందణఁగెనో కలికాలమహిమా ॥తతి॥ 3

దేవాలయాలు నానాదేశము లెల్లాఁ జొచ్చి ।
దేవఁగా నెట్లుండిరో దేవతలు ।

తావు లేలే రాజులకు దయ గొంత వుట్టదాయ ।
కావరమే ఘనమాయఁ గలికాలమహిమా ॥తతి॥ 4

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను ।
తెరల కెట్టుండిరో దిక్పాలులు ।
విరసవర్తను లుండే విపరీతకాలమున ।
గరువాలుం గపటాలె కలికాలమహిమా ॥తతి॥ 5

వుపమించి దంపతులు వొకరొకరినిం జూడ ।
చపలదుఃఖములతో నయముఁగాను ।
తపములు జపములు ధర్మము లెం దణఁగెనో ।
కపురుంబాపాలు నిండెఁ గలికాలమహిమా ॥తతి॥ 6

తలలు వట్టీడువఁగాను తల్లులు బిడ్డల వేయ ।
తలఁపెట్టుండెనో యంతర్యామికి ।
మలసి ముక్కులు గోయ మరుఁడెట్టు వోరిచెనో ।
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమా ॥తతి॥ 7

దీనతలోఁబడి గుండెదిగు లసురుసురులు ।
వాని నెట్లు లోఁగొనెనో వాయుదేవుఁడు ।
గూనువంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమా । ॥తతి॥ 8

పలుమాఱు నమ్మించి ప్రాణములు గొనఁగాను ।
యిలఁ దమలోఁ బ్రాణా లెట్లుండెనో ।
నెలవై శ్రీవెంకటేశ నీవే యెఱుంగుదువు ।
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమా ॥తతి॥ 9

అన్న. అధ్యా. 373 తేకు.

గజపతులు విద్యానగరము నాక్రమించినప్పు డాతఁ డొడ్డెబాస నేర్చుకోవలసినవాఁడయినాఁడు గాఁబోలును. దీనిని సంకీర్తనమునఁ జెప్పుకొన్నాడు :-



మాళవి

అన్నియు నాయందె కంటి నన్నిటివాఁడా నేనె ।
మున్నె నా భావముతో ముడిచివేసినది ॥పల్లవి॥

చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి ।
ములిఁగి ముక్తి దలంచి ముక్తుండనైతి ।
పలుమతాలు దలఁచి పాషండబుద్ధినైతి ।
చెలఁగి శ్రీపతిఁ శ్రీవైష్ణవుఁడనైతి ॥అన్ని॥ 1

పొనఁగఁ బుణ్యము సేసి పుణ్యాత్ముఁడనైతి ।
పసలఁ బాపముసేసి పాపకర్ముఁడనైతి ।
వెస బ్రహ్మచారినైతి వేఱే యాచారమున ।
ముసిఁగి మఱొకాచారమున సన్యాసినైతి ॥అన్ని॥ 2

వొగి నొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని ।
తెగి తెలుంగాడ నేర్చి తెలుఁగు వాఁడనైతి ।
అగడై శ్రీ వెంకటేశ అన్నియు విడిచి నేను ।
తగు నీదాసుండ నై దాసరినైతి ॥అన్ని॥ 3

అన్న. అధ్యా. 266 తేకు.

విజయనగరరాజ్య ప్రధానరాజధాని విజయనగరమే అయినను నరసింహరాయఁ డందు స్థిరవాసముచేయలేదేమో ! రాజ్యసర్వస్వాక్రమణానంతరమో, తత్పూర్వమో కొన్నాళ్ళాతఁడు గొప్ప దుర్గమగు పెనుగొండలోఁ గూడ నుండెను గాఁబోలును. అన్నమాచార్యునిఁ బెనుగొండకు రావించుకొని సంకీర్తనములు వినిపింపవేఁడెను.

## అన్నమయ పాడుట

తేనెలపై తేట తిన్నని చెఱకు
పానకముల నేరుపఱిచిన మేలు
చక్కెరలో తీపు చల్లఁ దెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కలయమృతంబు మీఁగడమీదిచవులు
చిలుకుచుఁగవు లెల్లఁ జేయెత్తిమ్రొక్క (చూ. 33 పుట)

నన్నమయ పాడెను. తిరుమలాచార్యుఁడుగాఁబోలును అన్నమాచార్య సంకీర్తనముల నిట్లు సన్నుతించెను.

సురలకు నరులకు సొరిది వినవిన ।
అరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥పల్లవి॥

చక్కెరై చవిచూపీ జాలై తావి చల్లీ ।
నక్కజపుమాఁతు వజ్రాలై మెఱసీని ।
నిక్కుటద్దములై మానిలువు నీడలుచూపీ ।
నక్కరతాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥ 1

పన్నీరై పైఁబూసీఁ గప్రంబై చలువ రేఁచీ ।
మిన్నగల ముత్యము లై మెయినిండీని ।
వెన్ను బలములై మావెంట వెంటఁ దిరిగీని ।
అన్నిట తాళ్ళపాకాన్నమయ్య పదములు ॥సుర॥ 2

నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ ।
పుట్టుతోనె గురువులై బోధించీని ।
గట్టి వరాలిచ్చే శ్రీవేంకటనాథుని మెప్పించీ ।
నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

వానిని విని యానందపరవశుఁడై నరసింహరాయఁ డాచార్యునిఁ జాల సత్కరించెను. పచ్చలకడియాలు మొదలుగా నాభరణాంబరాదులొసఁగెను. అన్నమాచార్యుల కాలముననే తాళ్ళపాకవారికి అగ్రహారములెన్నో ఉన్నట్టున్నవి. ఏలనఁగాఁ దత్పుత్రుఁడు పెదతిరుమలయ్య చాలా అగ్రహారములను స్వామికి సమర్పించెను. అందుఁ గొన్నియేని యన్నమాచార్యుఁడు నరసింగ రాయాదులవల్ల నార్జించి యుండును. అన్నమాచార్యచరిత్రలో 43 పుటలో నిట్లున్నది. "వెంకటాద్రిచెంగటను తనయగ్రహారమైతరచునున్న [1] మరులుంకు (?) నొకజీడిమామిడి దాన॥

1. ఇది "మరువాకర" కావచ్చును. ఈ పేరియగ్రహారమును అన్నమాచార్యుల కుమారుఁడు పెదతిరుమలాచార్యుఁడు స్వామికి సమర్పించెను.



అన్నమాచార్యుఁడు రాజసముతోఁ జాల వైభవముతోఁ గొన్నాళ్ళు వెలుగొందెను. (చూ. 35 పుట )

# అన్నమయ్య శృంగారకీర్తనలు

ఈ రాయఁడు మరల నన్నమాచార్యుని నొకనాఁడు పిలిపించి స్వామి వారిపై రచించిన శృంగార సంకీర్తనములు గొన్నిపాడ వేఁడెను. అన్నమయ పాడెను. (చూ. పుట 36)

చెలులార వెంకటశిఖరినాయకుని
"కలికికిఁ గడగంటఁ గనుపట్టునెఱుపు
చెలువ మేగతి నుండెఁ జెప్పరే" యనిన
"నలుపునఁ బ్రాణేశునాటిన చూపు
నిలువునఁ బెఱుక నూనినశోణితంబు
తలపోయఁ గాదుగాదా యన్నపదము
పలుమఱుఁ బాడించి పాడించి చొక్కినాఁ" డట.

ఆ శృంగార సంకీర్తనమిది.

నాదనామక్రియ

యేమొకో చిగురుటధరమున యెడనెడఁ గస్తురినిండెను ।
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోచిన ।
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు ।
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు ।
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా ॥ఏమొకో॥ 1

పడతికి చనుఁగవమెఱుఁగులు పైపైఁబయ్యద వెలుపల ।
కడుమించిన విధమేమో కనుగొనరే చెలులు ।
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు ।
వెడలఁగ వేసవికాలపు వెన్నెల కాదుకదా । ॥ఏమొకో॥ 2

ముద్దియచెక్కుల కెలఁకుల ముత్యపుజల్లుల చేర్పుల ।
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు ।
గద్దరి తిరువేంకటపతి కౌఁగిట యధరామృతముల ।
అద్దిన సురతపువేళల అందము కాదుగదా ॥ఏమొకో॥ 3

అన్న. శృంగా. 14 ఱేకు

## రాజధిక్కారము

రాయఁడు గర్వించి మైమఱచి వెంకటపతిమీఁది పదములవంటి పదములు నామీఁదఁ జెప్పు మని కోరఁగా అన్నమాచార్యుఁడు "హరి ముకుందునిఁ గొనియాడు నా జిహ్వ నినుఁ గొనియాడంగ నేర" దని చెప్పి తిరస్కరించినాఁడు. (చూ. 36పుట.) ఇట్టికథయే తిరుమళిశై ఆళ్వార్ల చరిత్రము నను గలదు (చూ. పరమ. ఆశ్వా 2. పుట 92 )

### లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము ।
కలిగిన దిదె మాకాపురమూ ॥పల్లవి॥

నరహరికీర్తన నానినజిహ్వ
ఒరుల నుతింపఁగ నోపదు జిహ్వ ।
మురహరుపదముల మ్రొక్కినశిరము ।
పరులవందనకుఁ బరగదుశిరము ॥తల॥ 1

శ్రీపతినే పూజించిన కరములు।
చోఁపి యాచనకుఁ జొరవు కరములు ।
యేపున హరికడ కేఁగినకాళ్ళు ।
పాపులయిండ్లకుఁ బాఱవుకాళ్ళు ॥తల॥ 2

శ్రీ వెంకటపతిఁ జింతించుమనసు ।
దావతి నితరముఁ దలఁచదు మనసు ।
దేవుం డతని యాధీనపు తనువు ।
తేవల నితరాధీనముగాదు ॥తల॥ 3

అన్న. అధ్యా. 135 ఱేకు.



### పాడి

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము ।
నట్టనడిమిదొరలు నా కియ్యవలెనా ॥పల్లవి ॥

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు ।
వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు ।
తల్లి యాకె మగనినే దైవమని కొలిచేము ।
వొల్లనే మా కీసిరులు వొరులియ్యవలెనా ॥పుట్టు॥ 1

గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు ।
ఆమని భూకాంతకు నంగభేదాలు ।
భామిని యాకెమగని ప్రాణధారిలెంకలము ।
వోమి మాకాతఁడె యిచ్చీ వొరులియ్యవలెనా ॥పుట్టు॥ 2

పసగల బ్రహ్మపదవులు బ్రహ్మనిర్మితములు ।
వెస బ్రహ్మతండ్రి శ్రీ వేంకటేశుండు ।
యెసఁగి యాతఁడే మమ్మునేలి యిన్నియు నిచ్చె
వొసఁగిన మా సొమ్ములు వొరులియ్యవలెనా ॥పుట్టు॥ 3

అన్న. అధ్యా. 316 ఱేకు.

### శుద్ధవసంతం

చీచీ వివేకమా చిత్తపువికారమా
యేచి హరిఁగొలువక హీనుఁడాయ జీవుఁడు ॥పల్లవి॥

బతికే నంటాఁ బోయి పయిఁడి వచ్చుకతన।
పతియవసరమునఁ బ్రాణ మిచ్చీని ।
బతు కందులోన నేది పసిఁడి యెక్కడనుండు ।
గతి హరిఁ గొలువక కట్టువడె జీవుండు ॥చీచీ॥ 1

దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలచి వారి ।
కడ్డమునిడుపు మొక్కు నతిదీనుఁడై ।
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాఁడు ।
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుండు ॥చీచీ॥ 2

చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల ।
యీవల శ్రీ వెంకటేశుఁ డింట నున్నాఁడు ।
దేవుఁ డాతఁడె నేఁడు తెలిసి కొలిచెఁగాని ।
భావించ కిన్నాళ్ళదాఁకా భ్రమపడె జీవుండు ॥చీచీ॥ 3

అన్న. అధ్యా. 103 రేకు.

### వరాళి

ఎవ్వరివాఁడాఁ గాను యేమందు నిందుకు ।
నవ్వుచు నాలోని హరి నన్నుఁ గావవే ॥పల్లవి॥

కోపుల రాజుల నెల్ల కొలచి కొన్నాళ్ళు మేను ।
చూపుడుఁ బూఁటవెట్టితి సొగిసి నేను ।
యేపున సంసారమున యిదిగాక కమ్మటాన ।
దావుగ తొర్లుంబూఁట తగిలించుకొంటిని ॥ఎవ్వ॥ 1

మొదలఁగర్మములకు మోసపోయి యీ బ్రదుకు ।
కుదువవెట్టితి నే గుఱిగానకా ।
వెదకి కామునికి విషయములకు నే ।
నదివో నావయసెల్ల నాహివెట్టితిని ॥ఎవ్వ॥ 2

ఇప్పుడే శ్రీవెంకటేశ యీడేర్చి నామనసు ।
కప్పిన గురుఁడు నీకు క్రయమిచ్చెను ।
వొప్పించి రిందఱు బలువుఁడు చేపట్టె ననుచు ।
అప్పు లెల్లఁబాసి నీ సొమ్మైతి నే నయ్యా ॥ఎవ్వ॥ 3

అన్న. అధ్యా. 325 రేకు.

## ఆచార్యునికి సంకెల

రాయఁ డన్నమాచార్యునికి మూరురాయరగండ మని పేరుగల సంకెలవేయించి చెరసాలలోఁ బెట్టించెను. "సంకెల లిడువేళఁ జంపెడు వేళ నంకిలి ఋణదాత లాఁగెడువేళ" ఇత్యాదిగా నాతఁడు సంకీర్తనము చెప్పి సంకెల విదలించుకొన్నాడు. (చూ. 38 పుట.)



### ముఖారి

ఆఁకటివేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱిలేదు ॥పల్లవి॥

కొఱమాలి వున్న వేళ కులము చెడినవేళ ।
చెఱవడి నొరులచేఁ జిక్కినవేళ ।
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక ।
మఱచి తప్పిన నైన మఱిలేదు తెఱఁగు ॥ఆఁక॥ 1

ఆపద వచ్చినవేళ నాఱడిఁ బడిన వేళ ।
పాపవు వేళల భయపడినవేళ ।
వోపినంత హరినామ మొక్కటే గతిగాక ।
మాపుదాఁకాఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ఆఁక॥ 2

సంకెలఁబెట్టినవేళ చంపఁ బిలిచినవేళ ।
అంకిలిగా నప్పులవా రాఁగినవేళ ।
వెంకటేశు నామమే విడిపించ గతిగాక ।
మంకుబుద్ధిఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ఆఁక॥ 3

అన్న. అధ్యా. 26 రేకు.

### దేసాక్షి

నీ దాసులభంగములు నీవు చూతువా ।
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా ॥పల్లవి॥

పాలసముద్రముమీఁదఁ బవళించి నట్టి నీకు ।
బేలలై సురలు మొఱవెట్టినయట్టు ।
వేళతో మామనవులు విన్నవించితిమి నీకు ।
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా ॥నీదాను॥ 1

ద్వారకానగరములో తగ నెత్త మాడే నీకు ।
బీరాన ద్రౌపది మొర వెట్టినయట్టు ।
ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి ।
యేరీతి పరాకు నీకు నింక రక్షించరాదా ॥నీదాను॥ 2

ఎనసి వైకుంఠములో నిందిరఁ గూడున్న నీకు ।
పెనఁగి గజము మొరవెట్టినయట్టు ।
చనవుతో మాకోరిక సారె విన్నవించితిమి ।
విని శ్రీ వెంకటేశుండ వేగ రక్షించరాదా ॥నీదాను॥ 3

అన్న. అధ్యా. 247 ఱేకు.

సామంతం

దాసవర్గముల కెల్లా దరిదాపు మీరే కాన ।
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును ॥పల్లవి॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా ।
శ్రీనాథునికి నేము సేసేవిన్నపము ।
ఆనుక భాష్యకారులు అట్టే మీరుం జేయరాదా ।
మానక విన్నపముల మామనవి చనవులు ॥దాస॥ 1

వేయినోళ్ళభోగి నీవు విన్నపము సేయరాదా ।
వేయేసి మావిన్నపాలు విష్ణునికిని ।
ఆయితమై గరుడండ అట్టే మీరుం జేయరాదా ।
యేయెడ విన్నపు మా కేమి వలసినాను ॥దాస॥ 2

దేవులమ్మ యిందిర మాదిక్కె విన్నవించరాదా ।
శ్రీవెంకటపతికి చిత్తమందను ।
ఆవేళ శేషాచలమ అట్టే మీరుం జేయరాదా ।
యీ వేళ మా విన్నపము లీడేరే నింకను ॥ దాస॥ 3

అన్న. అధ్యా. 247 ఱేకు

ఆచార్యుని మాహాత్మ్యమున కచ్చెరుపడి నరసింగరాయఁడు శరణు వేఁడి యాతనిచే ననుగృహీతుఁ డయ్యెను ( చూ. 39 పుట.)

## రాయలకైంకర్యములు

విజయనగరరాజ్యమున సురక్షితుఁడై నరసింగరాయఁడు 1495 దాఁక రాజ్యమేలెను. సంస్కృతమునఁ దచ్చరితము సాళ్వాభ్యుదయమని రచిత మయ్యెను. రాయఁడే రామాభ్యుదయమని కావ్యము రచించెను. పీఠిక



యీతనిని శ్రీ వెంకటాద్రినాథ దయావర్ధితరాజ్యుఁడని రత్నాంశు మత్కాంచీ వెంకట కాళహస్తి నగరీకల్యాణసౌధాంచల ప్రాంచచ్ఛాశనుఁడనీ తాను గృతిచేసిన జైమిని భారతమున వర్ణించినాఁడు.

శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి కీతఁ డనేకోత్సవ విశేషములు నైవేద్యవిశేషములు, ఆభరణవిశేషములు, ప్రాకారమండప సోపానాది నిర్మాణ విశేషములు ధనవ్యయముతో వెలయించినాఁడు. వానిని గూర్చి శాసనములు పదునాలు గున్నవి. స్వామి కైంకర్యపరాయణులై కొండమీఁదఁ ప్రఖ్యాతి గాంచియున్న కందాళ రామానుజ జియ్యంగారి కీతఁడు శిష్యుఁ డయ్యెను. పై కైంకర్యములు స్వామికిఁ గావించుటలో నన్నమాచార్యులయు నా జియ్యం గార్లయు నుపదేశముల నాతఁడు పాటించు చుండవచ్చును.

## నాఁటి యన్నమయ

ఆనాళ్ళలో నన్నమాచార్యుఁడు తనయగ్రహారములలోను దాళ్ళపాక లోను గొంతకాలము వసించుచువచ్చినను దిగువ తిరుపతిలోను గొండ మీఁద స్వామిసన్నిధిని నెక్కువకాలము గడపుచువచ్చెను. ఆ చోట్ల గృహాది వసతులాతనికాలముననే యేర్పడెను. ఆతని కుమారుని నాళ్ళలోఁ గొండ మీదను దిగువ తిరుపతిలోను దమగృహములముందు మండపముల గట్టించి యక్కడ స్వామిని వేంచేపు చేయించి యుత్సవాదులు జరపించుట సాగెను.

గుండక్రియ

కోటికిం బడగయెత్తి కొంకనేల ।
యీటులేని పదమెక్కి ఇంకనేల చింత ॥పల్లవి॥

పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలఁ జిన్న కౌపీనము ।
పట్టినది శ్రీహరిపాదపద్మమూలము ।
యెట్టయినా మాకుమేలె యింకనేల చింత ॥కోటి॥ 1

చిక్కినాలో నైనది శ్రీవైష్ణవధర్మము ।
తొక్కినది భవముల తుది పదము ।

యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగు ।
యెక్కువ కెక్కువేకాక యింకనేల చింత ॥కోటి॥ 2

చిత్తములో నిండినది శ్రీపతిరూపము ।
హత్తినది వైరాగ్య మాత్మధనము ।
యెత్తలం జూచినమాకు నిదివో శ్రీ వేంకటేశుఁ ।
డెత్తి మముఁ గావఁగాను యింకనేల చింత । ॥కోటి॥ 3

అన్న. అధ్యా. 307 ఱేకు.

## కొండకుఁ బయనము

అన్నమాచార్యుఁడు పెనుగొండ (రాయలయాస్థాని)నో, తాళ్ళపాకనో, వీడి స్వామిని దర్శింప రాఁగోరి చెప్పిన సంకీర్తనము :-

లలిత

రామకృష్ణ నీవు నందె రాజ్యమేలుచుండుదువు ।
యేమి సేసే విక్కడ నీయిరవుకే పదవే ॥పల్లవి॥

లంక విభీషణునుంచ లక్ష్మణుని నంపినట్టు ।
అంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు ।
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
వెంకటాద్రి పొంతనుండ వేగ మమ్మునంపవే ॥రామ॥ 1

ఘనకిరీటము దేను గరుడని నంపినట్లు ।
అనుఁగుఁ గపులనిండ్ల కంపినట్టు ।
వొనర గోపికలొద్ద కుద్ధవుని నంపినట్లు ।
ననుపు శేషాద్రి నుండ నన్ను నంపవే ॥రామ॥ 2

పెండిలికిఁ బరుషలఁబిలువఁగ నంపినట్టు।
అండనె ముందరఁ గంత కంపినయట్టు ।
వెండియు శ్రీవెంకటేశ వెంట వచ్చి మరలితి ।
వుండుచోటనుండి నన్ను వూడిగాన కంపవే ॥రామ॥ 3

అన్న. అధ్యా. 275 ఱేకు.



## అన్నలజోల

అన్నమాచార్యుఁడు శృంగారమంజరి [1] యను మంజరీచ్ఛందోమయ రచనను భాషచే భావముచే శృంగారసుందరమైనదానిని శ్రీ వెంకటేశ్వర స్వామివారిపై రచింపఁగాఁ జిత్తగించి స్వామి యన్నమాచార్యు నిట్లనుగ్రహించెను.( చూ. పుట. 41)

శృంగారమంజరిఁ జేసి శేషాద్రి
శృంగవాసునకు నర్పించి యిచ్చుటయు
నాడుచుఁ బతకమాకన్నల జోల
పాడఁగ నాఁడెల్ల బసిబిడ్డనైతి
నాకృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి
రాకఁ గొన్నాళ్ళు విరక్తుండనైతి
జగతి నీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచిప్రాయపువాఁడ నయితి
నని వెంకటేశ్వరు డన్నమాచార్యుఁ
గనుఁగొని వాత్రుచ్చి గారవించుటయు

పై గ్రంథభాగమునఁ దొలుత పతకమాకన్నలజోల తర్వాత కృష్ణమాచార్యునధ్యాత్మవినుతి కలవు. కృష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాపరుద్రుని నాఁటివాఁడు. కాన, యాతని వినుతికి ముందు గల పతకమా కన్నలజోల యంత కింకను బ్రాచీనము కాఁబోలును. అదియెట్టిదో యెక్కడేని కలదేమో తెలియఁ జాలకున్నాను. వాక్యము సరిగానున్నదో లేదో కూడఁ దెలియదు. పతకమాక ఊరిపేరేమో ! అది పతకమాకో లేక పతకమూరో పొతకమూరో ఇంకేదో ఆయూరివాఁ డయిన అన్నలు అనుగేయకవి జోలపాట రచించి యాడుచు నొండె స్వామి బాలుఁడై యాడఁగానొండెఁబాడెడివాఁడని యర్థము. కాఁబోలును. పయి, పతకమాకయన్నలజోల సుప్రఖ్యాతమయి తాళ్ళపాకవారు మెచ్చినదయి యుండును.

రాగిఱేకులలో అన్నమాచార్యుఁడు రచించినవే యనేకములు జోలలు

1. ముద్రితము. తాళ్ళపాకరచనలు 1 వాల్యుం.

న్నవి. వేలకొలఁదిగా నున్నయా శృంగారసంకీర్తనలెల్ల నిఁక సుపరిశోధితములు ముద్రితములును గావలసియున్నవి.

## అన్నమయ జోల

ఇటీవల నొక జోలపాటను లోకమున వ్యాపించిన దానిని నన్నమాచార్యుని పేరనుండుట గుర్తించితిని. [1]

రాగం. అటతాళం

జో వచ్యుతానంద జోజో ముకుంద ।
రావె పరమానంద రామగోవింద ॥జోజో॥

అంగజునిగన్న మాయన్న యిటు రారా ।
బంగారుగిన్నెలోఁ బాలు పోసేరా ।
దొంగ నీవనిసతులు పొంగుచున్నారా ।
ముంగిట నాడరా మోహనాకారా ॥జో॥ 1

గోవర్ధనం బెల్ల గొడుగుగాఁ బట్టి ।
కావరమ్మున నున్నకంసుఁ బడగొట్టి ।
నీవు మధురాపురము నేలఁ జేపట్టి ।
ఠీవితో నేలిన దేవకిపట్టి ॥జో॥ 2

అంగుగాఁ దాళ్ళ పాకాన్నయ్య చాల ।
శృంగారరచనగాఁ జెప్పె నీజోల ।
సంగతిగ సకలసంపదల నీవేళ ।
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥జోల॥ 3

ఈ జోలలో అన్నమాచార్యుని పేరున్నది గాని యది తిరుపట్ల బాలగోపాలదేవునిముద్రతో మాత్రమే యున్నది. నేను ముప్పదేండ్లకుఁ

1. శ్రీ విస్సా అప్పారావుగారి యింట వారి పూర్వులు వ్రాసి యుంచుకొన్న మంచి సంకీర్తనముల సంచయములోనిది. చిరంజీవి తి. కోదండరామయ్య ఆంధ్ర 8-9-48 వార పత్రికలోఁ బ్రకటించెను.



బూర్వము తంజావూరి లైబ్రరినుండి ఈ జోల కొన్ని చరణములు వ్రాసియుంచు కొనుట నిటీవలఁ జూచితిని. అది వేఱుతీరుగానున్నట్టున్నది. అందీ చరణమున్నది :-

అలిగి తృణావర్తు నవనిఁ గూల్చితివి।
బలిమిమైఁ బూతనఁ బట్టి పీల్చితివి ।
చెలఁగి శకటాసురునిఁ జేరి డొల్చితివి ।
తలఁచి మద్దులు రెండు ధరణి వ్రాల్చితివి ॥

అన్నమయ శ్రీ వెంకటేశ్వరస్వామి మీఁదనే కాక యింక ననేకపుణ్యక్షేత్రము లలోని దేవతలమీఁదఁగూడ సంకీర్తనములు రచించినాఁడు. ఆ సంకీర్తనము లలోఁ బెక్కింట నాయాక్షేత్రముల దేవతలపేర్లతో నభేదముగల్పించి తుదిచరణమున శ్రీ తిరుపతి వెంకటేశ్వరస్వామి నామముద్రికను నెట్టుకొల్పు చుండును. ఈ జోలలో స్వామినామముద్ర లేదు. ఇది యిక్కడి రాగిరేకు లలో నున్నదో లేదో.

## అన్నమయ లాలి

తంజావూరిపుస్తకశాలనుండి యిటీవలఁ గొన్ని తాళ్ళపాకసంకీర్తన ములు వ్రాయించి తెప్పించితిమి. అందు మీఁదిజోలవంటి దొకలాలి కలదు. దానఁగూడ గండవరపు బాలగోపాలుని నామాంక మున్నదిగాని శ్రీ వెంకటే శ్వరస్వామినామాంకము గానరాదు. అన్నమయపేరందు లేకపోయినను గండవరము తాళ్ళపాకవారికిఁ జెల్లుచువచ్చినగ్రామమని తెలియుటచేఁ దమయూరిస్వామి మీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్రపౌత్రులో దానిని రచించి యుందురనుకొంటిని, అది యిది :-

శ్రీరాగం. జంపెతాళం

లా లనుచు నూచేరు లలన లిరుగడల ।
బాల గండవరగోపాల నినుఁ జాల ॥పల్లవి॥

ఉదుటుగుబ్బలసరము లుయ్యాల లూఁగ ।
పదరి కంకణరవము బహుగతుల మ్రోఁగ ।

వొదిఁగి చెంపలకొప్పు లొక్కింత వీఁగ ।
ముదురుచెమటల నళికములు తొప్పఁదోఁగ ॥లాలి॥ 1

సొలపు తెలిగన్నుఁగవచూపు లిరువంక ।
మలయురవళులకుఁ బలుమాఱును బెళంక ।
కొలఁది కోవిలగములు క్రోలుమదనాంక ।
ములఁ గ్రేణిసేయు రవములు వడిఁ దలంక ॥లాలి॥ 2

సరసపదములు జంగచాపుచేఁ బాయ ।
గురులీల మీఁగాళ్ల గుచ్చెళ్ళు రాయ ।
కరమూలముల కాంతి కడుఁజాయఁ జేయ ।
సరస నురుకుసుమవాసన లెదురు డాయ ॥లాలి॥ 3

కొలఁది నునుమేను లతకూన లసియాడ ।
మెలఁకువతొ నొకరొకరి మెచ్చి సరిగూడ ।
తల లూఁచి చొక్కి చిత్తరుబొమ్మలాడ।
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥లాలి॥ 4

లలిత తాంబూలరసకలితంబు లైన ।
తళుకుదంతములు కెంపులగుంపులీన ।
మొలకవెన్నెలడాలు ముసురుకొనితోన ।
చెలఁగి సెలవుల ముద్దుచిఱునవ్వులాన ॥లాలి॥ 5

మలయమారుతగతులు మాటికిఁ జెలంగ ।
పలుకుఁగపురపుతావి పైపై మెలంగ।
బలుగాన లహరి యింపుల రా ల్గరంగ ।
బలసి వినువారిచెవి బడలిక దొలంగ ॥లాలి॥ 6

లలనాజనాపాంగ లలితసుమచాప ।
జలజలోచనదేవ సద్గుణకలాప ।
తలఁపులోపల మెలఁగు తత్వప్రదీప ।
భళిర గండవరేశ పరమాత్మరూప ॥లాలి॥ 7



# అన్నమయ మహిమలు

మండెమురాయనామక నరసింహదండనేత్రు (తృ?)న కిష్టధనబల స్ఫూర్తినిత్యాదివాక్యములకు (చూ 43 పుట) స్పష్టముగా నర్థమెఱుఁగరాదు. మండెమురాయఁ డన్నపేరు మండెముగ్రామమున వెలసిన నరసింహస్వామికిఁ గలదు. చండనేత్రుఁ డనియో? దండనేత్రుఁడనియో? దండనేతృఁడని దిద్ది దండనాథుఁడని యర్థముగుదుర్చు కొనఁగా నాతఁడు సాళువనరసింహరాయని విద్యానగర సామ్రాజ్యలాభమునకుఁ జాలఁ దోడుపడినవాఁడును, నరసింగ రాయని తర్వాత నిమ్మడినరసింహరాయఁ డను తత్పుత్రుడు పేరి కల్పకాలము రాజుగా నున్నను విద్యానగర సామ్రాజ్యము నాక్రమించుకొన్నవాఁడును నగు నరసింహదండనాథుఁడు కాఁగలఁడు. అన్నమాచార్యు నగ్రహారము మరులుంకు (మరువాకరై?) ఆదండనాథున కిష్టమగు ధనబలస్ఫూర్తి కలది గాఁబోలును. (చూ 43 పుట) ఆ గ్రామమునఁ గల జీడికంపుపుల్ల మామిడి పండ్లను స్వామికి నివేదనచేసి తా నారగింపఁగా నన్నమాచార్యునకుఁ బండ్లు పులిసెను. అపచారము క్షమింప స్వామినివేఁడి దానిని దియ్యమామిడిని జేయ నర్థింపఁగా స్వామియనుగ్రహమున నది తియ్యమామిడి యయ్యెను. ఆ విషయము నీ యన్నమాచార్య చరిత్రమేకాక పెదతిరుమలాచార్యునిఁ గూర్చియున్న సంకీర్తనము కూడ నిరూపించు చున్నది.

(రాగము పేరు లేదు )

కరము జీడిపులుసు గలిగిన మామిడి కరముసోకిన యంతనే ।
సరవిఁజక్కెరవలెఁ జవిగలిగించువాని చనవరిసుతుఁడితఁడే ॥పల్లవి॥

వేఁకరి మండెముకోట వెళ్ళుతా విచ్చనవిడిరాఁగా వొక ।
వీఁకతో వేసిన కత్తి తునుకలాయ వెన్ను సోకినయంతనే ।
ఆకాలమునాఁడు రాతినాతిఁ జేసె అతడేపో యీతఁడు ।
వాకుచ్చి పొగడరొ ఘనపుణ్యము తాళపాకతిరుమలయ్యను ॥కర॥ 1

గుములుగూడి యలుఁగులు తిరుగబాఱిచుట్టుకొన్న కురువదోవనతఁడు।
కమలనయనునిఁదలఁచినమాత్రాన కకపికలైపాఱెను ।
అమరఁబాంచాలికి వలువ లొసఁగి నతఁడె వోయీతఁడు ।
ప్రమదముతోడుత పేరుకొనరే తాళపాకతిరుమలయ్యను ॥కర॥ 2

దేవుఁడొక కన్నుదయచేసి తనవద్దికి నంపిన నతఁడు ।
పావనుఁ డితఁడు తానొక్కకన్నిచ్చె పరుషలు చూడఁగా ।
శ్రీవెంకటప్పని సేవచేయఁగోరి చేకొన్నతను వితఁడు ।
భావించి పొగడరొ భాగ్యముగల తాళపాకతిరుమలయ్యను ॥కర॥ 3
శేషాచార్యులవారి వ్రాఁతప్రతి

ఈ సంకీర్తనమున, 2.3. చరణముల విషయములు పెదతిరుమలాచార్యునికి సంబంధించినవి. ప్రజ లన్నమయ మాహాత్మ్యమును వశ్యవాక్కును దెలిసికొని యేవేవో యర్థించి వెంటాడసాగిరి.

ఆ వార్తవిని జను లరుదంది కొనుచు
వావిరి నొడి వళావళికి గాఁ బెగడి
చెలువొందు నా గురుశ్రీపాదరక్ష
తలనిడి తమయాపదల వీడుకొనిరి

అమాయికప్రజల యీ యలజడికి జడిసి చేసిన సంకీర్తనము :-

ముఖారి

పరమాత్మ నిన్నుఁ గొల్చి బ్రదికేము ।
విరసపు జాలిఁ జిక్కి వెతఁబడ నోపము ॥పల్లవి॥

మగఁడు విడిచినా మామ విడువని యట్లు ।
నగినా మనసు రోసినా లోకులు మానరు ।
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు ।
మొగ మోటలను నేను మోసపోవ నోపను ॥పర॥ 1

పొసఁగ దేవుఁడిచ్చినా పూజరి వరమీఁడు ।
విసిగి నేవిడిచినా విడువరు లోకులు ।
కొసరేరు ముసరేరు కోరిక దీర్చుమనేరు ।
పసలేని పనులకు బడలనే నోపను ॥పర॥ 2

నుదుగుట దప్పినా నోముఫల మిచ్చినట్లు ।
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు ।
తడవేరు తగిలేరు తామె శ్రీవెంకటేశ ।
బుడిబుడి సంగాతాలఁ బొరల నే నోపను ॥పర॥ 3
అన్న. అధ్యా. 232 ఱేకు.



# అన్నమాచార్య పురందరదాసులు

కర్ణాటభాషలో వేలకొలఁది సంకీర్తనముల రచించి మహానుభావుఁడని ప్రఖ్యాతి గాంచిన శ్రీపురందరదాసుఁ డన్నమాచార్యుని దర్శింప వచ్చి యతని సంకీర్తనములు విని తనిసి నీవు శ్రీ వెంకటేశ్వరుని యవతారమవేయని సన్నుతింపఁగా నన్నమాచార్యుఁడు పురందరదాసుని సంకీర్తన ములు విని తనిసి నీవు శ్రీపాండురంగవిట్ఠలుని యవతారమవేయని సన్నుతించె నట. (చూ. 44, పుట.) పురందరదాసులవారు శ్రీవ్యాస తీర్థులవారి శిష్యులని ప్రతీతి. వ్యాసతీర్థులవారు సాళ్వనరసింగరాయనికాలమునఁ గూడఁగలరు. శ్రీకృష్ణరాయలకు వారు గురువులు. వయసున చిన్నవారయినను వ్యాసతీర్థులను సన్యాసాశ్రమ స్వీకారముచే గురువర్యులనుగాఁ బురందరదాసులవారు పూజించియుందురు. అన్నమాచార్యుని వార్ధకమునఁ బురందర దాసులవారు చాలఁ జిన్నవారై దర్శించి యుందురు. పురందరదాసుల వారన్నమార్యుల సంకీర్తనముల ననుకరించి సంకీర్తనముల రచించిరి. మచ్చునకొక్కటి :-

మాళవిరాగం

శరణుశరణు సురేంద్ర సన్నుత శరణుశ్రీసతివల్లభా ।
శరణురాక్షసగర్వ సంహర శరణు వెంకటనాయకా ॥పల్లవి॥

కమలధరుఁడును కమలపుత్రుఁడు కమలశత్రుఁడు పుత్రుఁడు ।
క్రమముతో మీకొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ॥శర॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమర కిన్నర సిద్ధులు ।
ఘనతతో రంభాదికాంతలు కాచినా రెచ్చరికయా ॥శర॥

ఎన్నఁగల ప్రహ్లాదముఖ్యులు నిన్నుఁ గొలువఁగ వచ్చిరీ ।
విన్నపము వినవయ్య తిరుపతి వెంకటాచలనాయకా ॥శర॥

భజనపద్ధతిలో అన్నమార్యునిదిగా నాఁటనుండి నేఁటిదాఁక సాగుచున్న యీ పై సంకీర్తనమును జదివి పురందరదాసుగారి యీ క్రింది సంకీర్తనమును గూడఁ జదువుఁడు.

మాళి రాగం

శరణు శరణు సురేంద్ర వందిత శరణు శ్రీపతిసేవిత ।
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక ॥పల్లవి॥

నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణప్రియనె ।
తటిల్లతాంకిత కోమలాంగనె కర్ణకుండల ధారనె ॥శర॥

బటువుముత్తిన పదకహారనె బాహు హస్తచరుష్కనె ।
ఇట్టితొడగియు హేమకంకణ పాశ అంకుశ ధారనె ॥శర॥

కుక్షియొళు మహోలంబోదరనె ఇక్షుచాప గెలిదనె ।
పక్షివాహన నాద పురందరవిట్ఠలన నిజదాసనె ॥శర॥

అన్నమాచార్యుల వారి సంకీర్తనచ్ఛాయనే పురందరదాసులవారి కీర్తన మున్నది.

## సంకీర్తన సంఖ్య

అన్నమాచార్యుఁడు యోగవైరాగ్య శృంగార మార్గములలో ముప్పది రెండువేల సంకీర్తనములఁ జెప్పెనని కలదు. (చూ. 45 పుట.) ఆతఁడు తన పదునాఱేండ్లవయసున నుపక్రమించి దివ్యధామ మందుదాఁక దినమున కొక సంకీర్తనము చొప్పున సంకీర్తనములు రచించినట్లున్నది.[1] అట్లు లెక్కింపగా నించుమించుగా నిర్వదిమూఁడువేల సంకీర్తనములు లెక్కకు వచ్చును. ఇందు ముప్పదిరెండువేల సంకీర్తనములు రచించినట్లున్నది. "పరమతంత్రమ్ములిర్వ ది రెండువేలు॥ అని యుండవలెనో. కానిచో, ఆ రాగిరేకు మీఁదివాక్యమునకుఁ బ్రతిదినము నొక్కదానికిఁ దక్కువ కానీక సంకీర్తనములు రచించుచుండెనని యర్థము చెప్పికొనవలెనో. రెండవ తీరనుకొందుమేని ముప్పది రెండువేల సంకీర్తనములు రచించెననుట సంగతమే. రచించిన యా సంకీర్తనములెల్ల రాగిరేకుల కెక్కనే లేదో? ఎక్కినను నిప్పుడు మనకు దొరకలేదో? తిరుపతి దేవస్థానమునఁ గాక అహోబలమునకుఁ గొన్ని రేకులు చేరియున్నట్లు

1. (చూ) అన్నమాచార్యుల శృంగార సంకీర్తనముల మొదటి తేకు అధ్యాత్మ సంకీర్తనముల మొదటి తేకు.



తెలియుచున్నదిగదా. ఇంక నెన్ని యెప్పుడెక్కడికిఁ జేరినవో? క్రీ. 1560 ప్రాంతముల దాఁక సంకీర్తనములను రాగిమీఁదఁ జెక్కించుట జరగినట్లున్నది. విద్యానగర విప్లవముమూలమున దక్కిన వానిఁ జెక్కించుట సాగక తాళపత్ర ములమీఁదనే యుంపఁగా కాలవశమున నవియుఁ జెడియుండును. 1560 క్రీ. పూర్వమే కొన్ని సంకీర్తనములు తంజావూరికిఁ జేరియుండును. అక్కడఁ గలసంకీర్తనము లన్నియుఁ దిరుపతి రాగితేకులమీఁద నున్నవోలేవో? శేషాచార్యులవారి తాళపత్రప్రతిలోని సంకీర్తనములు గూడ నన్నియు రాగి తేకులమీఁది కెక్కినవోలేవో? పెదతిరుమలాచార్యుఁడుగూడ దినమున కొక సంకీర్తనము చొప్పునఁ దండ్రియానతిని రచించెను. అవికొన్ని వేలుండవలెను గదా! కానరావు.

## ద్విపద రామాయణము

అన్నమాచార్యుఁడు ద్విపదముగా నవముగా రామాయణమును గూడ రచించెనట. ద్విపదరచనమంతకు ముం దింకొకటి కలదని సూచించుటకు నవముగా ననుట. ఈతని రామాయణరచనము నేఁడు గానరాదు కాని, రామాయణకథాప్రసక్తములు సంకీర్తనము లనేకము లున్నవి. రాగితేకులమీఁద నన్నమాచార్యుల సంకీర్తనములను శృంగారమంజరిని మాత్రమే తత్పుత్రుఁడు పెదతిరుమలాచార్యుఁడు చెక్కించెను గాఁబోలును.[1]

1. తిరుపతి దేవస్థానమునగల రాగిరేకులలోనన్నమాచార్యుల రచనములను కొనఁదగినవి యించుమించుగా రెండువేలుండును. అన్నమాచార్యుని సంకీర్తనముల తొలిరేకున నామాంకముగలిగి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఇత్యాది క్రమ సంఖ్యాంకములతో రేకుల యడ్డము నిడుపుల సమపరిమాణముతో నున్న రేకులసంఖ్యను ఇంచుమించుగా రేకున కాఱు పాటల చొప్పుననున్న పాటలసంఖ్యను, బరిగణించి యీ మొత్తము గుర్తింపఁగల్గితిమి. అట్లె తొలిరేకుపై పెదతిరుమలాచార్యుల నామాంకముతో 1,2,3, సంఖ్యాక్రమముగల రేకులను వానియడ్డము నిడువుకొల్తల పృథక్త్వమును గమనించి పెదతిరుమలాచార్యుల సంకీర్తనముల సంఖ్యను, చిన్నతిరుమలాచార్యుల సంకీర్తనముల సంఖ్యను గుర్తింపఁగల్గితిమి.

కాని, యన్నమాచార్యులరేకులని కొల్తలపరిమాణము, సంఖ్యాను పూర్వియుగల రేకులలోఁగూడఁ గొన్ని యన్నమాచార్యులప్రసక్తములు తత్పుత్రుఁడో పౌత్రుడో రచించినవికూడఁ గలసెఁగాఁ బోలునని కొన్ని సంకీర్తనములలోని విషయములఁబట్టి సందేహింప నవకాశముకలిగినది.

# వేంకటాచలమాహాత్మ్యము

సంస్కృతభాషలో శ్రీవేంకటాచలమాహాత్మ్యము నన్నమాచార్యుఁడు రచించెను. (చూ. 46 పుట.) వరాహపురాణాదులలోనిదిగా సంఘటితమయి పదునేడు పదునెనిమిది శతాబ్దముల పిదప తెల్గు పరివర్తనము పడసి ప్రాచీనతాళ పత్త్రప్రతులు గలిగి యిప్పుడు నాగరాంధ్రాక్షరములలో ముద్రితమై వ్యాప్తిగాంచియున్న వేంకటాచల మాహాత్మ్యము నాఁడు తాళ్ళపాక యన్నమాచార్యుఁడు రచించినది యయినను గావచ్చును. అష్టాదశపురాణములలోఁ జేరినవిగాఁగానవచ్చు స్థలమాహాత్మ్యముల నన్నింటిని నమకూర్చి గ్రంథసంఖ్యను గణించినచో నష్టాదశపురాణములకుఁ బ్రాచీనులే పరిగణించిన గ్రంథసంఖ్య కంటె నీ స్థలమాహాత్మ్యముల గ్రంథసంఖ్య చాల మీఱి పోఁగలదు. వ్రాఁతప్రతులుగలిగి పురాణక్రమ నిర్వచనమునఁ జెప్పఁబడిన యానుపూర్విగలిగి యనేక స్థలములం దుపలభ్యమానము లగుటచే ముద్రితములయిన యష్టాదశపురాణములలో నాయాస్థలపురాణములు నూటికిఁ దొంబది తొమ్మిది వంతులు గానవచ్చుటలేదు. పురాణపు ముద్రాపకులు కొన్ని స్థలపురాణములను నేఁటిపురాణముద్రణములందుఁ జేర్చుటయు జరగకపోలేదు. అది యొక మహత్తరచర్చ. అధ్యాయసంఖ్యలు, పురాణముల పేళ్ళు ఉన్నను నేటి స్థలపురాణము లెల్ల నాయాపురాణములలో దొలుత రచితములు గావనుట ప్రఖ్యాత సత్యార్థము. ఇంచుమించుగా నిట్టిస్థలమాహాత్మ్యములు పదుమూఁడు పదునాల్గు శతాబ్దములనుండి నిన్నటినేఁటి దాఁకఁ గూడ నుప్పతిల్లుచునేయున్నవి. కాన, అన్నమాచార్యుఁడు రచించినాఁడన్న వేంకటాచలమాహాత్మ్యమిప్పుడు ప్రఖ్యాతముగానున్న వేంకటాచలమాహాత్మ్యము కావచ్చుననుట విద్దూరపడవలసిన విషయముకాదు. ఆతఁడేదో సంస్కృతము ననుసరించి తెల్గున స్థలమాహాత్మ్యము రచించెననఁ గాదు. "దివ్యభాష। నా వేంకటాద్రిమాహాత్మ్య మంతయును। రచించె" నని కలదు. జియ్యర్ రామానుజయ్యంగా రనువారు క్రీ. 1491 నాఁడు (అప్పటి కన్నమాచార్యుఁ డఱువది యేడేండ్ల వయసువాఁడు) తాను విన్నపముచేసిన తిరువేంకటాచలమాహాత్మ్యమునకు శ్రీ స్వామివారు స్వీకారము చిత్తగించి ఆలకింప ననుగ్రహించునట్లు చేయుటకును, గొన్ని యుత్సవములు జరుపుటకును ఉభయముగాఁ గొంతద్రవ్య మొసఁగి స్థానాధిపతులచే శిలాశాసనము చెక్కింపించుకొన్నారు.[1]

1. చూ- తిరుపతి శిలాశాసనముల వాల్యూం 2 నెం 95 శాసనము.



ఆ రామానుజ జియ్యంగారు కవీశ్వరుఁ డయిన యన్నమాచార్యునిచే వేంకటాద్రి మాహాత్మ్యమును రచింపించి తనసమర్పణముగా స్వామిసన్నిధిని విన్నవింపఁ గోరియుండవచ్చును. పెదతిరుమలాచార్యుఁడు స్వామిసన్నిధిని వేంకటాచల మాహాత్మ్యమును బఠించుటకుఁగాను అనంతాచార్యు లనువారికిఁ గొంత జీవిక యేర్పఱిచెనట. అది పితృదేవరచితమన్న యభిమానముచేఁ జేసిన దయినఁ గావచ్చును. అంతకుఁబూర్వమే యీస్థలమాహాత్మ్య సముచ్చయము కలదని నిరూపింపఁగల సాధనములు గానరా నంతవఱకు నిది యన్నమాచార్య రచితమని తలఁచుట యసంగతముగాదు. ఇప్పుడున్న పురాణములలోని వేంకటాచలమాహాత్మ్య భాగములు వేర్వేఱు రచనము లనుకొన్నచో నందుఁ గొన్ని యయినను నీతని రచనములు గావచ్చును.

వరాహ, బ్రహ్మాండములలో వేంకటేశ్వర విషయ మున్న ట్టీక్రింది సంకీర్త నమున నన్నమాచార్యుఁడో పెదతిరుమలాచార్యుఁడో చెప్పినాఁడు.

బౌళి

శ్రీవేంకటేశుఁడు శ్రీపతియు నితఁడె।
పావనపు వైకుంతపతియును నితఁడె ॥పల్లవి॥

భాగవతములోఁ జెప్పె బలరాము తీర్థయాత్ర ।
నాగమోక్తమైన దైవత మాతం డితఁడె ।
బాగుగా బ్రహ్మాండ పురాణపద్ధతియాతఁ డితఁడె ।
యోగమై వామనపురాణోక్తదైవ మీతఁడె ॥శ్రీవేంక॥ 1

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము ।
లలరఁ జేసినదేవుఁ డాతఁ డితఁడె ।
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి।
కలిమిఁ దపము సేసి కన్న దేవుఁ డితండె ॥శ్రీవేంక॥ 2

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు ।
తక్కక కొలిచియున్న తత్త్వ మీతఁడె ।
చక్క నారదాదుల సంకీర్తనకుఁ జొక్కి ।
నిక్కిన శ్రీ వేంకటాద్రి నిలయుఁడు నితఁడె ॥శ్రీవేంక॥ 3

అన్న. అధ్యా. 87 ఱేకు.

నేఁటి వేంకటాచలమాహాత్మ్య కథలు సంకీర్తనములలో నంతగాఁ గానరాకున్నవి. కొన్ని స్థానికదేశిగాథ లున్నవి. ( చూ. 25 పీఠిక పుట)

## ఇతర గ్రంథములు

అన్నమాచార్యుఁడు పండ్రెండు శతకములు రచించెనట. సకల భాష లందును ప్రతిలేని నానాప్రబంధములు రచించెనట. అన్నమాచార్యుని వేంక టేశ్వర శతకమొకటి నేను ప్రకటించిన ప్రబంధరత్నావళిలో నుదాహృతమ యినది. దేవస్థానపు రాగిరేకులలోఁ గానరావు. అలమేల్మంగాంబమీఁద నీతఁడు రచించిన శతక మిదే (చూ.పీఠిక 16పు). మఱి మిగిలిన పదిశతకములు నేయే వేల్పులమీఁద రచితము లయ్యెనో వాని పేళ్ళేమో తెలియరాదు. ఇవిగాక యన్నమాచార్యుని పౌత్రుఁడు చిన తిరుమలాచార్యుఁడు సంకీర్తన లక్షణమునఁ దనతాత యన్నమాచార్యుఁడు సంస్కృతమున సంకీర్తనలక్షణము రచించిన ట్టును దానికిఁ దనతండ్రి పెదతిరుమలాచార్యుఁడు వ్యాఖ్య చెప్పినట్లును వాని ననుసరించి తాను తెలుఁగు రచన చేసినట్టును జెప్పుకొన్నాఁడు. ఆ సంస్కృత సంకీర్తన లక్షణమును గానరాదు.

## అన్నమాచార్య విగ్రహము

సంకీర్తనభండారమనీ, తాళ్ళపాకవారి యర అనీ, పేర్కొనఁ బడుచుండు కొట్టు సరిగా భాష్యకారుల సన్నిధికిఁ బ్రక్కగా నున్నది. స్వామిదర్శనము చేయువారు బంగారువాఁకిటికడ నిలిచి ముందుచూచిన స్వామి దివ్య విగ్రహ మును గుడిచేతి ప్రక్కకేసి చూచిన భాష్యకారుల విగ్రహమును గానఁగల్గుదురు. భాష్యకారులతోపాటు దర్శనీయులుగా నన్నమాచార్యుల విగ్రహము సంకీర్తన భండారము ద్వారమునెడమప్రక్క నున్నది. ఆ ద్వారమునకుఁ గుడిప్రక్కను పెదతిరుమలాచార్యుల విగ్రహమును గాననగును. బంగారువాకిలి దగ్గఱ నుండి ఒకకంట స్వామిని ఇంకొకకంట భాష్యకారులను (చిదంబరమున కనకసభాపతిని, వరదరాజులను దర్శించునట్లే) అన్నమాచార్యుని తత్పుత్రునిగూడ దర్శింపనగును. సరిగా నీ యర్థమును నిరూపించునదిగాఁ జినతిరుమలాచార్యుఁడుగాఁబోలును రచించిన సంకీర్తనములున్నవి.



దేవగాంధారి

అతిముఖిఁ జూడఁబోతే నజ్ఞాని నేను ।
మఱుఁగు సొచ్చితి మీకు మహిలో నారాయణా ॥పల్లవి॥

నిన్ను ధ్యానముచేసీ నిచ్చఁ దాళ్ళపాక ।
అన్నమయ్యఁగా రెదుట నదిగో వయ్యా ।
పన్ని యాతనినే చూచి పాతకులమైన మమ్ము ।
మన్నించవయ్య వో మధుసూదనా ॥అతి॥ 1

సంకీర్తనలు చేసీ సారెఁ దాళ్ళపాక అన్నమయ్య ।
అంకెల నీ సన్నిధినే అదిగోనయ్యా ।
అంకించి నేవారివాఁడ నని దుష్టుండ నైనా నా ।
సంకె దీఱఁ గావవయ్య సర్వేశ్వరా ॥అతి॥ 2

పాదాలం దున్నాఁడు తాళ్ళపాక అన్నమయ్య మీకు ।
ఆదరాన ముక్తుండై అదిగో వయ్యా ।
ఈదెస శ్రీవెంకటేశ యీ సంబంధాననే నన్ను ।
నీదయ వెట్టి రక్షించు నెమ్మది భూరమణా॥అతి॥ 3

అన్న. అధ్యా. 223 ఱేకు.

దేసాళం

ఈతఁడే ముక్తిదోవ యీతండే మాయాచార్యుఁ
డీఁతడు గలుగఁబట్టి యిందరు బదికిరి ॥పల్లవి॥

అదివో తాళ్ళపాక అన్నమాచార్యులు ।
యిదె వీఁడె శ్రీవెంకటేశు నెదుట ।
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి ।
పదములు సేసి పాడి పావనము సేసెను ॥ఈతడే॥ 1

అలరుచుఁ దాళ్ళపాక అన్నమాచార్యులు ।
నిలిచి శ్రీవెంకటనిధియె తానై।
కలిదోషములు వాప ఘనపురాణము లెల్ల ।
పలుకుల నించి నించి పాడినాఁడు హరిని ॥ఈతడే॥ 2

అంగవించెం దాళ్ళపాక అన్నమాచార్యులు ।
బంగారు శ్రీవెంకటేశు పాదములందు ।
రంగుమీఱ శ్రీవెంకటరమణుని నలమేలు ।
మంగను యిద్దఱిం బాడి మమ్ముఁ గరుణించెను ॥ఈతఁడే॥ 3
అన్న. అధ్యా. 232 రేకు.

శ్రీరాగము

హరియవతార మీతఁడు అన్నమయ్య ।
ఆరయ మా గురుం డితం డన్నమయ్య ॥పల్లవి॥

వైకుంఠనాథునివద్ద వడిఁబాడుచున్న వాఁడు ।
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య ।
ఆకసపువిష్ణు పాదమందు నిత్యమై వున్నవాఁడు ।
ఆకడీకడఁ దాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥ 1

క్షీరాబ్ధిశాయి నిట్టె సేవింపుచునున్న వాఁడు ।
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య ।
ధీరుఁడై సూర్యమండల తేజమువద్ద నున్నవాఁడు ।
ఆరీతులఁ దాళ్ళపాక అన్నమయ్య । ॥హరి॥ 2

యీవలసంసారలీల నిందిరేశుతో నున్నవాఁడు ।
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య ।
భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాఁడు ।
హావభావమై తాళ్ళపాక అన్నమయ్య ॥హరి॥ 3
అన్న. అధ్యా. 117 రేకు.

భాష్యకారులకుఁబోలె నన్నమాచార్యులకును విగ్రహమును వెలయించి తాళ్ళపాక యరలో ప్రతిష్ఠయే జరుపవచ్చునుగాని యానాఁ డన్నమాచార్యుని నట్లు పూజించుటకు స్థానపతుల సమ్మతి దొరకవలెను. ఆయరగోడ మీఁద వారివిగ్రహము చెక్కించుటకే దొరకెనేమో. అన్నమాచార్యునివలె గొప్ప విద్వాంసుఁడు సంకీర్తనాదికర్త మహాభక్తుఁడు స్వామి కగ్రహారము లనేకములు



సమర్పించినవాఁడు నగు పెదతిరుమలాచార్యునిమూర్తికూడ నుండవలసిన దయ్యెను. పినతిరుమలాచార్యుఁడీ కొఱంత తీరుటకు మంగాపురమున గుడి కట్టించి మఱొక వెంకటేశ్వరస్వామినే వెలయించి ప్రతిష్ఠించి యక్కడ నాళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతోసహ అన్నమాచార్యుని విగ్రహమును గూడఁ బ్రతిష్ఠించి పూజాపురస్కారములు కల్పించెను. తాళ్ళపాక యరద్వారమున కిరుప్రక్కల నున్న విగ్రహములలో నొకటి ముదివయసుది, ఇంకొకటి లేవయసుది, గానున్నది. అన్నమాచార్యచరిత్ర (చూ. 35 పుట) లో నున్న వర్ణనమున కనుగుణముగానే యిక్కడ రూపకల్పనమున్నది.

# సంగీతరచన

ద్రవిడ కర్ణాటాంధ్ర భాషలలో కెల్లఁ బ్రాచీనములయిన సంకీర్తనము లన్నమాచార్యునివే. సంకీర్తన శాస్త్రమును గల్పించినవాఁడు నన్నమాచార్యుఁడే. కనుకనే యాతనికిఁ బదకవితా పితామహుఁడని, సంకీర్తనాచార్యుఁడని హరికీర్తనాచార్యుఁడని బిరుదులుగలిగెను. కన్నడమునఁ బురందరదాసుల వారును ప్రాకృతమున వెంకటమఖియు నీయనకుఁ దర్వాతనే సంకీర్తనములను గీతములను రచించిరి. ప్రాఁతవగు కృష్ణాచార్యుని సంకీర్తనములు తాళగంధి వచనములే కాని, పల్లవి చరణములు గల పదకవితా రచనలుకావు. అట్టి తాళగంధివచనరచనలను పెదతిరుమలాచార్యుఁడుగూడ వైరాగ్యవచన రచనమాలికాగీతములని పేర్వెట్టి రచించినాఁడు. అవి వెంకటేశ్వర వచనములని వెంకటేశ్వర విన్నపములని మద్రాసు తంజావూరి లైబ్రరీలలో నుండగా నేను గుర్తించి ప్రకటించితిని.

జాజఱలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెదపదములు, లాలి సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాలజోల జోజో జేజే, జయజయ విజయీభవ శోభన మంగళ వైభోగములు, మేలుకొలుపులు, నలుఁగులు, దంపుళ్ళు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెనగూళ్ళు, చందమామ గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లోనేరేళ్లు, చాఁగుబళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానములు, తందానలు, వెన్నెలలు, చిత్తమా, మనసా, బుద్ధి (సంబోధనలు) మొదలగు మధురకవితారచనా విశేషము లీ

సంకీర్తనములలోఁ జాలఁ గలవు. అన్నమాచార్యుఁడు సంకీర్తన లక్షణమున వీనిలోఁ గొన్నింటిని బేర్కొనుటచే నంతకుఁ బూర్వముననుండియు నివి వాడుకలో వచ్చుచున్నవే యనవలెను. తుమ్మెదపదములు, ప్రభాత పదములు, పర్వతపదములు, ఆనందపదములు, శంకరపదములు, నివాళిపదములు, వాలేశుపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు, సెజ్జవర్ణన, గుణవర్ణన పదములు, పాల్కురికి సోమనాథుఁడు తనగ్రంథములలోఁ బేర్కొన్నాఁడుగాని యవి యిప్పుడు గానరావు. అవి యేవొ పొడిపొడిగా వెలసిన లఘురచనలయి యుండునుగాని ప్రఖ్యాతకపు లానుపూర్వితో రచించినవి గావేమో ! త్యాగ రాయలకృతులకుఁ బూర్వమాంధ్రగాయకు లాలాపించు చుండిన గేయము లేవి? యని పరిశీలింపఁగాఁ జాలినంత సమాధానము దొరకకున్నది. నేఁటి గాయకు లందఱును ద్యాగరాయాదులను నూతేండ్ల క్రిందటి వారినే యెఱుఁ గుదురు. సింగభూపాలుఁడు పెదకోమటివేమారెడ్డి ప్రౌఢదేవరాయఁడు (సంగీతరత్నాకరః అనఁబడినాఁడు) సంగీతగ్రంథకర్తలు అన్నమాచార్యుని కించుకపూర్వులు. బయకారరామామాత్యుఁడు, కృష్ణరాయఁడు అచ్యుతరాయఁడు తిరుమలరాయఁడు, సంగీతగ్రంథములకుఁ గర్తలు, కారయితలును వెంకట గిరి, కాళహస్తి ,కార్వేటినగరము, నూజివీడు, చల్లపల్లి ,ముక్త్యాల, పిఠాపురము, పెద్దాపురము, విజయనగరము, గద్వాల, వనపర్తి ఆత్మకూరు మొదలగు రాజస్థానములు సంగీత వినోదము లేనివిగావు. దక్షిణాంధ్రరచనలలో తంజా పుర్యాదులలో వెలసినగేయరచనలు సురక్షితములుగా నున్నవిగాని తెలుఁగు దేశరచనలు ససిగా దొరకుట లేదేల? కృష్ణరాయలమీఁది గేయరచనలైనఁ గానరావే. ఆనుపూర్వితో క్షేత్రయపదములు, ఏగంటి,చిలుకపాటి పదములు రామదాసుకీర్తనలు, ముత్తేవివారికీర్తనలు, తాడంకివారి కీర్తనలు, నల్లబాటివారి కీర్తనలు ,సారంగపాణిపదములు, గుత్తెనదీవిరామాయణ కీర్తనలు, అధ్యాత్మ రామాయణకీర్తనలు, శోభనాద్రీశ్వరసంకీర్తనలు నని కొన్ని గలవుగాని యవియెల్ల నంతప్రాచీనములు గావు. మద్రాసు ప్రాచ్యలిఖితపుస్తకశాలలోఁ గొన్ని పొడిపొడి గేయరచన లున్నవిగాని యందుఁ గొన్ని ప్రాచీనతరము లయినను గావచ్చును గాని, యవి యానుపూర్వితో కర్తృనామాంకముతో లేవు. యక్షగానములు గొన్ని వానిలోనిగేయరచనలు గొన్ని కలవుగాని, మొదటి



కాయక్షగానములే యంతప్రాచీనములు గావు. తెలుఁగునఁ దొలుత శ్రీనాథుఁ డే యక్షగానముల బేర్కొన్నవాఁడు. దాక్షారామమున సంగీత నాట్య విద్యావినో దములు జరుగుట నాతఁడు వర్ణించినాఁడు గాని యానాఁటిగేయము లేవొ సరిగాఁ దెలియరావు. చాళుక్యరాజుల గ్రంథములలలో (అభిలషితార్థ చింతామణి, సంగీత చూడామణి) సంగీతవిషయములు చాలఁ గలవుగాని వానిలో వర్ణితము లయిన సంగీతప్రబంధము లంతముఖ్యమయినవి గావు. ఏలలు, ధవళములు, చర్చరులు, ఏకతాళులు, శరభలీలలు, చిందులు మొదలయినవేవో కొన్ని మాత్రమే చిన్న చిన్ని రచన లందుఁ జెప్పఁబడినవి. అందుగొన్ని నేఁడును వాడుకలో నున్నవి. వానిని గూర్చి యభిలషితార్థ చింతామణి, సంగీతచూడామణులలోని ముక్కలు కొన్ని :-

"కథాసు షట్పదీ యోజ్యా వివాహే ధవళ స్తథా
ఉత్సవే మంగళో గేయ శ్చర్యా యోగిజనైస్తథా"

"పదే పదే భవే ద్రాగః తాళశ్చాన్యః పదేపదే
పదాన్తే స్వరతాళాభ్యాం గేయశ్శరభలీలకః"

"షోడశమాత్రాః పాదేపాదే యత్ర భవన్తి నిరస్తవివాదే ।
పద్ధళికా జగణేనవియుక్తా చరమగురుస్సా సద్భిరిహోక్తా"

"రాగో హిందోళక స్తాళః చర్చరీ బహవోంఘ్రయః
యస్యాం షోడశమాత్రాస్సుర్ద్వౌ ద్వౌ చ ప్రాససంయుతౌ
సా వసంతోత్సవే గేయా చర్చరీ ప్రాకృతైః పదైః"

"పదమన్త్యం సమాదాయ యమకస్థితిభూషితః
ఆవృత్యా గీయతే యస్తు చక్రవాళస్స ఉచ్యతే
గద్యేవాపద్యబంధే వా పుణ్యనామాంతశోభితః
నామాంతే స్వరసంయుక్తో గీయతే చక్రవాళకః"

లక్ష్యమ్.

శశాంకశకలం కలంకికుముదం ముదంనవహతేహతేహిమకరే
కరేతదసమం సమంవివసితం సితంవిజయతేయతే తవయశః.

"నిరంతరమనుప్రాసో యతిర్యత్ర పదేపదే
క్రియతే గీతతత్త్వజ్ఞైః సాస్మృతా త్వేకతాళికా"
"ధవళాది పదైః పాదై రాశీర్వాదసమన్వితైః
ఛందసా యేనకేనాసి కర్తవ్యో ధవళాభిధః"

పై గ్రంథములలో లక్ష్యములు గొన్ని కర్ణాటభాషలో నున్నవి. చాళుక్యులు కర్ణాటకు లగుటచేతను రాజులగుటచేతను తొలుత సంగీత సంప్రదాయ మధికముగాఁ గన్నడమున బెంపొందించియుందురు. మొదటి కీ గానమునకే కర్ణాటగానమని పేరయ్యెను. సంగీతశాస్త్రమున స్వరపద్ధతికి ధాతువని సాహిత్యపద్ధతికి మాతువనిపేరు. శరీరమున సప్తధాతువులుండుటఁ బట్టితత్సాదృశ్యమున సప్తస్వరములకు ధాతుసంజ్ఞ కుదిరెను. "మాతు" కర్ణాట భాషాపద మనుకొందును. మాతు= మాట. ఈ శాస్త్రము తొలుత కర్ణాటమున వెలయుటచే సాహిత్యముకు 'మాతు' అన్నకర్ణాటపదము గొనుటయ్యెను గాఁ బోలును.

పై లక్షణ శ్లోకములలో నున్న చర్చరియే జాజఱ యయినది. అన్నమాచార్య సంకీర్తనములలోని జాజఱపాట లన్నియు గోవాళ్ళ వసంతోత్సవములోఁ బాడునవిగా నున్నవి.

ముఖారి

చాలుఁజాలు నీజాజఱ, నన్ను
జాలిఁ బఱచె నీజాజఱ ॥పల్లవి॥

వలపువేదనల వాడేను యీ।
తలనొప్పులచే తలఁకేను।
పులకలమేనితో పొరలేను కడు।
జలిగొని చల్లకు జాజర ॥చాలు॥ 1

వొల్లని నినుఁ గని వుడికేను నీ
చిల్లరచేఁతలఁ జిమిడేను।
కల్లగందవొడిఁ గాఁగేను పైఁ।
జల్లకు చల్లకు జాజఱ ॥చాలు॥ 2



తివిరి వెంకటాధిప నేను నీ।
కవుఁగిటి కబ్బితి గదనేఁడు।
రవరవ చెమటఁ గరఁగి నేడూయిదె।
చవులాయెను నీజాజఱ ॥చాలు॥ 3

అన్న. శృంగా. 87 ఱేకు.

నాచనసోమనగూడ వసంతవిలాసమున జాజఱనిట్లు వర్ణించినాడు :-
"వీణాగానము వెన్నెలతేట। రాణమీఱఁగా రమణులపాట।
ప్రాణమైన పినబ్రాహ్మణువీట। జాణలు మెత్తురు జాజఱపాట॥

ఇంతకుఁ జెప్పవచ్చిన దేమనఁగా విద్యానగరవినాశముపిదప ఆంధ్ర దేశమున సంగీత మన్నఁ గొంత యశ్రద్ధ పెరిగినదనుట. అదికారణముగాఁ బ్రాచీనగేయరచన లెన్నో అంతరించి పోయినవి. దాగియున్నను రాగిరేకుల మీఁదికెక్కియుండుటచే నేఁటికయినను దాళ్ళపాక సంకీర్తనములు పైకి రాఁ గల్గినవి.

## అన్నమయ సంతానము

### నరసింహకవి

అన్నమాచార్యుని ప్రథమభార్యయగు తిరుమలమ్మకు నరసింగన్న, నరసయ్య, నరసింహాచార్యుఁడు అని పేర్కొనఁబడువాఁడు చాలా గొప్ప కవీశ్వరుఁడు కొడు కుండెను. నిరుపమాన సుకవితా నిర్వాహకుఁడయిన తెనాలి రామకృష్ణకవి తనసమీపకాలమువా రగు తాళ్ళపాక కవుల నిట్లు సన్నుతించెను.

క॥ చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱఁగున్।
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్।[1]

ఈ పద్యమునఁ దనతోఁ క్రీ. 1560 దాఁక వర్తిల్లినవాఁడగు చిన్నన్నను,

1. రామకృష్ణునికిఁ జిన్నన్నకు, నూఱేండ్ల తర్వాత నప్పకవీయమున నీపద్యముదాహృత మయినది.

ఆతనితండ్రియు క్రీ. 1453 దాఁక వర్తిల్లినవాఁడునగు పెదతిరుమలాచార్యుని, ఆతని యన్నయగు నరసింగన్నను మెచ్చినాఁడు.

ద్విపదమునకుఁ జిన్నన్న వ్రాలును. పదములకుఁ బెదతిరుమలయ్య వ్రాలును. పద్య గద్య (ని) శ్రేణిని నరసింగన్న మిన్నందిమ్రోఁగును! అని దీని యర్థమనుకొందును. నరసింగన్న యిందధికముగాఁ బ్రస్తుతుఁడయ్యెను. కాని యాతఁడు రచించిన గ్రంథము లేవో తెలియరావు. 'పాడఁజెప్పఁగ వర్ణపద్ధతి నీడు । జోడు లేఁడన సభఁజొచ్చి వాదించి । పరగినధీశాలి ప్రతివాది దైత్య నరసింహుఁడనఁగల్గె నరసింహగురుఁడు,' అని చిన్నన్న యష్టమహిషీకళ్యాణమున నాతని స్తుతించెను. అతని కుటుంబ వృద్ధినిగూడ వివరించెను. చిన్నన్న పేర్కొనుటే కాని దేవస్థానశాసనములోఁగాని, తాళ్ళపాక వారియిండ్ల లోఁగాని, లోకమునఁగాని యాతని విషయ మేదియు గానరాకున్నది. చిన్నన్నయే క్రీ 1546 కొండవీటిసీమలోని చెందలూరు మల్లవర గ్రామములను స్వామికైంకర్యములకై సమర్పించుచునందు మాఘశుద్ధ చతుర్థీతిథిని తన పెదతండ్రిగారయిన నరసయ్యంగారి ప్రత్యాబ్దిక దినమున నర్చనావిశేషముల నిర్వహణముకూడఁ జేర్చినాఁడు. [1] ఇది క్రీ. 1546 నాఁటికి నరసింగన్న దివ్య ధామముఁబడయుటను జిన్నన్న కాతనిపై గౌరవమును దెలుపుచున్నది.

శ్రీ వీరేశలింగము పంతులుగారు కవిచరిత్రమున కవికర్ణరసాయన కర్త కృష్ణదేవరాయలనాఁటి వాఁడని కృష్ణరాయని "ఆందోళికల యందునం తరచరులౌట సవికృతాకృతుల పిశాచజనులు.... ప్రభుదురాత్ములనెవ్వాఁడు ప్రస్తుతించు" ననిగర్హించెనని, వ్రాసినారు. వృద్ధానుశ్రుతినిబట్టి వ్రాసిన యీ వ్రాఁత విశ్వాస్యమే యనుకొందును. కవికర్ణరసాయనకర్త నరసింగన్న తాళ్ళ పాక నరసింగన్న కాఁగూడు ననుకొందును. లక్షణగ్రంథములందు సుంకసాలనరసింగన్న అని కలదు. సంకుసాల అనిలోకమువాడుక. "సుంకేసుల" అని గ్రామములు రాయలసీమలో నున్నవి.

క॥ ఇంకా నవ్వే వచ్చే
సుంకేసుల మ్రానిక్రింది సుద్దులు దలఁపꣳ

1. తిరుపతి శాసనములు 5 వ్యాల్యుం. 184 పుట, చూ.



లంకించుకొన్న రాజవు
వెంకటగిరివాస ! విబుధవినుత విలాసా !

క॥ టెంకాయ చిప్పలోపల
వంకాయా పెసరపప్పు వరివంటకముꣳ ।
ఇంకాఁ బెట్టేఁ దినరా
వెంకటగిరివాస ! విబుధవినుత విలాసా !

ఇత్యాదిగా నెవరు రచించినవో రుచిగల కందపద్యములు గొన్ని శ్రీవెంకటేశ్వరస్వామి పేరనున్నవి. 'సుంకసాల, సంకుసాల సుంకేసులలు ఒకయూరిపేరి వికారములేమో ! కృష్ణరాయఁడు తాళ్ళపాక గ్రామమున వ్యాసతీర్థులవారి కగ్రహారీకరించుటచే నరసింగన్న తాళ్ళపాక విడిచి పై గ్రామము చేరి సుంకసాల యింటిపేరివాఁడయ్యెనేమో ! కవి కర్ణరసాయన మున నాతఁడు తనకులగోత్రములను దలిదండ్రులను బేర్కొనఁడయ్యెను. గ్రంథాదిని 'గురువరభట్టపరాశర చరణసరోరుహసముల్ల సన్మానసుఁడన్' అని గురుస్తుతి చేసినాఁడు. తుదిని 'ఆదిమశఠకోపాది' అని యాశ్వాసాంతపద్య మునఁ జెప్పినాఁడు. వీనినిబట్టి యాతఁడు, భట్ట పరాశరాహ్వాయుని శిష్యుడనీ, రెండవ శఠకోపయతియైన –యహోబలమఠ ప్రతిష్ఠాపకవన్ శఠకోప యతి నెఱిఁగిన వాఁడనీ గుర్తింపనగును, వేదాంతదేశికుల శిష్యులు, బ్రహ్మసూత్ర గీతావ్యాఖ్యాతభట్టపరాశరు లొకరు గలరు గాని అయినను రామానుజుల నాఁటి పరాశరభట్టారకుల వంశజులందఱకు పరాశరభట్ట నామము సాధారణ మనికూడ వాడుకగలదు. క్రీ. పదునైదవ శతాబ్దియుత్తరార్ధ మున వన్‌శఠకోపయతులు గలరుగాన యీతఁడు వారినాఁటివాఁడో వారి తర్వాతివాఁడో అగుటచే నన్నమయ పుత్రుఁడగుట నిర్బాధమగును.

కవికర్ణ రసాయనమున వైష్ణవమతాభిమానము, అద్వైతమతద్వేషము, అన్నమాచార్య సంకీర్తనచ్ఛాయలు నిలడార్లుగానున్నవి. నన్నిచోడ కుమార సంభవమును, ఎఱ్ఱన నృసింహపురాణమును, ఉత్తర హరివంశమును, శ్రీనాథ రచనలను, ననుకరించునవిగా పలుకుబళ్ళు, కూర్పు తీర్పులు, పద్యచ్ఛాయలు, నిందుఁ జాలఁగలవు. కవికర్ణరసాయనము తాళ్ళపాక నరసింగన్న రచనమే యగుచో నందు రాజాశ్రయగర్వ సహేతుకమే యగును. కారణము సుస్పష్టము

కాదు కాని, బహువారములు తిరుపతికి విచ్చేయుచు వచ్చినవాఁడు కవి విద్వాంసుఁడు కవిపోషకుఁడునగు శ్రీకృష్ణరాయఁడు సంస్కృతాంధ్ర విద్వాంసులు మహనీయులు కవులుగాయకులునగు నరసింహ పెదతిరుమల పినతిరుమలాచార్యాదుల నేలొకో యాదరింపఁడయ్యెను. పైఁగా వారి నివాస గ్రామమగు తాళ్ళపాకను వ్యాసతీర్థుల కగ్రహారీకరించెను. అచ్యుతరాయలవారు మాత్రము తాళ్ళపాకవారి నాదరించి యాదృతుడయ్యెను.

## పెదతిరుమలయ్య

అన్నమాచార్యుని రెండవభార్యయగు అక్కలాంబయం దీతఁడు జన్మించెను. ఈతనికి నరసమ్మ, తిరుమలమ్మయని యిర్వురు చెలియండ్రును గలరు. ఈ తిరుమలాచార్యుఁడు క్రీ. 1553 దాఁక జీవించినాఁడు . క్రీ. 1503 దాఁక జీవించిన యన్నమార్యుఁ డీ పెదతిరుమలయ్య పెదకుమారుఁడగు చినతిరుమలయ్యగారికి బ్రహ్మోపదేశముఁ జేసినాఁడు. 1500 ప్రాంతముల చినతిరుమలయ్య యుపనయనము జరగిన దనుకొన్నచో 1493 ప్రాంతముల జన్మించిన చినతిరుమలయ్య తండ్రి యప్పటి కిర్వదేండ్ల వాఁడే యనుకొన్నను 1473 ప్రాంతముల జన్మించినవాఁడగును. ఈతని నిండుయౌవనము శ్రీకృష్ణ రాయలవారి కాలమున గడచినది. కృష్ణరాయల పరిపాలన కాలమున నీతఁడు శ్రీ వెంకటేశ్వరస్వామికిఁ గొన్ని కైంకర్యములు జరపినను నందు సాళ్వ తిమ్మరుసును నాతని తమ్ముఁడగు గోవిందయ్యయు నిర్వాహకులుగా నుండిరి. ఆ శాసనములలో శ్రీకృష్ణరాయల పేరు లేదు. పెదతిరుమలయ్యకును నాతని యన్నయగు నరసింహకవికిని శ్రీకృష్ణరాయనితో వైరస్యము గలదనుకొనుట కింకొక సాధనము :-

"మండెమురాయనామక నరసింహ దండనేత్రు (తృ?)న కిష్టధన బలస్ఫూర్తి" నని యన్నమాచార్య చరిత్రమునున్న వాక్యమునకు మండెము రాయఁడను నామాంతరముగల నరసింహ దండనాథుఁడని యర్థము గావచ్చునని యనుకొంటిమి. ( చూ. పుట. 286)

పయి, మండెము కడపమండలమున చినమండెము అనీ, చిత్తూరు మండలమున గాజులమండెము చిఱుమండెము అనీ కలగ్రామములలో నొకటయి యుండఁబోలును. ఆయూర పెదతిరుమలయ్య నెవరో కత్తితో నఱకిరట. ఆ కత్తివ్రేటాతనికిఁ గలువ దండ యైనదట!



మండెము కోటలో మండలం బెఱుఁగ
మండలాగ్రాహతి మహనీయ పుష్ప
దామమై ధర్మాంగదస్థితిఁ బొలిచె
నేమహామహుని యహీన గాత్రమున

నని చిన్నన్న చెప్పినాఁడు. దేవకీపురవాస్తవ్యుఁడగు నరసింహదండ నాథుఁడిందు ప్రయోజకుఁడేమో ! ఈ విషయము పెదతిరుమలాచార్యుఁడే యిట్లు సంకీర్తనమునఁ జెప్పుకొన్నాఁడు.

శంకరాభరణ రాగం

నాఁటికి నాఁడు గ్రొత్త నేఁటికి నేఁడు గ్రొత్త !
నాటకపుదైవమవు నమో నమో ॥పల్లవి॥

సిరుల రుక్మాంగదుచేతి కత్తిధార దొల్లి ।
వరుసధర్మాంగదుపై వనమాలాయ ।
హరి నీకృపకలిమి నట్లనేయరులచే ।
కరఖడ్గధార నాకుఁ గలువదండాయ ॥నాటి॥ 1

మునుపు హరిశ్చంద్రుమొనకత్తిధార దొల్లి ।
పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ ।
వనజాక్ష నీకృపను వరశత్రులెత్తి నట్టి ।
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥నాటి॥ 2

చలపట్టి కరిరాజు శరణంటె విచ్చేసి ।
కలుషముఁ బెడఁ బాసి కాచినట్టు ।
అలర శ్రీవెంకటేశ ఆపద లిన్నియు బాపి।
ఇల నన్నుఁగాచినది యెన్నఁ గతలాయ ॥నాటి॥ 3

ఈ కీర్తనమునఁ జెప్పఁబడినదేకాక (పుట. 286 పుట) సంకీర్తనమున వర్ణితమయిన విషయములు గూఁడఁ బెదతిరుమలాచార్యుని మాహాత్మ్యమును వెల్లడించు చున్నవి. ఆ సంకీర్తనమును జినతిరుమలాచార్యుఁడు రచించి యుండఁ బోలును.

అచ్యుతరాయలవారు పూండి, సంగమకోటగ్రామములఁ దామ్ర శాసన పూర్వకముగా దానము చేయఁగాఁ బెదతిరుమలాచార్యుఁడు వానిని స్వామికే సమర్పించెను. ఆతఁ డచ్యుతరాయల జన్మనక్షత్రము నాఁడు తనద్రవ్యముతో స్వామికిఁ గైంకర్యములఁ గల్పించెను. అచ్యుతరాయలనాఁ డాతఁడు విజయ నగరములోవిట్ఠలేశ్వరస్వామికైంకర్యములకై గొప్ప భూసమర్ప ణము చేసెను. పెదతిరుమలయ్య స్వామికి అర్పించిన గ్రామములు :- కావనూరు, మరువాకరై, కుప్పము, కీళంగుగ్రము, మన్నసముద్రము, పూండి, సంగమకోట, ( ఈ రెండూళ్ళ సంవత్సరపు రాబడి 1000 రేఖ పొన్నులు) రాయలపాడు, సోమయాజులపల్లి, కత్తమువారిపల్లి, ఎఱ్ఱగుంటపల్లి, పల్లిపురము, ( 133 వరహాల సంవత్సరాదాయము కలది.) గండతిమ్మాపురము (100 రేఖ పొన్నులు సంవత్సరాదాయముగలది.) ఈ గ్రామములుగాక - భిన్న భిన్న సమయములలో 4600 పణాలు 5203 పణాలు 2000 వరహాలు 450 పణాలు 1900 పణాలు 1020 నర్పణాలు 2300 నర్పణాలు సమర్పించినారు.

శ్రీస్వామివారికిని ఎగువ దిగువ తిరుపతులను కడమ చోట్లను వెలసిన వేల్పులకు బహువిధభక్ష్యభోజ్యాది నివేదనలను నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ వర్షోత్సవాదులలో నింక ననేకవిధముల కైంకర్యములను వనభోజన వినోదములను తమ వంశపారంపర్యముగా తమ పేర జరపించుటకు బయి గ్రామములను ధనమును శ్రీభండారమున నర్పింపగాఁ గోవెల స్థానపతు లందుకు సమ్మతిగా శాసనములు చెక్కించిరి.

ఇవిగాక వీరు కట్టించిన కట్టడములు వగైరాలు :- స్వామిపుష్కరిణి జీర్ణోద్ధారము, మెట్లు, మండపములు, నీరాడుమండపము కొండమీఁద తాళ్ళపాకవారి యింటి ముందు మండపము, సంకీర్తన (సంకీర్తనములు చెక్కిన రాగిరేకులు దాచి ఉంచినది) భండారము, అక్కడ దీపారాధనలు, అక్కడ సంకీర్తనలు పాడే వైష్ణవులకు జీతాలు, గుడిగ్రామాలలో చెరువులు కాలువలు బాగు చేయించుటకు ధనదానము, ఆళ్వారుతీర్థము దగ్గఱ శ్రీలక్ష్మీ నారాయణస్వామి ప్రతిష్ఠ ఇత్యాదులు.



కొన్ని ఉత్సవములలోని ముఖ్యాంశములు :- శ్రీనివాసమూర్తికి ప్రతి శుక్రవారము తిరుమంజనము పిదప, పునుఁగుతైలము పూయునప్పుడు పన్నీరుచెంబు సత్కారముపడయుట ( తాళ్ళపాకవారు సంకీర్తనములు అప్పుడు పాడేవారు), అచ్యుతరాయల జన్మనక్షత్రమగు మృగశిరనాఁడు ఉత్సవము జరపుట, స్వామిపుష్కరిణి గట్టున తాళ్ళపాకవారు నిర్మించినరాతి స్తంభము మీఁద సంవత్సరము పొడుగునా ప్రతిగురువారము దీపారాధన, ముక్కోటి ఏకాదశి నాఁడు స్వామిపుష్కరిణి గట్టున ముప్పది దీపాలు, సంకీర్తన భాండారము దగ్గర నాల్గు తిరుబోనములు దీపాలనూనె ఆ భాండారములో సేవచేసే శ్రీవైష్ణవుల జీతాలు వగైరాలు.

తిరుమలయ్యగారికి శ్రీపతితొన్నడయ్య అనీ తిరుపతి చేరువనున్న కులశేఖర పురవాస్తవ్యుడు పల్లిపట్టురయ్య అనీ ఇద్దఱు సాతాని వైష్ణవులు శిష్యులుండిరి. వారు కూడ స్వామికిఁ గైంకర్యములు జరపిరి. పెదతిరుమలయ్య గారు చేయించిన యుత్సవ విశేషములు సమగ్రముగా వ్రాసిన నదియే పుస్తకమగును.

ఈతఁడు రచించిన గ్రంథములు :-

1. శృంగార సంకీర్తనములు.
2. అధ్యాత్మ సంకీర్తనములు
3. వైరాగ్యవచన గీతాలు
4. శృంగార దండకము
5. చక్రవాళ మంజరి
6. శృంగారవృత్త శతకము
7. వెంకటేశ్వరోదాహరణము
8. నీతిసీస శతకము
9. సుదర్శనగద
10. రేఫఱకారములు
11. భగవద్గీత తెల్గువచనము
12. ద్విపదహరివంశము
13. ప్రభాతస్తవము

పై వానిలో కడపటి రెండు ముద్రితములుగాలేదు. తొలి రెండింటిలోఁ గొంతభాగమును, గడమవి సమగ్రముగాను ముద్రితములయినవి. హరి వంశము దొరకనే లేదు.

ఇవిగాక చిన్నన్న పేర్కొన్న యంధ్రవేదాంతము తొలుత కృష్ణమాచార్యుఁ డును తర్వాత తనతాత యన్నమాచార్యుఁడును పిదప తనతండ్రి తిరుమలాచార్యుఁడునునను క్రమముగారచించినది. సంకీర్తనాత్మకము. ఇట్లనుటకు సాధకముగా అష్టమహిషీ కల్యాణములోన నిట్లున్నది. "క్ష్మానుతద్రావిడాగమసార్వభౌము। లైన మావారలనాళువారలను వేదంబులెల్ల ద్రావిడముగాఁ జేసి వేదాంతవిదులు గోవిదులు నైనట్టి । గురుతరులకు పరాంకుశముఖ్యయోగిఁ వరుల॥ నని ద్రవిడవేదాంతకర్తల సన్నుతిపై "వనజాతజాతసర్వ సురేంద్రముఖులు। గనలేని వెంకటగ్రావాధినాథు। పదములశోభనాస్పదములౌతనదు । పదములబహుదేశపదములజనులఁ । గనఁ జేసిపంచమాగమసార్వభౌముఁ । డనఁ బ్రసిద్ధకినెక్కియఖిలవిద్యలను । నన్నయాచార్యుండెయనఁ దాళ్ళపాక యన్నయాచార్యుఁడాయతకీర్తిఁ జెలఁగె॥" "వేదంబు తెనుఁగుగావించి సంసార । ఖేదంబుమాన్పిన కృష్ణమాచార్యు। ఘనతరపంచమాగమసార్వభౌము । ననఘు శ్రీతాళ్ళపాకాన్నమాచార్యుఁ దలఁచి" అనియు "ఉరుయోగసామ్రాజ్యవిభవ । జనకుండుతిరుమలాచార్యవర్యుండు । వేదాంతవిద్యాప్రవీణుఁడై యంధ్ర। వేదాంతమొనరించి, ద్విపద రూపమున। హరివంశకావ్యమాయతరసస్ఫూర్తి । హరివంశమిగురొత్త ననువొందజేసి" అనియు నాంధ్రవేదాంతకర్తల సన్నుతిగలదు.

ద్రవిడమున వేదవేదాంతములను పరాకుంశయోగి మొదలగు నాళ్వార్లు ద్రావిడీకరించి ద్రావిడాగమసార్వభౌము లనిపించుకొనఁగా తెలుఁగున కృష్ణమాచార్యుఁడు :- కృష్ణమాచార్య సంకీర్తనకర్త. అన్నమాచార్యుఁడు :- సంకీర్తనాచార్యుఁడు, సంకీర్తనకర్త, పదకవితా పితామహుఁడు. పెదతిరుమలాచార్యుఁడు :- సంకీర్తనాదికర్త.

ఇట్లీ, ముష్వరును వేదమును తెనుఁగుగావించి ఆంధ్రవేదాంతకర్తలని, పంచమాగమసార్వభౌములని, పంచమాగచక్రవర్తులని యనిపించుకొనిరి.

తిరుమలయ్యకు శ్రీ మద్వేదమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగతవజ్రపంజర, బిరుదములు గలవు.



ఈతనికి వేంకటేశ్వరస్వామి త్రిపురుషపర్యంతము ప్రత్యక్షంబును సప్తపురుషపర్యంతముగా మోక్షంబు నొసంగెదనని వరమిచ్చెనట ![1]

## సంకీర్తన భండారము

ఈ పెదతిరుమలయ్యగారే సంకీర్తన భండారమునకుఁ బెంపువెల యించిరి. తొలుత అన్నమాచార్యుఁడే సంకీర్తన భండారమును నెలకొల్పినట్టున్నాఁడు. అందుకుఁ దార్కాణగా సంకీర్తనము (పుట 263)

అన్నమాచార్యుని నాఁట సంకీర్తనములు తాటియాకులమీఁద వ్రాసియుంచఁబడెనేమో ! ఆతని తర్వాత పెదతిరుమలాచార్యుఁడు వానిని రాగిరేకులమీఁదఁ జెక్కించెను రాగివిలువయు, చెక్కించుకూలియు నిప్పటిలెక్క ప్రకారము లక్షలగును. ఒకరో యిద్దరో అక్షరములఁ జెక్కువారగుచో నదియొక పురుషాయుషమున్నంతకాలము జరపినఁ దేల వలసినపనియగును. రాగిఠేకులను జెక్కినవాఁడు :- అన్నమరాజు తిమ్మయ్య అని కొన్ని ఠేకుల మీఁద నున్నది.

పెదతిరుమలాచార్యుని తర్వాత చినతిరుమలాచార్యుని సంకీర్తనములు కూడ రాగిఠేకులకెక్కినవి. 1540లో సంకీర్తనభండారము దగ్గఱ సేవచేయు వైష్ణవు లిర్వురుండుట, సంకీర్తనములు పాడేవారు కొందఱుండుట, ఆ భాండారముముందు స్వామిని వేంచేపుచేయించి ప్రసాద వినియోగాదులు కైంకర్యములు దీపారాధనలు జరుగుచుండుటయు తాళ్ళపాకవారి శిలాశాసనముల కెక్కి యున్నవి. [2]

ఈ సంకీర్తనభండారము (తాళ్ళపాకవారి అర) ద్వారమున కిరుప్రక్కలనే విగ్రహములున్నవి. అవి యన్నమాచార్య తిరుమలాచార్యులవి.

## చినతిరుమలయ్య

ఈతడు పెదతిరుమలయ్య పెద్దకుమారుఁడు. అన్నమాచార్యుఁడితనికి బ్రహ్మోపదేశము (ఉపనయనము) చేసెను. ఇందుకు సంకీర్తనము :-

1 చూ. శకుంతలాపరిణయము. పీఠిక.

2. చూ తిరుపతి దేవస్థానం శాసనము నెం 144 నెం 4 వాల్యుం.

లలిత

తాళ్ళపాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు ।
వేళమె శ్రీహరిఁ గన వెర వానతిచ్చితివి ॥పల్లవి॥

గురుఁడవు నీవె సుమ్మీ కుమతి నైననాకు ।
సరవి బ్రహ్మోపదేశము సేసితి ।
పరమబంధుఁడ వైనా పరికింప నీవే సుమ్మీ ।
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥తా॥ 1

తల్లివైన నీవే సుమ్మీ తగినవిషయాలలో ।
ప్రల్లదానం బడకుండా బ్రదికించితి ।
అల్లుకొని తోడునీడ వైనా నీవే సుమ్మీ ।
చిల్లర మాయలలోనఁ జెడకుండాఁ జేసితి ॥తా॥ 2

ధాతవు నీవే సుమ్మీ తగుశ్రీ వేంకటనాథు ।
నాతలఁపులో నిలిపి నమ్మంజేసితి ।
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవే ।
ఆతల నీతల నన్ను నాచుకొనికాచితివి ॥తా॥ 3

చినతిరు. అధ్యా 7 ఱేకు.

కాన, యీతఁడు క్రీ. 1495 ప్రాంతముల జన్మించినవాఁ డనుకొన వచ్చును. క్రీ. 1553 దాఁ నీతనిశాసనము లున్నవి. ఈతఁడు సంస్కృతాంధ్ర ములందు మహాకవి. మహావిద్వాంసుఁడు. అష్టభాషాకవిచక్రవర్తియని బిరుదు గలవాఁడు. తండ్రితాతలవలెనే అధ్యాత్మ శృంగార సంకీర్తనలను రచించి నాఁడు. తెల్గుసంకీర్తన లక్షణము, అష్టభాషాదండకము రచించినాఁడు. (ఇవి ముద్రితములు. చూ. తాళ్ళపాక 1 వాల్యుం)

శ్రీ వేంకటేశ్వరస్వామికి దిగువ తిరుపతిలోని వేల్పులకుఁ గూడ జాలా కైంకర్యములు కావించినాఁడు. అందు ముఖ్యములు గొన్ని :

గోవిందరాజస్వామికి, పెండ్లి తిరునాళ్ళు (వైవాహికోత్సవము) జరుపుటకు నేడియం అనుగ్రామము రాఁబడిలో సగమిచ్చినాఁడు.



గోవిందరాజ విట్టలేశ్వరాచ్యుతపెరుమాళ్ రఘునాథ వరదరాజ లక్ష్మీనారాయణులకును హనుమదాలయములోఁ దాను ప్రతిష్ఠించిన నరసింహస్వామికిని కైంకర్యములకై చిత్రిచిత్రానక్షత్రమునఁ దన తిరునాళ్ళలో వైశాఖమృగశిరను దనతండ్రి తిరునాళ్ళలో గోవిందరాజస్వామి గుడిదగ్గఱి సుదర్శన చక్రమునకుఁ గైంకర్యములకై 200 రేఖై పొన్నుల రాబడిగల వెదుమప్పాకం గ్రామము నర్పించినాఁడు.

మంగాపురమున కళ్యాణవేంకటేశ్వర దేవాలయ జీర్ణోద్ధారణము గావించినాఁడు. స్వామి దివ్యసుందరమంగళ విగ్రహమునుగూడ నీతఁడే క్రొత్త వెలయింపించినట్టున్నాఁడు. ఆళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతో సహ తనతాతగారగు అన్నమాచార్యు విగ్రహము నక్కడ ప్రతిష్ఠించినాఁడు. కాని, యావిగ్రహము నేఁడు గానరాకున్నది.

## పెదతిరువెంగళనాథుఁడు

ఈతఁడు సాత్త్వికశుభమూర్తి సంగీతసత్కవిత్వాధికుఁడు నని చిన్నన్నచే స్తుతింపఁబడెను. స్వామిసన్నిధి నీతఁడు సంకీర్తనములు పాడుచుండగా స్వామి యాడుచుండెడువాఁడట ! వెంకటాచార్యుఁడు “విశేషించియు నత్తిరు వెంగళ నాథుండు సంకీర్తనంబుఁబాడిన నాడందొడంగె,”[1] నని చెప్పినాఁడు. ఈతడు చిన్నన్న జీవించియుండఁగా క్రీ 1546 పూర్వమే దివ్యధామ మందినాఁడు.

## చిన్నన్న

ఈతఁడే అన్నమాచార్య చరిత్రకర్త. చినతిరుమలాచార్యున కీతఁడు మూఁడవతమ్ముఁడు. ఈయిర్వురనడుమ అన్నమయ యని పెదతిరువెంగళ నాథుఁ డనీ యిద్దరు సోదరులు. చిన్నన్నతర్వాత తమ్ముఁడు కోనేరునాథుఁడు వీరందఱును సుప్రసిద్ధులు. కోనేరునాథుఁడు 1560 తర్వాతఁ గూడనున్నాఁడు. తాళికోటయుద్ధమును, విద్యానగర వినాశనమును, జూచుదౌర్భాగ్య మునకుఁ బాల్పడక 1565 పూర్వమే వీరందఱు దివ్యధామ మందియుందురు.

1 శకుంతలా పరిణయకృత్యవతరణిక.

# ధర్మకైంకర్యములు

స్వామి కీతఁడును జాల ధర్మకైంకర్యము లొనర్చెను. అందొకటి :– క్రీ. 1546 లో కొండవీటిసీమలోని చెందలూరు మల్లవర గ్రామములను స్వామి శ్రీభండారమున కర్పించెను. రెండుగ్రామములనుండి సంవత్సరపు రాబడి 620 గట్టివరహాలు. ఈ సొమ్ముతో జరపవలసిన ధర్మకైంకర్య ములలో మన కిక్కడ ముఖ్యమయినవి :–

1. వైశాఖమాస విశాఖానక్షత్రమున తాత అన్నమయగారి జన్మనక్ష త్రోత్సవకైంకర్యము.

2. చైత్రమాసము మృగశిరానక్షత్రమున పెదతిరుమలయ్యగారి జన్మ నక్షత్రోత్సవకైంకర్యము.

3. మాఘశుద్ధచతుర్థి తమ పెదతండ్రి నరసయ్యగారి శ్రాద్ధదిన కైంకర్యము.

4. జ్యేష్ఠమాసపూర్వపక్షచతుర్థి తనయన్నగారగు తిరువెంగళప్ప శ్రాద్ధ దినకైంకర్యము.

5. ఆశ్వయుజమాస బహుళ త్రయోదశి తమతల్లిగారైన తిరుమలమ్మ గారి శ్రాద్ధదినకైంకర్యము.

వీనివల్ల నన్నమాచార్యాదుల జన్మమాసనక్షత్రములు నిర్యాణ మాస తిథులు తెలియ నయినవి గాని, వానిసంవత్సరనామములు తెలియ రాకుం డుట కొఱఁతగొల్పుచున్నది. ఒక్కయన్నమాచార్యునివే జననినిర్యాణ సంవత్స రములు తెలియవచ్చినవిగాని , తక్కినవారివి తెలియరాలేదు. సూర్యచంద్రాదు లున్నంతదాఁకఁ బైవారి జన్మనక్షత్ర నిర్యాణకైంకర్యములు సాగుచుండుటకే యాయగ్రహారసమర్పణములు జరగినవి గాని యాధర్మకైంకర్యములకు "శ్రీవైష్ణ వులరక్ష " అని మాటకలదుగాని, అన్నీ అన్యథా అయిపోయినవి. పరమాచార్యుఁ డయిన యన్నమాచార్యునిజన్మనక్షత్ర నిర్యాణ తిథి కైంకర్యము లను స్వామి కనేకాగ్రహారముల నొసఁగి యనేక కైంకర్యములు జరపిన మహావిద్వాంసుడు మహాకవి యగు తిరుమలాచార్యుని నిర్యాణదినకైంకర్యములు నయిన నిఁకమీఁద సాగుట యర్థింపఁదగినది.



అష్టమహిషీకళ్యాణము, పరమయోగివిలాసము, ఉషాపరిణయము, అన్నమాచార్య చరిత్రము చిన్నన్న రచించిన గ్రంథములు. ఈతఁడు జలజాత వాసిని చనుబాలపుష్టిచే కవితారచన నేర్చినాడఁట. ఈతని యన్న పెదతిరు వెంగళనాథుఁడు 'సంగీతసత్కవిత్వాధికుఁడు' సంకీర్తనములు పాడుచుండు నప్పుడు స్వామి యాడుచుండెడువాఁడట. ఈ మహామహులకు ( అయిదుగురుకు) స్వామి పాండవులకుఁ గృష్ణునట్లు సహాయమై యుండెడివాఁడట ! వీరికి 'విచిత్రముక్తాతపత్రరత్నకిరీట ముద్రికా ప్రచండమణిమండిత మకర కుండలోత్కరాహః కరదీపికాపాదుకాది బహూకరణంబులను' స్వామి కరుణించెనట ! చిన్నన్న పరమయోగివిలాసాష్ట మహిషీకళ్యాణములలో రత్నశుంభ దనుపమ శ్రీవేంకటాద్రీశ దత్తమకరకుండలరత్న మండితకర్ణుఁడ నని, కావ్యంబు చెప్పి శ్రీ వేంకటేశు మెప్పించి సకలంబు నెఱుఁగ నసాధారణాంక మకరకుండలములు గొన్నవాఁడనని దినములోననె వేయిద్విపదలింపొంద వినుతవర్ణనలతో విరచించువాఁడనని చెప్పుకొన్నాఁడు. ద్విపదలక్షణము నీతడే నిష్కృష్టముగా నిర్వచించినాడు. లక్షణగ్రంథకారు లెవ్వరుగాని యితనివలె నిర్వచింపఁజాల రయిరి. ఈతఁడు కస్తురివీణఁ గోసినకరణి తెలి గప్పురపుఁ గ్రోవి దెఱచినసరణి విరవాదిపొట్లంబు విడిచినమాడ్కి పరిమళించుచుఁ గవుల్ బళిబళీ యనఁగ కవిత సెప్పినసులక్షణకవి.

అర్వాచీనులు కొందఱు 'తాళ్లపాక చిన్నన్న దండెమీటులుగావు' అనీ 'అలతాళ్ళపాక చిన్నన్న రోమము లైతె తంబురాదండెకుఁ దంత్రులౌనె' అనీ యీతని గొప్పగాయకునిఁగా స్మరించిరి. చిన్నన్న గాయకుఁడనుట కిక్కడి రాగిరేకులలోఁ గాని గ్రంథములలోఁగాని యాధారములు గానరావు. చిన్నన్నకు అన్న తండ్రి తాత గొప్పగాయకులు గాన, యిటీవలి వారు గ్రంథములఁ బట్టి చిన్నన్ననే యెఱిఁగినవారుగాన వారియోగ్యత నీతనికిఁ జేర్చి చెప్పియుండవచ్చును. కాక, యీతఁడును గాయకుఁడేమో ! గణవరపు వెంకటకవి ప్రబంధరాజమున చిన్నన్న నిట్లు సన్నుతించెను :–

క. ఎన్నఁ దెనుఁగునకు రాజను
గ్రన్నన యతిరాజునకును రమణయకును నేఁ
జిన్నను ద్విపద నొనర్పను
జిన్నన్నను బిరుదుగద్య చెప్పినఘనుఁడన్.

నూలినేతచే వస్త్రములు గల్పించి లోకమును నాగరకపఱిచి యుద్ధరించువా రయిన సాలెవారి కీతఁ డాచార్యపురుషుఁడు. వారి వంశమర్యాదల కీతఁడు సంరక్షకుఁడుగా నుండెను. సాలెవారు వీరికి పదివేల వరహాలు పాదకానిక సమర్పించిరి. చిన్నన్న వంశపారంపర్యముగా దమవంశపారంపర్యముగా గురుశిష్యతాసంబంధము వర్ధిల్లఁ గోరిరి. ఇందుకు తామ్రశాసనము వెలయించిరి. [1]

## కోనేటి తిరువెంగళనాథుఁడు

ఈతఁడు సదాశివరాయలచే క్రీ 1544, 1545 అద్దంకిదగ్గఱి బొల్లాపల్లి, ఓలపల్లి అని రెండగ్రహారములఁ బడసినాఁడు. క్రీ 1559 లో కడపజిల్లా పుష్పగిరి చెన్నరాయనికిఁ గొంతభూమి సమర్పించినాఁడు. ఈతఁడు గొప్ప వైభవ మనుభవించినాఁడనుటకీ క్రిందిపద్యముసాక్షి.

సీ॥ మొకరి వాతెర కీర్తిముఖము బంగరుదండె
    పాలకి యేగురుం డోలి నెక్కె
శ్రీజగన్నాథునూర్జితపదాంభోజముల్
    సేవించి యేబుధాశ్రితుఁడు వెలసె
కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
    తెలిసి యేఘనుఁడు సాధించి నెగడె
భక్తితోఁ బట్టాభిషిక్తులు ధరసాగి
    మ్రొక్క నేవిభుఁడు పెంపెక్కి చెలఁగె

నతఁడు పొగడొందు హారనీహారగంధ
సారకర్పూరగోక్షీర సదృశయశుఁడు
ఘనుఁడు పెదతిమ్మదేశికగర్భజలధి
కువలయాప్తుండు కోనేటిగురువరుండు [2]॥

## తిరువెంగళప్ప

ఈతఁడు గొప్పవిద్వాంసుఁడు. అమరుకావ్యమును దెలిఁగించినాఁడు.

1 చూ. తామ్రశాసనము. శ్రీ.వెం.ఓ. జర్నల్. 1 వాల్యుం. 1 పార్టు.
2. ఈ పద్యము శ్రీతాళ్ళపాక సూర్యనారాయణయ్యగారి వ్రాంతకాగితములనుండి కైకొంటిని.



నామలింగానుశాసనమునకుఁ దెలుఁగువ్యాఖ్య రచించినాఁడు. కావ్యప్రకాశికకు వ్యాఖ్య రచించినాఁడు. క్రీ. 1554లో అంబత్తూరు తూప్పిల్ అగ్రహారములలో కొంతభాగము తిరుపతి గోవిందరాజస్వామి పెండ్లి తిరునాళ్ళు జరపించుటకుగా సమర్పించినాఁడు. క్రీ. 1553లో చిన కంచిలో అరులాళప్పెరుమాళ్ళకు వల్లాత్తం జేరి పేరీచ్చంబాకము అను గ్రామము లిచ్చినాఁడు. [1]

## తిరుపతి శాసనములు

తిరుపతి దేవస్థానశాసనము లెల్ల నరవముననే కలవు. సర్వస్వతంత్రుఁడు దక్షిణాపథమునకెల్ల సార్వభౌముఁడును గాన యొక్క శ్రీకృష్ణదేవరాయఁడు మాత్రము గుడిలో సంస్కృత కర్ణాటాంధ్ర ద్రవిడములలోఁ దనశాసనములఁ జెక్కించుకోఁ గలిగెను. తిరుమల తిరుపతి దేవస్థానముల గుడిగోపురములలో దాళ్ళపాక వారి శాసనములు నరవముననే యున్నవి. తిరుమల కొండక్రిందనే తాళ్ళపాక వారి యగ్రహారముగానున్న మంగాపురమునఁ దాళ్ళపాక చినతిరుమలాచార్యుఁడు తాను గట్టించిన కళ్యాణ వెంకటేశ్వర దేవాలయమున శాసనము లన్నింటిని తెలుఁగుభాషలోఁ దెలుఁగులిపిలోనే చెక్కించుకొనెను. శుద్ధాంధ్రు లయిన మహనీయులు సాళువ తిమ్మన, గోవిందన, బయకారరామయ మొదలగువారు శ్రీస్వామి వారి కర్పించిన యగ్రహారాదుల శాసనములుగూడ ద్రవిడముననే ద్రావిడీకరణముఁ బడసిన పేర్లతోనే యున్నవి. శాసనము లెల్ల ద్రావిడముననే యుండుటకుఁ గారణము దేవస్థాన స్థానపతులు ద్రవిడు లగుటయే. గుడిలో శాసనములఁ జెక్కించుట కధికారులు వారే. తిరుమలాచార్యాదులు పదులకొలఁది గ్రామములను స్వామికి సమర్పించు కొన్నారేకాని గుడిలో శాసనములఁ జెక్కించుకోలేదు. ఆయా దాతలిచ్చిన యీవులను బ్రతిగృహీత యగుదేవునికిఁ జెల్లింతుమని దేవస్థాన స్థానపతులు బాధ్యత వహించి యుభయులకు నమ్మికగా శాసనములఁ జెక్కించిరి. దానికి 'శ్రీవైష్ణవరక్ష' వెట్టిరి. తిరుమలాచార్యులనాఁడు శాసనములఁ జెక్కించినయుద్యోగి తిరునిన్రార్‌వుడయ౯ . స్వామిపుష్కరిణి కడ మాత్రము పెద తిరుమలాచార్యుఁ డొక తెలుఁగుశాసనము వేయించు

1 పై చరిత్ర విషయములు పెక్కులు శ్రీసాధుసుబ్రహ్మణ్యశాస్త్రులుగారు రచించిన శాసనముల రిపోర్టులోని విషయములు శాసనములు చదివి సమకూర్చినవి.

కొనెను. పద్యరూపముగాఁ గూడ నది తాళ్ళపాక సూర్యనారాయణయ్యగారి ప్రాఁత కాగితములలో నున్నది. అది యిది :-

సీ. శ్రీశాలివాహనాంచితశకాబ్దము లెన్న
నిల వేయునన్నూఁట యేఁబదియును
నాలవయేఁడగు నందనవత్సర
వైఖాఖపూర్ణిమావాసరమున
శ్రీ వేంకటాధీశ శృంగారసంకీర్త
నాచార్యతాళపాకాన్నమార్య
పుత్త్రతిమ్మార్యుండు పూర్వపుఁగోనేఱు
కట్టించె నవశిలాకలితముగను

తత్తటాంకణగోపురద్వారములను
భువనసన్నుతుఁ డైనట్టి భూవరాహ
ఘనుని తిరుచుట్టుమాలె ప్రాకారవరము
తానె కట్టించె నాచంద్ర తారకముగ.

## నేఁటి తాళ్ళపాకవారు

తిరుపతిలో స్వామికి సంకీర్తనకైంకర్యము జరుపుచుఁ దాళ్ళపాక శేషాచార్యులగారు కుటుంబవృద్ధితో నున్నారు. మడితాడుగ్రామవాసి, సూర్యనారాయణయ్యగారు చిన్నన్న కోవలోనివారట. నేఁడు తిరుపతిలోనె వైద్యాదివృత్తులతో సకుటుంబముగా నున్నారు. వీరే తాళ్ళపాక వారి పూర్వగాథ లకై చాల శ్రమించుచున్నవారు. అన్నమాచార్యుల దేవతార్చన విగ్రహాదులను మంగాపురమునకుఁ జేర్చినవారు వీరే. ఇంకను కడపజిల్లాలో ముదుంపాడు, ఊటకూరు, మాచనూరు, రాజుపాలెం, ఎఱ్ఱువారిపాలెం అనుగ్రామములోఁ గూడఁ దాళ్ళపాకవారు పెదతిరుమలాచార్యుల యయిదుగురు కుమాళ్ళ వంశపరంపరలవారు ఉన్నారట. శ్రీసూర్యనారాయణయ్యగా రాయాగ్రామ ముల కరిగి యక్కడి విశేషములఁ దెలిసికొనివచ్చిరి. మఱికొన్ని విగ్రహాదులు ముదుంపాడు గ్రామమునఁ గలవని తెలుపఁగా వానిసేకరింపఁ గోరి వారి నాగ్రామమున కంపితిని. కాని, వారు విగ్రహముల నీయురయిరట.



గ్రంథములు శిథిలమయిపోయినవట. తాళ్ళపాకవారి యిండ్లనుండి (కడపజిల్లా) కొన్ని తాళపత్రగ్రంథము లాంధ్రసాహిత్య పరిషత్తువారు సేకరించినట్లున్నారు. (చూ. 6 వాల్యూం. పరిషత్పత్రిక)

## నందవరీకులు - వైష్ణవత

అన్నమయ యాదిగఁ శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవుఁడైనట్టే యాకాల మున నందవరీక బ్రాహ్మణులు మఱికొందఱు వైష్ణవము స్వీకరించి శఠకోప యతిశిష్యు లయిరి. అల్లసాని పెద్దనకూడ నందవరీకబ్రాహ్మణుఁడే స్మార్తుఁడే శఠకోపయతి శిష్యుఁడై వైష్ణవము పుచ్చుకొన్నాఁడు. ప్రబంధరాజవిజయ వేంకటేశ్వర విలాసము రచించిన గణపవరపు వెంకటకవి గూడ నందవరీ కుఁడే. వారి పూర్వులు వైష్ణవము పుచ్చుకొన్నవారే. కాని, యాతఁడు తాళ్ళపాక వారికిఁ జాలఁ దర్వాతివాఁడు. శ్రీవేంకటేశ్వరస్వామిపై నాతఁడు రచించిన కృతి వెంకటేశ్వరవిలాస మాతఁడన్నట్లు ప్రబంధరాజమే. నందవరీకులు గొందఱు వైష్ణవులగుటకుఁ బ్రధానముగా నన్నమాచార్యుఁడే కారణమను కొందును. ఆరాధ్యశైవుఁడగు తెనాలి రామకృష్ణుఁడు వైష్ణవుఁ డగుటకుఁ గూడ నీతాళ్ళపాకవారి పలుకుబడి కలదేమో. ఆతని కృతిపతి విరూరివేదాద్రిమంత్రి నందవరబ్రాహ్మణుఁడేమో. 'విరూరి' యింటిపేరివారు నందవరీకులు నేఁడున్నారట. రామకృష్ణుని గురువగు కందాడ అప్పలాచార్యుఁడు తాళ్ళపాక పెదతిరుమలాచార్యునకును గురువు. కాన, పెదతిరుమలయ్య రామకృష్ణుఁడు సతీర్థ్యులు.

## అన్నమాచార్యాదులు తిరిగిన దేశములు

అన్నమాచార్యుఁడు కడప, కర్నూలు, బళ్ళారి, యనంతపురము, చిత్తూరు, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినా పల్లి, మండలములలో సంచారముచేసిన ట్లున్నాఁడు. కృష్ణగోదావరి మండలముల నెఱుఁగడేమో ! అన్నమాచార్యుని మనుమఁడు చిన్నన్న గుంటూరు కృష్ణామండలములఁగూడఁ దిరిగినవాఁడు. ఆతనికి శిష్యులు సాలెవారు సర్వాంధ్రదేశమున నుండిరి.

## కీర్తించిన వేల్పులు

అన్నమాచార్యుఁడును ఆయనకొడుకు పెదతిరుమలాచార్యుఁడును మనుమఁడు చినతిరుమలాచార్యులును నీక్రిందిపుణ్యస్థలములలోని దేవతలఁ బేర్కొని సంకీర్తనములు చాల రచించిరి. మాడుపూరికేశవుఁడు కృష్ణుఁడు, దాసరిపల్లె రాముఁడు, మండెము నృసింహుఁడు, కదిరి నృసింహుడు, కదిరి వసంతుఁడు, చెంజినవనీతకృష్ణుఁడు, కళసాహనుమంతుఁడు, అహోబల నృసింహుడు, విజయనగరవేంకటేశ్వర విట్ఠల నరసింహహనుమంతులు, కడప వెంకటేశ్వరుఁడు, తిరుపళాచ్చివిష్ణుఁడు, తిరువళ్ళూరి వీరరాఘవుఁడు, కంచి వరదరాజు గండవరముగోపాలుఁడు, కుఱునూతుల చెన్నుఁడు, చేగలమఱ్ఱి చెన్నుఁడు, వావిలిపాడు రాముఁడు, ఉద్దగిరికృష్ణుఁడు, గుత్తిరాముఁడు, వెలుగోటి కేశవుఁడు , మంగాంబుధి హనుమంతుఁడు, నల్లబల్లి చెన్నుఁడు, ఊటుకూరి చెన్నకేశవుఁడు, కోవెలగుంట్లగోపాలకృష్ణుడు, ఓగునూతులనృసింహుఁడు, కోనచెన్నరాయఁడు, శ్రీరంగమురంగనాథస్వామి, ఒంటిమెట్ట వీరరఘు రాముఁడు, చుక్కపల్లి చెన్నుఁడు, కోసువానిపల్లె ,చెళ్లపిళ్ళ,, నెల్లూరు – అధ్యాత్మ సంకీర్తనములలో చదివిచూచి నంతలోఁ గానవచ్చిన నివి. కడముట్ట బరిశీలించినపై నింక నెన్నియగునో !

## సంకీర్తనముద్రాసామ్యములు

తాళ్ళపాక అన్నయ తిరుమలాచార్యులకు నిన్నూఱువర్షములఁ దర్వాత కాలమున క్రీ 1650 ప్రాంతముల వర్తిల్లిన క్షేత్రయ్యయును క్షేత్రయ్య కించు మించుగా నిన్నూఱేండ్లతర్వాత వర్తిల్లిన త్యాగరాయలవారును నిట్లే యనేక దివ్యస్థలముల దేవతలపై సంకీర్తనముల రచించిరి. తాళ్ళపాకవారాయాదేవ లకుఁ దిరుపతి వేంకటేశ్వరునితో నభేదము గల్పించి వేంకటేశ్వరనామ ముద్ర యుంచినట్లు క్షేత్రయయు నాయాక్షేత్రములదేవతలకు మువ్వగోపాలునితో నభేదము గల్పించి మువ్వగోపాల ముద్రను సంకీర్తనములకుఁ గూర్చెను. త్యాగరాయలవా రాయాక్షేత్రముల దేవతలఁ బేర్కొనుచుఁ గడపటి చరణమునఁ దనపేరే ముద్రగా వెలయించిరి.

రాజస్తుతిపరాఙ్ముఖత్వము, దేవతార్చనవిగ్రహములను గోల్పోవుట, మొదలగు విషయములు కొన్ని యన్నమాచార్యునకును, త్యాగరాజునకును



సమానముగాఁ దటస్థించినవి. అన్నమాచార్యుని శృంగారసంకీర్తనరచనాంశము క్షేత్రయ్యగాను అధ్యాత్మసంకీర్తనరచనాంశము త్యాగయ్యగాను నవతారముదాల్చె ననఁజెల్లును. అన్నమాచార్యునట్లు సంకెళ్ళువేసి చెరలోనుంచుట స్వామికృపవలన నాక్లేశము తొలఁగిపోవుట రామదాసు గారికిని గలిగెను.

## అన్నమాచార్యుని పలుకుబళ్ళు

అన్నమాచార్యుని సంకీర్తనములభాష పశ్చిమాంధ్ర దేశమున వాడుక గన్నది. ఆతనిపలుకుబళ్ళు చాలా కృష్ణరాయలయుఁ దదాస్థాన కవులయు రచనలలోని కెక్కినవి. రాయలతోఁ దఱచుగాఁ దిరుపతికి వచ్చి స్వామి సన్నిధికి తాళ్ళపాకవారి సంకీర్తనముల వినుచుండుటచే నాయాకవులకు వీరి పలుకుబళ్లు సుపరిచితములయి యుండవచ్చును. మచ్చుకుఁ గొన్ని :-

చిగురుఁగొమ్మైనఁ జేవ, మీసాలపై తేనియల్, సందుసుడిమాయలు, తంగేటిజున్ను, నూతులుత్రవ్వితే బేతాళాలుబయల్పడును, కోలగగ్గెర, పొరివిడంగాయములు, గోవాళ్లు, చిందువందు, తలపూవాడక.

తాళ్ళపాకవారి సంకీర్తనముల ఛాయలు వేమన పద్యములలోని కెక్కినవి.

## ఛాయాపహారులు

తన సంకీర్తనచ్ఛాయాపహారులను – వా రెవరో పేరు తెలియదు అన్నమయ కటువుగా గర్హించెను.

రామక్రియ

వెఱ్ఱులాల మీకు వేడుక కలితేను ।
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ॥పల్లవి॥

ముడిచి వేసినపువ్వు ముడువ యోగ్యముగాదు ।
కుడిచివేసినపుల్లె కుడువఁగాఁ గాదు ।
బడి నొకరు చెప్పినఁ బ్రతిచెప్పఁ బోతేను ।
అదరి శ్రీహరికి నది అరుహము గాదు ॥వెఱ్ఱి॥ 1

గంపెడుముక దినఁగా నొక్కవరిగింజ ।
తెంపునఁ గలసితే తెలియనెట్టువచ్చు ।
జంపులం బలవరించఁగ నొకమంచిమాట ।
ఇంపైతె హరి యందు కిచ్చునా వరము ॥వెఱ్ఱి॥ 2

ఉమిసినతమ్మలో నొకకొంత క్రపము ।
సమకూర్చి చవిగొని చప్పరించనేల ।
అమరంగ ఛాయాపహారము చేసుక ।
తమమాట గూర్చితే దైవము నగఁడా ॥వెఱ్ఱి॥ 3

చిబికి వేసినగింజ చేతఁ బట్టఁగనేల ।
గబుక కెంగిలిబూరె గదుగంగ మఱియేల ।
తొబుక కవిత్వాల దోషాలఁ బొరలితే ।
దిబుకార నవ్వడా దేవుఁ డైనాను ॥వెఱ్ఱి॥ 4

మించు చద్దికూటిమీఁద నుమిసినట్టు ।
మంచి దొకటి చెప్పి మఱి చెప్పనేరక ।
కంచుఁ బెంచు నొక్కగతి నదికితే మట్టి ।
పెంచువలెనే చూచుఁ బెరుమాళ్ళు వాని ॥వెఱ్ఱి॥ 5

పుచ్చినట్టిపండు బూఁజిలోననెవుండు
బచ్చనకవితలు బాఁతిగావు యెందు ।
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిఁగినట్లు ।
మ్రుచ్చిమి నుతు లేల మ్రొక్కరో హరికి ॥వెఱ్ఱి॥ 6

ఉల్లిదిన్నకోమ టూరక ఉన్నట్లు
జల్లెడ నావాలు జాఱిపోయినట్టు ।
కల్లలు చెప్పి యాకత కుత్తరములీక ।
మెల్లనే ఉండితే మెచ్చునా దైవము ॥వెఱ్ఱి॥ 7

నేతిబీఱకాయ నేయి అందు లేదు ।
రాతివీరునికి బీరము ఇంచుకా లేదు ।



ఘాత బూరుగుఁబండు కడుపులోన దూది ।
ఏతులనుడుగులు యెక్కునా హరికి ॥వెఱ్ఱి॥ 8

ఇరుగువా రెఱుఁగరు పొరుగువా రెఱుఁగరు ।
గొరబైనమాటలు గొణఁగుచునుందురు ।
పరులఁ గాదందురు బాతిగారు తాము ।
విరసు లట్టివారి విడుచు దేవుండు ॥వెఱ్ఱి॥ 9

ఎన్నఁగ శ్రీ వేంకటేశుఁ దాళ్ళపాక ।
అన్నమాచార్యులు అఖిలదిక్కులు మెచ్చ ।
ఉన్నతితోఁ బాడి రొకఁ డెవ్వఁడో తాను ।
సన్న నొరసునట సమ్మతా హరికి ॥వెఱ్ఱి॥ 10

అన్న. అధ్యా. 196 ఱేకు.

పాడి

నరసింహా రామకృష్ణ నమో శ్రీవెంకటేశ ।
సరుగ నాశత్రుల సంహరించవే ॥పల్లవి॥

బావతిట్లకు శిశుపాలునిఁ జంపిన ।
యేవకోపకాఁడవు నేఁ డెందు వోయితివి ।
నీవాఁడ నని నన్ను నిందించీ శత్రువును ।
చావఁగొట్టి వాని నిట్టె సంహరించవే ॥నర॥ 1

దాసుని భంగించేటితఱిఁ గసివుఁ జంపిన ।
యీనుకోపకాఁడ విపు డెందు వోతివి ।
మేనుల నీ లాంఛనాల మించి నన్ను దూషించీ ।
సాసించి శత్రువును సంహరించవే ॥నర॥ 2

కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁ జంపిన ।
యెల్లఁగాఁగఁ గోపకాఁడ వెందువోతివి ।
యిల్లిదె శ్రీ వెంకటేశ యీ నీమీఁది పాటలు ।
జల్లన దూషించుశత్రువు సంహరించవే ॥నర॥ 3

అన్న. అధ్యా. 378 ఱేకు.

చాలా కోపగాఁడయి యీ సంకీర్తనలు రచించినాఁడు. కవితా శత్రు వెవ్వఁడో యీతనిఁ గాసిపఱిచినట్టున్నాఁడు.

## భాషా విశేషములు

చక్కఁగా గ్రాంథికభాషను నేర్చినవాఁడయినను నీతఁడు సంకీర్తన ములలో జాలచోట్ల వాడుకభాషనే యుపయోగించినాఁడు. సంకీర్తన లక్షణమున నాతఁడు చెప్పినదానికి మనుమఁడు చినతిరుమలయ్య యిట్లు తెలుఁగు చేసినాఁడు.

క॥ పల్లవనారీమ్లేచ్ఛా
దృల్లాసమనోజ్ఞబంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యము లైనను
హల్లీసక ముఖ్యనాటకాదిక ఫణితిన్ ॥

క॥ జగతిఁ గడుఁ జెల్లుబళ్ళై
నగి నగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగ దన రహిచెడుఁ బువ్వుల
సొగ సుడుగన్ బిసికి కంపుసూపిన భంగిన్ ॥

వచ్చీని, పోయీని, చేసీని, ఆడుతా, చేయరంటా, చిముడుతా, ఏమిచెప్పే, దమ్మా, అమ్మలాలా, అయ్యలాలా, ఏవూరికేవూరు యేనాటి ఋణము, (సంధి కూర్పవలసినచోట్లు కూర్పక వయ ఆగమములు చేర్చుట) పోయె, ఆయె, ననుటకు పోయ, ఆయ అనుట, లోకవాడుక దినదినకొత్తలు (వైరిసమాస ములు) ఇత్యాదివిధముల వాడుకభాష నీకవులు ప్రయత్నముతోఁ గోరీ ప్రయో గించినారు. అరవములోవలె నీ కవులు ఉదంత తద్ధర్మార్థక క్రియాజన్య విశేషణములకు సమాసములో ద్రుతము చేర్చిరి. పోవుంద్రోవ చెప్పుంబలుకులు ఇత్యాదులు. దీమసపుఁబారివార (వారలార అనుటకు) కట్టివార (వారలార అనుటకు) ఇట్టి ప్రయోగము నాచనసోమనయు 'వెఱ్ఱివార పిడుగు వ్రేసినఁ దలటొప్పి యాగునే' అని చేసెను. నాచన సోమనరచనల యనుకృతులీ సంకీర్తనములలోఁ జాలఁ గలవు. 'ఎదిరి కిన్మడఁచువాఁడు తనకుఁ దగరంబు సఱచు టెంతటిభరమ్ము' నాచనసోమన నానుడి యిది



'ఎనలేక యెదిరికి యినుమడిచే వానికి తనకు తగర మదువఁదడ వయ్యీనా' అని సంకీర్తనమున కెక్కినది.

నిఘంటువుల కెక్కని దేసి తెలుఁగుపలుకు లీ సంకీర్తనములలో నెన్నో కలవు. అట్టివాని నెల్ల సేకరించి వేఱుగా నిఘంటువులకుఁ బరిశిష్ట ములు వెలయింపఁదగును.

## కవితారీతులు

అన్నమాచార్యుఁడు నరసన్న (కవికర్ణరసాయనకర్త?) పెద తిరుమ లయ్య చిన్నన్న –శబ్దార్థశుద్ధి గలిగిన వరకవులు. అన్నమయ మఱీసరిగాఁ బోతన వలె సహజకవితావిశారదుఁడే. స్వామి పలికింపఁగా దాను పలికితినని చెప్పుకొన్నాఁడు. ఆతఁ డాడినది యమృతకావ్యము పాడినది పరమ సంకీర్తన మయినది. అన్నమయ తెలుఁగు నొడికారమునఁ గడుదిట్ట. సంస్కృతమునఁ గూడ సత్కవితారచన నేర్చినవాఁడు. పెద తిరుమలాచార్యాదులు సంస్కృతాం ధ్రాది భాషలలో నన్నమయవలె విద్వాంసులు. పెదతిరుమలాదులరచనలలో పాండిత్యప్రకర్షము పదబంధపుజిగిబిగి యధికముగా నుండును. అన్నమాచార్య సంకీర్తనములును శృంగారమంజరియు తేటతేటగా, తేలిక తేలికగా, తియతియ్యగా, హాయిహాయిగా, గోస్తనీద్రాక్షాగుళుచ్ఛములవలె నాస్వాద్యము లయినవి. వానియర్థవిశేషములు శ్రోతలహృదయములలో సులువుఁగా జొరఁ బాఱి వానిని చూఱగొని కొనిపోయి యేడుకొండల నెక్కించి భగవంతుని పాదారవిందములపజ్జ నడంకువతో నత్తియుండునట్లు చేయఁగలవి! అన్నమాచార్యుఁడు తిరుపతి కొండమీఁద జగదేకనాథుఁడు ప్రత్యక్షమై వెలసియున్నాఁడని ఓహోప్రజలారా! నామాట వినుండు. దర్శించి కృతార్థులు కండు రండు రండని రెండుచేతులెత్తి యాహ్వానించినతీ రాలకింపఁదగినది.

రామక్రియ

చాటెద నదియే సత్యము నుండో ।
చేటులే దతని సేవించినను ॥పల్లవి॥

హరి నొల్లనివా రసురలు సుండో ।
సుర లీతని దాసులు నుండో ।

పరమాత్ముఁ డితఁడె ప్రాణము సుండో ।
మరుగక మఱచిన మతిలే దింకను ॥చాటెద॥ 1

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో ।
సోదించె శుకుఁ డచ్చుగ సుండో ।
ఆది బ్రహ్మగన్నాతఁడు సుండో ।
యేదెస వెదకిన నితఁడే ఘనుఁడు ॥చాటెద॥ 2

యిహపరమొసఁగను యీతఁడె సుండో ।
వహి నుతించెఁ బార్వతి సుండో ।
రహస్య మిదివో రహి శ్రీవేంకట।
మహీధరంబున మనికై నిలిచె ॥చాటెద॥ 3

అన్న. అధ్యా. 138 ఱేకు.

వైష్ణవు లనఁగా నిట్టివారట :-

అహిరి

మదమత్సరము లేక మనసు పేదైపోవ।
పదరిన యాసలవాఁడువో వైష్ణవుఁడు ॥పల్లవి॥

ఇట్టు నట్టుఁ దిరుగాడి యేమైనాఁ జెడనాడి ।
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కు లాడి ।
ఎట్టివారి నైనా దూఱి యెవ్వరినైనాఁ జేరి ।
వట్టి యాసలఁ బడని వాఁడువో వైష్ణవుఁడు ॥మద॥ 1

గడనకొఱకుం జిక్కి కాముకవిద్యలఁ జొక్కి ।
నిడివి నేమైనాఁ గని నిక్కినిక్కి ।
ఒడలి గుణముతోడ వుదుటువిద్యలఁ జాల ।
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ॥మద॥ 2

ఆవల వొరులఁ జెడనాడఁగ వినివిని ।
చేవమీఱి యెవ్వరినిఁ జెడనాడక ।
కోవిదు శ్రీవెంకటేశుఁ గొలిచి పెద్దలకృప ।
వావివర్తన గలవాడువో వైష్ణవుఁడు ॥మద॥ 3

అన్న. అధ్యా. 9 ఱేకు.



ధన్నాసి

వైష్ణవులు గానివార లెవ్వరు లేరు ।
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁ గాన ॥పల్లవి॥

అంతయు విష్ణుమయం బట మఱి దేవ ।
తాంతరములు గల వననేలా ।
భ్రాంతిఁ బొంది యేభావము భావించి ।
నంతటనే పుణ్యు లౌట దప్పదుగాన ॥వైష్ణ॥ 1

ఎవ్వరిఁ గొలిచిన నేమిగొఱఁత మఱి ।
యెవ్వరిఁ దలఁచిన నేమీ ।
అవ్వలివ్వల శ్రీహరిరూపు గాని వా ।
రెవ్వరు లే రని యెఱుక దోచినఁ జాలు ॥వైష్ణ॥ 2

అతిచంచలంబైన యాతుమ గలిగించు ।
కతమున బహుచిత్తగతులై ।
యితరులఁ గొలిచిన యెడయక యనాథ ।
పతి తిరువేంకటపతి చేకొనుఁగాక ॥వైష్ణ॥ 3

అన్న. అధ్యా. 6 ఱేకు.

భూపాళం

ఏకులజుఁడేమి యెవ్వఁడైననేమి ।
ఆకడ నాతఁడే హరి నెఱిఁగినవాఁడు ॥పల్లవి॥

పరగిన సత్యసంపన్నుఁ డైన వాఁడె ।
పరనిందసేయఁ దత్పరుఁడు గానివాడు ।
అరుదైన భూతదయానిధి యగువాఁడే ।
పరులుఁ దానే యని భావించువాఁడు ॥ఏకుల॥ 1

నిర్మలుండై యాత్మనియతిఁ గలుగువాఁడే ।
ధర్మతత్పరబుద్ధిఁ దగిలినవాఁడు ।
కర్మమార్గములు గడవనివాఁడే ।
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు ॥ఏకుల॥ 2

జగతిపై హితముగాఁ జరియించువాఁడే ।
పగలేక మతిలోన బ్రతికినవాఁడు ।
తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే ।
తగిలి వేంకటేశు దాసుఁడయినవాఁడు॥ఏకుల॥ 3

అన్న. అధ్యా. 47 ఱేకు.

లలిత

విజాతు లన్నియు వృథావృథా ।
అజామిళాదుల కది యేజాతి ॥పల్లవి॥

జాతిభేదములు శరీరగుణములు ।
జాతిశరీరము సరిఁ దోడనె చెడు ।
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది ।
యీతల హరివిజ్ఞానపు దాస్యం బిదియొక్కటెపో సుజాతి ॥విజా॥ 1

హరి యిందరిలో నంతరాత్ముఁడి దె ।
ధరణి జాతిభేదము లెంచిన ।
పరమయోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి ।
ధరణిలోనఁ బరతత్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి ॥విజా॥ 2

లౌకికవైదిక లంపటులకు నివి ।
కైకొనునవశ్య కర్తవ్యంబులు ।
శ్రీకాంతుఁడు శ్రీ వేంకటపతి సేసిన సంపాదనమిందఱికి ।
మేకొని యిన్నియు మీఱినహరికి మీనామమే సుజాతి ॥విజా॥ 3

అన్న. అధ్యా. 177 ఱేకు.

నాదనామక్రియ

ప్రపన్నులకు నిది పరమాచారము ।
విపరీతాచారము విడువఁగ వలయు ॥పల్లవి॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని ।
నగధరు శరణము నమ్మి యాచార్యుని ।
బగి వాయనిదే పరమవైష్ణవము ॥ప్రప॥ 1



దురహంకారము దుఃఖము సుఖమునుఁ ।
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక ।
దరిశనాభిమానాన ధర్మము వదలక ।
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ప్రప॥ 2

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి ।
యెపుడూఁ దీర్ఘప్రసాదేచ్ఛతోడ ।
నిపుణత శ్రీవేంకట నిలయుండె గతియని ।
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ప్రప॥ 3

అన్న. అధ్యా. 166 ఱేకు.

లక్ష్మీవిలాసము :-

గుండక్రియ

రూకలై మాడలై రువ్వలై తిరిగీని ।
దాకొని వున్నచోటఁ దా నుండ దదివో ॥పల్లవి॥

ఒకరిరాజుఁ జేసు నొకరి బంటుగఁ జేసు ।
వొకరికన్నెల వేఱొకరికి నమ్మించు ।
వొకచోట నున్నధాన్య మొకచోట వేయించు ।
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము ॥రూక॥ 1

కొందరిజాళెలు నిండు కొందరికి సొమ్ములవు ।
కొందరిపుణ్యులఁ జేసు గొందరిఁ బాపులఁ జేసు ।
కొందరికొందరిలోనఁ గొట్లాట వెట్టించు ।
పందె మాడినటువలెఁ బచరించు పసిఁడీ ॥రూక॥ 2

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు ।
తగిలి శ్రీ వేంకటేశు తరుణియై తానుండు ।
తెగనిమాయైయుండు దిక్కుదెసయై యుండు ।
నగుతా మా పాలనుండి నటియించుఁ బసిఁడీ ॥రూక॥ 3

అన్న. అధ్యా. 92 ఱేకు.

తత్త్వ విచారణ :–

భూపాళం

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు ।
ఎప్పుడును జింతించే నిదేపనై నేను ॥పల్లవి॥

పొలసి నీరూప మెట్టు పొడసూపేవో ।
ఎలమి నాభాగ్య మింక నెట్టున్నదో ।
అలరి నా కేబుద్ధి ఆన తిచ్చేవో ।
కలిగిన నీ మాయ యేగతిఁ గడచేనో ॥చెప్పవే॥ 1

వరుస నాకెట్లాఁ గైవస మయ్యేవో ।
ఇరవై నాజన్మ ఫల మెట్లున్నదో ।
పరగ నామతినెట్లుపాయకుండేవో ।
కరుణానిధిని నిన్నేకరణి మెప్పించేనో ॥చెప్పవే॥ 2

పనిపడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా।
మనసుచంచల మెట్టు మట్టు పడీనో ।
ఎనలేనినాతలఁపు లెటిఁగి శ్రీవేంకటేశ ।
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో ॥చెప్పవే॥ 3

భౌళి

పట్టినచోనె వెదకి భావింపవలెఁ గాని ।
గట్టిగా నంతర్యామి కరుణించును ॥పల్లవి॥

ఇంటిలోని చీకటే యిట్టె తప్పక చూచితే ।
వెంటనే కొంతపడికి వెలుఁ గిచ్చును ।
అంటి కానరాని తనయాత్మ తప్పకచూచు।
కొంటెఁ దన యాత్మయును గొబ్బునఁ గాన్పించును ॥పట్టి॥ 1

మించికఠినపు రాతిమీఁదఁ గడువ వెట్టితే ।
అంచెలఁ దానే కుదురైనయట్టు ।



పొంచి హరినామ మేప్రొద్దు నాలికతుదను ।
ఎంచి తలఁచఁదలఁచ నిరవౌ సుజ్ఞానము ॥పట్టి॥ 2

ఒక్కొక్కయడుగడుగె ఒగి ముందు వెట్టితే ।
ఎక్కువౌ కొండైన నెక్కుఁగొనకు ।
ఇక్కువ శ్రీవేంకటేశు నిటు దినదినమును ।
పక్కనం గొలిచితె బ్రహ్మపట్ట మెక్కును ॥పట్టి॥ 3

లలిత

ఆడుతాఁ బాడుతా నీతో నట్టే ముద్దు గునుసుతా ।
వోడక నీదండ చేరి చున్నారమయ్యా ॥పల్లవి॥

ఆసఁ దల్లిదండ్రిమోము అట్టె చూచి శిశువులు ।
యేసుఖదుఃఖములుఁ దా మెఱుఁగనట్టు ।
వాసుల శ్రీపతి మిమ్ము వడి నాత్మఁ దలఁచుక ।
యాసులఁబుణ్యపాపము లెఱఁగమయ్యా ॥ఆడుతా॥ 1

ఏలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు ।
ఆలకించి పరులఁ బో యడుగనట్టు ।
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా ।
యేలని యేమియుఁ గోర నెఱుఁగమయ్యా ॥ఆడుతా॥ 2

చేతఁజిక్కి నిధానము చేరి యింటఁ గలవాఁడు ।
యేతులఁ గలిమిలేము లెఱుఁగనట్టు ।
ఆతుమలో శ్రీవేంకటాధిప నీ వుండఁగాను ।
యాతలనే వెలుతులు నెఱుఁగమయ్యా ॥ఆడుతా॥ 3

అన్న. అధ్యా. 268 ఱేకు.

భైరవి

కరుణానిధి నీవే కనుఁగొంచు నున్నాఁడవు ।
యిరవై నాలో నున్నాఁడ వేది గతి యింకను ॥పల్లవి॥

పేరుచున్నవి నాలోనఁ బెక్కువికారములు ।
వూరుచున్న వెన్నైనా వూహ లెల్లాను ।
చేరుచున్న వొక్కొక్కటే సేనా సేన కోరికలు ।
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యింకను ॥కరు॥ 1

పట్టుచున్నవి నానాప్రకృతులవోజలు ।
పుట్టుచున్నవి యనేకభోగేచ్ఛలు ।
చుట్టుకొనుచున్నవి సులభపువేడుకలు ।
యిట్టివి నానడకలు యేదిగతి యింకను ॥కరు॥ 2

సందడింపుచున్నవి సారెకు నామమతలు ।
ముందువెనకై వున్నవి మోహాలెల్లా ।
చెందె నీపై భక్తి శ్రీవెంకటేశ్వర ।
యెందునూ నీవే కాక యేది గతి యింకను ॥కరు॥ 3

అన్న. అధ్యా. 238 ఱేకు.

లలిత

నమో నారాయణ నా విన్నప మిదివో ।
సమానుఁడఁగాను నీకు సర్వేశ రక్షించవే ॥పల్లవి॥

మనసు నీ యాధీనము మాటలు నీ వాడేటివే ।
తనువు నీపుట్టించినధన మిది ।
మునునీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే ।
వెనుక నన్ను నేరాలు వేయక రక్షించవే ॥నమో॥ 1

భోగము లెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి ।
యీగతి నాబతుకు నీ కిరవైనది ।
చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే ।
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే ॥నమో॥ 2

వెలినీవే లోనీవే వేడుకలెల్లా నీవే ।
కలకాలమును నీకరుణే నాకు ।



యిల శ్రీవెంకటేశ నీవేలుకొన్నబంట నింతే ।
నెలవు దప్పించక నీవే రక్షించవే ॥నమో॥ 3

అన్న. అధ్యా. 235 ఱేకు.

పెండ్లి తిరునాళ్లు :-

సామంతం

పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమె రారో ।
దెసలఁబేరంటాండ్లు దేవుని పెండ్లికిని ॥పల్లవి॥

శ్రీవెంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి ।
దైవికపుఁ బెండ్లి మూహూర్తము నేఁడు ।
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె ।
దేవతలు రారో దేవుని పెండ్లికిని ॥పసిఁడి॥ 1

కందర్ప జనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి ।
పందిలి లోపలం దలఁబాలు నేఁడు ।
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి ।
అందుక మునులు రారో హరిపెండ్లికిని ॥పసిఁడి॥ 2

అదె శ్రీవెంకటపతి కలమేలుమంగకును ।
మొదలి తిరుణాళ్ళకు మొక్కేము నేఁడు ।
యెదుట నేగేరు వీరే యిచ్చేరు వరము లివె ।
కదలి రారో పరుషఘనులు పెండ్లికిని ॥పసిఁడి॥ 3

అన్న. అధ్యా. 234 ఱేకు.

రామక్రియ

గరుడధ్వజంబెక్కె కమలాక్షుపెండ్లికి ।
పరుషలదివో వచ్చేఁబైపై సేవించను ॥పల్లవి॥

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు ।
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల ।

కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి ।
వేడుకలు మీఱఁగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరుడ॥ 1

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన ।
మొరసె దేవదుందుభి మ్రోఁత లెల్లను ।
బెరసె సంపద లెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి ।
తిరమైమించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥ 2

వేసిరి కానుక లెల్ల వేవేలు కొప్పెరల ।
పోసి రదే తలఁబ్రాలు పుణ్యసతులు ।
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను ।
సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికిని ॥గరుడ॥ 3

అన్న. అధ్యా. 204 ఱేకు.

వెంకటేశ్వరస్వామిపెండ్లి తిరునాళ్ళు మన యన్నమాచార్యుఁడే తొలుత వెలయించినవాఁడుగాఁ దోఁచుచున్నాఁడు. ఆగమ శాస్త్రమున వివాహోత్సవము చేయుచున్నమాన్యుఁడే కన్యాదాతగావర్తిల్లనగునని కలదట. కనుకనే శ్రీపాదరేణు మాహాత్మ్యమున నిట్లున్నది.

శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నఁడు దారవోయుచోఁ ।
దాళులపాక యన్నమయ దాఁగడిగెం బదముల్, ధరిత్రిమా ।
తాళుపాక చిన్ననపదంబులు పాడిన నాడె సర్వరాట్ ।
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే ॥

శకుంతలా పరిణయ కృత్యవతరణిక నిట్టున్నది.

"మఱియు నమ్మహాదేవుండు మదీయ మాతామహ వంశ శిఖారత్నం బగు నన్నమాచార్యునకు జామాతరుండనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించెనట."

దేవాలయములో సంవత్సరోత్సవములను తెల్గుదేశమున కళ్యాణోత్స వములనీ ద్రవిడదేశమున బ్రహ్మోత్సవములనీ నేఁడు పేర్కొనుట కలదు. ఆలయములలో స్వామి ప్రతిష్ఠజరగిననాళ్ళే యా యుత్సవములనాళ్ళట. శ్రీ



వేంకటేశ్వరస్వామి బ్రహ్మప్రతిష్ఠితుఁడు గనుక, ఆప్రతిష్ఠ జరగించిన బ్రహ్మపేర తిరుపతి వర్షోత్సములు బ్రహ్మోత్సములయ్యెననీ దాని ననుసరించ దక్షిణదేశపు దేవోత్సములకెల్ల బ్రహ్మోత్సవములని పేరు సంక్రమించెననీ ఆ యుత్సవము లలో కళ్యాణము జరుపుట తెల్గుదేశమునఁ గ్రొత్తగాఁ గలిగిన యాచారమని శ్రీపరవస్తు రామానుజస్వామి ఎం.ఏ. గారు చెప్పుచున్నారు.

బ్రహ్మోత్సవము :-

అహిరి

నానాదిక్కుల నరు లెల్ల ।
వానల లోననె వత్తురు గదలి ॥పల్లవి॥

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు ।
హితులు గొలువఁగా నిందరును ।
శతసహస్ర యోజనవాసులు సు ।
వ్రతములతోడనె వత్తురు గదలి ॥నానా॥ 1

ముడుపులు జాళెలు మొగిఁ దలమూటలు ।
కడలేనిధనము గంతలును ।
కడుమంచిమణులు కరులు దురగములు ।
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి ॥నానా॥ 2

మగుటవర్ధనులు మండలేశ్వరులు ।
జగదేక పతులుఁ జతురులును ।
తగు వేంకటపతి దర్శింపఁగ బహు ।
వగల సంపదల వత్తురు గదలి ॥నానా॥ 3

అన్న. అధ్యా. 331 ఱేకు.

అంపకాలు :-

ముఖారి

భోగీంద్రులును మీరుఁ బోయి రండు ।
వేగిన మీఁదటి విభవములకు ॥పల్లవి॥

హరుఁడ పోయిరా అజుఁడ నీవునుంబోయి ।
తిరిగిరా మీఁదటి తిరునాళ్ళకు ।
సురలు మునులు భూసురులు పోయిరండు
అరవిరి నిన్నాళ్ళు నలసితిరి ॥భోగిం॥ 1
జముఁడపోయిరా శశియు నీవునుఁ బోయి ।
సుముఖుఁడవైరా సురలఁ గూడి ।
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయి రండు ।
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి ॥భోగిం॥ 2
నారద సనక సనందనాదులు ।
భూరి విభవములఁ బోయి రండు ।
దూరముగాఁ బోకిట్టె తొరలి వెంకటగిరిఁ ।
జేరి నన్నిట్లనే సేవించుఁడి ॥భోగిం॥ 3
అధ్యా. 353. 2 వాల్యుం.

ఇంతవఱకు అధ్యాత్మసంకీర్తనలే ఉదాహరించినవి.
శృంగారసంకీర్తనలు గూడ రెండు :-

### కేదారగౌళ-అటతాళం

నీవుగాఁగా నేను గాఁగా
నేఁటి కాయఁ బోయను ।
మీవంటి చులుకనివారము మేమైతే ।
మేటైనంతలేసిపనులు నేఁడౌను ॥పల్లవి॥

మంచిగంధము నెఱపూఁత పూసుకొని
మావాడ కాతఁడు రాఁగాపోఁగాఁ జూచి ।
పొంచులు మాయింటిపంచ నుందువట ।
బోగాలవారమటే ।
ఎంచనేటికి తప్ప నీమగఁడైతే ।
యిలు వెళ్ళకుండ నరికట్టుకొని వల।
పించవలెఁగాక వూరివారిమీఁద
పొంచులుండవచ్చునా వోచెలియ ॥నీవు॥ 1



ఎమ్మెకాఁ డాతఁడు మావీథి నిలుచుండి
యెవ్వరితోనో మాటలాడఁగా విని ।
కొమ్మరో చూపెట్టుకొని వుందువట
గుట్టు విడిచివున్నామా ।
అమ్మరో ఆతఁడు నీమగఁడైతే
ఆన లిడుకొని వుండవలెఁగాక ।
దిమ్మరికత్తెవై మాయింటిచుట్టూ
తిరుగులాడ నాయమా ॥నీవు॥ 2

నాయముగా అలమేల్మంగ వెంకటనాథుఁడు
ననుఁగూడి నవ్వినంతలోనే ।
వోయమ్మ నేఁజెల్ల వూర నాఁట చాట
వున్న పనులవారమా ।
పాయక ఆతఁడు నీపతియైతే పక్క
పవ్వళించి వుండవలెఁ గాక ।
కాయని కాపులు పూయనిపూతలు గట్టి
కాపురాలు గుత్తగొందురటె ॥నీవు॥ 3
శేషా. వ్రాఁతప్రతి.

### (రాగము పేరు లేదు)

కటకటా అయ్యో కాంత నింత యేపుదురా ।
అటమటముగాదు నీయానసుమ్మీ నిజమయ్య ॥పల్లవి॥

కొసరినా నిన్నే కాని కోపించినా నిన్నే కాని ।
కసరినా నిన్నే కాని కాదన్నా నిన్నే కాని ।
విసరినా నిన్నే కాని వేసరినా నిన్నే కాని ।
ఇసుమంతైనా అన్య మెఱుఁగదయ్యా ॥కట॥ 1

అలసినా నిన్నే కాని ఆఁకొన్నా నిన్నేకాని ।
పిలిచినా నిన్నే కాని పేరుకొన్నా నిన్నేకాని ।
సొలసినా నిన్నే కాని సోకనాడినా నిన్నే కాని ।
కలనైనా తలఁపెందూ కలుగదు గదవయ్యా ! ॥కట॥ 2

కొనియాడినా నిన్నే కాని గుంపించినా నిన్నే కాని ।
పనివినా నిన్నే పాడినా నిన్నే కాని ।
మనసిచ్చి యలమేలుమంగపతి వేంకటేశ ।
యెనసితివి మాచెలి నింక నేచ నేమిటకయ్యా ॥కట॥ 3

## ఆళ్వార్లు - అన్నమాచార్యుఁడు

ద్రవిడవేదాంత రచనమునకై శఠకోపయతీంద్రు లవతరించిన విధముగా నంధ్రవేదాంతరచనమునకై యన్నమాచార్యుఁ డవతరించినాఁడు.

శఠకోపయతి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరింపగా–నన్నమాచార్యుఁడును వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరించి నాఁడు. శఠకోపయతి పదునాఱేండ్ల వయసువాఁడయిన తర్వాత సర్వవిద్యలు గోచరించి ద్రవిడ సంకీర్తనములు రచింప దైవానుగ్రహమందఁగా నన్నమా చార్యుఁడు నట్లే పదునాఱవయేటఁ స్వామి ప్రత్యక్షమై యుద్బోధింపఁగా సంకీర్తన రచనము సాగించెను. శఠకోపయతి శ్రీ తిరువేంగడనాథుని మీదను నింకననేక దివ్యస్థలములలోని విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనములు రచింపఁగా నన్నమాచార్యుఁడును ప్రధానముగా శ్రీ వేంకటనాథునిమీఁదను నింకను ననేకపుణ్యస్థలముల విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనలు రచించెను. శఠకోపయతిస్వామి కౌస్తుభాంశమున జన్మించినట్లు విజ్ఞులు విశ్వసింపఁగా నన్నమాచార్యుఁడు స్వామినందకాంశమున నవతరించినట్లు ప్రాజ్ఞులు పరిగణించిరి.

పెరియాళ్వార్లు (విష్ణుచిత్తులు) తులసీవనమున జనించిన గోదాదేవిని రంగనాథస్వామి కొసఁగి పెండ్లిచేసి మామగా రయినట్లే యన్నమాచార్యులు గూడఁ బద్మసరోవరమున జన్మించినమంగాంబికను వెంకటేశ్వరస్వామికిచ్చి పెండ్లిచేసి మామగా రయ్యెను.

ఇట్టి మహత్త్వముగలవాఁడు గనుకనే తిరుపతి వేంకటేశ్వరస్వామి సన్నిధి నీతనికి, నీతనివంశమునకుఁ గూడ నానాఁ డఖండగౌరవ మలవడినది.



## ఆంధ్రసంకీర్తనములు - ద్రవిడపాశురములు.

ఆళ్వార్లు రచింపఁగా నరవమున ద్రావిడవేదమనీ పంచమాగమమనీ పేర్కొనఁబడుదివ్యప్రబంధము నాల్గువేలసంకీర్తనములు పాట్టులు (సీస పద్యాదులవంటివి) కలదికాఁగా అన్నమాచార్యుఁ డొక్కఁడే రచించిన యంధ్రవేదము ముప్పదిరెండువేలపాటలు గలది. ఈ సంకీర్తనలు దివ్యప్రబంధముల ననువర్తించియే పరమాత్మునకు భక్తజీవులకు పతిపత్నీ భావము నాయికానాయక భావము కల్పించి యుజ్జ్వలరసానుభూతి నొదవించుచు ననేక దేవాలయములలోని యర్చామూర్తుల నభివర్ణించుచు శరణాగతిమహ త్త్వమును బ్రతిపాదించుచు నింక ననేకవిధముల లోకనీతి ధర్మోద్బోధభూత దయాదివిశేషాంశముల వెలయించుచు నెంతో వింతగా వేడుకగా సంగీత సారస్యముతో సవరనిభాషతో వేదవేదాంతేతిహాసాది సూక్తి తదర్థప్రతిపాదనము లతో వెల్విరిసి పెరియావాచ్చాంబిళ్లై వంటిమహావ్యాఖ్యాత వెలసెనేని యఖండానందతాండవముగాఁ బెదపెద్దవ్యాఖ్యాచమత్కారములు త్రవ్వి తీయఁదగినట్లు విజ్ఞాననిధులై విరాజిల్లుచున్నవి.

తిరువాయ్‌మొజ్హి మొదలగు దివ్యప్రబంధరచనల కివి తీసిపోవు. దేశ ప్రజాదౌర్భాగ్యముచే నివి వెలసిననాఁటనుండి నేఁటిదాఁక రహస్య రక్షలో నున్నవేకాని రాణ కెక్కవయ్యెను. అన్నమాచార్యులయుఁ దత్పుత్రపౌత్రులయుఁ బ్రాభవము చెల్లునప్పుడు వారే స్వామికి వైభవములు కల్పించునప్పుడుత్సవము లందేకాక యనుదినమును నీ సంకీర్తనములు స్వామిసన్నిధిని విన్నవించుట జరగినది. తమ తర్వాత నట్లు జరగుటకుఁ గూడ వారు వసతులు గల్పించిరి. తర్వాతఁ గొన్నాళ్ళట్లు తనరెనేమో ! ఇందుకుఁ దార్కాణగాభజన గోష్ఠులవారు తొలుదొలుత తాళ్ళపాకవారి సంకీర్తనములనే యాలాపింతురు. కాని, యిటీవల వీనియెఱుక మఱుగుపడిపోయినది. వీనిజన్మస్థానమగు తిరుపతిలోనే వీని ప్రాభవము వెలయ లే దనఁగా నిఁక నితరస్థలములమాట చెప్పనేల?

ఈ సంకీర్తనములు తెల్గునాఁటివిష్ణ్వాలయములలో దివ్యప్రబంధము లుగా నిత్యసంకీర్తనార్హములుగా నెగడఁదగినవి. ఆయా దేవాలయముల యధికారులును ప్రభుత్వమువారును వీని కర్హమయినయాదరము కల్గింతురుగాక! త్యాగరాజకీర్తనలవలె నివి సంగీతపుఁ జమత్కారములు

రాగస్వరవిహారములు పుక్కిలించునవిగా నున్నవో లేదో నిరూపించుయోగ్యత నాకు లేదు. గానవిశారదులే దానిఁ గనుఁగొనఁ దగినవారు.

ఈ సంకీర్తనఫలములు గాయకుల గానామృతమునఁ దోగి మాగి యాస్వాద్యము లయినప్పుడే వానితీయన తెలియనగును.

## శ్రీవేంకటేశ్వర వైభవము.

ఉపనిషన్మంత్రములవలె శ్రీ వేంకటేశ్వరమూర్తి తొలుత నాయామత ముల వారికిఁ గొంతకొంత యానుకూల్యము గొల్పు నవయవాలంకారాది కముతో వెలసి తన నిజాంతరంగమును నీరు కొలఁది తామరయన్నట్లుపాసకు లగువారి యోగ్యత కొలఁదిగా గోచరింపించుచు మహిమాభిరామమైరహి కెక్కినది. పలుమతములవారు పలుదెఱఁగుల వేంకటేశ్వరుని భావించు చుండుట నన్నమాచార్యుఁడును వివరించినాఁడు.

(చూ. పుట. 253)

శివుఁడని, శక్తియని, భైరవుఁడని, జినుఁడని, స్కందుఁడని, తమ తమ నిర్ణయముల కనుకూలము లయిన రూపురేఖలను బ్రమాణములను జూపుకొనుచు పలుమతములవారు పలుకుబడి చెల్లించుకొనుచు వైవిధ్యముతో నర్చించుచు వచ్చిన శ్రీవేంకటేశమూర్తిని ఆళ్వారాచార్యుల యభివర్ణనాను గుణముగా, విష్ణుమూర్తినిగా, శ్రీరామానుజాచార్యులవారు క్రీ. పదకొండవ శతాబ్దిలో విఖ్యాతపఱిచిరి. సింహాచలము, శ్రీకూర్మము మొదలగు స్థలములఁ గూడ నిట్టి నిర్ధారణములే వారు చేసిరట !

పర్వతారణ్యమధ్యస్థమై, దుర్గమమై పలుమతముల పలుకుబడికి చెల్లుబడికి లోఁబడుచు, పూజాపురస్కారములు సరిగా సాగక, ఎవరో ప్రగాఢ భక్తిపరులగు నిశితవ్రతులే నిలువఁదగినట్లున్న స్వామి సన్నిధిని శ్రీవైష్ణవుల స్థానపతిత్వమును స్థాపించి శ్రీరామానుజులు తమకు రామాయణోపదేశము చేసిన గురువులు తిరుమలనంబిగారిని శిష్యులు ఆనందాళ్వార్లను ఇద్దఱు జియ్యంగార్లను ఇర్వదినల్గుర నేకాంగులను సదా స్వామిని గాచియుండునట్లు చేసిరి.

వైఖానసాగమ విధానమునకు తిరుపతి ప్రధానక్షేత్రము. ఇది మధ్యరంగముగా నాంధ్రద్రవిడకర్ణాట దేశములందు విష్ణ్వాలయములలో



వైఖానసాగమ ప్రకారమునఁ బూజోత్సవాదికము లెప్పటి నుండియో సాగుచున్నవి. స్వామి కీయుభయులు నుభయరక్షలు.

పదునాల్గవ శతాబ్దిలో దేశికులవారును వారిశిష్యులును మనవాళ మహామునులు వారి శిష్యులును స్వామివైభవములకు విఖ్యాతిగూర్చిరి. పదునైదవ శతాబ్దిలో అహోబలమఠప్రతిష్ఠాపకులు శఠకోపయతులును, వారి శిష్యుఁ డన్నమాచార్యుఁడును స్వామివైభవమునకుఁ బ్రఖ్యాతిగొల్పిరి. అన్నమాచార్యుఁ డొకసంకీర్తనమున :–

"నేనొక్కండ లేకుండితే నీ కృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు."

అనెను. అతఁడు స్వామిసన్నిధి నివసించి సంకీర్తనములు సాయించుట చేతను, బైయెల్లరు రాజుల నావర్జించుకొని వారికృతముగాను స్వకృతముగాను ఆలయ గోపురారామ మార్గసోపానాది నిర్మాణములను ఉత్సవ విశేషములను బెంపొందించుటచేతను వైష్ణవమతపు శరణాగతి మాధుర్యము చేతను కలౌ వెంకటనాయక యన్నసూక్తికిఁ దార్కాణముగా లోకరక్షకమై, యాపన్నివారకమై, ప్రజ్వరిల్లుచుండు స్వామిమాహాత్మ్యవిశేషముచేతను పదునైదవ శతాబ్దిలో తిరుపతి క్షేత్రము భక్తపరిషత్తులరాకపోక లధికముగా గలదై జనరంజకమై వర్ధిల్లినది. పదునాఱవ శతాబ్దిలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణరాయఁడు, నంతకుఁ బూర్వుఁడు సాళ్వనరసింగరాయఁడును దమవిజయము లెల్ల శ్రీ వేంకటేశ్వరానుగ్రహమున వెలసినవే యన్న విశ్వాసముగలవారయి దిగ్విజయ యాత్రలలో శ్రీవైష్ణవాచార్యులను, కవీశ్వరులను, శ్రీ వేంకటేశ్వర విగ్రహమున దోడఁగొంపోవుచు శ్రీ వేంకటేశ్వరభక్తిని దేశమెల్ల వెల్లివిరియించిరి. దిగ్విజయ యాత్రారంభములందు విజయ నిర్వాహాంతములందు వారు శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనము చేసికొని కాన్క లర్పించుకొనుచు నుండెడివారు. శ్రీకృష్ణరాయఁడు క్రీ. 1512 నుండి, 1523 దాఁకనేడు తూర్లు తిరుపతికి విచ్చేసెను.

తొలితూరి :– ఇర్వురుభార్యలతో వచ్చి స్వామికి నవరత్న ఖచితకిరీట మును కర్పూరహారతికి ఇర్వైయైదు వెండిపళ్ళెములను భార్యలచే స్వామి పాలారగింప బంగారు గిన్నెను.

రెండవతూరి :- శ్రీ భూదేవుల కనేకాభరణములను,

మూడవతూరి :- 5 గ్రామములను,

నాల్గవతూరి :- ముప్పదివేలవరహాలతో స్వామికి కనకాభిషేకమును కొన్ని యాభరణములను తాళ్ళపాక గ్రామమును (చిన్నాదేవిచే) కంఠమాల పదకము ఒక గ్రామమును (తానే)నవరత్న ప్రభావళియను మకరతోరణమును

అయిదవతూరి :- కంఠమాలను, పదకమును, ఆనందవిమానపు బంగారుపూతకు ముప్పదివేలవరహాలను, పులికాపునిర్వాహమునకు వెయ్యి వరహాలను, ఉదయనైవేద్యమునకు 500 వరహాలను.

ఆఱవతూరి :- కొన్ని భూములను,

ఏడవతూరి :- నవరత్న ఖచితమయిన పీతాంబరమును, నవరత్న ఖచితములయిన రెండు వింజామరలను, పదకమును, పదివేల వరహాలను సమర్పించెను.

అచ్యుతరాయఁడు ప్రతిసంవత్సరము స్వామికిఁ బ్రబంధపుష్పాంజలు లర్పించుచుండెను. సదాశివరాయఁడును స్వామికెన్నో సేవలు చేసెను. దాన శ్రీ వేంకటేశ్వరమాహాత్మ్యము దక్షిణభారతదేశ మందెల్లఁ బ్రజ్వరిల్లినది. పదునాఱు పదునేడు శతాబ్దుల తెలుగుప్రబంధములలో శ్రీ వెంకటేశ్వర స్వామికి సమర్పితములే లెక్క కెక్కువగా నున్నవి. పుణ్యక్షేత్రయాత్రలలో ముఖ్యములయిన యనేక విష్ణ్వాలయ శివాలయ దేవతలతోపాటుగా నంతదాఁకఁ గీర్తనీయమగుచున్న శ్రీవెంకటేశార్చామూర్తి పదునాఱవశతాబ్ది యారంభమున నుండి సర్వ భారతదేశమునకు ముఖ్యార్చామూర్తి కాఁజొచ్చినది. బ్రాహ్మణుల మొదలుగాఁ బంచములదాఁక నన్నిజాతులవారును తమ యిండ్లలో శుభకార్యములు జరగునప్పుడు మునముందుగా వెంకటేశ్వర దీపారాధన, సమారాధన, జరుపుట, ఇంట నెవరికిఁగాని యానారోగ్యము కలిగినప్పు డాపద మ్రొక్కుల వాఁడని స్వామికి ముడుపుగట్టి కొండకు వచ్చి వడ్డితో ముడుపు చెల్లించుకొనుట సంప్రదాయమయినది. తలనీలా లిచ్చువారు, నిలువుదోపిళ్ళిచ్చువారు, అనర్ఘ రత్నాభరణము లిచ్చువారు, బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవాదులు జరిపించువారునై ప్రజలు, ప్రభువులు, మహారాజులు తండోపతండములుగా తిరుపతికి



రాకపోకలు జరపసాగిరి. భారతదేశమున నెక్కడగాని ప్రజలు తమకుఁ జేర్వైయున్న దేవాలయార్చామూర్తుల పేళ్ళఁ బెట్టుకొనుటకలదు. కాళహస్తీశ్వరుఁడు, వరదరాజు, మల్లికార్జునుఁడు, పానకాలరాయఁడు ఇత్యాదినామములు దాల్చినవారాయాపుణ్యక్షేత్రములచేరిక గ్రామములవారని తెలివిడి కలుగును. కాని, వెంకటేశ్వర వెంకటాచలపతీత్యాదినామములు దక్షిణాపథమందెల్ల నూరూర నింటింట సర్వసామాన్యమై వెలయసాగినవి, శ్రీ తిరుపతి వెంకటేశ్వరాలయమున కున్నంత యాదాయ మేదేవళమునకు నుండదు. విజయనగరరాజ్యము తర్వాత మట్ల మైసూరు తంజావూర్యాది రాజ్యములు నేటి జమీందారీలు స్వామి కెన్నో కైంకర్యములు జరపినవి. అవి నేఁడు ప్రజాస్వామ్యముచేఁ జిదికి పోయినను, పోవుచున్నను గూడ శ్రీవెంకటేశ్వర వైభవము ప్రజాసామాన్య పరమై యఖండమై యలరారుచునే యున్నది.

## అన్నమాచార్యచరిత్ర పరిశోధనము

ఈశ్వరసంకల్ప మెట్టిదోగాని తాళ్ళపాకవారి యధ్యాత్మసంకీర్తనములు చదువుచుండునపుడు నాహృదయతంత్రులలో ననురణనము సాగుచు పరమానంద పారవశ్యముకలుగుచు కర్తవ్యమేదో వ్యక్తమగుచున్నట్లుండును. ఈ యన్నమాచార్య చరిత్రము ముద్రించుచు నందు సాళ్వనరసింహరాయని దగ్గఱ నన్నమాచార్యుఁడు పాడిన శృంగారసంకీర్తన ప్రతీకము చదివి ఈ కథ నిజమా? ఇట్టికీర్తనము దొరకఁగలదా? ఉన్ననునది వేలకొలఁది సంకీర్తనములలో నెక్కడ నున్నదోకదా అనుకొనుచుఁ జేతనున్న తాళ్ళపాక శేషాచార్యులుగారి వ్రాఁతప్రతిని దెఱతునుగదా సరిగా నా సంకీర్తనమే యందు నాకన్ను లెదురఁ గానవచ్చెను. ఆనందమాయెను. నాతోనిందుఁబరిశ్రమించుచున్న చిరంజీవి శ్రీనివాసాచార్యునకిది చూపి చెప్పి మఱొకసంకీర్తనము సంకెల విడిపించు కొనుటకుఁ బాడినదాని ప్రతీకమును జదివి యిదికూడ దొరకిన బాగుగదాయనఁగా ఇదిగో యిప్పుడే యిట్టి సంకీర్తనమును జదివితిని అని యాతడంతలోనే దానినెత్తియిచ్చెను. ఇట్లునాలుగు మూఁడు నాళ్ళలోనే మాకుఁ గావలసిన సంకీర్తనము లెన్నో పుటపుట దొరకసాగినవి ! అందు ముఖ్యములఁ గొన్నింటి నీ పీఠికలో వెల్లడించితిని. ఇట్లు సంకల్పసిద్ధి సంతోషములతో పీఠిక రచించుచు దేవస్థానశాసనములలో మంగాపురమున తాళ్ళపాక చినతిరుమలాచార్యుఁడు కట్టించిన కల్యాణవెంకటేశ్వర దేవాలయమున

అన్నమాచార్యునివిగ్రహపుఁ బ్రతిష్ఠయు జరిగినట్లుండుటచే నదికలదేమో యని బరిశీలింపఁబోఁదలచి మిత్రులతో ముచ్చటించితిని. మహమ్మదీయ విప్లవముచే పాడుపడి విగ్రహములు విరిగి సర్వధ్వంసమైయున్న యీ దేవ ళమునొక పుణ్యపురుషుఁడు ( సుందరరాజరాయస్వామి) స్వప్నోద్బోధము వలన వెదకివచ్చి చేరి చాల శ్రమపడి తిరుపతి కొండమీది దివ్యమంగళమూర్తి వలెనే మహనీయమై దర్శనీయమైయున్న యక్కడిమూలమూర్తిని చక్కఁజూచు కొని పూజాపురస్కారములు ఉత్సవాదులు కొలఁదియేండ్లనుండి జరపుచున్నట్లును, వారప్పుడు తిరుపతిలోనే ఉన్నట్టును తెలియవచ్చెను. వారితో మిత్రులతో మూలమూర్తిని దర్శించి మాట మాటమీద తాళ్ళపాకవారి విషయ మెత్తఁగా తాళ్ళపాకవారి దేవతార్చన విగ్రహాదులిక్కడికిఁ జేరినవని వారొక పెద్దకథ చెప్పిరి. వాని నెల్లఁ జూపిరి, అందు అన్నమాచార్యునినాఁటి భజన చిఱుతలు, తులసితావళము, స్ఫటికహారము సాలగ్రామములు శ్రీవేంకటేశ్వర, తద్దేవ్యాదుల దేవతార్చన విగ్రహములు ఆ విగ్రహముల యిత్తడి మకర తోరణము. వెండిఛత్రములు మొదలగునవి యున్నవి. వానిని శ్రీతాళ్ళపాక సూర్యనారాయణయ్యగా రొసఁగిరని వారిప్పుడు తిరుపతిలోనే ఉన్నారని యాసత్పురుషుఁడు తెలియఁజెప్పెను. పరమానందముతో తిరుపతికిఁ దిరిగి వచ్చి యా శ్రీసూర్యనారాయణ్యగారిని గలసికొంటిని. వారే అన్నమాచార్య చరిత్రమును శ్రీ తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య విద్యాలయమునకు ఇచ్చిన వారు. కడపజిల్లా మడితాడును బీదరికముచే విడనాడి అన్నమాచార్యాదుల ర్చించిన దేవతావిగ్రహములను సరిగా నర్చింపననువుపడక తిరుపతిలో దేవుని సన్నిధిఁ నర్పింపఁగోరి తెచ్చితిననియు దమపూర్వులే కట్టించిన దేవాల యము పునరుద్ధారము చెంది పూజాపురస్కారములుగలదై యున్నందుకు పరితోషించి యావిగ్రహములనెల్ల నక్కడనర్పించితిననియు వారు చెప్పిరి.

ఆనాఁడెప్పుడో యన్నమాచార్యుఁడు తనదేవతార్చన విగ్రహములు పోయినందుకు విలపించిన సంకీర్తనము తలఁపున గోచరించెను. (చూ. పుట. 269) నాడాతని కవి మరలదొరకెనేమో దొరకినప్పుడెంత సంతోషిం చెనో ఏమిచేసెనో తెలియదుగాని యయిదువందలయేండ్ల తర్వాత నాతని భజనచిరుతలు తావళములు దేవతార్చన విగ్రహములు వెదకఁబోయినతీవ కాలఁదవిలినట్లు నాకన్నులెదుటగానవచ్చుట, వారు వెలయించిన దేవళము పూజాపురస్కారములతో మరలవెలయుట, చూడఁగా నాకుఁబరమాహ్లాదము



గలిగినది. శ్రీయన్నమాచార్యుఁడు నిత్యసూరులతో నారదాది మహర్షులతో నాళ్వారులతోఁగలసి శ్రీవెంకటేశ్వరస్వామి పుష్కరిణీతీరమున ఆకాశగంగా ఝరులలో దరులలో సూర్యమండలములో నిత్యానంద విహారము సల్పుచుండె నని యానాఁటి వారానందించిరి. (చూ. పుట 295) అన్నమాచార్యుఁడు పరమప్రాప్యము శ్రీవెంకటేశ్వర సన్నిధానమేయని యనేక సంకీర్తనములలో గొంతెత్తి చేయెత్తి గొప్పగాఁ జెప్పుకొనెను. ఆయన పరమ పదమందిన ఫాల్గున బహుళ ద్వాదశి ప్రత్యాబ్దికశ్రాద్ధదినముగాన యాతని కుమారుఁడు పెద తిరుమలాచార్యుఁడిట్లు తన తండ్రిగారి నాహ్వానించెను.

శ్రీరాగం

దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు ।
జనకుండ అన్నమాచార్య విచ్చేయవే ॥పల్లవి॥

అనంత గరుడముఖ్యు లయిన సూరిజనులతో ।
ఘననారదాది భాగవతులతో ।
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ ।
వెనుకొని యారగించ విచ్చేయవే ॥దిన॥ 1

వైకుంఠాననుండి యాళువారులలోపలనుండి ।
లోకపు నిత్యముక్తులలోన నుండి ।
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశుఁ గూడి ।
ఈకడ నారగించ నింటికి విచ్చేయవే ॥దిన॥ 2

సంకీర్తనము తోడ సనకాదు లెల్లఁబాడ ।
పొంకపు శ్రీ వెంకటాద్రిభూమి నుండి ।
లంకె శ్రీవెంకటగిరి లక్ష్మీ విభుఁడ నీవు ।
అంకెల మాయింటవిందు లారగించవే ॥దిర॥ 3

అన్న. అధ్యా. ఠేకు

మదరాసు విడిచి శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల సన్నిధి సేవకావింప వచ్చుటలో నాతొల్తటికోరిక తాళ్ళపాకవారి రచనల నన్నింటిని వెల్లడించుట. ఎంత ప్రయత్నించినను నడ్డంకులచే నింకి పోవుచున్న నా సంకల్పపు టూటలు చక్కసాగుట కద నిప్పటికి సమకూడినది. ఇక్కడనున్న తాళ్ళపాకవారి సంకీర్తన

ముల రాగిరేకు లన్నింటిని స్వాధీనముచేసికొంటిని. అస్మదీయుఁడు నాకుఁ జేదోడుగా ననువర్తించు పరిశోధన కార్యసహాయ విద్వాంసుఁడు చిరంజీవి. ఎ.వి. శ్రీనివాసాచార్యుఁడు వేలలెక్క నున్నరాగిరేకుల భరము మోయుచు బడలుచున్నను సంకీర్తనముల స్వారస్యా స్వాదనమున శ్రమతీర్చు కొనుచు సర్వపరిశోధన సందర్భములందు జాగరూకుఁడై తోడ్పడుచున్నాఁడు. మిత్రులైన డైరెక్టరు శ్రీపరవస్తు వెంకట రామానుజస్వామి, ఎం.ఏ.గారు నాకీ కార్య నిర్వాహములో సహాయపడుచున్నారు. దేవస్థానమునఁ బైముఖ్యాధికారు లిందుకుఁ జాల ముచ్చట పడువారుగా నున్నారు. ఇఁకఁజక్కగా తాళ్ళపాక సంకీర్తనములఁగొన్నింటిని సంగీతసాహిత్యపరిపుష్టులు శ్రీ అనంతకృష్ణశర్మ గారు స్వరవిన్యాసముతోఁ బ్రకటించుచున్నారు. ఇట్లిన్నాళ్ళకుఁ దాళ్ళపాక మహనీయుల స్వామి సేవాఫలము పరిపక్వమై సహృదయాస్వాద్య మగుచున్నది. అన్నమాచార్యాదులారా! ఆనందింపుడు! అయిదువందలేండ్లకుఁ బిదప మీయభీప్సితము లన్వర్థములు గావలసినట్లున్నది గాఁబోలును స్వామియనుగ్రహము !

సీ॥ చెక్కిళ్ళఁ జిఱునవ్వు చిందుద్రొక్కెడుతేఁడ !
యేడుకొండలవాఁడ ! యేలుకొమ్ము
అలమేలు మంగాంబ చెలికాఁడ ! యడుగడ్గ
దండాలవాఁడ ! మా కండ వగుము
ఆమటమ్రొక్కులస్వామి ! గోవింద గో
వింద సందడివేల్ప ! వందనమ్ము
కలియుగప్రత్యక్ష కులదైవమా ! యెల్ల
డెందాలవిహరించువింద ! శరణు

గీ॥ పిండివంటకములు కుండలవండిన
యోరెములును మాత్ర లారగించి
భక్తులకుఁ బ్రసాదపఱుచు మహాభోగి
వరకటాక్ష ! పరమపురుష! రక్ష।

సీ॥ నిలువుదోపుడు దోచు నెఱదొంగతన మేమి ?
పాపముల్ హరియించు భావ మొక్కొ
వడ్డికాసులఁ గూర్చు వ్యాపార మది యేమి ?



మేలు పెంపొందించు లీల యొక్కొ
తలమీఁది నీలాలఁ దొలఁచిపుచ్చుట యేమి ?
చిక్కులం దెగటార్చు ఫక్కి యొక్కొ
ఏడుకొండలమీఁద వీడొటయేమి ? స
హస్రారవసతిరహస్య మొక్కొ

గీ॥ ఏటివో యివి పెద్దలనాఁటిమాట
లీశ్వరుఁడు సర్వభూతసుహృత్తు, సుహృదు
డాపదపహర్త, యనవార్త కలరి యట్టి
వాఁడ వను కన్నెఱిఁగి కొల్చినాఁడ నిన్నె !

శా॥ ఏరీ కోరి మనోజ్ఞపుష్పములు నీ కీయెన్మిదే[1] యంచు నా
త్మారామమ్మునఁ బూవఁజేసితి నహింసాదిప్రసూనంబు లే
నారాధించెద వీనిచే నిను ననంతాళ్వార్ల కైంకర్యపుం
దీరుల్ గావని వేఱుచేసెదవె తండ్రీ ! వేంకటాధీశ్వరా ।

శా॥ దూరంబేల పరంబు నీ విహమునందుఁ భక్తరక్షార్థ మ
ర్చారూపంబు ధరించి యుంటివన నిచ్చల్ నిన్నె లోకన్ను చె
న్నారం గాంచెద దేహదేవకులమూలాధారమం దాసహ
స్రారంబుఁ సుఖ సత్య చి త్కలిత దీపారాధనల్ సేయుచుఁ !

చ॥ కరకరపల్కులఁ బిరుసు గల్గిన శర్కర నన్నుఁ బాగుగాఁ
గరఁచి పొరంటికొంటివి నిగన్నిగమీఁగడపాల వీవు ని
ల్వరమున నాకు మార్దవము వచ్చెను నీకు ఘనత్వ మబ్బె ని
ర్వరము రసాయనంబగుటపోలదె యుర్విఁకిఁ గ్రొత్తకోవగాఁ .

వే. ప్రభాకరశాస్త్రి.

1. అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియ నిగ్రహః
క్షాంతిః పుష్పం దయా పుష్పం జ్ఞానం పుష్పమతః పరమ్ ।
సత్యం పుష్పం తపః పుష్పం భావపుష్పమథాష్టమమ్
ఏవమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం పరమ్ ॥

# ఆంధ్రామరుకము
## పీఠిక

సంస్కృతమున అమరుశతకము శ్రీమచ్ఛంకరపూజ్యపాదులు పరకాయ ప్రవేశము చేసి శృంగారానుభూతులఁ దేలుచు, రచించిన దని కొన్ని గ్రంథములు వాకొనుచున్నవి. కాని, యవి యప్రామాణికములే యని ప్రాజ్ఞులచే నవగణింపఁబడినవి. అమరుశతకకర్త అమరుఁడనీ, అమరుకుఁడనీ, పేరుగల యొకానొక రాజుగాఁదగు నందురు. ఈ శతకశ్లోకములు నూఱును నేర్పరి యగు చిత్రకారుఁడు చదివినచో నూఱుచిత్రములు చిత్రింప గలఁడు.

"అమరుకకవే రేక : శ్లోక : ప్రబంధశతాయతే" అని ప్రాచీనులప్రస్తుతి అలంకారశాస్త్రకారు లీశతకపుశ్లోకములను ధ్వనిప్రభేదాదులకు లక్ష్యములనుగాఁ బదింబదిగా నుదాహరించిరి.

దీనికిఁ దెలుఁగున సరిగా లెక్కపెట్టఁగాక యెన్నో పరివర్తనములు వెలసినవి. కొన్ని ప్రాచీనములు, కొన్ని నవీనములు. కొన్ని రచయితల దగ్గఱనే దాగియున్నవి. ఉన్న వానిలోని కెల్ల నీ పరివర్తనమే ప్రాచీనతమ మను కొందును. దీనికర్త తాళ్ళపాక తిరువేంగళప్ప. ఈతఁ డన్నమాచార్యుని మనుమఁడగు చినతిమ్మదీక్షితుని కుమారుఁడు. తిరుమల, తిరువేంకటేశ, వేంకటేశ్వరదీక్షితపదము లొక్కనిపేర్లు కావచ్చును. చినతిమ్మదీక్షితుని కొడుకు తిరువేంగళప్ప కావ్యప్రకాశవ్యాఖ్యను నామలింగానుశాసన వ్యాఖ్యను గూడ రచించినాఁడు. ఈ శతకమునకుఁ గూడ నీ తిరువేంగళప్ప రచయిత కావచ్చు నని నాకుఁ బూర్వము తాళ్ళపాకరచనల ముద్రాపకులు తలఁచిరి.

పెదకోమటి వేమారెడ్డిగారి శృంగారదీపికావ్యాఖ్యను, వేంకటరాయ శాస్త్రిగారి ముద్రణమును ననుసరించి శ్లోకములసంఖ్య యిందు చేర్పఁబడినది. ఈ తెల్గుకవి శ్లోకములకు విషయవిభాగముచేసి యొక క్రమమేర్పఱిచినాఁడు. కోమటి వేమారెడ్డిగారి శృంగార దీపికావ్యాఖ్యాశ్లోకక్రమము వేఱు. ఈ కవి పద్యక్రమము వేఱు. శృంగారదీపికావ్యాఖ్యగలశ్లోకముల కిందు తెలుఁగు పద్యములు గొన్ని గానరాలేదు.



(1, 2, 30, 39, 48, 50, 77, 78, 84, 88, 94,. వీనికిఁ దెలుఁగు లేదు )

77వ పద్యమునకు మూలశ్లోకము రెడ్డిగారి గ్రంథమున లేదు. శృంగార దీపికావ్యాఖ్య 101 శ్లోకములకున్నది. ఇందవి 90 మాత్రమే కలవు.

శృంగార దీపికావ్యాఖ్యాక్రమమును నీ తెల్గు పద్యముల క్రమమున బ్రదర్శించు శ్లోకపద్యసంఖ్యాక్రమపట్టికను పాఠకుల సౌకర్యముకై యిందుఁ జేర్చితిని.

నేను బరిశీలించినంతలో సంస్కృతశ్లోకముల యావదర్థభావములు సరిగా గోచరించునట్లు సలిపిన తెల్గుసేఁతలు తక్కువ. కొన్ని రచనలలో కొన్ని కొన్ని పద్యములు మూలానుగుణముగాఁ జాలఁజక్కగా నున్నవి. అట్టి తెల్గుసేఁతలలో నిదియు నొకటి. తాళ్ళపాకవారిది యని ప్రాచీనము రసహృద్యము నని దీనిని బ్రకటించితిమి. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు ముప్పదేండ్లకు ముందు నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెమున అద్దంకి యింటి పేరి వైష్ణవాచార్యుల యింట నుండి దీనిని నేను సేకరించితిని. ఆ యేకప్రతిని జూచి మదీయులు చి॥ తి. కోదండరామయ్యగారు శక్యమయిన సంస్కారములు జరపి ప్రతి వ్రాసియిచ్చిరి. ఈ ముద్రణములో పాఠలోపములు తప్పు పాఠములు చాల మూలమును జూచి నేను సవరించితిని.

**వేటూరి ప్రభాకరశాస్త్రి**

(పీఠిక, శృంగారామరుకావ్యము
తి.తి.దేవస్థానము ముద్రణ
1949)

# ధనుర్విద్యావిలాసము
## పీఠిక

ఆంధ్రదేశమున నధీశ్వరులై వెలసినవారు ప్రాచీనులు నర్వాచీనులును ధనుర్విద్యలో నద్భుత ప్రజ్ఞతో నారితేరి, మగలమగలై, గండర గండండ్రై, సమరనిశ్శంకులై, సంగరకిరీటులై యుండి రనుట చరిత్ర పరిశోధకులు చక్కగా నెఱిఁగిన విషయమే.

అంతకుఁ బూర్వపు వారివార్త లట్లుండగా చరిత్ర సుపరిజ్ఞాతులయిన వారు సాతవాహనులు, ఇక్ష్వాకులు, సాలంకాయనులు, విష్ణుకుండులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు (వారి సేనానులు డెబ్బదేడు గోత్రాలవారు) వెలమవారు, రెడ్డివారు, కమ్మవారు, బలిఁజెవారు, కోటవారు, సాగివారు, పూసపాటివారు, వత్సవాయివారు, మందపాటివారు, తెలుగుచోళులు, వెలనాటి చోళులు, విద్యానగరాధీశులు, సాళ్వవారు, దాట్లవారు, మట్లవారు, గజపతులు, జగపతులు, తంజావూరు మధుర పుదుకోట నాయకులు, నిటీవలివా రనేకులు జమీనుదార్లు నింక నెందఱెందఱో.

'కదనమె బొమ్మరిల్లు చెలికత్తెలు వీరజయాంగనామణుల్ !
మదకరి మస్తకుంభములు మాటికి దొంతులు సంగరస్థలిన్
గుదిగొని పద్దరాహుతుల క్రొవ్వులు గుజ్జనఁగూళ్ళు బాపురే !'

అన్న ప్రశస్తి గన్నవారే. వారట్టివా రగుటకు ధనుశ్శాస్త్రమున జితశ్రము లగుట ముఖ్యహేతువు.

ఆయా మహీపాలుర యేల్బళ్ళలో ధనుర్విద్యాభ్యాస రంగములు చాలఁగా వెలసి యుండెడి వనుటను ప్రాచీనగ్రంథములు ప్రఖ్యాతపఱచుచున్నవి. నేఁటికిని ధనుర్విద్యయాటవికులగు కోయ చెంచు సవరాది జాతులవారికి వెన్నతోఁ బెట్టిన విద్యగాఁ బరిచితమయి యుండుట నెఱిఁగిన విషయమే.

ఇర్వదేండ్లకు ముందు వినుకొండప్రాంతగ్రామ వాస్తవ్యులు కలియుగార్జున బిరుదాంకులు అప్పారాయాభిధాను లొకరు ధనుర్విద్యలో



నద్భుత నైపుణ్యము ప్రదర్శించుట నే నెఱుఁగుదును. నేడును వారు తద్విద్యానిపుణులై నెగడుచున్నారట ! తాలింఖానాలు వస్తాదుల కుస్తీపట్లు నేఁడును పలుచోట్ల సాగుచున్నవి. సంస్కృతాంధ్ర గ్రంథములఁ జదివి నేర్చుట తగ్గిన దేమో కాని, వానిలోవిషయములు తొలుతఁ బ్రాకృతమున నిటీవల ఉర్దూలో పారిభాషిక పదములతో వెలసి వ్యవహారరూఢి గనుట ఆయా గ్రంథార్థము లనుభూతిలో నన్వితములయి నిన్నమొన్నటిదాఁక ననేకుల కందుబాటులో నుండుట దెలియ వచ్చుచునే యున్నది.

ప్రస్తుతమగు ధనుర్విద్యావిలాస విషయములు ధనుర్విద్యావిశారదుఁడగు తురకపండితుని (మహమ్మదజాఫర్ గురుని) యుపదేశముచొప్పున నేర్చి గ్రంథరచనా ప్రేరకుఁడు, రేపల్లెఱేఁడు తిరుమతి రాయ ప్రభుఁడు వివరించు చుండగా విని వాని పద్యకావ్యరూపమున కృష్ణమాచార్యుఁడను కవి రచించె నట ! పాశ్చాత్య యుద్ధశాస్త్ర శిక్షలు పెంపొందిన పిదప తుపాకులు ఫిరంగులు మొదలగునవి వెలయుటచే ధనుర్విద్యకంతగాఁ బ్రాముఖ్యము లేదయ్యెను. తుపాకులు మొదలగు నాయుధ తంత్రములు గూడ బాంబులు, విమానములు, సబ్‌మరైనులు, మైనులు, రాడార్లు, ఆటంబాంబులు ప్రబలిన తర్వాత వెనుకఁ బడఁజొచ్చినవి గదా ! నిజముగా సత్యదయాజ్ఞాన ధీరులయాయుధమగు నహింసా ప్రయోగము బలయునేని ఆటంబాంబుల దాఁకను బెరిగిన యుద్ధతంత్రమెల్ల నిరర్థకమే కాఁగలదు.

సృష్ట్యాది నుండి నేటి దాఁక వీరాధివీరు లనిపించుకొన్న మహాపురుషుల యుద్ధతంత్రము లెల్ల గంధివీరుని ధీరతావీరతల ముందు నిలువనేరక నిర్వీర్యములే యయినవి గదా! ప్రపంచము నందలి హింసాతంత్రసారమెల్ల దనమీఁదికిఁ దెచ్చుకొని యాయన హింసాపక్షమును నిర్వీర్యమొనర్చినాడు. అహింసాపక్షమునకు సర్వాంతర్యామియై విజయము చేకూర్చుచున్నాడు. భారతీయుల మూలమున నిది పరిస్ఫుటమై ప్రజ్వరిల్లిన తర్వాతనే లోకము దీని ప్రాభవమునకు జోహారులర్పింపఁ గల్గును.

ధనుర్వేదము యజుర్వేదమున కుపవేదమట. చరణవ్యూహమున నిట్లున్నది.

"యథా ఋగ్వేదస్యోపవేద ఆయుర్వేదః చికిత్సాశాస్త్రమ్
యజుర్వేదస్యోపవేదో ధనుర్వేదో యుద్ధశాస్త్రమ్
సామవేదస్యోపవేదో గంధర్వవేద స్సంగీతశాస్త్రమ్
అథర్వవేదస్యార్థ శాస్త్రం నీతిశాస్త్రం శస్త్రశాస్త్రమ్
విశ్వకర్మాదిప్రణీత శిల్పశాస్త్రమ్
ఇతి భగవాౕ వేదవ్యాసః స్కందః కుమారోవాఽ హ"

విశ్వామిత్రప్రణీతమగు ధనుర్వేదగ్రంథమున నీవిషయ మిట్లుగలదు– అథ ధనుర్వేదో నిరూప్యతే, స చ పాదచతుష్టయాత్మకో విశ్వామిత్రప్రణీతః, ఆదౌ బ్రహ్మణా ప్రజాపతయే రుద్రాయ చ ప్రోక్తో రుద్రేణ విశ్వామిత్రాయ, విశ్వామిత్రేణ మనవే, పురుహూతాదిభ్య ఉపదిష్టః, సహి పాదచతుష్టయాత్మక ఉపవేదః తత్ర ప్రథమః పాదః దీక్షాప్రకారః, ద్వితీయః పాదస్సంగ్రహః, తృతీయపాద స్సిద్ధ్యాత్మకః, చతుర్థః ప్రయోగపాదః, తత్ర ప్రథమపాదే ధను ర్లక్షణ మధికారి నిరూపణం చ కృతం, ధనుశ్శబ్దశ్చాపరూఢోఽపి చతురా యుద్ధే ప్రవర్తతే, ముక్త మముక్తం ముక్తాముక్తం యంత్రముక్తమితి ముక్తంచేతి అముక్తం ఖడ్గాదిః ముక్తాముక్తం శల్యావాంతరభేదాదిః యంత్రముక్తం శరాది తత్రా ముక్తం శస్త్రముచ్యతే. తదపి బ్రాహ్మ, వైష్ణవ,పాశుపత, ప్రాజాపత్యాగ్నే యాది భేదాదనేకవిధం, ఏవం సంధి దైవతేషు చతుర్విధా యుద్ధేష్వధికారః క్షత్రియకుమారాణాం తదనుయాయినాం చ సర్వేషాం చతుర్ధా పదాతి రథగజతురంగరూపా దీక్షాభిషేక శకున మంగళకరణాదికం చ ప్రథమ పాదే నిరూపిత మస్తి. సర్వేషాం శస్త్రవిశేషాణా మాచార్యాణాం లక్షణపూర్వకం సంగ్రహణప్రకారో దర్శితః. ద్వితీయే గురు సంప్రదాయ సిద్ధానాం శాస్త్ర విశేషాణాం పునః పునరభ్యాసో మంత్రదేవతా సిద్ధికరణమపి వక్ష్యతే. తృతీయే పాదే దేవతార్చనాభ్యాసాదిభిః సిద్ధానా మస్త్ర విశేషాణాం ప్రయోగః. చతుర్థ పాదే యుద్ధప్రకారః క్షత్రియాణాం స్వధర్మప్రవిష్టానాం యుద్ధకర్మనిష్ఠానాం స్వధర్మాచరణం యుద్ధం. దుష్టదస్యు చౌరాదిభ్యః ప్రజాపాలనం చ ధనుర్వేదస్య ప్రయోజనం, ఏవం బ్రహ్మరుద్రప్రజాపతి విశ్వామిత్రప్రణీతం ధనుర్వేదశాస్త్రం సురాసురైః పారంపర్యాదవగతం శ్రీపరశురామద్రోణ భీష్మాదిభిః ప్రభృతం



తచ్చధనుర్దీక్షాయాం పార్థః ఉత్తమాధికారీ. బాణాసురో, మధ్యమాధికారీ, సాత్యకి ప్రభృతయః సహస్రార్జునో హీనాధికారీ, గురవధాత్ ఇతిధనుర్ధర ప్రశంసా॥ అముద్రితములైన గ్రంథములు శ్రీమానవల్లి రామకృష్ణకవి ఎం.ఏ, గారి దగ్గఱనున్నవి. వానిని జూచియే నే నాయాభాగముల నుదాహరించితిని.

ఈ ధనుర్వేదమును గూర్చి శ్రీ మానవల్లి రామకృష్ణకవి, ఎం.ఏ. గారిప్పటి కిర్వది యాఱేండ్లకు ముందు గొప్ప వ్యాసము ప్రకటించిరి. దాని నెల్ల నిక్కడ మరలఁ బ్రకటించి దానిపై విశేషార్థములు వివరింతును.

"ధనుశ్శబ్దము వింటికి రూఢమైనను ముక్తము అముక్తము ముక్తా ముక్తము యంత్రముక్తము అను చతుర్విధ ప్రహరణముల వర్తించుచు ధనుర్వే దము శత్రుదండరూపమగు సమస్త ప్రయోగ సామగ్రీ తత్త్వమును బ్రతిపాదిం చును. అది యిరువదివేల శ్లోకములతో నీశానసంహితయను పేరితో శివునిచేఁ బార్వతి కుపదేశింపఁబడియె.

అందు

వింశత్సహస్రమానస్తు ధనుర్వేదోఽపి కీర్తితః।
యస్మిన్ నిగద్యతే సర్వలోకతత్త్వం వరాననే॥
బలాపాదనకాధ్యాయః స్థానాధ్యాయః ప్రమర్దనమ్।
భౌతికాపాదనాధ్యాయః సంధివిక్షేపణం తథా॥
అక్రమోజ్జీవనోధ్యాయః శ్రమప్రాప్తేర్హి లక్షణమ్।
ఆయుధగ్రహణం శిక్షా క్రమస్తత్పరిశీలనమ్ ॥
సన్నాహస్థాన చలన మపసవ్యస్థితిక్రమః ।
ఆశ్లేషోవాంతరాలంబ హస్తాటన పటుక్రియా ॥
ముష్టి బంధస్థానబంధో ధృష్టతాపాదనం తథా ।
సంగ్రామవిద్యావిజ్ఞానం సర్వాయుధ విలంఘనమ్ ॥
సూత్రాధ్యాయః పరీక్షా చ పాదపాయూపఘట్టనమ్ ।
రథాశ్వేభాద్యవస్థాన లక్షణాధ్యాయ ఏవ చ॥
(విలుంటనం మోటనం చ భ్రమణం పరిశీలనమ్ ।
ఆయుర్జ్ఞానం మోహనం చ భిన్నముల్లాసితం తథా) ॥

చాపాదిలక్షణజ్ఞానమస్త్రాణాం కరణం తథా।
అస్త్రమంత్రపరిజ్ఞానాధ్యాయో మదవినిర్గమః ॥
ఏవమాద్యా ధనుర్వేదే విద్యాః సంతి సహస్రశః ॥

అను నిరువదితొమ్మిది యంశములు విస్తరింపఁ బడియె. ధనుర్వే ద సూత్రములు పరశురామకృతములై శాండిల్యభాష్య వివృతములై కేరళ దేశమున లభించుచున్నవని తెలియుచున్నవి. అది నాలుగు పాదములుగలది. ప్రథమముదీక్షాపాదము. రెండవది సంగ్రహపాదము. మూడవది సిద్ధి పాదము. నాల్గవది ప్రయోగపాదము. ధనుశ్శబ్దము సర్వ ప్రహరణముల వర్తించు. అది ముక్తాది చతుర్భేదకము. ముక్తమనగాఁ జక్ర, వజ్ర, వలయ, శక్తి ,తోమర, కుంత, పాషాణాదికము. అముక్తమనగా నంకుశ ,పాశ, క్షురికా, అసి ,గదా,ముసల, దండాదికము. ముక్తాముక్తమనఁ బాశ, వాగురా, రజ్జు వలయాదికము. యంత్రముక్త మనఁ జాప, శతఘ్ని,శల్యక ,మంజు,షార్క వర్ణాదికము. మన శాస్త్రానుసారముగా సర్వశస్త్రములలో ధనువు శ్రేష్ఠము. వింటియంగములు బాణము, అర్ధచంద్రము, శిలీముఖము, నారాచము, మోచకము మొదలగునవి. అస్త్రము మంత్రాక్షర ప్రతిలోమ పఠితమై యధిదేవత ప్రేరితమై యుండును. మంత్రదేవతాభేదముల ననుసరించి, బ్రాహ్మము, ప్రాజాపత్యము, వైష్ణవము, శైవము, ఐంద్రము, వారుణము, ఆగ్నేయము, వాయవ్యము, సౌమ్యము (చంద్రదైవతకము), ఆదిత్యము, దౌర్గము (దుర్గాదైవతకము), గాణేశ్వరము (వినాయకాధి దైవతకము), స్కాందము, శాక్తేయము, యాక్షంరాక్షసము, నాగము, గారుడము, గాంధర్వము, పైశాచము, పైత్రము (పితృదైవతకము), పార్థివము, ఆప్యము (జలాధి దైవతకము), తైజసము, పావనము, నాభసము, (ఈకడపటి యైదును బంచభూతముల గ్రమముగా స్తంభింప జేయునట ) సాముద్రము, పార్వతము, గాయత్రము త్రైష్టుభమానుష్టుభము, మొదలగునవి (కడపటిమూడును ఛందోదైవతకము లగు మంత్రములు ప్రయోగములుగా గలవి) ఈ యాయుధశిక్ష కధికారులు క్షత్రియులును బ్రాహ్మణులును దదనుయాయులును నగుదురు. రథ గజ తురగ పదాతులె వాని కధికరణ ములు. ఈ సూత్రపాఠమునఁ బ్రథమపాదమున ధనుర్వేదాభ్యాసమునకు



దీక్షాభిషేక శకునమాంగల్య కరణాదికము వివరింపఁ బడియె. రెండవదియగు సంగ్రహపాదమున సకలాస్త్రశస్త్రముల సంగ్రహ విధియు మూఁడవది యగు సిద్ధిపాదమున సంగ్రహించిన యస్త్రములకుఁ బునఃపునరభ్యాసమున మంత్రదేవతానియమ జపహోమోపాసనక్రియలును విస్తరింపబడియె. మంత్ర దేవత సకళ యనియు నిష్కళ యనియు నిఱుదెఱంగులం బరఁగు, అదియు చేతనావత్త్వము, ఇచ్ఛావిగ్రహత్వము, యష్టవ్యత్వము, తుష్టిమత్త్వము ఫలదాతృ త్వము అను నైదుగుణములు గలదని పూజాహోమోపాసనాదుల సాధకులు నడపుదురు. షోడశోపచారములచే సిద్ధదైవత మిచ్చు ఫలదానముచే సాధకుఁ డస్త్ర ప్రయోగము నొనర్చుట నాల్గవ పాదమున విస్తరింపబడియె. శస్త్రగ్రహణ మునకు ధనుర్వేదమున నియమముగలదు. సామదానభేదములచే నసాధ్యుఁ డయి దుర్వినీతుఁడగు పురుషునిఁ గాని, బహుప్రజా సంరక్షణార్థము తత్పాల కునిఁగాని, దేశకాలావస్థోచితముగాఁ గర్శకరణ శక్తి కనుగుణముగా నాపత్కాలముననను, సర్వదా ధర్మరక్షణముననను, దండము విధేయమని శాస్త్రజ్ఞులు గ్రహించిరి.

ఈ ధనుర్వేదమున ముక్తాముక్తాది చతుర్భేదకములుగాక నియుద్ధ మని పంచమభేదమును దరువాతి శాస్త్రజ్ఞులు గ్రహించిరి. తద్భేదములన్నియు మల్లయుద్ధములలోఁ బ్రయోగింపఁ బడునని నాచనసోమనాథాదులు యుద్ధ ప్రక్రియల నుత్తరహరివంశాదుల వర్ణించియుండుట యెల్లరకు విదితమేగదా!

ధనుర్వేద దైవత మంత్రస్వరూపముల వైశంపాయనుఁడు తన నీతి ప్రకాశికలో నిట్లు వర్ణించుచున్నాడు.

"చతుష్పాచ్చ ధనుర్వేదో రక్తవర్ణశ్చతుర్ముఖః।
అష్టబాహుస్త్రి ణేత్రశ్చ సాంఖ్యాయనస గోత్రవాన్ ॥
వజ్రం ఖడ్గో ధనుశ్చక్రం దక్షిణే భుజమండలే ।
శతఘ్నీ చ గదా శూలం పట్టిసం వామబాహుషు ॥
ప్రయోగ కోటీరయుతో నిత్యాంగో మంత్రకంచుకః ।
ఉపసంహారహృదయః శస్త్రాస్త్రోభయ కుండలః ॥
అనేక వల్గితాకార భూషణః పింగళేక్షణః ।

జయమాలా పరివృతో వృషారూఢస్స ఉచ్యతే "॥
అని స్వరూప ప్రతిపాద నానంతరము–

"తన్మంత్రం చ ప్రవక్ష్యామి వైరిజాల నికృంతనం।
ఆత్మసైన్య స్వపక్షాణా మాత్మన శ్చాభిరక్షకమ్ ॥
ఆదౌ ప్రణవ ముచ్చార్య నమ ఇత్యక్షరే తతః ।
వతేతి భగపూర్వం తు ధనుర్వేదాయ చోచ్చరేత్ ॥
మాం రక్ష రక్షేత్యుచ్చార్య మమ శత్రూన్ వధేతిచ ।
భక్షయేతి ద్విరుచ్చార్య హుంఫట్ స్వాహే త్యథోచ్చరేత్ ॥
అహమేవ ఋషి శ్చాస్య గాయత్రీ ఛ్చంద ఉచ్యతే ।
మహేశ్వరో దేవతాస్య వినియోగో ఽరినిగ్రహే ॥
ద్వాత్రింశద్వర్ణమనుం వర్ణసంఖ్యా సహస్రకైః ।
జపిత్వా సిద్ధి మాప్నోతి రిపూం శ్చాత్యధితిష్ఠతి ॥"

అని మంత్రలక్షణము నుపదేశించెను. ముక్తాదిభేదులు గాక, ధనుర్వేదము మతాంతరముగా –

"ఆధానం చైవ సంధానం విమోక్షః సంహృతి స్తథా।
ధనుర్వేద శ్చతుర్ధేతి వదంతీతి పరే జగుః ॥"

అని బాణము నెత్తుటయు ఎక్కుపెట్టుటయు తెగగొని యేయుటయు లక్ష్యవేధము అని నాల్గుక్రియల నుద్యోతించు విభాగములు గలవని కొంద ఱూహింతురు. మఱికొందఱు శస్త్రము, ప్రతిశస్త్రము, అస్త్రము, పరమాస్త్రము, అని చతుర్విధముగా విభజించిరి. వసిష్ఠసంహితయు సారంగధరుని వీరచింతామణి, కోదండచతుర్భుజము, కోదండమండనము, హరిహరచతురంగము, రాజవిజయము, వైశంపాయనుని నీతిప్రకాశికయు నిప్పుడు మనకు లభింపఁ గలవు. పరశురామసంహిత, రాజవిలాసము, భోజుని ధనుస్సంహిత, ఈశాన సంహిత, విశ్వామిత్ర సంహిత లోహార్ణవము, లోహరత్నాకరము మొదలగు నవి యుత్పన్నము లయ్యె. సోమేశ్వరుని యభిలషితార్థ చింతామణిలోను, కెలది బసవేంద్రుని శివతత్త్వ రత్నాకరముననుు, వీరమిత్రోదయ భాగమగు లక్షణప్రకాశమున, దైవజ్ఞ విలాసమున, రాజనీతిఖండము నను, అగ్నిపురా



ణముననుు, విష్ణుధర్మోత్తరముననుు, ధనుర్వేదమును గుఱించి విస్తరించు నధ్యాయములు గలవు. ఇవి యన్నియు మనకు లభించునవియే. శుక్రనీతిలో గజాశ్వరాజనీతి ఖండములుగాక ధనుర్వేదము విస్తరముగాఁ జెప్పఁబడియె. అందు యవ క్షార గంధకాది మిశ్రితమగునస్త్ర బాణక్రమములు యంత్ర ముచ్యములు వర్ణింపఁ బడియె. ఖడ్గాదినానాయుధ లక్షణము లద్భుతముగా వివరింపఁబడియె. ఉదాహరణముగా నీ పంక్తిఁ జూడఁదగును. ఖడ్గమును బ్రశంసించుచు జమదగ్నికి శుక్రాచార్యుడు –

"అసిరేవ పరం శస్త్రం స్వహస్తే నిత్యశోఽక్షయమ్।
అమోఘాకార సదృశం సర్వశత్రు క్షయ ప్రదమ్॥
ఉత్తానే వాథ కుబ్జేవా బలేనాభిగతేఽపివా।
సంవిష్టే చోపవిష్టే చ ఖడ్గ ఏవ పరాయణమ్॥
సంకటేచ విషమే గిరిదుర్గే నిమ్నగర్త సికతాస్థగితే వా।
కంటక ద్రుమ వృతేపి చ దేశే ఖడ్గ ఏవ శరణం జమదగ్నే॥
క్షితే రథే వాజిని కుంజరే వా గృహే ద్రుమే నాగరకే ప్రమాదే।
సర్వత్ర సర్వస్యచ భార్గవేంద్ర పరాయణం స్యాదసి రేవ నిత్యమ్॥
ధనురిహ శరపాతా దేవ వైహంతి శత్రూన్।
దహతి రిపుసమూహం వాజి వహ్నిర్జవేన॥
సుభట కరగతస్తు క్షిప్ర మభ్యాస మాత్రే।
శమయతి రిపుసేనాం పాతయోగేన ఖడ్గః॥
మతంగజస్థో రథవాజిగో వా శరక్షయే శస్త్రగణక్షయేచ।
సమస్థితో వా విషమస్థితోవా సరో ఽసినా మర్దయతీహ సర్వాన్॥ "

అని సంగ్రహశ్లోకములు పఠించెను. గదను వర్ణించుచు – గదా లక్షణం వక్ష్యతే సమాహితో నిబోధ తత్ర పంచాశ దంగుళాయామా శ్రేష్ఠా చత్వారింశదంగుళాయామా మధ్యమా, త్రింశ దంగుళాయామా నికృష్టా భవేదితి త్రివిధా గదా బుధైరుపదిష్టా పలావాం సహస్ర ముత్తమాయా శతాన్యష్టౌ మధ్యమాయా ష్షట్శతాని కనిష్టాయా ఇతిగదాయాః త్రివిధం గౌరవం భవతి. యస్తు బలదర్పితః సమర్థా గౌరవో దేవ దేవ వరాధిష్ఠితః ఏతాం

గృహ్ణాతి తస్యముక్తస్య చదోషాః సంభవేయుః తథా యా గదా లఘీయసీ భవతి నసా సంగ్రామే యుద్ధ విశారదైః ప్రశస్యతే. తస్మాత్సమా సర్వేషాం ప్రశస్తా భవతి. యాహి ప్రతిచారే ప్రహారే చారికాసుర సంచారమోక్షా సమే త్యభిధీయతే, త్ర్యస్రా వృతాశ్రిర్వా సుగాత్రా వ్రణరహితా సువిహితా ప్రియదర్శనా కర్తవ్యా, గ్రహే (పిడి) దశాంగులాయామో దశాంగుల పరిణాహశ్చ త్రయాణాం పురుషాణామ్ మూలతః సుద్రవ్యాణి పద్మగర్భోపమా పూర్ణ చంద్రోపమా వా గ్రహమూలం చిత్రజ్ఞైశ్చిత్రితం భవతి. స్థూలాగ్రా విశిష్టా చతురస్రామధ్యమా తాలామూలాకృతి ర్నికృష్టా భవతి. తప్తకాంచన పదైర్వా బహుచిత్రిత రూపై ర్మూలమధ్యాగ్ర బంధనైర్విచిత్రీకృతా గదా శ్రేష్ఠా భవతి సర్వశస్త్రేషు. సాహిక్రియావిధౌ వవుష్మత్వాద్బల వత్వాచ్చ సుఖయోగా భవతి. నానాచిత్రైర రలంకృతా సర్వేభ్యః శస్త్రేభ్య శ్చాక్షయ్యా సాహి గదా శస్త్రజ్ఞై రాయుధవరే త్యభిదీయతే ”

గదను గుఱించి రాజవిజయమున సంగ్రహముగా :-

“పంచాశదంగులో దండో దలేష్వర్కాంగుళా గదా
దళాని షోడశైవ స్యుః కలశోంగుళిమాత్రకః”

అని సంగ్రహింపఁ బడియె. **శుక్రనీతి**లో శక్తియను నాయుధమునకు లక్షణ మిట్లు చెప్పఁబడినది.

“వత్స! జమదగ్నేశృణు !యన్మాం త్వం పరిపృచ్ఛసి. ఉత్తమా మధ్యమా కనిష్ఠా చేతి తిస్రః శక్తయోభవంతి తాసాం దండశ్చతుర్విధో వైణవః దారుమయో దండమయ ఆయసశ్చేతి. సుస్నిగ్ధ్వం నిర్వ్రణత్వం పూజితత్వం చేతి దండగుణాః స్యుః. తాసు పంచహస్తా ఉత్తమా మధ్యమా ద్వివితస్తిహీనా త్రివితస్తిహీనా త్వధమా భవతి తాసాం కక్షద్వయోప ఘటితలక్షణ ఉభయతః ఫలద్వయం భవంతి (ఫలమనఁగా ఖడ్గపురేకు) హస్తమాత్ర మతితీక్షణం కాయ భేధేన సమర్థ మతిఘనం తచ్చనిస్త్రింశాకారం కార్యం సంక్షిప్త మధ్యభాగం భవతి. మధ్యఫలమితరాభ్యాం కక్షాఫలాభ్యాం యుక్తంశ్రితం వా భవతి తచ్చద్వివిధం మూల యుక్తం మూలశ్రితముఖయుక్తం చేతి తచ్చ దండే పత్రభాగాది చిత్రా



న్వితం నాగబంధైర్బధ్నీయాత్. అధోత్తమా యాశ్శక్తేః ఫలాగ్రేణ శతఫల వర్ధితం గౌరవం భవతి. మధ్యమా యాస్త్వశీతిఫలం కనిష్ఠాయాః షష్టి ఫలమితి శక్తిలక్షణ ముక్తం.”

ఈ యుదాహరణధోరణి గనుగొన్న శుక్రనీతి మూలగ్రంథ మంతయుఁ బ్రాకృతముననో మాగధీభాషనో గాథారూపమున రచింపఁబడి యుండునని తోచుచున్నది. పైపంక్తుల లోని యర్థచ్ఛేదమును గమనించి మాగధికి మార్చినచో సులభముగా గాథారూపము చెందుచున్నది. గాథయనఁగాఁ బ్రాకృత మాగధీ భాషలలో నార్యావృత్తము వంటిది. ఇది కందపద్యము నందలి రెండవ నాల్గవ పాదముల కొనలో రెండుమూఁడు మాత్రలు తగ్గినట్టి యొకానొక జాతిపద్యము.”

శ్రీ కవిగారు పరశురామ సూత్రములు శాండిల్యభాష్యముతో గేరళ దేశమునఁ గలవనిరిగాని, యవి యట్లుండుట యింతదాఁకఁ దెలియరాలేదు. అగ్నిపురాణమున 249 అధ్యాయముననుండి 252 అధ్యాయముదాఁక ధనుర్వేద వివరణమున్నది. యుక్తికల్పతరువు, అభిలషితార్థచింతామణి, శివ తత్త్వరత్నాకరము, వీరమిత్రోదయము ( ఇవి ముద్రితములు), చతుష్షష్టి కలా సంగ్రహము ననుగ్రంథములలో యుద్ధతంత్ర వివరణమున్నది, యామలాష్టక తంత్రమునఁ గవిగా రుద్ధరించిన శాస్త్రవిషయ సంగ్రహసూచీ మాత్రమున్నది గాని, తద్వివరణములు లేవు. ఇవి గాక, వైశంపాయన నీతిప్రకాశిక, వసిష్ఠసంహిత, శివధనుర్వేదము, మనుసారము (వ్రాతప్రతిపంజాబు కేటలాగు లోనున్నది ) కోదండమండనము, హరిహర చతురంగము, వీరచింతామణి, శివోక్తధనుర్వేద సంహిత, భారతాదులలోని ధనుర్వేదవిషయములు నేఁ జూచిన ముఖ్యగ్రంథములు.

**భారతమున :-**

విరించి - స్వామ్యమాత్య రాష్ట్రదుర్గకోశ సుహృద్బలంబులు, నాన్వీక్షకీ త్రయీవార్తా దండనీతులు, నరిమిత్రో దాసీనాదిక ద్వాదశ రాజమండలంబును సంధి విగ్రహ యానాసనద్వైధీభావ సమాశ్రయంబులును మొదలుగా వలయువానికిం బ్రబోధకంబులగు నానావయవంబులుం గలిగి ధర్మార్థ

కామమోక్షంబులకు సాధకంబు లయి యుండునట్లుగా నూరువేలధ్యాయంబుల నఖిల లోకహితంబగు నీతిశాస్త్రంబు రచియించి యిది లోకచరిత్ర నిర్మలీ కరణంబునకుం గారణం బగునని యనుగ్రహించె, నాలోకపితామహులలాటం బున ననాది నిధనుండును, విశ్వజగత్కర్తయు, సర్వభూతాత్ముండును, సనాతనుండును నగు విరూపాక్షుండు విశాలాక్షుండను నామంబున నావిర్భ వించి యాగ్రంథం బధిగమించి దాని నభ్యసించుటకు మర్త్యుల కాయుర్బుద్ధులు సాలవని యుమ్మలించి యమ్మహనీయ తంత్రంబు సంక్షేప రూపంబునఁ బదివేలధ్యాయంబుల వైశాలాక్షంబన నిర్మించె

ఆ॥ హరునివలనఁ బడసి యాశాస్త్ర మమరేంద్రుఁ
డయిదువేలు సేసె నమరగురుఁడు
తేటపడ నొనర్చెఁ ద్రిసహస్రకాధ్యాయ
రూపసమ్మితముగ భూపవర్య!

దాని శుక్రుండు సహస్రాధ్యాయపరిమితంబు గావించె, మఱియు మనుష్యులశక్తి యెఱింగి మునులుక్రమంబున సంక్షిప్తరూపంబులుగా గ్రంథంబులు గావించి, రిది నీతిశాస్త్ర ప్రకారంబు " (భారతము- శాంతి పర్వము-2. ఆశ్వాసము) మఱియు.

"విష్ణుండు దండనీతిశాస్త్రంబు సకలంబు నాంగిరసున కిచ్చె నాంగి రసుం డింద్రమరీచులకు మరీచి భృగునకు భృగుం డనేకమునులకు నిచ్చె" శాంతి 2. ఆశ్వాసమున " ఏయజ్ఞంబులును సంగ్రామయజ్ఞంబునకు సదృశం బులుగావు వినుము వీరమస్తకరాశి వేదికగాఁ గృపాణబాణాది సాధనంబులు సమిత్స్రుక్స్రువంబులుగా శోణితం బాజ్యంబుగా మాంసంబు పురోడాశంబుగా వీరవ్రత దీక్షితుండు సమరాధ్వరంబు సలిపి రుధిరజల పూరయు మస్తిష్కకర్ద మయుఁ గేశశైవాలయు నాంత్రఫేనయు భేరీ మండూకయు హేతిమీనయు గజకళేబరపులినయు నగు సమరపుణ్యనది నవభృథస్నానంబు సేసి మదీయలోకంబున సుశ్లోకుండై నిత్యస్థితి నత్యుదాత్త పదవిం బ్రవర్తిల్లుఁ బుణ్యతముండగుటకుఁ దనువు దొఱఁగ వలయునని లేదు. తెగువతోడి యనివర్తనగతియ చాలు. (శాంతి 2, ఆశ్వాసము.)

వేదములు ప్రధానముగా యజ్ఞతంత్ర ప్రతిపాదకముగా నున్నవి గాన, యుపవేదములు గూడఁ దదర్థానుసారముగా గాంధర్వాదివిద్యల యజ్ఞ



తంత్రాత్మకములునుఁగా సమర్థించినవి. అట్లే శైవవైఖానస శాక్తాద్యాగమము లను శివవిష్ణుశక్తి పూజా విధానములును యజ్ఞ తంత్రాత్మకముల గావించినవి. భగవద్గీతలలో మఱింత విపులీకరణముతో జ్ఞాన తపోయజ్ఞాదికల్పనము లున్నవి.

పై విధమున భారతమునఁ బేర్కొనబడిన ధనుర్వేద గ్రంథములు గానరావుగాని మునులు క్రమంబున సంక్షిప్తరూపముగాఁ గావించిన గ్రంథము లీ క్రిందివి గానవచ్చుచున్నవి.

**వశిష్ఠధనుర్వేదసంహిత**

"అథైకదా విజిగీషు ర్విశ్వామిత్రో రాజర్షి ర్గురుం వశిష్ఠ మభ్యుపేత్య ప్రణమ్యో వాచ బ్రూహి భగవన్ ధనుర్విద్యాం శ్రోత్రియాయ దృఢచేతసే శిష్యాయ దుష్టశత్రువినాశాయచ త మువాచ మహర్షిర్బ్రహ్మర్షి ప్రవరో వశిష్ఠః శ్రుణు భోరాజన్ విశ్వామిత్ర ! యాం సరహస్యధనుర్విద్యాం భగవాన్ సదాశివః పరశురామా యోవాచ. తామేవ సరహస్యాం వచ్మితే హితా గోబ్రాహ్మణసాధు వేదసంరక్షణాయ చ యజుర్వేద ధర్మసమ్మితాం సంహితామ్ తత్రచతుష్టయ పాదాత్మకో ధనుర్వేదః యస్య ప్రథమే పాదే దీక్షాప్రకారః ద్వితీయే సంగ్రహః తృతీయే సిద్ధప్రయోగః చతుర్థే ప్రయోగవిధయః ధనుర్వేద విధి." ఆచార్య లక్షణము వేధవిధి చాప ప్రమాణము, శుభచాపలక్షణము, వర్జితధనువు గుణ లక్షణములు శరలక్షణములు ఫలలక్షణములు, తత్ఫలములు శరోపరిఔషధలేపనము నారాచనాళీక శతఘ్నీ వర్ణనములు స్థానముష్ట్యాకర్షణలక్షణములు, గుణముష్టి, ధనుర్ముష్టి, సన్ధానము, ధనుర్వ్యాయములు లక్ష్యములు లక్ష్యాభాసము అనధ్యాయములు శ్రమక్రియ లక్ష్యాస్థలనవిధి, శ్రీఘ్రసంధానము, దూరపాతిత్వము, దృఢభేదనము, హీనగతి సమూహము బాణాలక్ష్యస్థలనగతి సమూహము క్షుద్రగతులు దృఢచతుష్కము చిత్రవిధి కాష్ఠచ్ఛేదనము ధావనలక్ష్యము ధావనవిధి, శబ్దవేదిత్వము ప్రత్యాగమనము అస్త్రములు వాని మంత్ర సంస్కారము పాశుపతాస్త్రము ఔషధులు ఔషధవిధి ఉపవాసము సంగ్రామవిధి రుద్రమంత్రజపము వ్యూహాదులతో యుద్ధకరణము దగ్ధవ్యూహము శకటవ్యూహము

పిపీలికావ్యూహము సేనానయము పదాతిక్రమము అశ్వక్రమము హస్తిక్రమము రథక్రమము సేనాపతికరణవిధి శిక్ష హంతవ్యాహంతవ్యోపదేశము పరిశేషప్రకరణము :- అస్త్రనామములు :- అసి, అంకుశము, అవిద్య, అసిపుత్రిక, అర్ధధార, అంతర్ముఖము, ఆటీముఖము, ఆర, ఆస్తరము, ఇలి, ఇషువు, ఉత్పత్రపత్రము, ఏషణి, ఏంద్రచక్రము, కవచము, కరపత్రము, కాలచక్రము, కుఠారము, కుంతము కుఠాలిక, కుండిక, కుద్దాలము, క్రకచము, ఖేచకము, ఖగము, ఖట్వాంగము, గద, గాంధర్వము, గారుడాస్త్రము, గోశీర్షము, చక్రము, చమ్రము, చాపము, క్షురిక, జంభనము, జింభశాస్త్రము, తులాగుడ, తూణీరము, తోమరము, త్రిశూలము, త్రికూర్చక, దంతకట్వకము, దండచక్రము, దండము, దివ్యాస్త్రము, ద్రఘనము, దంతశంఖు, ధర్మచక్రము, ధనుస్సు నఖశస్త్రము, నారాచము, నాళీకము, నాగపాశము, నాగాస్త్రము, నిస్త్రింశము, నందనము, పరిఘము, పట్టిసము, పరశువు, పాశుపతము, ప్రశమనము, ప్రస్వాపనము, పినాకము, ప్రామము, బాణము, వక్రము, వాసి, రరుణము, బ్రహ్మశిరము, వాయ్వస్త్రము విద్య బడిశము, బ్రహ్మాస్త్రము, బర్షణము, బ్రహ్మదండము, వేతనపత్రకము, వ్రీహిముఖము విలాపనము, వృద్ధిపత్రము, భల్లము, భిండిపాలము, భుశుండి, మకరాస్త్రము, మండలాగ్రము, మౌష్టికము, ముసలము, మాదకి, మయూఖి, ముదిక, లఘిత్రము, లగుడము, లవిత్రము, శరము, శక్తి, శతఘ్ని, శలాకాస్త, శూల, శస్త్రి, శరావీముఖము శార్ఙ్గము, శోషణము, సమ్మోహనము, సర్పాస్త్రము, సంతాపనము, సాయకము, సింహముఖము, సూచీ సూచీముఖము, సీరము స్థూణము, హయశరము, హేతి, క్షుర, క్రౌంచాస్త్రము, కుశపత్రము, శ్రేణి, దాత్రము.

**శివతత్త్వరత్నాకరము** :- ఇది సంధానగ్రంథము, అర్వాచీనము, కెళిది బసవరాజుచే క్రీ శ. 1697 నుండి 1715లో సంధానింపఁబడినది, ఇందు 8వ కల్లోలమున ద్వితీయ, తృతీయ, చతుర్థ తరంగములలో ధనుర్యుద్ధ శాస్త్ర విషయములున్నవి.

**నీతిప్రకాశిక** :- దీనికే వైశంపాయననీతి యని నామాంతరము. ఇది యెనిమిదధ్యాయములు గలది.



తొలుత బ్రహ్మ పృథుచక్రవర్తి కుపదేశించిన ధనుర్వేదమును వైశంపాయనుఁడు జనమేజయున కుపదేశించినట్లు గ్రంథావతరణిక ప్రథమాధ్యాయమున గలిదోషములు రాజనీతి మున్నగు విషయములు శత్రుపై దాడి వెడలుటకుఁ బూర్వము సంసిద్ధుఁడై యుండవలసిన తీరులు గలవు.

ద్వితీయాధ్యాయమున జయప్రదములైన ధనుర్వేదోక్తములైన యాయుధములు ముక్తక ఆముక్తక ముక్తాముక్తక మంత్రముక్తకములని నాల్గు తెఱఁగులనియు ధనుర్వేద ప్రథమ పాదమున సూచితములగు ధనురాది ద్వాదశాయుధములు మొదటిరకములనియు, ద్వితీయపాదమునఁ జెప్పబడిన యిర్వదియాయుధములు రెండవ రకమనియు, తృతీయపాదమునవి మూఁడవ రకపుటాయుధములనియు నవి నలువది నాలుగనియు సోపసంహారము లనియు నేబదియై దుపసంహారాయుధములనియు.

చతుర్థపాదమున సర్వశక్తిమంతములగు నారాయుధములు ప్రతిపాదింపబడినవనియు ధనుర్వేద విషయము చెప్పబడినది.

తృతీయాధ్యాయమున ఖడ్గోత్పత్తి తద్వివరణము తెల్పబడినది.

చతుర్థ పంచమాధ్యాయములలో తొలుతటి రెండురకముల యాయుధముల వివరణమున్ను పంచమము చివర కలికాలోపయుక్తములగు భయంకరాయుధముల విషయము వర్ణింపబడినది.

షష్ఠము సైన్య విషయవివరణము, సప్తమము దండనీతిని గుఱించి, అష్టమమున రాజ్య పరిపాలనా విషయము సామాన్య ధర్మములును ప్రతిపాదింపబడినవి.

**కోదండమండనము** – దీనికర్త పే రెఱుఁగరాలేదు.

జ్యాకుండలిత కోదండయష్టి ర్యస్య కరే స్థితా
స్థితా తస్య కరేంభోధివేలాకుండలితా మహీ
ద్రోణభీష్మార్జునాదీనా మద్యాపివ్యాప్తభారతః
సధనుర్గుణటంకారః స్ఫారః స్ఫూర్జతి భూతలే

యజ్ఞామదగ్న్య భృగు రాఘవసూర్యపుత్త్ర।
ద్రోణార్జున ప్రభృతిభి ర్జమదగ్నిముఖ్యైః॥
నీతం యశస్త్రిషు జగత్సు యదద్యతావ।
త్కుందేందుధామధవళం సధనుఃప్రభావః॥
సర్వశాస్త్రాణి సంక్షిప్య కృత్వానుభవ మాత్మనః।
సంప్రదాయ ముపాదాయ కుర్మః కోదండమండనమ్॥
అనాదిబ్రహ్మసంభూత స్త్రివర్గఫలసాధనః।
యజుర్వేదోపవేదోఽయం ధనుర్వేదో నిగద్యతే॥
మనుష్యోఽపి మహాధన్వి భోజరాజో ధనుశ్శ్రమాత్।
వివ్యాధ స్ఫారనారాచైః ధారాయంత్రం కలౌయుగే॥
శ్రీమతో భోజరాజస్య కోంకణానాం క్షయక్షణే।
అద్వితీయస్య సాహాయ్యం విదధీత శరాసనమ్॥

1. అధ్యాయము ధనుర్వేదప్రశంస 2. శిష్యలక్షణము. 3. అధివాసనాధికారము.

విప్రే భూభుజి భంగభాజి వికలే బాలే వివస్త్రే స్త్రియాం
వృద్ధవ్యాధితముక్తకేశవివశే భగ్నోర్ధ్వబాహుష్వపి
నిశ్శస్త్రే శరణార్థిని క్షితి గతే క్షీణే తవాస్మీతిచ
క్షీబం జల్పతి నత్వయా రణముఖే వ్యాపారణీయం ధనుః

4. ఉపనయనవిధి 5 ధనుర్లక్షణము 6 గుణలక్షణము 8 కోదండ గుణబాణకర్మ 9 యోగాభ్యాసము 10 క్రియాభ్యాసము 11 శలాకాభ్యాసము 12 జాఘూతాభ్యాసము 13 శ్రమకాండము 14 గతిదోషనిర్ణయము 15 గతి నిర్ణయము 16 లక్ష్యసాధనము 17 ఆకర్షణము 18 దృఢవేధము 19 దూరాపాతము 20 చిత్రవేధము 21 సమరసంభారము.

యుక్తికల్పతరువు, చతుష్షష్టి కలాసంగ్రహము, అభిలషితార్థ చింతామణి యనుసంధానగ్రంథములలో ధనుర్వేదవిషయ మత్యల్పమే కలదు.



## –హరిహర చతురంగమ్ –
## ధనుశ్శాస్త్రప్రకరణమ్

“చతురంగబలం ప్రోక్తం నచ యుద్ధక్రియాక్షమమ్
ధనుర్విద్యాసు నిపుణధానుష్కేణ వినా తతః
ధనుర్వేదం సమాలోచ్య తథై వేశానసంహితామ్
వీరచింతామణిం వీక్ష్య శ్రీ కోదండచతుర్ముఖమ్ ”

“సారసంగ్రహమాలోచ్య ధనుశ్శాస్త్రాంతరాణిచవ వక్షీతత్ర ధనుర్విద్యా సారభూతార్థ సంచయం ధనుఃప్రశంస ధ్వని ప్రశంస ధనుర్గుణశ్చ బాణశ్చ గురుశ్శిష్యశ్చ పంచమః ధనుర్విద్యాంగ మేతాని కథ్యన్తేక్రమశస్సహ” చాపద్రవ్యము చాపభేదములు చాపప్రమాణములు చాపదోషములు ధనుఃషడంగములు, “అటనీ కర్ణికా శంఖః స్కంధాఃకోట్యంతరేస్థితాః వల్లవోలస్తకో మధ్యే షడంగం ధనురుచ్యతే ” షడంగవివరణము శరద్రవ్యము శరత్రైవిధ్యము తన్మాకము నిందితశరములు శరసప్తాంగములు “ముఖకర్ణౌ తథాస్కంధౌ గాత్రంవక్త్రాననం తథా జంఘూ పుంఖశ్చ విపిజే సప్తాంగా న్యనుకల్పయేత్” పుంఖాష్టవిధత్వము పక్షములు పత్రచ్ఛేదము ఫలసాయనము గురుశిష్యులు అనధ్యాయములు శ్రమము గురుపూజాదికము “శుక్ర గౌతమ శాండిల్య జమదగ్ని బృహస్పతీన్ ధనుర్వేద గురూంశ్చాగ్రాన్ తర్పయే ద్బలికర్మణౌ ఉపనయనమ్ పూజా ధనుర్గ్రహణమ్ శ్రమఫలలక్ష్యమ్” లక్ష్యదోషగుణములు స్థానదోషములు స్థానములు సంధానదోషములు అంగదోషము దార్ఢ్యము ముష్టి వ్యాయములు, వాయుసంధారణము, సౌష్ఠవము, అభ్యాసము, క్రమలు, గతులు, గతిదోషము, “కుంభస్థలం గజానాం స్యాత్ వాజినాం కర్ణపృష్ఠకమ్ నరాణాం హృదయం మర్మత్వేవం మర్మవిధో విధుః రాధా యంత్రమ్ శబ్దవేధ మనోవేధ” ఖడ్గలక్షణము. ఇది ముఖ్యవిషయసూచి **గద్య** “ఇతి శ్రీమన్మహా రాజాధిరాజ గజపతిప్రతాపరుద్రదేవస్వహస్త ధారితకనకకేసరి చతుష్టయా వేష్టిత శాత కుంభమయ కుంభ సంభృత మేఘాడంబరాభిధాన సితాతపత్రశోభమాన కవిపుంగవ పండిత రాజరాజగురు వాజపేయయాజి మంత్రివర గోదావరి మిశ్రవిరచితే హరిహరచతురంగే పంచమో ధనుర్విద్యాపరిచ్ఛేదః”

**వీరచింతామణి** :– భగవతో వ్యాసస్యకృతిః

ఆచార్యలక్షణము, శస్త్రకర్మారంభకాలము శిష్యునికి ధనుర్దానము వేధత్రయము ధనురాదానవిధి ధనుర్లక్షణము ధనురాచార్యులు పరశు రామాదులు.

"త్రిపర్వం పంచపర్వం సప్తపర్వం ప్రకీర్తితమ్।
నవపర్వం చ కోదండం చతుర్ధా యుద్ధకారకమ్॥
చతుఃపర్వం చ షట్పర్వ మష్టపర్వం విసర్జయేత్।
కేషాంశ్చ భవే చ్చాపం వితస్తి సవసమ్మితమ్॥
పౌరుషేయం తు యచ్ఛార్ఙ్గం బహువత్సర శోభితమ్।
వితస్తిభి స్సార్థ షడ్భి ర్మితం సర్వార్థ సాధనమ్"॥

ఇత్యంతమగు ధనుఃప్రమాణము గుణలక్షణములు శరలక్షణములు ఫలలక్షణములు ఫలపాయనము

"ఫలస్య పాయనం వక్ష్యే దివ్యౌషధివిలేపనైః।
యేన దుర్భేద్యవర్మాణి భేదయే త్తరుపత్రవత్॥
పిప్పలీ సైంధవం కుష్ఠం గోమూత్రేణ తు పేషయేత్।
అనేన లేపయే చ్ఛస్త్రం లిప్తం చాగ్నౌ ప్రతాపయేత్॥
శిఖి గ్రీవాసువర్మాభం తప్తపీతం తదౌషధమ్।
తతస్తు విమలం తోయం పాయయే చ్ఛస్త్రముత్తమమ్"॥

నారాచ నాళీకములు, స్థానముష్ట్యాకర్షణములు స్థానములు, ముష్టులు, వ్యాయములు, అనధ్యాయములు, శ్రమక్రియలు, లక్ష్యాస్ఖలనవిధి, శీఘ్ర సంధానము, దూరాపాతము, శీఘ్రదృఢభేదిత హీనగతులు, శుద్ధగతులు దృఢ చతుష్కము, చిత్రవిధి, బాణభాగములు, కాష్ఠఛేదనము, బిందుకము, గోలయుగళము, వేధవిధి, అస్త్రవిధి, శస్త్రవారణము, సంగ్రామవిధి, విష్ణుస్మరణము, అక్షౌహిణీ, మహాక్షౌహిణీ, వ్యూహవిశేషములు.

ముఖే రథా గజాః పృష్ఠే తత్పృష్ఠే చ పదాతయః
పార్శ్వయోశ్చ హయాః కార్యాః వ్యూహ స్సాయం విధి స్మృతః
అర్ధచంద్రం చ చక్రం చ శకటం మకరం తథా



కమలం శ్రేణికా గుల్మం వ్యూహ సేనాం ప్రకల్పయేలే

యుద్ధవిధి :–

యస్తు భగ్నేషు సైన్యేషు విద్రుతేషు నివర్తతే
పదేపదేఽశ్వమేధస్య రభతే ఫలమక్షయమ్
ద్వావిమౌ పురుషౌ లోకే సూర్యమండల భేదినౌ
పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖో హతః
ఆస్యేన వాయవో యాన్తి పృష్ఠే భాను ర్వయాంసి చ"

అనుప్లవంతే మేఘాశ్చ యస్య తస్య రణే జయః ఇతి ధనుర్వేదః నలజనంపాటిశాసనమున (ఇదినన్నయకుఁజాలఁ బ్రాచీనము) నిట్లున్నది.

దీని రక్షిఞ్చినవాని (కి) అడుగడు గశ్వమేధంబున ఫలంబగు
ఇదే నన్నిచోడని కుమారసంభవమున నిట్లున్నది.

చ. పుడమిపుడుఁ ధనాఢ్యుఁడును భూరిబలుండును శౌర్యవంతుఁడుఁ
గడుదృఢపాణి (యున్నయినఁగాని) యెడంబడ దశ్వమేధ మొం
డడరఁగఁ జేయఁ దన్మఖమునందుల పుణ్యఫలంబు నందఁగా
నడుగడుగశ్వమేధ మగునాజిమొనం జని చావు సేగియే.

సంస్కృతగ్రంథముల యాంధ్రీకరణము లయినను భారతాదులలోను దేసిరచనలగు కుమారసంభవాదులలోను యుద్ధతంత్రవిశేషములు వ్యూహ నామములు ఆయుధనామములు ప్రాకృతరూపములతో నధికముగా నున్నవి. అవి కర్ణాటాంధ్రసమానములుగా నున్నవి. అంతేకాక, యుద్ధగణిత భరత నాట్యాది శాస్త్రపారిభాషిక పదములు మహారాష్ట్ర ప్రాకృతమున నున్నవి : ఆఱ్నూటేండ్లు నిర్వక్రముగా రాజ్యమేలిన చాళుక్యులనాటనో అంతకుబూర్వము సాతవాహనులనాటనో యవియట్లు వెలసియుండవచ్చును. సభాపతివచన మున బత్తీసాయుధముల పేళ్ళిట్లున్నవి. అసి, ముసల, ముద్గర, రోహణ, కణయ, కంపణ, శిల్లు, భల్లాతక, భిండివాల, కరవాల, కుంత, కోదండ, కఠార, తోమర, పరశు త్రిశూల, వజ్రముష్టి, గదాతౌది, లాంగూలంబులు, నతళము, వంకిణి, చక్రము, సబళ, యీటె, యినుపకోల, సెలకట్టె, పట్టెసము, ప్రకూర్మము, నఖమయూరము, దండ, నాసంబులు.

ధనుశ్శాస్త్రవిషయకములైన సంస్కృత గ్రంథముల తీరిట్లుండఁగాఁ ధనుర్విద్యావిలాసముగాక శ్రీ పాకలపాటి రాజగోపాలరాజ ప్రణీతమగు దెలుఁగున నిప్పుడు ప్రసక్త మయిన ధనుశ్శాస్త్రము ఆద్యభ్యాస పరికరవ్యూహ ధర్మఖండములని యైదుఖండములు గలిగి యనేక ధనుశ్శాస్త్ర రహస్యార్థములతో గర్భితమై కానవచ్చుచున్నది. కానియందు తుదిఖండమగు ధర్మఖండము గానరాదు. అది యెందుచేతనో ముద్రణమున కెక్కదయ్యెను. క్రీ. 1811వ సంవత్సరమున ధనుశ్శాస్త్రమును మందపాటి వెంకటపతి రాజుగారి దగ్గఱ శుశ్రూషించి నేర్చుకొనెనట. ధనుశ్శాస్త్రరహస్యార్థములువారికి స్వయముగ జ్ఞానదృష్టికి గోచరింపఁగా నా గ్రంథమును వారు రచించిరట. ఆ గ్రంథమున ధనుర్విద్యావిలాసములోని విషయములు చాలఁగాజేరియే యున్నవిగాని ఇంక నెన్నో విశేష విషయము లందు గలవు. దానిలోని విషయ సూచి యిట్టిది :-

ఆదిఖండము - ప్రథమాశ్వాసము

1.నిమిభూపాలుఁడు నైమిశారణ్యమున కరుగుట, 2. నీచజనకృతమగు పరిభవము. 3, నారదాగమనము 4, ధనుర్విద్యా మాహాత్మ్యము. 5. బ్రహ్మయజ్ఞమున నారాయణుఁడు హయగ్రీవుఁడై యవతరించుట. 6. వేదోప వేదములయుత్పత్తి. 7, టట్టిభబ్రాహ్మణో పాఖ్యానము. 8, నారదుఁడు దివ్యాస్త్ర మంత్రములను శపించుట. 9, పారాశర్యస్తవము. 10 భారత కథాప్రకటనము. 11, పరిక్షిత్సంభవము.

ఆదిఖండము - ద్వితీయాశ్వాసము.

12, అర్జునుఁడు పరీక్షిత్తుకు విద్యాభ్యాస మాహాత్మ్యమును బోధించుట 13, అవక్రీతు చరిత్రము 14, కుమారభార్గవులు సదాశివునిభజించుట. 15 శక్తిత్రయోత్పత్తి, 16. ధనురాదిసాధన షట్కసంభవము. 17. శక్తి త్రయపూజానిరూపణము. 18. దివ్యాస్త్ర సంభవము. 19. ధనుర్విద్యాసాంప్ర దాయము. 23. సిద్ధదర్శనము, 24. ఏకాదశమహాధనుర్ధర చరిత్రము 25, దిండికారకృత విద్యాలాభము.



అభ్యాసఖండము -ప్రథమాశ్వాసము

1. కృపాచార్యుండర్జునుని గృహమునకేతెంచుట, 2. అర్జునుఁడు విద్యాలాభమునకై పరీక్షిత్తుని కృపాచార్యుని కప్పగించుట, 3. విద్యారంభ పూజావిధానము, 4. షణ్ముఖాదుల సత్యవచనప్రకటనము, 5. గురుశిష్యా భ్యాస రంగలక్షణములు. 6. ముహూర్తప్రకారము, 7. నిబిడాసనవర్తుల ముష్టిలక్షణము. 8. షణ్ముఖలక్షణములు తద్వినియోగములు. 9. ఏకశరా భ్యాస ప్రకారము. 10. చతుర్దశోపాయంబు లెఱింగించుట, 11. వైష్ణవ సాచీకృత సన్యాసలక్షణములు. 12. పంచస్థాన చిత్రస్థానలక్షణములును, తద్వినియోగంబులును అభ్యాసప్రకారంబును 13. చతుర్ముఖంబుల నభ్యసించువిధి. 14. వృషదత్తేతిహాసము. 15. కురుభూమహాదేవీభాషణము. 16. షడుపాయప్రకారము. 17. సూచీముఖప్రభావము. 18. పద్ధతినవజ ప్రకటనము. 19. సూచీముఖాభ్యాసభేదము. 20. క్రీడాసంగర ప్రకారము. 21. లాఘవశక్తి మాహాత్మ్యము లెఱింగించుట. 22. నిరంతరాభ్యాస శరసంఖ్యా నిరూపణము, 23. చతుర్యుగ సంధానప్రమాణము లుపన్యసించుట.

అభ్యాసఖండము - ద్వితీయాశ్వాసము

24. దృఢశక్తికీర్తనము, 25. మోహనాకర్షణలక్షణము, 26. భుజబాహుదండ ముష్టి సౌష్ఠవప్రకారము, 27. చలాచల భాగనిరూపణము, 28. రజ్జుచాప నిరూపణము, తదభ్యాసప్రకారము, 29. భోజ్యవస్తు ప్రకారము. 30. పంచదోషనిరూపణము, 31. కురులోచనోపాఖ్యానము నారాయణుఁడు దానిని శపించుట. 32. చతుర్విధ మోక్షణములు -తత్ప్రకటనము, 33. లక్ష్యవేదికా విధానము, 34. పంచశుద్ధులవిధము 35. బ్రహ్మదండ మోక్షణ ప్రకారము. 36. విధిత్రయప్రకటనము. 37. చతుర్యుగపురుషాధ్యులేయు భారంబుకొలందు లెఱిగించుట. 38. కాపీ విద్యామాహాత్మ్యము, 39. దూరా పాతి శరప్రయోగవిధానము, 40. గురుస్తవము, 41. ధనుస్తవము, 42. చతుప్ప్రహార పరిమితాభ్యాస వివరణము.

అభ్యాసఖండము - తృతీయాశ్వాసము

43. యోగీశ్వరుల ధారణక్రమము. 44.లంబలక్ష్య నిర్మాణక్రమము

45. దీపకలికావశంబున దృక్సిద్ధి వడయుప్రకారము. 46. క్రమక్రమాభ్యాసవివరణము 47. నవలక్ష్యాభ్యాస ప్రకారము, 48.ఉమామహేశ్వర సంవాదము, 49. ధునీయంత్ర కల్పితము, 50. శబ్దలక్ష్య రహస్యముల నుపన్యసించుట. 51. ధనంజయచరిత్రము, 52. చిత్రలక్ష్యమార్గములు గుహ్యప్రకారము నెఱింగించుట. 53. గురుదక్షిణా సమర్పణప్రకారము, 54. ధ్వజవిచారము, 55. కులధర్మంబులగు హింసాకార్యములకు నిర్దోషంబుగా గురుcడు స్మృత్యర్థంబుల సమాధానము సెప్పుట. 56. మృగయావినోదము.

అభ్యాసఖండము – చతుర్థాశ్వాసము

57. బ్రహ్మోపదేశమున స్వాయంభువ మనువుధనుశ్శాస్త్రమును రచియించుట. 58. కర్దమశాపముచే వైకల్యమునొంది మరల హయగ్రీవ పాదులవలన శాస్త్రదశకము కల్పింపబడుట. 59. గరుడుcడు నిజరచితంబైన భాన(ధ)నుశ్శాస్త్రమును గాధేయుని కిచ్చుట. 60. గాధేయుcడు రామచంద్రుని దోడితెచ్చుట. 61. తాటకాపహరణము. 62. ఖాణోపదేశారంభము. 63. గుణపంచక ప్రభావము. 64. వాయుధారణ విధమును ప్రకటించుట. 65. పరికరషట్కధారణ క్రమంబెరింగించుటయు తద్విమోక్షణక్రమంబును 66 వాయునిరూపణప్రకారము. 67. ఏకశృంగ శరాభ్యాస లక్షణము. 68. స్తంభీకృత విద్యాచమత్కారము. 69. స్థానపంచక ప్రతిస్థానలక్షణ వినియోగములు. 70. దూరాపాతిశరనైపుణ్య ప్రకారము. 71. కుమారోపాఖ్యానము. 72. భారతయోధుల కౌశల చమత్కార భేదములు.

పరికర ఖండము – ప్రథమాశ్వాసము.

1.ధనుర్దండములు దేశదేశ భేదములై జన్మించుట, 2. వేణుకుల కీర్తనము. 3. భూసారవిశేష నిర్ణయము. 4. వంశసంభవ ప్రకారము. 5. వేణుఖండన ముహూర్తములు, 6. వేణుఖండన ప్రకారము, 7. భూవహ్ని ప్రార్థనము, 8. ధనుస్సంగ్రహశాలానిర్ణయము. 9. విళ్ళగీతలకు రూపము లేర్పరించుట. 10. ధనుర్నిర్మాణ వస్తునిర్దేశములు. 11. చాపనిర్మితప్రకారము 12. కళాయంత్రంబు కల్పించు విధము. 13. తులాయంత్రనిర్మాణ ప్రకారము, 14. బలువుల సంఖ్యాప్రకటనము. 15. యుగత్రయపురుషుల ధనుర్బల ప్రమాణములు, 16. గాండీవాది కోదండసంభవము. 17. ధనుర్దండము. పండించు తెఱగు. 18. కుణవల్లీ షట్కంబును సృజించు విధానము. 19. జాంగలాది భూనిర్ణయ ప్రకారము. 20. ఏకవింశతివేలువుల చాప దండములు గల రాజులనిర్ణయంబులు. 21. శార్ఙ్గాది చాపలక్షణములు.



పరికరఖండము –ద్వితీయాశ్వాసము

22. శిలీముఖకర్తనము. 23. సెలకట్టియలభేద ముపన్యసించుట. 24. శరోత్పత్తిక్రమము. 25. సెలకట్టియల రాజమార్గంబునంబరచి అందుత్తమసారంబుల సంగ్రహించుట. 26. ధారావక్రంబులు దీర్చువిధము. 27. పుంఖార్హవస్తునిర్దేశము. 28. మయవిశ్వకర్మ సంవాదము. 29. వర్ణభేదవస్తునిర్దేశము. 30 శిల్పవిద్యాచాతుర్యము. 31. శరములకు లక్కగరులు కట్టుమార్గము. 32. ప్రతిపత్రార్హంబులైన పులుగులనామధేయములు, 33. దూరాపాతి, తేజోఘాతి, పాషాణఘాతి, లోహఘాతి రచితప్రకారము 34. అలుకుల రూపప్రకటనము, 35. పంచధారలవలన శరకల్పన ప్రకారము, 36. షడ్విధజాతులుంగల కట్టియలకు వినియోగంబు లెఱింగించుట.

పరికరఖండము – తృతీయాశ్వాసము

37. ఉపసాధనములు. 38. గోధాలలామంబులు, కనకశృంగ శిలాచర్మంబుల నిర్మించు విధము. 39. చెకినుల తారతమ్యంబు లేర్పఱిచుట 40. ఏకవింశత్యంగుళీత్రాణనిర్మాణ కౌశలప్రభావము. 41. కనకాంగుళీ గుప్తంబు మూసనుబోయువిధము. 42. హేమచర్మ సంయుక్తాంగుళీ గోపాయితమార్గము. 43. మయగౌతమసంవాదము. 44. వేణుతూణీర ప్రకారము, 45. దారుతూణీర నిర్మాణవిధానము, 46. చర్మనిషంగప్రకారము. 47. కేకీముకురంబులు తరకసులం బొదువు విధము, 48. తరకసుల వినియోగము.

పరికరఖండము –చతుర్థాశ్వాసము.

49. గురుస్తవము. 50. భార్గవదత్తమైన గ్రంథప్రకారము 51. కులమారిపైశాచ కాశ్మిక ఘోరి కుటిలాభిధానంబులు గల ధనుర్దోషంబుల

ప్రకారము. 52. రథవాహోపాఖ్యానము. 53. షణ్ముఖ కుండల పద్మవరాట భుజంగచక్రపంచక లక్షణపలసూత్రంబులుపన్యసించుట. 54. దివ్యాస్త్ర ప్రయోగార్హ శరలక్షణములు. తత్పూజానిరూపణంబును, 55. అమోఘాస్త్ర సంభవము. 56. ధీయువధ. 57. దివ్యాస్త్ర గర్వప్రకారము. 58. అమోఘాస్త్రము పరంపరానుగ్రహముగా భూలోకంబునకు వచ్చుట.

వ్యూహఖండము – పంచమాశ్వాసము.

1. అక్షోహిణీసంఖ్య. 2. సమరంబులకు, బయనంబగు సేనాలక్షణంబులు. 3. భటఘోటకరిరథాదుల స్వరూపప్రకటనము. 4. అతిరథ మహారథ సమరథార్ధధరులగుణంబులు, 5. రథీజమనోజ్ఞత్వ కౌశలవిశేషంబులుగలసారథులచందము 6. ఉపసైన్యంబగు బేడుదండున దీపించు తెఱగు. 7. మిత్ర వ్యూహనామనిర్దేశము. 8. మహావ్యూహంబు లొడ్డెడు విధము. 9. పోటుమానను లెక్కటి కయ్యంబులకు జోళ్ళుగట్టి పెనంగు మార్గము. 10. అసిచర్మల యుద్ధము. 11 కుంతాయుధులసమరము. 12. మల్లరణము, 13. చక్రాయుధుల కదనము. 14. గదాధరుల సంగ్రామము 15. అశ్వ విద్వేషము 16. వారణ విరోధము 17. అర్థరథ సమరథ మహారథాతిరథికుల యుద్ధచమత్కారము. 18. అర్ధరథాదుల నైజంబుల ప్రకటనము.

కడపటి దగు ధర్మఖండ మిందు ముద్రితముగాలేదు. గాన, దాని విషయసూచి యిందు చేరలేదు. ఈ గ్రంథము ధనుశ్శాస్త్ర విషయమున సంస్కృతగ్రంథము లన్నింటిని మించినది. దీనికి మూలమగు సంస్కృత గ్రంథమేదో తెలియరాలేదు. ఇందు ధనుర్వేద గ్రంథకర్తలపేళ్లు తత్సంప్రదాయాదులు చాల జెప్పబడినవి.

## కృతిపతి

**ఈవని కోదండ రామస్వామి.**

కృష్ణానేని తిరుమల మాణిక్యా రాయప్రభుఁడు ధనుర్విద్యా విశేషముల వివరింపఁగాఁ దదాస్థానకవి యగు కృష్ణమాచార్యుఁడు తెలుఁగున మూడాశ్వాసముల ప్రబంధముగా కృతిప్రేరకుని యిలవేల్పయిన యీవనికోదండరామ



దేవునకర్పితముగా నీ గ్రంథము రచియించినాఁడు. కృతిపతి వెలసియున్న యీవనిగ్రామము గుంటూరు మండలమున తెనాలి తాలూకాలోనున్నది. ఈ గ్రంథమునకు,

## కృతికర్త

**కృష్ణమాచార్యుఁడు.** ఈతని నివాసగ్రామ మేదో తెలియరాదు. ఈ ధనుర్విద్యా విలాసమునే కాక శకుంతలా పరిణయ మని మఱొక ప్రబంధమును గూడ నీతఁడు రచించినాఁడు. [1] శకుంతలా పరిణయము నీతఁడు చిరుమామిళ్ళ పాపయ్య ప్రభుఁడని నామాంతరముగల వెంకటాద్రి నాయనింగారి ప్రేరణమున తిరుపతి వెంకటేశ్వరస్వామి కర్పించినాఁడు. అందా పాపయప్రభుని వంశవిస్తర మెల్ల వర్ణింపబడినది. చల్లపల్లి జమిందార్లగు నేర్లగడ్డవారికిని, ముక్త్యాల, అమరావతీ ప్రభులగు వాసిరెడ్డి వారికిని చిరుమామిళ్ళ వంశ్యులు, నాయఁడమ్మగారు, పాగోలువాస్తవ్యులుఁ చల్లపల్లి శ్రీశివరామనృపునకుఁ బిన్నతల్లిభర్తయు, ముక్త్యాల శ్రీచంద్ర మౌళీశ్వర ప్రభునకు భావుకుఁడునై వర్ధిల్లుచున్నారు. శకుంతలా పరిణయమున గ్రంథకర్త తన్ను కృష్ణకవి యనియు ధనుర్విద్యావిలాసమున గృష్ణమాచార్యుఁడనియుఁ బేర్కొన్నాఁడు. శకుంతలా పరిణయమునాఁటి యీతని వైష్ణవత ధనుర్విద్యా విలాసము నాటికి క్రమపాకము పొందినదిగాఁబోలును. పేళ్ళుమార్పును బట్టి రెండు గ్రంథములకుఁ గర్తలు వేర్వేరువారగుదురేమో యని సందేహింపరాదు. ఈ నామభేదమేకాని రెండు గ్రంథముల గద్యములు సమానముగానున్నవి.

**గద్య:** "ఇది శ్రీమత్కౌసల్యానందన ప్రసాద సమాసాదిత కవితా విచిత్ర మైత్రేయసగోత్ర నృసింహగురుపుత్ర కృష్ణమాచార్య ప్రణీతంబైనఁ శకుంతలా పరిణయము." శకుంతలాపరిణయ రచనమునకుఁ దర్వాతి రచనముఁ గాబోలును ధనుర్విద్యావిలాసము. ఇందు గద్య మించుక మార్పు చెందినది. "కౌసల్యానందనకటాక్ష వీక్షణపరంపరాసమాసాదిత" అని. కాని, రెండు గ్రంథములందును గురుస్తుతియుఁ కవి కులగోత్ర ప్రశంసయు నొక్క విధముననే యున్నవి.

1 దీనిని పనప్పాకం శ్రీనివాసాచార్యులుగారు 1894లో ముద్రించిరి.

క. భాసురసూరి గ్రామణి
భూసురముఖ పంకరుహనభోమణి వినమ
ద్దాసనిచయ చింతామణి
నే సింగర గురుశిఖామణిం గణుతింతున్.

మ. నను రామానుజ పాదపద్మయుగళీ నవ్యావ్యయ ధ్యానపా
వనహృద్భాగవతావతంస పదసేవాసక్తచిత్తున్ మరు
త్తనయారాధన లబ్ధచారుకవితాధారున్ సదారూఢభా
వను నాస్థానకవిన్ నిజాశ్రితునిఁ బిల్వంబంచి పల్కెం గృపన్.

క. పాత్రుండవై మైత్రేయస
గోత్రుండవై నారసింహగురువర్యునకున్
బుత్రుండవై వెలయుదు వి
ద్ధాత్రిన్ మాపనుపు సేయఁదగుఁ గృష్ణకవీ !

రెండు గ్రంథములందును నీ పద్యము లున్నవి. గావున, రెండు నొక్క కవిరచనములే యగుట స్పష్టము. ఇవి గాక, ఆంధ్రసాహిత్య పరిషత్తు కేటలాగులోనున్న కొమ్మాలపాటి దండకము. నింకొక యక్షగానము నీతని రచనములని శ్రీ నిడదవోలు వెంకటరావుగారు చెప్పిరి. కావచ్చును. పరిషత్తు పుస్తకముల జాబితాలో నా దండకము కృష్ణమాచార్య రచనమని కలదు. ఆ గ్రంథమును నే జదివిచూడలేదు. ఆకాశరావణసంహారమని మఱొక పద్య కావ్యము, రసవంతమయినది తెనాలి తాలూకాలోనే మోదుకూ రను వూర మొగసాటి మూర్తిరాజుగారను భట్టురాజుగారి యింటదొరకినది, నేను మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక శాలకుఁ జేర్చినాను. తద్గ్రంథకర్త ఉరుటూరి వెంకటకృష్ణకవి తన గ్రంథము నేతద్ధనుర్విద్యావిలాస రచనా ప్రేరకుఁ డగు కృష్ణానేని తిరుపతి మాణిక్యా రాయప్రభుని ప్రేరణముననే రచించినట్టు వ్రాసి నాడు. అదికూడ (ఈవని) కోదండరామస్వామికే యర్పితమైయున్నది. కృతి ప్రేరకుఁడగు ఆ తిరుపతిరాయని గూర్చి ధనుర్విద్యా విలాసములో నున్న పద్యములే ఆకాశరావణసంహారమున నున్నవి. ఆకాశరావణ సంహారమున గొన్ని తాటియాకులే యానుపూర్విలేక దొరకినవిగాన, దానిని గూర్చియింతకంటె



హెచ్చు విషయములు గుర్తింపఁగాలేదు. ఆతనిగద్య మిట్టిది. "ఇది శ్రీవిమల చిత్తముని చరణసేవాధురీణ, రాఘవపాండవీయాది బహుప్రబంధనిబంధన ప్రవీణ ఆపస్తంబ సూత్రహరితసగోత్ర ఉరుటూరి.....ంకశ్లేష కవితాపితా మహోంక సంస్కృతాంధ్ర భాషా చతుర్విధ వివిధ కవితా నిలయ వెంగన మంత్రి తనయ వినయవిశంకట వెంకటకృష్ణకవి ప్రణీతంబైన యాకాశరావణ సంహారంబునందు తృతీయాశ్వాసము."

## కృతిప్రేరకులు - వెలమవారు

'వెలమ' యని నేటివ్యవహారమైనను వెలుమ 'వెల్మ' పదములే ప్రాచీన వ్యవహార రూఢములు. రెడ్డి, కమ్మ, వెలుమ, బలిజ జాతులవారు బహు ప్రాచీనకాలమున నుండియు నంధ్రదేశమున మహాప్రాభవము ననుభవించిన వారు. ఇప్పుడు ప్రసక్తులగు వెలుమవారిలో పద్మనాయకులను వారు (వారికే పద్మ వెలుమ లనివ్యవహారము ) చాల సుందరాకారులు, రాచఠీవిగలవారు, ఏల్బడులు నెఱపుచు, వీరాధివీరులయి చాల విఖ్యాతిగన్నవారు. వారి యాచార వ్యవహారములు రాచవారి తీరు లవి. కాకతీయులనాఁట నుండి నేఁటి దాఁక నవిచ్ఛిన్నమయినరాజ్య వైభవము ననుభవించుచు వర్ధిల్లినవారు. వెలుమ వారిలో రావువంశ్యులగు వెలుగోటి ప్రభువులు. 'వెలుమ' పదము 'వర్మ' పదవికృతి కావచ్చును. 'వర్మ' పదము వరుమ, వలుమ వెలుమ పదములుగాఁ గ్రమపరిణామము చెందియుండవచ్చును. 'నందాంతం క్షత్రియకులమ్' అన్న ప్రవాదముచొప్పున నెన్నఁడో క్షత్రియులు పలువురు చతుర్థ వర్ణమువారుగా మాఱియుండవచ్చును. అయినను వారు క్షాత్రధర్మమును వీడనాడక వెలయుచునే యున్నారు. తెలుఁగున వెలుమలే ద్రవిడ దేశమున 'వెళ్మాన్' అనఁబడు వెళ్ళాలవారు నయిరి. అహనానూఱు అను నతి ప్రాచీన ద్రవిడ గ్రంథమున 'వెణ్మాన్ - వెల్మాన్' వెల్మనుగూర్చి పద్యమొకటి కలదు.

"అహ వునర్ పురన్ద అన్బిన్ కడల్ తొాడి నఱవు
మహిళ్ ఐరుక్కై నన్నన్ వేళ్మాన్ "
వయలై వేలివియలూర్ - 97 పాట్టు

పాటలు నేర్చిన వారిని రక్షించేవాఁడు, ప్రేమగలవాఁడు, వదులు కంకణాలు గలవాఁడు, పానీయశాలలుగలవాఁడు, నన్నన్ అని పేరుగల వాఁడుగను, వెణ్మని (వెల్మని) బచ్చలి తీగలవ్నతి ( చెంచ) గల వియలూరు అను గ్రామము అని పై నేదోయున్నది. వెణ్మాన్, వెల్మన్, వేళాలన్, వెల్లాళన్ అన్నీ ద్రవిడమునఁ బర్యాయపదములట.[1]

ఇక్ష్వాకులు మొదలగు క్షత్రియు లంధ్రదేశమునకు వచ్చి రాచఱికము నెఱపి, ద్రవిడ దేశమునకును వ్యాపించి (శ్రీరంగనాథస్వామి యిక్ష్వాకుల నాఁటి కథలు ) యుండవచ్చును. తెలుఁగు దేశమున క్షత్రియులు అట్లే వెలుమవారును క్షత్రధర్మముతో తెలుఁగు దేశమున వర్ధిల్లి ద్రవిడదేశమునకును జేరియుండవచ్చును. బసవపురాణమున వెల్మనికథ యొకటి హృద్యమైనది కలదు. అది ద్రవిడదేశపు శివకవియగు సుందరమూర్తినాయనారు నాఁటి కథ, అది తెలుఁగున నున్నట్లు గాక ద్రవిడమున పెరియపురాణమునఁ గొంత భేదముతో నున్నది. వెల్మలను గూర్చి చాటువు.

ఉ. పైకొనువారితో నొరఁగిపాఱరు, నేరరు భంగసంగతుల్
చేకొనఁబూనికాని దొరఁజేరరు కోరరు దుష్టజంతుర
క్షాకరణంబు నొద్లకపకారులుగా రెపు డప్పుగోరు మం
దాకినితోడబుట్టియు గుణప్రతిభ౯ వెలుమల్ పురంబున౯ .

కాళహస్తి, వెంకటగిరి, నూజివీడు, పిఠాపురము, బొబ్బిలి, మైల వరము, నరసారావుపేట, పెదపవని, కొల్లాపురము, తిరువూరు, రేపల్లె, రాచూరు, ఉల్లిపాలెము, మొదలగు స్థలముల వెలుమ వారిప్పటికిని జమీం దారులుగా నున్నారు. అందు మన కిప్పుడు ప్రసక్తులు, రేపల్లె, రాచూరు, జమీందార్లగు మాణిక్యారావువారు. వీరితొల్తటియింటిపేరు కృష్ణానేనివారు. వీరు పుణ్యపలిగోత్రమువారు. తొల్తవీరు తెలుంగాణమున (నైజాం రాష్ట్రమున) నుండిరి. ఇప్పటికిని వీరిబంధువులు, అనుమకొండ దగ్గఱ పెదపెంద్యాలలో 'పొట్లపల్లివారు ' అనఁబరగుచున్నారట. వీరికి మాణిక్యారావు వారని బిరుదు

1 తిరుపతి శ్రీవెంకటేశ్వర రీసర్చి ఇన్స్టిట్యూట్‌లో అరవరీడరుగానున్న శ్రీపళనియప్ప పిళ్ళగారీ విషయము తెల్పిరి.



పేరు కుతుబ్‌షాహ యిచ్చినాఁడు. జైనులలో మాణిక్యచంద్ర, మాణిక్యసేన, మాణిక్యదేవాది నామములు మాణిక్య పదఘటితములు గలవు. తెలుఁగాణ మున మాణిక్య ప్రభువను యోగీంద్రుఁ డెప్పుడో వెలసెనట. వారి శిష్య పరంపర నేఁడును తెలుఁగాణమునఁ గలదు. ఇది వారిపేర నేర్పడిన బిరు దేమో ! ఈ వెలమ ప్రభువు పూర్వుఁడో ఆ మాణిక్యప్రభుయోగి పూర్వుఁడో నే నెఱుఁగను.

వీరి వంశవృక్షమిట్టిది, *(చూ. పుట 377)

పద్మనాయఁకులు డెబ్బదియైదు గోత్రముల వారట. వారిలో కుతుబ్ షాహాకు ఆశ్రితుడు మాణిక్యారాయఁడు, ఆతఁడు కోవెలకొండ, మెదకు, పెదకొండపల్లి, కొండవీడు, దుర్గములఁ గాచినందుకు కుతుబ్‌షాహ్, బిరుదు లిచ్చినాడు (చూ. 21 నుండి 29 పద్యముదాఁక, ప్రథమాశ్వాసము). అతని కుమారుఁడు కొండలరాయడు అబ్దుల్లా పాదుషా కాశ్రితుఁడై బిరుదులందెను. (చూ. 32 పద్యము) అతని మునిమనుమని కొడుకు అప్పభూపతి ఔరంగ జేబునకు ఆశ్రితుఁడయ్యెను (చూ. 32, 33 పద్యములు). తత్పుత్రుడు తిరుపతిరాయఁడు, ముర్తుజాన్నగరము పాలించెను. (చూ. 34 నుండి 40 దాఁక పద్యములు), ఈతని కాఱుగురు కొడుకులు. ఆఱవవాఁడగు సీతన్న మాణిక్యరావు ( 47 నుండి 50 దాఁక పద్యములు ). ఆతని రెండవకొడుకు తిరుపతియే యేతత్కృతిప్రేరకుఁడు. ఈతఁడు క్రీ. 1775 దాకనున్నవాఁడు. (చూ. 56 నుండి 72 దాఁక పద్యములు )వీరి వంశము కృష్ణా, గుంటూరు మండలము లందు చిరకీర్తి నార్జించినది. దాతృత్వమునందును, శౌర్యమునందును నీవంశము వారు సుప్రఖ్యాతులు. ఈ వంశమున నేఁడు వర్ధమానులుగా నున్న శ్రీ వెంకట హయగ్రీవరావుగారి తాతగారు వెంకటగోపాలరావుగారు, విలువిద్యలోను అశ్వారోహణకళలోను జితశ్రములని, చాల సౌందర్యవంతులని, సకలకళా రసికులని వారిని బ్రత్యక్ష ముగా నెఱిఁగినవారు మా నాయనగారు చెప్పఁగా వింటిని. వారిని గూర్చి వింతకథలు, కృష్ణా గుంటూరు మండలవాసు లిప్పటికిని జెప్పుకొనుచుందురు. వారి ప్రధాన గ్రామమగు రాచూరి దగ్గఱనే పల్లెకోనగ్రామమున భట్టురాజులు చదువగా నీ క్రిందిచాటు పద్యముల నీ వంశమువారి యోగ్యతను వెల్లడించు

పద్మనాయకులు, వెల్మలు– పుణ్యపలిగోత్రము –కృష్ణానేనివారు, కుతుబ్‌షాహ ఆశ్రితులు

మాణిక్యరావు

కొండలరాయుఁడు – అబ్దుల్లాపాదుషా

తిర్మలప్రభుఁడు

అప్పలరాయప్రభుఁడు

తిర్మలప్రభుఁడు

అప్పప్రభుఁడు (ఔరంగజేబు, బఫారత్ఖాను, రోహిల్లాఖాను )

తిరుపతి (చక్రమ, భార్య )

వెంకటరాయ, కృష్ణ, అప్ప, రమణ, వల్లభ, సీతన్న (లక్ష్మమ్మ భార్య)

అప్ప: రఘుపతి, తిరుపతి

రమణ: నరసింహ

సీతన్న:

జగ్గన్న, తిరుపతి (గ్రంథ రచనా ప్రేరకుఁడు ) (1774 A.D )

జగ్గన్న: సీతన్నారావు ఫ. 1200 నుండి 1232 దాక, (అచ్చమాంబ భార్య) భావన్నారావు ఫ. 1232 నుండి 1236 దాక

వెంకటగోపాలరావు (22-11-1883న గతించిరి )

మార్కండేయరావు

వెంకటహయగ్రీవరావు (A.D 1918 నుండి వర్ధిల్లుచున్నారు.)

తిరుపతి: అప్పారావు, సీతన్నారావు (1798 A.D )

వానిని నేను చాటుపద్యమణిమంజరిలోఁ బ్రకటించితిని.

సీ॥ సుమమౌక్తికా నల్పసుప్రతీకంబుతోఁ
గంబుతోఁ బుండరీకంబుతోడఁ
బల్లవకుసుమ సంపాదనై కాంతుతోఁ
గంతుతో రోహిణీకాంతుతోడ
నధిగతపరమోగ్రుఁ డైన స్వర్భానుతో
భానుతో నలచిత్రభానుతోడ
దండిగాండీవకోదండాభిరాముతో
రాముతో నందనారాముతోడ

గీ. నీదు సత్కీర్తి నీ మూర్తి నీ ప్రతాప
దీప్తి నీ దోర్బలస్ఫూర్తి దీటు మిగిలి
యలరె మాణిక్యరాయవంశాబ్ధిసోమ
భాసురగుణాళి భావభూపాలమౌళి

సీ. ఒక తాత కుతుబుశా ప్రకటదక్షిణభుజా
దండుఁడై కోవెలకొండ యేలె
నెలమి రెండవతాత యిభరాముపాదుశా
పంపునఁ బెదకొండపల్లె యేలె
మహి మించు ముమ్మడి మాణిక్య రాయఁడు
వినుతి కెక్కినకొండవీటి నేలె
రాణించు రఘుపతి మాణిక్యరాయండు
పరభయంకరవృత్తిఁ బరిఢవిల్లెఁ

గీ. దండ్రికంటెను బెదతండ్రి తండ్రికంటె
తాతముత్తాతలకు నెల్ల ఖ్యాతి దనర
వన్నెగంటి కృష్ణానేని వంశమునను
నిర్మలోపాయ బళిర మాణిక్యరాయ.



సీ. దురములోఁ గదిసినదొరలశిరంబులు
భేదింప బలుదిట్ట నీదుపట్ట
కదనరంగమునందుఁ గదసినపరరాజ
నిచయంబులను దాఁకు నీదుబాకు
జన్యసంతోషులై చనుదెంచువైరుల
నిముసంబులో మ్రింగు నీదు బాంగు
................................
................................

గీ. సొరిది నీడాలు వైరులచుక్క వ్రాలు
బళిర నీపౌరుషం బెన్నఁ దరముగాదు
అవనిమాణిక్య రాజవంశాబ్ధిచంద్ర
రాజవేంకటగోపాలరాయభూప.

సీ. శ్రీకరవిజయలక్ష్మీ విరాజితవైభ
వేంద్రుండు సద్గుణసాంద్రమూర్తి
మాణిక్య రాడ్వంశ మందార భూజంబు
పద్మనాయక మనఃపద్మహేళి
మన్నెకులోద్యాన మధుమాసపైకంబు
కామినీమన్మథాకరవేషు
సతిపుణ్యపంగోత్ర వితతాబ్ధిచంద్రము
దర్థిచాతక వార్షుకాంబుదంబు

గీ. అని జనుల్ మెచ్చఁ గీర్తిచే నలరి తహహ
చరితదేశాంత సత్కవీశ్వరనితాంత
వర్ణితస్వాంత రేపల్లెపూర్నిశాంత
దీపితాటోప! వేంకటగోపభూప.

వీరనేక దేవాలయములకు భూముల నిచ్చిరి. బ్రాహ్మణుల కనేకులకు వసతులు గల్పించిరి.

**మాణిక్యారావువారు కల్పించిన దేవబ్రాహ్మణవృత్తులు.**

**1. పెద్దపూడి :-**

ఇది వకసంతు, కూచిపూడి సర్కారు, ముర్తుజానగరు తాలూకా లోనిది. ఇది ప్రస్తుతము వాసిరెడ్డివారికి పోయినది.

పూర్వము అరణ్యముగానున్న ఈ స్థలములో ఋషులు సోమేశ్వర స్వామిని, వీరు గోపాలస్వామిని ప్రతిష్టించిరి, 1056 శకంలో గజపతాన్వయులు, గజపతి మహారాజులుగారు పరిపాలించిరి. వీరికి ప్రధానులు గోపరాజు రామన్న. గ్రామకరిణీకపు మిరాశీలు వీరు ఏర్పరచుచు, తెలగాణ్యులు కౌశికగోత్రులైన పుచ్చరాజువారికి సగభాగంగా యిచ్చినారు. 1240 శకం లగాయతు రెడ్డిరాజులు ప్రభుత్వం చేసిరి. వీరికాలములో కొండవీటిసీమ 44 అగ్రహారములు బ్రాహ్మణులకు దానంచేసిరి, వేగినాటి వారికి 2 అగ్రహారములు, ద్రావిళ్ళకు 5, వెలనాటివారికి 36. ఈ గ్రామము వెల్నాటి వారి క్రిందకువచ్చెను. ఈ గ్రామం యెల్లేపద్ది లక్ష్మణదీక్షితులుకు, షడ్దర్శనాల వల్లభసోమయాజులుకు దానంచేసిరి. పై జీర్ణదేవాలయములను మరల ప్రతిష్ఠించి ఏర్పరచినవసతులు కుం ౦౽౦ శ్రీ సోమేశ్వర స్వామివారికి. కుం ౦౽౦ గోపాలస్వామివారికి 1500 శకం వరకు చక్కగాజరిగెను. మహమ్మదీయుల పరిపాలనలో విచ్చిత్తుగలిగినది. కొండవీటి సమతుబందలు చేసేటప్పుడు, ఈ గ్రామం కూచిపూడి సమతులో చేర్చిరి. అప్పటికి షడ్దర్శనాలవారు ఖిలమైపోగా తిమ్మరాజువారి పరంచేయబడినది. కొండవీటిసీమ వంతుచేసి జమీందార్లుకు పంచిపెట్టేటప్పుడు ఈ వంతు ఈ గ్రామం రమణయ్య మాణిక్య రావు వంతులో వచ్చి రేపల్లె తాలూకాలో దాఖలు అయినది. 1122 ఫసలీ మొదలు 1126 ఫసలీవరకు పరిపాలించిరి. తరువాత వీరి తమ్ములు వల్లన్న గారు వచ్చి ఈ గ్రామానికి పశ్చిమ భాగమందు వనంతోట వేయించి శ్రీ వేణుగోపాలస్వామి గారికి దానవ్యయం ఒకు కుం ౦౽౦ కు భూమి యిచ్చినారు. ఈ వల్లన్నగారు, సీతన్నగారు, గోపన్నగారు 1169వ ఫసలీవరకు ప్రభుత్వం చేశేరు. 1169 ఫసలీలో సీతన్నగారి కుమారులు జంగన్న మాణిక్య రాయలంగారు చాల ధర్మవంతులై రాజ్యము పరిపాలించుచు, శ్రీ సోమేశ్వరస్వామివారి ఆలయం పునఃనిర్మించి కుం, ౦౽౦ కు భూమి దానం చేసిరి. మరియు వీరు చేయించిన దానముల వివరం -



అయితం వేదావధానులు రాయప్రోలు సూరంబొట్లు. పట్టెం రామలింగ దీక్షితులు, పోతుకుచ్చి పాపంబొట్లు, నేతి తెలగావధానులు, బూరుగుల నిమ్మంబొట్లు గార్లకు ఒక్కొక్కరికి కుం 82 చొ॥ దానంచేసిరి. వీరు 1169 నుంచి 1201 ఫసలీవరకు. 33 సం॥ ప్రభుత్వం చేసిరి. 1202లో వీరికుమారులు భావన్నగారు రాజ్యమునకు వచ్చిరి. వీరు కూడ తండ్రివలె దానములు చేయుచూ రాజ్యం పరిపాలించి 1213 ఫసలీవరకు రాజ్యం చేసిరి. ఆర్థికదుస్థితివల్ల 22 గ్రామాదులు వాసిరెడ్డివారికి అమ్ముటవల్ల పొన్నూరు వగైరాలతో కూడ ఈ గ్రామము వారికి పోయినది, కనుక సదరు 1203 నుండి వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు పరిపాలించిరి. ఈ గ్రామమీకట్టు 36 కుచ్చళ్ళలో వనంతోటలు 6టికు వల్లన్నగారుకు ౦౽౦ యెల్లేపెద్ది సుబ్బన్న ౧౽౦ ప్రభల పేరుభొట్లు ౦౽౦ జాస్తే భావన్న ౦౽౦ చదలవాడ పట్టాభిరాముడు యీ చదలవాడ రామన్న చెరి ఒక ౦౽౦ గ్రామం కవార ౦౽౦ మాలపల్లి ౦౽౦ చెర్వులు 3టికి. యెల్లేవద్ది సుబ్బన్న చెర్వు ౦౽౦ చదలవాడ రమణప్ప చెర్వు ౦౽౦ కర్ర తిరుపతి ౦౽౦ - ౦౽౦ జయనిపాడు డొంకలు చవుడుభూమి యీ యినాములు ౦౽౦ వెరశి పోను మిగతాది గుడికట్టు.

(2) **వల్లూరు గ్రామం గుడికట్టు కుచ్చళ్ళు** ౦౽౦

ఈ గ్రామం 1122లో రమణయ్య మాణిక్యరాయలంగారు పరిపాలించిరి. 1160 వరకు రమణయ్యగారు వల్లన్నగారు సీతన్నగారు పరిపాలించిన తరువాత నిజాముల్ ములుకు పెద్ద కుమారుడైన నాసర జంగు దీనిని పరాసువారికి యిచ్చినారు. వారు 1160 నుండి 1168 వరకు ప్రభుత్వం చేసి అపజయులు కాగా సీతన్నమాణిక్యారాయణంగారి అన్నకుమారుడు గోపాలరావు మాణిక్యరాయణింగారు 1168లో ప్రభుత్వం చేసి సీతన్నగారి కుమారుడైన జంగన్నగారు 1167 ప్రభుత్వానికి వచ్చి 1178 ఫసలీలో మజుకూరి మిరాసదార్లు అయిన వల్లూరి వెంకటాచలం పర్వతాలు. శంకరప్ప, విస్సంరాజు, పునరుద్ధరించిన గణపేశ్వరస్వామి వీరభద్రస్వామివార్ల ఆలయములు శ్రీ పూర్వమున్న చెన్నకేశ్వరస్వామివారి ఆలయము మ్లేచ్ఛులచే విచ్ఛిత్తుచేయబడినది కనుక తస్థానే శ్రీ వేంకట గోపాలస్వామివారిని ప్రతిష్ఠించి

శ్రీ ఆంజనేయస్వామినికూడ ప్రతిష్ఠించిరి. పై దేవాలయములు శ్రీవారు ఇచ్చిన వసతులు.

కు ౧ శ్రీ గణపేశ్వరస్వామి, వీర భద్రస్వామివార్లకు కు ౧ శ్రీ వేణు గోపాల స్వామివార్లకు :

1177 ఫసలీతో కుంఫిణీవారు మృత్తుజానగరు ప్రభుత్వానికి వచ్చి 3 సం॥ పరిపాలించి తిరిగి జమీందార్ల పరం చేసినారు. వీర్ల కుమాళ్ళు భావయ్య మాణిక్యరావు 1202 లో రాజ్యమునకువచ్చి వీరు పాలించుచుండిరి.

3. **కట్టెంపూడి** :-

గోపరాజు రామన్నగారు ఈ గ్రామానికి తూములింగన్నగారికి యేక భోగముగా మిరాశీ వ్రాసియిచ్చినారు. ఈ తూములింగన్నగారు గ్రామము నకు దక్షిణభాగమందు కేశవస్వామివారి ఆలయమున్నూ ఉత్తరం శ్రీ మల్లి కార్జున ఆలయం కట్టించి వీటికి ౦౫౦ మాన్యం ఇప్పించిరి. ఇదే ప్రకారం 1500 శకంవరకు జరిగెను. తరువాత తురకల పరిపాలనలో ఇది విచ్ఛిత్తు అయినది. అప్పుడు పొన్నూరు సమతులోనిది. అప్పుడు మాణిక్యరావువారు పాతృనివారు అలవర్తివార్ల అధికారములోనికి వచ్చినది. తరువాత కొండవీటి సీమ 3 వంతులుగా చేయగా ఈ గ్రామం రమణయ్య మాణిక్యరావు వారికి అప్పచెప్పగా వారు ప్రభుత్వం చేసి 1127లో సీతన్న మాణిక్యరాయలంగారు ప్రభుత్వానికివచ్చి ఆచ్చన్నగారికి కుం ౦౾౦ మాన్యం ఇప్పించినారు. వీరి అన్నదమ్ములు ఆరుగురు క్రమేణ ప్రభుత్వం చేసి గోపాలమాణిక్యరాయలంగారు 1168 వరకు ప్రభుత్వం చేసిరి. వీరి కుమారులు సీతన్నగారి కుమారులు. జంగన్నగారు ప్రభుత్వానికి వచ్చి 150 కుచ్చెళ్ళ యీ నామములు ఇప్పించిరి. 1201 వరకు ప్రభుత్వం చేసిరి. వీరి కుమారులు భావయ్యమాణిక్యరాయలం గారు 1202లో రాజ్యంకు వచ్చి 1122 ఫసలీవరకు ప్రభుత్వం చేస్తూవున్నారు. గ్రామంగుడికట్టు కుచ్చళ్ళు 1754.

(4) **పూండ్ల** :- పొన్నూరుతాలూకాలోని రేపల్లెలోని రాజా భావయ్య మాణిక్యరావు సర్కారులోని 1222 ఫసలీ; 1201 నుండి గ్రామం గుడికట్టు 122 కుచ్చళ్ళు.



(5) **ఇనగర్తిపాడు** :- పొన్నూరుసంతు రేపల్లె తాలూకా పై మాదిరిగా పరిపాలనలు జరిగెను. ఈ గ్రామం విష్ణువర్ధనుడు పరిపాలనలో చెఱుకూరు త్రివిక్రమస్వామివారికి అగ్రహారం యిచ్చినారు. గ్రామం గుడికట్టు కుచ్చళ్ళు ౧౩

(6) **సుదురుమాడు ఖండ్రిక** :- ఈ ఖడ్రికలో 5 గ్రామాదులున్నవి. ఒకప్పుడు ఈ 5 గ్రామాదులలోని రుసుము మాణిక్యరావు వసూలు చేయుచుండిరి.

(7) **మండూరు** :- కూచిపూడి సర్కారు ముర్తుజానగరు రాచూరు తాలూకే :

ఇక్కడ మాండవ్యమహాముని కొంతకాలం తపస్సుచేసిన చోటు ఇక్కడ శివలింగం ప్రతిష్టించిరి. దీనికి మాండలేశ్వరస్వామి అని పేరు. దీనికి దక్షిణ భాగమందు వేణుగోపాలస్వామివారిని ప్రతిష్టించిరి. ఇది అరణ్యము గనుక మునీశ్వరులే ఈ దేవాలయములను పూజించుచుండిరి.

1122లో కొండసీమ ౧౪ వంతులు చేసిపంచిపెట్టుటలో ఈ గ్రామం బలభద్ర పాతృని అప్పన వంతు వచ్చెను. ఈయన ౦౾౦ కుచ్చిళ్ళు శ్రీ స్వామి వార్లకు యిచ్చి వుత్సవము యేర్పాటుచేసిరి. ఈయన తదనంతరం ఈయన కుమార్డు పాపన్న రాజ్యపాలన చేయుచుండగా మాణిక్యారావు వారు బలవంత ముగా, ఆక్రమించి వొలివేరు యెడ్లపల్లి మండూరు చినగాదెలవఱ్ఱు అంగలకుదురు కొండపాడు వగైరాగ్రామాదులు పాతృనివారి మనోవర్తి క్రింద వుంచిరి.

1211లో రాచూరు తాలూక వేలం వేయబడుటవల్ల ఈ గ్రామం మల్రాజు వెంకటగుండారాయునింగారు కొనిరి. గ్రామంగుడి కట్టు కు ౬౦

చినగాదెల వర్కు కూచిపూడి తాలూకా రాచూరు సర్కారు. ఇది మండూరుకు వాయవ్యమూల వున్న ఒకదిబ్బ, ఈ ప్రదేశ మందు మండూరు ప్రజలు చిన్న గాదెలు కట్టుకొని ధాన్యంనిలవ చేసుకుంటూ వచ్చి క్రమేణ రయితులు నివసించుట వల్ల చినగాదెలవఱ్ఱు గ్రామమయినది. ఇది బలభద్ర పాతృనివారిది. రాచూరుమాణిక్యరావువారు జయించి బలభద్రపాతృని వారికి

మనోవర్తి క్రింద వుంచిన ౪౫ గ్రామాదులలో యిది ఒకటి. మాణిక్యరావు జంగన్నరావు తిరుపతిరాయనింగార్లు వంతువచ్చినది. తిరుపతి రాయణింగారికి సంతానం లేకపోవుటచేత జంగన్నగారి కుమారుడైన భావన్నా రాయణంగారు 1208 ఫసలీలో ప్రభుత్వమునకువచ్చి 1211 లో రాచూరు తాలూకా కుంఫిణీవారిచేత వేలంవేయగా ఈ గ్రామం రాజామగ్రాజు వెంకట గుండారాయణింగారి పరిపాలన లోనికి పోయినది. గ్రామంగుడికట్టు ౨౫ కుచ్చెళ్ళు.

**జానంచుండూడు** :- ఇది గుంటూరు వందురు తాలూకా : 1122 ఫసలీలో మూడు వంతులుగా భాగించినప్పుడు ఇది రేపల్లె తాలూకాలో చేర్చబడి రమణయ్య మాణిక్యరావు గారి పరంచేయబడగా క్రమముగా మల్లన్న సీతన్న గోపన్న జంగన్నగార్లు 1182 ఫసలీవరకు ప్రభుత్వం చేసిన తరువాత అన్నదమ్ములైన జంగన్న తిరుపతిరాయనంగార్లు భాగం పంచుకొనుటలో తిరుపతిరాయనంగారి వంతువచ్చుటవల్ల రాచూరుతాలూకాలో చేరినది. వీరి కుమారులైన అప్పారాయనంగారు సీతన్నగార్లు 1208 వరకుపాలించి నిస్సంతువల్ల జంగన్నగారి కుమారులైన భావన్నగారు 3 సం॥ పరిపాలించిన తరువాత 1211 వేలంలో మగ్రాజువారికి పోయెను. గుడికట్టు కుచ్చుళ్ళు ౪౦

(10) **పొత్తూరు సంతు గుంటూరు సర్కారు రాచూరు తాలూకా** :- ఉత్తరం సోమేశ్వరస్వామి తూర్పు వేణుగోపాల స్వాములను ప్రతిష్టించిరి. 1182 లో పంచుకొనుటలో తిరుపతి రాయన్నగారివంతులో వచ్చి రాచూరులో చేరినది. గుడికట్టు 75 మిగతా విషయములు పైదానిమాదిరి.

(11) **గారపాడుసంతు గుంటూరు సర్కారు రాచూరు తాలూకా** :- ఇది అగ్రహారగాసాలు 1 కి 5 వరహాలు ఇచ్చులాగున రమణయ్య మాణిక్యా రావువారు ఏర్పాటుచేసి తిరుమల కృష్ణసోమయాజులం గారికి యిచ్చిరి. 1182లో కృష్ణసోమయాజులంగారు ఈ గ్రామం తూర్పున గంగాధర స్వామిని ప్రతిష్టించి కు ౦౽౦ మాన్యంను దక్షిణభాగమందు శ్రీ ఆంజనేయస్వామిని ప్రతిష్టించి కు ౦౽౦ యిచ్చిరి. మిగతాది పైదానిమాదిరి. గ్రామం గుడికట్టు 83 పగ్గానికి 1కి 64 కుంటలు ప్రాప్తి అయిన కుచ్చుళ్ళు 25.



(12) **సుద్దపల్లి** :- సంతుగుంటూరు సర్కార్ రాచూరు తాలూకా గ్రామాన ఐదు పశ్చిమమున కాశీ విశ్వేశ్వరస్వామిని మధ్యను వేణుగోపాల స్వామిని దంటు దేవరాయ దీక్షితులు ప్రతిష్టించి కు ౨ దానంచేసి అగ్రహార మనుభవించుచుండిరి. ఇది పైవారికి కృష్ణదేవరాయలు చేత యివ్వబడిన అగ్రహారం : మిగతా కథ పై దాని మాదిరి. గుడికట్టు. కు॥ ౭౫

కొండవీటి కైఫీయతులో మాణిక్యారావు వారికి ప్రసక్తమయిన గ్రంథ భాగమిది :-ఉదయగిరి, అద్దంకి. వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, తంగేడు, కేతవరం మొదలైన దుర్గములు జయించి కొండవీడు వచ్చి అప్పుడు పరిపాలించుచున్న ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్రగజపతిని జయించి అతనికి అభయమిచ్చెను...... సింహాచలము వరకు సాధించెను. కటకం పర్యంతం జయించి గజపతివారి కుమార్తెను బలాత్కారముగా వివాహము చేసుకొనెను. సింహాచలం అవతలి దేశములు గజపతివారికి వదలి కొండవీటికి సాళ్వతిమ్మరుసు మేనల్లుడు నాదెళ్ళ గోపమంత్రికి పట్టం గట్టెను. నాదెళ్ళ గోపమంత్రిగారు దేవాలయము కట్టించి పరిపాలించు చుండెను. రాయల భార్య కంభంలో ఉండిపోయి తన స్వంత ద్రవ్యముతో కంభం చెరువు త్రవ్వించెను. దేవాలయము కట్టించినది. 1455 వరకు కృష్ణ రాయలు రాజ్యంచేసెను. తరువాత అచ్యుతరాయలు 1456 నుంచి 1467 వరకు 8 సంవత్సరములు పరిపాలించెను. ఇతనికి ప్రధానియైన రామయ భాస్కరునికి అధికారమిచ్చి కొండవీటికి పంపగా పూర్వము రెడ్డి రాజులు కట్టించిన సౌధములు గుళ్ళు పడిపోవుటవల్ల ఆ రాళ్ళు తెప్పించి యీ దుర్గానికి పశ్చిమ భాగమందు మావులకోట గట్టించి పట్నంనిర్మించి గోపీనాధస్వామి వారిని ప్రతిష్టించెను. ఇక్కడ ఒక బావిత్రవ్వించి తిరుగుబాటు చేసిన పాలెగాండ్లను నమ్మకముమీద పిలిపించి స్వామివారికి ప్రదక్షిణం చేయవలసినదని చెప్పి అదివరకు పూర్వమే తగిన ఏర్పాటు చేయబడిన ఆ బావిలో వారిని కూలద్రోసి చంపెనని ప్రతీతి. ఈ పట్టణమునకు కొండవీటి గోపీనాథపురమని నామాంకితము చేసిరి. ఈ పురం దగ్గరగా వెన్నముద్ద కృష్ణుడు మూలస్థానేశ్వరుడు. అంగడివీరభద్రుడు మొదలయిన దేవస్థానములు నిర్మించెను. ఈయన సహోదరి చిన్నమాంబ ఈ పట్టణానికి మూడు ఘడియల

దూరాన రామచంద్రపురమనే అగ్రహారము కట్టించి పర్వతేశ్వరుడను ప్రతిష్టించి, గోపీనాథ అనే చెరువు త్రవ్వించి సొంతలూరు అనే అగ్రహారమును ధారాగ్రహీతము చేసెను. ఇతను మొగలాయి ఫౌజును జయించి రాజ్యము నిర్వక్రముగా పరిపాలించెను. విజయ నగరమందు సదాశివదేవమహారాయలు పరిపాల నము చేయుచుండి అత్రేయగోత్రులై విఠలయ్య దేవమహారాజుగారిని ఈ దేశానికి పట్టం కట్టిరి. ఇతను కొండసింగయ్య అను దేవాలయమును ఈ దేవాలయమునకు ఉత్తరాన కొండపల్లి చెరువు పడమర వక తోట నిర్మించెను. ఇతను 1443 మొదలు 1470 వరకు 27సం॥లు పాలించెను. విజయనగరంలో అప్పుడు పరిపాలించుచున్న రామరాజయ్య దేవమహారాయలను 1487 లో తురకలు చంపి రాజ్యము స్వాధీనము చేసుకొని మల్కిరాయపాదుషావారు పరిపాలించుచు ముర్త్యుజ అనే తురకను ఈ దేశానికి పరిపాలనకు పంపిరి. అతను దేవాలయములు పడగొట్టి గోపీనాథ పురమునకు ముర్తుజానగరమని పేరిడి రాజ్యము చేయుచుండగా శ్రీ వీరప్రతాపతిరుమల దేవరాయలు కృష్ణయావలనున్న మొగలులను జయించి సామ్రాజ్యానికి వచ్చి ఆనెగొంది తిరుమల దేవరాయల పుత్రులయిన శ్రీరంగరాజయ్యకు ఈ దేశానికి ప్రభుత్వం కట్టిరి. ఆయనే కృష్ణాతీరమందున్న మూరంపూడి అనే గ్రామమును గంగాధర రామేశ్వర స్వామివారికి దానంచేసిరి. ఇది 1474లో జరిగెను. అజరత్ విభురాపాదుషాహావారు కృష్ణా ఆవలిభాగం ప్రభుత్వం చేస్తూయుండిరి. కర్ణాటకపాదుషాహా శ్రీరంగరాయలను జయించి కృష్ణ దక్షిణదేశమందున్న వినుకొండ మొదలైనవి సాధించవలెనని రాయరావు అనే బ్రాహ్మడికి సేన ఇచ్చి పంపగా ఆయన వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, మాచెర్లసీమ జయించి వెలమవారు పరిపాలించుచున్న నేలకోట కొబ్బెర్లతోట జయించి అద్దంకి, అమ్మనబ్రోలు, కందుకూరు, పొదిల, దరశి, కంభం, కాకర్ల, తూపాడు, తంగేడు, గురజాల, కేతవరం, కోడెపూడి మొదలైన నేలకోటలను జయించి కొండవీటిని ముట్టడించగా రాయలవారి ముతాలీమతులై ? ముతాధిపతులైన? వెలుగోటి తిమ్మన్న లోబడి రాయరావుకి ఆధీనుడైనాడు. 1502లో స్వాధీనపరచుకొని 1504 వరకు పరిపాలింపగోల్కొండకు వెళ్ళెను. గోల్కొండలో ఉన్న అజరత్‌గారు ఇక్కడ మన పూర్వీకుడు ముర్త్యుజాచే గట్టపడిన పట్టణము బాగుగా కట్టించెను. వినుకొండ, బెల్లంకొండ మొదలయిన దుర్గముల



వ్యవహారములుగూడ ఇక్కడ జరుగునట్లు యేర్పాటు చేసి దీనికి ముర్తుజా నగరు సర్కారని పేరిడి కొండవీటి సీమనంతయు 14 సమతులు చేసినారు. పొలద్లు, పులివఱ్ఱు, ప్రతిపాడు, సంతరావూరు, నూత్తక్కి, చీరాల, పొణం, మంగళగిరి, మునిగోరు, నాదెళ్ళ, రావిపూడి కూచిపూడి, గుంటూరు, తాడికొండ ఈ విధముగ 14 గ్రామాదులను 14 సమతులు చేసిరి.

కొండవీటి జిల్లాలో హుజూరునాయకుడు ఖిల్లాదారు హోదాలో యున్న మాణిక్యరావు స్వదేశిముఖి అవిన్నీ, మాసూరువారికి మజుందారనిన్నీ, పాత్రునివారికి దేశపాండ్యగిరిన్నీ సదరు సమతులను స్వాధీనపరచి నాదెళ్ళ సమతుకు కమ్మవారిని నియమించి వారి పరంగా మామ్లియతు జరిగేటట్లుగా నిర్ణయించినారు. తరువాత మహమదుపాదుషాహి రాయలంగారు గోల్కొండను రాజ్యంచేయుచు బందిపోట్లను అణచుటకై అమీనుముల్కును కొండవీటికి బంపగా అతను బందిపోట్లను అణచి 1514లో ముల్లగూరి అగ్రహారమును పాడుచేసి తన పేర మల్కాచెర్వు, మల్కామహాలు, మల్కాబావి కట్టించి ముల్లగూరిని యాబలూరి గ్రామంలో కల్పి అమీనుబాదా అను పేరుపెట్టి దుర్గం కట్టించిరి. ఒక బురుజు పేరు మల్కాబురుజని పేరుపెట్టి హిందువుల కట్టడముల పాడొనరించి 1512 నుండి 1520 వరకు 7 సం॥ పరిపాలించెను. ఆ కాలమందు సిగిలిన్‌ఖాను ఈ పురమువచ్చి మహమ్మదు కుదుబ్‌షావారి ఈ పురమునకు దక్షిణమున పేట, పురము కట్టించెను. తరువాత అబ్దుల్లా సుల్తాను, అబ్దుల్లాహుస్సేను, తానీషా అలంగీరు, పాదుషాలు రాజ్యము చేసిరి. వారి దినములలో అధికారము చేసిన హమీళ్ఖుచితాపఖానుడు 1521 నుండి 1524 వరకు, 1524 నుంచి ఒక సం॥ అభినిసిద్ది చివులు ఖానుడు 1524 నుండి 1527 వరకు అప్సరస ఖానుడు ప్రభుత్వం చేసిరి. వీరి తర్వాత యఖ్లాస్థానుడు గుంటుపల్లి ముత్తురాజయ్యలు పరిపాలించిరి. తరువాత 1574లో యఖ్లాస్‌ఖానుడు అమీలు అయి పూర్వము రెడ్డరాజులు చిన్నకొండమీద కట్టించిన విఘ్నేశ్వరాలయమును పడగొట్టించి ఈ దేవాలయానికి దక్షిణంగా కొంచెం నైరుతి మూలగా యఖ్లాస్‌ఖాను పేట కట్టించి, ఆవూరు గణేశపేట అనికూడ పిలుస్తూ వచ్చిరి. పిమ్మట కుటిఖానుడు అమీను పదవికి వచ్చి1574 నుండి 1577 వరకు మూడు సం॥ పరిపాలించెను. తరువాత జూపల్లె

రంగారావుగారి కుమారుడు రంగపతిరావు రాజ్యము నకు వచ్చి ఈ పట్నానికి నైరుతిమూలగా నాదెండ్లకుపోయే మార్గంలో ఈ ఊరి పొలం కొంత తీసికొని అందులో దేవాలయం కట్టించి ఈ పట్టణంలో నున్న శ్రీరంగనాయకస్వామి వారిని జయవిజయలతో కూడ తెచ్చి ప్రతిష్టించి అక్కడ రంగపతి పేట కట్టించి సోల్లసమేతు శ్రీరంగ నగరమని చుట్టు పొలిమేర స్తంభములు వేయించి పై దుర్గానికి వాయవ్యమూలను మిరియాలచుట్టు? మీదను బురుజు కట్టించి మిరియాలబురుజు అని పేరుపెట్టించి 1538 నుండి 1540 వరకు మూడు సం॥ ప్రభుత్వం చేసెను. తానీశా, అలంగీరు, వారి పరియంతం దుర్గములలో కిల్లేదార్లను ఉంచి హవేలీ గ్రామాలు వారి క్రింద ఉంచడమున్నూ, మిగతా సమతులు అమీళ్ళ పరంగాఉంచుతూ 1121 ఫసలీ వరకు జరగినది. 1122 ఫసలీలో నవాబు ముచరాజు ఖాను..... మృత్తుజానగరు మూడు..... విభాగించెను. అప్పుడు ఈ జిల్లాక్రింద 18 గ్రామాలు ఉంచి జమీందార్లకు సావరాలుముడుతూ ఉండేటట్లుగా ఏర్పాటు చేసెను. తర్వాత ఆషబ్ షా నవాబు నిజాముల్ ముల్క్ బహద్దరుగారు సుభా అధ్యక్షులై జాజావాదుల్లా మొలతరముఖానుడు బాలకృష్ణ మొదలయినవారికి అమీలు యిచ్చిరి. వారు వచ్చి అల్లకల్లోలముగా రాజ్యమును సరిచేసి దేశముఖి దేశపాండ్యలవల్ల సుంకమును తీసికొంటు వచ్చినారు. తరువాత సాహెబు జావాగారు పరిపాలించిరి. తరువాత వీరి కుమారులు నజర్‌జంగ్ ప్రభుత్వం వహించి 1160 ఫసలీలో పరాసువారి పరంచేసెను. తరువాత బసాలద్‌జంగ్ దివాను అయిన రాజాబలవంతు ఇంద్రజిత్తు బహద్దరుగారికి ఖిల్లాదారువని ఇచ్చి పంపగా వారువచ్చి నల్గురు జమీందార్ల వ్యవహారం తానే చేసికొంటూ ఉండగా ముశ్చఫీలుముశ్ నాభాముశే లాలి మొదలయిన వరాసువారు పెళ్ళూరి రామయ్యగారిని మంత్రిగా యేర్పరచి వ్యవహరించిరి. అరవీటి నుండి తద్దిఖానుడు మేస్తరుది వీలు వచ్చి జమీందార్ల పరంగా వ్యవహరించిరి. ఇంతలో టిప్పుసుల్తాను తరపున గండికోటనుంచి మీరు సాహెబుగారు 6000 గుఱ్ఱాలతో వచ్చి దోపిడి జరిగెను. తరువాత గోలకొండ నుంచి పంపబడ్డ సాహెబు వచ్చి జమీందార్ల నేర్పాటు చేసి గుంటూరు సుబాచేసి ఏడు సంవత్సరములు పరిపాలించిరి. 1177 ఫసలీలో ... వారు వచ్చి 1177



వరకు 3 సం॥ పరిపాలించిరి. 1200 ఫసలీలో ఈ తాలూక జమీందార్ల పరంచేసిరి. అప్పుడు యీ ఓంటుకు మాసూరి నరసన్నకు ఒప్పగింపబడెను. ఆయన 1219 వరకు 20 సం॥ పాలించి వీరి తమ్ముని కుమారులు వెంకట కృష్ణునింగారు 1221 వరకు పాలించెను.

(1) భీష్మకునినగరం కుండిననగరంపట్టున ప్రోలయ వేమారెడ్డి మరల పట్టణం కట్టించెను (2) దీనికి ఉత్తరం పుట్టకోట కట్టించిరి. (3) ఈ గ్రామానికి ఉత్తరదార్వాజాకు పశ్చిమంగా శివాలయం పడిపోయినది. (4) ఈ దేవాలయానికి తూర్పు లంకెల బావి ఉన్నది. (5) ఈ బావికి తూర్పున కైలాసరాయని కొండ ఉన్నది. దేవాలయాలను రెడ్లు పూజించేవి మ్లేచ్ఛులు పాడుచేసిరి. (6) ఈ స్థలానికి ఉత్తరం బార్ల అవీడు దేవాలయం దానికి క్రిందుగా బ్రహ్మగుండం కోనేరు ఉన్నది. (7) పట్నానికి ఆగ్నేయముగా వేంకటేశ్వరస్వామి – యీ స్వామికి తూర్పు పుష్కరిణి ఉన్నది. (8) ఈ స్వామికి ఆగ్నేయంగా కన్యకలబావి (9) ఈ పట్నానికి దక్షిణంగా గోపీనాథస్వామి దేవాలయం – ఈ ఆలయానికి పశ్చిమంగా రంగనాథస్వామి వారిని గజపతివారు ప్రతిష్టించిరి. (11) నాగమయ్య దక్షిణముగా కోనేరు ఉన్నది. (12) ఈ కోనేరు దక్షిణంగా మాణిక్యారావు వారి కోనేరు కలదు. పూర్వం కర్ణాటక ప్రభుత్వంలో యీ వెలుమవారు గోపీనాథపట్నం తురకలదని యిక్కడ రాజగృహములు కట్టించుకొని నివసించుతూ ఈ కోనేరు త్రవ్వించిరి. (13) ఈ కోనేటికి తూర్పుఁగా మాణిక్యారావు గుండాలని రెండు దద్దణాలున్నవి. పూర్వము యుద్ధాలలో మగవారు చనిపోతే స్త్రీలు సహగమనం చేసినారు యీ గుండాలలో అని ప్రసిద్ధి. (14) ఈ గుండాలకు దక్షిణంగా రెడ్లు కట్టించిన పెద్దకోనేరు ఉన్నది. (15) ఈ కోనేటికి పశ్చిమమున గృహరాజుమేడ దిబ్బ ఉన్నది. రెడ్లప్రభుత్వంలో కోమటి వేమారెడ్డిగారు శ్రీనాథుని ప్రభావం వల్ల నవులూరి పోతరాజు దేవాలయం వద్దనున్న యేడుతాళ్ళ పొడుగు యేడుమోకులు తిరిగే లావును గల తుమ్మచెట్టును తెప్పించి ఒంటి స్తంభము మేడ కట్టించి ఆదిలక్ష్మీ కామేశ్వరి అమ్మవారికి సింహాసనముగ ప్రతిష్ఠించిరి. ఈ మేడ శిఖరానను బొల్లిమోర వెంకటేశ్వరస్వామివారి దేవాలయమునకు మకర తోరణం కట్టించిరి. ఇక్కడకు వెంకటేశ్వరస్వామివారి కొండ తూర్పుగా

ఉండును. (16) ఈ కొండకు దగ్గిర జద్దిగాలబావి, దీనికి దగ్గరగా రెడ్డివారి చెరువుగలదు. (17) పెదదాసరాయ,చినదాసరాయ తోటలున్నవి. (18) ఈ గ్రామానికి దక్షిణంగా స్వయంభువు అయిన కొండ శింగరయ్య అనే నృసింహ స్వామి బిలంలో ఉన్నాడు. (19) ఈ స్థలానికి ఉత్తరం తిరుమల లక్ష్మీనృసింహ ఆలయమున్నది.(20) గ్రామముల పశ్చిమం శ్రీరామేశ్వరస్వామివారి దేవాలయం ఉన్నది. (21) దీనికి దగ్గర రుక్మిణీ సత్యభామా సమేత గోపాలస్వామి దేవాలయం (22) దీనికి పశ్చిమంగా సీతాపతి అనే చెరువున్నది. (23) ఈ గ్రామానికి ఉత్తరం వీరభద్రస్వామివారు (24) దీనికి ఉత్తరంగా రెడ్లు కట్టించిన దేవస్థానములున్నవి. పెద్దదర్వాజా ఉన్నది. (25) దీనికి ఉత్తరం పత్తేఖాను మశీదు ఉన్నది. (26) దీనికి ఉత్తరం ... అనే అత్తారు మశీదు ఉన్నది. (27) దీనికి ఉత్తరం పాడుబడ్డ మశీదు. (28) ఈ గ్రామానికి పశ్చిమం పేట మహమ్మదాపురం (29) దీనికి దక్షిణం నల్ల మశీదు (30) దీనికి పడమట గుమ్మల్ మశీదు (31) దక్షిణ జామత్ కానా మశీదు (32) చిన్న మశీదు (33) దక్షిణమున రెండు దర్వాజాలున్నవి. (34) దీనికి దక్షిణం కొండవీటి గోపీనాథస్వామి పట్టణం అనే ముర్త్యుజానగరు. దీనికి ఉత్తరపువైపు కొండపల్లి దర్వాజా ఉన్నది. (35) దీనికి దక్షిణ గోపీనాథ పట్నంలో నాదొడ్లదర్వాజాలు, (36) కుదుబ్‌షాపేట. శ్రీవెన్నముద్ద కృష్ణస్వామి దేవాలయము గలదు. (37) కమాల్‌దీన్ వారి మశీదు ఉన్నది.

## గ్రంథార్థము

ఈ గ్రంథమునఁ బ్రధానముగా ధనుర్నిర్మాణము మొదల్కొని శర ప్రయోగాంతముగాఁ గలధనుశ్శాస్త్ర విషయములు, అనుభవ రూఢకములు ససిగా వివరింపఁబడినవి. కాని, యీ గ్రంథమునకంటెఁ దునిరాజాగారు ప్రకటించిన ధనుశ్శాస్త్రము విపులమయినది. విషయ విశేషములు గలది. సంస్కృతధను శ్శాస్త్రగ్రంథము లన్నింటను విషయ సామ్యమున్నది. వాని ననుసరించియే యీరెండు తెల్గుగ్రంథములు వెలసినవి. కాని యీ యిర్వురు గూడ సంస్కృతమూలగ్రంథములు బేర్కొనరైరి. ఈ యిర్వుర గురువులును సంస్కృతముననున్న యాయాశాస్త్ర గ్రంథముల నెఱుగక తత్త ద్విషయ విశేషములనే గురుసాంప్రదాయానుసారమున నేర్చుకొని వానిని వారివారి



వ్యవహార భాషలలో వ్రాసికొనియుందురు. ఈ గ్రంథమున కృష్ణమాచార్యుడు "ఈ లక్షణాలను కందాళ వెంకటాచార్యులుగారు చెప్పిన పద్యాలు" అని కొన్ని పద్యాలు చేర్చిరి. అతడు కృష్ణమాచార్యునికంటెఁ దర్వాతివాడు.

నేను కృతిప్రేరకుని వంశము వారగు రాచూరి జమీందారుగారికి జాబులు వ్రాసి ముద్రణోపక్రమము తర్వాత నొకవ్రాఁత ప్రతిని వారివల్ల బడసితిని. కాళహస్తి వ్రాఁత గ్రంథములలో నొకప్రతి తిరుపతి దేవస్థాన పుస్తకశాలకు లభించినది. ఈ రెంటి సహాయములేకున్నచో నేతద్గ్రంథ ముద్రణ మీతీరుననేని నెఱవేఱక పోయెడిదే.

రాచూరు జమీందారు గారగు శ్రీ కృష్ణానేని హయగ్రీవరావుగారు వారి వ్రాఁతప్రతి నొసగియు, తమవంశ చరిత్రాది సాధనములను తమ యుద్యోగి శ్రీ కోపల్లె రామకృష్ణారావుగారి ద్వారమున పంపియు, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు తమదగ్గరనున్న ధనుశ్శాస్త్ర గ్రంథముల నీ పీఠికా రచనకాలమున నొసగియు, ప్రతిదినము ఉదయము వచ్చిన ప్రూఫులను నాఁడే వానిని మద్రాసు పంపుటలో నాకు చిరంజీవి పంగనామముల బాలకృష్ణమూర్తి బి.ఓ.యల్ (ఆనర్సు) నా సహోద్యోగి చాలదోడ్పడియు, విద్యాజన్మ వంశములందు సంతానమగు చిరంజీవులు శ్రీనివాస, సచ్చిదానందులు, సుందరమూర్త్యానందమూర్తులు నన్నునువర్తించి యుపకరించిరి.

విరోధి

మాఘపూర్ణిమ

**వేటూరి ప్రభాకరశాస్త్రి.**

( పీఠిక
ధనుర్విద్యావిలాసము
ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము
మదరాసు
ప్రచురణ 1950)

# తాళ్ళపాక తిమ్మక్క
# సుభద్రాకళ్యాణము
## పీఠిక

ఈ సుభద్రాకళ్యాణమును తాళ్ళపాకతిమ్మక్క రచించెను. తాళ్ళపాక అన్నమాచార్యునికి తిమ్మక్క అక్కలమ్మయని యిర్వురు భార్య లుండిరి. పెద్ద భార్య తిమ్మక్కకు నరసింగన్న యని కుమారుడు. చిన్నభార్య అక్కలమ్మకు పెద్ద తిరుమలాచార్యుడని కుమారుడు నిద్దఱు కూతుంద్రును కలిగిరి. అందు పెద్దభార్య యగు తిమ్మక్కయే యీ గేయకృతికి రచయిత్రి. సంగీత సాహిత్య చతుర యగు నీ యిల్లాలి నేలిన యన్నమాచార్యుఁ డదృష్టవంతుడు.

కం॥ సంగీతము సాహిత్యము
శృంగారము చక్కదనము శీలము గల పు
ణ్యాంగనకుం బ్రియుడగు కవి
పుంగవుఁ డరయంగ నెంత పుణ్యాత్మకుఁడో !"

తిమ్మక్క ప్రేయసిగా, భక్తిమయగేయరచన కవితగా, తత్కవితా వల్లభుఁడు శ్రీ వేంకటేశ్వరస్వామిగా, అన్నమాచార్యునకు లభించిరి. అతఁడు ధన్యుఁడు.

తిమ్మక్క కృతి యిది ద్విపదమంజరీవికార మనఁదగిన గేయరచన. స్త్రీబాలపామరాదులు కంఠపాఠముగా నేర్వఁదగినది. పాడఁదగినది. పూర్వమట్లే సాగినది. ఈ పాటలోని పలుకుబళ్ళు కొన్ని కొన్ని చేమకూర వేంకట కవి విజయవిలాసమునఁ జేరినవి. ఈ గ్రంథకర్త్రి అతని కిన్నూరేండ్లకుఁ బూర్వకాలమున వర్తిల్లినది కాన, దీనిలోని పలుకుబళ్ళు చేమకూరకవి యనుకరించె ననవలెను. ఇందులో '....... మువ్వగోపాల' అని కలదుగాని అది మువ్వపురి గోపాలునిఁ బేర్కొనునది యనఁగాదు. క్షేత్రయ 'మువ్వపురి గోపాలా' యని చెప్పెను గాన, యది యట్లే యనవలెను. ఇక్కడ మువ్వలు దాల్చిన బాలగోపాలుఁడని యర్థము కావచ్చును. ఈ పాట నన్నయ భారత కథారచనము నధికముగా ననువర్తించుచున్నది. దీనివ్రాంతప్రతిలిపి పాట పాడెడు తీరున తీగెసాగిన దీర్ఘాక్షరములతో నున్నది. స్త్రీపామరాదులనోటఁ



బడి యీ పాట చాల రూపుచెడి శ్రీకాళహస్తిరాజాగారి యాస్థాని నుండి తెచ్చిన తాళపత్ర గ్రంథసంచయములోఁ గానవచ్చినది. దీని నెంతో దిద్ది కొంత తీరునకుఁ దెచ్చితిమి. ఇట్లు దిద్దుటలో అచ్చు చిత్తులు చూచుటలో చిరంజీవి పంగనామముల బాలకృష్ణమూర్తి, విద్వాన్, శిరోమణి, బి.ఓ.యల్. (ఆనర్సు) నా సహోద్యోగి చాలఁ దోడ్పడెను. యథా మాతృకముగా చిరంజీవి విద్వాన్ పి. పార్థసారథినాయుడు పరిశోధనశాలా విద్యార్థి వ్రాసెను.

అన్నమాచార్యోత్సవము నాఁటి కాయన యిల్లాలి గేయరచనమును దీనిని వెల్వరింపవలయునని వడివడిగా దోషసహస్రము దిద్దుచు నచ్చున కిచ్చుచుండగా ప్రెస్సు మేనేజరు శ్రీ టి. ఆర్. నరసింహంగారు, కంపోజిటర్లు శ్రుతికలిపివడిగా వారములో ముద్రణము ముగించిరి. ఈ ద్వితీయ వర్షాన్నమాచార్యోత్సవమున (విరోధి ఫాల్గున బహుళదశమి ) వెల్వడిన యీ గ్రంథము, సర్వసమ్మతముగా శ్రీ సి. అన్నారావుగారు కమీషనరుగాను, శ్రీ సి.రామస్వామిరెడ్డిగారు పేష్కారుగాను, శ్రీ తిరుపతి దేవస్థానమున నుద్యోగించుటకును, భారతదేశము సంపూర్ణస్వాతంత్ర్యము పడయుటకును, జ్ఞాపకముగా వెలయఁగలదు.

తిరుపతి
13-3-50

వే. ప్రభాకరశాస్త్రి

(పీఠిక
సుభద్రాకళ్యాణము
తి.తి. దేవస్థానము ప్రచురణ
1950 )

# తిరుప్పావై - సప్తపదులు

## పీఠిక

ద్రవిడవైష్ణవులు వేదకల్పముగా నధ్యయనము చేయు నాలాయిర (చతుస్సహస్రి) మను ద్రావిడభాషా ప్రబంధమునందు ప్రథమ సహస్రిలో నీ "తిరుప్పావై" యను ముప్పది పాశురముల గ్రంథమున్నది. అది ద్రవిడ దేశమందేకాక యాంధ్రదేశమందునుగూడ వైష్ణవులకు వాచోవిధేయమై యుండును. అనుదినమును గీతోపనిషత్కల్పముగా దీనిని వా రనుసంధానము చేయుచుందురు. అందును ధను (మార్గళి) ర్మాసమున నతిప్రధానముఁగా జేయుదురు. విష్ణ్వాలయములందునుగూడ ధనుర్మాసమున దినమున కొకపాశురము (సీసపద్యమువంటి పద్యము) చొప్పున ముప్పది దినములు ముప్పదిపాశురములను దెలతెల వాఱకముందే యనుసంధించి స్వామి యారాధనము కావింతురు. చక్కెరపొంగళ్ళు, దధ్యోదనములు నారగింపులు పెట్టుదురు. పెరియాళ్వారని పేరొందిన విష్ణుచిత్తుల పుత్రియగు నాండాళ్ (గోదా) దేవి ఈ కృతికిఁ గర్త్రి. ఈమె చరిత్రము ప్రఖ్యాతాంధ్ర ప్రబంధమగు నాముక్తమాల్యదలోఁ గొంత చూడఁదగును. ఆమె శ్రీరంగనాథస్వామినే వివాహమాడినదట! భగవద్గుణానుభవానంద పరవశమై యామె తన భర్త శ్రీరంగనాథస్వామియే యని వినోదించుచు లౌకికరీతిచే నవివాహితగానే యాయుష్కాలము గడపి యుండవచ్చును.

## గ్రంథార్థము

ఈ గ్రంథమునకు ద్రవిడభాషలోఁబెక్కు వ్యాఖ్యానము లున్నవి. "పెరియావాచ్చాం బిళ్లై" యను వ్యాఖ్యాత యిట్లు చెప్పినాఁడు. "సర్వేశ్వ రుఁడు లోకమునుద్ధరించుటకై గోకులమున శ్రీకృష్ణుఁడై యవతరించి పంచ లక్షకుటుంబముల నున్న గోపస్త్రీలను సౌందర్య గుణకర్మములచేత వశపఱచు కొని ప్రాప్తయౌవనుఁడై యానందమునఁ దేలుచుండెను. అట్లు యౌవన విలాసముల నందుచున్న యువతులను శ్రీకృష్ణునిఁజూచి గోపవృద్ధులందఱును గూడి "ధూర్తుఁడగు శ్రీకృష్ణుని కడకు పోఁగూడ'" దని ప్రతిషేధించి స్త్రీలనిండ్ల నడంచి పెట్టిరి. వారి కృత్యమువల్ల వర్షములేదయ్యెను. అపుడు గోధనులగు గోపకు లీ యెద్దడికిఁ దాళఁజాలక వర్షార్థమై వ్రతమాచరింపను మనల



నియోగింతురు. శ్రీకృష్ణుఁడు ఘటకుండు కాఁగలఁ'డని గోపకాంతలు సంతసించిరి. అపాయము తప్పుటకై గోపవృద్ధులట్లే శ్రీకృష్ణుని ఘటకునిఁగాఁ గోరిరి. గోపవృద్ధులు వెడలిపోయిన తర్వాత శ్రీకృష్ణుఁడు గోపికలచే నారాధితుఁడై "యిండ్లకుఁ బోయి ఈ రాత్రి నిద్రించి వేగుజామున వచ్చి నన్ను నిద్రలేపవలసిన" దని వారి ననిపెను. శ్రీకృష్ణుఁడు నావిరహము నోర్వఁ జాలక నీలాదేవి సౌధమున కరిగెను. ఆ స్త్రీలును పరస్పర సంశ్లేష ముతో నిండ్లకేఁగి యటనిదురపట్టకపోఁగా శ్రీకృష్ణుని స్మరించుచు మిగిలిన గోపికలఁ గూడ నిదురలేపుకొని వచ్చిరి. శ్రీకృష్ణుని దర్శించిరి..........." ఇత్యాదిగా.

శ్రీభాగవతము దశమస్కంధమున హేమంతర్తువులో గోపికలు కాత్యాయనీవ్రతమును చేయఁబూనినట్టును, తొలినాఁడు వారు నదీస్నానము నకుఁబోయి వలువలు దరినుంచి నీరాడుచుండఁగా శ్రీకృష్ణుఁడు వానిని హరించినట్టును గోపికా వస్త్రాపహరణ కథాఘట్టమునఁ జెప్పఁబడిన నోమా కాత్యాయనీవ్రతము కావచ్చును. తిరుప్పావై పాశురములలో మకుటముగాఁ గానవచ్చు" ఏలో రెంబావాయ్" అను పదము బొమ్మ రూపునున్న స్త్రీ దేవతను జెప్పుచున్నదట ! వైష్ణవులకు శ్రీకృష్ణైకశరణ్యత బలసిన తర్వాత 'కాత్యాయనీ వ్రత ప్రస్తావము జాఱవిడువఁబడియుండవచ్చును. కావుననే పెరియవాచ్చాంబిళ్లై ' ప్రభృతులు దాని బేర్కొనరయిరి. వైష్ణవులకు వేదకల్పమగు నాలాయిరమున 'తిరుప్పావై' యున్నట్టు ద్రవిడదేశమున శైవులకును వేదకల్పమగు తిరువాచకమున (మాణిక్యవాచకర్ రచించినది) తిరువెంబావై యని యొక లఘుగ్రంథమున్నది. వారును బరమశివునిఁ బడయుటకై ధను ర్మాసమున వేకువజాముననే నిద్రలేచి దాని ననుసంధానము చేయుదురట ! "మార్గళి నీరాడేలో రెంబావాయ్" అని యందున్నది. ఇది తిరుప్పావైలో గూడ నున్నది. రెండు గ్రంథములందును విషయసామ్యమున్నది. కావున, నీ వ్రతము శైవ వైష్ణవ విభేదములు సాగక పూర్వమున నుండియు నాచారముగా ధనుర్మాసమున ననుష్ఠింపఁబడు వ్రతముగాఁ దలఁపఁ దగిన దగుచున్నది. దక్షిణభారతదేశమందెల్ల నీవ్రతము కొన్ని మార్పులతో నిప్పటికిని గలదని నే ననుకొనుచున్నాను. ధనుర్మాసమునఁ దెలుఁగు దేశమున బాలికలు, తెల్లవాఱుజాముననే నిద్రలేచి గొబ్బెమ్మలను పేర గోమయముతో బొమ్మలు

(ముద్దలు) గాఁజేసి ముంగిళ్ళ ముగ్గులతోఁ బెట్టి పూలతో నలంకరించి పూజింతురు.

సుబ్బీ గొబ్బెమ్మా సుఖము లియ్యావే
తామరపూవంటీ తమ్ముణ్ణియ్యావే
చేమంతి పూవంటి చెల్లెల్నియ్యావే,

ఇత్యాదిగాఁ బాటపాడుచుఁ బ్రార్థింతురు. ఇట్టి ప్రార్థనము తిరుప్పావై లోనుఁ గొంతగలదు. దక్షిణభారతమందంతటను సామాన్య మయిన యొకవ్రతము ననుసరించి ద్రావిడవైష్ణవులు విష్ణు సంప్రార్థనార్థకమగు తిరుప్పావైని ; ద్రావిడ శైవులు శివ సంప్రార్థనార్థకమగు తిరువెంబావైని గల్పించుకొనియుందురు. 'గొబ్బెమ్మ' పదము, గోపెమ్మ పదభవము. అరవమున 'గొబ్బియళో ' 'గోపిగళ్ ' పదభవము.

## తెలుఁగుచేఁత

మద్రాసు ఓరియింటల్ లైబ్రరిలోనున్న సప్తపదులు పదింటిని గొని నేను కడమ యిర్వదింటిని మూలముఁజూచి పూర్తిచేసితిని. తొలి పదిపాటలకు గర్త శ్రీనివాసగురుఁడు. కడమ యిర్వది నేను రచించినవి. శ్రీ కె. వెంకటస్వామి నాయుఁడుగారు (దేవస్థానం కమిటీ ప్రసిడెంటు) పూర్వమెప్పుడో నేను ప్రకటించిన యీ సప్తపదు లొక్క ప్రతియే యుండఁగా జూచి యిట్లు వారే పునర్ముద్రణము గావింపించిరి. ఇందు వారి భక్తిప్రపత్తులు వందనీయములు.

వే. ప్రభాకరశాస్త్రి
(పీఠిక
తిరుప్పావై – సప్తపదులు
తొలిముద్రణము. 19.....
పునర్ముద్రణము
తి.తి.దేవస్థానము ప్రచురణ
1950)

# ఆంధ్రకామందకము

## ఉపోద్ఘాతము

ఆర్యసారస్వతమున నుపవేదములలో రెండవది యర్థవేదము. అర్థ సంపాదనరక్షణక్రమముల నుపదేశించునది గాన నిది యర్థవేద మనఁ బరఁగు. ఇందు రాజధర్మములును అర్థార్జన రక్షణక్రమములును గలసి బ్రహ్మ లక్షయధ్యాయములుగాను. రుద్రుఁడు 50000. స్కందుఁడు 25000. ఇంద్రుఁడు 12000. వాల్మీకి 6000. బృహస్పతి 3000. శుక్రుడు 1000 అధ్యాయములుగాను గ్రంథములు రచించిరఁట. భయంకరములగు నీ పెద్ద గ్రంథములు తిన్నఁగా భుజింప నవకాశము చాలని మనకాలమువఱకు రాక నశించిపోయినవి. వీనిని సంగ్రహించి భారద్వాజుఁడు 700 అధ్యాయములు గాను, గౌరశిరుఁడనుముని 500 అధ్యాయములుగాను, వ్యాసులు 300 అధ్యాయములుగాను నర్థశాస్త్రములు రచించిరఁట. అవియుఁ బైవాని గతియే చెందినవి. అర్థవేదము సంగ్రహరూపముగాఁ బదునాలుగువేల శ్లోకములతో రచింపఁబడినదఁట. అందీ విషయములు నిరూపింపఁబడినవి.

"చతుర్దశ సహస్రాణి హ్యర్థవేదః ప్రమాణతః
యత్రై వాష్టాదశాధ్యాయాః సంతి ప్రత్యక్షసిద్ధిదాః
కల్పాధ్యాయో రసాధ్యాయః ప్రయోగాధ్యాయ ఏవ చ
ధాతుధ్మానక్రియాధ్యాయో రత్నాధ్యాయ స్తథైవ చ
త్రపు సీస జయాధ్యాయో లోహాధ్యాయ స్తతఃపరమ్
మూషామృల్లోణ తగరాధ్యాయో వాదజయ స్తతః
హేమసంపాదనాధ్యాయః సిద్ధాధ్యాయో ఒ ఖిలార్థదః
మూలికాశోధనాధ్యాయః పుటాధ్యాయో మహత్తరః
నాగాభ్రచంద్రికాధ్యాయో యోగాధ్యాయోఽర్థదాయకః
కాలపాకక్రియాధ్యాయః సింభిన్నాధ్యాయ ఏవ చ
విక్రియాకరణాధ్యాయ ఏతే సర్వార్థదాయకాః"

అని యామళాష్టకతంత్రమున నున్నది.

అర్థశాస్త్ర మనునామముతోనే వీనిలో రాజనీతి ప్రధానముగాఁ జెప్పఁ బడియె. శుక్ర,బృహస్పతి, విశాలాక్ష, బాహుదంతి, భీష్మోద్ధవ, చాణక్య,

ప్రభృతులు విస్తరముగా రచించిన రాజనీతిశాస్త్రములలోఁ జాణక్యుని కౌటిలీయము మాత్రమే మన కిప్పుడు లభించుచున్నది. బార్హస్పత్య సూత్రము లని యిటీవల ముద్రిత మైనదియు లఘుచాణక్య సూత్రములను గ్రంథమును సారరహితములు నాధునికములు నని మా యభిప్రాయము. శుక్ర బృహస్పతుల గ్రంథములకు శుక్రనీతి సారమనియు, బార్హస్పత్య నీతిసార మనియుఁ జాణక్యుని కౌటిలీయమునకుఁ గామందక నీతిసార మనియు గ్రంథములు గలవు.

కౌటిలీయము [1] కేవలము రాజనీతిని దెలుపును. ఇది పదునై దధికరణములుగా 180 అధ్యాయములలో రాజవిద్యావినయ గృహాత్మరక్షణ ములును, అధ్యక్షులవిధానమును (దుర్గము, పట్టణములు. కప్పము, సుంకము, కోశము, శాసనము, గోవులు, గజాశ్వములు, భోజనశాల, ముద్ర మొదలగు విషయములపై నధికారులధ్యక్షులు), వ్యవహార స్వరూప మును దత్పరిష్కారమును, రాజ్యములో నుండునంతశ్శత్రుశోధనము, సేవకాది పరిపాలనవిధి, ప్రజాసంపత్తును, దేహసంపత్తును, యానాసన సంశ్రయణ ద్వైధీభావసంధి విగ్రహా స్వరూపములును, ప్రజాపురుషసేనా మిత్రరక్షణ వ్యసనము, దండయాత్రాక్రమము, యుద్ధప్రకారము. సంఘవిధియు, బలవజ్జయోపాయ క్రమము, దుర్గలాభోపాయము, ఇంద్రజాల మాయా క్రమములును వరుసగా వివరింపఁబడినవి.

దీనిపై బౌద్ధభిక్షువు ప్రభామతి యను టీకను, శంకరాచార్యులు జయమంగళను, మాధవమిశ్రయజ్వ నయచంద్రికను, భట్టస్వామి ప్రతిపద పంచికను వ్యాఖ్యానములుగా రచించిరి. వానిలోఁ గొంత కొంత భాగములు లభించుచున్నవి. భిక్షుమాధవులవ్యాఖ్యానములు మంచివి. భట్టస్వామిది హీన రచనము. అయినను ద్రవిడులును గేరళులును దమ తమ భాషలలోనికి దీని ననువదించుకొనిరి.

కౌటిలీయార్థశాస్త్రముకన్నను చాక్షుషీయ మను నర్థశాస్త్రము ప్రాచీన గ్రంథము. అర్థశాస్త్ర గ్రంథములలో నెల్ల మిక్కిలి చిన్న గ్రంథ మీచాక్షుషీయమే. ఇందు విషయము సూత్రరూపమునను, వాక్యరూపమునను సంగ్రహశ్లోక

1. ఇది "కౌటలీయ" మని వ్రాంతప్రతులలో గలదు.



రూపమునను రచింపఁబడియున్నది. కొన్ని క్లిష్టస్థలములందుఁ బ్రాచీన సంప్రదాయార్థములకుఁ బూర్వపక్షానువాదదూషణరూప విమర్శనలతోఁ గూడిన సమీక్ష యను నాల్గవరూపము గూడ నున్నట్లు తెలియనగుచున్నది. కౌటిలీయమున నీ సమీక్షారూప విమర్శన ముండుటచే సుబోధమై చాక్షుషీయ గ్రంథము నణగఁ ద్రొక్కి ప్రజాదరణమునకుఁ బాత్రమైనది. ఇట్టి సూత్రరూప రచనలు మన ప్రాచీనుల ప్రతిభావిశేషములఁ జాటుచున్నవి. ఈ చాక్షుషీయము రాజ్యాంగములకు సంబంధించిన విషయముల నఱువది యేడింటిని గుఱించి తెలుపుచున్నది. ఇందు ప్రథమపటలము ఉద్దేశరూపమున నీ యఱువదియేడు విషయములఁ బేర్కొనుచున్నవి. ద్వితీయపటలమున నఱువది విషయములు మాత్రము లభ్యము లగుచున్నట్లు తెలియుచున్నది. మిగిలినది లుప్తమైనది. అందు ప్రథమపటల మిట్లున్నది.

> శక్యమేక శరీరేణ నీతిమార్గానుసారిణా ।
> వ్యవసాయ ద్వితీయేన సర్వాం జేతుం వసుంధరామ్ ॥

అథాతః పురుషార్థసాధన మర్థశాస్త్రం ప్రవక్ష్యామః –

తద్యథా – 1. సప్తప్రకృతయః 2. సప్తవిధా ప్రవృత్తిః 3. సప్తవ్యసనాని 4. సప్తక్షమాకాలాః 5. తిస్రో విద్యాః 6. చత్వారో భోగ సంగ్రహాః 7. త్రయో విజిగీషవః 8. చతుర్విధా రాజప్రకృతిః 9. షట్త్రింశద్గుణో రాజా 10. పంచవింశతి గుణో ఽమాత్యః 11. షడ్వింశతిగుణః సేనాపతిః 12. ద్వావింశతిగుణో రాజాధ్యక్షః 13. షోడశగుణో దూతః 14. ద్వాదశగుణో సాంవత్సరికః 15. ఏకాదశగుణః పురోహితః 16. పంచాదశగుణో వైద్యః 17. నవగుణో నాగరికః 18. దశగుణోఽంతఃపురపాలకః 19. ద్వాదశగుణం మిత్రం 20. షడ్గుణా యాత్రా 21. వింశతివిధం దుష్టలింగజ్ఞానం 22. అష్టాంగా బుద్ధిః 23. అష్టాంగా సేనా 24. అష్టౌ కోశవిధానాని 25. ఏకాదశేం ద్రియాణి 26. త్రివిధోమంత్రః 27. చత్వారో మంత్రగుణాః 28. త్రివిధం మంత్రఫలం 29. పంచాంగో మంత్రః 30. సప్తవిధోమంత్రభేదః 31. చతుర్దశ విధ ఉపజాపః 32. పంచవిధః శత్రురుపహంతవ్యః 33. చత్వారో నిర్యాణకాలాః 34. ద్వావిగ్రహకాలౌ 35. చత్వారః సంధాకాలాః 36. ద్వౌపంచ వర్గౌ 37. పంచత్రివర్గాః 38. ఏక ఏక వర్గః 39. చత్వారో అర్థసాధనోపాయాః

40. చతుర్విధారంభవృత్తిః 41. చతుర్విధోఽర్థానుబంధః 42. చతుర్విధో నిచయః 43. పంచ దుర్గాణి 44. దశవిధా దుర్గసంపత్ 45. వింశతివిధం దుర్గవ్యసనం 46. పంచచత్వారింశద్గుణా జనపదభూమిః 47. చతుర్విధం త్యాగస్థానం 48. చతుర్విధా భృత్య సంపత్ 49. చతుర్విధా పురుషపరీక్షా 50. సప్తవిధా కార్యవిప్రతిపత్తిః 51. ద్వివిధ ఉపసర్గః 52. ద్వివిధమనుష్ఠానం 53. అష్టవిధః శత్రుః 54. ద్వాత్రింశద్గుణః షాడ్గుణ్య సముద్దేశః 55. వింశతివిధం దుష్టప్రశమనం 56. షడ్విధంబలం 57. అష్టాయుద్ధాని 58. అష్టౌ సంగ్రామభూమయః 59. చతస్రో వ్యూహప్రకృతయః 60.పంచ వ్యూహాః 61. సప్తదశ వ్యూహాభేదాః 62. ఏకాదశానీకస్థానాని 63. ఏకాదశసుస్థానేషుసేనా రక్షితవ్యా. ఏతేష్వేవ స్థానేషు పరబల మభిహంతవ్యం 64. షడ్విధం విషం 65. ఏకాదశవిధః స్కంధావారనివేశః 66. చతుర్విధా బుద్ధిః 67. ద్వివిధ ఆచారః.

ఇతి చాక్షుషీయేఽర్థశాస్త్రే ప్రథమః పటలః

ఈ చాక్షుషీయమందలి విషయసంగ్రహమును బట్టి కౌటిలీయాది గ్రంథముల కిది మూలమని తెలియుచున్నది. చాక్షుషీయ విషయమే కౌటిలీయ మున విపులముగ వివృతమై యున్నదని రెంటిని బరిశీలించిన వారికిఁ దప్పక గోచరింపఁ గలదు.

సంస్కృత వాఙ్మయమున నర్థశాస్త్రగ్రంథములు పెక్కు లుండెడివి. కాని, దురదృష్టవశమున నవి యన్నియు నశించినవి. బ్రహ్మ, బృహస్పతి, శుక్రుఁడు, విశాలాక్షుఁడు, ఇంద్రుఁడు, మొదలగువారు రచించిన గ్రంథ రాజములు కానవచ్చుటలేదు. లబ్ధములగు గ్రంథములలోఁ జాక్షుషీయ కౌటిలీయములే ప్రశస్తములు.

కౌటిలీయకర్త కౌటిల్యుఁడను నామాంతరముగల చాణక్యుఁడని పలువు రందురు. ఆ చాణక్యుఁడు మౌర్య సామ్రాజ్య చక్రవర్తియగు చంద్ర గుప్తుని మంత్రియై యుండుటచేతను, చంద్రగుప్త చక్రవర్తి క్రీ॥ పూ॥ 325 నుండి 298 వఱకు రాజ్యమేలె నని యుండుటచేతను నీ కౌటిలీయము క్రీ॥పూ॥ నాల్గవ శతాబ్దపు గ్రంథ మని నుడువవచ్చును.



పదవశతాబ్దమువాఁడగు భోజుఁడును అర్థశాస్త్రమునఁ గృషిసల్పిన ట్లతని నీతిభూషణమను గ్రంథము తెల్పుచున్నది. అందర్థశాస్త్ర విషయము నంతను 1. వినయ 2. వార్తా 3.వ్యవహార 4. రక్షా 5. మంత్ర 6. ఉపాయ 7. విక్రమ 8. యుద్ధ 9. ఉపనిషత్ 10. ప్రశమస్కంధములని పది విభాగములుగా రచించె నని తెలియుచున్నది. కాని యా గ్రంథము లభ్యం మగుటలేదు. *1

## కామందక నీతిసారము

పైవిధముగఁ బరిశీలితములైన ప్రాచీన రాజనీతిమూలగ్రంథములకు దరువాతఁ గౌటిలీయార్థశాస్త్రమునకు సంగ్రహకారికా రూపమైన కామందక నీతిసారము సంస్కృతమున వెలసినది. ఇది క్రీ॥శ॥ 4-వ శతాబ్దమునకు బూర్వముదియు 1-వ శతాబ్దమునకుఁ దర్వాతిదియు నని చరిత్రకారులు గుర్తించిరి. ఏతత్కర్త కామందకుఁడు. ఆతని చరిత్ర మేమియుఁ దెలియరాదు. ఈ కామందకము 36 ప్రకరణములు గలది. కౌటిలీయార్థశాస్త్రము ననుసరించియే యిది రచితమైనను నిందుఁ గౌటిలీయమున గల విషయములు గొన్ని గానరావు. కౌటిలీయమున లేని విషయములు నిందుఁ గొన్ని గలవు. ఈ విషయమున "రాజపుత్రుని విద్యాభ్యాసపద్ధతిని నిర్ణయించు సందర్భములో నతఁడు (కౌటిల్యుఁడు) 'అధ్యక్షులనుండి వార్తను, వక్తృప్రయోక్తల నుండి దండనీతిని నేర్చుకొనవలె' నని చెప్పియున్నాఁడు. ఇతనికి నితర గ్రంథకర్తలకుఁ గల భేదమిదియే. కామందకాదు లిట్టి వ్యవహారానుభవము గలిగినవారు కారు. ఇతరులు వ్రాసిన గ్రంథముల వివేకదృష్టితో విమర్శించి స్వాభిప్రా యములఁ గొన్నిటిని జేర్చి కామందకుఁడు లోనగువారు నీతిశాస్త్రముల రచించిరి. కనుకనే వారి పుస్తకములందు సందర్భానుచితములగు ప్రశంసలుకూడ నక్కడక్కడఁ గన్పడుచుండును. కౌటిల్యుఁ డట్లుగాక సందర్భోచితముగను వ్యవహారానుకూలముగను వ్రాసియున్నాఁడు."*2

*1. ఇందాఁక శ్రీరామకృష్ణకవిగారు ఉపవేదములు అనుపేర రుధిరోద్గారి సం॥ ఆంధ్రపత్రికలో ప్రకటించిన వ్యాసమునుండి విషయము గ్రహింపబడెను.

* 2. కౌటిలీయార్థశాస్త్రము-ఉపోద్ఘాతము-శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య ఎం.ఏ.గారు.

ఈ గ్రంథ మనుష్టుప్‌శ్లోకాత్మకమైనదైనను వ్యాఖ్యానిరపేక్షముగా నర్థముకానిది. దీనికి జయమంగళ యనియు, మఱొకటియు వ్యాఖ్యలు గలవు. తిరువాన్కూరు ముద్రణాలయమువారు ప్రకటించిన జయమంగళా వ్యాఖ్యానముతోడి ముద్రణమే యున్న వానిలోఁ బ్రశస్తమైనది. ఇప్పటికి 100 ఏండ్లకు ముందు తడకమళ్ళ వేంకటకృష్ణారాయలను గొప్పవిద్వాంసులు ఈ కామందకమునుఁ దెనుఁగు టీకతోఁ దెనుఁగు లిపిలో ముద్రించిరి. తిరువాన్కూరు ముద్రణమునకును దీనికిని గొన్నిభేదము లున్నవి. కృష్ణారావు గారి తెలుఁగుటీక ప్రశస్తమైనది. వారీపద్యకామందకము నెఱుఁగరు.

## అంధ్రకామందకము - రాజనీతిగ్రంథములు

ఈ కామందకమును క్రీ॥శ॥ 1400 పూర్వకాలముననే యెవ్వరో పద్యకావ్యముగాఁ దెనిఁగించిరి. అందలి పద్యములు పెక్కులు మడికి సింగన సకలనీతి సమ్మతమున నుదాహృతములై యున్నవి. సకలనీతి సమ్మతమున మడికిసింగన యీ క్రిందివాని నాంధ్రరాజనీతిగ్రంథములను బేర్కొనినాఁడు. అవి ముద్రామాత్య, పంచతంత్రీ, బద్దెభూపాల, చాణక్య, ధౌమ్య,విదుర, ధృతరాష్ట్ర, బలభద్ర, కామందక, గజాంకుశ, నీతిసార, నీతిభూషణ, క్షేమేంద్ర, భోజరాజ, విభూషణ, పురుషార్థసార, భారత, రామాయణాది మహా కావ్యంబులు పురాణేతిహాసములు కందనామాత్యు నీతితారావళి లోకోక్తి చాటుప్రబంధంబులును. వీనిలోఁ బెక్కుగ్రంథములు నష్టములైనవి. సింగన ఆయాగ్రంథములలోని పద్యములను బెక్కింటిని తన గ్రంథమున నుదాహరించికొనినాఁడు. అందు బద్దెన నీతి యొకటి మాత్రమే యిపుడు లభించుచున్నది. సకలనీతిసమ్మత మును బోలె శ్రీరామకృష్ణకవిగారే తొలుత నీ బద్దెననీతిం బ్రకటించిరి. సకలనీతి సమ్మతమున నుదాహరింపఁబడిన ప్రాచీన కామందక పద్యములు కొన్ని యిచటఁ జూపుచున్నాఁడను.

ఉ. స్నానవిలేపనాభరణచారుసముజ్జ్వలగాత్రుఁడై శుభ
స్నానము నాత్మదత్తవసనస్ఫుటమూర్తియు నైన దేవులన్
స్థానము సేర్చి వారి సదనంబుల కేఁగక చేయుచు న్నిజా
ధీనమనస్కుఁడై సతులతీపులు నమ్మకయున్కి యొప్పగున్.

(సకలనీతి సమ్మతము. పద్యము 286: ఆంధ్రకామందకము: ఆ.3ప.138)



సీ॥ గురువులఁ బ్రణమితవరభక్తియుక్తుల
సద్భావచేష్టల సజ్జనులను
సుకృతకర్మంబుల సురల భూసురులను
మృదులమనోవృత్తి మిత్రజనుల
బాంధవజనుల సంభ్రమచేష్టితంబులఁ
గామినీజనములఁ బ్రేమములను
దాసజనంబులఁ దగు ప్రసాదంబుల
నితరుల దాక్షిణ్యచతురవృత్తి

గీ॥ నాత్మవశ్యులఁ గావించి యన్యకర్మ
నింద సేయక సత్కర్మనిష్ఠుఁ డగుచుఁ
జారుకారుణికత్వము సర్వలోక
మధురవాక్యము గలవాఁడు మనుజవిభుఁడు ॥

(స.స. పద్యము 158, ఆం.కా.ఆ. 2. ప 57, 58)

సీ॥ భుజగము విషమును బొడఁగాంచి కూయును
శుకభృంగరాజశారికలు వెఱచి
లలిఁ జకోరములకన్నులు విరాగము లగుఁ
గ్రౌంచంబు చాల మదించి తిరుగు
విషదర్శనంబుగా వెసఁ జచ్చు గోకిల
గ్లాని జీవంజీవకమున కొదవు
వీనిముఖంబున వెసఁ బరీక్షితములై
తనరిన యన్నము ల్గొనఁగవలయు

ఆ॥వె॥ జనవిభుండు గడుఁ బృహన్మయూరావళి
తద్గృహంబునం దుదారలీల
విడువవలయుఁ బెంచి వెస దానిఁబొడఁగన్న
పాము దనకుఁ దాన పఱచుఁగాన॥

(స.స.ప, 257; ఆం. కా. ఆ. 3ప.99)

సీ॥ భద్రసేనుఁడు నిజపత్నియింటికిఁ జన
నతనితోఁబుట్టువ యతనిఁ దునిమెఁ
దల్లి మంచముక్రింద నల్లన యడఁగి తాఁ
బుత్రుండ కారూషుఁ బొడవడంచె
లాజలు విషమున నోజించి తేనియ
యని కాశిరాజుఁ దద్వనిత యడఁచె
గరళాక్త మేఖలాఘనమణి సౌవీర
భూపు వైరంత్యు నూపురముచేత

గీ॥ జాతుషంబగు శస్త్రంబు జడ నిడికొని
రమణి తా నొక్కరిత విదూరథుని జంపు
టెఱిఁగి నమ్మక సతియింటి కేఁగఁ జనదు
కెరలి శత్రులపయిఁ బ్రయోగింపవలయు.
(స.స.ప, 287: ఆం.కా. ఆ. 3ప. 140 )

చం॥ అరివరు శత్రుదుర్గమును నాతనిబంధుసుహృద్విభేదమున్
బురధనసైన్యసంపదలపోఁడి మెఱుంగుట కృత్యపక్ష వి
స్తరపరిసంగ్రహం బతనిజానపదాటవికంబు సాధ్యముల్
దిరమిడి యుద్ధసారము విధిజ్ఞత యన్నివి దూతకర్మముల్
( స.స.ప. 362. ఆం.కా.ఆ. 5ప 77)

సీ॥ బాలుండు వృద్ధుండు పటుదీర్ఘరోగియు
నిల నిజజ్ఞాతిబహిష్కృతుండు
భీరుకుండును గడు భీరజనుండును
లుబ్ధుండు మఱియును లుబ్ధజనుఁడు
సతతవిరక్త ప్రకృతియైన నృపతియు
విషయరసాసక్త విరళమతియు
మఱియును బహుచిత్తమంత్రుండు దేవతా
బ్రాహ్మణ నిందా పరాయణుండు



గీ॥ దైవహతకుండు దైవ చింతన పరుండు
వ్యసన దుర్భిక్షకుఁడు బలవ్యసనపరుఁడు
లలినదేశస్థ బహుశాత్రవుఁడును గాల
యుక్తుఁడును సత్యధర్మ వియుక్తమతియు.
(స.స.ప. 526)

కం॥ ఈ యిరుపదవురు తోడన్
బాయక విగ్రహము సేసి పైకొనుటయు వా
రేయెడ మార్కొనక బల
శ్రీ యతి వశవర్తులగుచు సిరి యిత్తు రిలన్.
(స.స.ప. 527: ఆం. కా. ఆ, 4. ప. 70)

సీ॥ దక్షిణానిలముఁ బ్రదక్షిణాగ్నియు నధ్వ
సంతతోత్సాహంబు సాధువాద
చారుమంగళపాఠకారవంబు సుహృష్ట
పుష్టజనంబును బొలుపు మిగుల
నతిమనోహరముగా నరసి చెప్పిన శుభ
కలిత లక్షణములు గలిగియున్న
యట్టి వేలంబు, ప్రఖ్యాతమై పొలుపొందు
నతిశుభమై యుండు నధికశత్రు

ఆ॥వె॥ జయము గలుగునట్టి చందంబు...
నందగ విపరీత మయ్యెనేని
యపజయంబు నొందునట్టి చందములెల్ల
నెఱిఁగి నృపతి నిశ్చయింపవలయు ॥
(స.స.ప. 810. ఆం.కా. ఆ.7. ప.99)

ఉ॥ ఒక్కటఁ గూటయుద్ధమున నుక్కఱ శత్రు వధించినన్ జయం
బెక్కుడు గల్గి పాప మొకయించుక పొందదు నిశ్చయంబు పే
రుక్కున ద్రోణసూనుఁడుఱ కొక్కయెడ న్నదురేయి నిద్రమైఁ
జొక్కిన పాండునందనులఁ జూచి వధింపడె సౌప్తికక్రియన్॥
( స.స.ప. 954: ఆం.కా. ఆ. 8ప. 50)

# ఆంధ్రకామందకము నీతిసారము - గ్రంథరచనము

ఇది ప్రాచీనకామందకమంత రసవంతము కాదేమో కాని, శబ్దశుద్ధియు విషయ వైశద్యమును, ఉత్తమరచనము మున్నగు సుగుణములతో నొప్పుచున్నది. ఇందాంధ్ర దేశపు రాజనీతి సంప్రదాయములు కొన్నిగలవు. ఆంధ్ర దేశపు రాజనీతి పరిభాషాపదములు కొన్ని యచ్చటచటఁ గలవు. రాజనీతి శాస్త్ర పరిశోధకులు వానినెల్ల నుద్ధరింపవచ్చును. రాజ్యములే పోవుచున్న యీ కాలములో నీ రాజనీతిగ్రంథములు చరిత్రకారుల శాస్త్ర నిర్మాణక్రమాది చరిత్ర పరిశీలనమునకేగాని రాజ్యాంగ ప్రయోజనమున కుపకరింపవు. కాని, లోకవ్యవహారజ్ఞానము వీని వలన విశేషముగా లభింపఁగలదు.

## కృతికర్త - గ్రంథరచనా కాలము

మ॥ రమణీయంబుగ శాలివాహశకవర్షంబుల్ గతంబై సహ
స్రము నేనూఱును నాఱునై వెలయఁగాఁ బ్రౌఢిం దెనింగించి రౌ
ర మహిం దిమ్మయవేంకటాద్రివిభుపేరన్ వేడ్కఁగామందకీ
యము శ్రీ వేంకటరామకృష్ణులు స్వభాన్వబ్దంబునన్ రూఢిఁగా॥

అను నాశ్వాసాంత పద్యమునుబట్టి యిది రామకృష్ణ కవులచే రచితమని తెలియుచున్నది. కొందఱీ గ్రంథము రామకృష్ణ కవులనుజంట కవులచే రచితమని యందురు గాని యందు కాధారము కానరాదు. ఆశ్వాసాంత గద్యమునఁ బట్టి యది యొక్కని పేరే యని తెలియనగును. పై పద్యమున బహువచన ముండుట పూజార్థము కావచ్చును.

## కృతిపతి

ఈ కామందకకృతి నందికొనినది కొండ్రాజు వెంకటాద్రిరాజు. ఈతఁడారవీటి వంశస్థుఁడగు కొండ్రాజు తిమ్మరాజకుమారుడు. తెనాలి రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యమునకుఁ గృతిపతియగు విరూరి వేదాద్రి మంత్రికి యజమానియగు పెద సంగభూపాలునకుఁ జెల్లెలి కుమారుఁడు.

ఈ వెంకటాద్రి రెట్టమత మనెడిజ్యోతిష గ్రంథమునుగూడ నంకిత మందినాఁడు.



మ॥ కపటారాతి విభంజనోద్ధతమతీ ! కర్ణాట సింహాసనా
ధిపతి ప్రాప్తరమాధురీణ : కరుణాబ్ధీ! కంతుసౌందర్య ! కా
శ్యప సద్గోత్ర పవిత్ర ! నమ్రతరవాచానైపుణీ నిర్జితా
హిప ! కామందకకావ్యనాయక ! కవీంద్రేష్టార్థ సంధాయకా !॥

రెట్టమతము.

ఆంధ్రకామందకగ్రంథమునఁ బ్రథమాశ్వాసాంతమున

కం॥ శ్రీ చంచద్భట్టరు చి
క్కాచార్య వరార్య శిష్య యతులిత శౌర్య
ప్రాచుర్యధుర్య గుణర
త్నాచల జయలలిత ధైర్య నయవినయనిధీ ॥

ఆం. కామందకము ఆ 1. ప. 65

అని వెంకటాద్రి సంబోధింపఁ బడియున్నాఁడు. ఈతఁడు భట్టరు చిక్కాచార్యులకు శిష్యుఁడు. ఈ భట్టరుచిక్కాచార్యులకుఁ బలువు రాంధ్రకవులు శిష్యులుగా నుండిరి. చాతుర్వాటికా మాహాత్మ్యము. ఆనందకాననమాహాత్మ్యము మొదలగు ప్రబంధములను రచించిన లింగమకుంటతిమ్మకవియు, తెనాలి రామకృష్ణకవియు నీతని శిష్యులే. ఈ విషయమును వారికృతులందలి పద్యములు తెల్పుచున్నవి.

కం॥ గురురాయపట్టభద్రుని
నరిహరు శ్రీరంగనాయకాంశభవున్ భ
ట్టరు చిక్కాచార్యుల మ
ద్గురులఁ దలఁచి యడుగులకు నతుల్ గావింతున్ ॥

లింగమకుంట రామకవి

సీ॥ శ్రీ వైష్ణవ హితుండఁ జిక్కయ భట్టరు శిష్యుఁడ.

లింగమకుంట తిమ్మకవి.

కం॥ వాక్కాంతాశ్రయభట్టరు
చిక్కాచార్యుల మహాత్ము శ్రీ గురుమూర్తిన్
నిక్కపు భక్తి భజించెద
నిక్కావ్యకళాకలాప మీడేరుటకున్ ॥

పాండురంగ మాహాత్మ్యము.

ఈ వెంకటాద్రి నరేంద్రుఁడు కామందక సప్తమాశ్వాసారంభమున నిట్లు సంబోధింతుఁడయ్యెను.

కం॥ శ్రీ మదహోబల నృహరి
స్వామి పునస్థాపన ప్రశస్త జయాంకా
రామపద భక్తివర వి
ద్యామహ కొండ్రాజు వెంకటాద్రి నరేంద్రా ॥

ఆం. కా. 7 ఆ. ప. 1.

అని యుండుటచే నీ వెంకట్రాజు అహోబలస్వామి భక్తుఁడై యాన్ృసింహ దేవాలయము నుద్ధరింపఁబ్రయత్నించి నట్లు తెలియ వచ్చుచున్నది. ఈ విషయమే రెట్టమతగ్రంథమునందును.

సీ॥ శ్రీమదహోబలస్వామిమహారాజ్య
రక్షకుం డగుచు నే రాజు వెలయు
నభిరామకామందకాఖ్య సత్కావ్యర
త్నమునకు నేరాజు నాథుఁడయ్యె
నెరయూరి పురవరాధీశాది బహుబిరు
దాంకుఁడై యేరాజు యశముగాంచె
జానకీ నాయక చరణ సంసేవన
ప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల

గీ॥ నతఁడు కొండ్రాజుతిమ్మభూపతివరేణ్య
తనయ పెదతిమ్మరాజవతంస గర్భ
వార్ధిచంద్రుండు సత్కులవర్ధనుండు
సతతవిభవుండు వెంకటక్ష్మావిభుండు ॥

అని కలదు.

ఈ వెంకట్రాజు అహోబలము నుద్ధరించె ననుటకు అహోబల మహాద్వారమున శాసనప్రమాణమున్నది.

"శుభమస్తు. శ్లో. దేవశ్రేణీశిరోరత్నం దైత్యద్విపఘటాంకుశమ్ !
జయతు శ్రీ నృసింహస్య దేవదేవస్య శాసనమ్ ॥



స్వస్తిశ్రీ జయాభ్యుదయశాలివాహనశకవర్షంబులు 1506 అగు నేటితారణ సం॥ వైశాఖశుద్ధ 14 శ్రీమద్రాజాధిరాజ రాజ పరమేశ్వర శ్రీవీర ప్రతాప శ్రీవీర శ్రీరంగరాయదేవమహారాయలు గారు పెనుగొండనగరమందు వజ్రసింహాసనారూఢులై పృథ్వీ సామ్రాజ్యము చేయుచుండఁగాను శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య సర్వతంత్రోభయ వేదాంతాచార్యులయిన శ్రీ శఠగోపజియ్యంగారి కార్యకర్తలయిన రాచప్పగారున్ను శ్రీ అహోబలస్థానం వారున్ను కాశ్యపగోత్ర ఆపస్తంబసూత్ర యజు శ్శాఖాధ్యాయులయిన సూర్యవంశోద్భవులయిన మూరురాయర బసవశంకర గుత్తిహన్నిబ్బరగండ యెరయూరి పురవరాధీశ్వరులయిన శ్రీ మన్మహామండలేశ్వర కొండ్రాజు తిమ్మరాజుగారి పౌత్రులయిన తిమ్మరాజు గారికి పుత్రులయిన వేంకటరాజు దేవమహారాజులుంగారికి యిచ్చిన శిలాశాసన క్రమ మెట్లన్నను, ప్రాక్ బహుధాన్యనామ సంవత్సరాన నిభరామ వారు హండేవారిని కూడుకొని సీమ యంతా రాచూరా పట్టి అహోబలస్థలానకు వచ్చి అహోబలం అంతా పాడుచేసి అహోబలస్థలం అయిదుఆరుఏండ్లు తమ వశంచేసుక ఆక్రమించి నడుస్తూవున్న నిమిత్తం శ్రీ అహోబలేశ్వరులు సన్యాసం ప్రసాదించిన ఆదిమమైన శఠగోప జియ్యంగారికి ఏడోతరమై శ్రీ పురుషోత్తమ ఆళ్వారుల ప్రతిష్ఠసేసి ముకుందదేవునిచేత పూజగొని రామానుజ దర్శనోద్ధారకులైన శ్రీ పరాంకుశ మహాముని శిష్యులయినటువంటి శ్రీ మచ్ఛఠకోపస్వామివారి స్థలం యీ తీరున అయిన నిమిత్తం శ్రీరంగరాయ దేవమహారాయుల సముఖాన తాము మనవిచేసి మీరు యీ తీరున రత్నసింహాసనారూఢులై వుండిన్ని మీకుల స్వామియైన అహోబలేశ్వరుని స్థలం తురకలు...."

ఈ శాసనములోని వేంకటరాజు దేవమహారాజులుంగారు మన కామందక కృతిపతి యగు వేంకటరాజే !

## ముద్రణము

తంజావూరు సరస్వతీ మహలులోఁ దప్పులమయముగాఁ దాటాకు ప్రతి యొకటియే కలదు. దానికి ప్రతివ్రాయించి తత్పుస్తక శాలాధికారులు మాకుఁ బంపిరి. మక్కికి మక్కిగావ్రాసిన వ్రాత యగుటచే దాని దిద్ది ముద్రణ మున కిచ్చుటకు సాధ్యము కాదయ్యెను. అందుకై ముద్రణార్థముగా అధిక

పరిశ్రమమున నవీన ముద్రణపు లిపిరీతి చొప్పున ఛందోగణయతిభ్రంశ రహితముగా వేఱొక ప్రతి వ్రాయింపవలసె. ఎట్లో ప్రతి వ్రాయించి సందిగ్ధ స్థలములను తంజావూరికిఁ బోయి మాతృకతో సరిచూసి దిద్ది యింకను దిద్దఁ గుదురని స్థలములను సంస్కృతమూలమునుజూచి పూరించియును, అందును గుదురనిదాని నుచితరీతిని క్రొత్తగా రచనముచేసియును గ్రంథమును బూరించితిని. తంజావూరి నుండి పుస్తకము నాకు వచ్చినదాదిగా నిట్లు ముద్రిత మగు నంతదాఁక జరిగిన నిర్వాహములో నాకు గుడిభుజమై నాసహోద్యోగి విద్వాన్ సాహిత్యశిరోమణి, చిరంజీవి పంగనామాల బాలకృష్ణ మూర్తి ఎమ్.ఏ.బి.ఒ.యల్. కడచిన వేసంగి సెలవులలో నాకెంతేని తోడ్పడెను. తంజావూరి సరస్వతీమహల్ పుస్తకాలయ కార్యదర్శి శ్రీ యస్ గోపాలన్ బి.ఏ. బి.యల్. గారును, నీ ముద్రణమును తిరుపతి రత్నాప్రెస్‌లోనే సాగించుటచే నా ప్రెస్‌వారును మాకుఁజాలఁగా ననుకూలించి యెంతేని తోడ్పడిరి. పైవారికి నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఈ కామందకకృతి యాంధ్రులయాదరము పడయఁ గలదని, తంజావూరి సరస్వతీమహల్ లైబ్రరీలోని యముద్రితాంధ్ర గ్రంథము లెల్ల సుముద్రితములై వెలయఁగల వని యాశించుచున్నాను.

తిరుపతి
1-8-50

వేటూరి ప్రభాకరశాస్త్రి.

(ఆంధ్రకామందకము
ఉపోద్ఘాతము
మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక బాండాగారము
1950 )

# సప్తపదులు - పీఠిక

(తిరుప్పావై యను ద్రవిడప్రబంధమునకు తెలుగుపాటలు)

ద్రవిడవైష్ణవులు వేదకల్పముగా నధ్యయనముచేయు నాలాయిరంలోనీ "తిరుప్పావై" యను ముప్పది పాశురముల గ్రంథమున్నది. ఇది ద్రవిడ దేశమందేకాక యాంధ్రదేశమందునుగూడ వైష్ణవులకు వాచో విధేయమై యుండును. అనుదినమును గీతోపనిషత్కల్పముగా దీనిని వారనుసంధానము చేయుచుందురు. అందును ధను (మార్గళి) ర్మాసమున నతిప్రధానముగాఁ జేయుదురు. విష్ణ్వాలయములందునుగూడ ధనుర్మాసమున దినమున కొక పాశురము (సీసపద్యమువంటి పద్యము)చొప్పున ముప్పది దినములు ముప్పదిపాశురములను దెలతెలవాఱకముందె యనుసంధించి స్వామి యారాధనము కావింతురు. చక్కెర పొంగళ్ళు, దధ్యోదనములు నారగింపులు పెట్టుదురు. పెరియాళ్వారని, పేరొందిన విష్ణుచిత్తుల పుత్రియగు నాండాళ్, (గోదా) దేవి ఈ కృతికి గర్త్రి. ఈమె చరిత్రము ప్రఖ్యాతాంధ్ర ప్రబంధమగు నాముక్తమాల్యదలో గొంతచూడఁదగును. ఆమె శ్రీరంగనాథస్వామినే వివాహమాడినదఁట! భగవద్గుణానుభవానంద పరవశయై యామె తన భర్త శ్రీరంగనాథస్వామియేయని వినోదించుచు లౌకికరీతిచే నవివాహితగానే యాయుష్కాలము గడపియుండవచ్చును.

## గ్రంథార్ధము

ఈ గ్రంథమునకు ద్రవిడభాషలోఁ బెక్కు వ్యాఖ్యానములున్నవి. "పెరియవాచ్చాం బిళ్లై" యను వ్యాఖ్యాత యిట్లు చెప్పినాడు. సర్వేశ్వరుఁడు లోకమునుద్ధరించుటకై గోకులమున శ్రీకృష్ణుఁడై యవతరించి పంచలక్ష కుటుంబముల నున్న గోపస్త్రీలను సౌందర్యగుణకర్మములచేత వశపఱచుకొని ప్రాప్తయౌవనుఁడై యానందమునఁ దేలుచుండెను. అట్లు యౌవనవిలాసముల నందుచున్న యువతులను శ్రీకృష్ణునిఁజూచి గోపవృద్ధులందఱునుగూడి " ధూర్తుఁడగు శ్రీకృష్ణుని కడకు స్త్రీలుపోఁగూడ"దని ప్రతిషేధించి వారి నిండ్లలో నడఁచి పట్టిరి. వారుచేసిన ఈ కృత్యము వల్ల వర్షములేదయ్యెను. అపుడు 'గోధనులగు గోపకులీయెద్దడికిఁ దాళఁజాలక వర్షార్థమై వ్రతమాచరింపను మనల నియోగింతురు. శ్రీకృష్ణుఁడు ఘటకుఁడు కాఁగలఁ'డని గోపకాంతలు

సంతసించిరి. అపాయము తప్పుటకై గోపవృద్ధులట్లే శ్రీకృష్ణుని ఘటకునిఁ గాఁగోరి స్త్రీల నాయనకప్పగించి నోమునోమఁగోరిరి. గోపవృద్ధులు వెడలిపోయినతర్వాత శ్రీకృష్ణుఁడు గోపికలచే నారాధితుఁడై "యిండ్లకుఁబోయి ఈ రాత్రి నిద్రించి వేగుజామున వచ్చి నన్ను నిద్రలేపవలసిన"దని వారి ననిపెను. శ్రీకృష్ణుఁడు నావిరహము నోర్వఁజాలక నీలాదేవి సౌధమున కరిగెను. ఆ స్త్రీలును పరస్పరసంశ్లేషము తోనిండ్ల కేఁగి యట నిదురపట్టకపోగా శ్రీకృష్ణునిస్మరించుచు మిగిలిన గోపికలఁగూడ నిదురలేపుకొనివచ్చిరి. శ్రీకృష్ణుని దర్శించిరి..." ఇత్యాదిగా.

కాని యీ 'పెరియవాచ్చాంబిళ్లై' చెప్పిన పై కథార్థమున కాధారమేదో కానరాదని మూ. రాఘవయ్యంగారు ప్రసిద్ధ ద్రవిడ విద్వాంసులు 'తిరుప్పావై' ని గూర్చి ద్రవిడమున వ్రాసిన యొకవ్యాసమున వ్రాసిరి. అందు వారు మఱియు గొన్ని విషయములఁ దెలపినారు. శ్రీభాగవతము సప్తమ స్కంధమున హేమంతర్తువులో గోపికలు కాత్యాయనీవ్రతమును చేయఁబూనినట్టును, తొలినాఁడు వారు నదీస్నానమునకుఁబోయి వలువలు దరినుంచి నీరాడుచుండఁగా శ్రీకృష్ణుడు వానిని హరించినట్టును గోపికావస్త్రాపహరణ కథాఘట్టమునఁ గానవచ్చుచున్నది. ఈ తిరుప్పావై గ్రంథమునఁ జెప్పఁ బడిన నోమా కాత్యాయనీవ్రతము కావచ్చునని వారనిరి. తిరుప్పావై పాశురములలో మకుటముగా గానవచ్చు "ఏలో రెంబావాయ్" అనుపదము బొమ్మ రూపునను్న స్త్రీ దేవతను జెప్పుచున్నదని వారు నిరూపించిరి. వైష్ణవులకు శ్రీకృష్ణైక శరణ్యత బలసిన తర్వాత కాత్యాయనీ వ్రతప్రస్తావము జాఱవిడువఁ బడి యుండవచ్చును. కావుననే 'పెరియవాచ్చాంబిళ్లై' ప్రభృతులు దాని బేర్కొన రయిరి. ఆ వ్రతము విష్ణు విషయకము, కాదనియు, శక్తి విషయకమే యనియు నిరూపించుట కింకొక యాధారమును వారు చూపిరి. వైష్ణవులకు వేదకల్పమగు నాలాయిరమున 'దిరుప్పావై' యున్నట్టు ద్రవిడ దేశమున శైవలకును వేదకల్ప మగు తిరువాచకమున (మాణిక్యవాచకర్ రచించినది) తిరువెంబావై యని యొకలఘు గ్రంథ మున్నది. అదియుఁ బరమశివునిఁ బడయుటకై ధనుర్మాసమునఁ జేయువ్రతము రీతిని దెలుపుచున్నది. శైవులును వైష్ణవులవలె ధనుర్మాసమున వేకువజాముననే నిద్రలేచి దాని ననుసంధానము చేయుదురట ! "మార్గళి



నీరాడేలో రెంబావాయ్" అని యందున్నది. ఇది తిరుప్పావైలో గూడ నున్నది. రెండు గ్రంథములందును విషయ సామ్యమున్నది. కావున, నీ వ్రతము శైవవైష్ణవ విభేదములు సాగక పూర్వము నుండియు నాచారముగా ధనుర్మాసమున ననుష్ఠింపఁబడు వ్రతముగాఁ దలఁపఁ దగినదగుచున్నది. కావుననే 'ఏలో రెంబావాయ్' అనునది యుభయులకు సామాన్యమయినది. ఈ వ్రతము కొంతమార్పుతో నేఁడును మళయాళ దేశమున ననుష్ఠింపఁబడు చున్నదఁట. అట్లనుటకు మళయాళ దేశమును గూర్చి యొకరు వ్రాసిన గ్రంథమునుండీ కొంతభాగము నుదాహరించిరి. మళయాళముననేకాక దక్షిణ భారతదేశమందెల్ల నీ వ్రతము కొన్ని మార్పులతో నిప్పటికిని గలదని నేననుకొనుచున్నాను. ధనుర్మాసమున దెలుఁగు దేశమున బాలికలు, తెల్లవారు జాముననే నిద్రలేచి గొబ్బెమ్మలను పేర గోమయముతో బొమ్మలు (ముద్దలు)గాఁ జేసి ముంగిళ్ళ ముగ్గులతోబెట్టి పూలతోనలంకరించి పూజింతురు.

సుబ్బీ గొబ్బెమ్మా సుఖము లియ్యావే
తామరపూవంటీ తమ్ముణ్ణియ్యావే
చేమంతి పూవంటి చెల్లెల్నియ్యావే,

ఇత్యాదిగాఁ బాటపాడుచుఁ బ్రార్థింతురు. ఇట్టి ప్రార్థనము తిరుప్పావై లోనుఁ గొంతగలదు. దక్షిణ భారతమం దంతటను సామాన్యమయిన యొక వ్రతము ననుసరించి ద్రావిడ వైష్ణవులు విష్ణుసంప్రార్థకమగు తిరుప్పావైని; ద్రావిడ శైవలు శివ సంప్రార్థనార్థకమగు తిరువెంబావైని గల్పించుకొని యుందురు.

## తెలుఁగుచేఁత

తిరుప్పావై ముప్పదిపాశురములును జక్కని కవితగలవిగా ద్రావిడులు చెప్పుదురు. ముద్దుపళని (రాధికాసాంత్వనకర్త్రి -వేశ్య) వానిని దెలిఁగించెను. అందుఁ 10 పాటలుమాత్రమే శైథిల్యముతోఁ దప్పులతో సప్తపదులను పేర ప్రాచ్యలిఖితపుస్తకశాలను దొరకియున్నవి. వానిఁజదివి సంతోషించి నేనాకృతిని సమగ్రముగా సంతరింతునుగాక యని

కుతూహలపడితిని. ద్రవిడభాషయందు నున్న తిరుప్పావై యర్థము వివరించి చెప్పుటకు బలువురను ద్రవిడపండితులనడిగితిని గాని వారు సులువుగా జెప్పఁ గుదురదనియు, నొక్కొక్క పాశురమున కనేకార్థములున్నవనియు, సంప్రదాయప్రకార మధ్యయనము చేయవలయుననియుఁ జెప్పిరి. ఇట్లుండఁ గానప్పుడు మన్మిత్రులును శశిలేఖాపత్రికాధిపతులు నగు శ్రీమాన్ గట్టుపల్లి శేషాచార్యులుగారు, తిరుప్పావై తెలుగుటీకతో గొప్పగా ముద్రించిరి. దాని దెప్పించుకొని చూచితిని విచిత్ర శతావధానీత్యాది బిరుదాంకితులును నలోకసామాన్య ప్రతిభాశాలురును నఖండవిద్వాంసులు నగు శ్రీపండిత, టి. లక్ష్మణాచార్యుల వారి యుపన్యాసముల ననుసరించి యది వ్రాయఁబడినది. దాని సాహాయ్యమున నేను సుఖముగా 20 పాశురములను దెలిఁగింప గలిగితిని. ఉపలబ్ధములైన ముద్దుపళని గ్రంథభాగమునఁ గల తప్పుల నెన్నింటినో దిద్దితిని. ఈ తెల్గురచనము అరవపాటలకు దెలుఁగున దండాన్వయము చెప్పినట్టుండు ననవచ్చును. మిక్కిలి స్వారస్యముగల యర్థవిశేషము లెన్నో లక్ష్మణాచార్యులు గారి యుపన్యాసములందుఁ గలవు. అవియెల్ల శేషాచార్యులుగారు ప్రకటించిన టీకలో మిక్కిలిచక్కగా సంఘటితములైనవి. తిరుప్పావై యర్థస్వారస్యముల నారయఁగోరు వారి కదితప్పక చదువతగినది. అది చదివి నేనెంతో ఆనందము చెందితిని. ఎంత తొందఱలో తెలిఁగించినను నేను శక్యమైనంతవఱ కాస్వారస్య విశేషములు తెలుఁగు గృతికిఁ గూడఁ దేఁజూచితిని. 27, 28, 29 పాశురములఁ దెలిఁ గించునప్పుడు పులకాంకితుఁడనయితిని. ఇఁక నా తెలుఁగు చేతలోని గుణదోషములకు సహృదయులు ప్రమాణము.

అశ్రద్ధతోఁ బ్రకటింపఁజూడకున్న నన్నుత్సాహపఱిచి తమ స్వధర్మ ప్రకాశినీపత్రికలో దీనిఁ బ్రకటింపఁజేసి పుస్తకములఁదీయించి యిచ్చిన మన్మిత్రులు బ్రహ్మశ్రీ కనుపర్తి. మార్కండేయశర్మగారి యెడఁగృతజ్ఞుఁడను.

వేటూరి ప్రభాకరశాస్త్రి

(పీఠిక
సప్తపదులు –ప్రథమ ముద్రణము
స్వధర్మ ప్రకాశిని నుండి పునర్ముద్రితము 1925 )

# శ్రీకృష్ణ భారతము

(ఆది –సభాపర్వములు)

–కవిరాజు శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి

(చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందలి పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పంపిన యభిప్రాయము)

శ్రీకృష్ణ భారతమున పర్వద్వయము పరికించితిని. పొగడ్త పొలము త్రొక్కక నా యుద్దేశము నెఱిఁగించుచున్నాఁడను. తెలిఁగింపు సంస్కృత గ్రంథమును జీర్ణించుకొని క్రొత్త వెలయించినట్లు తొట్రులేక నినుపారియున్నది. శైలియందు జీవధారగలదు. తెలిఁగింపునం దిట్టి మేటికూర్పు నేఁటి కవులకుఁ బెక్కురకు దక్కకున్నది. పద్య బాహుళ్యము గద్య వైరళ్యము హృద్యముగా నున్నది. గద్య స్థితియు నుచిత స్థలములందే పరిమితమై వినువు దోఁపింపకున్నది. నన్నయార్యునకు వలెనే యీ మహాగ్రంథ రచనమును నిర్వర్తించుటకు వలయు కుదిరిక లన్నియుఁ బర్యాప్తముగా నీకవివర్యులకుఁ గుదిరి యున్నవి. పాఠవైవిధ్య పర్యాకులితములగు సంస్కృత భారత ప్రతులుసూచి సాధుపాఠ నిర్ణయము సుదుష్కరముగా నూహించుచుండు వాఁడను. ఈ కవివర్యు లెట్టికష్టమునకుఁబాల్పడి కృతార్థులు కాఁగల్గు చున్నారోకదా! మహాభారత ప్రబంధమునిట్లు చక్కగాఁ బూరింప దొరఁకొన్న శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారికిని వారిని బ్రేరింప దొరఁకొన్న శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాద ప్రభువు నకును శాశ్వత కీర్తులు దొరికినవి.

పెదకళ్లేపల్లి
4-4-16 –వేటూరి ప్రభాకరశాస్త్రి

(చింతలపాటి వంటు జమీన్‌దారులు
శ్రీ రాజావాసిరెడ్డి శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాద్ బహదర్‌వారి
నామాంకితము
శ్రీమాహిష్మతీ ముద్రణశాలయందు ముద్రితము
ముక్త్యాల, 1916.)

# భోగేశ్వరమాహాత్మ్యము

**సత్యవత్యుపాఖ్యానము**

మల్లంపల్లి మల్లికార్జునకవి

## పండితాభిప్రాయము

"మీరు ముందు ముద్రించిన భోగేశ్వర మాహాత్మ్యమును, ఇప్పుడు ముద్రించుచున్న సత్యవత్యుపాఖ్యానమును చదివితిని. మన గురువులు శ్రీతిరుపతి వేంకటేశ్వరులు మెచ్చిన మీ కవితాధారను నేనును ప్రశంసించుట సిద్ధసాధనము. అక్లిష్టమై తేటగాఁ దియ్యగా మీ శైలి మేలిల్లుచున్నది. మీ గ్రంథములు లోకమున మంచివ్యాప్తిని బొందగలవు. శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల శిష్యులలో మీరొక రత్నము.

-వేటూరి ప్రభాకరశాస్త్రి

చెన్నపురి

సత్యవత్యుపాఖ్యానము - ఆంధ్రపత్రికా ముద్రాలయము
మద్రాసు (1919)
భోగేశ్వర మాహాత్మ్యము -బందరు సత్యసాధనీ ముద్రాశాల
ద్వితీయ ముద్రణ -1932

# కువలయానందసారము

ఉభయభాషా - సాహిత్య విద్యాప్రవీణ

బులుసు వేంకటరమణయ్య

## పండితాభిప్రాయము

బ్రహ్మశ్రీ బులుసు వేంకటరమణయ్యగారు రచించిన భాషా కువలయానందమునఁ గొన్ని పట్టులు చదివితిని. అది సంస్కృత గ్రంథము నకుఁ దగిన తెలుఁగుచేఁతగా నున్నది. అలంకార లక్షణములను వీరు స్వయము పద్యరూపమున పరివర్తించి లక్ష్యములను ప్రశస్తములయిన ప్రాచీనాధుని కాంధ్ర ప్రబంధముల నుండి చాల వఱకు సేకరించి చేర్చిరి. ఇట్లుచేయుటచే వివిధములగు ప్రాచీనాధునికాంధ్ర కవుల కవితా ప్రభేదములను జక్కగాఁ బాఠకులు చవి చూడఁ గల్గుదురు. ఈ గ్రంథము శీఘ్రముగా ముద్రితమై వెలయుఁగాకయని కోరుచున్నాను. ఇది ఆంధ్ర విద్వత్పరీక్షార్థులకును, విద్వాంసులకును బహూపకారకము. అలంకారశాస్త్ర గ్రంథము లిప్పుడిప్పుడే తెలుఁగున వెలయుచున్నవి. అందిది ముఖ్యమైన గ్రంథము. సరసముగాను స్పష్టముగాను ఈ పరివర్తనమున్నది. వీరింకను మఱికొన్ని అలంకారశాస్త్ర గ్రంథములను తెలిఁగించి ఆంధ్ర సాహిత్యోన్నతికి తోడ్పడుదురుగాక అని కోరుచున్నాను.

మదరాసు,
20-7-33. - వేటూరి ప్రభాకరశాస్త్రి

సంస్కృతమూలం - అప్పయ్యదీక్షితుల కువలయానందం
గ్రంథం - కువలయానందసారము
కర్త - బులుసు వేంకటరమణయ్య
ప్రకాశకులు - ఆర్. వేంకటేశ్వర్ అండ్ కం.
లోన్ స్క్వేర్, మద్రాసు -1
ప్రథమ ముద్రణ - 1934 ముద్రణ - ద్వితీయ ముద్రణ- 1972
ఫ్రీడమ్ ప్రెస్, మద్రాసు -21
విక్రేతలు - ప్రసాద్ అండ్ కో.
అండర్సన్ స్ట్రీట్, మద్రాసు-1

# హంస సందేశము

మోచర్ల రామకృష్ణయ్య

## తొలి పలుకు

నేటి నెల్లూరి యువకవివర్యులలో శ్రీమోచర్ల రామకృష్ణయ్యగారు ముఖ్యులు. వారి గంగాలహర్యాది రచనలను నేనవ్వారిగా మెచ్చుకొను చుందును.

వారిప్పుడు క్రొత్తగా రచించిన 'హంస సందేశము' గూడ – అది శ్రీ వేదాంత దేశికుల వారి సంస్కృత కృతికి తెలుగుసేత – నాకుఁ గడు వేడుకఁ గొల్పినది.

తెలుగున శ్రీనాథునట్లు సంస్కృతమున దేశికుల వారు తమ కృతు లలో సౌశబ్ద్యమునకును, శయ్యా సౌభాగ్యమునకును హెచ్చుగా ముచ్చట పడిరి. వారి కావ్యములు కొన్ని కాళిదాసకావ్యముల యనుకరణములు సాజముగానే అనుకర్త్యానుకరణములకు జాతిరత్నములకు పోఁత రత్నములకు నున్నంత యంతర ముండును. సప్రయోజన సరస మృదుపద విన్యాసముతో భావము పిక్కటిల్లునట్లు సాగిన కాళిదాస రచనములకును చటుల మృదంగ ధ్వని సంవాదియగు శబ్దానుసంధానముతో నున్న దేశికుల కృతులకును కుడి యెడమ వాసి యుండుననుట అసత్యోక్తి కాదు. ఆపాత మధురమగు శయ్యాసౌభాగ్యముతో నున్న దేశికుల కృతిని హంస సందేశమును తెలుగున రసమయముగా వెలయించుట దుష్కరము. మేఘసందేశాంధ్రీకరణమునఁ గవికి లభించు వస్తు పౌష్కల్యము, రచనా సుఖము దీన దొరకదు.

అయినను శ్రీ రామకృష్ణయ్యగారు తమ తెల్గుకూర్పునఁ జాల స్వాతంత్ర్యపు నేర్పుఁజూపిరి. తెలుఁగుసేత పెక్కుపట్టులఁజాల జక్కగా నున్నది. 'మక్కికి మక్కి' తెలిగింపున నింత హృద్యతయేర్పడదు. ఈ గ్రంథమును బూర్వము విద్వానభినవ పండితరాయేత్యాది బిరుదాకింతులు శ్రీ మాడభూషి వేంకటాచార్యులవారు సరసముగా దెలిగించిరి. కాని, యది యొక శ్లోకమున



కొకపద్యము చొప్పున సరాసరిగా సాగిన తెలిగింపు. ఇంక నిటీవల కొందఱెవరో కూడ దెలిగించినట్లు చూచినట్లు స్మరణలు. నాచూచిన రచనలలో శ్రీ రామకృష్ణయ్యగారి రచనమే చతురతరముగా నున్న దనగలను. ఇందుకు ప్రధానకారణము మూలచ్ఛాయానుసారిగా కవి కైకొన్న రచనాస్వాతంత్ర్య మనదగును.

రామకృష్ణకవిగారు తెల్గుకూర్పున జూపిన స్వాతంత్ర్యపు నేర్పు నీ క్రింది శ్లోకపు దెలుగు సేతను బట్టి స్థాలీపులాక న్యాయముగ గుర్తింపనగును.

శ్లో॥ సా మే దృష్టి శ్శఫరనయనా సన్నత భ్రూస్సుకేశీ
తన్వీ తుంగస్తనభరనతా తప్తజాంబూనదాభా
బాలా యుష్మత్ప్రతిమగమనా వేదిమధ్యా పరాంగీ
శృంగారాఖ్యం నిధిమధిగతా శ్రేయసీ దేవతేన.

సీ॥ బేడిస కనుల పూబోడి నీ పోడిమి
గమన విలాసములు గల నెలంత
కాంత కుంతల పాశకలిత లావణ్యాబ్ధి
యాగవేది సమానావలగ్న
పుటపాక శోధిత స్ఫుట సువర్ణ సవర్ణ
సన్నత భ్రూలతా సాధువదన
శృంగార నిధి నధిష్ఠించిన దేవత
భాసురగాత్రి సౌభాగ్య లక్ష్మి

గీ॥ జనక భూజాని తనయ యక్షయ వివేక
నిలయ వెలలేని కలిమి, నా యెలమి చెలిమి
కలుష మెఱుగని రూపు నా కంటి చూపు
అయ్యశోక వనీసీమ నరయు మయ్య !

పయి శ్లోకమున కీ తెలిగింపు లలిత లలితము జతురతరము మనోహరము నయియున్నది. నేను సరిపోల్చి చూచిన పట్టెల్ల నిట్లెయున్నవి.

సంస్కృత గ్రంథములనంటి యింతదాక బెంపారుచున్న తమ కవితా వల్లికల నికమీద శ్రీరామకృష్ణకవిగారు స్వతంత్రకృతులను పొదరిండ్లుగా మలపి గుబురుకొల్పి రసిక విహార వసతుల నెసగింతురు గాక !

మద్రాసు,
4-10-1930 వేటూరి ప్రభాకరశాస్త్రి.

(ప్రమాది -విజయదశమి
ప్రభాత ముద్రణాలయము
హంససందేశము - శ్రీమద్వేదాంతదేశికుల
కృతికి ఆంధ్రీకృతి)

# శ్రీవావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రి అభినందన గ్రంథము

## సందేశము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, ఓరియంటల్ ఇన్స్టిట్యూటు

**తిరుపతి**

“ముప్పదియేండ్ల నుండి శ్రీ శాస్త్రులుగారిని నేనెఱుఁగుదును. వారి తండ్రిగారు పెక్కేండ్లు సమధిక చాతుర్యముతో సాగించిన పుస్తకవ్యాపారము వారి యనంతరము యథాయథలు కాఁగా బాలకులయ్యును, నానాఁడు శ్రీ శాస్త్రులుగా రల్పారంభముగా మరల నుపక్రమించి పిత్ర్యమగు గ్రంథ వ్యాపారమును క్రమ క్రమముగా బెంపొందించిరి. ఈశ్వర కృపవారి నేర్పునకు, దోడు కాఁగాఁ గడచిన యుద్ధమున వారి వ్యాపారము మిక్కిలి పెంపొందినది. ఒడుదుడుకులు సోకనీకుండ నిర్వక్రముగా వ్యాపారము సాగింపగల చాక చక్యమున్ను జాగ్రత్తయు, వ్యాపార విషయములందంతగా జాగ్రత్త వహింపక పోయినను శ్రీ నాగేశ్వరరావుగా రీశ్వరానుగ్రహమున సంకల్పించిన సర్వకార్యములను నిర్వర్తింప గలవారై మహైశ్వర్య మహితులయిరి. శ్రీ శాస్త్రులు గారీశ్వరానుగ్రహముతో వ్యాపారనైపుణియుఁ గలవారై ధనము వమ్ముపోనీక జాగ్రత్తగా మెలఁగుచు గవుల సంపదలఁ బడిసిరి. శ్రీ నాగేశ్వరరావు గారివలె వీరును ననేక ధర్మ కార్యములకు ధనసాహాయ్యము జరపుట యెల్లరు వినుచున్న విషయమే. అనేక సంస్కృతాంధ్ర గ్రంథములు శ్రీ శాస్త్రులుగారు ప్రకటించిరి. సమర్థులగు గ్రంథవిక్రేతలిట్టివారు వర్ధిల్లుటచే ఆంధ్రదేశమున ప్రశస్త గ్రంథ ప్రకటనము సాగినది. ఆంధ్రదేశమున కీ విధముగా వీరు చాల మేలు చేసిరి. “త్రిలింగ” యని తెలుగు పత్రికను వీరు ప్రకటించుచున్నారు. పెక్కేండ్లకు ముందు దానిని జూచితిని. అదికూడ సనాతన పత్రికయై దేశమునకుపకారము జరపుచున్నది. ఆంధ్రదేశమున కింకను చిరకాలము శ్రీ శాస్త్రులుగా రుపకార కులుగా వెలయుదురుగాక !

(పుటలు 706 -707
వావిళ్ళ ప్రెస్సు, చెన్నపురి, 1941 )

# శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావు గారికి వేటూరి వారి లేఖ

" నా వాఙ్మయ మిత్రులు" అనే గ్రంథంలో శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారిని గురించి వ్రాస్తూ శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావుగారు శాస్త్రిగారి ఒక లేఖను ఉటంకించారు. అది ఈ క్రింది విధంగా వుంది.

"శాస్త్రిగారు భాండాగారోద్యోగం నుండి 1940 లో పింఛినీ పుచ్చుకొన్నారు. నేను 1941లో ఏలూరులో ఉంటూన్నప్పుడు నా పుస్తకమొక దానికి, వారిని పీఠికను వ్రాయమని కోరుతూ లేఖలను వ్రాసేను. దానికి ఇట్లు జవాబును ఇచ్చేరు.

తిరుపతి
24-4-41

అయ్యా !

మీ కార్డులు చేరినవి. నేను గ్రామైక రాత్రముగా సంచారమున ఉన్నాను. వారం రోజులలో ఏలూరు రాగలను. ఈ లోగా మీరు ముద్రిత గ్రంథ భాగము పంపుట, అది నాకు అందుట, అసంభవము. నేను ఏలూరు వచ్చుట చి॥ శేషాచార్లుగారు యమ్‌బిబియస్. అనువారికి, దామరాజు వెంకట్రావు అనువారికి తెలియ గలదు. మార్చి (?) 4,5 తేదీలలో రాగలను అంతదాక మీరాగ గలిగితే, నే నక్కడికి వచ్చినపుడు మీరు మీ గ్రంథము నిచ్చినపుడు, మీరు కోరిన తీరున యగును.

వే.ప్రభాకరశాస్త్రి

" కాని వారు ఏలూరు రాకపోవడం చేత, విధిలేక ఆ పనిని మరొకరి చేత చేయించవలసి వచ్చిందని చెప్పడానికి విచారిస్తున్నాను."

(పుట. - 242)
చిత్తూరు, 1966

# శ్రీ శివ భారతము

గడియారము వేంకటశేషశాస్త్రి

## అభిప్రాయము

మీ 'శివ భారతము' చేకొంటిని..... ఎడనెడ కొంత మాత్రమే చదువ శక్తుడనైనాను. దివ్యశయ్య, సౌశబ్ద్యమూ రసపుష్టి నిండార్లుగా ప్రవహించిన మీ కవితావాహినిలో నే నింతకుముందెన్నడు అవగాహించి యెఱుఁగని వాడనగుట నన్ను నా నాలుక కొఱికించినది. ఇంతటి చక్కని నిర్దుష్ట రచన నేర్చిన మిమ్ము నే నింతకుముం దెఱుఁగననగా, నా యెఱుక యెంతటి దన్నమాట ! మీ గ్రంథము చదివి చాలతనిసితిని..... శివాజీ మహనీయ చరితము వీరరసభరితము. దానిని మీరు రసానుగుణశయ్యతో తెలుఁగున రచించితిరి. మీ రచనకు జోహారులు.

తిరుపతి
1943.

వేటూరి ప్రభాకరశాస్త్రి

(కావ్యము - శ్రీ శివ భారతము (శివాజీ ప్రబంధము)
కవి - గడియారము వేంకటశేష శాస్త్రి
ముద్రణ - ప్రథమ ముద్రణ - 1943
శ్రీ జానకీ ముద్రాక్షరశాల, ప్రొద్దుటూరు.)

# శ్రీ రాజశేఖర శతావధాని
# రాణాప్రతాపసింహ చరిత్ర
# సమీక్ష

పదునైదేండ్ల కింకను బై పడిన కాలమే యయియుండును. రవీంద్రనాథ ఠాగోరు కవీశ్వరు లాంధ్ర దేశమున కరుగుదేరగా వారికి గాను –ప్రొద్దుటూర శ్రీ రాజశేఖర శతావధానిగారు రచించిన సన్మాన పత్రమని "ఆంధ్రపత్రిక" లో నొక వచన రచనము ప్రకటితముకాగాఁ జదివితిని. అదియు మహాకవి కర్పించుట జరుగలేదేమో? అది చిన్న వచనపుఁ గూర్పే: అయినను భావోన్మేషము మహనీయమై – వినియుండినచో "టాగోరు కవి" తనిసి తన్నుఁబోలిన వాడవని తద్రచయిత నభినందించి యుండును సుమాయని యనిపించినది. ఎన్నేండ్లో కడచెను. నాటికీనాడు మరల నా కవియే రచించిన "రాణా ప్రతాపసింహ చరిత్ర" మను నిర్వచన మహాకావ్యమును జదివితిని. అది చదువునప్పుడు కవిగారికి, అవకాశము కలిగించుకొని విపులముగాఁ దద్గ్రంథ సమీక్షఁ గావింపఁగలవాఁడనని మాటయిచ్చితిని. ఆ గ్రంథమును గూర్చి యంతకుఁ బూర్వమే, నాకు గురువర్యులగు శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారును, మిత్రులగు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారును రచించి ప్రకటించిన సమీక్షల నటుతర్వాతనే చూచితిని. అచ్చముగా నేను వారి అభిప్రాయముల ననుమతించువాడనే యని వ్రాయవచ్చు ననుకొంటిని గాని, యా మాట సహృదయులెల్లరు నైకకంఠ్యముగా నంగీకరించునదే కాన యది వ్రాయుట యేలని, గుణవంతమైన సత్కృతిని గొండాడుట మేలని, కవికది యింకను సత్కావ్య రచనకు సముత్సాహ జనకము కాఁబోలునని, చర్విత చర్వణము కాకుండ నెందఱేని కావింపఁదగినంత ప్రశంసా సామగ్రి కలదియే కదా గ్రంథమని, యిచ్చినమాట చెల్లించుకొన నే పూనితిని ఇక్కడ నింకొక్కమాట.

"ప్రతాప చరిత్రము" నాకు వచ్చిన కొలది నాళ్ళకే–వారి యూర నుండియే శ్రీ శేషశాస్త్రిగారు – సుకవివర్యు లింకొకరు తాము రచించిన "శివ భారతము"ను గూడ సమీక్షార్థము నాకుఁ బంపిరి. వీరిర్వునొక యూరనే వర్తిల్లి, యొకపేరనే కవితలు రచించుచు శతావధానములు చేయుచు కొంత



కాలమైక్యముతో వర్తిల్లిరట. కావున నీ రెండు గ్రంథములు నొక కొమ్మనే పూచిన రెండు పూవు లనఁదగినవి. కవితా రచనలో నీ యిర్వురును గలసిన నొక్కడైన సవ్యసాచి. ఒకరు కుడిచేయి. ఇంకొక రెడమ చేయి. సవ్యసాచి రెండు చేతులు సమవాటముగలవే యటకదా! కుడిచేయికంటె నెడమచేయి మఱీవాటము గలదనియు నొక భారతపాఠమున్నది. వీరిర్వురు గలసిన నొక సవ్యసాచి యగుట వింతకాదు. వీరిర్వురు వేర్వేరుగా నున్నను గూడ సవ్యసాచులే! యగుటను వేఱ్వేఱ రచించిన యీ రెండు గ్రంథములును సమర్థించుచున్నవి. వీరిరువురును గుడి యెడమ చేతుల వ్రేల్మిడితో వడివడిగా బొంగరములఁ బోలెఁ బద్యముల విసరగలరు. వీరి పద్యముల నడక బొంగరముల వోలె వాలువాటములు కలది. మఱొకమాద్రిగా నుల్లేఖించుచో వీరి పద్యములెల్ల నాస్వాద్యములో నుత్తరదేశపు రస గోళములు (రసగుల్లాలు). శ్రీరాజశేఖర కవిగారి రచన అచ్చము బమ్మెర పోతనగారి సరస రచనపుఁ గమ్మఁదనపు సారాంశము. శ్రీశేషశాస్త్రిగారి రచనము చిదిమి పుచ్చుకున్న శ్రీనాథుని రచనపు జిగిబిగి. పోతరాజుగారికి శ్రీకృష్ణదేవుని వర్ణనమందెంత ముచ్చటో రాజశేఖర కవిగారికీ ప్రతాపదేవుని వర్ణనమందంతట ముచ్చట. రామాయణమున శ్రీరామునితో సమశ్రేణిలో నిలుచు ధీరోదాత్త నాయకుడు ప్రతాపసింహ చరిత్రమున ప్రతాపసింహుడు. రామాయణమునకు ఉత్తర రామాయణమువలె వీరిర్వుర రచనములును మొత్తమున భారతమున కుత్తర భారతములు. రాణాప్రతాపసింహ చరిత్రము, శివభారతము రెండును గల సినచోఁ బదునాఱు పదునేడు శతాబ్దుల దాక నుత్తర భారతవర్ష చరిత్ర మేర్పడును. రాజపుత్ర వంశమున వీరాధివీరుడై వెలసిన రాణాప్రతాప సింహుని చరిత్రమొక గ్రంథమునను, పురాణములు కలియుగము కడతేర్చు నవతారముగా ప్రశంసించిన కల్కిమూర్తియే యనఁదగిన శివాజీ చరిత్రము వేఱొక గ్రంథమునను, వర్ణితములయినవి. శివాజీ యశ్వారోహము, యవన నిగ్రహము మొదలగు యోగ్యతలు పోల్చిచూచినచో నాతడు కల్కిమూర్తియే కాఁదగు ననుపించును. ఈ రెండు గ్రంథములు గలసి యుత్తర భారతమ గుననుచో నుత్తరదేశపు భారత మనియు నర్థాంతరము. ఏలన దక్షిణ దేశపు మహావీరుల చరిత్రమిందుఁ జేరలేదు. ఇర్వుర రచనల మొత్తమగు నీ ఉత్తరభారత

మీ యిరువదవ శతాబ్దిలో నగ్రగణ్యమని చెప్పుట ప్రస్తుత గ్రంథము నుత్కర్షించుటకాదు.

ఏతత్కవిద్వయము, ఈ నడుమ వేఱువాసి యీ రెండు గ్రంథములను బరస్పర నిస్సహాయముగానే రచియించిరి. అయినను రెండు గ్రంథములును వారి ఏకీభావమునే సమర్థించుచున్నవి. కాన, యేకీకరించియే నేనింతదాక వ్యవహరించినాను. తథ్యముగా మరల వారిఁక మీఁదఁగూడ నట్లతనరఁ గల్గుదురుగాక! ఇందు ముందు ప్రతాప చరిత్రమును పృథక్కరించి సమీక్షింతును.

## ప్రతాపచరిత్రము

రాణా ప్రతాపసింహుడు ఉత్తర హిందూదేశమున రాజపుత్ర స్థానపు టుదయపురమున రాజ్యాభిషిక్తుడై, యక్బరు సామ్రాజ్య చ్ఛత్రచ్ఛాయ క్రింద నడఁగి యుండ నొల్లక యిర్వదియైదేం డ్లరణ్యములపాలై కడగండ్ల గుడుచుచు, గడ్డిరొట్టెలు తినుచు, స్వాతంత్ర్య తపస్సు గావించి కడకు కాంక్షిత సిద్ధి నందిన రవివంశపు రాజర్షి. ఏతచ్చరిత్రము నభివర్ణించిన శ్రీరాజశేఖర కవిగారు దక్షిణ హిందూదేశపు పశ్చిమాంధ్ర భాగమున నుదయపురమునకు, దెలుగు పేరగు 'ప్రొద్దుటూర' నుత్తమ బ్రాహ్మణ వంశమున జనించి పదునైందేడ్ల కాలమట! ప్రతాపసింహునే లక్షీకరించుకొని , యనుధ్యానించి తజ్జీవితచర్యలఁ దనలో జీర్ణించుకొని తన్మయీభవించి, యతడే తానై కవితా తపస్సు గావించి, కావ్యరూపతపఃఫలమును బడసిన బ్రహ్మర్షి. 'నా నృషిః కురుతే కావ్యమ్' అని కదా యార్యోక్తి.

"రాణా ప్రతాపచరిత్రము" సర్వలక్షణ సంపన్నమయిన సత్కావ్యము అష్టాదశ వర్ణనల యాచారపుఁ జాదస్త (చాందసత్వ) మిందు గానరాదు. ఆత్మస్వాతంత్ర్య మర్థించువారు స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు నెల్లరు నుల్లాసములతో నుద్బోధలాభముతో జదువఁదగిన దివ్యకావ్యమిది. ఇందు ప్రథమాశ్వాసమునఁ దొలి యిన్నూరు పద్యముల కావ్యభాగమున(అంతకింకను కథానాయిక చరిత్రోపక్రమము కాలేదు) సంయుక్త, పద్మిని. హమీరసింహుడు, మీరాబాయి, కుంభరాణా, చిత్తూరు యుద్ధము, పున్నాహమీదా, అగ్బరు,



పుత్త- ఇత్యాదుల వీరకథాంశములు వజ్ర కందళములు వోలె దివ్యజ్వాలలతోఁ దేజరిల్లుచున్నవి. పయి గ్రంథభాగ మనేక సత్కావ్య వస్తువుల కూటపట్టు ! ఉత్తమగుణ నాయక రత్నభూషితమైన దివ్యహారము. ఇఁక కథాప్రధాన నాయకుఁడగు ప్రతాపసింహుని చరిత్రాంశమునకువత్తును.

రాణా ప్రతాపుఁడు నేటికి నన్నూరేండ్లకు ముందు వర్తిల్లిన వాడగు టచేఁ దచ్చరిత్ర రచనమునఁ గవికి పౌరాణికులగు రామాదుల చరిత్రము లందు వోలె రసపుష్టికై యిచ్చ చొప్పునఁ గథా కల్పనము గావింపననువు పడదు. వాల్మీకి వ్యాసాదులు రచించిన పురాణములను, అందలి యుపాఖ్యాన ములను, దెలిగించుచోఁ బ్రబంధీకరించుచోఁ గథాంశములందు నన్నయ పెద్దనాదులు, కొంతకుఁ గొంతగా నింకనెంతైనఁ గూడ స్వాతంత్ర్యము సాగించు కొనిరి. ఆయాకథలు కూడఁ బురాణ భేదములచే వైవిధ్యముతో నున్నవి గాన వారి స్వాతంత్ర్యము కొంత సమర్థనీయ మయ్యెను. ఇఁక నితివృత్తము కల్పితమే యగుచోఁ గవి సర్వస్వతంత్రుడే యగునుగాన దానఁ జిక్కుండదు. ఇతివృత్తము వాస్తవ చరిత్రాంశమయి, మఱియు నాతి చిరకాల ప్రవృత్తమయి విస్పష్టముగా, విస్తృతముగాఁ జరిత్ర గ్రంథ నిరూపితమయి యుండునప్పుడు కవి దానిని విచ్చలవిడిగా నిచ్చకు వచ్చినట్లు మార్చి వేయఁగూడదు. ఏవో పరమార్థములు గర్భితము లయియున్నను, గవితా పరికరములు ప్రాయికముగాఁ గవి స్వేచ్ఛా కల్పితముల గావించుట సత్యచరిత్రార్థములందు సముచితము కాదు. అట్లగునేని దాని కవిత యనిపించుకొనదన్న వెఱపు చేతఁ గాబోలును నేఁటి సత్కవు లధికముగా నర్వాచీనుల చరిత్రములను గావ్యవస్తువులుగా గయికొనకున్నారు. కవి తానూహించి జక్కదిద్దనక్కఱలేని తీరున- సచ్చరిత్ర సంవిధాన సౌభాగ్యముగల చరిత్ర పురుషులను -బుద్ధుడు, జీసను, గాంధి వంటి వారిని నాయకులుగాఁ గయికొన్నచో, గవికందు తథ్యానుకరణమే, రచన శ్రుతి కలసిన యనుసరణమే కర్తవ్యమగును. అసలు వస్తువే కవితా శిల్పపరాకాష్ఠలో వెలసినపుడు, కవి, కవితా కల్పన లల్లబోవుచో నెందేని దాని సౌందర్యమును జెడగొట్టువాఁడు కూడా కావచ్చును.

సరియయిన స్పష్టమయిన ఫోటోగల చరిత్ర ప్రసిద్ధ పురుషునిఁ జిత్రించుచోఁ జిత్రకారునికెంతో కవికినంతే స్వాతంత్ర్యముండును. చిత్రకా

రుడా చిత్రమూర్తికి విగ్రహ పరివేషమును వింతగాఁ గొంత సంతన పఱుప వచ్చును. శయ్యాసన గమనాదులలో ననుగుణమైన యెయ్యారము గూర్పవచ్చును. కవియు వర్ణ్యుని జీవిత కథాంశముల తత్త్వమును గమనించి తార్మాఱు కాకుండఁ బూర్వోత్తరముల సరిపఱిచి సందర్భింపఁ జేయవచ్చును. వాని కనుగుణమైన పరిసరములఁ బొసగింపవచ్చును. అంతేకాని వానిచరిత్ర శరీరమునే తార్మారు చేయ వీలుపడదు. మఱియునతడు తన కాలపువి, తన తలపులోనివియునగు వాని నాచారవ్యవహారములను, గుణదోష నిర్ణయము లను వర్ణ్యునిలో నసందర్భముగా ననుగతపఱుపఁగూడదు. జీససు రూప చిత్రరచనలో శుభ్రానర్ఘ్య వస్త్రకల్పనమును, శిరోజముల క్రాపు తీర్పును దూష్యములని హెచ్ జి వెల్స్ పరిహసించెనట. ప్రతాపుని జీవిత చర్యయను బంగారు నగను తననాటి యుక్తాయుక్త వివేక కల్పనపుఁ డంకపుఁ బొళ్ళతో నదికి వన్నె మార్పక కవి తానును తన్మయుడగుటచే నదుకులు లేని యచ్చ బంగారుననే నిర్మించె ననుకొందును. పూర్వమెప్పుడో చదివిన శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహకవిగారి "రాజస్థాన కథావళి" నిప్పుడు మరలఁజూచితినిగాని దానిలోని విషయమున కంటె నిందెంతో అధికముగాఁ గథావస్తువున్నది. ఇది తన్మూలకమేయనుట కెడనెడ కవిగారు ఫుట్‌నోట్‌తో ఇంగ్లీషు గ్రంథ ప్రమాణములఁ గూడ నుదాహరించుచు వచ్చిరి. శ్రీ లక్ష్మీనరసింహకవిగారి గ్రంథము టాడ్‌దొరగారి గ్రంథమునకే సంగ్రహానువాదము కాబోలును. కవి యిందేవేని కొనిపట్టులఁ గథావస్తువును గూడ మార్చెనేమో యిదమిత్థమని నిరూపింపఁజాలను.

పట్టాభిషేకానంతరము ప్రతాపసింహుని వేఁటలో నొక వనవరాహము ప్రతాపసూక్త సింహుల యేటులకుఁ బడుటయు, అది నా దెబ్బకే, నాదెబ్బకే యని యాయన్నదమ్ము లిర్వురును దగవులురేచుకొని ద్వంద్వయుద్ధమున కుపక్రమించుటయు, దాని నెవ్వరు నాపఁజాలకుండుటయు, వేటఁజూడ వెంటవచ్చిన పురోహితుడు హరభట్టారకుడు హితముపదేశించుచు

"మంచియు చెడ్డయుం దెలుపు మాన్యులులేరు, గతించెఁ దండ్రి; ప్రా
పంచక పద్ధతుల్ తెలియు ప్రాయముగాదిఁక రాజ్యమెంతొ భా



రాంచితమౌ; రిపుల్ బలియు; రాహవమర్హముగాదు, మిమ్ముఁ బ్రా
ర్థించెదఁ దండ్రులార! వినరే! గురువాక్యము మీఱరాదనన్

సూక్తసింహుని ప్రత్యుక్తి :–

అపజయమొ లేక జయమొ యిష్టందఁగోరి
చావు బ్రతుకుల నున్నాము మీవచించు
చప్పనగు మాట లూఁకొట్ట మొప్పఁబోవ
మేమిటికిఁ గష్టపడగ ! నింకేల వగవ.

తనదౌ శక్తికి మీఱు కార్యములకున్ దార్కొన్నచో ముప్పు వ
చ్చును; మా యిర్వురలోన నొక్కడు రణక్షోణిన్ మృతిన్ గన్న మీ
రును రావచ్చును నేడ్వవచ్చు మఱిఁ బౌరోహిత్యమున్ జేయవ
చ్చును! లబ్ధిన్ గొనవచ్చు, నిప్పుచనవచ్చున్ దాఁటి దూరమ్ముగన్.,

అనినంత గత్యంతరముగానరాక హరభట్టారకుడు ఖడ్గముతోఁ దనఱొమ్ము చీల్చుకొని మృతుఁడగుటయు నంతలోఁ దగవు తీరుటయుఁ గల కథాఘట్టముఁ జదువునపుడు నేను చాల వెన్నబడితిని. ధీరోదాత్తుడగు నాయకుఁడుగా నుండవలసిన ప్రతాపునకింత మూర్ఖపుఁ బట్టుదలయేల! పందినేసినవాఁడు తమ్ముడే యేల కాఁగూడదు. క్షణికమైన యీ యుద్రిక్త వ్యవహృతిలో స్పష్టపరిజ్ఞానము దుర్ఘటముగదా! తాకిన దెవరిదో ! తప్పినదెవ రిదో ! తనయంత పట్టుదలతోను దమ్ముఁడును వాదాడుచున్నాఁడుకదా వ్యవహారౌచితి నేని చూడవలదా! మహనీయుఁడైన పురోహితునిఁ జంపుకొ నుట, పరాక్రమశాలియయిన తమ్ముని తెగఁద్రెంచుకొని శత్రుపక్షమునఁ జేరఁ నడచుట; ఇదియేమినేరిమి. ఇస్సీ! యనుకొంటిని. అన్నను విడనాడి వెడలి పోయిన సూక్తసింహుడు తన యన్న మరలఁగొన్నియేండ్లకు అక్బరు సైన్యము తోడి మహాయుద్ధమున శత్రువులఁ జెక్కుముక్కలుచేసియు, యుద్ధ పరాఙ్ము ఖుఁడై యశ్వైకసహాయుఁడై పరుగువాఱుచుండగా వెంబడించి చేరఁబోయి శరణాగతుఁడై యానాడు వేఁటలో వంచకుఁడై తాను వాదనకుఁ జొచ్చుటను, పంది సేసినది తానుగాక పోవుటను వ్యక్తపఱచిన ఘట్టము చదువునపుడు నేను బులకిత శరీరుఁడనై కన్నుల నశ్రుకణములు దొరుగగా విస్మయము

చెందితిని. ఈ పరిణామమును దొలుతనే కవి సూచించినచో నీ యద్భుతరస నిర్వాహము పొసగదుగదా! ప్రతాపుని సత్యదీక్ష తెలియరాదుగదా! ఇట్లు నాటకము నందుఁ బోలె నద్భుత రసనిర్వాహ మీ గ్రంథమునఁ బెక్కు పట్టులఁ గలదు. ఇట్టిపట్టుల సమకూర్చుటలోఁ గవికల్పనా కౌశలము చాలఁగా పనిగొని యుండవచ్చును. ప్రతాపసింహుడు దౌర్భాగ్యమయుఁడై విజయాశ వీడి, యనుచరులతోఁ గూడి, పిడికెడు మాతృదేశపు మృత్తికను దలమీద ధరించి దేశాంతరములకుఁ బయనము సాగింపఁబూనినప్పుడు పర్షియానుండి భామాసాహియను ప్రాచీన మంత్రి వచ్చి పర్యాప్తమైన ధనమొసఁగి, యుద్ధమునకు మరల నుపక్రమింపఁ జేయుటయుఁ దదాదిగా సర్వము జయమే యగుటయుఁ దటస్థించినది. ఇట భామాసాహి సంఘటన సన్నివేశ మద్భుత రసావహము. మహాభారతమును మించి యే గ్రంథమున నలౌకిక మాహాత్మ్య సందర్భములు లేకయే యద్భుత కథార్థములిట్టివి మఱియెన్నో గలవు. భామాసాహియే కథానాయకుని యశశ్శరీరమునకుఁ బ్రాణము వోసిన మహాత్యాగి. ఈ క్రింది కథాఘట్టములీ గ్రంథమునఁ గండపట్టు లనఁ దగినవి.

రాజపుత్ర స్థానపు క్షత్రియులకు మేవాడ క్షత్రియాన్వయము వారు రాజాధిరాజులును, గురురాజ పట్టభద్రులు నట! అట్టి వంగడపు టేలిక యగు ప్రతాపసింహుని తలపై రాజపుత్రస్థాన క్షత్రియ సంప్రదాయ సంరక్షణ భారము, కిరీటముతోఁబాటు నెలకొన్నది. అందు కర్ఘుఁడనియే సలుంబా కృష్ణుఁడు తాను మాట దప్పిన వాఁడన్న సడికిఁ బాల్పడి యాతనిఁ బట్టాభిషిక్తునిఁ జేసినాఁడు. ఇక్కడ కుటుంబ కలహములు రేగినవి. సోదరులే శత్రువగు నగ్బరు పక్ష మాశ్రయించిరి. రాజ్యారంభముననే యంతఃకలవరము – అయినను రాజపుత్ర స్థాన సామంత మండలమెల్ల, నిర్వికల్ప నిశ్చయముతోఁ ప్రతాపసింహు ననువర్తించుట, వారికి ధైర్యోత్సాహ దీప్తి నాతఁడు కలిగించుట అబ్బురము గొల్పును. ప్రతాపసింహుఁ డనుచరులతోఁ గర్తవ్యము నాలోచించుట మొదలుగా మేవాడపాడు పఱచుదాఁక గల నూఱుపద్యముల గ్రంథభాగమున, పలువురొక ధర్మనిర్ణయమునే పలు దెఱఁగుల నుల్లేఖించుటను, గర్తవ్యమునకు దూఁకుటను, నేర్పుతో గంభీర నిర్భరముగాఁ గవిగారు నిర్వహించినారు. స్వామిభక్తి, దేశభక్తి, రాజగురురాయని



సేవానందము నిక్కడ నఖండముగాఁ దాండవించినది. నాయకుని సమరోల్లాస సందర్భముల నిట్లు రసోదాత్తముగా వర్ణించి, తోడనే ప్రతినాయకుఁడగు నగ్బరు నాస్థానిని, తదీయుల నిర్ణయములను గూడ త్రాసు తూకమున నెడుగుదిగుడుగా నూగులాడించి యక్కడనుండి రాయబారిగా వచ్చిన మానసింహుని, అక్బరు తోడి బాంధవము నెఱపినందుకని యవమానించి పంపుటతో ద్వితీయాశ్వాసమును ముగించినారు. ఇట 281, 282, 283 పద్యములలో మానసింహుడు ప్రతిపాదించిన సంధిషరతుల నభిమానసింహుఁడై ప్రతాపసింహుఁడు ధిక్కరించినాడు. ఉభయ పక్షముల వారి చిత్తవృత్తులకుగూడ నింతటితో నాశ్వాసము ముగిసినది. తృతీయాశ్వాసమెల్ల దారుణయుద్ధము. అందులో నూఱుపద్యముల పట్టునే నే నుద్యోగపర్వరచనా మహత్తుకు మిక్కిలి చేయి యనఁదగినఁ దానిఁ జదివి నీరయినాను. భీమచందు గంభీరోక్తులు, ప్రతాపసింహుని విషాదము చంద్రభట్టారకుని ధర్మోద్బోధము నర్జున విషాదయోగసారాంశములు ! మఱి వీర, కరుణ, శాంత రసముల సుడిగుండములు– అట కవితా ప్రవాహము నంటుకొన్నచోఁ పాఠకుడిందు మునిగిపోవును. వీర భయానక బీభత్స సంక్షోభమయ మయిన పైభాగమును మనసారఁ జదువ నాకు శక్యము కాలేదు. దూరము దూరముగా పయింబయిన చదివితిని. నాకట్టి పట్టులు దుష్పఠములు. ఏ వాఙ్మయమునందుఁ గాని, యే సత్యచరిత్రమునందుఁగాని, యిట్టిఘట్టమపురూపమే యనదగినది. ఖండేరాయని వీరనిర్యాణము, సూక్తసింహ ప్రతాపసింహ సౌదర్య సౌహార్దముల పునరనుసంధానము; చైతకాశ్వపు స్వర్గప్రస్థానమునుఁ రాజనీతి రీతిని జూచితిమేని, వీనిలో సూక్త సింహుని ప్రవర్తనము దూషితమనవలెను. అక్బరు సేనలో సేనానియై యుండి యాతని యుప్పుఁదినుచు నాతని పక్షమున యుద్ధము సేయుచు దొంగచాటుగా స్వపక్షీయులను జంపి ప్రతిపక్షమునఁ జేరినాడు. తాను జేరవచ్చుటకు ముందు అక్బరు పక్షమును వీడివచ్చుట యక్కడ వ్యక్తపరుపలేదు. అన్న దగ్గరనుండి మర్నాడు వెడలి అబ్దుల్ రహిమాను ప్రభృతులతోఁ దనమార్పును దెలుపుకొన్నాడు. అప్పుడు అబ్దుల్ రహిమానుడు మానసింహుని మాట వినక సూక్తుని విడిచిపుచ్చుటయు రాజద్రోహమే. రాజనీతిలో – అనఁగా దయాదాక్షిణ్యములు వీడనాడి యుద్ధమొనర్చి శత్రువులను జంపుటకే పూనిన

క్రూర తంత్రములో – మెలఁగుచుఁ దద్విరుద్ధముగా సూక్తసింహుని దయదలఁచి ప్రతిపక్షమునఁ జేరవిడుచుట స్వామిద్రోహము కదా! సూక్త సింహుడును, రహిమానుఁడును నాడట్లు ద్రోహము చేయకుండినచో --? కవిగారిందు సత్యచరిత్రమును సంరక్షించిరి! వీరాధి వీరుఁడయిన సూక్తసింహుని హృదయమును చిదిమి వైచినది భ్రాతృ గౌరవము! ధీరోదాత్తుఁడయిన ప్రతాపసింహుని నా దశలోఁ జూచి యాతఁడు నీరయినాడు. యుద్ధ మిక్కడ నొక్కనాటిదే. అయినను నిందు రెండులక్షల తురుష్కవీరులును నిర్వదివేలరాజపుత్రవీరులును, తొంబదివేల తురుష్కవీరులును వీరస్వర్గమందిరి. ఉభయపక్ష వీరులలో తేజసింహుడు, అబ్దుల్ రహిమానుడు, ఖండేరావు (ఈతడు పసుపుబట్టలతోడి పెండ్లికొడుకు, ఈతని పెండ్లికూతురు,) మానసింహుడు, భీమచాందు ప్రభృతుల వీరవిహారములు మహనీయములు. శ్రీరామునకు హనుమంతుడెట్లో ప్రతాపునకు భీమచాందను భిల్లుల రేడట్లు. రామునకు సుమంతుఁడు – లక్ష్మణుఁడు ఎట్లో ప్రతాపునకు సలుంబా కృష్ణ సింహుఁ డట్లు. వీరిద్దర నైరంతర్యపు తోడ్పాటునకును, మతి తక్కిన రాజపుత్ర రాజమండలపు సౌమనస్య సహకారములకును, ప్రతాపదేవుని త్యాగ సాహస సత్యధర్మ దీక్షలు సంరక్షకములైనవి. తృతీయాశ్వాసపు యుద్ధవర్ణనమునఁ గవియు శరపరంపరగా దివ్యధారగాఁ గవితను సాగించెను. ఈ బీభత్స వర్ణనమునఁ గవి ప్రామాణికమైన కథావస్తుపరికరమును బడసియే కవిత నెఱపెనవి విశ్వసించుచున్నాను. చతుర్థాశ్వాసమునఁ గూడ మరల యుద్ధములు, పరాజయములు, నిప్పచ్చరములు, నిర్వేదములు, ప్రతాప సింహునిఁ జుట్టుముట్టుటయే ! దుర్భరముగా దుఃఖము గొల్పు సంఘటన మిందొకటి ! "దేవేరీ యుద్ధా" వసానమున ఘోర వర్షము. శైలగుహలో దేవేరియు, బిడ్డలును దడిసి, ముప్పందుచుండిరి. తిండిలేదు. పాటేశ్వరీదేవి గడ్డిరొట్టెలు గాల్చి బిడ్డలకు భర్తకుఁ బెట్టెను. ధ్యాన నిమగ్నుఁడై ప్రతాపుఁ డుండగా గండుబిల్లి పసిబిడ్డల పైకిదూకి, మేనురక్కి రొట్టెముక్కల నెత్తుకొనిపోయెను. ఆహారములేదు. నెత్తురు గీఱలతో బిడ్డని యేడ్పు ప్రతాపుఁడు క్రుంగిపోయినాడు. మనసు చెదిరినది. భిల్లభృత్యునిద్వారమున అక్బరునకు యుద్ధవిరామపు లేఖనంపినాడు. అప్పుడు పాటేశ్వరీదేవి ప్రతాపునకుఁ గార్యోత్సాహముఁ గొల్పినట్లు కవి చేసిన వర్ణనము ఉత్సాహానందరసాయనము ! సంగ్రామ రక్ష !



ఒక్క పద్యమే ఉదాహరింతును ---

సీ॥ నేనెఱుంగకయున్న నిరతంబు ననుఁగాచి
  నాకోప ముపశమనంబు చేసి
మధుర స్వభావ సంపదచే నుడుకుఁ దీర్చి
  యలఘు శాంతతఁ గూర్చి కలత దేర్చి
యూరించి లాలించి యుపచరించి కఱంచి
  యలరించి మించి ధైర్యంబునించి
మదిహరించెడు గుణమాధుర్యమును రూప
  మాధుర్యమును బెంచి మమతనుంచి

గీ॥ యండఁబాయక నీవుండునంత దాఁక
వనిత! కోటానఁగోటు లాపదలు వచ్చి
తలఁబడిన నంగుళంబు ప్రతాప విభుఁడు
దారి తప్పునె స్వాతంత్ర్య ధర్మ నిరతి--

(4. ఆ. 164. ప)

అక్బరు నాస్థానానికి భిల్లుఁడు వెళ్ళినాఁడు. ఢిల్లీ వర్ణనము, అక్బరు సందర్శన వర్ణనము, అక్బరు నాస్థాన వర్ణనము, సభ్యుల వర్ణనము, అందు సభ్యుల సచ్చరిత్ర సంకలనమునఁ గవి జాగ్రత్త– ఇట్టివి ఆంధ్ర కావ్యములలో ననన్యత్రదృష్టములు, విస్పష్టములు, మనోజ్ఞములు, మహనీయములు ! అక్బరు సభ్యులలోనివారు, అబ్దుల్ రహిమానుపృథ్వీరాజులు, భీష్మద్రోణుల మాఱటవారు ! అబ్దుల్ రహిమానుఁడు ప్రతాపునెంతో కొండాడునట్లు కవి వర్ణన మున్నది. కాని నిజమునకుఁ జూడ రహిమానుఁడు గూడఁ బ్రతాపుని నిత్యప్రస్తుతికి బాత్రుఁడే యనవలెను. కవిగారును దీని గణుతించినారు. కావ్యములోనికెల్ల నక్బరు సభలో భిల్లుని లేఖము చదువుట, దానిపై పృథ్వీరాజు, అబ్దుల్ రహిమానుఁడు, మానసింగు ప్రభృతులు అక్బరు చక్రవర్తితో జరిపిన చర్చలును, మర్నాడు భిల్లుడు పృథ్వీరాజు నింట నుండగా నబ్దుల్ రహిమానుఁడు వచ్చి ప్రతిలేఖము వినుచుట, దివ్యకావ్య ధోరణిలో రసభరితములై యున్నవి. తిక్కన భారతోద్యోగపర్వ రచన కిది ప్రతిరచనము ! ఈ పట్టు

ప్రతాపుని మహనీయతను బ్రకటించు నొక వస్తుధ్వని మహాకావ్యము !

ఈ కావ్యమున నాకుఁ జాల నబ్బురము గొల్పినది అక్బరునేర్పు కూర్పు. రహిమాను, పృథ్వీరాజు , మానసింహుఁడు, పలుతెఱఁగుల కర్తవ్యములను నిరూపించునపుడు వానినెల్ల సమరసపఱిచి; తియ్యనితీరున కార్యనిర్వాహము గావించుటలో అక్బరు మెలకువ మెచ్చఁదగినది. అక్బరు నేర్పెట్టిదో కవిగారినేర్పు నట్లేమెచ్చదగినది. ఇందు మానసింహుడు కర్ణునంతవాఁడు. ఈతనిఁ దేలికవానిగానేను దృణీకరింపఁజాలను. ఒక తీరున స్వామి భక్తిలో పృథ్విరాజును అబ్దుల్ రహిమానును మీఱిన వాడేమో! రాజనీతి రీతిని జూడఁగా అబ్దుల్ రహిమానులేఖ యాక్షేపార్హము కావచ్చును. ఇట భారతమున భీష్మద్రోణుల కెట్టిసడివెట్టవచ్చునో యట్టిసడినే యిర్వురపయిఁ గూడఁ బెట్టవచ్చును. దానినెట్లు సమర్థింపవచ్చునో దీని నట్లే సమర్థింపవచ్చును. ఇందుఁ గర్ణునట్లే మానసింహుఁడు వర్తిల్లెను. స్థలాంతరమందలి యీ పద్యమిక్కడ చదువఁ దగినది.

ప్రమదోద్యానముఁ బోలు నీయవన సామ్రాజ్యంబునన్ గంటకో
గ్రమహీజంబులు నెవ్వగన్ బెనిచె నీరాణా ప్రతాపుండు; త
త్సమదౌద్ధత్య మడంపరాని యెడ నీ దర్పంబు నేనొల్లఖ
డ్గము నేనొల్ల ; నటంచునేలవిసరెన్ గాలాహినా రోజుచున్.
( 5 ఆ. 320 ప)

కవిగారు పయికథా పాత్రముల నాయాతీరుల వివిధమనోవికాసములతో గుర్తించి విభిన్న లక్షణములతో విమర్శింపఁదగినట్టు కట్టుదిట్టముగాఁ గల్పించినారు. చరిత్ర గ్రంథములలో నేవేనికొంత స్థూలరూపముగా నాయా విషయము లుండబోలునేమో ! కాని, యిందు గవిచిత్రణము చాలఁ గౌశలముతో నాయాపాత్రముల మనోభావ లేశాతిలేశాంశ వివేచనముతో సువిపులముగా సురుచిరముగా నున్నది. ప్రతిపక్షము వారు గూడఁ పరమానందముతోఁ బ్రస్తుతింపఁదగినది ప్రతాపుని మహనీయత. నిజమెంతోగాని కవిగారు దానినంత చక్కఁగా నద్భుతావహముగా నారాధనీయముగాఁ గల్పించి నారు. శత్రుముఖమునఁ ప్రతాపుని సౌగుణ్యమును సన్నుతించుటలోఁ గవిగారు గొప్పనేరిమి నెరపినారు. ప్రతాపుని దూతయైన భిల్లునికి అక్బరునాస్థానిలో



జరిగిన సత్కారము రసచమత్కారకలితము. అక్బరు తన పట్టాభిషేకము నాడయిన భిల్లలేఖ ప్రకటనము నాటి మహోత్సవమున నుభవించెనో లేదో యనదగినట్లు కవితావిలాస మక్కడ వెలసినది.

అక్బరు ప్రతాపసింహుని లేఖఁగొనివచ్చిన భిల్లునియునికి సభలో

గీ॥ దుద్దుఁగంబడి బుజముల దుడ్డుకట్టి
కరమున నెసంగు గంభీర కాలమూర్తి !
భిల్లుడు వసించెనొక దొడ్డపీటపైన
వేదికాంతమందక్బరు విభుఁడుచూప. (4 ఆ 209 ప)

ఆ॥ అల్ల వాఁడె భిల్లుడంట యక్బరు శాహి
యోలగమునఁ గూరుచుండెనంట
నా ప్రతాపు దూతయట యితండనిమేడ
లెక్కి నిక్కిచూచి రింతులెల్ల – ( 4ఆ 297 ప)

అబ్దుల్ రహిమాను లేఖలోని ముక్కలు రెండు –

గీ॥ బరువుపడ కిన్నియేండ్లు కాపాడినాఁడ
వనఘ స్వాతంత్ర్య కనక గర్భాలయమునఁ
బ్రజ్వరిల్లు నఖండ దీపమ్మునిపుడు
కొండ యెక్కింతువే కనుగూర్కిదేవ ! ( 4ఆ. 328 ప.)

గీ॥ సంగర తరంగ సంక్షుభితాంగమగుచు
నలముకొనియున్న బహువిపదబ్ధియందుఁ
జెక్కుచెదరక చిక్కక సేమమునను
నడచెదును గాక యుష్మదానందనౌక ॥ (4 ఆ. 334ప)

చతుర్థాశ్వాసము ముగిసినది. పంచమాశ్వాసము మరల యుద్ధమే. పరాజయములే. ధనము లేదు. ధాన్యములేదు. స్వాతంత్ర్యముతో నిలువ నీడలేదు. దేశభ్రష్టుడ నగుదునుగాకని ప్రతాపుఁడు తలఁచెను. తోడివారు సలుంబా కృష్ణసింహాదులెల్లరు వెంటవత్తుమనిరి. ఈ ఘట్టమున కవిగారు తమ కవితలోఁ గరుణరస వర్షము కురిపించినారు.

సీ॥ వేనవేల్ రిపుల నొప్పించు పట్టునఁగర్జ
పేయమై విందునీ వీరగర్జ
దలద్రుంచు బహుళాపదలుచుట్టినప్పుడు
చెవియొగ్గి హుంకారరవమువిందుఁ
దిండిలేక తపించు దినముల విధిఁజూచి
పెడబొబ్బవెట్టు చప్పుడుల విందు
స్వాతంత్ర్య సమరదీక్షకుఁ బూన్చునీయుప
న్యాసంబులను జెవులారవిందుఁ

గీ॥ గాని కొండంత నొప్పితోఁ గాసిపడుచుఁ
బిడుగుపడినట్లు హృదయముల్ వ్రీలఁజేసి
విన్ననై దీనమగువాక్కు విని యెఱుంగ
ననలమున వ్రేల్చునట్లు నా మనసు పొగిలె.
( 5 ఆ. 94 ప,)

గీ॥ నీ హృదయ పద్మపీఠ నిర్వ్యూహమెక్కి
యలరి స్వాతంత్ర్యలక్ష్మి సహస్రభాను
కాంతులను వెల్గెఁ దన్మహాఖండ దీప్తి
కడలుకొని ఢిల్లి మొగలుల కనులుగుట్టె ( 5-95)

సీ॥ పురము రాజ్యము మాని మూఁడేండ్లు శ్రీహరి
శ్చంద్రుండు పడిన కష్టముల నెఱిగి
పదునాలుగబ్దముల్ వనవాసమున రామ
చంద్రుండు పడిన కష్టముల నెఱిగి
పదియు మూడేండ్లుగాఁ బాండవుల్ గహనాంత
రములలోఁ బడిన కష్టముల నెఱిగి
యిరువదిమూడేడు లీవీ వనులఁ గుటుం
బముతోడఁ బడిన కష్టముల నెఱిగి

గీ॥ తారతమ్యంబుఁ దూచిన వారియిడుమ
లత్యగాధాపదావర్త మైననీదు



చరితమున నొక్కపుట కొక్కచరణమునకు
సాటిగావని గొంతెత్తి చాటనేర్తు ! ( 5 ఆ.96 ప.)

గీ॥ వీరు లాత్మీయులాప్తులు పృథ్వివరులు
బంధువులు నీగిరీంద్ర గర్భముల నొఱుగ
బిరికి దొంగనుగా నిన్ను దొఱగి జాఱ
వ్రాసె నాతల ధాత! మేవాడమాత! ( 5ఆ. 116ప)

గీ॥ తలఁదఱుగ నోపుబహు విపద్దశలనైనఁ
గాంతి యించుక చెడని నా కన్నుదోయి
నశ్రుకణములు వొడమె; నీ యడుగుదోయి
నమ్మ ! ముక్తాభిషేకంబు నాచరింతు ( 5 ఆ. 117 ప)

సీ॥ హారావళీశైల మనుపమ స్వాతంత్ర్య
వీర దుందుభుల శబ్దించుఁ గాక;
గుట్టలు పుట్టలు గుహలు స్వధర్మత
త్పరుల యశంబు మార్పలుకుఁ గాక ;
మేవాడ రాజ్యలక్ష్మీ పరాక్రమమెల్ల
వేళల భువిఁ దాండవించుఁ గాక ;
త్యాగైక ధనుల సత్యస్వరూపులచే ర
హించి నీ కడుపు ఫలించుఁ గాక ;

గీ॥ భానుకుల గౌరవంబు నిల్వంగ నోడి
త్యాగమునఁ గుంటువడి నీ పదముల గొలుచు
పున్నెములు లేక దూరభూములకు నేగు
మమ్ము మాపేళ్ళు లోకంబు మఱచుఁగాక! (5 ఆ. 119 ప)

గీ॥ అనుచు భక్తినిఁ జూపి వందనమొనర్చి
మరువఁజాలక చేరెడు మట్టిదీసి
కనులనద్ది రుమాలునఁ గట్టి యూర్చి
యాప్రతాపుఁ "దంకారు" పై నధివసించె. (5ఆ. 120 ప)

కం॥ ఆ రీతి నెల్ల వారలు
చేరెడు చేరెడుఁగ మట్టి చేకొని తలలన్
జేరిచి మ్రొక్కుచుఁబయనం
బారంభించిరి ప్రతాపుఁ డందఱ నడుపన్ (5ఆ. 121 ప.)

ఇట్టి యిక్కట్లు పట్టుననే భామాసాహి యనుప్రాంత మంత్రి వెదకి కొనివచ్చి విపుల ధన మిచ్చినాడు ! పునర్యుద్ధోద్యోగము ! దీనికిఁ బ్రతిగానక్కడ నగ్బరు దౌర్బల్యము ! ప్రతాపుని జయములు విజయములు, పునారాజ్య లాభములు ! ప్రతాపుని పట్టు గండుజీమపట్టు. తలతెగినఁ దెగుగాక! పట్టు విడువడు ! తల త్రెగలేదు, పట్టు నెగ్గినది. ఇర్వదియైదేండ్ల ప్రచండప్రయత్న మున సంకటములు, సంక్షయములు ఎన్నో ? అయిన నేమి! మంగళాంతముగా కథ ముగిసినది.

పెక్కు సంవత్సరములు ప్రతాపుని చరిత్రము పఠించి పరవశత్వమున మైమఱచుచు రసమయ హృదయముతో, సత్కావితా దీక్షతోఁ గవిగారేక ధారగా నొక్క యూపున నొక్క యావేశమున నీ కావ్యమెల్ల ముగియ రచించినారు. గ్రంథమెల్లఁ జదివితిని. ఈ గ్రంథమును జదువుచున్నప్పుడు నాకు మఱీ ముచ్చట గొల్పిన పద్యములను, గూర్పుపొంకములను గొన్నింటి నిక్కడ పరిగణించుచున్నాను.

## పూర్వపీఠిక

42, 48, 50, 51, 57, 59.

## ప్రథమాశ్వాసము

1 34 43 44 48 49 51 79 84 95 114 124 125 128 130 132 133 134 139 145 146 147 151 153 154 156 175 181 183 184 191 195 196 198 199 202 204 211 212 213 254 270 296 304 343.

## ద్వితీయాశ్వాసము

43 52 69 71 72 79 80 84 88 93 94 97 98 103 105



106 108 109 110 111 115 117 118 119 135 140 141 142 145 146 148 149 154 160 164 165 168 169 171 172 177 178 179 182 184 188 195 213 220 222 247 248 252 255 258 261 264 265 268 275 276 284 285 290 291 301 312 316 318

## తృతీయాశ్వాసము

26 28 30 32 33 52 61 71 73 74 82 86 90 101 121 144 149 158 160 161 162 168 169 174 176 182 209 212 219 220 224 228 230 313 314 316 317 321 322 323 324 325 329 331 333 335 336 337 338 339 340 342 343 346 352 353 355 356 359 363 365 366 372;

## చతుర్థాశ్వాసము

4 21 23 27 29 55 67 81 82 83 94 105 128 129 130 135 144 157 162 165 196 224 230 231 232 233 243 250 256 260 272 277 283 297 303 328 334 357 :

## పంచమాశ్వాసము

22 29 61 62 71 77 78 79 82 84 91 94 97 116 117 119 120 130 145 147 158 173 181 275 289 290 300 307 309 314 315 317 324 342 346 352 353 356 366 368 372 373 376 381 383 384 :

ధారాపాతపు రచనా ధోరణిలోనక్కడక్కడ నెఱసులు గొన్ని దొరలినవి. కవిగారు వానిని బునర్ముద్రణమున సరిపఱుచుకొందురని వానిని వ్రాసి వారికి నేఁటిఁగాఁ బంపితిని. అవి గణింపఁదగినవి కావు. కవిగారు ఉహ్వాని యూది తొలగింపఁగలరు.

'.... ......... .........కావ్యమునా జలరాశి యందులో
లప నెఱసుల్ గణింతురెయపారములై మణులెల్ల నుండఁగన్'.

కావ్యము ముగిసినది. కావ్యనాయక కవీశ్వరుల యైక్యము గుర్తించి వారి వెన్నాడి నేను నానాఁటి వాడనై యేదో కొంత కావ్య సమీక్ష చేసినాఁడను. ఇక నేను నేనై నేటిఁ వాడనై స్వతంత్రుఁడనయి ఇంచుక యుగ్గడింతును.

రాణాప్రతాపసింహుడు భారత దేశముపై పొంగి పొరలి పాఱువాఱుచున్న తురుష్కనదీ ప్రవాహము నతికట్టుటకును, భారత ధర్మమును నిల్వరించుటకును, నని యిర్వది యైదేండ్లపాటు (నేటి గవర్నమెంటు సర్వీసు కాలము) పాటుపడి కృతార్థతను ముట్టికొన్నాఁ డనిపించుకొన్నాఁడేమో! అందు బ్రతినాయకుఁడగు నగ్బరును నిందుకుఁ బ్రతిగాఁ దలపులున్నవాఁడు గావచ్చును గదా! ఏకముఖమైన యేల్బడిలేక చెడుచున్న భారతదేశమును దన యేకచ్ఛత్రాధిపత్యమునకు లోఁబఱచుకొని యేక రాజ్యముగా నేలవలెనని యతని తలపుగావచ్చును. అందాతఁడును గొంత వఱకు కృతార్థుఁడయ్యెనని పించుకొనెనేమో! ఇందుపై యిర్వురు నిర్వదియైదేండ్ల పాటు దారుణ మహామారణతంత్రము నడపినారు. ఎందఱో మహనీయు లీమహాగ్ని జ్వాలలో మ్రగ్గినారు. యుద్ధమనఁగానే దయాదాక్షిణ్యములులేని క్రూరమారణ కర్మమన్న మాటే. కంబళిలో నంబలి పోసికొని త్రాగువాని నోర వెండ్రుకలేరఁ జూచుట వంటిది, యుద్ధతంత్ర నిర్వాహకులలో ధర్మాధర్మముల వివేచనము చేయఁ జూచుట. దేవాసుర యుద్ధమాదిగా నేఁటిదాఁక జరుగుచున్నయుద్ధ కర్మములలో సర్వత్ర సత్యదయా ధర్మ దాక్షిణ్యముల విధ్వంసమేకానవచ్చుచున్నది గదా! మాకారోగ్యాయుష్యైశ్వర్యములవృద్ధి : మాప్రత్యర్థికిఁ దత్ప్రతికూలముల సిద్ధి– ఇదికదా యుద్ధనీతి. ఇట్టి యుద్ధతంత్రమునఁగూడ నేవోకొన్ని ధర్మనిర్ణయములున్నవి. అవికూడ నన్నియు యుద్ధ కథలలోను నవకతవకయి నట్టే కన్పట్టును. దేవాసురయుద్ధమున, రామరావణయుద్ధమున, భారతయుద్ధమున తెఱచి యెఱిఁగింపఁబనిలేదు; సువ్యక్తములే. అట్టి లోపము లీ యుద్ధకథనము నందుఁగూడనున్నవి. అవి తప్పనివే. యుద్ధమన్నప్పుడు కవిగారు వానిని దిద్దఁగల్గుదురుగాక. దిద్దలేదు. దిద్దగూడదు కూడ. నిజమున కీ యుద్ధసందర్భము నిప్పటి మనము వెనకుఁదిరిగి చూచితిమేని నైరాశ్యమే పొడచూపును. ప్రతాపుని సంకల్పము లాతని యుసుఱుతోనే ఉడిగిపోయినది. అగ్బరు నాశయునాశమే యయినది. ఏమేమో జరిగినది. ఏమిలాభము?



ఏనాఁడో ముట్టుకొన్న హైందవ తురుష్క వైరాగ్ని రావణాసురుని కాష్ఠమన్నట్టు నేటికిని ఆరకుండ మండుచునే యున్నది! ఏమి పరమార్థము లభించినట్టు. గ్రంథము రచించుచో శ్రీరాజశేఖర కవిగారిని ప్రతాపసింహుఁ డాత్మసాత్కరించుకొన్నట్టే యీ సమీక్ష రచించుటలో ప్రహ్లాద, బుద్ధ, జీసస్, టాల్స్టాయ్ గంధులు నన్నాత్మ సాత్కరించుకొన్నట్లయినది. సమీక్ష చేయుటలో నడుగడుగునకు నడ్డంకులే! సాగకపోవుటే ! మనస్సవశమగుటే. తలఁపు కుదురదు. వ్రాఁత పొసఁగదు. నేటి నన్ను దిగద్రొక్కుకొని పదునాఱవ శతాబ్ద కాలమునకుఁ బంపించి ప్రతాపుని సంకల్పములకు వెన్నాడింపఁజాలక పోయితిని. ఉరికంబము నెక్కించు వారినిఁ గూడఁ– “తండ్రీ! యెఱుక మాలి యిట్లు చేయుచున్న యజ్ఞానుల రక్షింపు’ మని భగవంతుని వేడిన క్రీస్తునంతఃకరణమున, “జనరల్ డయరు ఉద్రిక్తుడై నన్నుఁగాల్చుటకు రివాల్వరు గురిపెట్టి దూకి వచ్చుచున్నచో నపమార్గమునఁ జాటుగా వచ్చుచున్న యాతని కాలఁ ద్రాచుపాము చుట్టుకొని కాట్లు వేయుచున్నచోఁ జూచితినేని వెంటనే చేరఁబోయి త్రాచును దప్పించి విషము నోటఁబీల్చి యుమిసి యతని రక్షించుటనా యహింసా సిద్ధాంతపుఁ బరమ పరిష్కార” మన్న గంధి హృదయమును, నా హృదయమునఁ దొణికిసలాడఁ జొచ్చినవి. ఉత్తర ధ్రువమున నుండి దక్షిణ ధ్రువముదాఁక, ఇండియా నుండి అమెరికాదాకా, భూగోళమునఁ గల మానవత యెల్ల నైక్యముతో ననురాగముతో వర్ధిల్లుటే పరమలక్ష్యమని, అహింసా సత్యప్రేమ సౌమ్యములే దానికిఁ బరమ సాధనములని, ఆధర్మముల గానమున శక్యమయినంతవఱకు శ్రుతిఁ గలుపుకొనుటే, యుసురున్నంత దాఁక నా కర్తవ్యమని నిశ్చయించుకొని యుండుటచే నట్టి కలవరము నాకుఁ జెలరేగినది. కాని ; క్రీస్తు మాత్రమేమి చేయగలిగెను? అని ప్రశ్నము రావచ్చును. ఏమి చేయఁగలుగక పోయినను సరియే ఆ దివ్యతత్త్వములలో జీర్ణించుటే నా యాత్మకు శాంతి. నా బ్రదుకునకుఁదెరువు. కాలగర్భమున నేమున్నదో. ఇది యెందుకుఁ జెప్పితిననగా నిట్టి వైక్లబ్యము నాకుఁ గలుగకుండినచో నీ సమీక్ష నింతకంటె సంతనగాఁ జక్కగా సాగింపగల్గియుండెడివాఁడ నేమోకదా యని. ఇటీవల బుద్ధుని జీవితవిశేషములెన్నేని గుర్తింపబడినవి. విపులముగా బుద్ధచరిత్రమునుగాని. క్రీస్తు చరిత్రమును

గాని కొని శ్రీరాజశేఖర కవిగారు గ్రంథమురచించినచో నాకెంతేని సంతోషము గల్గును. ఇది నా కోరిక.

" సర్వత్ర సంపదస్సంతు సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్దుఃఖ మాప్నుయాత్"–

( మహాకవిశేఖరా, మహాపురుషా, గురుపాదుల సన్నిధికి– ఇత్యాది సంబుద్ధులతో రాజశేఖర శతావధాని గారు వేటూరివారికి వ్రాసిన లేఖలు కొన్ని ఉన్నవి. ఆ ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆ పవిత్ర కవితాత్మల అనుబంధము ఈ జన్మపరిచయాన్ని అధిగమించిన రీతిని వ్యక్తం చేస్తున్నది. శతావధాని గారి 'ప్రతాప' గ్రంథం మీది పై సమీక్ష కూడా ఆ అంశాన్ని వ్యక్తీకరిస్తున్నది. 'రేపు సభ జరుగు' ననియు నందు మీరు సమీక్ష చదివి యాశీర్వదింతురనియు సౌ॥ కామేశ్వరీదేవి తెలిపియున్నది. ( 18-1-1944) అని ఒక లేఖలో కలదు.)

# విక్రమాంకదేవ చరితము

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

మాదిరాజు విశ్వనాథరావు

## పండితాభిప్రాయము

కళాప్రపూర్ణ

బ్ర॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

వనపర్తి సంస్థాన వాస్తవ్యులు శ్రీ విశ్వనాథరావుగారు, శ్రీ లక్ష్మణ శాస్త్రిగారు–వారు స్వయముగఁ దెలిఁగించిన గ్రంథమును, విక్రమాంక దేవ చరితమును, హృద్యముగాఁ జదివి వినిపింపఁగా విని తనిసితిని. మహాకవి బిల్హణుడు, చాళుక్య విక్రమాంక దేవు నాస్థానమున నెలకొని నేఁటి కించుమించు వేయి యేండ్లకు ముందు, తుంగభద్రా–కృష్ణాతీరాంధ్ర దేశపుఁబాఁడి పంటల ననుభవించి వెలయించిన మహాకావ్యమును, నానాఁటి యాంధ్రదేశ చరిత్రాత్మకము, నగు విక్రమాంక దేవచరిత్రమును వీరు పద్యరూపమునఁ బరివర్తింపఁబూనుటే మిక్కిలి కొనియాడఁ దగినది. బిల్హణ రచనము ప్రాయికముగా వర్ణనాత్మకము. శబ్దాడంబర ప్రధానము– కాళిదాసాదుల రచనల వలెఁ బ్రతిపదరసస్యంది గాదు. అట్టి దానిని దెనిఁగించుట కష్టసాధ్యము– అయినను నిర్దుష్టమగు భాషతో శయ్యా సారళ్యముతో వీరీ గ్రంథమును దెలిఁగించిరి. వడిగా దీనిని వీరు ప్రకటింతురుగాకని కోరుచున్నాను. ఆంధ్రు లభిమానించవలసిన గ్రంథమిది.

తిరుపతి, (సం.) వేటూరి ప్రభాకరశాస్త్రి.
22-1-1943

| | |
|---|---|
| కావ్యం | – విక్రమాంక దేవచరితము (బిల్హణకవి సంస్కృత మహాకావ్యానువాదము) |
| అనువాదకులు | – కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మాదిరాజు విశ్వనాథరావు |
| ప్రథమముద్రణ, | – 1974 హైదరాబాద్. |

# ధర్మదీక్ష

మదివర్తి కొండమాచార్యులు

## అభిప్రాయము

ఆర్యా! వందనములు

మీ లేఖమును బట్టి మీరు చాలఁ బసిప్రాయపు వారని తెలిసినది. కాని 'ధర్మదీక్ష' యను మీ రచనమును బట్టి చూడఁగాఁ బరిణత ప్రజ్ఞుఁడైన ప్రౌఢ కవికిఁ బై చేయిగా మీరు కానవచ్చుచున్నారు. వస్తువు అద్భుతరసపు సుడిగుండములు గల కరుణరస వాహిని! ఇటువంటి దివ్య కథా వస్తువులను (మత వైముఖ్యముచే) నుజ్జగించి శృంగార ప్రచురములైన పురాణ కథా వస్తువులకే మన పూర్వులు ముచ్చట పడిరి గదా !

మీబోటి బుద్ధిమంతులు దయాధర్మ ప్రచురములైన కథల నిట్టివానిని గావ్య వస్తువులుగాఁ గొని సరస రచనా సామర్థ్యమును సఫల పఱచు కొందురు గాక !

మీ కవిత మంచి శయ్య, పాకము, భావపరిపాకము కలదై ఆనందము గొల్పుచున్నది. అపూర్వ కావ్య భూషలచే నాంధ్ర సరస్వతి నలంకరించుచు నాయుష్మంతులై కీర్తివంతులై మీరు వెలయుదురు గాక!

తిరుపతి

మకర సంక్రాంతి. వేటూరి ప్రభాకరశాస్త్రి

( ప్రచురణ- వి.వి. నాయుడు అండ్ సన్స్

ట్రంక్ రోడ్డు, నెల్లూరు

ప్రథమ ముద్రణ - బి ఎన్ కే. ప్రెస్, మద్రాసు

వ్యయ, వసంతము, మే, 1946

అంకితము - శ్రీ వరిగొండ సత్యనారాయణమూర్తిగారికి)

# శ్రీ మహర్షి జీవిత కథామృతము

(ప్రాచీన భారతవర్ష మహర్షుల జీవిత చరిత్రము)

బులుసు వేంకటేశ్వరులు

## పండితాభిప్రాయము

కందశలాటు శాక పరికల్పిత భుక్తి నరణ్యసీమ నా
నందమయాత్మ కోశయజనవ్రత మూని సమస్తలోకమా
త్మందల పోసి తా రభయదానము కోసమె లోని తెల్వి ది
వ్వెం దిలకించు మద్భరత వర్ష మహర్షుల నాశ్రయించెదన్.

ప్రాచీన భారత వర్ష మహర్షి చరిత్ర మిదివఱకే పెద్దలు రచించి యుండ వలసినది. వారది శ్రీ వేంకటేశ్వర్లుగారికి విడిచిపెట్టుట వీరి సుకృతము. శ్రీ వేంకటేశ్వర్లుగారు పురాణాద్యాకరములను బెక్కింటిని బరిశీలించి శ్రమపడి యీ గ్రంథము రచించిరి. ప్రాచీనార్య మహర్షి మహత్త్వము జగదాశ్చర్యకరము. దానిని శ్రీ వేంకటేశ్వర్లుగారు తేట పఱిచిరి. తెలుఁగు వారెల్ల రీ గ్రంథమును సమధికాదరముతోఁ బఠింతు రని నేను విశ్వసించు చున్నాను. శ్రీ వేంకటేశ్వర్లుగారి రచన మిక్కిలి చక్కఁగా నున్నదని వ్రాయుట చర్విత చర్వణము.

( కీ॥శే॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యాపీఠము,
తిరుపతి. )

(గ్రంథం – శ్రీమహర్షి జీవితకథామృతము
ప్రాచీన భారత వర్ష మహర్షుల జీవిత చరిత్రలు )
గ్రంథకర్త – విద్వాన్ బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ,
పి. ఆర్. కాలేజీ
రామారావు పేట, కాకినాడ
ముద్రణాది | తొలికూర్పు – 1946
వివరాలు | మలికూర్పు – 1950
మూడవ కూర్పు – 1953 జార్జి ప్రెస్, కాకినాడ,

గమనిక : ఇది 1946 నాటి
అభిప్రాయము కావుననే 1953 నాటి
మూడవ కూర్పులో కీర్తిశేషులు అని వ్రాయబడినది )

# శ్రీ శివపురాణము

శ్రీ ముదిగొండ నాగవీరేశ్వరకవి.

## విద్వదభిప్రాయము

శ్రీ తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్యవిద్యాపీఠ ప్రధానోపాధ్యాయులు,
సంస్కృతాంధ్ర వాఙ్మయ పరిశోధకాగ్రణులునగు
బ్ర॥ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు

ఆర్యా! మీచే రచితప్రకటితమైన శివపురాణము నందందు హాయి హాయిగాఁ జదివి యానందించినాను. మీరు మీ ప్రజ్ఞను జిరకాలము దాచి యుంచుకొని పరిపుష్టి పరచుకొని యీ గ్రంథమును రచియించితిరి. శ్రీ గురుపాదులు వెంకటశాస్త్రిగారును, మిత్రులు గుణగ్రహణపరాయణులు సత్యనారాయణ కవిగారును మెచ్చుకొన్న మీ గ్రంథమును నా బోటివాఁడు మెచ్చుట సిద్ధసాధనము. తథాపీధమస్తు. మీగ్రంథము మహాగ్రంథము. మీరు మహాకవులు. గ్రంథ యోగ్యతకు దగిన రచనా యోగ్యత గలవారు మీరు. మీ రచనారీతి మంచి పురాణఫక్కిని సాగినది. కుమారసంభవాది సంస్కృతాంధ్ర ప్రాచీన కృతులలోని శివకథలు మీ పురాణములో నున్నవి. ప్రాచీన కవులీ శివపురాణమును జాలసంగ్రహించి తమ కృతులందు వినియోగించుకొనిరి. మీ గ్రంథమే తత్పురాణ ప్రయోజనమును సర్వవిధముల నాంధ్రులకు సమకూర్ప గలిగి యున్నది. నిర్దుష్టము, గుణబహుళమునగు మీ రచన శ్రీ వేంకటశాస్త్రి గారి రచనపు బోలికలు నాకు వేడ్క గొల్పినది. తీరికలేమిచేఁ బర్యాప్తముగా జదువుటకును బరితృప్తితీర సవిమర్శముగాఁ బ్రశంసించుటకును జాలకున్నాను. క్షమింపుడు.

మిత్రుడు
వేటూరి ప్రభాకరశాస్త్రి
తిరుపతి.

| | | |
|---|---|---|
| (గ్రంథం | – | శ్రీ శివపురాణము |
| కవి | – | శ్రీ ముదిగొండ నాగవీరేశ్వరకవి |
| పరిష్కర్త | – | బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి |
| మొదటికూర్పు | – | 1947 |
| ముద్రణ | – | ఓరియంటల్ ప్రెస్ |
| | | నెం. 6583, మార్కెట్టు వీధి, సికింద్రాబాదు ) |

# మంగళగిరి మాహాత్మ్యము

నందిరాజు చలపతిరావు

## పండితకవుల అభిప్రాయములు

ఆంధ్ర సారస్వత పరిషద్విచక్షణులచే "విమర్శకాగ్రేసర" బిరుదము బడసిన సుప్రసిద్ధ పండిత కవి విమర్శకులగు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారిట్లు వ్రాయుచున్నారు.

ఆర్యా! వందనములు !

మీ గ్రంథమును సమగ్రముగా నవతరణికను ఎడనెడ గొన్ని కథాఘట్ట ములను జదివితిని. అస్మదాదులు కనులు దెరవక పూర్వమే మీరు తెలుగు రచనలో గడుదిట్టలు. రచనాపటిమలో మీరు గండర గండంద్రు, మొన గాంద్రునగుట సువిదితము.

పండబారిన మీ కవితాఫలము "మంగళగిరి మాహాత్మ్యము" మంచి మంచి కథాఘట్టములు, తదనుగుణ కవితా వైశారద్యములు కలిగి హృద్యముగా నున్నది. రచనపు జిగిబిగువులు, పలుకు పొంకములు చక్కగా బొందుపడినవి.

పురాణ రచనమునకుఁబయి చేయియై "మంగళగిరి మాహాత్మ్య' రచన ప్రబంధరచన నందుకొనుచున్నది. ఎడనెడ మీ గ్రంథము చదువునపుడు పాండురంగ, కాళహస్తి మాహాత్మ్యములు స్మరణమునకు వచ్చినవి. అర్వాచీన సర్వక్షేత్ర మాహాత్మ్య రచనలకు నవిమేలు బంతులే కాన వానితో వంతుకు వచ్చుట క్వాచిత్కముగా అందందే అగును గదా! శ్రీనాథుడు కూడ మీ యట్టి వయసుననే కాబోలును కాశీఖండమును రచించినాడు. మీరింకను గ్రంథములు రచించుచుండగలరు గాక !

ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ — చిత్తగింపుదు
తిరుపతి — విమర్శకాగ్రేసర
1-10-47 — వేటూరి ప్రభాకరశాస్త్రి

(మంగళగిరి మాహాత్మ్యము ( 7 ఆశ్వాసాల పద్యకావ్యం
కవి - నందిరాజు చలపతిరావు.
మంజువాణి ప్రెస్, ఏలూరు - (1948)

# శిల్పదర్శనము

కొండూరు వీరరాఘవాచార్యులు

## అభిజ్ఞుల అభిప్రాయములు

"సంస్కృతమునను ఆంగ్లాది భాషలయందును గల శిల్పశాస్త్ర గ్రంథ ములను బరిశీలించి, దేశమున గల శిల్ప, తద్రచయితల గణ్యతను గుర్తించి రచియించిన మీ శిల్పదర్శనము నాకు చాల వేడ్క గొల్పినది. ఇట్టి గ్రంథమును ఇంతవఱకెవ్వరును తెల్గున రచించి యుండలేదనుకొందును. మీరు గట్టి ప్రయత్నముతో నిట్టి గ్రంథమును నేడు రచించితిరి. దివ్య శిల్పములు, వాని శిల్పులు సర్వదా పూజార్హులు. మీ గ్రంథము తత్పూజనము కొంత జరిపినది. ప్రాచీన భారత శిల్ప, తద్రచయితల చరిత్ర మింకనెంతో అవ్యక్తముగా నడగి యున్నది. (కొంత అణగారి పోయినది కూడ) మీరందు కొంత వఱకైనను తద్రచనము జరిపితిరి. నేను శిల్ప శాస్త్ర రహస్యముల నెఱుగని వాడను. మీ గ్రంథము తద్రహస్యముల నెన్నింటినో నాకెఱింగించినది. మీ వచన రచన చాల హృద్యము. ఇట్టి గ్రంథము లింకను రచింప గలుగునట్లు భగవదనుగ్రహము మీ యెడవరగుగాక !

తిరుపతి, — చిత్తగింపుదు
5-4-1947. — (సం.) వే. ప్రభాకరశాస్త్రి.

| | | |
|---|---|---|
| గ్రంథం | - | శిల్పదర్శనము (పరివర్ధిత సంస్కరణము) |
| రచయిత | - | కొండూరు వీరరాఘవాచార్యులు |
| ప్రథమముద్రణ | - | 1946 |
| ద్వితీయ ముద్రణ | - | 1978 సర్వోదయ ప్రింటర్స్ తెనాలి |
| ప్రకాశకులు | - | శ్రీమతి కె. రాజేశ్వరమ్మ<br>గాంధీనగరం తెనాలి.<br>గుంటూరు జిల్లా.) |

# గాంధీ శతకము

(విద్వాన్ బయిరెడ్డి సుబ్రహ్మణ్యంగారి యీ శతకానికి వేటూరి వారు వ్రాసిన ముందుమాట యిది -- సం॥ )

## విద్వజ్జనాభిప్రాయము

'గాంధి శతకము'ను రచయిత వినిపింపఁగా నామూలాగ్రము హాయిగా వింటిని, "రాఘవేశ్వరు చారిత్రము నెందఱెన్నిగతులన్ వర్ణించినన్ గ్రాలదే?" అన్నట్లు "గాంధిదేవ చరిత్రంబును నెంద ఱెన్నిగతులన్ వర్ణించినన్ గ్రాలదే !" ఈ శతకము పద్యములు ధారాళముగా నిర్దుష్టముగా నున్నవి.

గాంధిగారి "ధారాళమయిన నీతులు" కొన్నియును, చరిత్రాంశములు కొన్నియును నిందు సంధానితములైనవి. విద్యార్థులకీ శతకమును సుమతి నీత్యాదులవలె నేర్పవచ్చును.

తిరుపతి,

16-6-48 వే. ప్రభాకరశాస్త్రి.

(శతకము - గాంధీ శతకము

కవి - విద్వాన్ బయిరెడ్డి సుబ్రహ్మణ్యం

ప్రచురణ - 40, భారతీ నికేతనము, తిరుపతి.)

"దీనిని సరిచూచి, సముచిత సలహా లొసంగి, తమ యభిప్రాయము వ్రాసి యిచ్చిన మద్గురువరేణ్యులు శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి నా హృదయ పూర్వక నమశ్శతములు" అని -

- "తొలిమాట" లో

గ్రంథకర్త.



( చాలా మందికి ఈ శతకాన్ని గురించిగాని, శాస్త్రిగారి శిష్యుడే దీన్ని వ్రాశారని గాని తెలియదు. మనకు తెలిసినదంతా 1924 జనవరి, భారతి, ప్రథమ సంచికలో శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు రచించిన 'గాంధి శతకము', మాత్రమే. భారతీ పత్రికాస్థాపనకు ప్రేరకులు ప్రభాకరశాస్త్రిగారే అయినట్లు, శ్రీ బయిరెడ్డి సుబ్రహ్మణ్యంగారు శాస్త్రిగారి శిష్యులే అవడం గమనార్హం. 1948లో గాంధిగారి నిర్యాణానంతరం "గాంధి రామాయణము" సంకలించడానికి సంకల్పించిన శ్రీ గురుదేవులు తమ శిష్యుడేవ్రాసిన 'గాంధి శతకాన్ని' సరిచూచి అభిప్రాయమివ్వడం గాంధి దేవునిపట్ల వారికున్న శ్రద్ధాభక్తులు విశదపరుస్తున్నది. )

సేకరణ - వివరణ : ముదివేడు ప్రభాకరరావు.

# వేద భూగోళము

(ప్రథమ సంపుటం )

శుభ్రవేటి తిప్పాజ్యోశ్యులు

## అభిప్రాయము

ఆర్యా! వందనములు

మీ గ్రంథము చేరినది. వారము పదిరోజులనుండి అన్నమాచార్యోత్సవ సంరంభములో నలగుల వడుచు మీ గ్రంథము సనిగా చదువనూ దాని గూర్చి నా సముత్సాహమును మీకు విన్నవించుకోను జాలనయితిని. జాగుకు క్షమింపుడు.

మీ గ్రంథము చదివి ఆశ్చర్య చకితుడనై నాడను. అంతరంగ పరిశోధనమున పనిగా నే వారికిగాని మీరు ప్రతిపాదించిన విషయముల యథార్థము గోచరింపదు. మీరు వేదమంత్రములకు భాష్యోక్త రీతిని అర్థ జ్ఞానమే కాకా, ఆత్మపరిశీలనమున అనుభూతితో అన్వయము వడసినట్టు గొన్ని కొన్ని పట్టులc దెల్పితిరి. మీ ప్రజ్ఞకు జోహారులు.

తీవ్రముగా ఆత్మావేక్షణము చేసి శరీరసముద్రము మథించి జ్ఞాన రత్నములను వెలికిc దెచ్చుటకై మీరు చేసే ప్రయత్నము మిక్కిలి కొనియాడc దగినది. మీ గ్రంథములోని విషయములc గొన్నింటి నేని గాదని నేను నిరూపింప సర్వజ్ఞుcడనుగాను. కడమ సంపుటములను గూడ వడిగా మీరు ప్రకటించి జిజ్ఞాసువుల కుపకరింతురుగాక! శ్రీ శివరామశాస్త్రి గారు నిట్టి ప్రయత్నము జరుపుచుండుట మీరు గుర్తించు చుంటిరి గదా! మీ రిరువురకు విజయమగు గాక !

చిత్తగింపుడు
వేటూరి ప్రభాకరశాస్త్రి
తిరుపతి
-4-49

( వేదభూగోళము (ప్రథమ సంపుటము)
శ్రీ దేశబంధు ముద్రణాలయం — శుభ్రవేటి తిప్పాజ్యోశ్యులు
తాడిపత్రి ( 1948) — యాడికి గ్రామం, అనంతపురం)

# కాంచీ ఖండము

మల్లంపల్లి వీరేశ్వర శర్మ

## పండితాభిప్రాయము

శ్రీ మల్లికార్జున శాస్త్రిగారి సంతానమునకు తేలికపాఱు పలుకు నాలిక కెక్కదు. పలుకు పొంకము, పరమార్థముతో శ్రుతిగూడి సాగును గాని పెడవాసి వెడత్రోవ తొక్కదు. ఇందుకు లక్ష్యముగా మీ గ్రంథమున దారుకావనవిహారకథ చదివితిని. శృంగారాభాసము దానc గానరాలేదు.

"పోతన భక్తీ" త్యాది పద్యము తాతగారిc గూర్చి చెప్పినదయినను, మనుమని యెడc గూడ సనిపడినది. తాతగారే మనుమc డయినా రేమో !

తపోమయులు, అస్మత్పూజ్య శ్రీ గురుపాదములు అద్దేపల్లి సోమనాథ శాస్త్రిగారి పేరి పద్యము చదివి, మరలcజదివి, కొంత తడవు తలcపు లుడిcగి, ముడిcగి కూర్చున్నాను.

దోషజ్ఞతcగాక గుణజ్ఞత నాకుc గూర్చినది మీ గ్రంథము. అయినను అచ్చుతీరు దానిని నాకు నిలిపినది.

తే॥గీ॥ మల్లికార్జున సుకవి కుమార వరుస
కుల్లసితకావ్యకళలు రంజిల్లు టరుదె?
గురులు తిరుపతి వేంకటేశ్వరుల కరుణ
మెలcగు వారికిc దియcబల్కుపొలుపు లరుదె?

తిరుపతి, (సం) వే. ప్రభాకరశాస్త్రి

(కావ్యం – కాంచీఖండము
కవి – మల్లంపల్లి వీరేశ్వరశర్మ
ముద్రణ – శ్రీ రామలింగేశ్వర ముద్రాక్షరశాల
వరంగల్ 1949)

# శ్రీ దండక రామాయణము

కరణము అశ్వత్థరావు.

## పండితాభిప్రాయము

సుప్రసిద్ధ విమర్శకాగ్రేసరులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, తిరుపతి.

ఉద్దండ ధార గల "దండక రామాయణము"ను స్థాలీపులాక న్యాయమున చదివి చూచితిని. శ్రీ యనంతకృష్ణ శర్మగారు, అస్మద్గురువర్యులు వెంకట శాస్త్రిగారు వెల్లడించిన పరితోషమునకు బలే ! యని తోడు పలుకుట కంటె నే వెల్లడింపఁదగిన యభిప్రాయ భేదములేదు.

గ్రంథకర్తగారు రచనపు సొంపును, ఔచితిని జక్కగా ఎఱిగినవారు కాన కొఱఁత కానరాలేదు. మృదంగ ధ్వనికి విజ్జోడు గాకుండ భావానుకూలముగా నర్తకి యడుగుజాడ సాగినట్లు, దండక చ్ఛందముతో పద విన్యాసము భావ ప్రసాదమునకు ననుగుణముగా ససిగా నీ గ్రంథమున సాగినది.

గ్రంథమెల్ల దండకముగా నుండుట యిది యొక క్రొత్తతీరు.

కవి కౌశలమును గొండాడుచు నీ దండకరామాయణమునకు సహృదయ లోకము స్వాగతము చెప్పగలదని తనియు చున్నాను.

తిరుపతి (సం.) వే. ప్రభాకరశాస్త్రి

1949

(కావ్యం – శ్రీ దండక రామాయణము

కవి – కరణము అశ్వత్థరావు, కలుగోడు

ప్రచురణ – వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రి అండ్‌సన్స్ మద్రాసు

ప్రథమ ముద్రణ – జూన్, 1949)

# శ్రీ వెంకటేశ్వర – సదాశివేశ్వర గేయద్వయము

## అభిప్రాయము

అయిదుమాత్రలగణములు రెండు, నొకగురువు తొలిచరణము, మరల నయిదుమాత్రలగణములు రెండు నొక గురువు, రెండవచరణము రెండింటి నడుమ నుసిగా నయిదుమాత్రల గణమొకటి యుండునట్లు నాలుగు చరణములు గల గేయ రచనలు, నారాయణా, రామారామా, యని మకుటము గలవి భక్తివేదాంతమయ శతకములుగాఁ బ్రజాసామాన్యమున నందు మరి రాయలసీమలోఁ బ్రచారము గలిగియున్నవి. ఆ రెంటిలో నారాయణశతకము కొంతఁ బ్రాచీనముగావచ్చును. నాకు నారాయణశతకము పసితనమున నాలుక మీద నాట్యమాడుచుండెడిది. అది చక్కని భావములు గలది.

శ్రీకనమలూరు వేంకటసుబ్బయ్యగారు 'వేంకటేశ' యనుమకుటముతో రచించిన యీ శతకముపై ఫణితి ననువర్తించిన దగుటచే సులభ సుందరముగా నున్నది.

స్వయము తన్మయుఁడై రచయిత దీనిని రచియించినచో నారాయణ శతకాదులవలె నిదియును బ్రజాసామాన్యమున బహుళ ప్రచారమును బడయగలదు. "స్వయంతీర్ణః పరాంస్తారయతి" యనిగదా. ఏతద్రచయిత యిట్టివాఁడని, కాన నేతద్రచనము సప్రయోజనమని విశ్వసించుచున్నాను.

వ్యాకరణ చఞ్చుత్వముతో నిట్టి రచనములో భాషాదోషములను ద్రవ్వియెత్తుటకై బ్రయత్నించుట తగనిపని. చూచినంతలో నిదితేటగా తియ్యగా నున్నది.

తిరుపతి

24-7-49

వే. ప్రభాకరశాస్త్రి

( అభిప్రాయము శ్రీ వేంకటేశ్వర–సదాశివేశ్వర గేయద్వయము 1949 )

# ధర్మజ్యోతి

తుమ్మల సీతారామమూర్తి చౌదరి

## తొలిపలుకు

రచన

శ్రీ సీతారామమూర్తి చౌదరిగారు నాకుఁ గవితాబంధువు. బహు మార్గముల రచనా సంస్కరణాభినివేశములతోఁ బరుగులు వాఱుచున్నవర్త మానాంధ్ర కవివర్యుల కులములలో శ్రీ సీతారామమూర్తి చౌదరిగారు సంప్రదాయ సంరక్షణాభినిష్టులై మడి గట్టుకొని కూర్చున్న శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణులు. భాషా సంప్రదాయ సంరక్షణమునం దిట్లుందురు గాని భావావేశమున వారు కదువడిగా వాడిగా వర్తింతురు. రాష్ట్రగానములో, పఱిగపంటలో నీ తీరు తిలకింపఁదగ్గది. కావ్య క్రమము ననుసరించి వారి రచనా క్రమము నెఱి నీటులు నెఱసి మెఱుఁగలు దేఱఁ జొచ్చినది. ప్రకృత గ్రంథమగు " ధర్మజ్యోతి" లో వారి కవితాధార దరు లొరసికొని నిండారి పార్వాఱినది.

" బొజ్జబలిసి నేఁడు విఱ్ఱవీఁగుచునున్న
సాహుకార్ల యాట సాగదిట్లె
రుద్రమూర్తియై దరిద్రుండు చిచ్చుఱ
కన్ను విప్పి గజ్జె గట్టు నెపుడొ "

పద్యరచన మింతకంటె బాగుగా నుండుటకుఁ దెఱఁగు నే నెఱుఁ గను. నన్నయ పద్య మీ క్రిందిది.

"ఎల్ల వారు నెఱుఁగ నొల్లని ధర్మువు
బేల నీకుఁ దెలుప నేల వలసెఁ
జిఱుత వాని కింత దఱుసంటి పలుకులు
సన్నె? వృద్ధ జనము లున్నచోట "

ఈ పద్యముఁ జదివి నేనెంత మురిసితినో పై చౌదరి గారి పద్యముఁ జదివి యంత కెక్కువ మురిసితిని.



కథావస్తువు – కవి

కథావస్తువు కవికిఁ దన నాటిది. తన నాఁటిది యగుట కేనెంతయు సంతసంపడుదును. ఇందుఁ గవికిఁ గథావస్తువు తన నాటిది, తన నాఁటిది మాత్రమేకాక తన వీటిది కూడ నగుట మఱియు విశేషము ! ఇందు స్వదేశ, స్వకుల, స్వగురు ప్రశంసలు కథాంగములుగాఁ గవికిఁ గుదురుట యానుకూల్య విశేషమే కాక, యాహ్లాదకరమగు సదృష్ట విశేషము కూడ నయ్యెను. ఏతత్ ప్రశంసలు, కథామధుర భక్ష్యమునకుఁ గమ్మ నంజుళ్ళు ! ఇందు వెలనాటి, ధనదవోలి వర్ణనలు రుచిరములు, స్వవంశ ప్రశంస సంగతము, శ్లాఘ్యము : స్వగురుస్తుతి సంస్తవనీయము.

ఈ కబ్బమున నుప్పరివాండ్రు తమకు దొరకిన బంగరును జాటు సేయక వెల్లడించియే యుండిరేని యం దెంతో కొంత వంతు దొరతనము వారు కైకొని, కడమ వారి కిచ్చి యుందురు. వారు సంపన్నులునయి యుందురు. అది క్రమ మార్గము. చదువురాని వారు గాన వారు దానిని గోమట్ల పాలు చేసి చెడిరి ! దాని నపహరించిన బేరులు పదపడి దాని నెట్లు జీర్ణించు కొనిరో, వారు కుబేరులే యైరో, బికారులే యయిరో యెఱుఁగము కాని మన కథలోని కోమటి మాత్రము పెక్కేండ్లు దాని మూలమునఁ జాలఁ గడగండ్లు కుడిచినాఁడు ! ఆ కడగండ్లతో నాతని దోసము తొలఁగెఁ గావలయు ! నారయ్య దాఁపఱికమున కొప్పు కొనుటలోఁ గూడఁ గొంత కొఱఁత లేకపోలేదు గాని యది యా ధనమును దా నర్థింపకుండుటతోఁ దొలఁగెఁ గావలయు ! ఈ కొఱంత చేతనే యేమో తన ధర్మఫలమును దానాస్వాదించి చూచుటకు నారయ్య కెంతో కాల విలంబము కలుగవలసెను.

ఇందుఁ గథా ప్రధాన పాత్రమగు నారయ్య స్వార్థ రాహిత్యము మూలమున "ధర్మజ్యోతి" యై వెలిఁగినాఁడు ! ఆతఁడానాఁట సంపత్స మృద్ధుఁడు కాడు ! సంపన్నుడే యగుఁగాక ! ధనాశకు సంపన్నత బాధకము గాదు సరిగదా, మఱింత సాధకము గూడ నగుట కలదు గదా ! అయినను, బంగారు లప్పలు సులువుగాఁ జొప్పడనున్నప్పుడు–వణిజుఁడిచ్చెదనని కూడ నన్నప్పుడును దానందుల కొప్పుకొనక తృణీకరించినాఁడు నారయ్య. ఆనాఁ

డాతఁడు కొంత బంగరును వణిజునొద్ద గోఁజాడి యార్జించి యుండినచోఁ దానును ధనిక విడంబనములకుఁ బాల్పడి యేమేమో యయి యుండు వాఁడేమో ! కాని దానినతఁ డర్థింపలేదు. ఇక్కడ నారయ్య శీల సంపద మిక్కిలి మెచ్చఁదగినది.

ఏకాంతమున నెవ్వరికి నెఱుక పడ వీలులేని తెఱఁగునఁ గాంతా కనకములు సమకూడఁదగిన సంఘటన లేర్పడఁగా నిబ్బరముగా నిట్లు “నేను నిగ్రహము నెఱపుదును గాక”! యను దృఢ వ్యవసాయముతో జాగ్రత్త వహించి నిలిచి శీలమును శిక్షించుకొని రక్షించుకొనఁగల్గువారు లోకమున నెన్నఁడేని నరిదిగాఁ గొందఱేయుందురు. ఇట్టి మహత్త్వము నారయ్యలో సునాయాసముగాఁ గుదుర్కొన్నది. దీనికి సంపన్నత, చదువు సందెలు నావశ్యకములు కావు గాఁబోలును ! సుకృత విశేషమే !

నారయ్య సెట్టి మిత్రునకు మట్టిలో దాఁచిన బంగారు ముద్దలిచ్చివేయుట మాత్రమే కాక తన పొట్టలో నేచిన నిండారు సుద్దులను, బంగారు కంటె విలువ గలిగిన వానిని గూడఁ నొసఁగినాఁడు. నిజముగా నారయ్య యానాఁడట్టి సూక్తులను సెట్టికి వినిచినాడో లేదోకాని పుత్త్రరూపమగు నారయ్య యాత్మ ( ఆత్మా వై పుత్ర నామాసి) నేఁడు నాడెల్లరకుఁ గూడ నా సూక్తులను, దత్కథా విధమును గూడఁ గావ్యరూపమున వినిచినది. నారయ్య నాఁడట్లు శీలమును శిక్షించుకొని వర్తించి నందులకుఁగా నెట్టి ఫలమును బడసి నాఁడో యది ‘ధర్మ జ్యోతి’ని జూచువారెల్లరు నేఁడు కనుఁగొనఁగలరు. తథావిధమైన సుకృత పరిపాకమే యా పుణ్యాత్ముని కడుపుపంట శ్రీ సీతారామమూర్తి చౌదరి! నాఁటి నారయ్య సుకృత బీజమే యిప్పుడిట్లు సత్కావ్య కల్పకశాఖిగా జెట్లు గట్టి చెలఁగుచున్నది.

కృష్ణా తీరమునఁ బేర్వెలయు కమ్మకొలమువారు ప్రాయికముగా రెండువేలేండ్ల నాఁడు బౌద్ధ ధర్మ పరిపాలకులయి విఖ్యాతిఁ గన్న ‘కర్మరాష్ట్రీయు’ లే యగుదురని నా నమ్మకము ! అట్లే మేని యట్టి సంస్కార వాసన గల కొలమున నిట్టి వారు వెలయుట సంగతమే కదా !



శ్రీ సీతారామమూర్తి చౌదరి గారి కోరికి కూడ, “మాకున్, మాసంతతికిని ధర్మ వ్యాసక్తియె సిరులకంటె నగ్రియమగుతన్” – అన్న పద్యార్థమున వెల్లడి యైనది. వీరి వంశమిట్లే సుగుణవైభవముతో వెలయుచుండున ట్లీశ్వరుఁ డనుగ్రహించుఁగాక !

(మూడవ కూర్పు – మన్మథ – మాఘము
1956 – ఫిబ్రవరి
ముద్రణ – భారతి ప్రెస్ తెనాలి.)

వేటూరి ప్రభాకరశాస్త్రి
పార్థివ – దీపావళి

---

# హరస్తుతి

(గరికపాటి లక్ష్మీకాంతయ్య కృతి)

## ప్రశంస

“ప్రాచార్య శైలీపరిశోభితాం కృతిం
హరస్తుతీం త్వద్రచితాం సమీక్ష్య,
అమందమానంద మవాపమాంతం
పఠంస్తథాన్యైరపి పాఠయంశ్చ ॥”

(sd ) వేటూరి ప్రభాకరశాస్త్రి
Oriental Research Institute Tirupati

(ప్రశంస
హరస్తుతి
గరికపాటి లక్ష్మీకాంతయ్యకృతి
1950)

# శివ పంచస్తవి
## సమీక్ష

స్తుతిగ్రంథములలో శివ పంచస్తవి, దేవీపంచస్తవి, విష్ణుపంచస్తవి – బహుప్రసిద్ధములు. శివపంచస్తవీగ్రంథనామపరిగణనమున మత భేదములున్నవి. ప్రస్తుతముద్రణమునఁ బ్రధానముగా గృహీతమయినవి, మహిమ్న, మల్హణ, మలయరాజా, నామయ, హలాయుధస్తవములే పలువురు పరిగణించునవి. నీలకంఠ బిల్హణస్తవములు కూడఁ గొందఱు గ్రహింతురు. అందు 'నీలకంఠస్తవము' వాయుపురాణాంతర్గతము. నన్నిచోడుడును, శ్రీనాథుఁడును గుమారసంభవహరవిలాసములలో దీనిని బేర్కొన్నారు. ఇక్కడ ప్రకటితమయిన స్తవములలో 'మలయరాజస్తవము'ను దెలుఁగువా రింతకుముందెఱుఁగరు. ఈ 'మలయరాజు' ఆంధ్రదేశీయుఁడయి యుండవచ్చును. ఈ తెలుగువారగు మలయరాజులనుగూర్చి శ్రీ సోమశేఖర శర్మగారు వ్యాసము వ్రాసిరి. పంచస్తవియేకాక బిల్హణస్తవము కూడ నిందుఁ జేర్పఁబడినది.

ఈ పంచస్తవి మంచికవితాగౌరవము, భక్తిభావావిష్కరణముగల మహనీయకృతి. ఈ యయిదుస్తవములకుఁ బలువురు పద్యరూపముగాఁ జేసిన తెలుఁగు సేఁతలు గూడఁ జాలఁజక్కఁగా సరసముగా నున్నవి. అన్నిటను, శ్రీ దేవులపల్లి సుబ్బరాయశాస్త్రిగారి మల్హణస్తవాంధ్రీకరణము, సౌశబ్ద్య మయము. శ్రీపండిత చిదిరెమఠము, వీరభద్రశర్మగారు కొన్ని రచనలు పద్యరూపముగాఁ దెలిగించియు. 'భక్తరంజని' యను పేరఁ బ్రతిపదటీకలు వ్రాసియు, బహువిషయపర్యాలోచన పూర్వకముగా విశదమగు పీఠిక రచించియు, సర్వాంగ సుందరముగా నీ గ్రంథమును సంతరించి, బ్రకటించి, సంస్కృతాంధ్ర వాఙ్మయముల కుపకరించినారు. ఆస్తికుల గృహములందెల్ల నీ పంచస్తవి ప్రచారము పడయఁదగినది. ఇట్టి పుణ్యగ్రంథములను బ్రకటించుటకు శ్రీశర్మగారికి ఉండవల్లివాస్తవ్యులు శ్రీ దుంపలరామిరెడ్డిగారు ధనమొసగి, తమ సంపన్నతను సార్థకపఱచుకొన్నారు.

'స్తోత్రం సమ్యక్ప్రరమవిదుషా దండినావాచ్యవృత్తాన్
మందాక్రాంతాంస్త్రిభువనగురోః పార్వతీవల్లభస్య –'

అనియున్నది. దీనికేమిటో టీకయునున్నది. 'దండినావోచివృత్తైః మందాక్రాంతై స్త్రిభువనగురోః' ఉండఁదగును. ఇట్టివి నెరసులు పరిగణింపఁదగినవి కావు.

వేటూరి ప్రభాకరశాస్త్రి.
18-7-1944.

# శ్రీమదాంధ్రవ్యాస భారత నవనీతము

ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రి

## సమీక్ష

మహనీయులయిన శ్రీ ఆకుండి వ్యాసమూర్తి శాస్త్రులుగారు రచించిన పై గ్రంథములోని యాదిధార మాకార్యస్థానమలంకరించినది. శ్రీ వ్యాసమూర్తి శాస్త్రిగారి రచనమతిప్రౌఢమనియు, నపండితులకర్థముకాదనియుఁ బ్రతీతి కలదు. ఈ విషయమునఁ బీఠికాకర్తలు చేసిన సముచితవిమర్శములనే మేము బహూకరించుచు నిక్కడ నుదాహరించుచున్నాము.

"శ్రీ వ్యాసమూర్తి శాస్త్రులవారి యాంధ్రకవితారచన మభూతపూర్వ మైనదియు, నత్యంతగంభీరమైనదియును. వ్యర్థపదములను విశేషముగా నుపయోగింపవలసిన యవసరము గలుగకుండ విషయము నిమిడికగా సమకూర్చుటకుఁ బదక్రమమునంతగాఁ బాటింపకుండుటచేఁ దఱచుగా నన్వయ కాఠిన్యములు తటస్థించుచున్నను గొంచెము ప్రయత్నించి యన్వయించుకొని నప్పుడు వీరి కవిత మిగుల నానందదాయకముగ నుండుననుటకు సందియములేదు. వీరీగ్రంథమును నిర్వచనముగా నిర్వహింపనియమము నూనియుండుటచేతఁ గూడ నట్టి యన్వయ కఠినత తటస్థించి యుండవచ్చును. శ్రీవ్యాసమూర్తి శాస్త్రులవారు తమకవితా ప్రయోజన మెంతవఱకుఁగలదో యది తెలిసికొనలేకపోయినవారుకారు. ఆంధ్రకవితాసౌష్ఠవాదుల నెఱుంగలేక పోయినవారునుగారు. ఆ మహనీ యుఁడు తన కవిత్వరచనమునం దభూతపూర్వమైన యొకానొక విలక్షణత్వమును బుద్ధి పూర్వకముగానే చూపింపఁ దలఁచినట్లు భావింపవలసియున్నది.

ఈ గ్రంథమునకు శ్రీ శాస్త్రులవారు మహాభారతమునుండి నవముగా నీతమైనదను నర్థము వచ్చునట్లును, మహాభారతము నందలి నవనీతసమానమైన సారతర పదార్థమను భావము తోఁచునట్లును. "శ్రీ మహాభారత నవనీత" మని నామకరణము చేసి యుండవచ్చును. ఏలయన నీ గ్రంథము మూలమునకు మక్కికి మక్కిగాఁ దెలుఁగు చేసినట్లు కనుపట్టదు.

వీరు రాజమహేంద్రవరశాస్త్రకళాశాలయందు దమయుద్యోగ ధర్మమును సక్రమముగా నిర్వహించుకొనుచు ననేక గ్రంథములను రచించి క్రమముగా నట్టి మహాగ్రంథము నింతవఱకునైనా విరచింపఁగలిగినందులకెల్ల అబ్బురపడి వారి నిర్మల కవితా ప్రవాహవేగ ధాటి నభినందింపవలసి యుండును గదా !

శ్రీ శాస్త్రులవారు తమ జీవితమునందుఁ గావించిన యాంధ్రభాషా సేవయుఁ గవితాపరిశ్రమమును వారు రచించి యుంచిన మహాభారత నవనీతము శైలియు నాంధ్రమహాజనులకు వెల్లడించి వారల సహాయ సంపదలచే నీ మహాగ్రంథమును శిథిలమైపోకుండ ముద్రింపఁ జేయవలయునను తలంపుతో మచ్చునకీ మొదటి యాశ్వాసముమాత్ర మచ్చొత్తింపఁబడినది. అనంతరమహాకార్యభార మాంధ్రమహాజనుల యనుగ్రహముపై నాధారపడియున్నది.

ఈ గ్రంథభాగమును గ్రంథాలయమువారు కొనియు, విద్యాశాఖవారు పాఠ్యముగా గ్రహించియు శ్రీశాస్త్రులవారి కడమ గ్రంథమెల్లఁ బ్రకటితమగుటకుఁ దోడ్పడుదురు గాకని, శ్రీ శాస్త్రులవారి గ్రంథము శాశ్వతముగా వెలయుఁ గలదు గాకని, యాశించుచున్నాము.

వేటూరి ప్రభాకరశాస్త్రి
1944